

భగవద్గీత
భగవద్గీత - శ్రీ శంకర భాష్యం యధాతదం-1,2
ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org  Mobile App: Free Gurukul  email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul  Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం

# శ్రీమద్భగవద్గీత

## శ్రీ శంకరభాష్యం యథాతథం

### మొదటి భాగము

అనువాదకులు :

**శ్రీ సదానంద భారతి**

ప్రణవాశ్రమము, గుడివాడ

గురువందన

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః

గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః.

గురుదేవులు :

**శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాములవారు,**

ప్రణవాశ్రమము, గుడివాడ

# ఉపోద్ఘాతము

"ఓం నారాయణః పరో உవ్యక్తాదండమవ్యక్త సంభవమ్,
అండస్యాంతస్త్విమే లోకాః సప్తద్వీపా చ మేదినీ".

అనగా – అవ్యక్తమువలన అనగా మాయవలన శ్రీ నారాయణుడను ఆదిపురుషుడు సర్వకాల సర్వావస్థలయందును అగోచరుడు. అవ్యక్తమైన ప్రకృతినుండి ఈ బ్రహ్మాండము ఏర్పడినది. ఈ భూ, భువః మొదలగు సర్వలోకములు మరియు ఏడు ద్వీపములుగా ఏర్పడియున్న భూగ్రహమున్నూ ఆ బ్రహ్మాండమునందే ఏర్పడియున్నవి.

ఆ భగవంతుడు తన మాయచేత ఈ జగత్తును రచించి దీనిని చక్కగా పాలించవలయునను కోరిక కలిగి ముందుగా మరీచి మొదలగు ప్రజాపతులను సృష్టించి వారికి వేదోక్తములైన ప్రకృతి రూపమైన ధర్మమును కలుగునట్లుగా చేసెను.

అటు తరువాత వారికంటె భిన్నముగా అనగా వేఱుగా సనక సనందనాది ఋషులను సృష్టించి వారికి జ్ఞానము మరియు దానిచే కలుగు వైరాగ్యము లక్షణముగా గలిగిన నివృత్తి ధర్మమును అనగా జ్ఞానయోగమును బోధించెను.

ఈ విధముగా వేదములందు చెప్పబడిన ధర్మము రెండు విధములుగా యున్నది. ఒకటి ప్రవృత్తి రూపధర్మము, రెండవది నివృత్తి రూపమైన ధర్మము.

ధర్మం సహజంగానే చాలా గొప్ప వ్యవస్థ. ఏలయన ? అది జగత్తు యొక్క ఉత్పత్తికి, స్థితికి, సర్వప్రాణుల ఔన్నత్యానికి, చివరకు మోక్షమునకు గూడ కారణ రూపమైనది. అంతే గాకుండా సర్వప్రాణుల సంరక్షణను కోరునటువంటి బ్రాహ్మణాది వర్ణాశ్రమ వ్యవస్థ ద్వారా కాపాడునదే ధర్మం.

కొంతకాలానికి ధర్మానుష్ఠానము అనగా ధర్మానుసారముగ చరించు మానవుల అంతఃకరణమునందు ధర్మభావము నశించి కామభావము వుత్పన్నమైనది. ఆ కామభావ వికాసము వలన వివేక విజ్ఞానాదులు తరిగిపోయినవి. ఆ విధంగా ధర్మదృష్టి తరిగినందున అధర్మబుద్ధి పెరుగనారంభించినది. అప్పుడు జగత్తు యొక్క స్థితిని కాపాడుటయే కర్తవ్యముగా కలిగియున్న ఈ జగత్తుకు ఆదికర్తయైన నారాయణుడను పేరుగల శ్రీ విష్ణుభగవానుడు భూలోకమునందలి బ్రహ్మణు అనగా భూదేవతలు అనగా బ్రాహ్మణుల యొక్క బ్రాహ్మణత్వమును

రక్షించుటకొఱకై శ్రీ వాసుదేవుడు మరియు దేవకీ దంపతుల గర్భమునుండి తనయొక్క అంశతో అనగా లీలావిగ్రహ రూపముతో శ్రీకృష్ణుని రూపమున అవతరించినాడు. ఇది అతి ప్రసిద్ధమైన విషయము.

బ్రాహ్మణత్వమును రక్షించుట ద్వారానే వైదిక ధర్మము సురక్షితముగా మనగలదు. ఏలయన ? వర్ణాశ్రమాది వ్యవస్థ ఆ వైదికధర్మమునందే యిమిడియున్నది.

ఆ భగవంతుడు జ్ఞానము, ఐశ్వర్యము, శక్తి బలము, వీర్యము, తేజస్సు మొదలగువానితో సదాసంపన్నుడైయున్నవాడై యున్నప్పటికి అజుడు అనగా జన్మమరణములు లేనివాడై సమస్త భూతములకు అనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి మొదలగు వాటికన్నింటికి ఈశ్వరుడు అనగా అధిపతియై వుండియు నిత్యశుద్ధుడు అనగా ఎటువంటి మలినములు అంటనివాడు, బుద్ధుడు అనగా జ్ఞానమే రూపముగా గలవాడు ముక్తుడు అనగా యితరమైన ఏ వస్తువు తోడను ఎటువంటి సంబంధము లేనివాడై యున్నాడు. అయినప్పటికి తనయొక్క త్రిగుణముల (సత్వ, రజ, తమ) తో కూడియున్న మూల ప్రకృతిగా యున్న వైష్ణవీ మాయను తన వశమునందుంచుకొని లీలగా అనగా వుండియు లేనట్లుగా సాధారణ శరీరధారులగు జీవులవలె జన్మించినట్లుగాను, జీవులందరిని అనుగ్రహిస్తున్నట్లుగాను అవతరించియున్నాడు.

తనకు వ్యక్తిగతముగా ఎటువంటి ప్రయోజనము లేకుండిననూ భూతములపై దయచూప తలంచినవాడై అనగా ఎక్కువమంది గుణవంతులైన పురుషుల ద్వారా గ్రహించబడియున్న మరియు అట్టివారిచే ఆచరించబడుచున్న ధర్మము అత్యధిక ప్రచారము పొందునన్న భావము కలవాడై శోకమోహ రూపమైన సముద్రమునందు మునిగియున్న అర్జునునకు (లోకులకు) రెండు విధములైన అనగా ప్రవృత్తిమార్గము, నివృత్తిమార్గము – ధర్మములను బోధించెను.

ఆ విధముగా పై రెండు విధములగు ధర్మములను భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు అర్జునునకు ఎలా బోధించెనో అలా యథాతథంగా అనగా ఎటువంటి మార్పులు చేర్పులు లేకుండా సర్వజ్ఞుడైన మరియు భగవత్స్వరూపుడైన వేదవ్యాసులవారు ఏడువందల శ్లోకములతో "గీత" అను గ్రంథ రూపమున వెలయించియున్నారు.

ఈ గీతాశాస్త్రము సర్వవేదముల సారసంగ్రహమై యున్నది. అందుచే దీనిని సక్రమముగా అర్థము చేసుకొనుట చాలా కఠినమైన పని అయి వున్నది. అలా అయినప్పటికి గూడ ఆ గూఢార్థమును ప్రకటించుటకు అనేకులైన పండితమ్మన్యులు పదచ్ఛేదము, పద అర్థము.

వాక్యార్థము మరియు ఆక్షేప-సమాధాన పూర్వకమైన వ్యాఖ్యానములు ఈ గ్రంథమునకు రచించియున్నారు. అలా అనేకములైన వ్యాఖ్యానములు చెప్పబడియున్నప్పటికి లోకభావముతో నిండియున్న మనస్సులు గల మానవులు ఆ గీతాశాస్త్రమునకు అనేక విధములుగా అనగా అత్యంత పరస్పర విరుద్ధములైన అర్థములను గ్రహించుచుండగా చూచి ఆ గ్రంథమునకు వివేకముతో కూడియున్న అర్థమును నిశ్చయించదలంచి నేను అనగా శ్రీశ్రీశ్రీ జగద్గురువులు ఆది శంకరాచార్యులవారు - సంక్షిప్తముగా ఈ వ్యాఖ్యానమును రచించితిని..

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ గీతాశాస్త్రము యొక్క ప్రయోజనము లోకకల్యాణమే అనగా **కారణ సహితముగా ఈ ప్రాపంచిక వాసనలను తొలగించుటయే.** ఆ పరమ కల్యాణమేమనగా **సర్వకర్మ సంన్యాస పూర్వకమైన మోక్షమును పొందుటకు** గీతయందు చెప్పబడిన ఆత్మజ్ఞాన నిష్ఠారూపమైన ధర్మము సాధనముగా లభించుటయే.

ఈ గీతార్థ రూపమైన ధర్మమును లక్ష్యముగా తలంచియే స్వయముగా బ్రహ్మాపదమును అనగా మోక్షమును పొందుటకు గీతయందు చెప్పబడిన **జ్ఞాననిష్ఠతో కూడియున్న ధర్మమే** అన్నివిధముల సామర్థ్యము కలిగియున్నదని భగవంతుడు చెప్పియున్నాడు.

ఇంతేకాకుండా "ఎవ్వడు ధర్మమును ఆచరించునో లేక ఆచరించకయుండునో, మరియు ఎవ్వడు శుభాశుభములతో సంబంధము లేకయుండునో మరియు ఎవ్వడు ఏ విషయమును గురించి కొంచము కూడా ఆలోచించక నిర్విచారముగా వుండునో అలా వుండియు **ఈ సమస్త జగత్తునకు ఆధార స్వరూపుడైన ఆ బ్రహ్మ భావముతో కూడియుండునో ఆతడు ఆ బ్రహ్మమునే పొందును**" అని కూడా చెప్పియున్నాడు.

ఇంకా ఏం చెప్పాడంటే - **"సంన్యాసమే జ్ఞానమునకు లక్షణము లేక గుర్తు"** అని కూడా చెప్పియున్నాడు.

ఇచ్చట కూడా అనగా ఈ గీతాశాస్త్రమునందు గూడ చివరకు అర్జునునితో "సర్వ ధర్మములను పరిత్యజించి నా యందే శరణు పొందుము. **"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ"** గీ. 18.66 అని చెప్పియున్నాడు.

అభ్యుదయం అనగా సాంసారిక ఔన్నత్యమే దేనికి ఫలమో అటువంటి ప్రవృత్తి రూపమైన ధర్మము వర్ణములను ఆశ్రమ వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకొని చెప్పబడినదో ఆ ధర్మము స్వర్గాదులను పొందడానికి మాత్రమే సాధనమై యున్నప్పటికీ "ఫలమును పొంద

వలయును" అను కోరిక లేకుండా కేవలము ఈశ్వరార్పణ బుద్ధితో ధర్మము చెప్పినట్లుగా కర్మలు చేసిననూ ఆ కర్తకు అంతఃకరణ శుద్ధి కలుగును.

మరియు ఆ విధముగా శుద్ధమైన అంతఃకరణము గల పురుషునకు ఆ ప్రవృత్తి రూపమైన ధర్మాచరణము జ్ఞాననిష్ఠకు అవసరమైన యోగ్యతను కలిగించి అటు తరువాత జ్ఞానమును కలిగించుటకు సాధనముగా వున్నందువలన ఆతని అభ్యుదయమునకు కారణ రూపముగా వుంటుంది.

పై అర్థమునే లక్ష్యముగా ఎంచుకొని యికముందు చెప్పబోవునదేమనగా **"కర్మలను, కర్మఫలములను బ్రహ్మమునకే అర్పించండి. యోగులైనవారు గూడ ఫలాసక్తిని వదలి ఆత్మశుద్ధి అనగా అంతఃకరణశుద్ధి కొరకు కర్మలు చేయుదురు".**

లోకమునకు పరమ కల్యాణకరమైన ఈ రెండు విధములైన అనగా ప్రవృత్తి ధర్మము మరియు నివృత్తి ధర్మము - ధర్మములను మరియు ఈ గ్రంథమునకు **లక్ష్యభూతమైన వాసుదేవుడను పేరుగల పరబ్రహ్మ స్వరూపమైన ఆ పరమార్థ తత్వమును విశేషముగా అనగా ముఖ్యముగా ప్రకటించునటువంటి ఈ గీతాశాస్త్రము** అసాధారణమైన ప్రయోజనము, అసాధారణమైన సంబంధము మరియు అసాధారణమైన విషయమును కలిగియున్నది.

ఇటువంటి ఈ గీతాశాస్త్రము యొక్క అర్థమును చక్కగా ఎఱింగిన వారికి సంపూర్ణ పురుషార్థము సిద్ధించును. (అర్థ, కామ, ధర్మ మోక్షములు పురుషార్థములు). అందుచేత దీనిని వ్యాఖ్యానించుటకు నేను ప్రయత్నించుచున్నాను.

ఇట్లు

**శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు**

ఓం

# గ్రంథ ప్రవేశము

మన దేశము భారతదేశము. ఇది చాలా సుదీర్ఘమైన చరిత్ర కలిగిన దేశము.

ఈ దేశము నందు మన పూర్వీకులైన యెంతో మంది ఋషులు, పండితులు, మహాత్ములు, కవులు, గాయములు మొదలగు వారందరూ వారి మాటల ద్వారాను ఆటలు (నాటకములు) మరియు పాటల ద్వారాను ప్రపంచమంతటను "ఇందుగల డందువేదను" సందేహము లేకుండా సర్వమునందును నిరాకార రూపమున వ్యాపించియున్న భగవత్తత్త్వమును మరియు ఆ తత్త్వమునందే కల్పించబడిన ప్రకృతి వర్ణనముల ద్వారా మనముందు సాక్షాత్కరింపజేయుటకు ప్రయత్నించియున్నారు. ఆ ప్రయత్నముల ఫలములే మన వేదములు అనగా శ్రుతులు, స్మృతులు కావ్యములు మొదలగునవి. ఆ ప్రయత్నములలో ఒక మహదంశమే యీ శ్రీమద్భగవద్గీత. శ్రీకృష్ణుని రూపమున ప్రత్యక్షమైన ఆ సర్వవ్యాపక భగవత్తత్త్వమే మహాభారత యుద్ధారంభమునందు యుద్ధ విముఖుడైన అర్జుననకు పాడి వినిపించిన గీతముల సమూహమే యీ శ్రీమద్భగవద్గీత.

ఆ భగవంతుని యందు మాయచే కల్పించబడిన యీ ప్రకృతి అంతయూ అనగా పంచ భూతములు ఆ భగవంతుని స్వరూపమున వున్న ఆయన సంపదయే. అనగా యీ సంపద రూపమైన ప్రకృతి అంతయూ ఆ భగవంతుని రూపమే, ఆ భగవంతునిదే. దీనికి మరియొక యజమాని అనగా, యీ ప్రపంచమును 'నాది' అనువాడు మరియొకడు యీ ప్రపంచమునందు లేడు. "కర్తన్నేను సమస్త భూతములకున్ కౌంతేయ సర్వమ్ములో వర్తింతింతున్" అని చెప్పి యున్నాడు. ఈ శ్రీమద్భగవద్గీతయందే

"మయాతతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా,
మత్థాని సర్వభూతాని నచాహం తేష్వవస్థితః"

అని కూడా చెప్పియున్నాడు.

ఆ సర్వము తానే అయి వున్న భగవంతుని మానవ దేహధారియైన జీవుడు (ఆత్మ) యెలా తెలుసుకొనగలడో లేక పొందగలడో యీ భగవద్గీతయందు అనేక విధములుగా చెప్పబడియున్నది.

భగవంతుని పొందుటకు అన్నిటికంటె ముందుగా ధర్మాచరణము ముఖ్యము. ఆ ధర్మము రెండు విధములైనది. ఒకటి ప్రవృత్తి మార్గము, రెండు నివృత్తి మార్గము. ఈ రెండు

విధములైన మార్గములు గీతయందు స్పష్టముగా చెప్పబడినవి. కాని చివరకు భేదమంతము తొలగి నివృత్తి మార్గమే సర్వవిధజనులకు మోక్షప్రదమని తేల్చి చెప్పబడినది.

భగవంతుని పొందు మార్గమే ధర్మము. ఆ ధర్మమును ఆయనయే స్థాపించినాడు. ఆ కారణముగా ఆ ధర్మమును చెడకుండా కాపాడుటకై ఆ నిర్వికార స్వరూపుడైన పరమేశ్వరుడు మానవ శరీర రూపమైన దేహమును ధరించి అనగా నామ రూపములు కలిగి ఆ ధర్మమును తిరిగి స్థాపించుచుండును. ఈ విధముగా ఆయనచే స్థాపించబడిన ధర్మము ననుసరించి మానవులందరూ నాలుగు వర్ణములుగా విభజింపబడినారు. అలా విభజింపబడుటకు వారి వారి స్వభావములు మరియు గుణ సంగ్రహముననుసరించి యేర్పడిన కార్యప్రవృత్తియే కారణము. చూ - గీ. 4.13 -

**చాతుర్వర్ణ్యం, మయా సృష్టం, గుణకర్మ విభాగశః,**
**తస్యకర్తారమపి, మాం విద్ధ్యకర్తార మవ్యయమ్**

అనగా – బ్రాహ్మణ క్షత్రియాదులను నాలుగు వర్ణములు సత్వాది గుణముల యొక్కము, ఆ గుణముల కారణముగ చేయబడు కర్మల యొక్కము విభజన ననుసరించి నాచే చేయబడినవి. ఆ నాలుగు అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు గీతయందు చెప్పబడిన గుణత్రయ విభాగ యోగమునందు యే విధమగు గుణములతో కూడియున్న మనోబుద్ధులు గలవారు యేవర్ణము వారిగా చెప్పబడినారో ఆ వివరణమంతయు ఆ యోగమునందు చెప్పబడినది.

స్థూలముగా - సత్వగుణము అధికముగా గలవారు బ్రాహ్మణులు.

రజోగుణము యెక్కువగా కలిగియున్నవారు క్షత్రియులు.

రజోగుణముతోపాటు తమోగుణము గూడ కలిగియున్న వారు వైశ్యులు

తమోగుణమే అధికముగా యున్న బుద్ధులు గల మానవులు శూద్రులు.

ఈ విధమగు గుణభేద కారణముగ స్వభావ భేదము, స్వభావ భేద కారణముగా కర్మభేదము, కర్మభేదము కారణముగ పాపపుణ్య, సుఖ దుఃఖ, జన్మ-మరణ, స్వర్గ-నరక భేదములు కలుగుచున్నవి. వీటినన్నింటిని తొలగించుకొని జీవుడు అనగా మానవుడు సుఖ, దుఃఖ, జన్మ-మరణ, పాప-పుణ్య, స్వర్గ-నరకముల నుండి తప్పించుకొని జన్మరాహిత్యమును అనగా మోక్ష స్థితిని యెట్లు పొందగలడో యీ గ్రంథమునందు నాలుగు వర్ణముల వారికి సాధ్యయోగ్యములైన వేఱు వేఱు సాధనా మార్గములు బోధించబడినవి.

వాటిలో -1) సాంఖ్యము అనగా జ్ఞానమార్గము

2) కర్మ మార్గము

3) యోగమార్గము

4) ధ్యానమార్గము

5) భక్తి మార్గములు ముఖ్యమైనవి.

అందరూ తమ తమ గుణ భేదము మరియు ఆ భేదము కారణముగ కలిగిన స్వభావ భేదము కారణముగా ఒకే మార్గమున పయనించి జన్మ మరణ రాహిత్య రూపమైన ముక్త స్థితిని పొందజాలరు. కావున యే గుణ ప్రధానమైన స్వభావము గలవారు యే మార్గమున పయనించి ఆ మోక్ష స్థితిని పొందగలరో ఆ వివరమంతయు పైన చెప్పబడిన అయిదు మార్గములను బోధించు యోగముల యందు చెప్పబడినది.

1) కర్మ మార్గము అనగా కర్మయోగము - సాధారణముగ యీ కర్మ మార్గము ముఖ్యముగా గృహస్థులై జీవనము గడుపు వారలకు చెప్పబడినది. దీనినే ప్రవృత్తి మార్గమని చెప్పుదురు. ప్రవృత్తి యనగా ప్రాపంచిక విషయములయందు అభిరుచి కలిగియుండుట. కాని గీతయందు మాత్రము యీ ప్రవృత్తి విషయక కర్మమార్గము గూడా క్రమక్రమముగా చివరకు ఆ సర్వవ్యాపక పరబ్రహ్మతత్త్వమును పొందింపజేయు నివృత్తి మార్గమునందే లయమైపోవును అని చెప్పబడినది.

కర్మకు మోహమే అనగా భ్రాంతి అనగా అజ్ఞానమే కారణము. అజ్ఞాన దశలో మానవుడు సత్పదార్థసాక్షాత్కారమును పొందగల సామర్థ్యము లేక భ్రాంతి జన్యములైన భౌతిక విషయముల - వస్తువుల - ద్వారా సుఖములు పొందవలయునని ప్రయత్నిస్తూ వుంటాడు. అటువంటి అజ్యానికి గూడ కర్మలు చేయగా చేయగా అనుభవము ద్వారా అవన్నియు తనకు ఎటువంటి శాశ్వత ఆంనదమును యివ్వజాలవని తోచు జ్ఞానము కలుగును. అట్టి జ్ఞానము కలిగినప్పుడు నిజమైన ఆనందమును యివ్వజాలని కర్మలు చేయుట తనంతట తానుగానే మానివేయును. ఆ విధముగా తన అనుభవజన్య జ్ఞాన బలంతో ప్రాపంచిక విషయములకు దూరమై తన యొక్క నిజస్వరూపమును గుర్తించి మోక్షస్థితిని పొందును. కావున యీ విధముగా కర్మమార్గము గూడ చివరకు నివృత్తియందే లయమైపోవును.

**2) భక్తిమార్గము :** అట్లే భక్తిమార్గము గూడ ఆరంభదశలో అజ్ఞానము చేత జీవుడు తానువేఱు ఈ ప్రపంచమునకు కారణస్వరూపుడైన భగవంతుడు వేఱనియు, తాను దుర్బలుడననియు, తనకు కలుగు సుఖదుఃఖములన్నియు ఆ భగవంతుని దయ తనపై లేనందువలననే కలుగుచున్నవనియు, తాను జన్మజరామరణములు గల వాడననియు, ఆ

సర్వేశ్వరుడు సర్వవిధ సంపన్నుడనియు ఆయనను ఆరాధించు భక్తులకు ఆయన సర్వవిధ సౌఖ్యములతో పాటు రక్షణ గూడ కలుగజేయుననియు, యింకా జన్మజరామరణముల నుండి తప్పించుననియూ ఒక భ్రాంతి జన్యమైన విశ్వాసమును ఏర్పరచుకొనును.

ఈ విధమగు భక్తిభావము గూడ అనేక విధములుగా వుండును. నారద భక్తి సూత్రములు మరియు భాగవత సిద్ధాంతము ననుసరించి యీభక్తి భావము తొమ్మిది విధములుగా వుండునని చెప్పబడినది.

**తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలోయెరుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచుదలతున్ సత్యంబు దైత్యోత్తమా.**

చూ. భాగ. స. స్కం

ఈ తొమ్మిది మార్గములలో యేమార్గమున భగవంతుని వైపుకు పయనించినా, అయితే యెలాపయనించాలంటే మనసా వాచా కర్మణా నాకు ఆభగవంతుడే సర్వస్వము. ఆయనయే నాకు దిక్కు, ఆయన దయను పొందియే, అయనచే స్థాపించబడిన ధర్మమార్గమున పయనించియే నేను సర్వవిధ దుఃఖముల నుండి ముక్తిని పొందగలను, అంతకంటే వేఱుమార్గము లేదు. లావొక్కింతయు లేదు. ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్ ఠావుల్దప్పెను, మూర్ఛవచ్చెఁ దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్ నీవే తప్ప నితఃపరంబెఱుగన్ మన్నింపదగున్. దీనునిన్ రావే ఈశ్వర, కావవేవరద, సంరక్షింపు భద్రాత్మకా, గ.మో. 74. అని తలంచి ఆయనను సేవించితే, అదెట్లన ? -

భక్తుడైనవాడు బలిమివిశ్వమువీడు,
దిక్కులేక తుదకు దీనుడగును,
'హరి'ని జేరగోరు 'హా' యనిచింతిల్లు.....

అటువంటి భక్తునికి ఆభగవంతునితో తాదాత్మ్యభావము కుదిరి సాలోక్యముక్తియో, సామీప్య ముక్తియో లేక భక్తిభావ తీవ్రతననుసరించి సారూప్య ముక్తియో అనగా జన్మ - మరణ రాహిత్యరూపమైన బ్రహ్మస్వరూపముగా వుండుస్థితియో లభించును. ఈ విధముగా భక్తి మార్గము గూడ చివరకు సర్వకర్మ సంన్యాస ఫల రూపమైన మోక్షమునే కలిగించును. అట్లే యోగ, ధ్యానమార్గములు గూడాను.

కాని జ్ఞాన మార్గము ఆ యితర మార్గముల వంటిదికాదు. ఇది నిత్యానిత్య వస్తు వివేకము ద్వారా జీవునికి అజ్ఞాన కారణముగ గల ప్రాపంచిక విషయ వాసనలనన్నింటిని సమూలముగా నశింపజేయును. ఎప్పుడైతే జీవుడు తన పూర్వపుణ్యకర్మల సంస్కార బలముతో మాయా కల్పిత ప్రపంచము యొక్క లేమిని తెలుసుకొనునో అప్పుడే అతనికి తనయొక్క నిజమైన, శాశ్వతమైన, వికార రహితమైన, జన్మ-జరా-మరణరహితమైన అపరోక్షానుభూతి కలుగుతుంది. అప్పుడు ద్వైతభావమంతయూ నశించి సర్వకర్మసంన్యాసము ద్వారా "అహంబ్రహ్మాస్మి" "అయమాత్మాబ్రహ్మ" మొదలగు సత్యానుభూతి కలుగుతుంది. తద్వారా ప్రాపంచిక విషయముల యందు, చివరకు తనదేహము నందు గూడ "దేహమేనేనను" భ్రాంతి గూడ తొలగి తానుమాత్రమే మిగిలి వుంటాడు. అప్పుడు దేనియందూ మోహము లేక శుద్ధుడై, వికారరహితుడై పరబ్రహ్మ స్వరూపుడుగా మిగిలి వుంటాడు. అదియే మానవుని, జీవుని పురుషార్ధము. అదియే పరమానందస్థితి. అదియే అపరోక్షాను భూతి. అదియే జన్మ-మరణములు లేని మోక్షస్థితి.

ఈ విషయమునే "శ్రీమద్భగవద్గీతకు శ్రీశంకరభాష్యం యంథాతథం" అను ఈ గ్రంథము బోధించుచున్నది.

జీవుడు ముందుగా ధర్మబుద్ధి గలిగి, ఈశ్వరుని ద్వారా తనకు లభించిన కర్మాధికారమును అనుసరించి ఫలాపేక్షలేని బుద్ధితో కర్మలు చేయుచుండినచో అతనికి ఆకర్మల ద్వారా ఎటువంటి సుఖదుఃఖములు గాని పుణ్యపాపములు గాని అంటక పర్యవసానముగా జ్ఞానోదయము కలిగి దానిద్వారా స్వరూప సాక్షాత్కారము కలుగును. ఇదియే శ్రీమద్భగవద్గీత యందు చెప్పబడినదని శ్రీశంకరాచార్యుల వారు తన భాష్యము ద్వారా విశదీకరించియున్నారు. సమస్త గీతారహస్యమును "గ్రంథోపసంహారము" అను శీర్షికతో తన భాష్యములో అంతర్భాగముగా గ్రంథము యొక్క అంత్యభాగమున చక్కగా సమీక్షించియున్నారు. ఇటువంటి సమీక్ష యింత వరకు యే గీతా వ్యాఖ్యాత గూడ చేసియుండలేదు. శ్రీ శంకరుల వారు నిర్ద్వందముగా గీత ధర్మాన్నివదల కుండానే నివృత్తి మార్గమును బోధించుచున్నదని స్పష్టపరచియున్నారు.

అటువంటి అతి స్పష్టము, సరళము, సర్వజనాను బోధకము అయిన శ్రీశంకర భాష్యమును నా శిష్యుడైన శ్రీసదానందభారతి సులభముగా సర్వులకు విశదముగా అర్థమగునట్లుగా ఆంధ్రభాషలోనికి అనువదించుట నాకెంతో ఆనందమును కలుగజేసినది.

ఈ శ్రీసదానందభారతి తన పూర్వాశ్రమమునందు డాక్టరు బండ్లమూడి ఆంజనేయులుగా లోకవిదితులు. ఆయన హిందీ, తెలుగు, సంస్కృతము మరియు ఇంగ్లీషు భాషల చక్కని పరిచయముగలవారు. హిందీ భాషయందు భక్తితత్త్వమునకు సంబంధించి "తులసీకా వ్యక్తిత్వ" అను పరిశోధనా గ్రంథమును వ్రాసి ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి "పి.హెచ్.డి" డిగ్రీని, దానితో పాటుగా విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘము వారి నుండి గొప్ప 'అవార్డు'ను కూడ పొందిన విద్వాంసులు. అంతేగాక కాలేజీ లెక్చరర్‌గా షుమారు నలుబదివత్సరములు బాలబాలికలకు విద్యాబోధగావించి వారిలో ఎందరినో విద్వాంసులుగా తీర్చిదిద్దిన మహోధ్యాపకులు.

ఈ అనువాదమునకు పూర్వము చాలాకాలముగా షుమారు పన్నెండు వత్సరముల నుండి మా ఆశ్రమము నందుచేరి అద్వైతతత్త్వమునకు సంబంధించిన వివేక చూడామణి, భారతీయ తత్త్వశాస్త్రము, ఉపదేశసహస్రి, మహావాక్యదర్పణము, సర్వవేదాంతసార సంగ్రహము, వేదాంతపంచదశి, నైష్కర్మ్యసిద్ధి, మాండూక్య, శ్వేతాశ్వర, కఠ, తైత్తరీయ, బృహదారణ్యక, ఛాందోగ్య ఐతరేయ, ప్రశ్న, ఈశావాస్య మొదలగు ఉపనిషద్గ్రంథములు మహాభారత, రామాయణ, శ్రీమదాంధ్ర మహాభాగవతాది స్మృతి గ్రంథములు, ఎంతో శ్రద్ధాభావముతో పఠించిచిత్తశుద్ధిని పొందిన తత్త్వవేత్తలు. ఆకారణముగ "జీవనవేదము", "రామరాయ శతకము", జ్ఞానోపనిషత్తు, పాటలలో సమస్తమైన అద్వైతతత్త్వమును తెలుపు "అమృతబిందువులు", హిందీలో "కలాకార్ కా వ్యక్తిత్వ ఔర్ కావ్యమే వుస్కీ అభివ్యక్తి" మొదలగు అనేక గ్రంథములు వ్రాసిన పండితులు.

ఈ "శ్రీమద్భగవద్గీత – శ్రీశంకరభాష్యం యథాతథం"అను ఈ అనువాద గ్రంథము పండితులకు, తత్త్వవేత్తలకు మరియు సామాన్యులకు గూడ గీతా రహస్యమును ఆంధ్రభాష ద్వారా తేట తెల్లముగా తెలియజేయగలదని ఆశించుచూ నాశిష్యుడైన శ్రీసదానందభారతిని ఋఇంత మంచి కార్యమును చేయుటకు శ్రమించినందులకు హృదయపూర్వకముగా ఆశీర్వదించుచున్నాను.

ఇట్లు

**- శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాములు**

ప్రణవాశ్రమము

గుడివాడ 10.3.2002

ఓం

# కృతజ్ఞతలు

శ్రీమద్భగవద్గీత ఒక అత్యద్భుతమైన శాస్త్రగ్రంథము. ఇటువంటి గ్రంథము ప్రపంచములో మరియొకటి కానరాదనడం అతి శయోక్తి కాదు. ఏలయన ? దీని గ్రంథకర్తయైన శ్రీశ్రీశ్రీ వేదవ్యాస మహర్షుల వారు భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుని ముఖతా మానవులనందరిని పూర్వపూర్వ జన్మలయందు తమచే చేయబడిన కర్మల ఫలముగా నాలుగు వర్ణములుగా విభజించి ఆ వర్ణవ్యవస్థయను ధార్మిక పునాదులపై శ్రీమద్భగవద్గీత యనబడుచున్న మహావిశాలము మరియు సుదృఢమైన భవనమును నిర్మింపజేసి దానియందు అన్ని వర్ణములవారు తమతమ వర్ణధర్మములకు కట్టుబడి తమ స్వభావజనితమైన కర్మల నాచరించుచూ, సుఖజీవనము గడపుచూ తుదకు క్రమక్రమముగా జన్మ – మరణ రాహిత్యరూపమైన మోక్షస్థితిని పొందుటకు తగు వ్యవస్థను యేర్పాటు చేసియున్నారు. అన్ని వర్ణముల వారికి వారివారి స్వభావ కారణముగ యేర్పడిన గుణముల సమన్వయము ననుసరించి విధించబడిన కర్మాధికారమునకు లోబడి ఫలాపేక్షలేక కర్మలు చేయుచూ తుదకు ఆ కర్మల ద్వారానే కలిగిన జ్ఞానబలంతో మోక్ష స్థితిని పొందునట్లుగా యేర్పాటు చేసియున్నారు.

ఈ గ్రంథమునందు అన్ని వర్ణములకు చెందిన మానవులందరికి మోక్షసిద్ధికి అవుసరమగు మార్గములు చూపించియున్నాడు. ఆకారణముగానే కర్మయోగము, భక్తి యోగము, ధ్యాన యోగము, సాంఖ్యయోగము అనగా జ్ఞానయోగము అను వివిధ యోగములు అనగా మోక్షమును కలిగించు మార్గములు పరస్పర విరోధము లేకుండ చూపెట్టబడినవి.

అయితే గ్రంథం మొత్తములోను ధర్మాచరణము కంటె జ్ఞానసంపాదనమే శ్రేయోదాయకమని చెప్పుచూ నిష్కామ కర్మయోగము ద్వారా మానవ సహజమైన కర్మను బహిష్కరించలేదు. భగవదర్పిత భావముతో అన్ని వర్ణముల వారు తమకు విధించబడిన కర్మాధికారము ననుసరించి యెటువంటి కర్మలు చేసినను ఆ కర్మల ఫలములైన పాపపుణ్యములు అనగా సుఖదుఃఖములు వారికి అంటవని మర్మగర్భితముగా చెప్పియున్నారు. పైగా అజ్ఞానము కారణముగ కర్మల యందు మునిగియున్న వారికి నైష్కర్మ్య భావము అనగా శుద్ధ జ్ఞానరూపమైన అద్వైతతత్త్వమును బోధించరాదనియు, బోధించినచో వారు చెడిపోవుదురనియు, అందులకు గాను జ్ఞానియైన వారలుగూడ ఆ యజ్ఞానులకు మార్గదర్శకత్వము లభించునట్లుగా నిష్కామ భావముతో కర్మలు చేస్తూనే వుండవలయునని, అందులకు శ్రీ కృష్ణునినే వుదాహరణముగ గ్రహించవచ్చునని వ్యాసులవారు బోధించియున్నారు.

గీత యందు సారరూపముగా అద్వైతతత్త్వమును మోక్షమునకు సర్వశ్రేష్ఠమైన సాధనముగా బోధించిగూడ వర్ణగతమైన కర్మను వదలరాదని నొక్కి చెప్పియున్నారు. శ్రీ శంకరాచార్యులవారు తమ భాష్యము ద్వారా గీతారహస్యమును సర్వులకు సుబోధక మగునట్లుగా విశదీకరించియున్నారు.

ఇప్పటికి షుమారు మూడువేల సంవత్సరములకు పూర్వమే యీ సర్వాంగపూర్ణము మరియు సర్వజనమోక్షదాయకము అయినటువంటి మయసభా ప్రాంగణమును పోలిన

గ్రంథభవనము సర్వవిధ జనసముదాయమునకు సుఖదాయకముగా వుండునట్లుగా నిర్మించబడినది. ఈ లోకం వున్నంత కాలం యీ గ్రంథము పాతబడదు దీని ఔన్నత్యము చెడదు. యుగయుగాల పర్యంతము యీ గ్రంథం పఠనీయంగానే వుంటుంది. దీనిని త్రోసివేయగల మరొక గ్రంథము రాదు, రాబోదు.

సర్వవిధ ధర్మములకు యీ గ్రంథము శత్రుదుర్భేద్యమైనటువంటి కోట వంటిది. ఇంతేకాదు యీ గ్రంథము హిందూ ధర్మము యొక్క మహోన్నత్యమును, ఉదార స్వభావమును మరియు సర్వజనీనతను వేలాది నోళ్లతో లోకమునందు చాటుతూనే వుంటుంది.

అందువలననే అనగా యీ గ్రంథరాజము యొక్క మహోన్నత్యము కారణముగానే నేటికి షుమారు అయిదు వేలమంది మహాత్ములు యీ గ్రంథమును తమతమ బుద్ధ్యాను సారముగ వ్యాఖ్యానించియున్నారు. అయినప్పటికి శ్రీశ్రీశ్రీ జగద్గురువులు ఆది శంకరాచార్యుల వారి భాష్యమునకు సరితూగగల వ్యాఖ్యానము ప్రకటితము కాలేదు. ఆ కారణముగానే ఆంధ్రభాషా పరిచితులందరికి శ్రీ శంకరభాష్యమును పరిచయము చేయు సద్భావముతో ప్రేరేపించబడిన వాడనై "శ్రీ మద్భగవద్గీత – శ్రీ శంకరభాష్యం యథాతథం" అను నామముతో యీ అనువాద కార్యమును చేసియున్నాను. ఇందు యేవైన దోషములున్నచో అవన్నియు నా అజ్ఞానమూలముగా దొర్లినవేగాని శ్రీ శంకరుల వారివి కావని విన్నవించుకొనుచున్నాను. నాయందు దయయుంచి, నాదోషములను మన్నించి పండితులైనవారు ఆదోషములను నాకు తెల్పినచో తరువాతి ముద్రణకాలమందు తగురీతిగా సంస్కరించుకోగలవాడనని సవినయముగా ప్రార్థించుచున్నాను.

**కృతజ్ఞతలు** అందరికంటె ముందుగా లోకకల్యాణార్థము శ్రీశ్రీశ్రీ తిరుమలగిరిపై వేంచేసియున్న వేంకటేశ్వర స్వామివారు అప్రత్యక్షముగా తన మహిమచే లోకమును నడిపించుచూ ఈ గ్రంథ ప్రకాశమునకు నలుబడివేల రూపాయీలు తమ ప్రతినిధుల ద్వారా గ్రాంటుగా యిచ్చినందులకు వారికి మరియు వారి ప్రతినిధులకు నాహృదయ పూర్వక శతాధిక సర్వాంగదండ ప్రణామములు ఆచరించుచున్నాను. అట్లే నన్ను అత్యంత ప్రేమభావముతో తమ శిష్యునిగా స్వీకరించి గత పన్నెండు వత్సరములుగా నాకు అద్వైత విద్యను బోధించి నన్ను ఈ మహాగ్రంథమును అనువదించగల సమర్థునిగా జేసి, అట్లు చేయుటకు అన్నివిధముల ప్రోత్సహించుటయేగాక నాచే అనువదించబడిన యీ 'శంకరభాష్యం యథాతథం' అను గ్రంథమునకు 'గ్రంథప్రవేశము' వ్రాసియిచ్చిన నాగురుదేవులు, ప్రణవాశ్రమాధిపతులు శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాముల వారికి సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించు చున్నాను.

అట్లే ఈ గ్రంథమును ప్రకాశింపజేయుటకు అవసరమైన అన్ని విధ కార్యములు శ్రమయనితలంచక పట్టుదలతో ప్రయత్నించిన రిటైర్డు చీఫ్ ఇంజనీరు శ్రీ కాజ కృష్ణారావు గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకొంటున్నాను. ఆవిధముగానే నేను కోరినయంతనే అతి సంతోషంతో తన 'నాగేంద్ర ప్రెస్సు'నందు ఈ గ్రంథమును యింత చక్కగా అచ్చువేయించి యిచ్చిన శ్రీ బాబూరావుగారికి కూడా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.
ప్రణవాశ్రమము.

ఇట్లు అనువాదకుడు

**– శ్రీ సదానందభారతి**

ఓం

# గురుపరంపరాభివందన

ఓం నమోబ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో,

వంశ ఋషిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః

ఓం సర్వో పప్లవ రహితః ప్రజ్ఞాన ఘనః

ప్రత్యగర్థో బ్రహ్మైవాహమస్మి, బ్రహ్మైవాహమస్మి

ఓం నమో నారాయణం, పద్మభవం, వసిష్టం

శక్తిం చ తత్పుత్ర పరాశరం చ

వ్యాసం శుకం గౌడపదం మహాంతం

గోవింద యోగీంద్ర మథాస్య శిష్యం

శ్రీ శంకరాచార్య మథాస్య పద్మ పాదం చ

హస్తామలకం చ శిష్యం తం తోటకం

వార్తి కకారమన్యాన్ అస్మద్గురూన్ సంతత మానతోస్మి

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం

నమామి భగవత్పాదం శంకరం లోకశంకరం

శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణం,

సూత్రభాష్య కృతౌ వందే భగవంతౌ పునః పునః

ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే

వ్యోమవత్ వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః.

# విషయాను క్రమణిక


| | | పుట |
|---|---|---|
| | ఉపోద్ఘాతము | iii |
| | గ్రంథ ప్రవేశము | vii |
| | కృతజ్ఞతలు | xiii |
| | గురుపరంపరాభివందన | xv |
| | విషయాను క్రమణిక | xvi |
| 1. | మొదటి అధ్యాయము (అర్జున విషాదయోగము) | 1 |
| 2. | రెండవ అధ్యాయము (సాంఖ్యయోగము) | 10 |
| 3. | మూడవ అధ్యాయము (కర్మయోగము) | 58 |
| 4. | నాల్గవ అధ్యాయము (జ్ఞానకర్మ సంన్యాసయోగము) | 86 |
| 5. | ఐదవ అధ్యాయము (కర్మ సంన్యాసయోగము) | 119 |
| 6. | ఆరవ అధ్యాయము (ధ్యానయోగము) | 141 |
| 7. | ఏడవ అధ్యాయము (జ్ఞానవిజ్ఞానయోగము) | 165 |
| 8. | ఎనిమిదవ అధ్యాయము (బ్రహ్మవిద్యాయోగము) | 179 |
| 9. | తొమ్మిదవ అధ్యాయము (రాజవిద్యారాజగుహ్యయోగము) | 193 |
| 10. | పదవ అధ్యాయము (విభూతియోగము) | 212 |

# శ్రీమద్భగవద్గీత

## శ్రీ శంకరభాష్యం యథాతథం

# మొదటి అధ్యాయము

ధృతరాష్ట్రుడు యిట్లనెను -

1. "ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః,
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ॥

అనగా - ఓ సంజయా ! ధర్మభూమియైన కురుక్షేత్రమునందు నా కుమారులైన కౌరవులు పాండురాజు పుత్రులైన పాండవులు ఏ విధముగా పాండవులు ఎటువంటి యుద్ధము చేయుచున్నారో నీవు నాకు చెప్పుము.

అప్పుడు సంజయుడు ఇలా చెప్పినాడు -

2. దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తథా ।
ఆచార్య ముపసంగమ్య రాజా వచన మబ్రవీత్ ॥

అనగా - ఆ సమయమందున రాజైన దుర్యోధనుడు పాండవ సైన్యమును వ్యూహాత్మకముగా నిలచివుండుట చూచి గురువైన ద్రోణుని దగ్గరకు వెళ్ళి యిట్లనుచున్నాడు.

3. పశ్యైతాం పాండుపుత్రాణామాచార్య మహతీం చమూమ్,
వ్యూఢాం ద్రుపద పుత్రేణ. తవ శిష్యేణ ధీమతా ॥

అనగా - దుర్యోధనుడు గురువైన ద్రోణునితో యిట్లనెను -

గురువుగారూ ! తమయొక్క బుద్ధిమంతుడైన శిష్యుడు, ద్రుపద పుత్రుడైన దుష్టద్యుమ్నుని ద్వారా వ్యూహారచన చేయబడిన పాండవులయొక్క ఆ గొప్ప సైన్యమును ఒక్కసారి పరికించండి.

4. అత్రశూరా మహేష్వాసా భీమార్జున సమా యుధి,
యుయుధానో విరాటశ్చ, ద్రుపదశ్చ మహారథః.

5. ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్,
పురుజిత్కుంతి భోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః.

6. యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్,
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః.

అనగా - ఈ సేనయందు మహా ధనుర్ధారులైన వీరులు, పోరాడుటయందు భీముడు మరియు అర్జునునితో సమానులైన సాత్యకి, విరాట్రాజు మరియు మహారథులైన ద్రుపదుడు,

బలవంతుడైన దృష్టకేతువు, చేకితానుడు, మరియు కాశీరాజు యింకా నరశ్రేష్ఠులైన పురుజి కుంతిభోజుడు, మరియు శౌర్యము మరియు పరాక్రమమునందు మిన్నలైన యుధామన్యు బలవంతుడైన ఉత్తమౌజుడు, సుభద్రాపుత్రుడైన అభిమన్యుడు మరియు ద్రౌపదీ పుత్రుల అయిదుగురు వీరులు, వీరందరూ మహారథులే.

**7. అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ,**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్బ్రవీ మితే.**

అనగా - ఓ ద్విజోత్తమా ! మన సైన్యమందు గూడ ఎవరెవరు వీరులున్నా వారినందరిని తమరు గుర్తించండి. మన సేనా నాయకుల పేర్లను చెప్పుచున్నాను. ఆలకించం

**8. భవా న్భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః,**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ.**

అనగా - తమరు, పితామహులు భీష్ములు, కర్ణుడు, రణవిజేతయైన కృపాచార్యు అట్లే అశ్వత్థామ, వికర్ణుడు మరియు సోమదత్తుని పుత్రుడు భూరిశ్రవుడు.......

**9. అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః,**
**నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధ విశారదాః.**

అనగా - వారేగాక యింకా అనేకులైన శూరవీరులు నాకొఱకు తమ ప్రాణముల అర్పించుటకు సిద్ధముగా యున్నారు. వారందరూ గూడ నానావిధములైన శస్త్రాస్త్రము ధరించియున్నవారై యుద్ధ విద్యయందు నిపుణులై యుండియున్నారు.

**10. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్,**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీష్మాభిరక్షితమ్.**

అనగా - ఆ విధముగా పితామహులైన భీష్ముని రక్షణయందున్న మన సైన్యము అ విధములుగాను అజేయమై యున్నది. మరియు లక్షింపబడుచున్న యీ పాండవుల సైన్యం చాలా సులువుగా గెలువబడవచ్చును.

**11. అయనేషు చ సర్వేషు యథాభాగ మవస్థితాః,**
**భీష్మమేవాభి రక్షన్తు భవన్తః సర్వ ఏవ హి.**

అనగా - అందుచేత తమరందరూ గూడ యుద్ధభూమియందు తమ త స్థానములయందు స్థిరముగా జాగరూకులై నిలబడియుండి పితామహులైన భీష్ములవారి రక్షించుచుతూ వుండగలరు.

12. తస్య సంజనయన్హర్షం కురువృద్ధః పితామహః,
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్.

అనగా - దుర్యోధనుడు అలా చెప్పిన తరువాత కురువంశ వయోవృద్ధుడు మరియు పరమవీరుడు అయిన భీష్ముడు దుర్యోధనుని హృదయమునందు హర్షాతిరేకమును కలించుటకై బిగ్గరగా సింహమువలె గర్జించుచూ శంఖమును మ్రోగించెను.

13. తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః,
సహసైవా భ్యహన్యంత స శబ్దస్తుములో ౭భవత్.

అనగా - అంతలోనే ఒక్కసారిగా శంఖములు, నగారాలు, డోళ్ళు, మృదంగములు యింకా కొమ్ము వాయిద్యములు మొదలగు అనేకములైన వాద్యసాధనములు మ్రోగినవి. ఆ మ్రోత చాలా భయంకరంగా వుంది.

14. తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ,
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః.

అనగా - అటు తరువాత తెల్లని గుఱ్ఱములు పూన్చినటువంటి పెద్ద రథముపై అధిష్టించియున్న శ్రీకృష్ణుడు మరియు అర్జునుడు కూడ తమ తమ అలౌకికమైన శంఖానాదములు చేసినారు.

15. పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః,
పౌంద్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః.

అనగా - శ్రీకృష్ణుడు పాంచజన్యము అను పేరుగల శంఖమును మరియు అర్జునుడు దేవదత్తమను శంఖమును పూరించిరి. భయంకరమైన కర్మలు చేయు వృకోదరుడైన భీముడు పౌంద్రము అను పేరుగల తన మహాశంఖమును మ్రోగించెను.

16. అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః,
నకులః సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ.

అనగా - కుంతీపుత్రుడు మరియు రాజు అయినటువంటి యుధిష్ఠిరుడు అనంత విజయమను శంఖమును, నకులుడు సుఘోషము అను శంఖమును మరియు సహదేవుడు మణిపుష్పకమను పేరుగల శంఖమును గొప్పగా పూరించిరి.

17. కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః,
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః.

అప్పుడు సంజయుడు యిలా అన్నాడు -

**24. ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత,**
**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్.**

**25. భీష్మద్రోణ ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్,**
**ఉవాచ పార్థ పశ్యైతాన్సమవేతాన్కురూనితి.**

అనగా - ఓ భారతా ! నిద్రను జయించిన అర్జునుని ద్వారా ప్రేరేపించబడిన శ్రీకృష్ణుడు ఆ సర్వోత్తమమైన రథమును యిరుసైన్యముల మధ్య భీష్ముడు మరియు ద్రోణాచార్యుడు యింక తదితరమైన రాజులకు ఎదురుగా నిలబెట్టి యిలా అన్నాడు - "ఓ పార్థా ! యిప్పుడు యిచ్చట గుమిగూడియున్న కౌరవులను చూడుము"

**26. తత్రాపశ్య త్థి స్తతా న్పార్థః పితౄనథ పితామహాన్,**
**ఆచార్యా న్మాతులా న్భ్రాతౄ న్పుత్రాన్పౌత్రా న్సఖీం స్థథా.**

**27. శ్వశురాన్సుహృదశ్చైవ సేనయోరుభయోరపి,**
**తా న్సమీక్ష్య స కౌంతేయః సర్వాన్బంధూనవస్థితాన్.**

**28. కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్,**
**దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్.**

**29. సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి,**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే.**

అనగా - ఓ పృథ్వీనాథా ! అప్పుడు ఆ పృథాపుత్రుడైన అర్జునుడు అచ్చట రెండు సైన్యములందును యుద్ధము చేయుటకు సిద్ధముగా నున్న పినపెద తండ్రులను, తాతలను, గురువులను, మామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, మిత్రులను, మామలను మరియు సుహృద్వర్గీయులను చూడమొదలిడెను. అచ్చట ఆ విధముగా తన కుటుంబమునకు సంబంధించిన వారినందరిని అలా యుద్ధమునకు సిద్ధముగా నిలబడియుండుట చూచి దయార్ద్ర హృదయుడైన ఆ కుంతీపుత్రుడు అర్జునుడు శోకించుచూ యిలా అన్నాడు - "ఓ కృష్ణా ! ఇప్పుడు నా యెదుట యుద్ధోన్ముఖులై నిలబడియున్న నా బంధు సముదాయమును చూచి నా సర్వాంగములు శక్తిహీనములగుచున్నవి. గొంతు ఎండిపోవుచున్నది. నా శరీరము కంపించుచున్నది.

**30. గాండీవం స్రంసతే హస్తాత్త్వక్చైవ పరిదహ్యతే,**
**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః.**

అనగా - నా గాండీవ మనబడు ధనుస్సు చేజారిపోవుచున్నది. తనువంతయు కాలిపోవుచున్నది. వాటితోపాటుగా నా మనస్సు భ్రమించుచున్నట్లున్నది. ఇంకా ఏమి చెప్పేది? నేను నిలబడ శక్తి గూడలేనివాడనై యున్నాను.

**31. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ,**
**న చ శ్రేయో ఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే.**

అనగా - ఓ కేశవా ! అంతేకాకుండా యింకా అన్ని లక్షణాలు నాకు విపరీతముగానే తోచుచున్నవి. యుద్ధములో నా కులమువారి నందరిని చంపి నేను ఎటువంటి శుభములు పొందగలను ?

**32. న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ,**
**కిం నో రాజ్యేన గోవింద కిం భోగై ర్జీవితేన వా.**

అనగా - కృష్ణా ! నేను యుద్ధము చేసి విజయమును పొందగోరుట లేదు. మరియు రాజ్యమును గాని రాజభోగములను గాని పొందగోరుట లేదు. ఓ గోవిందా ! రాజ్యమువలన గాని, రాజభోగముల చేతగాని, చివరకు జీవించుటయందు గాని ఏమి ప్రయోజనము కలదు?

**33. యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ,**
**త ఇమే ఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ.**

**34. ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః,**
**మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబధిన స్తథా.**

అనగా - ఎవరికొఱకు నేను రాజ్యమును, రాజ్యభోగములను మరియు సర్వవిధ సుఖములను కోరుకొంటున్నానో వారందరూ అనగా నా గురువులు, తండ్రులు, కుమారులు, తాతలు, మామలు, మనుమలు, బావమరుదులు మరియు యితరమైన నా కుటుంబము వారందరూ ధనప్రాణములను గూడ లెక్కచేయక యుద్ధము చేయుటకై యిచ్చట సిద్ధముగా వున్నారు.

**35. ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతో ఽపి మధుసూదన,**
**అపి త్రైలోకరాజ్యస్య హేతోః కి ను మహీకృతే.**

అనగా - ఓ మధుసూదన ! వారందరూ నాపై దండెత్తివచ్చి నన్ను బాధించినా సరేగాని నేను మాత్రము ముల్లోకముల రాజ్యమును పొందుటకైనను నా బంధువులైన వీరినందరిని చంపజాలను. అలాంటప్పుడు ఒక చిన్నిరాజ్యము కొఱకు నేను వారందరినీ ఎలా చంపగలను?

**36. నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన,**
**పాప మేవాశ్రయేదస్మాన్హత్వై తానాతతాయినః.**

అనగా – ఓ జనార్దన ! ఈ ధృతరాష్ట్రుని పుత్రులనందరిని చంపినందువలన నాకు (మాకు) కలుగు సంతోషమేముండును ? పైగా ఈ అల్లరిమూకలను చంపినందువలన మనకు పాపము సంభవించునేగాని కలుగు పుణ్యమేమున్నది ?

**37. తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్స్వ బాంధవాన్,**
**స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ.**

అనగా – అందువలన ఓ మాధవా ! నాకు బంధువులు మరియు స్వగోత్రీకులైన ధృతరాష్ట్ర సంతానమును వధించుట న్యాయముకాదు. ఏలయన ? మన బంధువులను వధించి మనమెట్లు సుఖపడగలము ?

**38. యద్యప్యేతే న పశ్యంతి లోభోపహత చేతసః,**
**కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్.**

అనగా – లోభం కారణముగా మతిభ్రష్టులైయున్న యీ కౌరవులు కులక్షయము వలన కలుగబోవు దోషమును మరియు మిత్రులైన వారితో వైరభావము కలిగియున్నందువలన కలుగు పాపమును తెలియజాలకున్నారు.

**39. కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్,**
**కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన.**

అనగా – అలా అయినప్పటికి ఓ జనార్దనా ! కులక్షయము వలన కలుగు దోషమును చక్కగా ఎఱింగియున్న మనము యిటువంటి పాపమునుండి తప్పుకొనుటకు కావలసిన మార్గమును ఎందుకు వెదకరాదు ?

**40. కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః,**
**ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మో ऽభిభవత్యుత.**

అనగా – అందరికి తెలిసిన విషయమేమనగా – కులం నశించితే సనాతనమైన అనగా అనాదిగా ఆచరణయందున్న కాలధర్మం నశిస్తుంది. ఆ విధంగా ధర్మం నశిస్తే కులమంతా పాపభూయిష్టం అయిపోతుంది.

41. అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః,
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణ సంకరః.

అనగా – ఓ కృష్ణా ! ఈ విధంగా పాపం ప్రబలినట్లయితే ఆ కులమునకు సంబంధించిన స్త్రీలందరు దూషితలైపోతారు. ఆ విధంగా కులస్త్రీలందరూ దూషితలైన ఎడల ఆ కులమునకు వర్ణసాంకర్యము ఏర్పడును.

42. సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ,
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదక క్రియాః.

అనగా – ఆ వర్ణసంకరత్వము ఆ కులం చెడినవాళ్ళను మొత్తం కులాన్ని గూడ నరకానికి తీసుకొని వెళ్ళడానికి కారణం అవుతుంది. అట్లేలయన ? వాళ్ళ పిత్రుదేవతలు పిండ, క్రియ జలక్రియ లేకుండా పోయినందున తమ తమ స్థానముల నుండి భ్రష్టత్వాన్ని పొందుదురు.

43. దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః,
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః.

అనగా – ఈ విధంగా వర్ణ సంకరత్వాన్ని కలిగించే పై దోషముల వలన ఆ కుల ఘాతుకుల కారణంగా సనాతన కులధర్మము మరియు జాతిధర్మము రెండూ నశిస్తాయి.

44. ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన,
నరకే నియతం వాసో భవతీత్యను శుశ్రుమ.

అనగా – ఓ జనార్దనా ! ఎవరి కులధర్మములు నశించునో ఆ మానవులందరికీ తప్పక నరకవాసము కలుగును. అలా అని నేను ఇంతకు పూర్వమే వినియున్నాను.

45. అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయం,
యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజన ముద్యతాః.

అనగా – అయ్యో ! మనము చాలా గొప్ప పాపకార్యము చేయ నిశ్చయించుకొని యున్నాము. ఇది ఎంతటి దుఃఖకార్యము ? రాజ్యసుఖలోలురమై మనయొక్క కుటుంబాన్నే నశింపజేయుటకు వుద్యుక్తులమై యున్నాము.

46. యది మా మప్రతీకార మశస్త్రం, శస్త్రపాణయః,
ధార్త రాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్.

అనగా – ఒక వేళ శస్త్రాస్త్రములు లేక యుద్ధ విముఖుడనైయున్న నన్ను అన్ని విధములైన శస్త్రాస్త్రములతో కూడియున్న ఆ ధృతరాష్ట్రుని పుత్రులు రణభూమియందు చంపివైచిననూ అది నాకు అన్నివిధముల శుభకరమే యగును.

అప్పుడు ధృతరాష్ట్రునితో సంజయుడు యిలా అన్నాడు -

**47. ఏవ ముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్,**
**వి సృజ్య సశరం చాపం శోక సంవిగ్నమానసః.**

అనగా - ఆ రణభూమియందు పై విధముగా చెప్పిన అర్జునుడు బాణములతో కూడియున్న విల్లును క్రిందపడవైచి శోకముతో మరియు వ్యాకులతతో నిండిన చిత్తము కలవాడై తన రధమునందే కూలబడిపోయినాడు.

కృష్ణార్జున సంవాదరూపమైన అర్జున విషాదయోగము విషాదము = అనగా దుఃఖము అను ప్రథమ అధ్యాయము సమాప్తము

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*అర్జున విషాద యోగమను మొదటి అధ్యాయమునకు శ్రీశ్రీశ్రీ శంకరాచార్య*
*విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు - **శ్రీ సదానంద భారతి***
*ప్రణవాశ్రమము.*

# రెండవ అధ్యాయము

సంజయుడు ఇలా చెప్పినాడు -

**2.1. తం తథా కృపయావిష్ట మశ్రుపూర్ణా కులేక్షణమ్,**
**విషీదంత మిదం వాక్యమువాచ మధుసూదనః.**

అనగా - ఈ విధంగా నీటితోనూ, భయంతోనూ కూడియున్న కన్నులు గలిగి శోకభావమునందు మునిగియున్న అర్జునుని చూచి భగవంతుడైన మధుసూదనుడు యిలా అన్నాడు.

**2.2. కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్,**
**అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున.**

అనగా - ఓ అర్జునా ! శ్రేష్ఠులైన పురుషులు కోరనటువంటిది, స్వర్గమును పొందుటకు పనికిరానిది మరియు అపకీర్తిని కలిగించునటువంటి అనర్థదాయకమైన యీ విషాదము (మోహము) యీ యుద్ధక్షేత్రమునందునీకు ఎట్లు కలిగినది ?

**2.3. క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే,**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప.**

అనగా - ఓ పార్థా ! నీవు పిరికివాడవు కాబోకు. పిరికితనము గౌరవప్రదమైనది కాదు. ఓ శత్రువులను పీడించు అర్జునా ! క్షుద్రమైన ఈ హృదయ దుర్బలత్వమును వీడి యుద్ధమునకు సన్నద్ధుడవు కమ్ము.

అప్పుడు అర్జునుడు యిలా అన్నాడు -

**2.4. కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన,**
**ఇషుభిః ప్రతి యోత్స్యామి పూజార్హా వరిసూదన.**

అనగా ఓ మధుసూదన ! యుద్ధ క్షేత్రమునందు నా పితామహులైన భీష్ములవారితోనూ, గురుదేవులైన ద్రోణాచార్యులవారితోను నేను బాణములతో ఏ విధముగా యుద్ధము చేయగలను? ఏలయన ? ఓ అరిసూదనా ! వారిరువురూ గూడ నాకు పూజార్హులు గదా !

**2.5. గురూ నహత్వా హి మహానుభావా శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహలోకే,**
**హత్వార్థకామాంస్తు గురూ నిహైవ భుంజీయ భోగా(న్రుధిర ప్రదిగ్ధాన్.**

అనగా - అట్టి మహనీయులు మరియు పూజ్యులు అయినవారిని చంపుటకంటె యీ లోకములో భిక్షాటనము చేసుకొని జీవించుట మంచిపని. ఏలయన ? ఈ గురుజనులను వధించి ఈ ప్రపంచమునందు నేను రక్తముతో కూడిన సంపదను కోరికలతో కూడిన భోగములను ఎట్లు అనుభవించగలను ? వారిని వధించినందువలన నాకు లభించునవి ఇహలోక భోగములే గదా ?

**2.6. న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః,**
**యానేవ హత్వా న జిజీవిషామస్తే ఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః.**

అనగా - మనం ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో నాకు బొత్తుగా తెలియకున్నది. ఈ జరుగబోవు యుద్ధమునందు మనం విజయమును పొందుదుమో లేక అపజయమునే పొందవలసి యుండునో తెలియక యున్నది. ఎవరిని వధించి మనం బ్రతికి వుండడం కూడ కోరుకోవడం లేదో అటువంటి ధృతరాష్ట్రుని పుత్రులు మనతో యుద్ధం చేయదానికి మనకు ఎదురుగా నిలబడి యున్నారు.

**2.7. కార్పణ్యదోషోపహత స్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః,**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తే ఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్.**

అనగా - పిరికితన రూపమైన దోషమువలన నశించిన స్వభావుడను మరియు కర్తవ్య నిర్ణయము చేయుటయందు విఫలుడనైన నాకు శుభములను కలుగజేయునటువంటి నిర్దుష్టమైన మంచిమాట ఒకటైనా చెప్పమని మిమ్ములను వేడుకొనుచున్నాను. నేను ప్రస్తుతము మీ శిష్యుడను. మిమ్ము శరణుజొచ్చియున్న యీ దాసునకు సదుపదేశము చేయుమని ప్రార్థించుచున్నాను.

**2.8. న హి ప్రపశ్యామి మమాపనుద్యాద్య చ్ఛోకముచ్ఛోషణ మింద్రియాణామ్,**
**అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్.**

అనగా - ఏలయన ? ఈ భూమిమీద నిష్కంటకమై ధనధాన్యాదులతో నిండియున్న రాజ్యమునుగాని, లేక దేవతల స్వాధీనమునందున్న స్వర్గాధిపత్యమును గాని పొందినప్పటికి యిప్పుడు నా యింద్రియములను తపింపజేయుచున్న దుఃఖమును తొలగించు ఉపాయము నాకు తోచుటలేదు.

ఇంతలో ధృతరాష్ట్రునితో సంజయుడు యిలా అన్నాడు -

**2.9. ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప,**
**న యోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ.**

అనగా - శత్రువులను తపింపజేయు ఓ ధృతరాష్ట్ర మహారాజా ! నిద్రను జయించినటువంటి అర్జునుడు సర్వాంతర్యామియైన శ్రీకృష్ణునితో యిలా అనగా పై విధముగా చెప్పిన తరువాత "నేను యుద్ధము చేయను" అని కూర్చున్నాడు.

**2.10. తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత,**
**సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః.**

అనగా - ఓ మహారాజా ! ఆ విధముగా యిరుసైన్యముల మధ్య శోకించుచూ కూర్చొనియున్న అర్జునుని జూచి నవ్వుచూ భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు యిలా అన్నాడు.

వ్యాఖ్య - ఇచ్చట "దృష్ట్వాతు పాండవానీకం" గీత 1-2 అను శ్లోకము మొదలు "న యోత్స్య ఇతిగోవిందముక్త్వా తూష్ణీంబభూవ హ" గీత 2-9 అను శ్లోకము వరకు చెప్పబడిన గ్రంథమునకు అర్థము యీ క్రింది విధముగా గ్రహించవలయును -

ఈ ప్రకరణము సర్వప్రాణులయొక్క శోకము, మోహము, మొదలగు ప్రాపంచిక కారణ స్వరూపములైన ఏ దోషములు కలవో వాటి యొక్క ఉత్పత్తికి కారణము చెప్పుటకొఱకే చెప్పబడినదని గ్రహించవలయును.

అట్లేలయని అన్నచో - "కథం భీష్మమహం సంఖ్యే" గీ. 2-4 మొదలగు శ్లోకముల ద్వారా అర్జునుడు అదే విధముగా రాజ్యము, గురువు, గురుపుత్రుడు, మిత్రులు, సహృదయులు, స్వజనులు అనగా బంధువులు మరియు తాతలు, తండ్రుల విషయమున గూడ "వీరంతా నావారు" నేను వాళ్ళవాడను" అని ఈ విధముగా అజ్ఞాన జనితమైన ప్రేమ విచ్ఛేదము మొదలగు కారణములవలన జరుగబోవు శోక మోహములను తెలిపియున్నాడు.

ఆ యర్జునుడు మొదట తనంతతానుగానే అనగా యితరులెవ్వరి ప్రేరణ లేకుండగనే క్షాత్ర ధర్మమైన యుద్ధకార్యమునందు పాల్గొనుటకు వచ్చియే యున్నాడు. అయినప్పటికి శోకమోహాదుల కారణముగ వివేకజన్య జ్ఞానము మరుగుపడగా అతడు యుద్ధ విముఖుడు అయినాడు. అంతేగాక పరధర్మమైన అనగా బ్రాహ్మణ ధర్మమైన భిక్షాటనము ద్వారా జీవితమును గడపతలంచినాడు. ఈ విధముగా ఏ మానవుని చిత్తము శోకమోహాదులతో ఆవరించబడునో ఆతడు స్వధర్మాన్ని వదలి నిషిద్ధమైన పరధర్మాన్ని గ్రహించుటకు ప్రయత్నిస్తాడు. ఇటువంటివారు ఒకవేళ స్వధర్మపాలనకు కట్టుబడియున్నప్పటికి మనసా, వాచా మరియు శారీరక ప్రవృత్తి కారణముగ ఫలాకాంక్ష కలిగినవారై అహంకార భావము కలిగియే యుందురు.

అలా వున్నందువలన పుణ్యపాపములు రెండూ పెరుగుచూ వుంటూ వున్నందువలన మంచి చెడ్డ జన్మలు, సుఖదుఃఖములకు ప్రతిరూపమైన సంసార నివృత్తి జరుగదు. ఆ కారణముగ శోకమోహములు రెండూ గూడ సంసారమునకు బీజములవంటివి. అనగా తిరిగి జన్మ-మరణములు కలిగించునవే.

ఈ రెండూ అనగా శోకమోహములు సర్వకర్మ సంన్యాస పూర్వకమైన ఆత్మజ్ఞానము లేకుండా యితర ఉపాయముల ద్వారా నశింపనేరవు. అందువలన లోకులందరికి ఆత్మజ్ఞానమును కలిగించకోరుచున్న భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునుని నిమిత్తముగా జేసుకొని **"అసోచ్చన్"** గీత 2-11 మొదలగు వాక్యములను వుపదేశించుచున్నాడు.

ఈ విషయమై చాలామంది టీకాకారులు కేవలము సర్వకర్మ సంన్యాస పూర్వకమైన ఆత్మజ్ఞానము ద్వారా శోకమోహములు నివర్తించవనియు, మోక్షము కలుగదనియు చెప్పుచున్నారు. కాని అగ్నిహోత్రాది శ్రౌత-స్మార్త కర్మసహేతుకమైన జ్ఞానము ద్వారా మోక్షము కలుగునని యిదియే గీతయొక్క నిశ్చితమైన అభిప్రాయమని చెప్పుచున్నారు.

ఈ భావమును బలపరుచుటకై వారు కొన్ని ప్రమాణములను గూడ చెప్పుచున్నారు. అవి ఏవన ? -

"అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి గీ. 2-33

కర్మణ్యేవాధికారస్తే, కురుకర్మే తస్మాత్త్వమ్ గీ. 2-47 మొదలగు ప్రమాణ వాక్యములు చూపుచున్నారు. వారు యింకా ఏమంటున్నారంటే - హింసాభావముతో కూడియున్నంత మాత్రమున వైదిక కర్మలు అధర్మముతో కూడినవని చెప్పరాదు. ఏలయన ? గురువులు, సోదరులు, పుత్రులు మొదలగువారిని వధించుటయే స్వరూపముగా కలిగియున్న అత్యంత క్రూరమైన యుద్ధమే స్వధర్మముగా కలిగియున్న క్షాత్రధర్మము వేదాది శాస్త్రముల యందు క్షత్రియ వర్ణమువారికి స్వధర్మముగా చెప్పబడియున్నందున ఆ హింస, ఆ మారణకాండ అధర్మమని - పాపహేతువని చెప్పరాదని కొందరి భాష్యకారుల వాదము. అంతేకాకుండా అటువంటి స్వధర్మమైన యుద్ధము చేయకుండినచో **"తతః స్వధర్మం కీర్తించ హిత్వా పాపమవాప్స్యసి"** గీ. 2-33 అనగా స్వధర్మమును ఆచరించనివారికి పాపము సంభవించును. ఈ విధమగు దోషమును చూపించువారికి భగవానుడైన శ్రీకృష్ణులవారు చెప్పిన "జీవన పర్యంతము కర్మలు చేయుచుండుము" అను వాక్యము శ్రుతిననుసరించి జంతువధ మొదలగునవి అధర్మ కర్మలు కానేరవు.

కాని వారు అలా చెప్పునది సరికాదు. ఏలయన ? **వేఱువేఱుగా రెండు విధములైన బుద్ధులను ఆశ్రయించియున్న జ్ఞాననిష్ఠ మరియు కర్మనిష్ఠ వేఱువేఱుగా చెప్పబడియున్నది.**

**"అశోచ్యన్"** గీ. 2-11 అను శ్లోకము మొదలు **"స్వధర్మపి చావేక్ష్య"** గీ. 2-31 అను శ్లోకము యొక్క మొదటి ప్రకరణము నుండి భగవంతుడైన శ్రీకృష్ణుడు ఏ పరమార్ధమైన ఆత్మ తత్త్వమును నిరూపించియున్నాడో అది అంతయు సాంఖ్యమతమునకు చెందినదై యున్నది. ఆ సాంఖ్యమతము ననుసరించి విచారించి చూచిన యెడల ఆత్మయందు జన్మ-మరణాది ఆరు విధములైన వికారములు లేనందున ఆత్మకు కర్తృత్వము కుదరదు - లేదు. ఈ ప్రకారమైన నిర్ణయము ఆ ప్రకరణము యొక్క అర్ధమును విచారణ చేసినందున కలుగుచున్నది. అటువంటి విచారణ చేయు బుద్ధిని సాంఖ్యబుద్ధి లేక సాంఖ్యుల మతము ననుసరించి విచారించినందువలన

కలిగిన నిశ్చయము. ఈ నిశ్చయము ఏ జ్ఞానులకు వివేకముతో కూడిన నిశ్చయముగా తోచుచున్నదో వారలు సాంఖ్యయోగులు.

అట్లుగాక అనగా పైన చెప్పబడినటువంటి సాంఖ్యబుద్ధి ఏర్పడక పూర్వము ఆత్మ దేహాదులకంటే వేఱుగా వున్నదని, దానికి కర్తృత్వము, భోక్తృత్వము కలదని తలంచువారు; అనగా ధర్మాధర్మములతో కూడియున్న మార్గమున మోక్షమును పొందుటకు అవసరమైన అనుష్ఠానమును చేయుటకు ప్రయత్నించుటయే స్వరూపముగా కలిగియున్న బుద్ధి యోగబుద్ధి. అలాంటి యోగబుద్ధి కలిగియుండుట ఎవరికి సమ్మతమో వారు యోగులు.

ఈ విధంగా భగవంతుడైన శ్రీకృష్ణుడు **"ఏషా తే ఽభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు"** గీ. 2.39 అను శ్లోకమునుండి పైన చెప్పబడిన రెండు విధములైన బుద్ధులను వేఱువేఱుగా చెప్పి వర్ణించియున్నారు.

ఆ రెండు బుద్ధులలో నుండి సాంఖ్యబుద్ధి ననుసరించి యుండు సాంఖ్యయోగుల యొక్క జ్ఞాననిష్ఠను "పురాప్రోక్తా మయానఘ" గీ. 3.3 అను మొదలగు వాక్యముల ద్వారా వేరుగా చెప్పియున్నారు.

మరియు యోగబుద్ధిననుసరించి కర్మయోగముతో కూడిన నిష్ఠను **"కర్మయోగేన యోగినామ్"** గీ. 3.3 అను మొదలగు వాక్యముల ద్వారా వేఱుగా చెప్పియున్నారు.

కర్తృత్వము, అకర్తృత్వము మరియు ఏకత్వము – అనేకత్వము మొదలగు భిన్న భిన్నములైన బుద్ధులను ఆశ్రయించుకొని యుండు ఏ జ్ఞానము మరియు కర్మలు వున్నవో ఆ రెంటిని అనగా ఆ జ్ఞాన-కర్మలను ఒకే పురుషుని యందు కూడియుండుటను అసంభవమని తలంచు భగవంతుడైన శ్రీకృష్ణుడే స్వయముగా పైన చెప్పబడినట్లుగా సాంఖ్యబుద్ధి మరియు యోగబుద్ధిని ఆశ్రయించుకొని యుండు రెండు వేఱు వేఱు నిష్ఠలని చెప్పియున్నాడు.

ఏ విధముగా ఈ గీతాశాస్త్రమునందు పై రెండు నిష్ఠలు అనగా సాంఖ్యబుద్ధి మరియు యోగబుద్ధి-వేరువేరుగా వర్ణించబడియున్నవో ఆ విధముగానే **"శతపథి బ్రాహ్మణమునందు"** గూడ వేఱువేఱుగానే చూపించబడియున్నవి. ఆ "శతపథి బ్రాహ్మణ"మునందు ఈ ఆత్మలోకమును పొందగోరు వైరాగ్యశీలురైన బ్రాహ్మణులు సంన్యాసమును స్వీకరింతురు అని చెప్పబడియున్నది. ఈ విధముగా సర్వకర్మలను విసర్జించు అనగా సంన్యసించు పద్ధతిని అనుసరించి అదే వాక్యము చివర భాగమునందు "ఏదైతే మాకు మాత్రమే సంబంధించియున్న ఆత్మయే లోకమో ఆ మేము సంతానము ద్వారా మరి యింక దేనిని పొందుదుము ?" అని చెప్పబడియున్నది. **చూ. కింప్రజయా కరిష్యామో యేషాం నో ఽయమాత్మాయం లోకః.బృ.** 4.4.22

"ప్రాకృత ఆత్మ అనగా అజ్ఞాని యగు మానవుడు ధర్మజిజ్ఞాసానంతరము మరియు వివాహమునకు పూర్వము ముల్లోకములను పొందుటకు సాధన రూపమైన పుత్రుని అనగా దైవము మరియు మానవుడు వంటి రెండు విధములైన సంపదను పొందవలయునని తలంచనారంభించెను. వీనిలో పితృలోకములను పొందుటకు సాధన రూపమైన "కర్మ" మానవ

సంపత్తి మరియు దేవలోకమును పొందుటకు సాధనరూపమైనది. 'విద్య' అనగా దైవధనము అనగా జ్ఞానము అని కూడ అచ్చటనే చెప్పబడియున్నది.

ఈ విధముగా పైన చెప్పబడిన శ్రుతివాక్యమునందు విద్యావిహీనుడై ప్రాపంచిక వస్తువుల యందు మనసు కలిగియున్న పురుషునికే శ్రౌతాది సమస్త కర్మలు చెప్పబడినాయి.

"ఆ విధమగు సమస్త కర్మలను త్యజించి విద్యావంతులైన బ్రాహ్మణులు సంన్యాసమును స్వీకరించుదురు" అను వాక్యముననుసరించి చూచిన కేవలము బ్రహ్మలోకమును పొందగోరు నిష్కామి అనగా ఎటువంటి కోరికలు లేనటువంటి పురుషునికే కుదురునని చెప్పబడినది.

ఒకవేళ భగవంతుడైన శ్రీకృష్ణునికి శ్రౌతకర్మలు మరియు జ్ఞానముయొక్క సముచ్చయము అనగా రెండు విధములగు పద్ధతులు ఒకే పురుషునికి తగునను భావము యిష్టమని ఒప్పు కొన్నచో లేక చెప్పినచో ఆయన సవివరముగా పైన ఆ రెంటిని విడదీసి చెప్పినదంతయు వ్యర్థమైనదిగా ఋజువగును. అంతేగాకుండా అట్టి సముచ్చయమును ఒప్పుకొన్నచో **"జ్యాయసీ చేత్కర్మణస్తే"** గీ. 3.1 మొదలగు అర్జునుడు వేసిన ప్రశ్న గూడ నిరర్థకమే యగును.

ఒకవేళ జ్ఞానము మరియు కర్మలు రెండూ ఒకే పురుషునియందు ఒకే కాలములో కలిగియుండుట సంభవమేనని మరియు కర్మకంటె జ్ఞానమే గొప్పదని భగవంతుడు యింతకు పూర్వమే చెప్పియుండక పోయినట్లయితే అర్జునుడు భగవంతుడు చెప్పిన మాటను సరిగ్గా విన కుండానే లేక విన్నా సరిగ్గా అర్థము చేసుకోకుండానే **"జ్యాయసీ చేత్కర్మ ణస్తే మతాబుద్ధి"** గీ. 3.1, అను వాక్యము ద్వారా భగవంతుని యందు అబద్ధపు ఆరోపణ చేసినవాడగును.

నిజముగా మానవమాత్రులందరికీ జ్ఞానము మరియు కర్మ సముచ్చయము అనగా రెండూ ఒకే పురుషుడు ఒకే కాలమునందు చేయగలుగుట సంభవమేనని భగవంతుడు చెప్పియున్నట్లయితే అదే మాట అర్జునునకు గూడ చెప్పియుండవలసినది గదా ! మరి అలా చెప్పియుండలేదు గదా ? **"యచ్ఛ్రేయఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితం"** అనగా పై రెంటిలో నీకు ఏది శ్రేయస్కరమో దానినే చేయుము. అని చెప్పియుండదు గదా ?

అట్లేలయన్నచో - పైత్యము నుండి ముక్తిని పొందగోరు రోగికి వైద్యుడు మధురము మరియు శీతలమైన పదార్థములను సేవించమని చెప్పినప్పుడు రోగి ఆ రెంటిలో ఒకదానినే ముందుగా చెప్పమని కోరలేదు గదా ?

ఒకవేళ అర్జునుడు భగవంతుడు చెప్పిన విషయమును సక్రమంగా అర్థం చేసుకోనందున అలాంటి ప్రశ్న వేశాడనుకొంటే అప్పుడు భగవంతుడు అర్జునుని ప్రశ్నకు అనుకూలంగానే "నేను జ్ఞానము, కర్మలు రెండూ కలిసి వున్నప్పుడే మోక్షము సిద్ధించునని చెప్పియున్నాను గదా? ఇప్పుడు నీకు ఈ సందేహము భ్రాంతి - ఎట్లు కలిగినది ?" అని చెప్పి వుండేవాడు గదా !

అందుచేత అర్జునుని ప్రశ్నకు విపరీతముగా నేను ముందే చెప్పియున్నాను గదా ? అని చెప్పుట కుదరదు.

ఇదే గాకుండా కెవలము స్మార్తకర్మలతో పాటు జ్ఞానము కలిసియే యుండును అని చెప్పియుండినచో ఆ రెంటిని పై విధముగా విడదీయుట కుదరదు.

అలా కాకుండా "యుద్ధం చేయుట" అను స్మార్తకర్మ క్షత్రియ వర్ణమువారికి స్వధర్మమే" అని అందామంటే **"తత్ కిం కర్మణి ఘోరే మాం నియోజయసి"** గీ. 3.1 అనగా యుద్ధమువంటి ఘోరపాప రూపమైన కర్మలు చేయుటకు నన్ను ఎందులకు పురికొల్పుచున్నావు' ' అని అర్జునుడు కృష్ణుని ఎత్తిపొడుపుగా అడుగుట కుదరదు గదా ?

అందువలన యిచ్చట తేలిన సారాంశమేమన – ఈ గీతాశాస్త్రమునందు శ్రౌత లేక స్మార్త సిద్ధాంతములకు సంబంధించిన ఎటువంటి కర్మతోనూ ఆత్మజ్ఞానమునకు సంబంధము కలదని ఏ పండితుడు గూడ ఋజువు చేయజాలడు.

అజ్ఞానము వలనగాని లేక ఆసక్తి మొదలగు దోషముల వలన గాని కర్మల యందు చిక్కుకొన్న మానవుడు ఎప్పుడైతే యజ్ఞములు, దానములు, లేక తపము మొదలగు కర్మలు చేసి తన అంతఃకరణమును మాలిన్య రహితముగా శుభ్రపరచుకొనునో అప్పుడు అతనికి పరమార్థ తత్వ విషయకమైన జ్ఞానము కలుగును. ఆ జ్ఞానబలముతో ఈ ప్రపంచమంతయు ఆ పరబ్రహ్మ తత్వముకంటె వేఱుగా లేదని తెలిసినవాడై కర్తృత్వ భావమును త్యజించును.

ఆ విధముగా కర్మలు మరియు కర్మఫలము నుండి నివృత్తి పొందియున్ననూ సంపూర్ణము, సర్వాంగపూర్ణము అయిన జ్ఞానమును పొందిన మానవుడు ఫలప్రాప్తి భావముతోగాక కేవలము లోకసంగ్రహార్థము జ్ఞానమును పొందక పూర్వము వలెనే నిరాసక్తతో కర్మలు చేయుచుండును. అటువంటి జ్ఞానికి కర్మఫలము అంటదు. అందుచే ఆతనికి కర్తృత్వ భావము వుండదు.

భగవత్స్వరూపుడైన వాసుదేవుడు అనగా కృష్ణుడు తనలోక ధర్మము ననుసరించి కర్మలు చేయుచున్నను ఆయన సర్వాంగ పూర్ణమైన జ్ఞాని అయినందువలన ఆయనకు కర్తృత్వ భావము వుండదు. ఆయనకువలెనే కర్తృత్వ భావమును త్యజించి కేవలము లోకసంగ్రహార్థము కర్మలు చేయు మానవునికి గూడ కర్మఫలము అంటదు.

ఇంతేగాకుండా కర్మను సాధనముగా జేసుకొని అగ్నిహోత్రాది కర్మలను అనుష్ఠించు స్వర్గాదులనుకోరు సాధకుడు కూడ మధ్యలో జ్ఞానము కలిగినందువలన ఆ యా కర్మానుష్ఠానమును త్యజించెనేని అనగా ఫలాసక్తిని వదలి నిరాసక్త భావముతో ఆ యా కర్మలు చేయుచుండినను ఆ కర్మలు కామ్యకర్మలు కానందున కర్మఫలము జ్ఞానికి వలె ఆతనికి గూడ అంటదు.

**"కుర్వన్నపి నలిప్యతే"** గీ. 5.7 **"నకరోతినలిప్యతే"** మొదలగు వాక్యముల ద్వారా భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు అచ్చటచ్చట యిటువంటి మాటలే చెప్పియున్నాడు. అంతేగాకుండా **"పూర్వైః" పూర్వతరం కృతమ్"** గీ. 4.15 **"కర్మణైవ హి సంసిద్ధిమాస్థితాం జనకాదయః"** మొదలగు వాక్యములను గూడ చక్కగా విశదముగా చూచిన ఎడల పై భావమే స్థిరపడును.

అయితే "ఆ వాక్యములను ఏ విధముగా తెలియవలయును ?" అని సామాన్యులు అడుగుచుందురు. అందులకు సమాధానమేమనగా –

ఇంతకు పూర్వము జనక మహారాజులాంటి కర్మలు చేయువారు గూడ జ్ఞానులై యుండియు లోకసంగ్రహార్థం మాత్రమే కర్మలు చేయుచుండెడివారు.

ఆ విధముగా కర్మలు చేయుచుండియు "గుణములే గుణములయందు వ్యవహరించు చున్నవి" అనగా తమ దేహాదులు మాత్రమే కర్మలయందు నిమగ్నమై యున్నవిగాని తాము మాత్రము ఎటువంటి కర్మలు చేయుటలేదు అని తలంచుచుండెడివారు. అందువలననే జనకాదులు సిద్ధిని పొందగలిగిరి.

ఇట్లు విచారించగా తెలియున దేమనగా - జనకాదులు కర్మ సంన్యాస భావము స్థిరముగా కలిగియుండియు ఫలభావమును, కర్తృత్వ భావమును వదలి కర్మలు మాత్రము చేయుచునే యుండిరి. ఆ విధముగా కర్మలు చేస్తూ వుండి కూడ పరమస్థితిని అనగా మోక్షభావమును పొందగలిగిరి.

ఒకవేళ "జనకాదులకు తత్వజ్ఞానము కలిగియుండలేదు" అను అర్థమును గ్రహించిననూ కర్మఫలమును తాము స్వీకరించక ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయుచుండిరను భావమును గ్రహించిననూ అట్టి కర్మలద్వారా చిత్తశుద్ధి రూపమైన సిద్ధి లేక జ్ఞానోదయమునకు సాధన రూపమైన అంతఃకరణ శుద్ధిరూపమైన సిద్ధి కలిగినదని తెలియనగును. అందుకే భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు "యోగులు అంతఃకరణ శుద్ధికొఱకు కర్మలు చేయు చుందురు" అని చెప్పియున్నాడు.

అంతేగాకుండా **"సర్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధింవిందతి మానవః"** గీ. 18.46 అనగా తనకు విధించబడిన కర్మలను ఫలాపేక్ష రహితముగా ఆచరించిన మానవునికి సిద్ధి కలుగును. అలా చెప్పిన తరువాత మరల "అటువంటి సిద్ధిని పొందిన పురుషునకు **"సిద్ధిం ప్రాప్తోయథా బ్రహ్మ"** గీ. 18.50 అనగా అలా చిత్తశుద్ధి కలిగిన పురుషునకు జ్ఞానోత్పత్తి ద్వారా బ్రహ్మత్వము సిద్ధించును" అని జ్ఞాననిష్ఠ కలుగు మార్గమును గురించి భగవంతుడు చెప్పియున్నాడు.

అందుచేత గీతాశాస్త్రము నిర్ణయించి చెప్పు సందేశమేమనగా -

"కేవలము తత్వజ్ఞానము ద్వారా మాత్రమే ముక్తి లభించును.

కర్మలతో కూడియున్న జ్ఞానముద్వారా మాత్రము లభించదు.

ఈ భావము అనగా భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణులవారు చెప్పిన యీ సందేశము ముందు ముందు యీ గ్రంథమునందు అనేక సందర్భములందు మనకు స్పష్టముగా బోధపడును.

ఈ విధముగా ధర్మసంబంధమైన విషయమునందు ఏ మానవుని చిత్తము మోహమును జెందినందువలన అతడు శోకసాగరమనబడి మునకలు వేయుచుండునో అటువంటి అర్జునునకు ఆత్మజ్ఞానము కలుగకుండా శాశ్వతమైన చిత్త శాంతి కలుగదని నిర్ణయించి ఆతనికి ఆత్మజ్ఞానము కలిగించి తద్వారా ఆతనిని ఉద్ధరించవలయును అని తలంచి వాసుదేవుడు యిచ్చట ఆత్మజ్ఞానమును పొందు మార్గమును గురించి విశదముగా చెప్పుచున్నారు -

**2.11.** 'అశోచ్యానన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతా సూనగతా సూంశ్చ నానుశోచన్తి పండితాః ॥

అనగా – శోకించడానికి తగనివానిని 'అశోచ్యుడు' అని అంటారు. భీష్ముడు, ద్రోణుడు మొదలగువారు సద్ వ్యవహారము చేయువారు మరియు పరమార్ధ దృష్టితో నిత్యులై యున్నందున వారిని అశోచ్యులు అని చెప్పవచ్చును. ఏలయన ? వారు దేనిని గురించి చింతించరు. అటువంటివారిని గురించి నీవు (అర్జునుడు) చింతించుచున్నావు." నాచేత చంపబడుదురు" అని నీవు చింతించుచున్నావు. ఇంకా ఆ పైన వారు లేకుండా నేను రాజ్యసుఖములను ఎట్లు అనుభవించగలనని నీవు చింతించుచున్నావు. పైగా నీవు సర్వమూ తెలిసినవానివలె మాట్లాడుచున్నావు. అనగా నీవు వున్మత్తుని (పిచ్చివాని) వలెను, మూర్ఖునివలెను మరియు బుద్ధిమంతునివలెను పరస్పర విరుద్ధమగు మాటలు మాట్లాడుచున్నావు.

ఆత్మజ్ఞానము కలిగియున్న పండితులు చచ్చినవారిని గురించి గాని, బ్రతికియున్న వారిని గురించి గాని, శోకమును పొందరు.

**"పాండిత్యం నిర్విద్య"** బృ 3.5.1. అనగా శ్రుత్యానుసారముగా ఆత్మ విషయక జ్ఞానమునే పాండిత్యమందురు. అట్టి ఆత్మ విషయక జ్ఞానము గలవారే పండితులు.

కాని నీవు మాత్రము నిత్యులు అనగా ఏ కాలమునందు మరణమును పొందనివారు అందుచేత చింతింపతగనివారు అయిన భీష్మద్రోణాదుల వంటి మహనీయులకొఱకు చింతించుచున్నావు. అందుచేత నీవు మూఢుడవు అనగా సత్యమును ఎఱుంగనివాడవు అని అభిప్రాయము. భీష్మ, ద్రోణాదులు అశోచ్యులు అనగా చింతింపతగనివారు ఎందుచేత ? అందుచేత వారు నిత్యులు. నిత్యులు ఎలా ? అంటే –

పైన అందరూ అను బహువచన ప్రయోగము దేహభేదము ననుసరించి చెప్పబడినదే గాని ఆత్మదృష్టితో అనగా ఆత్మభేదమును దృష్టియందుంచుకొని చెప్పబడలేదు. ఏలయన ? ఆత్మ ఒక్కటే ఆత్మకు భేదము అనగా బహుళత్వము – అనేకత్వము లేదు. ఆత్మ దేనివలె నిత్యమై యున్నది ? అందుకు దృష్టాంతము –

**2.12** న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః,
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్.

అనగా – ఏ కాలమందును "నేనులేను" అని చెప్పరాదు. "నేను" అన్ని కాలముల యందును వుండును. అనగా ఆ "నేను" కు ఎన్ని దేహములు కలిగి నశించినను "నేను" ...టువంటి నాశములేక యెల్లప్పుడూ వుండును.

అలాగే "నీవు కూడా ఒకప్పుడు లేవు" అనుమాట సత్యముకాదు. "నీవు" కూడ "నేను" వలెనే సర్వకాలములయందును తప్పక వున్నావు. ఆ రాజులు గూడ లేరనరాదు. వారు గూడ సర్వకాలములయందును వుండియున్నారు. అవశ్యము వుండియున్నారు.

ఈ దేహాదులు నశించిన తరువాత గూడ మనమందరమూ "వుండము" అనుమాట సత్యము కాదు. తప్పక వుంటాము. తాత్పర్యమేమనగా ఆత్మరూపముతో అందరూ గూడ భూతభవిష్యత్వర్తమాన మూడు కాలముల యందును నిత్యులై వుంటారు.

## 2.13. దేహినో ఽస్మిన్యథా దేహే కౌమారం యౌవనం జరా, తథా దేహాంతర ప్రాప్తిర్ధీర స్తత్ర నముహ్యతి.

అనగా – ఎవనికి దేహము కలదో అతడుదేహి అనగా దేహము కలవాడు అనబడును. ఆ దేహియొక్క అనగా శరీరమును ధరించియున్న ఆత్మయొక్క యిప్పుడు ఆ యాత్మను కలిగియున్న శరీరమునకు పరస్పర విరుద్ధములైన యీ మూడు అవస్థలు కలుగుచుండును. ఈ అవస్థలయందు మొదటిదైన బాల్యము నశించినప్పుడు ఆత్మనశింపదు. అట్లే బాల్యము నశించి యౌవనావస్థ ఉద్భవించినప్పుడు క్రొత్త ఆత్మ ఉద్భవించుట లేదు. మరి అప్పుడు ఏమి జరుగుతుంది ? అంటే నిర్వికారమైన ఆత్మయందే అనగా ఆత్మకే రెండవ అనగా యౌవనము మరియు మూడవదగు వృద్ధాప్యము కలిగినట్లుగా మనము చూచుచుందుము.

అలాగే నిర్వివికారమైన ఆత్మ పదార్ధమునకే దేహాంతర ప్రాప్తి అనగా ఒక అవస్థ పోయి రెండవ అవస్థ ఎట్లు కలుగుచున్నదో అట్లే ఒక దేహము నశించి మరియొక దేహము కలుగుచున్నది.

అలా జరిగినందువలన ఆత్మయందు ఎటువంటి వికారము కలుగుట లేదు. దేహములే వికారమును, నాశమును పొందుచున్నవి. అందుచేత "ఆత్మ నిర్వికారమైనది" అని తెలుసుకొనినందువలన బుద్ధి అనగా నిజమైన తెలివిగలవానికి దేహాదులయందు ఎటువంటి మోహము కలుగదు" అనగా యీ దేహమే నేను" అను భావము వుండదు.

అలా అయినప్పటికి అనగా ఆత్మ నిత్యమైనదే అయి వున్నప్పటికి అలా ఆత్మ నిత్యమైనది మరియు నిర్వికారమైనది అని తెలిసియున్న జ్ఞానులకు ఆత్మ నశించునను మోహము దానివలన కలుగు భయము లేనప్పటికి శీతోష్ణములు, సుఖదుఃఖములు, ప్రాప్య అప్రాప్యములు అందువలన కలుగు లౌకిక మోహము మరియు సుఖము లభించినందువలన మరియు దుఃఖము వలన కలుగు శోకము ఆ యాత్మకే కలుగుచున్నట్లుగా లోకులు అనగా అర్జునుడు లాంటివాళ్ళు తలంచుచుండుట చూచి శ్రీకృష్ణుడు యిలా అన్నాడు –

## 2.14. మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః, ఆగమాపాయినో ఽనిత్యాస్తాం స్తితిక్షస్వ భారత.

అనగా – మాత్రా అనగా శబ్దాది విషయములను ఏ సాధనముల ద్వారా తెలుసుకొనుట జరుగుచుండునో అటువంటి చెవ్వులు మొదలగు యింద్రియములు మరియు ఆ యింద్రియముల స్పర్శ అనగా శబ్దాది విషయములతో వాటి సంయోగము, యివన్నియు కలసి శీతోష్ణములు మరియు సుఖదుఃఖములను కలిగించుచుండును.

శీతము అనగా చల్లదనము ఒకప్పుడు సుఖమును కలిగించునదిగాను మరొకప్పుడు దుఃఖమును కలిగించునదిగాను వుండును. అట్లే ఉష్ణము అనగా వేడి కూడాను. ఈ విధముగా యీ శీతోష్ణములు అనిశ్చిత రూపములు కలిగియుండును. కాని వాటివలన కలుగు సుఖ దుఃఖములు మాత్రము నిశ్చితరూపము కలిగియుండును. ఏలయన ? ఆ సుఖదుఃఖాదులయందు ఎటువంటి వికారము అనగా మార్పు వుండదు. అందువలన సుఖదుఃఖముల కంటె వేఱుగా శీతోష్ణములు గ్రహించబడుచున్నవి.

పై కారణముగా ఆ మాత్రా - స్పర్శాది అనగా యింద్రియములు మరియు వాటి విషయములు, వాటి సంయోగ వియోగములు ఉత్పత్తి వినాశములు కలవై యున్నవి. ఆ కారణముగ అవి అనిత్యములై యున్నవి. అందువలన ఆ శీతోష్ణాదులను మానవుడు సహించవలయును. అనగా వాటివలన సుఖదుఃఖములను పొందరాదు.

ప్రశ్న - అలా శీతోష్ణాదులను ఓర్చుకొనినందున కలుగు లాభమేమి ? అన్నచో -

**2.15. యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ,**
**సమ దుఃఖ-సుఖం ధీరం సో ఽమృతత్వాయ కల్పతే.**

అనగా - ఏ పురుషుడు సుఖ-దుఃఖములు రెంటియందు హర్ష విషాదములు లేక నిర్వికారముగనే యుండునో అటువంటి ధీరుడు మరియు జ్ఞాని యైనవాడు పైన చెప్పబడిన శీతోష్ణాదులను లెక్కచేయక అనగా వాటిచేత కలుగు సుఖదుఃఖములను లెక్కచేయక ఆత్మభావముతో నిర్వికారుడై యుండును. ఆ విధముగా ఆత్మభావముతో వుండు దేహమునకు కలుగు శీతోష్ణ జనితమైన సుఖదుఃఖాదులను పొందక యుండునో అట్టి పురుషులు మృత్యువును కూడ పొందనివారై మోక్ష భావమును పొందుటకు సమర్థులగుదురు.

అందుచేత అజ్ఞాన జనితమైన శోకమోహాదులను త్యజించి శీతోష్ణములను గూడ సహించి నిర్వికారముగా వుండుట మంచిది. అందువలన.......

**2.16. నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః,**
**ఉభయోరపి దృష్టో ఽన్త స్త్వనయోస్తత్త్వ దర్శిభిః.**

అనగా - నిజముగా విచారించి చూచిన యెడల అస్తిత్వమే లేనటువంటి శీతోష్ణాదులు మరియు వాటికి కారణమగు పదార్థములు లేనేలేవు. ఏలయన ? ప్రమాణముల ద్వారా (ఒకటి ప్రత్యక్ష ప్రమాణము, రెండు అనుమాన ప్రమాణము, మూడు శాస్త్రప్రమాణము, నాల్గవది అనుభవ ప్రమాణము) నిరూపించుటకు ప్రయత్నించినప్పుడు యీ శీతోష్ణాదులు మరియు వాటికి కారణమైన అగ్ని, జలము, వాయువు మొదలగునవి పదార్థములుగా నిరూపించబడుట లేదు.

ఏలయన ? యీ శీతోష్ణాదులు కేవలము వికారములు, యీ వికార రూపములైన పదార్ధములు ప్రతిక్షణము స్థిరముగా వుండక వికారమును పొందుచూ వుండును. అదెట్లన ? కన్నుల ద్వారా వీటిని నిరూపించుటకు ప్రయత్నించినప్పుడు ఘటాదులు మట్టికంటె వేఱుగాలేవని ఋజువగును. అందుచేత ఘటము అసత్పదార్ధము అనగా లేనిది అగుచున్నది. అందుకే ఒక తత్వవేత్త యిలా పాడుకొన్నాడు -

"ఘటము ఘటమని పలుకుచుందురు ఘటము యన్నది లేనేలేదు.
మట్టికంటే వేఱుగా మరి ఘటము యన్నది కానరాదు
ఓ పరమగురుడా ! భ్రాంతి తత్వము తెలుపరావయ్యా !
ఓ పరమగురుడా ! భ్రాంతి తత్వము తెలుపరావయ్యా !

చూ. అమృతబిందువులు స.భా.

ఆ విధముగా వికారములన్నియు కారణముకంటె వేఱుగా లేవని ఋజువగుచున్నది.

అట్లేలయన ? ఘటాది దృశ్యములగు వస్తువులన్నియూ వాటి ఉత్పత్తికి పూర్వము, నాశమునకు తరువాత దృశ్యములు కాకుండా పోవుచున్నవి. ఇందులకు పూర్వపక్షము -

ఘటమునకు మట్టి కారణము, మరి మట్టికి మరొకటి కారణము. ఆ మరొకదానికి మరొకటి కారణము. ఈ విధంగా చూస్తూ పోతే చివరకు అభావము అనగా ఏమీలేదు అని ఋజువగును.

సమాధానము - అలా అనడం సరికాదు. ఏలయన ? సర్వత్ర అనగా సర్వప్రాణుల యందు సత్‌బుద్ధి మరియు అసత్‌బుద్ధి అని రెండు బుద్ధులు వుంటాయి.

ఏ పదార్ధమును విషయముగా చేసుకొని బుద్ధి ఎటువంటి వికారమును పొందకయుండునో ఆ పదార్ధము సత్తు అనగా సత్ పదార్ధము. మరియు పదార్ధమును విషయముగా చేసుకొను ఏ బుద్ధి మారుతూ వుంటుందో అనగా వికారమును పొందుతూ వుంటుందో ఆ బుద్ధి అసత్‌బుద్ధి. ఈ విధముగా సత్ మరియు అసత్తులను విభజించు శక్తి బుద్ధియొక్క అధీనమునందున్నది.

అన్నిచోట్ల సమానాధికరణం అనగా ఒకే మూల పదార్ధమునందు అందరి యందును ఈ రెండు విధములైన బుద్ధులు దాగివుంటాయి.

నీలకమలమునందు కమలత్వము, నీలత్వము అను రెండు బుద్ధులు వుంటాయి. అలాగాక ఘటము వున్నది, వస్త్రమున్నది, ఏనుగు వున్నది అన్నట్లుగా అన్నిచోట్ల రెండు రెండు బుద్ధులు వుంటాయి.

ఆ రెండు బుద్ధులలో ఘటాదులను విషయముగా తలంచు బుద్ధి నిత్యమూ అనగా ప్రతిక్షణమూ వికారమును పొందుతూ వుంటుంది. ఈ విషయం యింతకు పూర్వమే విశదముగా చెప్పబడినది. కాని సత్‌బుద్ధి మాత్రము ఎటువంటి వికారమును పొందదు.

అందుచేత ఘటాదులను విషయముగా చేసుకొను బుద్ధి అసత్ బుద్ధి. ఏలయన ? దానియందు వ్యభిచారము అనగా వికారము కలుగుచుండును. కాని సత్‌బుద్ధికి తోచు విషయమునందు వికారము వుండదు. అందుచేత అది సత్‌బుద్ధి అనబడుతుంది.

పూర్వపక్షము - ఘటము నశించినప్పుడు ఘట విషయమును గ్రహించు బుద్ధి కూడ నశిస్తుంది. అప్పుడు సత్ బుద్ధి గూడ నశించుచున్నది గదా ?

సమాధానము - అలా చెప్పడం సరికాదు. ఏలయన ? వస్త్రము మొదలగు యితర విషయములందు సత్‌బుద్ధి వుంటుంది. ఆ సత్‌బుద్ధి కేవలము విశేషణమును మాత్రమే విషయంగా గ్రహిస్తుంది.

పూర్వపక్షము - సత్‌బుద్ధి వలెనే ఘటబుద్ధి గూడ మరో ఘటంలో చూస్తుంది గదా !

సమాధానము - అది సరికాదు. ఏలయన ? వస్త్రములు మొదలగు వాటియందు చూడజాలదు గదా !

పూర్వపక్షము - ఘటము నశించిన తరువాత అందులో సత్‌బుద్ధి గూడ దేనినీ చూడజాలదు గదా ?

సమాధానము - అట్లనుట సరికాదు. ఏలయన ? అచ్చట ఘటరూప విశేషత లేదు. సత్‌బుద్ధి సామాన్యమునుగాక విశేషమును మాత్రమే విషయంగా చూస్తుంది. అందుచేత ఎప్పుడైతే ఘటరూపమైన విశేష్యము లేనిదగుచున్నదో అప్పుడు విశేష్యము లేకుండ విశేషణము యొక్క ఉనికిని సత్‌బుద్ధి దేనిని విషయంగా చేయగలదు ? అయినప్పటికి గూడ విషయము లేనంత మాత్రమున సత్‌బుద్ధికి లేమి కలుగదు.

పూర్వపక్షము - ఘటాది విశేష్యములు లేనందువలన ఏకాధికరణత అనగా రెండు విధములైన బుద్ధులు ఒకే అధిష్ఠానము అనగా ఆధార వస్తువునందు కలిగియుండుట సాధ్యముకాదు గదా !

సమాధానము - అట్లు తలంచుట సరికాదు. ఏలయన? మృగతృష్ణాదుల యందు అధిష్ఠాన పదార్థము లేకుండగనే యితర వస్తువు అనగా జలము వుండుట లేదు. అయినప్పటికి "ఇది జలము" అను బుద్ధి అని తోచుటయందు సమానాధికరణత్వము, సమానాధికరణత్వ మనగా రెండు వస్తువులు వున్నట్లుగా తోచుట. అంతేగాని నిజముగా అచట సత్‌పదార్థము వున్నదా ? లేదా ? అనికాదు. చూడబడుచున్నది గదా ?

అందుచేత అసత్తులగు శరీరాదులయందును, శీతోష్ణాది ద్వంద్వముల యందును మరియు వాటికి కారణములైన వాటియందును ఎటువంటి భావము అనగా వునికి వుండదు.

అట్లే - ఆత్మ తత్వమైన ఏ సత్ పదార్థము కలదో దానియొక్క లేమి అనగా అభావము వుండదు. ఏలయన ? ఆ సత్ పదార్థము సర్వత్ర నిర్వికారముగ వుండియున్నది. ఈ మాట యింతకు పూర్వము గూడ చెప్పబడియున్నది.

ఈ విధముగా సత్తు అయిన ఆత్మతత్వము మరియు అసత్తు అయిన అనాత్మ తత్త్వము ఈ రెంటిని గురించి చెప్పిన ఈ నిర్ణయము తత్వమును తెలుసుకొన్నవారి ముఖతా చెప్పబడియున్నది. అందుచేత సత్తుసత్తే మరియు అసత్తు అసత్తే.

'తత్' అనునది సర్వనామము. అందులో 'సర్వ' అంటే బ్రహ్మ పదార్థము అందుచేత దానిపేరు అనగా సర్వమైయున్న బ్రహ్మతత్వమునకు **'తత్'** అని పేరు. దానియొక్క భావమును అనగా వునికిని, అనగా బ్రహ్మతత్వము యొక్క యధార్థ స్వరూపమునే 'తత్వము' అని అంటారు.

ఆ తత్వమును దర్శించుటయే స్వభావముగా కలిగియున్నవారలు "తత్వదర్శులు", అనబడుచుందురు. అటువంటి తత్వదర్శుల ద్వారానే పైన చెప్పబడిన నిర్ణయము చేయబడినది.

మీరు కూడా అనగా అర్జునుడు లాంటివాళ్ళు కూడా ఆ తత్వమును దర్శించిన మహాపురుషుల యొక్క బుద్ధిని ఆధారముగ జేసుకొని శోకమోహములను విడనాడి మరియు నియతము మరియు అనియతము అనగా సత్తు, అసత్తు రూపములైన శీతోష్ణాది ద్వంద్వములను- ఇవన్నియు కేవల వికారములే గాని, నిజమైనవి కాకపోయినను మృగతృష్ణాదులయందు తోచు జలమువలె మిధ్యా ప్రతీతములే అనగా నిజముగా లేకున్నను భ్రాంతివలన వున్నట్లుగా తోచునవి మాత్రమే అని తలంచి - సహించవలయును.

ఇప్పుడు మరో ప్రశ్న - అయితే నిస్సందేహముగా సత్ పదార్థమై, సర్వకాల సర్వావస్థలయందును నిర్వికారముగా వుండు పదార్థము ఏది ? అందులకు భగవంతుని ద్వారా సమాధానము -

## 2.17. అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్, వినాశ మవ్యయ స్యాస్య న కశ్చిత్కర్తుమర్హతి.

అనగా - **నశించే స్వభావము లేని వస్తువు 'అవినాశి' అనబడును.** 'తు' అను శబ్దము అసత్తులోని సత్తుయొక్క విశేషత్వమును తెలుపుచుండును.

నీవు దానిని అవినాశిగా తెలుసుకొనుము. గుర్తించుము. దేనిని ? ఏ 'సత్' అను శబ్దము వాచ్యార్థము ద్వారా ఆకాశము మొదలు సమస్తమైన విశ్వమును ఘటాదుల వలె వ్యాపించియున్నదో దానిని 'బ్రహ్మ' తత్వముగా గుర్తించుము. ఈ అవ్యయమైన అనగా **దేనియందు ఎటువంటి వికారము జరుగదో దానిని అవ్యయ మందురు. అటువంటి అవ్యయమైన బ్రహ్మ తత్వమును ఎవ్వరు దేనిద్వారానూ నశింపజేయజాలరు.**

ఏలయన ? ఆ 'సత్' అనబడు బ్రహ్మ పదార్థము ఎటువంటి వ్యయము అనగా వికారము లేనిదగుటచేత దేహాదులవలె తన స్వరూపమునందు ఎటువంటి వికారమును కలుగనివ్వదు. సత్యమై, నిత్యమై, నిర్వికారమై యుండును.

ఈ బ్రహ్మ పదార్థమునకు తనదంటూ మరియొక వేఱు పదార్థము లేనందున ఏ పదార్థమునందు ఎటువంటి వికారము సంభవించినను దీనియందు మాత్రము ఎటువంటి వికారము కలుగదు. ఉదాహరణమునకు దేవదత్తు తన ధనము పోయినప్పుడు ఎట్లు ధనహీనుడు అగునో అట్లు ఈ బ్రహ్మతత్వమునందు ఎన్నడూ ఎటువంటి వికారముగాని నష్టముగాని కలుగనేరదు.

అందువలననే ఈ **నాశరహితమైన బ్రహ్మమును నశింపజేయగల సామర్థ్యము ఎవ్వరికిని లేదు.** ఎవ్వరూ గూడ చివరకు **ఈశ్వరుడు గూడ ఈ బ్రహ్మతత్వమును నశింపజేయజాలడు.**

ఏలయన ? ఆత్మయే స్వయముగా బ్రహ్మము. అందుచే తనకు విరుద్ధమైన కార్యము తానే ఎన్నడూ చేయజాలడు.

మరో ప్రశ్న - దేనియొక్క స్థితి క్షణ క్షణము వికృతత్వమును పొందుచుండునో ఆ అసత్ పదార్థము ఎట్లుండును ? అందులకు సమాధానము -

**2.18. అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః,**
**అనాశినో ௨ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత.**

అనగా - ఏ పదార్థములకు ఆది అంతములుండునో అవి యన్నియు వినాశము గలవి అనగా అంతము గలవి. ఏ విధముగా మృగతృష్ణ మొదలగు వాటియందు తోచు జలము సత్‌బుద్ధి మొదలగు ప్రమాణముల ద్వారా నిరూపించుటకు ప్రయత్నించినప్పుడు ఆ జలము ఆ జలమునకు సంబంధించిన భ్రాంతిజన్య భావము తొలగిపోవుచున్నదో, అట్లు **తొలగిపోవుటయే వాటియొక్క అంతము.** ఆ విధముగానే మన ఈ శరీరాదులన్నియూ గూడ అంతము గలవియే. మరియు స్వప్నమునందును లేక మాయచేతను తోచు శరీరాదులవలె మన ఈ శరీరములన్నియు అంతము గలవియే. అందుచేత ఈ అవినాశీ అనగా నాశము లేనటువంటి అప్రమేయము మరియు శరీరమును ధరించునటువంటి ఆత్మయొక్క ఈ దేహాదులన్నియూ వివేకము గల పురుషుల ద్వారా అంతములు గలవి అని చెప్పబడినవి. ఇది వివేకము గల పండితుల అభిప్రాయము.

"నిత్యము మరియు అవినాశీ అనగా నాశము లేనటువంటి వస్తువు కలదు" అని చెప్పుట పునరుక్త దోషము లేని మాటయే.

శరీరము అగ్నియందు దహించబడినప్పుడు ఆ శరీరము అదృశ్యమై నశించినది అని చెప్పబడుచున్నది గదా ! మరియు రోగముల చేత పీడించబడి విపరీత పరిణామమును పొంది దృశ్యముగా వుండి కూడ నశించినది లేక క్షీణించినది అని చెప్పబడుచున్నది గదా !

అందువలన అవినాశి మరియు నిత్యమైన ఈ రెండు విశేషణముల యొక్క అభిప్రాయము ఏమనగా - **ఈ ఆత్మ పై రెండు విధములుగాను నాశముతో సంబంధము లేని పదార్థమే.**

అలా చెప్పని యెడల ఆత్మపదార్థము యొక్క నిత్యత్వము గూడ భూమి మొదలగు భూతముల వలె అనిత్యమగును. అలా కాకూడదు. అందుచేతనే దీనిని అనగా **ఆత్మను "అవినాశి' ' మరియు నిత్యమైనది అని చెప్పబడినది.**

ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా దేనియొక్క స్వరూపము నిర్ణయించబడజాలదో అది "అప్రమేయము" అనబడును.

పూర్వపక్షము - మరి శాస్త్రాది గ్రంథముల ద్వారా ఆత్మయొక్క స్వరూపము నిర్ణయించబడుచున్నది గదా అలాంటప్పుడు ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా దానిని యిదమిద్ధమని నిర్ణయించబడుట సిద్ధమే అయి వున్నది గదా ! అలాంటప్పుడు అది అనగా ఆత్మ "అప్రమేయము" అని చెప్పడం ఎలా కుదురుతుంది ?

సమాధానము - అలా చెప్పడం ఉచితం కాదు. ఏలయన ? ఆత్మస్వతః సిద్ధమై **యున్నది. ప్రమాతయైన ఆత్మ సిద్ధించిన తరువాతనే** సాధకుని యొక్క ప్రమాణ విషయికమైన **ప్రయత్నము ఆరంభమగుచున్నది.**

ఏలయన ? "నేను ఫలానా అయి వున్నాను" అని ఆ విధంగా ముందుగా తనని తాను గుర్తించకుండానే యితరమైన తెలుసుకొనదగియున్న పదార్ధములను తెలుసుకొనుటకు ప్రయత్నించుట కుదరదు – ఇంకా మరో విశేషమేమనగా తనకు తాను ఎవ్వడూ కూడా అప్రత్యక్షముగా అనగా అజ్ఞాతముగా అనగా తెలియకుండా వుండడు.

శాస్త్రము ప్రమాణముల యందు చివరిది. మొదటిది ప్రత్యక్ష ప్రమాణము, రెండు అనుమాన ప్రమాణము, మూడవది శాస్త్రప్రమాణము అనగా ఆగమ ప్రమాణము. అది అనగా యీ అంతిమ ప్రమాణము ఆత్మయందు ఆరోపించబడిన సర్వమైన అనాత్మ పదార్ధములను తొలగించిన తదనంతరమే ఆత్మవిషయమునందు ప్రమాణముగా సిద్ధమగును. **అంతేగాని అసలే తెలియబడని అనగా అజ్ఞాతముగా వున్న వస్తువును తెలియజేయుట వలన కాదు.**

శ్రుతిగూడ యిలాగే చెప్పింది. **"ఏదైతే సాక్షాత్తుగా అపరోక్షమై యున్నదో అదియే బ్రహ్మపదార్ధము "ఇంకా" ఏ ఆత్మతత్వము అందరి శరీరములయందు వ్యాపించియున్నదో అదియే బ్రహ్మము"**

ఈ విధంగా ఆత్మ నిత్యమైనదని, నిర్వికారమైనదని సిద్ధించినది. అందుచేత నీవు యుద్ధము చేయుము. యుద్ధమునుండి విరమించవలదు.

పై చెప్పిన మాటల ననుసరించి యుద్ధము చేయుట ఆతని విధి అనగా కర్తవ్యము అని చెప్పినట్లు కాదు. ఏలయన ? అర్జునుడు యుద్ధము చేయడానికి సర్వ సన్నద్ధుడై వచ్చియే యున్నాడు. కాని అకస్మాత్తుగా తన బంధువులను ఒక్కచోటుగా చూచినందువలన ఆతని మనస్సునందు శోకమోహములు అలముకొనుటచే యుద్ధము చేయనని కూర్చుండిపోయినాడు. ఆ శోకమోహములు ఆతనిని తన కర్తవ్యమును నెరవేర్చనివ్వకుండా ప్రతిబంధకములుగా ఏర్పడినవి. ఆ ప్రతిబంధకములైన శోకమోహములను తొలగించుట అను ప్రయత్నమే భగవానుడు యిచ్చుట చేయుచున్నాడు. అందుచేత "నీవు యుద్ధము చేయుము" అని చెప్పుట తన ఆమోదమును తెలుపుటయే గాని యుద్ధము చేయమని ఆజ్ఞాపించుట మాత్రము కాదు.

అసలు **ఈ గీతాశాస్త్రము యొక్క ఉద్దేశ్యము ప్రపంచము అనగా సంసారమునకు కారణరూపమైన శోకమోహాదులను నిర్వర్తింపజేయుటయే గాని సంసారమును కలిగించుట కాదు.** ఇటువంటి అర్ధమును యిచ్చునటువంటి వేదముల నుండి రెండు ఋక్కులను సాక్ష్య స్వరూపముగా చూపుచున్నారు.

"నేను గనుక యుద్ధముచేసినట్లయితే ఆ యుద్ధమునందు నా ద్వారా అనగా నేను యుద్ధము చేయుట కారణముగా భీష్మద్రోణాదులందరూ చంపబడతారు. ఆ విధంగా నేను వాళ్ళను చంపినవాడనవుతాను" అని తలంచుట ఓ అర్జునా ! కేవలము మిధ్యయే. అదెట్లన ?

**2.19.** **య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం,**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే.**

అనగా – పైన చెప్పబడిన వివరణ ననుసరించి "ఈ ఆత్మను నేను చంపుచున్నాను. నేనే యీ మరణ క్రియకు కర్తను" మరియు "దేహము నశించినందువలన ఆత్మస్వరూపుడైనైన నేను నశించుచున్నాను. ఆ విధముగా హనన క్రియారూపమైన ఈ యుద్ధమునందు చనిపోవుట

కారణముగ నేను కర్మను అగుచున్నాను. అనగా నేను చంపబడుచున్నాను" అని తలంచు పై యిరువురూ **అహం ప్రత్యయమునకు విషయభూతమైన ఆత్మను తమ అజ్ఞానము కారణముగా తెలియజాలక యున్నారు.**

నేను చంపుచున్నానని, లేక నేను చంపబడుచున్నానని తలంచువారందరూ ఆత్మ తత్వమును ఎఱుంగనటువంటి అజ్ఞానులే. ఏలయన ? ఈ ఆత్మ వికారరహితమైనది అగుటచేత అది ఎవరిని చంపదు, చంపజాలదు. మరియు చంపబడదు. ఆ విధముగా ఆత్మ హనన క్రియకు ɔ కర్తయు కాదు. కర్మయూ కాదు. కాజాలదు.

ప్రశ్న - "ఆత్మ నిర్వికారమని ఎట్లు తెలియును ?" అన్నచో ఇదిగో ఈ రెండవ మంత్రమును చూడండి -

**2.20.** **న జాయతే మ్రియతే వా కదా చిన్నాయం భూత్వా ౨భవితా వా న భూ యః,**
**అజో నిత్యః శాశ్వతో ౨యం పురాణో న హన్యతే హన్యమానే శరీరే.**

అనగా - ఈ ఆత్మ పుట్టునది కాదు. అనగా పుట్టినటువంటి వస్తువులయందు కలుగు వికారము ఈ ఆత్మయందు వుండదు. పుట్టునది కానందున దీనికి మరణము గూడ లేదు. "మరణించదు" అను శబ్దము ద్వారా వినాశమను అంతిమ వికారము ఈ ఆత్మయందు కలుగదు" అని దృఢముగా చెప్పబడినది. "కదాచిత్" అను శబ్దము అన్ని విధములైన వికారములను ఆత్మయందు నిషేధించుచున్నది. ఎలాగున యనగా - ఆత్మ ఎన్నడూ పుట్టదు మరణించదు అన్నట్లుగా.

ఈ ఆత్మ పుట్టుట యను వికారమును పొంది మరల మరణించుట అనగా వినాశమును పొందుట అనగా లేకుండా పోవుట అను వికారములను పొందదు. పొందునటువంటిది కాదు. అందుచే మరణించదు. ఏలయన ? ఏ పదార్థము పుట్టి మరల నాశమును పొందునో అనగా లేకుండా పోవునో దానిని 'నశించుట' మరణించుట' అని అందురు.

'వా' మరియు 'న' శబ్దముల ప్రయోగము వలన తెలియునదేమన - ఆత్మ శరీరము వలె మొదట లేక తరువాత కలుగునది కాదు. అందుచేత యిది జన్మించునది కాదు.

అలా జన్మ-మరణములు లేనిదగుటచే ఈ ఆత్మ "అజము" అనగా పుట్టుకలేనిది మరియు మరణించదు గావున "ఆత్మ నిత్యమైనది" అని చెప్పబడుచున్నది.

**ఆది అంతములనబడు రెండు వికారములు దానియందు లేవని నిషేధింపబడినందు వలన మధ్యలో తోచు సమస్త వికారములు గూడ నిషేధింపబడుచున్నవి.** అలా అయినప్పటికి గూడ మధ్యయందు కలుగు వికారములను గూడ ఆ యా వికారములను స్పష్టముగా నిషేధించు విశిష్ట శబ్దముల ద్వారా విశదీకరించుట మంచిది. అందుచేత పైన చెప్పబడినటువంటి బాల్యము, యౌవనము మొదలగు అన్ని వికారములు ఏ విధముగా నిషేధింపబడుచున్నవో తెలియవచ్చును. అలా నిషేధించుట కొఱకు 'శాశ్వతము' అను శబ్దము వుపయోగించబడుచున్నది.

**సర్వకాల సర్వావస్థలయందును ఎటువంటి వికారమును పొందని వస్తువును - భావమును - శాశ్వతము అని అందురు.** ఈ శాశ్వతము అను శబ్దము ద్వారా అపక్షయ అనగా క్షయమును పొందుట అనగా పూర్వరూపము నశించుట రూపమునకు కలుగు వికారము

నిషేధించబడుచున్నది. ఏలయన ? **ఆత్మ అవయవ రహితమైనది. అందుచేత దానికి రూపక్షయము అనగా దానిరూపమునందు ఎటువంటి వికారము కలుగనేరదు.** మరియు ఆత్మ నిర్గుణమైనదై యున్నందున దాని గుణములయందు గూడ ఎటువంటి క్షయము – నాశము – వికారము – సంభవము కాదు.

"పురాణము"అను ఈ శబ్దము ద్వారా అపక్షయమునకు విరుద్ధముగా వృద్ధి అనబడు ఏ వికారము వున్నదో అది గూడ నిషేధించబడుచున్నది. ఏ పదార్థము యితర వస్తువులతో కూడి తన రూపమును మార్చుకొని కొత్త రూపమును పొందునో అటువంటి మార్పును మనము ఆ వస్తువు వృద్ధిని పొందినది అని తలంచుతూ వుంటాము. కాని ఈ 'ఆత్మ' అని చెప్పబడు పదార్థము మాత్రము అవయవ రహితమైనది అయి ఉన్నందున ఎప్పుడూ నూతనమైనదే మరియు పురాణము అనగా ఎటువంటి వికారము లేక, ఆద్యంతములు గూడ లేక నిత్యమైనది, సత్యమైనది. పెరగదు, తరగదు, మారదు, నశించదు.

అంతేకాకుండా శరీరము నశించినా ఆ శరీరమునందు వ్యాపించియున్న ఆత్మ మాత్రము నశించదు. అంతేగాక శరీరమునందు కలుగు బలము, దుర్బలత్వము, ఆరోగ్యము, అనారోగ్యము ఆకలి దప్పులు, జన్మమరణములు మొదలగు వికారములతో ఎటువంటి సంబంధము లేక నిత్యమై, నిర్వికారమై వుంటుంది.

ఈ మంత్రమునందు లౌకిక వస్తువులందు నిత్యమూ కలుగుచున్నటువంటి ఆరు విధములైన భావవికారములు ఆత్మయందు లేవని చూపడమైనది. ఆ విధముగా ఆత్మ అన్ని విధములగు వికారములు లేనిది. ఇదే ఈ మంత్రమునకు నిజమైన అర్థము.

పందొమ్మిదవ శ్లోకములోని **"య ఏనం వేత్తి హంతారమ్"** అను వాక్యమునకు "ఆత్మ చంపుట అనుక్రియకు కర్తకాదు. కర్మ గూడ కాదు" అని అర్థము. అలా ప్రతిజ్ఞ చేసిన అనంతరమే **"నజాయతే"** అని అనగా ఆత్మకు జన్మమరణాదులు లేనందున నిర్వికారమైనది అని చెప్పబడినది. ఆ నిర్వికారిత్వమునకు తగిన హేతువు గూడ చెప్పి ఇప్పుడు ఆ విధముగా ప్రతిజ్ఞ చేసి చెప్పిన అర్థమునకు వుపసంహారమును చెప్పుచున్నారు –

**2.21. "వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్,**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్".**

అనగా – ఇంతకు పూర్వము చెప్పబడిన లక్షణములతో కూడియున్న ఆత్మను ఏ మహాత్ముడు అవినాశియని, అంతిమభావ వికార రూపమైన మరణము లేనిదియని, నిత్యమైనదని, రోగాదుల వలన కలుగు దుర్బలత్వము, క్షీణత్వము మొదలగు వికారములు లేనిదియని, అజము అనగా జన్మించినది కాదు అని మరియు అవ్యయము అనగా ఎటువంటి క్షయము అనగా క్షీణించు స్వభావరూపమైన వికారము లేనిది యని తెలుసుకొనునో అటువంటి ఆత్మ తత్వమును చక్కగా ఎఱింగినట్టి పురుషుడు ఎవరిని ఎట్లు చంపగలడు ? చంపించగలడు ? అనగా అతడు హనన క్రియకు అనగా చంపుట అను కర్మకు ఎట్లు కర్తకాగలడు ?

సారాంశమేమనగా ఆతడు ఎవరిని ఏ విధముగానూ చంపజాలడు. ఎవ్వరిని ఏ విధముగానూ చంపించజాలడు. ఈ రెండు విషయములందును 'కిమ్' మరియు "కథమ్" శబ్దములు ఆక్షేపమును తెలుపు శబ్దములు. ఏలయన ? ప్రశ్నార్థకముగా ఈ శబ్దముల ప్రయోగము యిచ్చట జరుగలేదు. అనగా ఆత్మ ఎవరినీ గూడ చంపేది, చంపించబడేది కాజాలదు. ఈ మాట చెప్పుట కొఱకే యిచ్చట కిమ్ మరియు "కథమ్" శబ్దములు వాడబడినవి. ప్రశ్న రూపములో వాడబడలేదు.

సర్వవిధ కర్మలను నిషేధించుట కొఱకే. అందుచేత ఈ ప్రకరణము - సందర్భము నందు **ఆత్మవేత్త అయినవాడు** ఏ విధమైన **కర్మను చేయడు, చేయించడు** అని చెప్పుటయే భగవంతుని యొక్క అభిప్రాయము.

ఒంటరిగా హననక్రియ విషయమున ఆక్షేపణ ఉదాహరణతో సహా వేఱుగా ఉన్నది. అనగా జ్ఞాని కేవలము హననక్రియకు కర్తగాని, కర్మగాని కాజాలడు. అంతేగాక ఆత్మ నిర్వికారుడు, నిత్యుడు అయినందువలన ఆతడు ఏ క్రియకు కర్తగాని కర్మగాని కాజాలడు. ఇచ్చట కేవలము హనన క్రియను ఒక్కదానిని ఉదాహరణకు చూపడమైనది.

పూర్వపక్షము - కర్మలు జరుగకపోవుటయందు ఏ ముఖ్య హేతువును జూపి జ్ఞానికి భగవంతుడు **'కథం స పురుషః'** అని చెప్పిన వాక్యాంశము ద్వారా కర్మలను ఆక్షేపించుచున్నాడు? అనగా కర్మలను చేయుట అజ్ఞానుల లక్షణముగా భావించుచున్నాడు ?

సమాధానము-**ఆత్మయొక్క నిర్వికారిత్వమే జ్ఞానియొక్క అకర్తృత్వమునకు అనగా సర్వ విధ కర్మలను సన్యసించుటకు ముఖ్య హేతువని యింతకు పూర్వమే చెప్పియున్నాము గదా !**

పూర్వపక్షము - చెప్పియుండిన మాట నిజమే. కాని కర్మరహితమైన ఆత్మకంటె దానిని ఎఱుంగునటువంటి జ్ఞాని భిన్నముగా వుండియున్నాడు గదా ! అందుచేత పైన చెప్పబడినటువంటి ముఖ్య కారణము సహేతుకముగా లేదు. ఏలయన ? కొయ్యబొమ్మను కర్మలు చేయనివానిగా తలంచువానికి కర్మలు జరుగవు. అలా శంకించుట యందు దోషమేమియున్నది ?

సమాధానము - అలా చెప్పుట సరికాదు. ఏలయన ? **ఆత్మ తనంతట తానుగా అనగా యితర సాధనములతో నిమిత్తము లేకుండగనే తెలుసుకొనగల సామర్థ్యము కలిగియున్నది.** దేహాది సంఘాతమునందు (ఆ దేహాదులు జడములగుట వలన) వాటికి తెలుసుకొను సామర్థ్యము వుండదు. అందుచేత తుదకు దేహాది సంఘాతముకంటె వేఱుగా వున్న ఆత్మయే అ విక్రియము అనగా ఎటువంటి కర్తృత్వము లేనటువంటిదిగా తెలియబడుచున్నది. మరియు సర్వమును తెలుసుకొనునది ఆత్మయే. అటువంటి ఆత్మజ్ఞానము గల జ్ఞానిద్వారా కర్మలు జరుగుట అనునది అసంభవము. అందుచేత **"కథం స పురుషః"** అని చెప్పుట ఆక్షేపరహితమైన మాటయే. అనగా ఔచిత్యము కలదియే.

నిజముగా ఆత్మ ఎటువంటి వికారములు లేనిదే అయినప్పటికి బుద్ధి వృత్తికి ఆత్మకు గల భేదజ్ఞానము లేని కారణముగ అనగా అవిద్య చేత అనగా అజ్ఞానము కారణముగ బుద్ధి,

మనస్సు, చెవ్వులు, కన్నులు మొదలగు యింద్రియముల ద్వారా గ్రహింపబడుచున్న శబ్దాది విషయములను ఆత్మయే గ్రహించుచున్నదని తలంచబడుచున్నది.

అదే విధముగా ఆత్మ, అనాత్మక విషయకమైన వివేక జ్ఞానరూపమైన బుద్ధివృత్తి, దీనినే విద్య అని కూడ అంటారు. అసత్ రూపము గలదే అయి వున్నప్పటికి దానియొక్క సంబంధము చేత నిజముగా ఎటువంటి వికారము లేనటువంటి ఆ "ఆత్మ విద్వాంసుదు" అని అనబడుతూ వున్నది.

**జ్ఞానియైనవానికి ఇటువంటి కర్మలు కుదరవని చెప్పబడినది.** అందుచేత శాస్త్రముద్వారా ఏ యే కర్మలు విధించబడుచున్నవో అవి యన్నియు అజ్ఞానుల కొఱకేయని భగవంతుని నిశ్చయముగా చెప్పుచున్నట్లు తోచుచున్నది.

పూర్వపక్షము – విద్యకూడ అజ్ఞానికే విధించబడినది. ఏలయన ? విద్యను పొందియున్న వానికి మరల విసిరిన పిండినే విసిరినట్లుగా విద్య ఎందుకు విధించబడుతుంది? ఆ పని వ్యర్థమే గదా ? అందువలన అజ్ఞానికే కర్మలు విధించబడినవి. జ్ఞానికి కాదు. అని యీ విధముగా విభజింపబడుట కుదరదు.

సమాధానము – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? ఇది కర్తవ్యము యిది కర్తవ్యము కాదు అనే భావము వలన భిన్నత్వము ఏర్పడుచున్నది. అంటే అసలు అభిప్రాయమేమనగా అగ్నిహోత్రాది కర్మలను విధించుచున్న విధి వాక్యముల అర్థమును తెలుసుకొన్న తరువాత అనేకమైన సాధనములను మరియు ఉపసంహారముతో అనగా విరమించుటతో సహా ఫలానా అగ్నిహోత్రాది కర్మలు అనుష్ఠించ తగియున్నవి. ఎలా– నేను కర్తను" నాకు ఫలానా కర్తవ్యము కలదు. అని యీ విధంగా తలంచు అజ్ఞానులకు మాత్రమే. **ఆత్మస్వరూపము యొక్క విధానమును తెలుపు వాక్యముల యొక్క అర్థమును ఎఱింగిన జ్ఞానులకు ఎటువంటి కర్తవ్యములు వుండవు.**

ఏలయన ? ఏ పురుషునకు "నేను కర్తనుకాను, నేను భోక్తను గూడ కాను" అను నటువంటి ఆత్మయొక్క ఏకత్వము మరియు దానియొక్క అకర్తృత్వము మొదలగు విషయ జ్ఞానముండునో అటువంటివానికి ఈ విషయము తప్ప యితరమైన ఎటువంటి జ్ఞానము వుండదు. ఈ విధముగా జ్ఞానికి సంబంధించిన కర్తవ్యములు, అజ్ఞానికి సంబంధించిన కర్తవ్యముల భేదబుద్ధి యొక్క వివరణ వివేకము తెలుస్తుంది. అజ్ఞానికి అజ్ఞానం కారణంగా కర్తవ్యాలు వుంటవి. కాని జ్ఞానికి ఎటువంటి కర్తవ్యములు వుండవు. **అందువలన జ్ఞానికి కర్మలు చేయు అధికారముగాని, అవసరముగాని లేదు. కాని అజ్ఞానికి కర్మలు చేయకతప్పదు.** ఈ భేదం చాలా వివేకముతో తెలుసుకొనతగియున్నది.

'నేను కర్తను' నాకు ఫలానా కర్తవ్యమున్నది' అని తలంచు బుద్ధి ప్రతివానియందును వుండును. అలాంటి బుద్ధి కారణముగానే ఆతదు కర్మాధికారి అనగా కర్మలు చేయు బాధ్యత కలవాడు – అగుచున్నాడు. మరియు **"ఉ భౌ తౌన విజానీతః"** గీ. 2-19 ఈ వాక్యానుసారముగ ఆతదు అజ్ఞానియే అగుచున్నాడు.

ఏలయన ? ఇంతకు పూర్వము చెప్పబడిన విశేషణముల కారణముగ జ్ఞానికి **"కథం స పురుషః"** అను వాక్యము ననుసరించి సర్వవిధ కార్యములు నిషేధించబడినవి. అందువలన తేలిన సారాంశమేమనగా – ఆత్మను నిర్వికారుడుగ ఎఱుంగు విశిష్టులైన విద్వాంసులకు మరియు ముముక్షువులకు అనగా మోక్షస్థితిని అభిలషించువారికి కూడ సర్వకర్మ సంన్యాసమునందే అధికారము కలదు.

అందువలన భగవంతుడైన నారాయణుడు **"జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం"** గీ. 3.3 ఈ వాక్యము వలన **సాంఖ్యయోగులైన జ్ఞానుల యొక్కయు మరియు కర్మయోగులైన అజ్ఞానుల యొక్కయు** స్పష్టమైన విభజనజేసి రెండు వేఱు వేఱు నిష్ఠలను – పద్ధతులను గ్రహించునట్లుగా చెప్పియున్నాడు.

ఆ విధంగానే తన పుత్రుడైన శుకునికి వేదవ్యాసులవారు 'ఈ రెండు మార్గములున్నవి' **అ**నియు యింకనూ "మొదట కర్మమార్గము తదుపరి సంన్యాసము' అని ఉపదేశించియున్నారు.

"ఈ విభజననే భగవంతుడైన శ్రీకృష్ణుడు గీతయందు అనేకమార్లుగా చెప్పియున్నారు. అదెట్లన ? – అహంకారముచేత మోహితుడైన అజ్ఞాని **"నేను కర్తను" అని తలంచుచుండును. తత్వవేత్త 'నేను ఏమియు చేయుటలేదు' అని తలంచుచుండును. అంతేగాక జ్ఞాని మనస్సు నుండి సర్వవిధ కర్మలను త్యజించి యుండును.**

జన్మాది ఆరు భావ వికారములు లేనటువంటి నిర్వికారమైన 'అకర్తను మరియు ఆత్మను నేనే' అను జ్ఞానము ఈ లోకములో ఎవ్వనికి కలుగనే కలుగదు. అందుచేత అటువంటివారికి సర్వకర్మ సంన్యాసోపదేశము కుదరదని అనేకమంది తనను పండితులని తలంచువారు గూడ తలంచుచుందురు.

అట్లు తలంచుట సరికాదు. ఏలయన ? అలా తలంచినందువలన **'న జాయతే'** **గీ.** 2.20 మొదలగు శాస్త్రోపదేశములు వ్యర్థములగును.

అలా చెప్పేవారిని మనం ఏమని అడగాలంటే శాస్త్రములయందు చెప్పబడిన ఉపదేశ సామర్థ్యంతో కర్మలు చేయు మనుష్యునకు ధర్మము వున్నదను జ్ఞానము మరియు ఈ దేహమును త్యజించిన తరువాత కలుగు స్థితియొక్క జ్ఞానము కలుగుచున్నది గదా ? అదే విధముగా అదే పురుషునికి ఆ శాస్త్రము ద్వారా ఆత్మయొక్క నిర్వికారిత్వము, అకర్తృత్వము మరియు ఆత్మయొక్క ఏకత్వము మొదలగు జ్ఞానము ఎందుకు కలుగుట లేదు ? అని అడుగవలయును.

అప్పుడు వారు మనస్సు, బుద్ధి మొదలగు కరణములు అనగా సాధనములకు ఆత్మ గోచరమయ్యే వస్తువు కాదు అని చెప్పుదురు.

అలా అనడం సరికాదు. ఏలయన? **"మనస్సు ద్వారా ఆ యాత్మను చూడవలయును" అని** శ్రుతివాక్యము. అందువలన శాస్త్రము మరియు గురుదేవుల వుపదేశము ద్వారాను మరియు శమ, దమాది సాధనముల ద్వారాను శుద్ధిచేయబడిన మనస్సు ఆత్మ దర్శనమునకు కరణము అనగా సాధనముగా వుపయోగపడును.

ఈ విధముగా ఆ జ్ఞానప్రాప్తికి సంబంధించిన విషయమునందు అనుమాన ప్రమాణము మరియు ఆగమ ప్రమాణములు సిద్ధములైయుండగా ఆత్మజ్ఞానము కలుగటకు సాధనములే లేవని చెప్పుట యుక్తము అనగా సరికాదు.

ఆ విధముగా కలిగిన జ్ఞానము తనకు విరుద్ధముగా యున్న అజ్ఞానమును తప్పక నశింపజేయునని మనం తప్పక వొప్పుకొని తీరాలి.

"నేను మరణించువాడను. నేను చంపబడియున్నాను" ఆ విధంగా చంపువాడు గాని చంపబడువాడుగాని యిరువురూ ఎఱుంగరు" అను అజ్ఞానము యింతకు పూర్వమే చెప్పబడినది. మరల యిచ్చట గూడ **ఆత్మయందు హననక్రియ యొక్క కర్తృత్వముగాని, కర్మత్వముగాని యివన్నీ అజ్ఞాన జనితములేయని చెప్పబడినది.**

ఆత్మ నిర్వికారుడైనందున 'కర్తృత్వము' మొదలగు సర్వభావములు అవిద్యా మూలకములైనందున ఆ భావము అన్ని క్రియలయందును సమానముగానే యుండును. ఏలయన? వికారమును పొందినవాడే తనను కర్తగా తలంచి తనకు కర్మ రూపముగా యితరులను నియమించి "నీవు ఆ కర్మచేయుము" అని అంటూ వుంటాడు. అంతేగాని అసలు **'నీవు' అనువాడు ప్రపంచమందు ఎచ్చటా లేదని ఎఱుంగడు.** అందుకే ఒక తత్వవేత్త యిలా పాడుకొన్నాడు -

"నీవు నీవని పలుకుచుందురు". 'నీవు' యన్నది లేనేలేదు.
'నేను' కంటే వేఱుగా మరి. 'నీవు' యన్నది కానరాదు.
ఓ పరమగురుడా ! 'నేను' తత్వము తెలుపరావయ్యా !
ఓ పరమ గురుడా ! "నేను" తత్వము తెలుపరావయ్యా !

చూ. అమృతబిందువులు. **సదానందభారతి**

అందువలన **జ్ఞానికి కర్మలుచేయు అవసరముగాని అధికారముగాని లేదు.** ఈ విషయం - ఈ సత్యం - చెప్పడానికే శ్రీకృష్ణులవారు **"వేదావినాశినమ్" కథం స పురుషః"** మొదలగు వాక్యముల ద్వారా అన్ని క్రియలయందును సమాన భావముతో విద్యాంసుడైనవానికి కర్తృత్వము ప్రయోజక కర్తృత్వము రెండూ నిషేధించబడినవి. అని చెప్పియున్నాడు.

మరి జ్ఞానికి దేనియందు అధికారమున్నది ? ఈ విషయము **"జ్ఞాన యోగేన సాంఖ్యానామ్"** మొదలగు వాక్యముల ద్వారా యింతకు పూర్వమే చెప్పబడినది. అయినప్పటికి కూడ మరల **"సర్వకర్మాణి మనసా"** మొదలగు వాక్యముల ద్వారా సర్వకర్మల సంన్యాసమును భగవంతుడే చెప్పెదరు.

**పూర్వపక్షము -** మీరు చెప్పిన శ్లోకమునందు "మనసా" అను శబ్దము కలదు. అందుచేత మానసిక కర్మలను మాత్రమే సంన్యసించవలయునని చెప్పబడినది. అంతేగాక శరీర సంబంధమైన కర్మలను సంన్యసించమని చెప్పబడియుండలేదు.

**సమాధానము -** అలా తలంచుట సరికాదు. ఏలయన?

"సర్వకర్మలను సంన్యసించి అనగా వదలి" అను వాక్యమునందు "సర్వ" అను విశేషణ శబ్దమున్నది.

**పూర్వపక్షము** – "మనస్సంబంధమైన సర్వకర్మలు త్యజించి" అను అర్ధము గ్రహించితే.........

**సమాధానము** – అట్లనుట సరికాదు. ఏలయన ? వాక్కు మరియు శారీరిక క్రియ మనో వ్యాపారము వలననే జరుగును. **మనో వ్యాపారము లేకుండా ఏ కర్మ అనగా క్రియ జరుగదు.**

**పూర్వపక్షము** – శాస్త్రసమ్మతమైన శారీరిక, వాక్ సంబంధమైన కర్మలకు కారణరూపమైన మానసిక కర్మలు తప్ప మిగిలిన సర్వకర్మలను మనసు నుండి సంన్యసించవలయును అని అనుకొంటే ?.........

**సమాధానము** – అట్లనుకొనుట సరికాదు. ఏలయన ?" తాను చేయకుండా, యితరులచే చేయించకుండా" అను విశేషణ వాక్యము జోడించబడి వున్నదిగదా ? అందుచే మూడు విధములైన కర్మలు అనగా **మనసావాచా కర్మణా అనగా సర్వవిధ కర్మలు సంన్యసించవలయునని చెప్పబడియున్నది.**

**పూర్వపక్షము** – భగవంతుని ద్వారా చెప్పబడిన ఈ సర్వకర్మ సంన్యాసము ముముక్షువుల కొఱకు మాత్రమేగాని బ్రతికియున్నవారికి కాదు అని అంటే ?–

**సమాధానము** – అది సరికాదు. ఏలయన ? ఆ విధమగు అర్ధము గ్రహించిన ఎడల "**తొమ్మిది ద్వారములు కలిగియున్న దేహమను పురమునందు ఆత్మ వున్నది**" అని చెప్పిన విశేషణమునకు వుపయోగము ఉండదు.

కారణమేమనగా – ఏ పురుషుడు సర్వకర్మ సంన్యాసము చేసి భౌతిక శరీరమును త్యజించినాడో అనగా మరణించినాడో ఆతడు ఎటువంటి కర్మలు చేయకుండా, చేయించకుండా ఆ శరీరమునందు వుండుట కుదరదు.

**పూర్వపక్షము** – పై వాక్యము ననుసరించి కర్మలన్నియూ శరీరమునకు సంబంధించిన వనీన్నీ, ఆత్మశరీరమునందు వ్యాపించి వుంటున్నది గనుక ఆ యాత్మకు కర్మలతో సంబంధము లేదనీ చెప్పవచ్చును గదా ?

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? సర్వత్రా ఆత్మయొక్క నిర్వికారిత్వము చెప్పబడియున్నది. ఆసనము అనగా కూర్చొనుట అనుక్రియకు ఆధారముగా వుండు (కుర్చీవంటిది) మరియొక వస్తువు కావలసియుండును. కాని సంన్యాసము లేక సంన్యసించుట అను క్రియకు యితర వస్తువుతో ఎటువంటి సంబంధము లేక అవసరము వుండదు. ఏలయన ? 'సం' అనగా సమేతముగా 'న్యాస్' అనగా త్యజించుట అయి వున్నది. అంతేగాని వుంచుట కాదుగదా ?

ఈ విధముగా గీతాశాస్త్రమునందు **ఆత్మజ్ఞానికి సంన్యాసమునందే అధికారము చెప్పబడినది. అంతేగాని కర్మలు చేయుటయందు కాదు.** ఈ విషయము యింకా వివరముగా ఆత్మజ్ఞాన ప్రకరణమునందు చెప్పబడినది.

ఇప్పుడు ప్రకృత విషయమును గురించి విచారింతము. ఈ ప్రకరణమందు **'ఆత్మకు నాశములేదు'** అని ప్రతిజ్ఞ చేయబడినది. అది ఎటువంటిదో యిచ్చట చెప్పబడుచున్నది.

**2.22. వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరో ఽపరాణి,**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ.**

అనగా – ఏ విధముగా ప్రపంచమునందు మనుష్యులు చిరిగిన వస్త్రములను విసర్జించి తిరిగి క్రొత్త వస్త్రములను ధరించుచుందురో, ఆ విధముగానే జీవాత్మ జీర్ణమైయున్న శరీరమును వదలి యితరమైన అనగా మరియొక క్రొత్త శరీరమును పొందును. తాత్పర్యమేమన – పాతవస్త్రములను వదలి క్రొత్త వస్త్రములను ధరించు పురుషునివలె **జీవాత్మ నిర్వికారముగనే అనగా జన్మమరణములు లేకుండగనే యుండును.** ఏ కారణముగ ఆత్మ నిర్వికారమైయున్నది? అనగా –

**2.23. నైనం ఛిందన్తి శస్త్రాణి నైనం దహతి పావకః,**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః.**

అనగా – పైన చెప్పబడిన **ఆత్మను శస్త్రములు నఱుకజాలవు.** తాత్పర్యమేమన ? **ఆత్మ అవయవ రహిత పదార్థమై** యున్నందున కత్తి మొదలగు ఆయుధములు దానిని ముక్కలు ముక్కలుగా చేయజాలవు.

అదే విధముగా అగ్ని కూడ ఈ **ఆత్మను దహింపజాలదు. జలము దీనిని తడుపజాలదు.** ఏలయన ? అవయవములు కలిగియున్న వస్తువునే జలము నానబెట్టి ఆ అవయవములను వేఱువేఱుగా చేయగల సామర్థ్యము కలిగియున్నది. అవయవములు లేని ఆత్మయందు అట్లు చేయుట కుదరదు.

అదే విధముగా **వాయువు గూడ తడిగా వున్న వస్తువుల యందలి తడిని శుష్కింపజేసి దాని రూపమును నశింపజేయగలదు.** అందువలన ఆ **వాయువు గూడ స్వస్వరూపమైన ఆత్మను శుష్కింపజాలదు.**

అలా అగుటుకు కారణమేమనగా –

**2.24. అచ్ఛేద్యో ఽయమదాహ్యో ఽయ మక్లేద్యో ఽశోష్య ఏవ చ,**
**నిత్యః సర్వగతః స్థాణు రచలో ఽయం సనాతనః.**

అనగా – **ఈ ఆత్మ నరకబడునది కాదు. తగలబడునది కాదు. నీళ్ళలోబడి కరగిపోవునది కాదు. అట్లే గాలికి గాని ఎండకు గాని ఎండునది కాదు.** పరస్పరము ఒకదానిని మరియొకటి నశింపజేసుకొనునటు వంటి పంచభూతములు అనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము

మరియు భూమి ఈ ఆత్మను నశింపజేయు సామర్థ్యము గలవికావు. అందుచేత ఈ ఆత్మ నిత్యమైనదై యున్నది.

నిత్యమగుటచేత సర్వగతము అనగా సర్వమునందు వ్యాపించియుండునదై యున్నది.

ఇందుగల డందులేడను
సందేహమువలదు బ్రహ్మ (ఆత్మ) సర్వోపగతం
బెందెందు వెదకి చూచిన
అందందే గలదు ఆత్మ సత్యము సుమతీ

సర్వవ్యాపియై యున్నందున స్థాణువువలె స్థిరమైనది. అనగా చలనము లేనిది. స్థిరమైనదగుట వలన అచలమైనది. మరియు ఆ కారణముగానే **సనాతనము అనగా ఆది అంతములు లేనిదైయున్నది.**

ఈ శ్లోకములయందు పునరుక్తి అనగా ఒకేమాట అనేక పర్యాయములు చెప్పుట అనుదోషము లేదు. ఏలయన ? న **జాయతే, మ్రియతే** వా గీ. 2.20 ఈ ఒక్క శ్లోకము ద్వారానే ఆత్మయొక్క నిత్యత్వము మరియు నిర్వికారత్వము చెప్పబడినవి. ఇంక ఆత్మను గురించి ఏమి చెప్పబడినా ఈ శ్లోకార్థము కంటె వేఱుగ వుండజాలదు. కాని ఆత్మతత్వము దుర్బోధకమైనది. అనగా సులభముగా తెలియబడునది కాదు. అందుచేత అవకాశమును కల్పించుకొని వేఱు వేఱు శబ్దముల ద్వారా వాసుదేవుడు ఆ తత్వమును గురించియే చెప్పియున్నారు. అట్లేలయన ఏదో ఒక విధంగా ఆ అవ్యక్తమైయున్న అనగా యింద్రియ గోచరముకాకయున్న ఆత్మ తత్వము యీ ప్రాపంచిక మాయయందు చిక్కుకొని దుఃఖమును పొందుచున్న మానవులకు తెలియబడి వారి దుఃఖము తొలగవలయును.

**2.25. అవ్యక్తో ఽయమచిన్త్యో ఽయమ వికార్యో ఽయముచ్యతే,**
**తస్మా దేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి.**

అనగా–ఈ ఆత్మ బుద్ధ్యాది యింద్రియములకు గోచరించని కారణముగ ఎవ్వరికి దాని విషయము తెలియుట లేదు. ఎవరిచేతను ఎఱుగబడనందున అది అవ్యక్తము అనబడుచున్నది.

ఆ విధముగా **అవ్యక్తము అయి వుండుటచేత అచింత్యము అనగా విచారణకు విషయము కానిదై యున్నది.** ఇంద్రియ గోచరమగు పదార్థములన్నియు విచారణకు విషయములగుచున్నవి.

మరియు **అవయవ రహితము అయినది అయినందువలన గూడ ఆత్మవిచారణకు సాధ్యము కానిదైయున్నది.** ఆ యాత్మ వికార రహితమైనది. ఏలయన ? **నిరాకారమైన పదార్థమునందు వికారము చూడబడదు.** ఆ విధముగా ఆత్మవికార రహితమైనదైయున్నందున 'అవికారి' అనబడుచున్నది.

అందువలన ఈ యాత్మను పై విధముగా తెలుసుకొని దాని మరణమును గురించి చింతించుట అజ్ఞానముతో కూడియున్న పని. అందుచేత నేను చంపువాడను నాచేత వీరందరూ చంపబడుచున్నారు యని తలంచుట శుద్ధ అవివేకము.

**2.26. అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్,**
**తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ॥**

అనగా 'అథ' 'చ' ఈ రెండు అవ్యయములు కేవలము తాత్కాలిక స్వీకృతిని సూచించు శబ్దములు.

ఒకవేళ నీవు ఈ ఆత్మకు గూడ జన్మ-మరణములు కలవని, అనగా లోకులు తలంచుచున్నట్లుగా శరీరాలతో పాటుగా ఈ ఆత్మలు గూడ పుట్టుచున్నవి - మరల మరణించుచున్నవని తలంచినా ఆ విధముగా నిత్యము జన్మించి - మరల మరణించు ఆత్మ కొఱకు గూడ ఈ విధముగా చింతించుట నీకు తగదు. ఏలయన ? **పుట్టువాని మరణము, మరణించువాని జన్మము యివి రెండూ తప్పక తమంతట తాముగా జరుగుచుండును** గదా ? **అట్టి** సహజములైన జన్మ - మరణములను గురించి శోకించుట తగని పని. అనగా వ్యర్థము.

అందువలన -

**2.27. జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ,**
**తస్మా దపరిహార్యే ఽర్థే న త్వం శోచితు మర్హసి.**

అనగా - **'జాతస్య మరణం ధృవం"** అనగా ఎవడు జన్మించునో ఆతనికి మరణము తప్పదు. అట్లే ఎవడు మరణించునో వాడు తప్పక పుట్టును. అందుచేత ఈ **జన్మ-మరణరూపమైన భావము తొలగించరానిది.** అనగా ఏ విధంగానూ ఈ జన్మ - మరణభావమును తొలగించ జాలము. కావున **యిటువంటి తొలగించ సాధ్యముగాని విషయమును గురించి శోకించుట తెలివిగల కార్యముకాదు.**

కార్య-కరణ సంఘాతరూపమే యీ ప్రాణులు అని తలంచిననూ అది కూడ సరికాదు - ఎట్లనగా -

**2.28. అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత,**
**అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా.**

అనగా - అవ్యక్త మనగా కానరానటువంటి అనగా ఏ విధముగానూ ఎవని వునికి తెలియరాదో అనగా ఈ ప్రాణులన్నియూ ఎప్పుడు పుట్టినవో, ఎట్లు పుట్టినవో ఎవ్వరికిని తెలియవచ్చుట లేదు. అటువంటి భూతరూపములైన పుత్రమిత్ర కళత్రాది యీ ప్రాణులన్నియూ వ్యక్తము కాక పూర్వము అవ్యక్తముగా వుండియున్నవి.

ఈ ప్రాణులు ముందు వ్యక్తమగుచున్నవి అనగా పుట్టుచున్నవి లేక ఏర్పడుచున్నవి. అటు తరువాత మరణించుచున్నవి. ఈ **జన్మ-మరణముల మధ్యకాలము నందు అవ్యక్తములుగా వుంటున్నవి. వ్యక్తమైనప్పుడు దృశ్యములగుచున్నవి. మరణించిన తరువాత అదృశ్యములగు చున్నవి.** కావున అదృశ్యమైనదే దృశ్యమగుచున్నది. దృశ్యమైనదే అదృశ్యమగుచున్నది. కావున

ఈ భూత సంఘాతమంతయూ మొదట అదృశ్యముగా నుండి తరువాత దృశ్యములై తిరిగి అదృశ్యములగుచున్నవి. కావున అవ్యక్తములు వ్యక్తములై తిరిగి తమంత తాముగానే అవ్యక్తములగుచున్నవి. ఆ విధముగా వ్యక్తావ్యక్తములగుచున్న ప్రాణులను గూర్చి శోకించుట వివేకముతో కూడిన పనికాదు.

అందుచేత ఎటువంటి కారణము లేకుండగనే వ్యక్తావ్యక్తములగుచున్న భ్రాంతి రూపములైన భూతములను గురించి చింత దేనికి ? ఈ ఏడ్పులు మొత్తుకోళ్ళు ఎందులకు ?

ఆత్మతత్వమును గురించి చర్చించబడుచున్న ఈ ప్రకరణము దుర్విజ్ఞేయము అనగా తెలియరానిది అనగా స్పష్టముగా చెప్పబడనిది, తెలియబడనిది. లోకములోని మానవుల నందరిని భ్రాంతియందు వుంచుతున్న ఈ విషయమునందు నిన్ను ఒక్కనిని నిందించినందువలన కలుగు లాభమేమి ?

అయితే ఈ ఆత్మ దుర్విజ్ఞేయము అనగా ఎవ్వనికి తెలియరానిది ఎట్లగుచున్నదో తెలుసుకొనుటకు ప్రయత్నించెదము -

**2.29. ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః,**
**ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్.**

అనగా - ఇంతకు పూర్వము మనము చూడనటువంటి వస్తువు అకస్మాత్తుగా మనకు దృశ్యరూపంలో కనబడితే కలిగే భావం ఆశ్చర్యము. తద్వత్తుగా అనగా యింతకు పూర్వము అకస్మాత్తుగా దృశ్యమైన వస్తువు వంటిది మరొకటి తోచినట్లైన దానికి ఆశ్చర్యవత్ అనగా ఆశ్చర్యము కలిగించుదానివలె అని అర్థము. ఎక్కడో ఒక మహానుభావుడు ఆత్మపదార్థమును ఆశ్చర్యమును కలిగించు వస్తువుగా చూస్తాడు.

మరొకడు దానినే ఆశ్చర్యవత్తుగా చూస్తాడు. మరొకడు దానినే ఆశ్చర్యవత్తుగా వింటాడు. మరియొకరు ఆత్మ పదార్థమును చూచియు దానిని గురించి విని కూడా ఏమి చూడని, విననివాని వలె వుంటాడు.

మరో విధంగా చెప్పాలంటే ఎవడైతే ఆత్మ పదార్థమును చూస్తాడో అతడు ఆశ్చర్యముతో సమానుడు. ఎవడైతే ఆత్మను గురించి చెప్పునో మరియు వినునో ఆతడు కూడ ఆశ్చర్యము వంటివాడే ఇంతకు అసలు విషయం ఏమిటంటే లక్షలో ఏ ఒక్కడో అలాంటివాడు వుంటాడు.

అందుచేతనే ఆత్మ చాలా దుర్బోధకమైన తత్వము.

**2.30. దేహీ నిత్యమవధ్యో ఽయం దేహే సర్వస్య భారత,**
**తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి.**

అనగా - ఈ జీవాత్మ సర్వవ్యాపి అయివున్నందున స్థావరజంగమాది సమస్త శరీరముల యందును వ్యాపించియున్నది. అయినప్పటికి అవయ రహితము నిత్యము అయి వున్నందువలన సర్వకాల సర్వావస్థలయందును సర్వమునందును వ్యాపించి యున్నది.

అందుచేత సర్వప్రాణుల యొక్క శరీరములన్నింటిని నశింపజేసినప్పటికి ఈ జీవాత్మ నశించదు. అందుచేత సర్వప్రాణుల శరీరములయందు వ్యాపించియున్న ఏకాత్మను దృష్టియందుంచుకొని విచారించి చూచిన భీష్మాదులందరు నశించునని నీవు చింతించనవసరము లేదు.

పైన చెప్పినదానికి సారాంశమేమనగా పరమార్థతత్త్వమును దృష్టియందుంచుకొని చూచిన ఏ ప్రాణి మరణమును గురించియు చింతించనక్కర లేదు. పరమార్థ దృష్టితో చూచిన దేనికొఱకు శోకించుట, చింతించుట కుదరదు.

కాని –

**2.31. స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి,**
**ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రే ఽ యో ఽన్యత్ క్షత్రియస్య న విద్యతే.**

అనగా – క్షత్రియ కులస్థులకు విధించబడియున్న యుద్ధము చేయుట యను ఏ స్వధర్మము కలదో దాని దృష్టితో చూచినను యుద్ధమునందు మరణించువారిని గురించి చింతించుట క్షత్రియ వంశజుడవైన నీకు తగదు. అనగా క్షత్రియులకు స్వధర్మము అనగా కులధర్మమైన యుద్ధకర్మను గురించి చింతించుట తగదు.

ఏలయన ? యుద్ధము పృథ్వీ విజయము ద్వారా ధర్మపాలన మరియు ప్రజారక్షణ కొఱకు చేయబడుచున్నది. అందువలన **యుద్ధము ధర్మముతో కూడియున్న** పరమ **ధర్మము. అందుచేత** ఆ పరమ ధర్మమైన **యుద్ధము తప్ప క్షత్రియునకు వేఱు ధర్మము లేదు.** ఆ యుద్ధమే క్షత్రియుడైనవానికి పరమ కల్యాణ ప్రదము.

ఆ యుద్ధము క్షత్రియులకు ఏ విధముగా కర్తవ్యమైయున్నదో చెప్పెద వినుము –

**2.32. యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్,**
**సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీ దృశమ్.**

అనగా – ఓ పార్థా ! కోరుకొనకుండగనే లభించినటువంటి అనగా అడగకుండగనే లభించినటువంటి తెఱువబడిన స్వర్గద్వారము వంటి యుద్ధమును పొందునటువంటి క్షత్రియులు ఎంత అదృష్టవంతులో నీకు తెలియదా ?

ఈ విధముగా కర్తవ్య రూపముగా ప్రాప్తించిదైనప్పటికీ.....

**2.33. అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి,**
**తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి.**

అనగా – ఒకవేళ నీవు (అర్జునుడు) ఈ ధర్మయుక్తమైన అనగా ధర్మముతో పెనవేసుకొని యున్న యుద్ధము చేయకుండిన – ఆ యుద్ధము చేయకయుండిన కారణముగ నీ స్వధర్మమును,

శివునితో నీవు యుద్ధము చేయగా లభించిన కీర్తిని పోగొట్టుకొనినవాడవై పాపమును పొందిన వాడవు అగుదువు.

కేవలము స్వధర్మము మరియు కీర్తి నశించుటయే గాక......

**2.34. అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తే ऽవ్యయామ్,**
**సంభావితస్య చాకీర్తిర్మరణా దతిరిచ్యతే.**

అనగా – నీకు చాలాకాలము వరకు వుండవలసియున్న కీర్తిని లోకులు నిందించెదరు. అనగా నీకు వుండతగిన కీర్తికి బదులుగా అపకీర్తి లభించును. ధర్మాత్ముడని, శూరుడని, వీరుడని మొదలగు **ఉత్తమ గుణముల కారణముగ ప్రతిష్ఠను పొందిన పురుషునికి అపకీర్తి మరణము కంటె కూడ ఎక్కువగా చెడ్డది.** ఒక్కమాటలో చెప్పవలయునన్నచో లబ్ధ ప్రతిష్ఠుడైన పురుషునకు అపకీర్తిని పొందుటకంటె మరణము మేలు. అనగా ఉత్తమమైనది.

మరి యింకేమనగా –

**2.35. భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః,**
**యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్.**

అనగా – ఇంతకు పూర్వము ఏ దుర్యోధనాదుల దృష్టిలో నీవు అనేకములైన గుణములతో కూడిన వీరుడవో ఆ దుర్యోధనాదుల దృష్టిలో చాలా అల్పుడవు అయిపోదువు. అంతేగాకుండా ఆ దుర్యోధనాదులు నిన్ను కర్ణాదులగు మహారధికుల చూచి భయపడి యుద్ధము నుండి విరమించుకొన్నవానినిగా తలంచెదరు. అంతేగాని నీవే వాళ్ళమీద దయదలచి యుద్ధము చేయుట లేదని తలంచరు.

ఇంకా ఏమనగా –

**2.36. అవాచ్య వాదాంశ్చ బహూన్వదిష్యంతి తవాహితాః,**
**నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్.**

అనగా – శత్రుసమూహము, అయిన నివాతకవచాది వీరులతో యుద్ధము చేయుటయందు నీవు ప్రదర్శించిన సామర్థ్యమును నిందించుచూ యింకా ఎన్నో చెప్పరాని వాక్యముల ద్వారా నిన్ను కించపరచెదరు.

అటువంటి నిందలవలన కలుగు దుఃఖము కంటె గొప్ప దుఃఖము యింకేముంటుంది?

నీవు ధైర్యముగా నిలబడి కర్ణాది వీరులతో యుద్ధము చేసితి వేని దానివలన కలుగు లాభమెట్టిదన –

**2.37. హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్,**
**తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః.**

అనగా - నీవు యుద్ధము జేసితివా వారి ద్వారా చంపబడి స్వర్గమును పొందెదవు. లేక కర్ణాది శూరవీరులను జయించి రాజభోగములను అనుభవించెదవు. ఈ విధంగా చూస్తే నీవు యుద్ధములో మరణించినా లేక యుద్ధమునందు విజయమును పొందినా రెండు విధములా నీకు లాభమే కలుగును.

ఎటు చూచినా నీకు లాభమే గనుక అర్జునా యుద్ధము చేయు నిశ్చయముతో లేచి నిలబడుము. శత్రువులను జయించి రాజ్యలాభమును పొందుటయో లేక శత్రువులచే చంపబడి వీరస్వర్గమును పొందుటయో నిశ్చయించుకొని యుద్ధము చేయుము.

యుద్ధము చేయుట "స్వధర్మముగా" భావించుచూ యుద్ధము చేయువానికి కలుగు లాభమేమనగా ? - వినుము -

**2.38. సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ,**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి.**

అనగా - ఇది సుఖదాయకము, ఇది దుఃఖదాయకము అను భావము మనస్సునందు లేకుండ, సుఖముపట్ల ఆసక్తిగాని దుఃఖము యందు విరక్తి భావముగాని లేకుండా, రెంటియందును సమభావము కలిగియుండి, లాభనష్ట భావము కూడ లేకుండ, జయపరాజయ భావము అనగా జయమునందు ఆసక్తి మరియు అపజయము నందు దుఃఖభావము లేకుండ యుద్ధము చేయుటకు నీవు సన్నద్ధుడవుకమ్ము. అలా యుద్ధము చేసినట్లయితే ఆ యుద్ధమునందు నీవు ఎంతమందిని చంపినా నీకు పాపము అంటదు. అట్టి సమభావము వలన నీకు సుఖదుఃఖాదులు సంభవించవు.

**"స్వధర్మమపి చావేక్ష్య"** (గీత 2.31) మొదలగు శ్లోకములందు శోకమోహములను దూరము చేయుటకు అవసరమైన లౌకిక న్యాయము చెప్పబడినది. అంతేగాని పారమార్థిక దృష్టితో అది సత్యముకాదు. న్యాయము కాదు.

ఇచ్చట ఈ ప్రకరణమునందు పరమార్థమును దర్శింపజేయుటయే ముఖ్య లక్ష్యము. అందుచేతనే యీ అధ్యాయమునందు ముప్పదియవ శ్లోకము వరకు పారమార్థిక విషయమే చెప్పబడినది.

ఇంక యిప్పుడు శాస్త్ర విషయమును చక్కగా విడదీసి చెప్పుటకు **"ఏషా తే ఽభిహితా'** మొదలగు శ్లోకముల ద్వారా పారమార్థిక విషయమే చెప్పబడును. ఆ విధముగా యీ అధ్యాయము సమాప్తమగును.

అట్లేలయన్నచో - ఇచ్చట శాస్త్ర విషయమును చక్కగా విభజించి చెప్పినందున, ముందు ముందు "జ్ఞానయోగేన సాంఖ్యానాం, కర్మయోగేన యోగినాం" (గీత 3.3) మొదలగు రెండు

వేఱు వేఱు విషయములను విడదీసి చెప్పు శాస్త్రము సులభముగా అర్థమగునట్లుగా చెప్పుటకు వీలగును. శ్రోతలు గూడ అనాయాసముగా విషయమును స్పష్టముగా గ్రహించగలరు.

అందుకని –

**2.39. ఏషా తే ౽భిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణ,**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి.**

అనగా – పార్థా ! నేను నీకు సాంఖ్యము అనగా పరమార్థమైన విషయమును (వస్తువును) గుర్తించుటకు సహాయపడు జ్ఞానమార్గమును చెప్పియున్నాను. ఆ జ్ఞానము సంసారమునకు **కారణమైన ఏ శోకమోహాది దోషములు కలవో వాటి నివృత్తికి అది కారణము.**

ఆ జ్ఞానమును పొందుటకు సాధనమైన యోగ విషయమును గురించి అనగా ఆసక్తి రహితమైన సుఖదుఃఖాది ద్వంద్వములను త్యజించి ఈశ్వరారాధన కొఱకు చేయబడు కర్మయోగమును మరియు సమాధి యోగమును గురించి తెలుసుకొను బుద్ధిని గురించి చెప్పుచున్నాను – సావధానుడవై వినుము –

ఆ విషయమునందు అభిరుచి కలగించుటకై ఆ బుద్ధియొక్క విశేషత్వమును స్తుతించుచున్నాడు –

ఓ అర్జునా ! ఏ యోగబుద్ధితో కూడియున్న నీవు ధర్మాధర్మములనబడు కర్మరూపమైన బంధమును ఈశ్వరుని కృపవలన కలుగు జ్ఞానప్రాప్తి ద్వారా నశింపజేయగలవో......

ఇంతేకాకుండా యింకా చెప్పెదను – వినుము –

**2.40. "నేహాభిక్రమనాశో ౽స్తి ప్రత్యవాయో న విద్యతే,**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్.**

అనగా – అభిక్రమము అంటే ఆరంభము. ఈ కర్మయోగ రూపమైన మోక్షమార్గము నందు ప్రారంభించుటలో చేయబడు కర్మలు మొదలగు వాటియొక్క నివృత్తి కలుగదు. సారాంశమేమన – యోగవిషయమైన కర్మఫలము సంశయ రహితమైనది కాదు. అంతేగాక విపరీత ఫలమును కలిగించునది గూడ కాదు. మరి ఏమి జరుగునన్నచో – ఆ కర్మయోగ రూపమైన ధర్మానుష్ఠానము అనగా ఆచరణ కొంచమైనను జన్మ–మరణ రూపమైన ప్రాపంచిక భయము నుండి రక్షించును.

ఈ విధముగా సాంఖ్య విషయరూపమైన బుద్ధిని గురించి చెప్పబడినది. ఇంకముందు యోగవిషయ సంబంధమైన బుద్ధిని గురించి చెప్పబడును.

అదెట్లనగా –

**2.41. వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన,**
**బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయో ౽వ్యవసాయినామ్.**

అనగా – ఓ కురునందనా ! ఈ పరమకల్యాణ ప్రదమైన మార్గమునందు **వ్యవసాయాత్మిక నిశ్చయ స్వభావము కలిగియున్న బుద్ధి ఒక్కటియే.**

అనగా యధార్ధము మరియు ప్రమాణ సిద్ధమైనది అయినందున యితరములైన విపరీత బుద్ధి యోగముతో కూడియున్న భేదములన్నింటిని బాధించును. అనగా వాటిని నశింపజేయును.

ఇతర బుద్ధులేవైతే వున్నవో వాటియొక్క శాఖాభేదముల వ్యాపకత్వము వలన ప్రపంచము అనంతమైనదనియు, అపారమైనదనియు అనగా ఎంత ప్రయత్నించినను అధిగమించరాని దనియు చెప్పబడుచున్నదో అట్టి భేదభావములను కలిగించు బుద్ధులను, ప్రమాణజనితమైన బుద్ధిజలముతో నివృత్తినిపొందించి సమస్త మాయా సంసారమును నివర్తింపజేయును.

కాని ఎవడు ప్రయత్నశీలుడు కాడో, ఎవడు ప్రమాణజనితమైన వివేకబుద్ధి కలిగి యుండడో వానికి ఆ శాఖాభేదముతో కూడియున్న బుద్ధులు అనేకములై యుండి ఆతనిని బాధించుచుండును.

ఎవనికి నిశ్చయాత్మకమైన బుద్ధిలేదో – ఆతడు

**2.42. యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్య విపశ్చితః,**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః.**

అనగా– కుసుమ వైభవంతో నిండియున్న లతాకుంజము వంటి అతి మృదు మధురమైన, వినసొంపుగా యున్న శబ్దములతో కూడియున్న విషయమును చెప్పబోవుచున్నాను –

ఆ చెప్పున దెవ్వరు ? ఏ మహాత్ముడు జ్ఞానహీనుడు, అల్పబుద్ధి గల వివేకహీనుడు, అర్థవాదము మరియు మహాఫలములను యిచ్చు సాధనములను ప్రకాశింపజేయునట్టి వేదవాక్య రసముతో నిండియున్నవాడో ఆతడు – మరేమనగా పార్థా ! ఎవడైతే స్వర్గాధి ఫలములను పొందింపజేయు సాధనరూపమైన కర్మలు తప్ప యితరమైనది ఏమియు లేదని చెప్పునో.....

ఇంకా యేమనగా –

**2.43. కామాత్మానః స్వర్గపరా జన్మ-కర్మఫలప్రదామ్,**
**క్రియావిశేష బహులాం భోగైశ్వర్యగతిం ప్రతి.**

అనగా – కామాత్మా అనగా ఎవడైతే కామభోగములను మాత్రమే తన స్వభావముగా చేసుకొనియున్నాడో అట్టి భోగపరాయణుడు మరియు స్వర్గప్రాప్తినే తన జీవిత లక్ష్యముగా ఎంచుకొని యున్నాడో అనగా స్వర్గప్రాప్తినే పరమ పురుషార్థముగా నిశ్చయించుకొనియున్నాడో అటువంటి మానవుడు జన్మ-మరణ రూపమైన కర్మఫలమును గురించిన మాటలు మాత్రమే మాట్లాడుచుండునో ఆతడు. కర్మయొక్క ఫలము పేరు "కర్మఫలము" "జన్మరూప కర్మఫల" మనగా జన్మ కర్మఫలము అనబడును. అటువంటి ఫలమును యిచ్చునటువంటి మాటలను **"జన్మకర్మ ఫలప్రదా"** అని అంటారు. ఇటువంటి మాటలు మాత్రమే మాట్లాడుతూ వుంటారు.

ఈ విధముగా భోగము మరియు ప్రాపంచిక ఐశ్వర్యమును పొందుటకు ఎటువంటి ఎన్ని క్రియాభేదములు అనగా ఎన్ని విధములైన కర్మలు వున్నవో వాటిని వర్ణించి చెప్పుట అతి కష్టము. ఏలయన ? స్వర్గమని, పశువులని, భార్యలని, బిడ్డలని, ఇళ్ళని, భూములని - భాగవతములో చెప్పినట్లుగా" చెలులుం తల్లులు తండ్రులాత్మజులు సంసేవ్యుల్ సతుల్ చారునిర్మల గేహం బులటంచు గూర్తురు మహామాయాగుణభ్రాంతులై........ ఇటువంటి వాటిని సంపాదించుటకు చేయబడు కర్మభేదములను గురించి మాట్లాడువారు, పరమ మూర్ఖులు. సంసార చక్రమునందు చిక్కుకొని క్రిందికి పైకి వచ్చుచూ పోవుచూ వుందురు...

**"భువిజచ్చున్ దివిజొచ్చు, అచ్చటను చావుంగాంచిచొచ్చున్ భువిన్**
**భువిచావుం దివి చావు నాగనిటు చావుల్రెండు భూతాళికిన్**
**భువి చావున్ సుఖ సుప్తివోలె బడయంబో నేనుగా కక్కటా**
**దివి చావుం ననుజావనీకుము కపర్దిస్వామి మృత్యుంజయా !**

అని ఏడ్చాడు పూర్వం ఒక భక్తుడు...... చూ. కంకణము (కావ్యం)

## 2.44. భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృతచేతసామ్,
## వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే.

అనగా - ఎవరైతే ఐశ్వర్యము మరియు భోగాదులయందు ఆసక్తి కలవారై యుందురో అనగా ఐశ్వర్య భోగాదులనే పురుషార్థముగా తలంచి వాటియందే ఆసక్తి కలవారై యుందురో, తద్రూపులై యుందురో, మరియు క్రియాభేదములను విస్తార పూర్వకముగా చెప్పు స్వభావము ఎవరి చిత్తమును హరించివేసినదో అనగా ఎవరియొక్క వివేకబుద్ధి మాయచేత ఆచ్ఛాదితమై పోయినదో వారియొక్క సమాధియందు సాంఖ్య విషయికమైన లేక యోగ విషయికమైన నిశ్చయాత్మికమైన బుద్ధి నిలువజాలదు.

**పురుషునియొక్క భోగము కొఱకు దేనియందు సర్వము స్థాపించబడునో దాని పేరు సమాధి.** ఈ వ్యుత్పత్తి అర్థము ననుసరించి **సమాధికి మరియొక పేరు అంతకరణము. ఆ సమాధియందు బుద్ది నిలువజాలదు.** అనగా **బుద్ధి సమాధి అవస్థయందున్న అంతఃకరణము నందు పుట్టదు.**

ఇటువంటి వివేకముతో కూడిన బుద్ధి లేనటువంటి కామపరాయణులైన పురుషుల........

## 2.45. త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున,
## నిర్ద్వంద్వో నిత్య సత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్.

అనగా - వేదములు త్రిగుణాత్మికములైన విషయములను గురించి చెప్పును. అనగా ఆ మూడు (సత, రజ, తమ) గుణముల యొక్క కార్యరూపమైన సంసారమునే తెలుపుచుండును. కాని అర్జునా ! నీవు సంసారములేనివాడవు. కామభావము గూడ లేనివాడవు.

నీవు ద్వంద్వత్వము లేనివాడవు. అనగా సుఖ-దుఃఖములకు కారణమైన పరస్పర విరుద్ధ లక్షణములు కలిగియున్న పదార్థములను ద్వంద్వములందురు. అటువంటి ద్వంద్వములు లేనివాడవు. మరియు నిత్య సత్వగుణ సంపన్నుడవు.

మరియు యోగక్షేమములకు అతీతుడవు. అప్రాప్యమైన వస్తువును ప్రాప్తింపజేసుకొనుట **యోగమనబడును. మరియు ప్రాప్తించిన వస్తువును రక్షించుకొనుట క్షేమమందురు.** యోగక్షేమములను పొందుటకు అవసరమైన మార్గమునందు కలుగు ప్రవృత్తిని కలిగియుండుట చాలా కష్టము. అందుచేత నీవు **యోగక్షేమములను పొందుకోరకుము.**

మరియు నీవు ఆత్మవంతుడవు అనగా ఆత్మవిషయమునందు ఎటువంటి ప్రమాదము లేనివాడవు. నీవు నీ స్వధర్మ నిర్వహణమునందు నిమగ్నుడవై వుండుటకు గాను నీకు నేను యీ విధముగా ఉపదేశించుచున్నాను.

అన్ని వేదముల యందును చెప్పబడియున్న కర్మలకు అనంతములైన ఫలములు కలుగును. అటువంటి ఫలములను కోరనట్టి పురుషుడు ఈశ్వరుని కొఱకు ఆ యా కర్మలను ఎందులకు ఆచరించవలయును ?

అన్నచో - చెప్పెదను, వినుము -

**2.46. యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే,**
**తావాన్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః.**

అనగా - జగత్తునందలి నూతులు, చెఱువులు మొదలగు అనేకమైన చిన్ని చిన్ని జలాశయములందు ఏ విధముగా స్నాన - పానాది కార్యములు ఎటువంటి ప్రయోజనమును సిద్ధింపజేయుచుండునో ఆ ప్రయోజనము లన్నియూ అన్ని విధములా గొప్పగా అనగా తగినంతగా యున్న జలాశయములందు గూడ ఆ పరిమాణములోనే అనాయాసముగా సిద్ధించుచుండును. ఆ ప్రయోజనములన్ని ఆ జలాశయములందు అంతర్భాగములే.

అదే విధముగా సర్వవేదములయందును అనగా వేదములయందు చెప్పబడిన కర్మల ద్వారా ఏ ప్రయోజనము సిద్ధించునో అనగా ఆ కర్మలను ఆచరించినందువలన ఎట్టి ఫలములు కలుగునో ఆ సమస్త ఫలములు అనగా **ప్రయోజనములు పరమార్థ తత్వమును ఎఱింగిన బ్రాహ్మణునకు అనగా సంన్యాసికి అన్నివైపుల నుండి పరిపూర్ణముగా నున్న జలాశయముల వంటి విజ్ఞానముతో కూడిన ఆనంద రూపమైన ఫలము అంతే పరిమాణములో అనాయాసముగనే సిద్ధించును.**

అనగా ఆ పరమార్థమునందు ఆ ఫలములన్నియూ అంతర్భాగములే.

శ్రుతియందు గూడ యిట్లే చెప్పబడియున్నది -

"దేనిని ఆతడు అనగా ఆ సంన్యాసి ఆ పరబ్రహ్మ తత్వమును ఎంత పరిమాణములో ఎఱుంగునో ఆతడు ఆ ఫలములన్నింటిని అంతపరిమాణములో పొందును. **గీతయందు గూడ** సర్వవిధ కర్మలు జ్ఞానమునందు సమాప్తమగును. అని చెప్పబడినది.

సారాంశమేమన - నూతులు, చెఱువులు మొదలగు చిన్న చిన్న జలాశయముల వలెనే **కర్మలు అల్పములైన ఫలములను మాత్రమే కలుగజేయును.** అట్లు అయినప్పటికి జ్ఞాన నిష్ఠాధికారము లభించక పూర్వము కర్మాధికారము మాత్రమే కలిగియున్న పురుషుడు కర్మలను చేయుచూనే యుండవలయును.

**2.47. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,**
**మా కర్మ ఫలహేతుర్భూర్మా తే సంగో ఽస్త్వకర్మణి.**

అనగా - **నీకు కర్మలు చేయు అధికారము కలదు. జ్ఞానసంపాదనాధికారము లేదు.** నీవు కర్మమార్గము ననుసరించి కర్మలు చేయుచుండిననూ ఆ కర్మ ఫలమును పొందు అధికారము నీకు లేదు. అనగా ఫలమును ఆశించి నీవు కర్మలు చేయకూడదు.

ఒకవేళ కర్మఫలమును పొందవలయునన్న కోరిక నీకు కలిగినచో ఆ కర్మఫలప్రాప్తికి నీవే కారణమగుదువు. అందుచేత నీవు కర్మఫలప్రాప్తికి కారణము కాబోకుము.

ఏలయన ? మానవుడు కర్మఫలమును పొందవలయునన్న కోరికతో ప్రేరేపించబడి కర్మలు చేయుటయందు నిమగ్నుడైనచో ఆతడు అప్పుడు కర్మఫలరూపమైన పునర్జన్మకు కారణ మగును.

కర్మఫలమును పొందవలయునన్న కోరికయే లేకున్నచో దుఃఖరూపమైన కర్మఫలముతో పనియేమి ? ఈ విధముగా కర్మలు చేయకుండిననూ కర్మలు చేయుటయందు ఆసక్తిగాని, ప్రీతి అనగా చేయవలయునను కోరిక కూడ వుండరాదు.

కర్మఫలమును పొందవలయునన్న కోరికతో ప్రేరేపించబడి కర్మలు చేయకుండా వుండవలయునన్నచో మరి యింకే విధముగా చేయవలయును ? అన్నచో - వినుము -

**2.48. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,**
**సిద్ధ్య సిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే.**

అనగా - ఓ ధనంజయా ! యోగమునందు స్థిరపడి కేవలము ఈశ్వరుని కొఱకు కర్మలు చేయుము. అందులో గూడ **ఈశ్వరుడు నాయందు ప్రసన్నుడగు గాక" అను ఆశతో కూడిన ఆసక్తిని గూడా త్యజించి కర్మలు చేయుము.**

ఫలతృష్ణారహితుడైన పురుషుని ద్వారా కర్మలు చేయబడినచో అంతఃకరణ శుద్ధికలిగి తద్వారా కలిగిన జ్ఞానము సిద్ధించును. ఇంకా దానికి వ్యతిరేకముగా అనగా జ్ఞానము కలుగ కుండిన సిద్ధి కలుగనేరదు. అటువంటి సిద్ధి కలిగినను, కలుగకుండినను సమముగా వుండి కర్మలు చేయుచుండవలయును.

ఆ యోగము ఎట్టిది ? ఎట్టి యోగమునందు స్థిరముగా వుండి కర్మలు చేయమని చెప్పుచున్నారు ? అని అన్నచో **"సిద్ధి ప్రాప్తించినను, ప్రాప్తించకుండినను సమముగా వుండుటయే యోగము.**

ఈశ్వరార్పణ బుద్ధితో చేయు కర్మలకంటె ఫలాసక్తితో చేయు కర్మలు నికృష్టమైనవి. అదెట్లన ?–

## 2.49. దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ, బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః.

అనగా – ఓ ధనంజయా ! బుద్ధియోగము కంటె అనగా సమత్వ బుద్ధి కలిగియుండి చేయు కర్మలకంటె కర్మఫలమును కోరుచూ కామభావము కలిగియున్న మనుష్యుల ద్వారా చేయబడు కర్మలు, జన్మ–మరణములకు కారణమగుచుండుట వలన చాలా నికృష్టము అనగా నీచమైనవి.

అందువలన ఓ ధనంజయా ! నీవు యోగవిషయిక బుద్ధియందు గాని లేక దాని పరిపాకముచేత వుత్పన్నమైన సాంఖ్యబుద్ధియందు గాని శరణు పొందుము. వాటిని పొందుటకు ప్రయత్నించుము. తాత్పర్యమేమన – **పరమార్థమును పొందుటకు సాధనమైన జ్ఞానమును పొందుటకు ప్రయత్నించుము.**

అట్లేలయన ? ఫలమును పొందగోరుచు కర్మలు చేయువారు కృపణులు అనగా స్వార్థపరులు మరియు దీనులు. అందులకే శ్రుతిగూడ "ఓ గార్గీ ఎవరైతే ఈ అక్షరబ్రహ్మను గుర్తించక యీ లోకమును విడిచి వెళ్ళుదురో వారు అత్యంత దీనులు అనగా దయతలచ తగియున్నారు."

సమత్వబుద్ధి కలిగి స్వధర్మమును చక్కగా ఆచరించు పురుషుడు ఎటువంటి ఫలమును పొందునో – వినుము –

## 2.50. బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే, తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్.

అనగా – సమత్వయోగ విషయిక బుద్ధి కలిగియున్న పురుషుడు, అంతఃకరణ శుద్ధి ద్వారాను మరియు జ్ఞాన సంపాదన ద్వారాను సత్కర్మలను, దుష్కర్మలను మరియు పాప పుణ్యములను ఈ మాయా లోకమునందే వదలివేస్తాడు. **ఈ పంచభూతాత్మకమైన దేహమునందు వుండగానే లోకమునకు సంబంధించిన కర్మబంధము నుండి ముక్తుడై పోతాడు.** అందువలన అర్జునా ! నీవు సమత్వ విషయిక బుద్ధి రూపమైన యోగస్థితిని పొందుటకు ప్రయత్నించుము.

ఏలయన ? **యోగమనగా కర్మకౌశలత్వమే.** అనగా స్వధర్మ సంబంధమైన కర్మలయందు మునిగియున్న పురుషుడు ఆ కర్మల ఫలములను ఈశ్వరార్పణ జేయు బుద్ధికలిగి సిద్ధి అసిద్ధులయందు సమభావము కలిగియుండుటయే కర్మకౌశలత్వము.

అసలు కౌశలము లేక కుశలత్వము, నైపుణ్యమనగా స్వభావతః బంధమును కలిగించు కర్మలు గూడ ఈ సమత్వబుద్ధి యొక్క ప్రభావము చేత తన స్వభావమును త్యజించును. కావున నీవు **సమత్వ బుద్ధిని పొందుటకు ప్రయత్నించుము.**

అట్లెందుకనగా -

**2.51. కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః,**
**జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛన్త్య నామయమ్.**

అనగా - 'కర్మజమ్' అను శబ్దమునకు **"ఫలంత్యక్త్వా"** అను శబ్దమునకు పరస్పర సంబంధము కలదు.

**కర్మల ననుసరించి కలుగు యిష్టాయిష్టరూపమైన దేహము ప్రాప్తించునది 'కర్మజము' అనబడును.** సమత్వబుద్ధి కలిగియున్న పురుషుడు ఆ కర్మఫలమును త్యజించి మనీషి అనగా జ్ఞానసంపన్నుడై శరీరముతో కూడియున్న కాలమునందే జన్మ-మరణ బంధమునుండి విడువడి మోక్షమనెడు సర్వోపద్రవ రహితమైన పరమ పదమును పొందును.

యోగానుష్టాన జనితమైన సత్వగుణ వికాసము వలన పుట్టిన బుద్ధి ఎప్పుడు ప్రాప్తించును? అని అన్నచో -

**2.52. యదాతే మోహకలిలం బుద్ధిర్వ్యతి తరిష్యతి,**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ.**

అనగా - ఎప్పుడైతే నీ (మానవుని) బుద్ధి - "మోహకలిలమును" అనగా దేనివలన ఆత్మానాత్మక వివేక విజ్ఞానము కలుషితమై అంతఃకరణ కల్పిత విషయములందు లగ్నమగునో దానినుండి అనగా ఆ మోహభావముతో కూడియున్న అజ్ఞానరూపమైన కలుషత్వమును అధిగమించునో అప్పుడు నీ బుద్ధి శుద్ధమైనదిగా భావించబడును.

అట్టి స్థితి కలిగినప్పుడు నీవు వినదగని మరియు వినియున్నట్టి విషయముల నుండి వైరాగ్య భావమును పొందగలవు. అనగా అట్టి వైరాగ్య భావమును పొందినప్పుడు నీవు యింతకు పూర్వము వినియున్న సమస్తమైన సాంసారిక విషయములను విడిచి శుద్ధుడవగుదువు.

మోహరూపమైన ప్రాపంచిక మలినత్వమును అధిగమించి నేను ఆత్మవివేక జన్యమైన బుద్ధిని పొంది కర్మయోగ ఫలరూపమైన పరమార్ధయోగము (జ్ఞానమును) ను ఎప్పుడు పొందుదును అని అడిగినట్లయినచో చెప్పెదను. వినుము -

**2.53. శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా,**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగ మవాప్స్యసి.**

అనగా - అనేకమైన సాధ్య-సాధనములు, మరియు వాటి సంబంధమును చెప్పనటువంటి శ్రుతుల వలన విప్రతిపన్నమైన అనగా అనేక పరస్పర విరుద్ధ భావములతో నిండి వికలమైన నీ బుద్ధి సమాధియందు అనగా చిత్తమును సమాధానపరచి స్థిరముగా వుంచునది సమాధి యనబడును - స్థిరపడునో. అప్పుడు దృఢమై స్థిరముగా వుండును. అనగా విక్షేప

రూపమైన చంచలత్వము మరియు వికల్పముల నుండి తొలగి స్థిరముగా, శాంతముగా వుండును.

అప్పుడు అట్టి యోగమును అనగా సమాధి అవస్థను అనగా చాంచల్య రహితమైన స్థిరత్వమును పొందెదవు.

తన ప్రశ్నకు సమాధానమును పొందినవాడై అట్టి సమాధి ప్రజ్ఞను పొందిన పురుషుని లక్షణము లెట్లుండునో ఎఱుంగ గోరిన అర్జునుడు యిలా అన్నాడు –

**2.54. స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ,**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్.**

అనగా – **"నేను పరబ్రహ్మ పరమాత్ముడను" అని నిశ్చితమైన బుద్ధిగల మహనీయుడే "స్థితప్రజ్ఞుడు"** అనబడును. కేశవా ! ఆ విధంగా సమాధి ద్వారా స్థితప్రజ్ఞత్వము గల పురుషుడు ఎటువంటి భాష మాట్లాడును ? ఆతడు యితరమైన పురుషుల ద్వారా ఎటువంటి లక్షణములు గలవాడుగా చెప్పబడును ?

మరియు ఆ స్థిత ప్రజ్ఞత్వము కలిగియున్న పురుషుడు ఏ విధముగా మాట్లాడును ? ఏ విధంగా నడచును ? అనగా ఆచరణ ఎట్లుండును ?

ఈ విధంగా అర్జునుడు, స్థితప్రజ్ఞత్వమును పొందిన పురుషుని లక్షణము లెట్లుండునో తెలియగోరుచున్నాడు –

ఏ మహాపురుషుడు యింతకు పూర్వమునుండియే కర్మలను త్యజించి అనగా సంన్యసించి జ్ఞాననిష్ఠ కలిగియున్నాడో మరియు ఏ పురుషుడు కర్మయోగము ద్వారా జ్ఞాననిష్ఠను పొందియున్నాడో ఆ రెండు విధములైన ఆ యిరువురి స్థితప్రజ్ఞత్వ లక్షణములను మరియు సాధనములను గురించి 'ప్రజహాతి' అను శ్లోకము మొదలుకొని ఈ అధ్యాయము చివర వరకు చెప్పబడును.

అధ్యాత్మ శాస్త్రగ్రంథములందు అన్నిచోట్ల కృతార్థుడైన పురుషునియొక్క లక్షణములు ఏవి కలవో అవన్నియూ ప్రయత్న సాధ్యములగుట వలన సాధన రూపముగా అందరికీ ఉపదేశింపబడుచున్నవి. యత్న సాధ్యములైన సాధనములే సిద్ధ పురుషునియొక్క స్వాభావిక లక్షణములై యున్నవి. అందుచే భగవంతుడైన శ్రీకృష్ణుడు యిలా చెప్పుచున్నాడు.

**2.55. ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్,**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే.**

అనగా – ఓ పార్థా ! ఏ మనుష్యుడు మనసునందు దాగియున్న, మరియు హృదయాంతరాళమున ప్రవేశించియున్న సమస్తమైన కామభావములను సమస్తమైన కోర్కెలను, వాటి భేదములను పూర్తిగా త్యజించునో –

సమస్తమైన కోర్కెలను పూర్తిగా త్యజించిన తరువాత తృప్తిపరచవలసిన కారణములన్నియు లేకుండా పోవును. అటు తరువాత శరీర ధారణకు కారణమైన ఏ ప్రారబ్ధము మిగిలియుండునో అది మాత్రము మిగిలియే యుండును. అందుచేత శరీర పోషణకొఅకు ఆ మానవుని ప్రవృత్తి పిచ్చివాని చేష్టలవలె యుండును. అటువంటి సందేహము కలిగినప్పుడు ఆ **పురుషుడు ఎటువంటి బాహ్యమైన వస్తులాభమును అపేక్షింపక అంతరాత్మ స్వరూపమునందే తనంతట తానుగానే తృప్తిని పొందినవాడై,** అమృత రసమును ఆనందమును – అనుభవించుచూ ఇతరములైన సమస్త అనాత్మ పదార్థముల పట్ల పూర్తిగా మనస్సు లేనివాడై యున్నవాడు స్థితప్రజ్ఞ కలవాడని చెప్పబడును. అనగా ఎవని **బుద్ధియందు ఆత్మనాత్మ వివేచన ద్వారా వివేకబుద్ధి స్థిరమై యుండునో ఆతడు స్థితప్రజ్ఞ కలవాడనబడును.**

సారాంశమేమన ? – దారాపుత్రాదులయందు, సంపదయందు మరియు సమస్త ప్రాపంచిక వస్తువుల యందు గల తృష్ణను త్యజించిన సంన్యాసియైన ఆత్మారాముడే ఆత్మయందు క్రీడించువాడే స్థితప్రజ్ఞుడనబడును. మరియు –

**2.56. దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః,**
**వీతరాగ భయక్రోధః స్థితధీర్మని రుచ్యతే.**

అనగా – ఏ మానవుని మనసు మూడు విధములైన (ఆధ్యాత్మిక, ఆధి దైవిక, ఆధి భౌతిక) దుఃఖములు కలిగినప్పటికి ఉద్విగ్నతను అనగా వ్యాకులతను చెందదో అనగా ఏ విధముగాను సంక్షోభమును చెందదో అటువంటి వాడు "అనుద్విగ్నమనా" అనగా వ్యాకులత గలగని మనస్సు గలవాడు అనబడును.

మరియు లౌకిక వస్తువుల ద్వారా సుఖములు కలిగినప్పటికి ఆ సుఖములయందు ఎవనికి తృష్ణ నశించియున్నదో, అనగా ఎండుకట్టెలు వేసినప్పుడు ఏ విధముగా అగ్ని ప్రజ్వలించునో ఆ విధముగా భౌతిక సుఖములు కలిగినప్పుడు ఎవని మనస్సు ఎటువంటి వికారమును పొందదో ఆతడు **"విగతస్పృహః"** తృష్ణ లేనివాడు అనబడును.

మరియు ఎవనియందు భయము, క్రోధము మరియు ఆసక్తి పూర్తిగా నివృత్తిని చెందియున్నవో ఆతడు "వీతరాగ భయక్రోధః" అనగా ఆసక్తి, భయము, క్రోధము లేనివాడని చెప్పబడును. ఎవ్వడైనా, ఎప్పుడైనా ఏ మానవుడు అటువంటి గుణములు కలవాడగునో అప్పుడు అతడు స్థిరమైన బుద్ధిగల స్థితప్రజ్ఞుడు, ముని, అంటే నిజమైన సంన్యాసి అనబడును.

మరియు –

**2.57. యః సర్వత్రానభిస్నేహస్తత్ర ప్రాప్య శుభాశుభమ్,**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.**

అనగా – ఏ ముని అనగా సంన్యాసి సర్వత్రా అనగా దేహమునందు మరియు జీవితంలో కూడ ఆసక్తి రహితుడై యున్నాడో మరియు ఆయా శుభ లేక అశుభములను పొందియు

ప్రసన్నుడు కాక మరియు ద్వేష క్రోధములను పొందకయుండునో అనగా శుభములు కలిగినప్పుడు ఆనందముతో ఉప్పొంగక మరియు అశుభములను పొందినప్పుడు దుఃఖమును పొందకయుండునో, అనగా ఎవడు హర్ష - విషాదములను పొందకయుండునో ఆతనికి వివేకముతో కూడియున్న బుద్ధి ప్రతిష్ఠింపబడియున్నట్లుగా తలంచవలయును.

మరియు -

**2.58. యదా సంహరతే చాయం కూర్మో౨ంగానీవ సర్వశః,**
**ఇంద్రియాణీంద్రియార్థే భ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.**

అనగా - ఎప్పుడైతే జ్ఞాననిష్ఠయందు స్థిరపడియున్న సంన్యాసి తాబేటి అవయవములవలె అనగా తాబేలు భయమును పొందినప్పుడు అన్నివైపుల నుండి తన అవయవములను లోపలికి ముడుచుకొనునో ఆ విధముగానే **అన్ని విధములగు ప్రాపంచిక విషయముల నుండి తన యింద్రియములను వెనుకకు మరల్చుకొనును. ఆ యింద్రియములు విషయములను ఎప్పుడు కల్పించుట మానివేయునో అప్పుడు ఆతనిబుద్ధి స్థిరత్వమును పొందును.**

రోగగ్రస్తుడైన మనుష్యుని యింద్రియములు గూడ విషయములయందు ప్రసరించుట మానివేయును గదా ! అనగా తాబేలు భయముచేత ఏ విధముగా తన అంగములను లోనికి ముడుచుకొనునో అట్లే రోగియొక్క యింద్రియములు గూడ విషయములయందు ప్రసరించవు **కాని రోగియొక్క మనస్సునందు విషయములయందు గల ఆసక్తి నశించదు.**

ఆసక్తి నశించవలయునన్నచో ఏమి చేయవలయును అని అడిగినచో చెప్పెద వినుము-

**2.59. విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః,**
**రసవర్జం రసో౨ప్యస్య పరం దృష్ట్వా నివర్తతే.**

అనగా - అజ్ఞాని యగు పురుషుడు అనగా నిత్యానిత్య వస్తువివేకము లేనటువంటి పురుషుడు విషయములను గ్రహించక అతి కఠోరమైన తపస్సు చేసియు దేహాభిమానమును వదలజాలనివాడు శబ్దాది విషయములను గ్రహించకయుండిననూ విషయ భోగములయందలి ఆసక్తిని విడువజాలడు. ఇందులకు కఠోర తపమొనరించి తుదకు మేనకయను అప్సర కన్యయందు ఆసక్తుడై శకుంతలకు జన్మనిచ్చిన విశ్వామిత్రుడే మంచి ఉదాహరణము. అందులకే కాబోలు శ్రీ జి.వి. కృష్ణారావుగారు తన 'వరూధిని' యను కావ్యమునందు యిలా అన్నాడు.

"జన్మముచేత వచ్చు ఫలసంపదలం దడి యాస జేసియ
భ్యున్నతిగాల ద్రోచెదవహో నినుమించినవారు గారె యో
షిన్నిత బాహుబంధముల చేత దగుల్కొని యున్నకచ్చుడా
లన్ని దొలించి వారి నిలయంబుల బందెలుగారె యాజ్ఞికుల్
చూ. "వరూధిని" కావ్యము.

'ఆసక్తి' యనగా 'రసము' . అదెట్లన ?-

"స్వరసేన ప్రవృత్తో రసికో రసజ్ఞః" మొదలగు వాక్యములు సర్వవిదితములే గదా !

కాని ఈ యీ రాగాత్మిక సూక్ష్మ ఆసక్తి గూడ పై విధమగు సాధకునికి పరమార్థ తత్త్వస్వరూపమైన బ్రహ్మ సాక్షాత్కారము కలిగినప్పుడు తనంతట తానుగా తొలగిపోవును. **అనగా "నేనే ఆ బ్రహ్మను" అను భావము దృఢమైనప్పుడు అతని విషయ సంబంధమైన ఆసక్తి నిర్జీవము అయిపోవును.**

సారాంశమేమనగా - యధార్థమైన తత్త్వజ్ఞానము కలుగనంతవరకు 'రాగభావము', అనగా విషయముల ద్వారా లభించు ఆనందమునందలి ఆసక్తి నశించదు. అందుచేత నిత్యానందరూపమైన మోక్షస్థితిని కోరు సాధకుడు తప్పక జ్ఞానరూపమైన బుద్ధియొక్క స్థిరత్వమును పొందవలసినదే.

యధార్థమైన జ్ఞానరూపమైన బుద్ధియొక్క స్థిరత్వమును పొందగోరు సాధకుడు ముందుగా యింద్రియములను తన వశమునందు వుంచుకొనవలయును. ఏలయన ? అలా యింద్రియములను తన వశమునందుంచుకొనని ఎడల కలుగు దోషము యీ క్రింది విధముగా వుండును -

**2.60. యతతో హ్యాపి కౌంతేయ పురుషస్య విపశ్చితః,**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః.**

అనగా - ఓ కుంతీపుత్రా ! మహా ప్రయత్నశీలుడు, చక్కగా ఆలోచించగల సామర్థ్యము గలిగి బుద్ధిమంతుడైన పురుషునియొక్క సతత ప్రేరణశక్తి కలిగియున్న యింద్రియములు **విషయాసక్తి కలిగియున్న పురుషుని దుఃఖవంతునిగా జేయును.** అలా వికలమైన మనస్సు గలవానిగా జేసి కేవలము ప్రకాశమును మాత్రమే చూచు విద్వాంసుడైన వివేకము, విజ్ఞానము కలిగియున్న పురుషుని మనస్సును బలాత్కారముగా చలింపజేయును. అందుచేత -

**2.61. తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః,**
**వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.**

అనగా - ఆ యింద్రియములన్నింటిని చక్కగా వశమునందుంచుకొని సమాహిత చిత్తుడై అనగా చిత్తమును గూడ నిశ్చలముగా జేసుకొని నాయందు అనగా పరమాత్మయందు చిత్తము గలవాడవై కూర్చుండవలయును. అనగా సర్వాత్ముడనైన నాయందే మనస్సు గలవాడవై నాకంటే వేఱుగా లేనను భావముతో కూర్చొని యుండవలయును.

అట్లేలయన ? ఈ విధముగా కూర్చునియున్నవాని యింద్రియములు అభ్యాస బలముతో ఆతని వశమునందుండి పరబ్రహ్మ భావముతో నిండియుండును.

ఇంత చెప్పిన తరువాత పతనాభిముఖుడైన పురుషునికి కలుగు సమస్తమైన అనర్థముల యొక్క కారణమును చెప్పుచున్నారు.

**2.62. ధ్యాయతో విషయాన్పుంసః సంగస్తే షూపజాయతే,**
**సంగత్సంజాయతే కామః కామాత్క్రోధో ఽభిజాయతే.**

అనగా - ఎల్లప్పుడూ విషయాలను గురించి మాత్రమే మరియు వాటి నానావిధ భేదములను గురించి అనేక పర్యాయములుగా ఆలోచించే పురుషునికి ఆ యా విషయముల యందు ఆసక్తి పెరుగును. ఆ ఆసక్తిచేత వాటిని పొందవలయునను కామము, కోరిక, తృష్ణ పెరుగును. ఆ కోరిక ఏ కారణము వలననైనా తీరనప్పుడు క్రోధము కలుగును. అనగా తృష్ణయే క్రోధముగా మారును.

**2.63. క్రోధాద్భవతి సంమ్మోహః సంమ్మోహాత్ స్మృతి విభ్రమః,**
**స్మృతి భ్రంశాద్ బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి.**

అనగా - క్రోధము వలన మోహము అనగా కర్తవ్యాకర్తవ్యావివేకము కలుగును. ఏలయన? క్రోధభావము కలిగియున్న మానవుడు తాను పొందగోరుచున్న వస్తువు పట్ల మోహితుడై గురువులాంటి పెద్దలను గూడ దూషించును.

మోహభావము తీవ్రతను పొందినప్పుడు స్మృతి గతి తప్పును. అనగా శాస్త్రములు మరియు గురువుల ముఖతా విన్నటువంటి వుపదేశ వాక్యముల వలన ఏర్పడిన స్మృతి అవసరమైనప్పుడు కలుగనేరదు. అనగా మోహముతో కూడిన మనస్సు గతములో తాను వినియున్న మంచిమాటల నన్నింటిని మరచిపోవును.

ఆ విధంగా స్మృతి తప్పినప్పుడు బుద్ధి సక్రమంగా పనిచేయదు. అనగా అంతఃకరణము నందు కార్య-అకార్య విషయకమైన అనగా కర్తవ్యాకర్తవ్య విషయకమైన వివేక శక్తి లోపించును. **అట్లు వివేకశక్తి లోపించుటనే బుద్ధినాశమైనదని అందురు. ఏలయన ? విధి - నిషిద్ధ కర్మభేదము కలిగియున్నవాడే మానవుడు.** ఆ భేదమును ఎఱుంగనివాడు పశువుతో సమానమగును.

అందువలన వివేకశక్తి రూపమైన అంతఃకరణము అనగా బుద్ధి నశించినప్పుడు మానవుడు నశించి మానవ రూపమున పశువుగా నిలచియుండును. సారాంశమేమనగా క్రోధము మోహము మొదలగు దోషములు కలిగినప్పుడు మానవుడు విధి నిషేధములను మరిచినవాడై చివరకు పురుషార్థ రూపమైన మోక్షస్థితిని పొందుటయందు విఫలుడగును.

విషయచింతన అనగా విషయములను గురించి ఆలోచించుచుండుట సర్వానర్థములకు మూలముగా చెప్పబడినది.

ఇప్పుడు మోక్షమును పొందుటకు అవుసరమైన సాధనములను గురించి చెప్పబడును.

**2.64. "రాగద్వేషవియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్,**
**ఆత్మవశ్యై ర్విధేయాత్మా, ప్రసాద మధిగచ్ఛతి.**

అనగా - ఆసక్తి మరియు ద్వేషభావములను "రాగద్వేషము" లందురు. ఈ రెంటిని ఆధారముగా జేసుకొనియే యింద్రియముల యొక్క స్వాభావికమైన ప్రవృత్తి ఏర్పడుతూ

వుంటుంది. కావున ముముక్షువు అనగా సాంసారిక మాయా మోహములను వదలి ముక్తత్వమును పొంద కోరు సాధకుడు అయినవాడు తన అంతఃకరణమును విషయముల మీదికి వెళ్ళనివ్వకుండా తన స్వాధీనమునందు ఉంచుకొన్న మహనీయుడు రాగద్వేషములు రెంటిని వదలినవాడై శ్రోత్రాది యింద్రియముల నన్నింటిని గూడ తన వశమునందుంచుకొని అత్యంత ఆవశ్యకమైన విషయముల యందే ప్రసరింపజేయుచు ముక్తత్వమును అనుభవించును. ముక్తత్వమునే ప్రసాదమందురు. ప్రసాదమనగా శారీరిక, మానసిక స్వస్థత కలిగి సర్వదా సంతోషముగా వుండుటయే. అటువంటి ప్రసాదమును అనగా ప్రసన్నత్వమును పొందినందున కలుగు లాభమేమి? అన్నచో -

**2.65. ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోప జాయతే,**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే.**

అనగా - అట్టి ప్రసన్నత్వము ప్రాప్తించినప్పుడు సాధకునికి యింతకు పూర్వము గల ఆధ్యాత్మిక, అదిభౌతిక, ఆది దైవికములైన మూడు విధముల దుఃఖములు శాశ్వతముగా తొలగిపోవును.

అట్లేలయని అన్నచో - ప్రసన్నమైన అంతఃకరణము గల పురుషునియొక్క బుద్ధి సర్వవిధ విషయరహితము మరియు ఆ కారణముగ సర్వవిధ దుఃఖరహితము అయి ఆకాశము వలె నిర్మలము నిశ్చలముగ వుండును. అనగా కేవలము ఆత్మరూపగా నిలిచిపోవును.

ఇట్లు చెప్పుటకు కారణమేమనగా - ఈ విధముగా ప్రసన్నంతఃకరణము మరియు స్థిరత్వమును పొందియున్న బుద్ధిగల పురుషునకు కృతకృత్యత్వము అనగా సత్కర్మల ఫలము లభించును. అందువలన సాధకుడైన పురుషుడు రాగద్వేషాదులతో సంబంధము లేనటువంటి యింద్రియముల ద్వారా శాస్త్రవిరుద్ధములు కానటువంటి అనివార్యమగు విషయములను మాత్రమే గ్రహించుచుండవలయును.

ఆ ప్రసన్నత్వమును స్తుతించుచున్నారు - ఎట్లన ?

**2.66. నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా,**
**న చాభావయతః శాంతిరశాన్తస్య కుతః సుఖమ్.**

అనగా - ఏ పురుషుని అంతఃకరణము రాగద్వేషములను వదలి శుద్ధముగా లేదో అటువంటి పురుషునియందు ఆత్మవిషయికమైన బుద్ధి వుండదు. అందుచేత అట్టి పురుషునకు విషయరాహిత్యము వలన కలిగిన ఆత్మజ్ఞానము మరియు అట్టి ఆత్మజ్ఞానమును పొందవలయునను ఆసక్తి వుండనేరదు. అందుచేత అనగా ఆత్మజ్ఞానమును పొందవలయునను ఆసక్తి లేకపోవుటచేత అతనికి శాశ్వతమైన, ఆనందముతో కూడియున్న శాంతి లభించదు.

మరి శాంతిలేని పురుషునకు సుఖమెట్లు కలుగును ? ఏలయన ? విషయములను సేవించినందువలన కలుగు క్షణిక సుఖమునందలి తృష్ణను యింద్రియములు వదలనంతవరకు

ఆ విషయ సంబంధమైన క్షణభంగురమైన సుఖమే ప్రాప్తించుచుండును గాని శాశ్వత ఆనందముతో కూడిన శాంతి లభించదు కదా ? విషయ సుఖము నిజమైన సుఖము కానేకాదు. సారాంశమేమన -

సాంసారిక మాయా కల్పిత విషయములందు తృష్ణ అనగా ఆ విషయముల ద్వారా సుఖమును పొందవలయునన్న కోరిక వున్నంతవరకు నిజమైన సుఖము అనగా ఆత్మజ్ఞానము వలన కలుగు ఆనందము కొంచెము కూడ లభించదు.

అయుక్త పురుషునకు అనగా విషయములు లేని శుద్ధ అంతఃకరణము లేనటువంటి పురుషునకు సరియైన అనగా లోకవాసనా రహితమైన బుద్ధి ఎందుకు వుండదు ? అన్నచో -

**2.67. ఇంద్రియాణాం హి చరతాం యన్మనో ఽను విధీయతే,**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి.**

అనగా - ఏలయన ? ప్రాపంచిక విషయములయందు నిమగ్నమై యున్న యింద్రియము లలో ఒకటియైన మనస్సు విషయముల యందే నిమగ్నమై క్షణికములైన సుఖములను పొందుటకు ప్రయత్నించుచుండును కాని ఆత్మానందమును పొందగోరు సాధకుని శుద్ధమైన బుద్ధి స్థిరత్వమునకు సహాయకారి కాజాలదు. అనగా ఆత్మానాత్మ వివేకము వలన కలిగిన బుద్ధియొక్క శుద్ధతను చెరిపి అశుద్ధముగా చేయుచుండును.

అదెట్లనిన ? - జలమునందున్న నావను తీవ్రమగు వాయువు ఏ విధముగా ముంచివేయునో ఆ విధముగానే విషయములందు ఆసక్తి కలిగియున్న మనస్సు ఆత్మజ్ఞానమును పొందగోరి వివేకయుక్తమైన బుద్ధిని చలింపజేసి తిరిగి విషయముల వైపుకు తీసుకొనిపోవును.

**"యతతోహ్యపి"** గీ - 2-60 అను శ్లోకమునందు ప్రతిపాదించబడిన విషయమును అనేక విధములుగా వివరించి యిప్పుడు ఉపసంహారము చేయుచున్నారు -

**2.68. తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః,**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.**

అనగా - ఇట్లేలయన ? ఇంద్రియముల యొక్క ప్రవృత్తియందున్న దోషము స్పష్టముగా చెప్పబడినది. అందువలన అర్జునా ! ఏ సాధకుని యొక్క యింద్రియములు తమ తమ శబ్దాది విషయముల యందు అన్ని విధముల అనగా మనసా, వాచా, కర్మణా మొదలగు సర్వభేదములతో తన వశమునందుంచుకొనబడినవో అతని బుద్ధి స్థిరముగా అనగా ఎటువంటి వికారములు లేకుండ వుండినయట్లుగా భావించనగును.

**ఈ లౌకిక వైదిక వ్యవహారమంతయు పూర్తిగా అవిద్యకు సంబంధించిన కార్యము.** అందుచేత ఎవనికి శాస్త్రపఠనము గురూపదేశము మరియు మనన నిది ధ్యాసము వలన వివేక జ్ఞానము ప్రాప్తించినదో అటువంటి స్థితప్రజ్ఞునికి అనగా నిశ్చలమైన బుద్ధి గలవానికి అవిద్యా

నివృత్తితో పాటు పై అవిద్యాకృతమైన వ్యవహారమంతయు తొలగిపోవును. అనగా నివర్తించును మరియు అవిద్యకు విద్యయందు గల విరోధము కారణముగా ఆ అవిద్య గూడ నివర్తించును. ఆ భావమును విశదీకరించుచూ ముందు శ్లోకము చెప్పుచున్నారు.

**2.69.** యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతోమునేః.

అనగా - తామస స్వభావము కారణముగా కలిగి సర్వపదార్థములను తెలియకుండా జేయునటువంటి రాత్రికి 'నిశ' అని పేరు. అన్ని భూతములయందును అవివేకరూపమైన ఈ నిశ కలదు. అందుచే ఈ 'నిశ' అనుదానిని గురించి విపులముగా తెలియవలసియున్నది. స్థిత ప్రజ్ఞత్వమునకు విషయముగా యున్న ఏ పరమార్థ తత్వముకలదో ఆ పరమార్థతత్వము జ్ఞేయము అనగా తెలుసుకొనదగిన పదార్థము. ఏ విధముగా గుడ్లగూబ వంటి నిశాచరములకు యితరులకు పగలుగా వున్నది గూడా నిశ అనగా రాత్రిగానే యుండునో అదే విధముగా నిశాచరముల వంటి సంపూర్ణమైన అజ్ఞానియైన మనుష్యునకు అనగా ఎవనియందు పరమార్థతత్వమును తెలుసుకొను నటువంటి బుద్ధి లేదో అటువంటి భూతములన్నింటికి తెలియనిది అయివున్న కారణముగ ఈ పరమార్థ తత్వము గూడ నిశా కాలమునందలి వస్తువుల వంటిదే అగుచున్నది. అనగా అజ్ఞానులకు తెలియబడనిదై యున్నది.

ఆ నిశా కాలమునందలి తెలియబడని వస్తువుల వంటి పరమార్థ తత్వము అజ్ఞానమను నిద్రనుండి మేల్కొనినటువంటి స్థితప్రజ్ఞునికి అనగా జితేంద్రియునకు అనగా తన యింద్రియము లన్నింటిని తన వశమునందుంచుకొన్న యోగికి పగటియందు తోచు వస్తువుల వంటిది అగుచున్నది. అనగా ఆ పరమార్థ తత్వము తెలియబడుచున్నది.

గ్రాహ్యగ్రాహక వస్తు భేదరూపమును తెలియనివ్వకుండా వుంచు - చేయు - రాత్రియందు గూడ స్వప్నమునందు సర్వమును ఎఱుంగుచున్న మానవుని వలె స్థిరబుద్ధి కలిగియున్న యోగి సర్వదా అనగా రాత్రి, పగలు అను భేదము లేకుండా ఆ పరమార్థ తత్వమును తెలుసుకొనుచునే యుండును.

అందుచేత యిప్పుడు తేలిన సారాంశమేమనగా - అవిద్యావస్థయందున్న అజ్ఞానియైన మానవుడు పరమార్థమును తెలియజాలక కర్మలు చేయుటయందే నిమగ్నుడై యుండును. విద్యావస్థయందు అట్లు జరుగదు. అనగా **పరమార్థ తత్వమును ఎఱింగిన పురుషుడు ఆ విధముగా కర్మలు చేయుటయందు నిమగ్నుడు కాడు.** ఏ విధముగా సూర్యోదయము కాగానే అంధకారమంతయు పటాపంచలైపోవునో ఆ విధముగానే పరమార్థ తత్వజ్ఞానము కలుగగానే అజ్ఞానము మరియు ఆ య జ్ఞానము వలన తోచు పదార్థములు అన్నియు తొలగిపోవును. అనగా కనబడకుండా పోవును.

జ్ఞానోత్పత్తి జరుగక పూర్వము ప్రమాణబుద్ధి చేత గ్రహించబడు అవిద్యయే అనగా అజ్ఞానమే క్రియగాను, కారకముగాను, ఫలముగాను అనేక రూపభేదములతో తోచుచు సర్వపథ

కర్మలు చేయుటకు మరియు చేయించుటకు కారణమగుచున్నది. అప్రామాణికమైన బుద్ధిచేత గ్రహించబడిన అజ్ఞానము కర్మలు చేయుటకుగాని చేయించుటకుగాని కారణము కాజాలదు.

ఏలయన ? ప్రమాణ స్వరూపమైన వేదము నేను ఫలానా కర్మలు చేయవలయుననియు, ఫలానా కర్మలు చేయరాదనియు చెప్పి నిర్ణయించియున్నది అని తలంచియే మానవరూపుడైన జీవుడు తాను కర్తయై కర్మలయందు నిమగ్నుడగుచున్నాడు. నిజముగా విచారించి చూచిన యిదియంతయు రాత్రివలె అజ్ఞానము మాత్రమే అని తెలిస్తే చేయనే చేయడు.

ఎవనికి ఈ **దృశ్యమంతయు రాత్రివలె అజ్ఞానరూపమైనదేనని తెలియునో అటువంటి జ్ఞానికి సర్వకర్మ సన్యాసమునందే అధికారము కలిగియుండును.** ఆ కర్మలు చేయుటయందు ఎటువంటి ప్రవృత్తి వుండనేరదు.

ఈ విధముగా **"తద్ బుద్ధ్య స్తదాత్మనః"** గీ. 5.17 మొదలగు శ్లోకముల ద్వారా అటువంటి ఆత్మజ్ఞానికి అధికారము జ్ఞాననిష్ఠయందే చెప్పబడును.

**పూర్వపక్షము** – అటువంటి జ్ఞాననిష్ఠయందు గూడ తత్త్వవేత్తకు ప్రవృత్తిని కలిగించు ప్రమాణముల (విధి వాక్యముల) లేమి వుండును గదా ! అందువలన అందులో గూడ ఆతనికి ప్రవృత్తి కలుగకపోవచ్చును గదా ?

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? **ఆత్మజ్ఞానము తన స్వరూపమునే విషయముగా చేసుకొనగలదు. అందువలన తన స్వరూప జ్ఞానమునకు సంబంధించిన విషయమునందు ప్రవృత్తిని కలిగించు జ్ఞానమునకు ప్రమాణములతో నిమిత్తము వుండదు.** ఆ యాత్మజ్ఞానము స్వయముగా ఆత్మయే అయివుండుట వలన స్వతఃసిద్ధమై యుండును. మరియు దానియందు సర్వవిధ ప్రమాణముల యొక్క ప్రమాణత్వము విలీనమై యుండును. అనగా ఆత్మజ్ఞానము కలుగువరకే ప్రమాణముల యొక్క ప్రమాణత్వము ఆవశ్యకమై యుండును. అందువలన ఆత్మస్వరూప సాక్షాత్కారము కలిగిన తరువాత ప్రమాణ ప్రమేయముల వ్యవహారము నిలువజాలదు.

ఆత్మజ్ఞాన రూపమైన అంతిమ ప్రమాణము ఆత్మయొక్క ప్రమాతృత్వమును గూడ నశింపజేయును. ఆ ప్రమాతృత్వమును నివారించుచూ అది స్వయముగా కూడ మేల్కొనిన తరువాత స్వప్నావస్థయందలి ప్రమాణత్వము వలె అప్రమాణము అయిపోవును. అనగా ప్రమాణత్వము లోపించిపోవును.

అట్లేలయన ? వ్యవహారమునందు గూడ యిష్ట వస్తువు లభించిన వెంటనే ఏ ప్రమాణము గూడ ప్రవృత్తికి కారణమగుట కానరాదు.

కావున నిర్ణయమేమన ? ఆత్మజ్ఞానికి కర్మలయందు అధికారము లేదు.

ఏషణత్రయమును అనగా పుత్రేషణ, దారేషణ మరియు విత్తేషణను – త్యజించినట్టి స్థితప్రజ్ఞుడు, విద్వాంసుడు మరియు సర్వమును సంన్యసించిన మహాత్మునికే మోక్షము లభించును. భోగములను కోరునట్టియు మరియు సంన్యసించని మానవునకు మోక్షము లభించదు. ఈ సిద్ధాంతమును దృష్టాంతముల ద్వారా దృఢపరచుచున్నారు –

**2.70. ఆ పూర్యమాణమచల ప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్,**
**తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ.**

అనగా – జలముతో నిండి స్థిరముగా వున్న సముద్రమునందు అనగా ఏది స్థిరముగా ఉన్నదో అటువంటి తన హద్దులయందు స్థిరముగా వున్నట్టి సముద్రములోనికి నాల్గువైపుల నుండి వచ్చి చేరిన జలము ఆ సముద్రము యొక్క స్థిరత్వము నందు ఎటువంటి వికారమును కలిగించక దానియందే యిమిడి పోయినట్లుగా, విషయ సంబంధము కలిగియున్నప్పటికీ **స్థితప్రజ్ఞత్వము కలిగియున్న పురుషునియందు అవి ఎటువంటి వికారమును కలిగించక ఆతనియందు లీనమైపోవును. ఎవని సమస్తమైన కోరికలు ఆత్మయందు లీనమై పోయినవో ఆతనియందు విషయములు ఎటువంటి వికారమును కలిగించజాలవు.**

అటువంటి పురుషునకే పరమశాంతియను మోక్షస్థితి కలుగును. అంతేగాని యితరులకు అనగా భోగములయందు మనస్సు గలవానికి అట్టి స్థితి కలుగనేరదు.

ఏలయన ? అది అలా వున్నది కావున –

**2.71. విహాయ కామాన్యః సర్వాన్పుమాంశ్చరతి నిఃస్పృహః,**
**నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి.**

అనగా – సంన్యసించినట్టి ఏ పురుషుడు సమస్తమైన కోరికలను మరియు భోగభావములను నిశ్శేషముగా త్యజించి అనగా కేవలము శరీర పోషణ కొఱకు మాత్రమే ప్రయత్నించుచుండునో మరియు ఎవడు దేహ పోషణార్థము గూడ ఆలోచించడో, ఎవడు మమత్వము అనగా నాది అను భావము లేనివాడో అనగా శరీర పోషణార్థము అవసరమైన వస్తువుల సంగ్రహమునందు గూడ ఎటువంటి ఆసక్తి చూపడో.

మరియు అహంకారము లేక యుండునో అనగా విద్వత్తు మొదలగు విషయములకు సంబంధించిన అభిమానము అనగా గర్వము కూడ వుండదో, అటువంటి స్థిత ప్రజ్ఞత్వము గలిగి బ్రహ్మవేత్త అనగా బ్రహ్మతత్వమును గురించి సమ్యక్ జ్ఞానము కలిగియున్న మహాత్ముడు సంసార సంబంధమైన సర్వవిధ దుఃఖముల నుండి ముక్తిని పొంది మోక్షము అనబడు మహదానందమును అనుభవించును. అనగా బ్రహ్మస్వరూపుడై నిలిచియుండును.

ఇప్పుడు పైన చెప్పబడిన బ్రహ్మనిష్ఠత్వ ప్రశంశ చేయబడుచున్నది.

**2.72. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి,**
**స్థిత్వా స్యామంతకాలే ఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి.**

అనగా – పైన చెప్పబడిన స్థితి బ్రాహ్మీస్థితి. అనగా సర్వవిధ కర్మలను సాధకుడు మనసా, వాచా, కర్మణా సంన్యసించి అనగా త్యజించి కేవలము బ్రహ్మ భావముతో నిండియుండును.

ఓ పార్థా ! ఈ స్థితిని పొందిన బ్రహ్మవేత్త తిరిగి ప్రాపంచిక విషయ సంబంధమైన మోహమును పొందదు.

స్థూల దేహమును త్యజించు సమయమున, అంతకు పూర్వము దేహముతో కూడియున్నప్పుడు కూడ బ్రాహ్మీస్థితి యందే నిశ్చలముగా వుండి మనుష్యత్వము కలిగియుండియు బ్రహ్మ స్వరూప లాభమైన మోక్షానందమును అనుభవించును. ఎవడు బ్రహ్మచర్యాశ్రమ కాలమునుండియే సంన్యసించి జీవన పర్యంతము బ్రాహ్మీ స్థితియందే లీనమై యుండునో ఆతడు బ్రహ్మ స్వరూపమునే పొందును. ఈ విషయమునందు ఎటువంటి సంశయమునకు తావులేదు.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*సాంఖ్యయోగమను రెండవ అధ్యాయమునకు శ్రీశ్రీ శ్రీ శంకరాచార్య*
*విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు : **శ్రీ సదానందభారతి***
*ప్రణవాశ్రమము.*

# మూడవ అధ్యాయము

ఈ గీతాశాస్త్రమునందలి రెండవ అధ్యాయమునందు భగవంతుడైన శ్రీకృష్ణుడు **ప్రవృత్తి విషయికమైన యోగబుద్ధి** మరియు **నివృత్తి విషయికమైన సాంఖ్యబుద్ధి** అను రెండు బుద్ధులను గురించి విపులముగా చర్చించియున్నారు.

ఆ ద్వితీయ అధ్యాయమునందు సాంఖ్యబుద్ధిని అనగా నివృత్తి భావముతో కూడియున్న బుద్ధిని ఆశ్రయించి సాధన చేయువారి కొఱకు. "**ప్రజహాతి యదాకామాన్**" (2.55) అను శ్లోకము మొదలు ఆ రెండవ అధ్యాయం చివరిదాకా **సర్వవిధ కర్మలను త్యజించుటయే మోక్షార్థియైన సాధకుని ధర్మమని** చెప్పి "ఏషా బ్రాహ్మీ స్థితిః" (2.72) అను శ్లోకమునందు సాధకుడు అనగా మోక్షార్థి ఆ బ్రహ్మజ్ఞాన నిష్ఠతోడనే కృతార్థుడు అనగా మోక్షభావమును పొందినవాడు కాగలడని వివరించియున్నారు.

కాని అర్జునునకు మాత్రము "నీకు కర్మలు చేయుట యందే అధికారము కలదు" కర్మలు చేయకయుండుట యందు నీవు ఎటువంటి ఆసక్తిని కలిగియుండరాదు" అని మొదలగు వాక్యముల ద్వారా **"యోగబుద్ధిని ఆశ్రయించి నీవు కర్మలే చేయవలయును" అని చెప్పి దానివలన ముక్తి లభించదని చెప్పియున్నాడు.**

ఈ మాటలు విన్నప్పుడు అర్జునుని బుద్ధి వ్యాకులత్వమును చెందినది. అప్పుడు ఆతడు (అర్జునుడు) **"జ్యాయసీ చేత్కర్మణస్తే"** (3-1) అను వాక్యము ద్వారా భగవానుడగు శ్రీకృష్ణుని ప్రశ్నించినాడు.

"నీ భక్తుని మేలు కోరుచున్న నీవు (కృష్ణుడు) మోక్షమునకు సాక్షాత్తు సాధనమైన సాంఖ్యబుద్ధి - నిష్ఠను వినిపించి గూడ దానికి విరుద్ధమై అనేక విధములైన అనర్థములతో కూడియున్నటువంటి మరియు క్రమముగా అనగా ఏ యోగబుద్ధి ననుసరించి సాధనచేసినప్పటికి ఈ జన్మయందు మోక్షరూపమైన ఫలము లభించుట దుర్లభమో అటువంటి కర్మలయందు నన్ను నిమగ్నుడవు కమ్మని ఎందులకు చెప్పుచున్నావు ? అని వ్యాకుల మనస్కుడైన అర్జునుడు భగవంతుడైన శ్రీకృష్ణుని ప్రశ్నించుట సహజముగనే యున్నది.

ఆ వ్యాకులత్వము కారణముగానే **"జ్యాయసీచేత్"** అని ప్రశ్నించుట సహజమైనదే.

ఈ ప్రశ్నను నివర్తించుటకు అవసరమైన విషయమంతయు శ్రీకృష్ణుడు యింతకు పూర్వము అనగా రెండవ అధ్యాయమునందే జ్ఞాననిష్ఠ - కర్మనిష్ఠ మొదలగు విషయ విభజన చేసి వేరువేరుగా చెప్పియేయున్నారు. అయినప్పటికీ అనగా అలా వేరువేరుగా సవివరముగా చెప్పియున్నప్పటికి యింతకు పూర్వము ఈ శ్రీమద్భగవద్గీతకు టీకా - తాత్పర్యము వ్రాసిన

మహానుభావులు అర్జునుని ప్రయోజనమును అనగా అభిప్రాయమును మరో విధముగా తలంచి అందులకు అనగా అర్జునుని ప్రయోజనమునకు విపరీతముగా అనగా విరుద్ధముగా భగవంతుని సమాధానమును చెప్పియున్నారు. మరియు ముందుగానే భూమికాభాగమునందే భగవంతుడు స్వయముగా ఏ విధముగా గీత యొక్క తాత్పర్యమును అనగా లక్ష్యమును వివరించి యున్నారో దానికి గూడ యిచ్చట అర్జునుని ప్రశ్నకు, భగవానుని సమాధానమునకు గూడ విపరీతార్ధమునే ప్రతిపాదించియున్నారు.

అది ఎట్లన ?

అచ్చట భూమిక యందు యింతకు పూర్వము ఈ గ్రంథమునకు టీకా తాత్పర్యములు వ్రాసియుండిన మహాత్ములు చెప్పినదేమనగా – గీతాశాస్త్రమునందు అన్ని ఆశ్రమములయందు (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ మరియు సంన్యాస) వున్నవారికి జ్ఞానము మరియు కర్మల సముచ్చయమును చెప్పియున్నారు. ఇంకా ప్రత్యేకముగా "అందరూ అనగా అన్ని ఆశ్రమములయందున్నవారూ బ్రతికి వున్నంతకాలము అగ్నిహోత్రాది కర్మలు చేయచునే యుండవలయును" అని చెప్పియున్నారు. ఇటువంటి "అగ్నిహోత్రాది" శ్రుతివిహిత కర్మలు అనగా వేదములందు చెప్పబడియున్న కర్మలు వదలి" కేవలము జ్ఞానము వలననే మోక్షము కలుగును" అను సిద్ధాంతము గీతాశాస్త్రమునకు విరుద్ధమని చెప్పియున్నారు.

కాని యిచ్చట అనగా ఈ మూడవ అధ్యాయమునందు వారు ఆశ్రమ భేదములను వివరించుచూ "బ్రతికి యున్నంతవరకు" మొదలగు శ్రుతియందు చెప్పబడిన కర్మలను త్యజించవలసినదిగా చెప్పియున్నారు.

దీనివలన మరియొక శంక కలుగుచున్నది. అదేమనగా – ఇటువంటి పరస్పర విరుద్ధములగు అర్ధములు కలుగు వచనములు భగవానుడైన శ్రీకృష్ణుడు అర్జునునకు ఎలా చెప్పాడు ? ఆ వచనములను అర్జునుడు మాత్రము విని అలాంటి అర్ధములను ఎలా ఒప్పుకొన్నాడు ?

**పూర్వ పక్షము** – ఒకవేళ భూమికా భాగమునందు గృహస్థుని కొరకు మాత్రమే శ్రౌతకర్మలను త్యజించి కేవలము జ్ఞాన సంపాదన వలననే మోక్షము నిషేధింపబడి యితర ఆశ్రమముల వారికి మాత్రము అట్లా నిషేధింపబడి యుండలేదేమో ?

**సమాధానము** – ఇది కూడా పూర్వాపర విరుద్ధమైన వచనమే. ఏలయన ? అన్ని ఆశ్రమముల వారికి జ్ఞానము కర్మల సముచ్చయము అనగా రెండూ ఒకే వ్యక్తి ద్వారా చేయబడుట గీతాశాస్త్రము యొక్క నిశ్చితమైన అభిప్రాయము అని భూమికా భాగమునందు ప్రతిజ్ఞ చేసి దానికి విరుద్ధముగా యిచ్చట గృహస్థులను వదలి యితర ఆశ్రమాదుల యందు వున్నవారికి మాత్రమే కేవల జ్ఞానము వలన మోక్షము కలుగునని చెప్పుట ఎలా కుదురును ? అసలు ఎలా చెప్పగలరు ?

**పూర్వ పక్షము** – (శ్రౌత కర్మలయందు ఆదరభావముతో) శ్రౌతకర్మలు ఆచరించకుండానే కేవల జ్ఞానము ద్వారానే గృహస్థునికి మోక్షము కలుగదని చెప్పియున్నాడని అందులో గూడ కేవల జ్ఞానము వలన గృహస్థులకు మోక్షము కలుగదు అని చెప్పుట యందు ఆచరణయందున్న శ్రౌతకర్మలకు కూడా లేమిని అపేక్షించి అలా చెప్పబడెనేమో ? అన్నచో –

**సమాధానము** – ఈ మాట కూడా ఒప్పుకొనబడదు. ఏలయన ? **గృహస్థునకు మాత్రమే కేవలము స్మార్తకర్మలతో పాటు కలసియున్న జ్ఞానము వలన మోక్షము నిషేధించబడినది.** ఇతర ఆశ్రమముల వారికి మాత్రము కాదు అని చెప్పినచో తెలివిగల మానవుడెవ్వడూ ఒప్పుకొనజాలడు.

మరోమాట యేమనగా – ఒకవేళ ఊర్ధ్వరేతలకు – అనగా ఇంద్రియమును యోగబలముతో పైకి అనగా వెనుకకు లాగుకొనువారలకు – మోక్షప్రాప్తి కొరకు జ్ఞానముతో పాటు కేవలము స్మార్తకర్మల సముచ్చయము అనగా సముదాయము ఆవశ్యకము అన్నచో ఈ న్యాయము ననుసరించి **గృహస్థులకు గూడ కేవలము స్మార్తకర్మలతో పాటు జ్ఞానము యొక్క సముచ్చయము ఆవశ్యమని తలంచవలసి యుండును.** శ్రౌతకర్మలతో పాటు కాదు.

**పూర్వపక్షము** – గృహస్థునకు మాత్రమే మోక్ష సిద్ధిని పొందుట కొరకు శ్రౌత మరియు స్మార్త రెండు విధములైన కర్మలతో పాటు జ్ఞాన సముచ్చయము ఆవశ్యకము గాని ఊర్ధ్వరేతస్సు గల యోగులకు కేవలము స్మార్తకర్మయుక్తమైన జ్ఞానము వలననే మోక్షము కలుగును అని చెప్పినందున తప్పేమి కలదు ?

**సమాధానము** – అలా అని ఒప్పుకొన్నట్లయితే అత్యంత శ్రమ సాధ్యమైన మరియు అపరిమిత దుఃఖరూపములైన శ్రౌత–స్మార్త మొదలగు కర్మలన్నియు గృహస్థుని నెత్తిన పడవేసినట్లే గదా ?

**పూర్వపక్షము** – ఆ విధముగా అధిక శ్రమ చేసినందువలన జ్ఞానికంటే అనగా సంన్యాసికంటే గృహస్థునకే మోక్షము లభించునని చెప్పవచ్చును గదా ? ఇంక యితర ఆశ్రమాదులయందుండువారికి శ్రౌతసంబంధమైన నిత్యకర్మలు లేనందున, అనగా విధించనందున వారికి త్వరగా మోక్షము లభించకపోవచ్చును గదా ? అని అన్నచో –

**సమాధానము** – ఇలా చెప్పటం కూడా సరికాదు. ఏలయన ? సర్వోపనిషత్తులు, చరిత్ర గ్రంథములు, పురాణాదులు మరియు యోగశాస్త్ర గ్రంథములయందు గూడ **ముముక్షువులకు జ్ఞానమే ప్రధానమని ఎంచి సర్వకర్మ సంన్యాసమును విధించుట జరిగినది.** మరియు శ్రుతులు మరియు స్మృతి గ్రంథముల యందు గూడ ఆశ్రమముల వివిధత్వము మరియు వాటి యొక్క సముచ్చయత్వము క్రమముగా చెప్పబడినది. (ఆ సముచ్చయ విధానమెట్టిదన? – ముందు బ్రహ్మచర్యము, తరువాత గృహస్థము, అటుపైన వానప్రస్థము చివరకు సంన్యాసము గ్రహించవలయును. **ఇదియే సముచ్చయ విధానము.** అంతేగాని బ్రహ్మచర్యము నుండి సంన్యాసము లేక గృహస్థము నుండి సంన్యాసము స్వీకరించమని చెప్పుట వికల్పమనబడును.)

పూర్వపక్షము - అలా అయితే అన్ని ఆశ్రమముల వారికి జ్ఞాన-కర్మల సముచ్చయము సిద్ధించును గదా !

సమాధానము - కాదు. ఏలయన ? ముముక్షువునకు అనగా కేవలము మోక్షమును **కోరువానికి సర్వకర్మ సంన్యాసము విధించబడినది.** ఏలయన ? నిజమైన మోక్షార్థి **సర్వవిధములైన భోగములయందు విరక్తినిబొంది, భిక్షావృత్తిని అవలంభించును.** అందుచేత మోక్షమును పొందింపజేయు మార్గములన్నింటిలోను సంన్యాసమునకే ప్రాధాన్యత యివ్వబడినది. సర్వకర్మ సంన్యాసమే శ్రేష్ఠమని చెప్పబడినది. "న కర్మణా, నప్రజయా, ధనేన త్యాగేనైకే ఽమృతత్వమానశుః" (**నా.ఉ. 2-12**) అనగా కర్మల వలన గాని, సంతానము వలన గాని లేక ధనము వలన గాని మోక్షము లభించదు. కేవలము త్యాగము అనగా సర్వవస్తు సంన్యాసము ద్వారానే మహా పురుషుడైన మానవుడు అమృతత్వమును అనగా మరణములేని స్థితిని పొందును. కావున బ్రహ్మచర్యము నుండియే సంన్యాసమును గ్రహించ లేక అవలంభించవలయును. ఇది శ్రుతి వచనము.

ఈ సంన్యాసమును గురించి బృహస్పతి గూడ కచునితో యిలాగే చెప్పాడు. "బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్" **"ధర్మాధర్మములు రెంటిని త్యజించుము, సత్యము అసత్యము రెంటిని వదలి, ఏ అహంకారము నుండి వీటినన్నింటిని త్యజించెదవో ఆ యహంకారమును గూడ త్యజించుము. ఆ పైన సంసారమును సారరహితమైనదిగా ఎరింగి పరమవైరాగ్య భావమును ఆశ్రయించి ఏ పురుషుడు సారమైన అనగా నిత్యమైన వస్తువును దర్శించ వలయునన్న కోరిక ప్రబలము కాగా వివాహము చేసుకొనకుండా బ్రహ్మచర్యము నుండియే** సంన్యాస **భావమును పొందునో అతడే మోక్షాధికారమును కలిగి యుండును. తస్మాత్కర్మనకుర్వంతి యతయః పారదర్శినః"** (చూ. మహా.భా. శాంతి పర్వము 5.125 శుకానుశాసనం)

వ్యాసభగవానుడు గూడ తన కుమారుడైన శుక మహర్షికి ఉపదేశించుచూ "జీవుడు కర్మల చేత బంధించబడును మరియు జ్ఞానము చేత ముక్తత్వమును పొందును. అందుచేత ఆ తత్వమును చక్కగా ఎరింగిన సంన్యాసి ఎటువంటి కర్మలను ఆచరించదు. యీ విధముగా చెప్పియున్నాడు. (చూ. మ.భా. శాంతి పర్వము 125). వినుప్రవృత్తి కర్మమనఘునివృత్తి నిష్కర్మమరయబంధకంబు మోక్షణంబునగుట బోధసత్వసంపన్నులు సారదు కర్మతంత్ర కర్ణమునకు."

ఇచ్చట గీతయందు గూడ "సర్వ కర్మలను మనస్సు నుండి త్యజించి" (గీ. 5-13) అని చెప్పబడినది.

**మోక్షము అకార్యము. అనగా ఎటువంటి కర్మల ద్వారానూ లభించునది కాదు. దీనిని బట్టి చూచినా మోక్షార్థికి కర్మలు వ్యర్థమైనవే.**

**పూర్వపక్షము** - ప్రత్యవాయమును అనగా విహిత కర్మలను చేయకుండినచో కలుగు పాపమును తొలగించుకొనుటకు నిత్య కర్మలను ఆచరించుట ఆవశ్యకమేయని చెప్పినచో -

**సమాధానము** - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? సంన్యాసికి ప్రత్యవాయము కలుగదు. గృహస్థునకు మాత్రమే కలుగును. ఎవడు సంన్యసించి యుండలేదో, అటువంటి

కర్మలు చేయు గృహస్థునకు మరియు బ్రహ్మచారులకు గూడ విహిత కర్మలు చేయనందు వలన ప్రత్యవాయము కలుగును. ఆ విధముగా అగ్నిహోత్రాదికర్మలు చేయనందు వలన **సంన్యాసికి ప్రత్యవాయము కలుగుననుట అసంభవము.**

మరియు నిత్యకర్మలు చేయనందువలన భావరూపమైన ప్రత్యవాయము కలుగుననుట వట్టి కల్పన మాత్రమే. ఏలయన ? అసత్తు నుండి సత్పదార్థము ఎట్లు వుత్పన్నమగును ? (చూ. ఛాందోగ్యోపనిషత్తు ఉ. 6-2-2) అదే విధముగా అభావము నుండి భావరూపమైన వస్తువు వుత్పన్నమగుట అసంభవమని శ్రుతి వచనము.

ఒకవేళ నీవు నిత్యకర్మలు చేయనందున ఆ కర్మాభావము నుండి భావరూపమైన ప్రత్యవాయము సంభవము కానప్పటికీ విహిత (విధించబడిన) కర్మలు చేయనందు వలన ప్రత్యవాయము కలుగునని వేదమే చెప్పుచున్నదని చెప్పినట్లయితే వేదము అనర్థదాయకము, అప్రామాణికము అని చెప్పవలసి యుంటుంది.

ఏలయన ? నీవు చెప్పినది నిజమని ఒప్పుకొన్నట్లైతే వేదముల చేత విధించబడిన కర్మలు ఆచరించినను, ఆచరించకపోయినను రెండు విధముల కేవలము దుఃఖమే ఫలముగా లభించును.

ఇంతేకాకుండా "శాస్త్రము అజ్ఞాపక్ అనగా అపూర్వమైన జ్ఞానమును కలిగించునది గాక కారకము అనగా యుక్తి శూన్యమైన అర్థమును బోధించునది" అని ఒప్పుకొనవలసి వస్తుంది. ఇది సర్వమాన్యము అనగా అందరి చేత ఒప్పుకొనతగినది కాదు.

అందువలన, తేలిన సారాంశమేమన ?

**సంన్యాసులకు కర్మలతో ఎటువంటి సంబంధము లేదు.** అందువలన **జ్ఞానకర్మల సముచ్చయము గూడ సమంజసము కాదు.**

మరియు "జ్యాయసీ చేత్కర్మణస్తే మతాబుద్ధిర్జనార్దన" (గీ. 3.1) మొదలగు అర్జునుని ప్రశ్న గూడ సమంజసముగా లేదు. అట్లు లేనందువలన జ్ఞానకర్మల సముచ్చయము గూడ కుదురుట లేదు.

ఏలయన ? రెండవ అధ్యాయము నందు భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునునితో నీవు జ్ఞానము యొక్క సంపాదన మరియు కర్మలు రెండూ చేయవలసి యుంటుంది అని చెప్పి వున్నట్లయితే యిప్పుడు అర్జునునకు ఓ జనార్ధనా ! "మీరు కర్మలకంటే జ్ఞానమే శ్రేష్ఠమైనదని తలంచిన యెడల" అని అడిగి వుండే అవకాశము కలిగేది కాదు.

నిజముగా భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునునితో అర్జునా ! నీవు జ్ఞానకర్మలు రెంటినీ ఒకే కాలమునందు అనుష్ఠించవలయును అని చెప్పి వున్నట్లయితే అప్పుడు కర్మల కంటే శ్రేష్ఠమైనటువంటి ఆ జ్ఞాన సంపాదన కొరకు ప్రయత్నించమని యింతకుపూర్వమే చెప్పబడియున్నది గదా ! మరి అప్పుడు "ఓ కేశవా ఆ ఘోరమైన కర్మలు చేయమని ఎందులకు ప్రోత్సహించుచున్నావు ?" అని అడిగే అవకాశము అర్జునునకు కలిగి వుండేది కాదు.

అటువంటి శ్రేష్ఠమైనటువంటి జ్ఞానము యొక్క సంపాదన అర్జునుడు చేయకూడదు అని భగవంతుడు చెప్పి వున్నట్లయితే అర్జునునికి "జ్యాయసీచేత్" అను ప్రశ్నకు అవకాశము వుండేదికాదు.

అట్లుగాక భగవంతుడైన శ్రీకృష్ణుడు **జ్ఞాన కర్మలకు పరస్పర విరోధమున్న కారణముగ** ఒకే పురుషుడు ఒకే కాలమందు జ్ఞానకర్మలు రెంటి యొక్క అనుష్ఠానము చేయుట సంభవము కాదు గావున భగవంతుడు ఆ రెంటిని వేరువేరు మనుష్యుల ద్వారా, వేరు వేరు కాలములందు అనుష్ఠింప తగియున్నవని యింతకు పూర్వమే చెప్పియున్నట్లయితే "జ్యాయసీచేత్" అని ప్రశ్నించ డానికి అవకాశము వుంటుంది.

అర్జునుడు ఈ ప్రశ్న అవివేకము చేత వేశాడని అనుకొందామనుకొన్నా **"జ్ఞాననిష్ఠ మరియు కర్మనిష్ఠ రెండూ వేరు వేరు పురుషుల ద్వారా అనుష్ఠించదగియున్నవి"** అని భగవంతుడు చెప్పుట సమంజసముగా లేదు.

భగవంతుడు చెప్పిన సమాధానమును అజ్ఞానజనితమైనదిగా తలంచుట ఎట్టి స్థితి యందును వుచితము కాదు.

కావున భగవంతుని చేత చెప్పబడిన **జ్ఞాననిష్ఠ మరియు** కర్మనిష్ఠల **అనుష్ఠానము చేయు అధికారముగలవారు వేరువేరుగా వున్నారు.** అను వాక్యమును పరిశీలించగా సిద్ధించునదేమన **జ్ఞానకర్మల సముచ్ఛయము కుదరదు అనగా సంభవము కాదు.**

అందువలననే **గీతయందును మరియు సర్వోపనిషత్తుల యందును కేవలము జ్ఞానము వలెననే మోక్షము కలుగును గాని కర్మల వలన కాదని ఋజువగుచున్నది.**

నిజముగా జ్ఞానకర్మల రెంటియొక్క సముచ్ఛయము చేతనే మోక్షము కలుగునని చెప్పియున్నట్లయితే అర్జునుడు భగవంతుని ఆ రెంటిలో ఏదో ఒకదానిని నిర్ణయించి దాని ద్వారానే మోక్షము కలుగును అని నిశ్చయించి చెప్పుము అని ఎందులకు ప్రార్థించి వుండే వాడు ?

అంతేగాక, **"కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వ తరం కృతమ్"** (గీత 4-15) అను నిశ్చితమైన నిర్ణయము ద్వారా భగవంతుడు అర్జుననకు జ్ఞానమార్గమును బోధించి యుండలేదని స్పష్టమగుచున్నది. కర్మలు చేయుటయందే ఆతనికి అధికారము కలదని చెప్పినట్లుగా స్పష్టమగుచున్నది.

అప్పుడు అర్జునుడు యిలా అన్నాడు -

**3.1. జ్యాయసీ చేత్కర్మణస్తేమతా బుద్ధిర్జనార్దన,**
**తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ.**

అనగా – ఓ జనార్ధన ! ఓ కేశవా ! కర్మలు చేయుటకంటే జ్ఞాన సంపాదనమే శ్రేష్ఠమైనదని మీ అభిప్రాయమైతే మరి నన్ను క్రూరకర్మయైన ఈ హింస అనగా యుద్ధము చేయమని ఎందులకు ప్రోత్సహించుచున్నారు ?

భగవంతునికి జ్ఞానము మరియు కర్మలు రెంటియొక్క సముచ్చయము సమ్మతమైతే "నాకు కల్యాణకరమగు ఆ ఒక్క సాధనమును గురించియే చెప్పండి" అని మరియు "కర్మల కంటే జ్ఞానము శ్రేష్ఠమైనది" మొదలగు వాక్యముల ద్వారా అర్జునుడు జ్ఞానమును కర్మలను వేరుచేసి మాట్లాడుట అనుచితమగును గదా !

సముచ్చయము దృష్టితో చూచిన ఎడల కర్మఫలము కంటే జ్ఞాన ఫలము శ్రేష్ఠమని చెప్పుట కుదరదు గదా ?

ఇంకా కొంచము విచారించి చూచిన భగవంతుడు కర్మఫలము కంటే జ్ఞానఫలము కల్యాణకరమని చెప్పి మరియొక ప్రక్క "నీవు అకల్యాణకరమైన కర్మలనే చేయుము" అని పరస్పర విరుద్ధమైన భావమును కలిగించు వాక్యములు చెప్పుటకు కారణమేమియని విచారించి అర్జునుడు శ్రీకృష్ణుని నిందించుచూ "ఓ కేశవా ! మరి నన్ను హింసతో కూడియున్న యుద్ధరూపమైన క్రూర కర్మల యందు ఎందులకు నియోగించుచున్నావు ? అని అనుటలో ఔచిత్యమేమున్నది ?

నిజముగా భగనంతుడు స్మార్తకర్మలతో పాటుగా జ్ఞానము యొక్క సముచ్చయము అందరకూ కల్యాణకరమే యని చెప్పియున్నట్లయితే, అర్జునుడు గూడ జ్ఞానకర్మల సముచ్చయమే కల్యాణకరమని తలంచి వుంటే అప్పుడు "ఓ కేశవా ! నన్ను యుద్ధరూపమైన యిటువంటి క్రూర కర్మల యందు ఎందులకు నియోగించుతున్నావు" అని అనుట ఎట్లు సమంజసమగును?

మరియు –

## 3.2. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే,
## తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయో ౭హమాప్నుయామ్

అనగా – భగవంతుడు సత్యమునే మాట్లాడుచున్నప్పటికి మందబుద్ధి కలిగి యున్న అర్జునుడు "నాకు భగవంతుని వాక్యములు పరస్పర విరుద్ధ భావములను ప్రకటించుచున్నట్లుగా తోచుతున్నవి" అని అలాంటి పరస్పర విరుద్ధ భావములను కలిగించు వాక్యముల ద్వారా మీరు నన్ను అనగా నా బుద్ధిని మోహింపజేయు చున్నారు" అని ప్రశ్నించడు...

నిజముగా మీరు నన్ను అనగా బుద్ధియందున్న మోహమును అనగా భ్రాంతిని తొలగించుటకే ప్రయత్నించుచున్నారు. మరి అలాంటప్పుడు నాకు భ్రాంతి ఎట్లు – ఎందులకు – కలుగజేయుదురు ? అందుకే మీరు నాకు భ్రాంతిని కలుగజేయుచున్నారని చెప్పుచున్నాడు.

మీరు వేరు వేరు క్షణ్మాధికారములు గలవారి ద్వారా చేయదగియున్న జ్ఞాన మరియు కర్మానుష్ఠానములు ఒకే పురుషుని ద్వారా చేయబడుట అసంభవమని తలంచియున్న యెడల ఆ రెంటిలో నుండి జ్ఞానబుద్ధియో లేక కర్మబుద్ధియో ఏది నాకు అనగా అర్జుననకు అతని శక్త్యానుసారముగా తగియున్నదో, దానిని నిశ్చయించి చెప్పండి, నేను జ్ఞానము ద్వారా ఉద్ధరించబడుదునో లేక కర్మలను ఆచరించుట ద్వారానో స్పష్టముగా చెప్పండి అని అడిగినాడు.

కర్మ నిష్ఠయందు అనగా కర్మలు చేయుట యందు గౌణరూపముగానైనా అనగా అప్రధానంగానైనా జ్ఞానము కూడా వుండాలి అని భగవంతుడు అర్జునునితో చెప్పి వుంటే యిప్పుడు అర్జునుడు భగవానుని ఆ రెండింటిలోను అనగా కర్మాచరణ మరియు జ్ఞాన సంపాదనలో ఏదిమంచిదో అది నాకు చెప్పండి అని ఎందుకు ప్రశ్నించును ?

ఏలయన ? జ్ఞానము మరియు కర్మలు ఈ రెండింటిలో ఏదో ఒక్కటి మాత్రమే నేను నీకు చెప్పెదను. రెండూ మాత్రము చెప్పను అని భగవంతుడు అర్జునునితో ఎచ్చటనూ చెప్పి యుండలేదు. అలా చెప్పి వున్నట్లయితే అలా రెండింటిని సంపాదించుట దుర్లభమని తలంచి ఆ రెండూ వద్దు ఆ రెంటిలో నాకు ఏది మంచిదో దానిని మాత్రమే చెప్పండి అని అడిగి వుండేవాడు.

అర్జునుని ప్రశ్నకు అనుకూలమైన సమాధానము శ్రీకృష్ణులవారు చెప్పుచున్నారు -

**3.3. లోకే ఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ,**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్.**

అనగా - అర్జునా ! ఈ మానవ లోకమునందు రెండు విధములగు పురుషులు వుండియున్నారు. ఒకరు శాస్త్రమునందు చెప్పబడిన కర్మలు మాత్రమే చేయు అధికారము గలవారు. రెండవవారు శాస్త్రమునందు చెప్పబడిన జ్ఞానమును పొందుటకు అధికారము కలిగినవారు. అటువంటి వారిలో మూడు వర్ణముల వారికి అనగా బ్రాహ్మణ, క్షత్రియ మరియు వైశ్య వర్ణముల వారికి రెండు విధములైన నిష్ఠాస్థితి అనగా కర్తవ్య తత్పరత చెప్పబడినది. ఇది అంతయు సర్వప్రథమముగా సృష్టి చేయుకాలమునందు ముందుగా ప్రజలను సృష్టించి వారి యొక్క లోక సంబంధమైన ఔన్నత్యము కొరకు మరియు వారికి మోక్షమును కలిగించుట కొరకు సాధన రూపమున వైదిక సంప్రదాయమును ఆవిష్కరించిన ఈశ్వరుడను నేనే.

ఆ రెండు విధములగు నిష్ఠ అనగా ఆచరణ క్రమము ఎట్టిదో చెప్పెద. వినుము.

ఎవరు ఆత్మ మరియు అనాత్మ పదార్థములకు సంబంధించిన విషయము నందు వివేకము వలన కలిగిన జ్ఞానమును పొందియున్నవారో, ఎవరు బ్రహ్మచర్య ఆశ్రమము నుండియే సంన్యాస ఆశ్రమమును స్వీకరించియున్నారో, అట్లే ఎవరు వేదాంత శాస్త్రముల యందు చెప్పబడిన విజ్ఞానమును గ్రహించుట ద్వారా ఆత్మతత్వమును గురించి నిశ్చయమైన అభిప్రాయము కలిగియున్నారో, ఎవరు పరమహంస అనగా నిత్యానిత్య వస్తు వివేకము కలిగి సంన్యసించి యున్నారో, ఎవరు సర్వకాల సర్వావస్థలయందును బ్రహ్మాభావముతోనే తన మనస్సును నింపుకొని యున్నారో, **అటువంటి సాంఖ్యయోగుల యొక్క నిష్ఠ జ్ఞానరూపమైన యోగము** అని చెప్పబడినది.

కర్మలు చేయువారి నిష్ఠ కర్మయోగమని చెప్పబడినది.

ఒకే పురుషుని ద్వారా ఒకే ప్రయోజనమును సిద్ధింపజేసుకొనుటకు జ్ఞానము మరియు కర్మ రెండూ ఒకేసారి అనుష్ఠింపవలయును అని తన అభిప్రాయముగా భగవంతుని ద్వారా

గీతయందు యింతకు పూర్వము ఎక్కడైనా చెప్పబడి వుంటే లేక వేద గ్రంథములందు ఎచ్చటనైనా చెప్పబడి వుంటే తనయందు శరణుజొచ్చిన అర్జునునికి భగవంతుడు జ్ఞాననిష్ఠ మరియు కర్మనిష్ఠ వేరువేరుగా భిన్నభిన్నమైన అధికారమున్న పురుషుల ద్వారానే అనుష్ఠింపదగియున్నవని ఎట్లు చెప్పును ?

ఒకవేళ మనము దీనిని భగవంతుని అభిప్రాయమని ఒప్పుకొన్నచో జ్ఞానము మరియు కర్మానుష్ఠానమును గురించి వినిన అర్జునుడు తనంతటతానుగానే రెంటినీ ఒకే కాలమందు అనుష్ఠించుటకు సిద్ధమగును గదా ? రెండూ అనగా జ్ఞానము మరియు కర్మలు వేరు వేరు పురుషుల ద్వారా వేరు వేరు విధములుగా అనుష్ఠింప వలయునన్నచో ఆ రెంటినీ వేరు వేరు పురుషులకు భగవంతుడే చెప్పి యుండెడివాడు గదా ! అలా చేయలేదు గనుక మరియు అలా రెంటినీ కలిపి ఒకనికే ఒకే కాలమందు చేయవలసి యుండగా చేయుట సంభవము కాదని చెప్పి యుండుట చేత ఆయన చెప్పినది ప్రామాణికము కాదని, రాగద్వేషయుక్తమైనదని చెప్పవలసి వచ్చును. అలా చెప్పుట అనుచితమగును గదా ?

అందుచేత ఏ **విధముగా జూచినా జ్ఞానము మరియు కర్మల యొక్క సముచ్చయము కుదరదు.**

కర్మల కంటే జ్ఞానము శ్రేష్ఠమైనదని అర్జునుడు చెప్పిన మాట స్వతఃసిద్ధమైన సత్యము. ఏలయన ? అర్జునుడు చెప్పిన ఆ మాటను భగవంతుడు నిరాకరించలేదు.

ఆ జ్ఞాననిష్ఠానుష్ఠానము చేయు అధికారము ఒక్క సంన్యాసులకు మాత్రమే ఉన్నది. అట్లేలయన ? రెండు విధములగు నిష్ఠానుష్ఠానములు భిన్నమైన పురుషుల ద్వారా వేరువేరుగా చేయవలసి యున్నదని చెప్పబడియున్నది. ఆ కారణముగా భగవంతునికి గూడ అదే సమ్మతము.

"బంధమునకు కారణరూపములైన కర్మల యందు భగవంతుడు నన్ను నియోగించు చున్నాడు" అని దుఃఖించినవాడై మరియు "నేను అటువంటి కర్మలు చేయను" అని ధనుర్బాణము లను క్రింద పారవైచిన అర్జునుని జూచి, "న కర్మణామనారంభాత్ యితి" అనగా కర్మలు చేయుట ఆరంభించకనే అని భగవంతుడు వుపదేశింపనారంభించినాడు –

లేక జ్ఞాననిష్ఠకు మరియు కర్మనిష్ఠకు పరస్పర విరోధము వున్న కారణము వలన ఒక పురుషుని ద్వారా ఒకే కాలమందు రెంటి యొక్క అనుష్ఠానము చేయబడ జాలదు గావున. అందుచేత ఒకదానితో మరియొక దానిని ముడిపెట్టక అవి రెండూ వేరు వేరు విధములుగా మోక్షమునకు సాధనములగునని శంకించి –

ఆ విషయమును స్పష్టముగా – వివరముగా – చెప్పదలంచినవాడై జాననిష్ఠ ప్రాప్తికి సాధనరూపముగా వుపయోగపడునదై యున్నందున కర్మనిష్ఠ మోక్షరూపమైన పురుషార్థమును పొందుటకు సాధనమగుననియు, **స్వతంత్రముగా కర్మ నిష్ఠ మోక్ష ప్రాప్తికి సాధనము కాజాలదనియు** మరియు కర్మనిష్ఠయను ఉపాయము అనగా సాధనము ద్వారా సిద్ధించునటువంటి జ్ఞాననిష్ఠ యితర సాధనముల సహాయము లేకుండగనే తనంతట తానుగానే మోక్షమునకు సాధనమగునని అభిప్రాయపడి భగవంతుడు యిలా అన్నాడు –

**3.4. న కర్మణా మనారంభాన్నైష్కర్మ్యం పురుషో ఽశ్నుతే,**
**న చ సంన్యాసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి.**

అనగా - కర్మలు చేయకనే అనగా జన్మ జన్మాంతరములందు చేయబడినటువంటి మరియు సంచిత కర్మ ఫలములను నశింపజేయుటకును తద్వారా అంతఃకరణశుద్ధికి కారణమగుచున్న యజ్ఞయాగాది కర్మలు చేయక పూర్వ పూర్వ జన్మలయందు చేసిన పాపకర్మల ఫలములు నశించనంతవరకు మానవుని అంతఃకరణమునందు దాగియున్న జ్ఞానము ప్రకాశించదు. ఇది స్మృతి చెప్పిన వాక్యము. దానిననుసరించి చూచిన కర్మలు అనగా **యజ్ఞ యాగాది కర్మలు అంతఃకరణ శుద్ధికి కారణమగుట ద్వారా జ్ఞాననిష్ఠకు సాధనములగుచున్నవి.** (చూ. మహా. భార. శాంతి ప. 204/8) "జ్ఞానముత్పద్యతే పుంసాంక్షయాత్పాపస్యకర్మణః."

ఆ యజ్ఞాది కర్మలు చేయుట ఆరంభించకనే .....

మానవుడు నిష్కామ భావమును అనగా కర్మలు లేని స్థితిని అనగా నిష్క్రియ అనగా ఎటువంటి కర్మలు లేనటువంటి ఆత్మతత్త్వమునందు నిలచి వుండుటయను జ్ఞానయోగము వలన కలుగు పరమశాంతి రూపమైన నిష్ఠను పొందజాలడు.

**పూర్వపక్షము** - కర్మలు చేయుట ఆరంభించకుండా వున్నట్లయితే నిష్కర్మ బుద్ధితో కర్మలు చేయుట అనునది కుదరదుగదా ? అను వాక్యము వలన కలుగు భావమేమనగా దానికి వ్యతిరేకముగా అనగా కర్మలు చేస్తూ వుంటేనే మానవుడు నిష్కర్మ భావముతో కర్మలు చేయుట నేర్చుకుంటాడు. అంతేగాని కర్మలు అసలు చేయుట ఆరంభించకుండానే నిష్కామపూర్వకమైన కర్మత్వమును పొందజాలడా ?

**సమాధానము** - అలాకాదు. ఏలయన ? కర్మలు చేయుట ఆరంభించుటయే నిష్కర్మత్వమును పొందుటకు మంచి వుపాయము. మరియు వుపాయము లేకుండా ఉపేయము ప్రాప్తించజాలదు. ఇది సర్వసిద్ధమైన విషయమే.

నిష్కర్మతారూపమైన జ్ఞానయోగమును పొందుటకు వుపాయము కర్మయోగమే. ఈ మాట శ్రుతులయందును యిచ్చట ఈ గీతయందును గూడ చెప్పబడి యున్నది.

శ్రుతి యందు ప్రస్తుత జ్ఞేయరూపమైన ఆత్మలోకమును తెలుసుకొను వుపాయము (మార్గము, విధానము) చెప్పుచూ "ఆ ఆత్మను బ్రాహ్మణుడు వేదాధ్యయనము మరియు యజ్ఞము ద్వారా తెలుసుకొనగోరును." యిత్యాది వాక్యముల ద్వారా కర్మయోగమును జ్ఞానయోగమును పొందుటకు సాధనముగా, వుపాయముగా చెప్పియున్నారు.

మరియు యిచ్చట ఈ గీతాశాస్త్రమునందు గూడ "ఓ మహాబాహో ! కర్మయోగము లేకుండ సంన్యసించుట లేక సంన్యాస స్థితిని పొందుట చాలా కఠినము. యోగులైనవారు ప్రాపంచిక వస్తువుల యందలి ఆసక్తిని వదలి అంతఃకరణ శుద్ధి కొరకు (అనగా అంతఃకరణము ప్రాపంచిక వస్తువులను కల్పించుట మానుట అంతఃకరణశుద్ధి) కర్మలు చేయుచుందురు.

యజ్ఞము, దానము, తపము మొదలగు కర్మలు తెలివిగలవారిని పవిత్రులుగా చేస్తాయి. ఈ దృష్టితో యిక ముందు యింకా కొన్ని విషయములు చెప్పబడును.

ఇచ్చట ఒక శంక కలుగవచ్చును. అదేమనగా – "సర్వభూతములకు అభయదానము చేసి సంన్యాసమును గ్రహించవలయును" మొదలగు వాక్యముల ద్వారా కర్తవ్యకర్మలను త్యజించుట ద్వారా గూడ నిష్కర్మత్వము చెప్పబడినది. మరియు లోకము నందు గూడ కర్మలు చేయుట ఆరంభించకుండానే నిష్కర్మత్వము ప్రాప్తించుట అందరకు తెలిసిన విషయమే. అందుచే నిష్కర్మత్వమును కోరుకొనువానికి కర్మలను ఆరంభించుట వలన కలుగు లాభమేమి కలదు ? అటుపైన –

కేవలము సంన్యాసము వలన అనగా జ్ఞానము లేకుండ కేవలము కర్మ పరిత్యాగము ద్వారా మానవుడు నిష్కర్మతారూపమైన ఫలమును (సిద్ధిని) అనగా జ్ఞానయోగము ద్వారా లభించు ముక్తస్థితిని పొందలేడు.

జ్ఞానము లేకుండా కేవలము కర్మసంన్యాసము ద్వారా మానవుడు నిష్కర్మత్వ రూపమైన సిద్ధిని ఎందులకు పొందజాలడు ? ఇందులకు కారణము తెలుసుకొనవలయునన్న కోరిక కలిగినందున చెప్పుచున్నారు.

**3.5. న హి కశ్చిత్క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్,**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః.**

అనగా – ఈ లోకమునందలి ఏ మానవుడు ఎన్నడూ ఒక్క క్షణం కూడా కర్మలు చేయకుండా వుండలేడు. ఏలయన ? ప్రాణులన్నియు ప్రకృతిచే కల్పించబడిన సత్వ, రజ మరియు తమస్సు అను ఈ మూడు గుణముల ద్వారా ప్రేరేపించబడినవై, వివశులై అనగా కర్మలు చేయకుండా బ్రతుకలేనివై తప్పనిసరిగా కర్మలు చేయుటయందు నిమగ్నమై యుండును.

ఇచ్చట 'అన్ని ప్రాణులు' అను శబ్దముతో పాటు "అజ్ఞానముతో కూడియున్న" అను శబ్దమును గూడ జోడించవలయును. అనగా "అజ్ఞానముతో కూడియున్న ప్రాణులన్నియు" అని చదువుకొనవలయును. ఏలయన ? ఇంక కొంచము ముందునకు వెళ్ళిన తరువాత "ఎవడు అనగా ఏ ప్రాణి గుణముల నుండి వేరు చేయబడజాలదో" అను పదముచే జ్ఞాన సంపన్నులైనవారిని ఆ నియమము నుండి వేరుచేయవలయును. అందువలన **అజ్ఞానముతో కూడియున్న వారి కొరకే కర్మయోగము చెప్పబడినది. జ్ఞానసంపన్నులైన మహాత్ముల కొరకు కాదు.**

ఏలయన ? ఏ **మహాత్ములు ప్రకృతిజన్యములైన గుణములచేత ప్రేరేపించబడరో అటువంటి జ్ఞానులయందు సహజముగానే కర్మ (క్రియా) భావము లేకుండుట వలన వారియందు కర్మయోగము కుదరదు.**

అలాగే "వేదవినాశినమ్" అను శ్లోకము యొక్క తాత్పర్యము చెప్పునప్పుడు పై విషయము చాలా విపులముగా చెప్పబడినది. (చూ. గీత. 2–21)

కొందరు ఆత్మజ్ఞాన సంపన్నులు కాకపోయినప్పటికీ శాస్త్రము ద్వారా విధించబడిన కర్మలు చేయరో (అతడు) వారు అలా చేయకుండుట మంచిది కాదు.

*అదెట్లన ? –*

**3.6. కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్,**
**ఇంద్రియార్థాన్విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే.**

అనగా – ఏ మానవులు చేతులు, కాళ్ళు మొదలగు కర్మేంద్రియములను కర్మలు చేయకుండా నిలిపి వుంచి యింద్రియముల ద్వారా లభించవలసిన భోగములను మానసిక చింతన ద్వారా అనుభవించుచుందురో అటువంటి విమూఢాత్ములు అనగా విషయములయందు మోహము కలిగియున్న మనస్సు గలవారు మిథ్యాచారులు, మోసగాండ్రు మరియు పాపము చేయువారు అని చెప్పబడుదురు.

**3.7. యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతే ఽర్జున,**
**కర్మేంద్రియైః కర్మయోగ మసక్తః స విశిష్యతే.**

అనగా – కాని అర్జునా ! కర్మాధికారము కలిగియున్న అజ్ఞాని జ్ఞానేంద్రియములను మనస్సు ద్వారా విషయముల మీదికి వెళ్ళనివ్వక నిలిపి వుంచి వాక్కు, చేతులు, యింద్రియములు మొదలగు కర్మేంద్రియముల ద్వారా ఆచరించుచుండునో ఆతడు... మరియింక ఎటువంటి కర్మలు ఆచరించుచుండును ? అన్నచో –

మనసా ఎటువంటి విషయములందును ఆసక్తిలేనివాడై కర్మయోగమును ఆచరించుచుండునో ఆతడు, ఆనగా ఆ కర్మయోగి యితరుల కంటే అనగా ఆ కపటాచరణము గలవారి కంటే శ్రేష్ఠుడనబడును.

*అలా అనబడుటకు కారణమేమన ? –*

**3.8. నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః,**
**శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః**

అనగా – ఓ అర్జునా ! శ్రుతియందు ఏ కర్మలు ఎట్లు ఫలమును పొందుటకు చెప్పబడి యుండలేదో అటువంటి ఏ కర్మ చేయుటకు ఎవడు అధికారమును కలిగి యున్నాడో ఆతనికి అది తప్పనిసరిగా ఆచరించుటకు విధించిన కర్మ అనబడును. అలా నియత అనగా విధించబడిన నిత్య కర్మలను నీవు చేయుము. ఏలయన ? కర్మలు చేయకుండా వుండుట కంటే విధించబడిన కర్మలు చేయుట పరిణామ దశయందు శ్రేష్ఠము.

ఏలయన ? ఎటువంటి కర్మలు చేయక వున్నట్లయితే నీ శరీరయాత్ర అనగా పోషణ గూడ జరుగదు. అందువలన కర్మలు చేయుట యందును మరియు చేయకుండుట యందును గల భేదము ప్రపంచమునందు ప్రత్యక్షముగా తెలియబడుచునే యున్నది.

బంధహేతువులగుట వలన కర్మలు చేయరాదని నీవు తలంచుచున్నట్లయితే అట్లు తలంచుట పొరపాటు.

అదెట్లన ?

**3.9. యజ్ఞార్థాత్కర్మణో౽న్యత్ర లోకో౽యం కర్మబంధనః,**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్త సంగః సమాచర.**

అనగా – "యజ్ఞమే విష్ణువు." శ్రుతియందలి ఈ వాక్యమునననుసరించి యజ్ఞమనగా ఈశ్వరుడే. (సర్వము తానై యున్నవాడు ఈశ్వరుడు). అందుచేత ఏ కర్మ చేయబడినా అది యజ్ఞము కొరకు చేయబడిన కర్మయే. అటువంటి ఈశ్వరార్థము అనగా భగవంతుని కొరకు చేయబడు కర్మలను వదలి చేయబడు యితర కర్మలు చేయు కర్మాధికారియైన మానవుడు కర్మ బంధములందు చిక్కువడును. **కాని ఈశ్వరుని కొరకు చేయబడు కర్మల వలన మానవుడు కర్మ బంధమునందు చిక్కుబడడు.** అందుచేత ఓ కౌంతేయ అనగా కుంతీ పుత్రా ! నీవు కర్మల వలన కలుగు ఫలమునందు ఆసక్తిని ఆ కర్మ వలన కలుగు ఫలమును అనుభవించవలయునను కోరికను వదలి ఈశ్వరుని కొరకు చక్కగా ఆసక్తి కలిగి కర్మలు చేయుము.

ఇంక ముందు చెప్పబోవుచున్న కారణముల వలన గూడ **అధికారియైనవాడు కర్మలు చేయవలసినదే** –

**3.10. సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః,**
**అనేన ప్రసవిష్యధ్వమేష వో౽స్త్విష్టకామధుక్.**

అనగా – సృష్టి యొక్క ఆరంభకాలమునందు యజ్ఞంతో సహా ప్రజలను అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య – ఈ మూడు వర్ణముల వారిని సృష్టించి ఈ జగత్తును రచించినట్టి ప్రజాపతి "ఈ యజ్ఞముల వలన మీరందరూ ప్రసవము, ఉత్పత్తి అనగా సర్వవిధములైన అభివృద్ధిని పొందండి" అని చెప్పినాడు. **ఈ యజ్ఞములు మీకు యిష్టార్థములను** అనగా మీరు కోరుకొను ఫలరూపములైన సర్వ పదార్థములను మరియు ఆ పదార్థముల భోగవలన కలుగు సర్వ విధ సుఖములను యిచ్చునవై యున్నవి.

అదెట్లన ? –

**3.11. దేవాన్భావయతానేన తే దేవా భావయంతు వః,**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ.**

అనగా – మీరు ఈ యజ్ఞముల ద్వారా ఇంద్రాది దేవతలను సంపన్నవంతులుగా చేయండి. ఆ దేవతలు వృష్టి అనగా వర్షము మొదలగు వాటి ద్వారా మిమ్ములను ఐశ్వర్యవంతులుగా చేయుదురు. ఈ విధముగా దేవతలు, మీరు పరస్పర సహకార సహాయముల

ద్వారా ఒకరినొకరు ఐశ్వర్యవంతులుగా అనగా సర్వవిధ ఔన్నత్యము గలవారుగా చేసుకొంటూ మీరు జ్ఞానమును పొందుట ద్వారా మోక్ష రూపమైన పరమ శ్రేయమును పొందగలరు. లేక స్వర్గరూపమైన పరమశ్రేయస్సును పొందగలరు.

ఇంక మరోమాట యేమనగా –

**3.12. ఇష్టాన్భోగాన్హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః,**
**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః.**

అనగా – మీచేత చేయబడుచున్న యజ్ఞముల ద్వారా ఔన్నత్యమును పొందినటువంటి దేవతలు మీకు మీ చేత చేయబడిన యజ్ఞ ఫలములుగా **స్త్రీలను అనగా భార్యలను, పశువులను, సంతానమును మొదలగు మీరు కోరిన భోగ్యపదార్థములన్నింటిని యిచ్చెదరు.**

ఆ దేవతల ద్వారా ప్రదానము చేయబడిన భోగ్య పదార్థములను తిరిగి వారికి యివ్వకుండా అనగా వారి నుండి పుచ్చుకొన్న భోగ్య పదార్థరూపమైన ఋణమును తీర్చకుండా మీలో ఎవ్వరు వాటిని తమ స్వంత వస్తువులుగా తలంచి స్వసుఖార్థం అనుభవించెదరో అనగా తన శరీరములను, ఇంద్రియములను మాత్రమే తృప్తి పరచెదరో వారు ఆ దేవతల స్వంతము అనగా దేవతల సొంత సొమ్మును అపహరించిన దొంగలగుదురు.

కాని ఎవ్వరు –

**3.13. యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః,**
**భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్.**

అనగా – యజ్ఞ శిష్టము అనగా యజ్ఞము పూర్తిగా ముగిసిన తరువాత మిగిలియున్నట్టి అన్నమును భుజించు పురుషులు శ్రేష్ఠులు.

అనగా దేవయజ్ఞములు అనగా దేవతలకు సమర్పించు సమారాధనలు మొదలగునవి పూర్తిగా నిర్వహించి తదుపరి అనగా సమర్పణ కార్యము పూర్తి అయిన తరువాత మిగిలినటువంటి అమృతమనబడు అన్నమును భుజించు స్వభావము కలిగియున్న పురుషులందరూ అన్ని విధములైన పాపముల నుండి అనగా గృహస్థ ధర్మమునందు చేయబడు పిండి విసరుట, పొయ్యి రాజేసి అన్నాదులు వండుట మొదలగు పంచ పాపముల నుండి మరియు ప్రమాదము అనగా తెలియకుండా జరుగు హింసల వలన కలుగు యితర పాపముల నుండి గూడ ముక్తిని పొందెదరు.

మరియు ఉదరపరాయణులు అనగా కేవలము తనకొరకే అన్నాదులను వండుకొని తింటూ వుంటారో వారు మహా పాపులు మరియు పాపమునే భుజించువారనబడుదురు.

అందువలన కూడా కర్మాధికారులకు కర్మలు చేయవలసి యుండును. ఏలయన ? **కర్మలు జగత్తు అనబడే చక్రము తిరుగుచుండుటకు కారణమై యున్నవి.**

అదెట్లన ? ఇప్పుడు చెప్పబడుచున్నది -

**3.14. అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః,**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః.**

అనగా - **భక్షించబడిన అన్నము రక్తము మరియు వీర్యము రూపముగా పరిణమించగా దానినుండి ప్రత్యక్షముగనే ప్రాణులన్నియు పుట్టుచున్నవి.** వర్షము వలన అన్నోత్పత్తి జరుగుచున్నది. ఆ వర్షము యజ్ఞము వలన కురియుచున్నది.

విధిపూర్వకముగా అనగా వేదాది శాస్త్ర గ్రంథములందు చెప్పబడినట్లుగా అగ్ని యందు అర్పించబడిన ఆహూతులు సూర్యునియందు ఘనీభవించుచున్నవి. ఆ సూర్యుని వలన వర్షము కురియుచున్నది. వర్షము వలన అన్నము కలుగుచున్నది. ఆ అన్నము నుండి ప్రాణులు (ప్రజలు) పుట్టుచున్నవి. చూ. మనుస్మృతి 3.76.

**"అగ్నౌ ప్రాస్తాహుతిః సమ్యగాతిత్యముపతిష్టతే,**
**అదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాః.** మనుస్మృతి 3.76 ఇతి స్మృతేః

ఋత్వికుడు మరియు యజమాని యిరువురు కలసి చేయు వ్యాపారమే కర్మ. ఆ కర్మనుండియే అపూర్వ రూపము కలిగిన యజ్ఞము ఉద్భవించుచున్నది.

**3.15. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్,**
**తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్.**

అనగా - క్రియారూపమైన కర్మను నీవు వేదరూపమైన బ్రహ్మము నుండి ఉద్భవించి నదిగా ఎరుగుము. అనగా **కర్మోత్పత్తికి కారణము వేదము.** ఆ విధముగా ఎరుంగుము. మరియు వేద రూపమైన బ్రహ్మ అక్షరము అనగా అ-క్షరము. అనగా నాశములేని పదార్థము నుండి వుద్భవించినది. అనగా అవినాశీ అనగా నాశము లేని పదార్ధము నుండి వుద్భవించినది. అనగా అవినాశీ అనగా **నాశము లేనటువంటి పరబ్రహ్మ పరమాత్మ వేదోత్పత్తికి కారణము.**

వేదరూపమైన బ్రహ్మపదార్థము సాక్షాత్తుగా పరమాత్మ అనబడు అక్షరము నుండి పురుషుని ఉచ్ఛ్వాసనిశ్వాసముల వలె వుద్భవించినది. అందువలన అది సర్వార్థములను ప్రకాశించునది అగుట వలన సర్వగతము అనగా సర్వమునందు వ్యాపించి వున్నదై వున్నది.

మరియు యజ్ఞవిధియందు అనగా యజ్ఞమును నిర్వహించు పద్ధతియందు వేదప్రాధాన్యము కలిగి యుండుట వలన ఆ బ్రహ్మతత్వము సర్వగతమై యుండియు సర్వకాలసర్వావస్థలయందును యజ్ఞము నందు ప్రతిష్ఠింపబడియున్నది.

**3.16. ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః,**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి.**

అనగా - ఈ లోకమునందు ఏ మానవుడు కర్మాధికారియై వుండి కూడ ఈ విధముగా ఈశ్వరుని ద్వారా వేదము మరియు ప్రయత్నపూర్వకముగా త్రిప్పబడుచున్న ఈ

జగత్చక్రముననుసరించి (వేదాధ్యయనము - యజ్ఞయాగాది) కర్మలు చెయ్యడో ఓ పార్థా ! ఆ మానవుడు పాపముతో కూడియున్న జీవితము కలిగియుండి మరియు ఇంద్రియారామా అనగా యింద్రియముల ద్వారా విషయములయందు మునిగి తేలుచూ వ్యర్థముగా జీవించును. అనగా అటువంటి పాపాత్ముడు జీవించుట కూడా వ్యర్థమే అగుచున్నది.

*అందువలన ఈ ప్రకరణమునకు తాత్పర్యమేమన ?*

**అజ్ఞానియగు అధికారికి కర్మలు అవశ్యము చేయవలసియుండును.**

అనాత్మజ్ఞ అనగా ఆత్మతత్వమును ఎరుంగనటువంటి అధికారియైన పురుషునకు ఆత్మజ్ఞానమును పొందుటకు అవసరమైన యోగ్యత కలుగనంతవరకు జ్ఞాననిష్ఠను పొందుటకొరకు కర్మయోగానుష్ఠానము అవశ్యముగ చేయవలసి యుండును. ఇది **"న కర్మణామనారంభాత్"** (గీత 3.4) మొదలు **"శరీరయాత్రాపి చ తే న ప్రసిధ్యేదకర్మణః"** (గీత 3.8) వరకు గల శ్లోకములందు ప్రతిపాదించి .....

**"యజ్ఞార్థాత్కర్మణో ऽన్యత్ర"** మొదలు (గీత 3.9) **"మోఘం పార్థ స జీవతి"** (గీత 3.16) వరకు చెప్పబడిన గ్రంథము ద్వారా కూడా **ఆత్మజ్ఞానము లేనటువంటి కర్మాధికారి కొరకు కర్మానుష్ఠానము చేయుట యందు అనేకములైన కారణములు ప్రసంగానుకూలముగా చెప్పబడినవి** మరియు ఆ కర్మలు చేయకుండిన కలుగు అనేక దోషములు గూడ చెప్పబడినవి.

నిజంగా అలా అయితే త్రిప్పబడిన సృష్టి చక్రముననుసరించి అందరూ తమ జీవితాలను అనగా జన్మమరణములతోను, సుఖదుఃఖములతోను కూడియున్న జీవితాలను అనుభవిస్తూ వుండవలసిందేనా ? లేక యింతకు పూర్వము చెప్పబడిన కర్మయోగానుష్ఠాన రూపమైన వుపాయము ద్వారా లభించునటువంటిదియు మరియు ఆత్మతత్వమును ఎరింగిన సాంఖ్య యోగుల ద్వారా సేవించబడిన జ్ఞానయోగము వలన లబ్ధమగు జ్ఞాననిష్ఠను సంపాదించజాలని అనాత్మజ్ఞులు ఆ విధంగా అనగా జన్మ-మరణ చక్రమునందు తగుల్కొని పైకిపోతూ క్రిందికి వస్తూ వుండవలసినదేనా ? అర్జునుడు యిలా అడుగవచ్చునని భగవానుడు తన మనస్సునందు శంకించినవాడై ఇలా అన్నాడు -

లేక భగవంతుడు శాస్త్రార్థమును చక్కగా భోదించుటకై "అతి ప్రసిద్ధమగు ఆత్మ ఏది కలదో దానిని చక్కగా గుర్తించినందున మిధ్యాజ్ఞానము నశించిన మహాత్ములైన బ్రాహ్మణులు అజ్ఞానుల ద్వారా అవశ్యముగా చేయబడుచున్న దారాపుత్రాది పోషణ త్రయమును తొలగించుకొనినవారై కేవలము శరీర పోషణార్థము భిక్షాటనము చేయుచుందురు. అటువంటి వారికి ఆ జ్ఞాననిష్ఠ కంటే వేరుగా మరే యితర కర్తవ్యము వుండదు. చూ. బృ.ఉ. 3-5-1.

ఇటువంటి శ్రుతి తాత్పర్యమును ఈ గీతాశాస్త్రము ద్వారా ప్రతిపాదించుట యందు అభిరుచికలవారై ఆ శ్రుత్యర్థము వచ్చునట్లుగా చెప్పుచున్నారు.

**3.17. యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మ తృప్తశ్చ మానవః,**
**ఆత్మన్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే.**

అనగా – ఎవడు కేవలము ఆత్మయందే ఆనందమును అనుభవించుచుండునో అనగా ఎవనికి ఆత్మయందే ప్రేమ కలదో, విషయములయందు ప్రేమ లేదో, అనగా సంన్యసించియున్న ఏ మానవుడు ఆత్మయందే తృప్తిపొందునో, ఎవనికి అన్నరసాదుల పట్ల తృప్తి అనగా ఆసక్తిలేదో మరియు ఆత్మ భావముతోనే సంతుష్టుడై యున్నాడో – **బాహ్యావిషయములందు అందరూ లాభవృత్తిని కలిగి యుంటారు. కాని ఆత్మజ్ఞానియైనవాడు ఆ బాహ్య విషయములందు ఎటువంటి లాభమును చూడక ఆత్మయందే సంతుష్టుడై వుండును. అనగా అన్ని విషయముల వైపు నుండి తృష్ణారహితుడై యుండును.** అటువంటి ఆత్మజ్ఞాని అయిన వానికి ఎటువంటి కర్తవ్యములు వుండవు. అటువంటి వానినే **ఆత్మజ్ఞాన నిష్ఠ సాంఖ్యయోగి** అని చెప్పుదురు.

అట్లేలయన ?

**3.18. నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన,**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః**

అనగా – **ఆ పరమాత్మ తత్వమును గుర్తించిన పురుషునకు ఈ లోకము నందు కర్మలు చేయుట వలన కలుగు ప్రయోజనము యిసుమంతయును లేదు, వుండదు.**

అయితే మరి ఎటువంటి కర్మలు చేయకుండా వున్నందు వలన ఆతనికి ప్రత్యవాయ రూపమైన అనర్థము ప్రాప్తించును గదా అని అనవచ్చును. కాని అట్లనుట సరికాదు. ఏలయన? ఎటువంటి కర్మలు చేయనప్పటికి ఆ కర్మలు చేయనటువంటి పురుషులకు ఎటువంటి ప్రత్యవాయ ప్రతిరూపము లేక ఆత్మహానికర రూపమైన అనర్థముగాని ప్రాప్తించదు. కారణమేమన? బ్రహ్మ మొదలు స్థావర పర్యంతము అన్ని ప్రాణులయందును ఆతనికి కొంచము కూడా లాభహాని జరుగదు. అనగా అర్థవ్యపాశ్రయము కలుగదు.

అర్థవ్యపాశ్రయమనగా – ఏదో ఒక ఫలితము కొరకు (ఏ ప్రాణి విశేషమైననూ సరే) చేయబడు క్రియ వలన కలుగు ఆశ్రయము. అందువలన ఆత్మజ్ఞానియైన ఏ పురుషునకైనను ఏదో ప్రాణి విశేషమును ఆధారముగ జేసుకొని ఏటువంటి ప్రయోజనమును పొందనవసరము లేదు. ఏలయనగా దానికొరకై అతనికి చేయవలసిన క్రియ అంటూ ఏదీ లేదు గావున.

కాని నీవు యీయన్నింటిని చక్కగా తెలుసుకొనగలిగిన స్థితియందు లేవు గావున.

నీ స్థితి ఆ విధముగా వున్నది గావున –

**3.19. తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర,**
**అసక్తో హ్యాచరన్కర్మ పరమాప్నోతి పూరుషః.**

అనగా – నీవు అజ్ఞానస్థితి యందు వున్నావు గావున ఆసక్తిలేనివాడవై నీ కర్తవ్యమును అనగా నిత్యనైమిత్తిక కర్మలను చక్కగా ఆచరించుము. అట్లేలయన ? ...... అనాసక్తుడై

కర్మలు చేయువాడు అనగా ఈశ్వరుని కొరకై కర్మలు చేయుచున్న పురుషుడు అంతఃకరణ శుద్ధియగుట ద్వారా చివరకు మోక్షరూపమైన పరమపదమును పొందును.

అందులకు మరియొక కారణము కలదు -

**3.20. కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః,
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి.**

అనగా - ఆ కారణమేమనగా - ఇంతకు పూర్వము జనకుడు, అశ్వపతి మొదలగు విద్వాంసులైన క్షత్రియులు కర్మలనాచరించుచూ మోక్షస్థితిని పొందుటకు ప్రయత్నించియున్నారు.

ఇచ్చట యీ శ్లోకమునకు యీ క్రింది విధముగా వ్యాఖ్యానము చెప్పవలసి యున్నది.

ఆ జనకాదులు యదార్థమైన జ్ఞానమును పొందియే యున్నచో వారు తమ ప్రారబ్ధము అనగా పూర్వపూర్వ జన్మల యందు చేసియున్న కర్మల ఫలములను అనుభవించుట. మిగిలియుండుట వలన లోక సంగ్రహార్థము కర్మలు చేయుచుండియు అనగా సన్యసించకనే పరమ సిద్ధిని అనగా మోక్షమును పొందియుండిరి.

ఒకవేళ ఆ జనకాదులు యదార్థ జ్ఞానమును పొంది యుండకయున్నచో వారు తమ అంతఃకరణమును శుద్ధిజేయు సాధనరూపమైన కర్మల ద్వారా క్రమశః అనగా సత్కర్మలు చేయగా చేయగా కలిగిన జ్ఞానము (ద్వారా) కారణముగా పరమసిద్ధిని పొంది యుండిరి.

ఆత్మతత్వమును ఎరుగనటువంటి జనకాదులు వారు పూర్వ పూర్వ జన్మలయందు చేసి యుండిన కర్తవ్య కర్మల ఫలముగా తుదకు ఆత్మ సిద్ధిని పొందగలిగిరనియు, అందుచేత యితరులైన ఆత్మజ్ఞానము కలిగిన పురుషులందరూ నిత్యనైమిత్తిక కర్మలు తప్పక చేయవలసియే యుండునని నీవు తలచుచున్నచో -

నీవు గూడ నీ ప్రారబ్ధకర్మ అనగా పూర్వ పూర్వ జన్మల యందు చేయబడిన కర్మల ఫలమును అనుభవించుటకు ఆధీనుడవై యున్నావు. అందుచేత నీవు కూడా జనకాదుల వలెనే లోక సంగ్రహబుద్ధిని దృష్టియందు వుంచుకొనియైనను (లోక సంగ్రహబుద్ధి అనగా లోకము నందలి సామాన్యమైన మానవులు తప్పుత్రోవను నడువ కుండా వుంచుటకుగాను తాను జ్ఞానియైయున్నను వారికి మంచి మార్గము చూపుట కొరకు కర్మలు చేయచుండుట) అందుచేత ఆ లోక సంగ్రహరూపమైన ప్రయోజనమును దృష్టియందు వుంచుకొనియైనను నీకు కర్మలు చేయవలసి యున్నది.

ఈ లోక సగ్రహ కర్మలు ఎటువంటివాడు చేయవలసి యున్నది ? మరియు అట్టి కర్మలు ఎందుకు చేయవలయును ? అన్నచో చెప్పుచున్నారు -

**3.21. యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః,
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే.**

అనగా - శ్రేష్ఠులైన అనగా తత్వజ్ఞానము కలిగియున్న మానవులు ఏ యే కర్మలు

చేయుచుందురో యితరులు అనగా అజ్ఞానులు గూడ వారిని అనగా జ్ఞానులను అనుసరించుచూ ఆ యా కర్మలే చేయుదురు.

మరియు జ్ఞానులైన శ్రేష్ఠ పురుషులు ఏ యే లౌకిక లేక వైదిక సంప్రదాయములను ప్రామాణికములుగా ఎంచి కర్మలు చేయుచుందురో అజ్ఞానులు గూడ తమకు తెలియకపోయినా అట్లే చేయుచుందురు.

ఈ లోక సంగ్రహ కర్తవ్య కర్మలను గురించి నీకు (అర్జునునకు) ఏమైనా సందేహములు వుండి వుంటే నన్ను నీవు చూడవచ్చును కదా ? అనగా నేను అనగా శ్రీకృష్ణుడు చేయు కర్మలన్నియు లోకసంగ్రహార్థము చేయు కర్మలేయని భావము -

**3.22. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,**
**నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.**

అనగా - ఓ పార్థా ! మూడు లోకములందును నాకు ఎటువంటి కర్తవ్యములు అనగా చేయవలసిన కర్మలు ఏమియూ లేవు. అనగా నేను ఎటువంటి కర్మలు చేయనవసరము లేదు. ఏలయన ? నాకు ఎటువంటి అప్రాప్యమైన అనగా లభించనటువంటి వస్తువులను పొందవలసిన అవసరము లేదు. అయినప్పటికి నేను లోక కల్యాణార్థము కర్మలు ఆచరించుచునే యున్నాను.

**3.23. యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః,**
**మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః.**

అనగా - నేను గనుక సోమరితనము లేక అసావధాన చిత్తుడనై కర్మలు చేయకుండినచో ఓ పార్థా ! ఈ లోకమునందలి మనుష్యులందరూ అన్ని విధముల శ్రేష్ఠుడనైన నా మార్గమునే అనుసరించి వుండెడివారు.

అలా జరిగితే కలుగు దోషమేమనగా - చెప్పెదను వినుము -

**3.24. ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్,**
**సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః.**

అనగా - నేను ఎటువంటి కర్మలు చేయకుండినచో లోకస్థితి కొరకు చేయబడు సర్వకర్మలు లేకుండా పోవును. అప్పుడు ఈ లోకమంతయు నశించిపోవును. అప్పుడు నేను లోకనాశముజేసిన వాడనగుదును. అందువలన అనగా ఆ విధముగా ప్రజలందరినీ నశింపజేసిన వాడనగుదును. అనగా ప్రజలందరనూ ఉద్ధరించవలసియున్న నేను వారినందరినీ నశింపజేసిన వాడనగుదును. ఈ విధమైనదంతయు నా వంటి ఈశ్వరస్వరూపునికి తగని పని.

అలాగే నావలెనే నీవు కూడా లేక యితరులు కూడా కృతార్థబుద్ధి గలవారై యున్న వారు గూడ తనకు ఎటువంటి కర్తవ్య కర్మలు లేకుండిననూ కేవలము యితరులు అనగా అజ్ఞానులయందు అనుగ్రహ బుద్ధికలవారై కర్మలు చేయుచుండవలయును.

**3.25. సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత,**
**కుర్యాద్విద్వాంస్తథాసక్తశ్చి కీర్షుర్లోకసంగ్రహమ్.**

అనగా - ఈ ప్రపంచమునందు సరియగు జ్ఞానము లేనటువంటి పురుషులు ఫలములనాశించి అనేక విధములగు కర్మలు చేయుచున్నట్లుగా ఆత్మతత్వము నెరింగిన జ్ఞానులైన పురుషులు ఫలములయందు ఎటువంటి ఆసక్తి లేకుండా లోకహితార్థమై కర్మలు చేయుచుందురు.

ఈ విధముగా లోకసంగ్రహ భావము కలిగియున్న జ్ఞానులైన మహాత్ములు మరియు నావంటి పరమాత్ములు కేవలము లోకకల్యాణార్థమే కర్మలు చేయుచున్నారు గాని కర్తవ్యబుద్ధితోనో లేక ఫలాసక్తి కలిగియో కర్మలు చేయుటలేదు. అందుచేత అటువంటి ఆత్మతత్వమును ఎరింగియున్న మహాత్ములకు నేను చెప్పు వుపదేశమేమనగా -

**3.26. న బుద్ధి భేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్,**
**జోషయేత్సర్వకర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్.**

అనగా - బుద్ధియందు వికారము కలుగుటను బుద్ధిభేదమందురు. అందుచేత కర్మలయందు ఆసక్తి కలిగి వివేకములేనివారై కర్మలు చేయు వారిని జ్ఞానులైనవారలు వివేకహీనులై, కర్మలు చేయువారి భేదబుద్ధియందు ఎటువంటి వికారమును కలిగించరాదు. అజ్ఞానులకు "ఈ కర్మలు నేను చేయవలసి యున్నది. మరియు ఆ కర్మల ఫలములను నేను అనుభవించ వలయును" అను నిశ్చిత బుద్ధి కలిగి యుండును. జ్ఞానులైన వారలు అజ్ఞానుల యొక్క "కర్మలు చేయవలయును, వాటి ఫలములను అనుభవించవలయును" అను బుద్ధి యందు వికారమును కలిగించరాదు.

మరి జ్ఞానులైనవారలు ఏమి చేయవలయును ? అన్నచో సమాహిత చిత్తము గల జ్ఞానులు స్వయముగా అజ్ఞానుల వలెనే ఆ యా కర్మలను శాస్త్రానుకూలముగా ఆచరించుచూ అజ్ఞానులైన వారలను గూడ శాస్త్రానుకూలముగా కర్మలు ఆచరించుచుండుటకు ప్రేరేపించు చుండవలయును.

అజ్ఞానియై అనగా నిత్యానిత్య వస్తు వివేకము లేక మూర్ఖుడైన మానవుడు కర్మలయందు ఏ విధముగా ఆసక్తుడై యుండును ? అన్నచో అందులకు సమాధానము చెప్పుచున్నారు.

**3.27. ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః,**
**అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే.**

అనగా - సత్వము, రజస్సు మరియు తమస్సు ఈ మూడు గుణముల యొక్క సమన్విత అనగా ఏకమైయున్న రూపముగల వస్తువునే ప్రధానమనియు లేక ప్రకృతియనియు అందురు.

ఆ ప్రకృతి రూపమైన గుణముల వలన అనగా కార్యము మరియు కరణ రూపములైన సమస్త వికారముల వలన లౌకికము మరియు శాస్త్రీయము అయిన సర్వకర్మలు సర్వ విధములుగా చేయబడుచున్నవి. కాని అహంకారము చేత జ్ఞాన హీనములైన కార్యము మరియు కరణముల యొక్క సంఘాత రూపమైన దేహమునందు ఆత్మభావము కలిగియుండుటయే అహంకార మనబడును. **ఆయహంకారము వలన అంతఃకరణము అనేక విధములుగా భ్రాంతిని బొందుచున్నది.** ఆ విధముగా దేహేంద్రియ ధర్మములను తన యొక్క ధర్మములుగా తలంచు దేహాభిమానము గల పురుషుడు అవిద్య కారణముగ ప్రకృతి చేయు కర్మలను తాను చేయుచున్నట్లుగా తలంచి ఆ యా కర్మలకు "నేను కర్తను" అని వ్యర్థముగా అనగా భ్రాంతి చేత తలంచుచున్నాడు.

కాని జ్ఞానియైన పురుషుడు -

**3.28. తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః,**
**గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే.**

అనగా - గుణకర్మ విభాగమును అనగా గుణవిభాగము మరియు కర్మ విభాగము (త్రిగుణాత్మికమైన మాయ యొక్క కార్యరూపమైన పంచమహా భూతములు మరియు మనస్సు, బుద్ధి, అహంకారము మరియు పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు మరియు శబ్దాది పంచ విషయములు, వీటన్నింటితో కూడియున్న సముదాయము యొక్క పేరే గుణవిభాగము. మరియు వీటియొక్క పరస్పర సంబంధము వలన కలుగు చేష్టల సమూహాము యొక్క పేరు కర్మవిభాగము (అని శాస్త్రబోధ) వాటి యొక్క తత్త్వమును బాగుగా ఎరింగిన జ్ఞాని యింద్రియాది రూప గుణములే విషయరూప గుణముల యందు వ్యవహరించుచున్నవి గాని ఆత్మ వ్యవహరించుట లేదని ఎరింగి వాటి యందు అనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము మరియు భూమి యొక్క గుణములైన శబ్దము, స్పర్శ, రూప, రస మరియు గంధము - వీటిని కార్యములందురు. బుద్ధి, అహంకారము మరియు మనస్సు చెవి చర్మము, నాలుక, ముక్కు మరియు వాక్కు, హస్తములు, పాదములు, వుపస్థము మరియు గుదము యివన్నియు కరణములనబడును.... వీటియందు జ్ఞాని ఆసక్తుడు కాడు. ఆ యా విషయముల యందు భోగభావము కలిగియుండడు. కాని ఏ -

**3.29. ప్రకృతేర్గుణ సంమూఢాః సజ్జంతే గుణకర్మసు,**
**తాన కృత్స్నవిదో మందాన్కృత్స్న విన్న విచాలయేత్.**

అనగా - పురుషుడు ప్రకృతి యొక్క గుణముల యందు మోహాము గలవాడై "మేము ఫలాఫలము నాశించి ఈ కర్మలు చేయుచున్నాము." ఈ విధముగా గుణజనితమైన కర్మలయందు ఆసక్తుడై యుండునో ఆ విధముగా సమ్యగ్దృష్టి లేక సత్పదార్థ సత్వరూపమును ఎరుంగనటువంటి

మరియు కర్మఫలమును మాత్రమే చూచుచూ కర్మలయందు ఆసక్తికల మందబుద్ధి కలిగియున్న పురుషులను అన్ని విధముల సమ్యగ్దృష్టి కలిగి తత్వమును బాగుగా గుర్తించిన మహాత్ములు పై విధములైన అజ్ఞానులను జ్ఞానమార్గమున నడిపించుటకు ప్రయత్నము చేయరాదు.

అజ్ఞానులకు బుద్ధి భేదమును కల్పించుటకు ప్రయత్నించుటయే వారిని దారి తప్పించుటగా భావించబడుచున్నది. అనగా **అజ్ఞానముచే కర్మలయందు మునిగి తేలుచున్నవారికి జ్ఞానమార్గమునకు సంబంధించిన ఆత్మబోధ చేయరాదు.** అలా అయితే మరి కర్మాధికారియై యుండి, అజ్ఞానియైయున్న ముముక్షువు - అనగా మోక్షమును కోరువాడు కర్మలు ఎట్లు చేయవలయును ?

అన్నచో ఆ విషయము చెప్పుచున్నారు -

**3. 30. మయి సర్వాణి కర్మాణి సంన్యస్యాధ్యాత్మచేతసా,**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః.**

అనగా - అటువంటి కర్మాధికారులు తాము చేయు కర్మలను మరియు వాటి ఫలములను గూడ సర్వాత్మస్వరూపుడను, సర్వజ్ఞుడను, పరమేశ్వరుడను, వాసుదేవుడను అయివున్న నాయందు వివేక బుద్ధితో అర్పించి, "నేను సర్వ విధ కర్మలను ఈశ్వరుని కొరకు సేవకుని వలె చేయుచున్నాను" అని తలంచి సర్వవిధ కర్మలను మరియు వాటి ఫలములను నా యందు అర్పించవలయును.

మరియు నిరాశా పురుషుడు అనగా ఎటువంటి ఆశలు లేనట్టి పురుషుడు మరియు నిర్మమ్ అనగా ఎవనియందు స్వాత్మబుద్ధి పూర్తిగా నశించినదో అటువంటి వానిని నిర్మమ్ అనగా మమత్వము అనగా నాది అను భావములేనివాడు అనబడును. నీవు కూడా ఆ విధముగా మమకార రహితుడవై యుద్ధము చేయుము. అనగా చింతా - సంతాప రహితుడవై యుద్ధము చేయుము.

"కర్మలు చేయవలయును" అని చెప్పబడిన ఈ మతము అనగా అభిప్రాయము ప్రమాణ సహితముగా యదార్థము" అని తలంచి -

**3. 31. యేమే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః,**
**శ్రద్ధావంతో ఽనసూయంతో ముచ్యంతే తే ఽపి కర్మభిః.**

అనగా - ఏ శద్ధాభక్తులు కలిగియున్న మానవుడు గురు స్వరూపుడనై వాసుదేవుని రూపమున వున్న నన్ను ఎటువంటి ద్వేష-అసూయ మొదలగు భావములు లేకుండ నేను పైన చెప్పిన మతముననుసరించి వ్యవహరించెదరో వారందరూ పాప-పుణ్య రూపములైన కర్మల నుండి విముక్తులౌదురు.

**3.32. యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే ఽమతమ్,**
**సర్వజ్ఞాన విమూఢాంస్తాన్విద్ధి నష్టానచేతసః.**

అనగా - పైన చెప్పిన విధముగా కర్మల నాచరించక అందులకు విరుద్ధముగా యున్నవారు నా యీ అభిప్రాయమును (మతమును) నిందించుచూ నా మతముననుసరించి ఆచరణచేయరో వారు అన్ని విధములగు జ్ఞానములందును అనేక విధములుగా మూఢులై యుందురు. అన్ని విధములగు జ్ఞానములందు మోహితులైన ఆ అవివేకులనందరినీ నీవు నశించినవారిగా తలంచుము.

వారందరూ ఏ కారణము చేత మీ మతముననుసరించి వ్యవహరించుట లేదు ? ఇతరుల మతమును ఆచరించుచున్నారు ? మరియు స్వధర్మాచరణము ఎందులకు చేయుట లేదు ? మీకు వ్యతిరేకముగా మీ ఆజ్ఞను పాటించకుండా వున్నందువలన కలుగు దోషమునకు ఎందులకు భయపడుట లేదు ? ఇందులకు కారణమేమి ?

అన్నచో భగవానుడు యిలా చెప్పుచున్నాడు -

**3.33. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేఃజ్ఞానవానపి,**
**ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి.**

అనగా - ప్రాణులన్నియు మరియు తత్వమును ఎరింగిన జ్ఞానులు గూడ తమ ప్రకృతి అనగా స్వభావముననుసరించియే కర్మవ్యాపారము చేయుచుందురు. అనగా తమ పూర్వ పూర్వ జన్మలయందు చేయబడిన కర్మలననుసరించి పాపపుణ్యాదికమైన ఎటువంటి సంస్కారము యిప్పుడు ఈ జన్మమునందు ఏర్పడియున్నదో దానికే ప్రకృతియను పేరు. దానిననుసరించియే జ్ఞానులు గూడ కర్మవ్యాపారము చేయుచుందురు. ఇంక మూర్ఖుల సంగతి చెప్పదగిన దేమున్నది ?

అందుచేత ప్రాణులన్నియు తమ ప్రకృతి అనగా తమ స్వభావముననుసరించియే సర్వకార్య వ్యాపారము చేయుచున్నవి. ఇందులో నాదిగాని మరియే యితరుల ప్రమేయముగాని ఏమియూ లేదు. జీవులన్నియు తమ తమ ప్రకృతికి అనురూపముగానే వ్యాపారములు చేయుచున్నవి. ప్రకృతికి అతీతముగా ఏదియును లేదు. మరి అలా అయినప్పుడు పురుష ప్రయత్నముతో నిమిత్తం లేకున్నందున విధి-నిషేధములను గురించి చెప్పు శాస్త్రము నిరుప యోగమే కదా ? అన్నచో -

అందులకు చెప్పుచున్నాడు -

**3.34. ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ,**
**తయోర్న వశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ.**

అనగా - ఇంద్రియములు, యింద్రియములన్నచో సర్వేంద్రియముల యొక్క శబ్దాది విషయములందు రాగద్వేషములు స్థిరపడి యుండునో అనగా యిష్ట పదార్థముల యందు

రాగము అనగా ప్రేమ అనిష్ట పదార్థములయందు ద్వేషము యిలా అన్ని యింద్రియముల విషయములందును రాగద్వేషములు రెండును అవశ్యముగ నుండును.

అటువంటి స్థితియందు పురుష ప్రయత్నము మరియు శాస్త్రముల మహాత్త్యము ఎట్లుండునో చెప్పుచున్నారు.

శాస్త్రానుసారముగ వ్యవహరించు మనుష్యుడు ఆరంభము నుండియే రాగ-ద్వేషములకు లోనుగాకుండ వుండవలయును.

అభిప్రాయమేమన - సహజముగానే మానవుని యందు గల ఆతని ప్రకృతి ఆతనిని రాగద్వేషములతో కూడియున్న కర్మలయందు నియమించును. అప్పుడు తనంతటతానుగానే స్వధర్మత్యాగము పరధర్మానుష్ఠానము జరుగనారంభమగును.

కాని యీ జీవుడు ఎప్పుడు వివేకము కలిగి తన స్వభావమునకు విరుద్ధమైన భావముతో రాగద్వేషాదులను సంయమించునో అప్పుడు శాస్త్రదృష్టి కలవాడగును. తిరిగి తన ప్రకృతికి వశుడు కాకుండా వుండగలుగును.

అందుచేత చెప్పునదేమన ? మనుష్యుడు రాగద్వేషములకు వశుడు కాకుండా వుండవలయును. అట్లేలయన ? ఆ రాగ ద్వేషములు దొంగలవలె శుభమార్గమున పయనించువానిని తప్పుద్రోవ పట్టించును.

రాగద్వేషములతో కూడియున్న మానవుడు శాస్త్రార్థమును గూడ విపరీతముగా తెలుసుకొనును. అంతేకాకుండా అది కూడ ధర్మమే కదాయని తలంచి పర ధర్మమును స్వీకరించి అనుష్ఠించతగినిదేయని తలంచును. కాని అతడు అలా తలంచుట పొరపాటు మాత్రమే యగును.

అదెట్లన -

**3.35. శ్రేయాన్ స్వధర్మో విగుణః, పరధర్మాత్స్వనుష్ఠితాత్,**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః.**

అనగా - ఎంత బాగుగా అనుష్ఠించబడినప్పటికీ అట్టి పరధర్మము అనగా యితర వర్ణములవారికి విధించబడిన కర్మసముదాయము కంటె గుణరహితమైనదైనప్పటికి స్వధర్మమును ఆచరించుటయే క్షేమకరము.

పరధర్మమును ఆచరించు మానవుని జీవితముకంటె స్వధర్మమును ఆచరించుచూ వున్న మానవ జీవనము శ్రేష్ఠమైనది. ఏలయన యితరుల ధర్మాచరణ భయధాయకము. నరకాది రూపములైన భయమును కలిగించునదై యున్నది.

అప్పుడు అర్జునుడు యిలా అన్నాడు -

**'ధ్యాయతో విషయాన్ పుంస ః"** (చూ. గీత 2-62)

అనగా విషయములను గురించి ఆలోచించు పురుషునికి ఆ విషయములందే ఆసక్తి కలుగును. అనియు "రాగ ద్వేషౌ హ్యస్య పరిపంథినౌ" (చూ. గీత. 3-34) అనగా

ప్రతియింద్రియమునకును వాటివాటి విషయములందు రాగద్వేషములను కలిగించు విషయము సర్వానర్థములకు మూలకారణములని చెప్పబడినది. కాని ఆ విషయమంతయు భిన్న భి సందర్భములందు అస్పష్టముగా చెప్పబడినది. అందువలన ముఖ్యముగా యిదిం సర్వానర్థములకు సరియైన కారణము అని నీవు సంక్షిప్తముగా నాకు చక్కగ బోధపడునట్లు చెప్పిన యెడల తెలియును. అప్పుడు నేను ఆ సర్వానర్థదాయకములైన విషయముల యింద్రియముల నుండి తొలగించుటకు ప్రయత్నింతును. అని అర్జునుడు యింకా యీ అన్నాడు.

**3.36.** అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః,
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః.

అనగా – ఓ కృష్ణా ! ఏ ప్రధాన కారణముచేత ప్రేరేపించబడిన ఈ పురుషుడ తనంతట తానుగా కోరక పోయినప్పటికి రాజు చేత ఆజ్ఞాపించబడిన సైనికునివలె బలవంతముగ ఆజ్ఞాపించబడినట్లుగా పాపపుణ్యకార్యములు చేయుటకు వివశుడగుచున్నాడు ?

అర్జునా ! నీవు అడుగుచున్న ఆ సర్వానర్థములకు కారణరూపమైన విషయమున చెప్పుచున్నాను, వినుము –

సంపూర్ణమైన ఐశ్వర్యము, ధర్మము, యశము అనగా కీర్తి, లక్ష్మి అనగా సంపద వైరాగ్యము, మరియు మోక్షము – ఈ ఆరింటికి "భగ" అనగా భగము అని పేరు. ఐశ్వర్యాద ఆరు గుణములనే ప్రతిబంధకము లేకుండా సంపూర్ణమై ఏ వాసుదేవునియందు ఎల్లప్పుడు వుండునో.....

మరియు వుత్పత్తి ప్రళయములను, భూతముల రాకపోకలను, విద్య – అవిద్యలను ఎవ్వడెఱుంగునో ఆతని పేరు 'భగ'వంతుడు. అందుచేత వుత్పత్త్యాది, సర్వ విషయములను ఎవడు చక్కగా ఎఱుంగునో ఆతడే వాసుదేవ రూపుడే భగవంతుడు అను పేరుతో పిలువబడు చున్నాడు.

**3.37.** కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః, ,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్.

అనగా – కామము ప్రాణులన్నిటికి పరమ శత్రువు. దాని కారణముగానే జీవులన్నింటికి అన్ని విధములైన అనర్థములు ప్రాప్తించుచున్నవి. అటువంటి ఈ కామము ఎన్నడైనా ఏ కారణముచేతనైనా బాధింపబడితే అది అప్పుడు క్రోధముగా రూపాంతరము చెందుతుంది. అందుచేత కామమే క్రోధము.

ఈ కామము ప్రకృతి యొక్క రజోగుణము వలన వుత్పన్నమగుచున్నది. త్రిప్పి చూచినట్లయితే ఈ కామమే రజోగుణమును కలిగించుచున్నది. అట్లేలయన ? మానవ మనస్సునందు వికార రూపమున కలిగిన కామమే రజోగుణమును వృద్ధి జేసి పురుషుని కర్మలయందు నియోగించుచున్నది.

మరియు పరసేవ మొదలగు కార్యములందు నిమగ్నమైన కష్టజీవులందరూ ఏక కంఠముతో చెప్పునదేమనగా - **తృష్ణయే మానవుల చేత సర్వవిధ కర్మలు చేయించుచున్నది.**

**కామము సమస్త పాపకార్యములకు మూలము.** ఏలయన ? కామము చేత ప్రేరేపించబడిన ప్రాణియే - జీవులే - సర్వవిధ పాపములు చేయుదురు. కావున **ఈ ప్రపంచమునందలి సర్వప్రాణులకు ప్రథమ శత్రువు ఈ కామమేనని ఎఱుంగుము.**

ఈ కామము సర్వప్రాణులకు ఏ విధముగా శత్రువు ? అని అన్నచో దృష్టాంతముల ద్వారా వినుము.

**3.38. ధూమేనావ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ,**
**యథోల్బేనావృతో గర్భస్తథా తే నేదమావృతమ్.**

అనగా - ప్రకాశమే స్వరూపముగా కలిగియున్న అగ్ని తనతోపాటుగా జనించిన అంధకారరూపమైన ధూమమము (పొగ) ద్వారాను, మరియు మురికి అనగా మలము చేత ఏ విధముగా అద్దము మలినమై పోవుచున్నదో ఆ విధముగానే గర్భము గూడ తన యొక్క ఆవరణ రూపమైన మలముతో కప్పబడిపోతుంది. ఆ విధముగానే ఈ కామముచేత పురుషుని యొక్క జ్ఞానము కప్పబడిపోవుచున్నది.

పైన చెప్పపబడిన శ్లోకమునందు 'ఇదమ్' అను శబ్దము ద్వారా సంకేతించబడిన అర్థమేమనగా - కామముచేత కప్పబడుచున్న అనగా తెలియరాకుండా వున్న వస్తువు ఏది ? ఆ వస్తువెద్దియో చెప్పబడుచున్నది -

**3.39. ఆ వృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా,**
**కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ.**

అనగా - **కామ నామముగల ఈ శత్రువుచే వివేకము గలవాని జ్ఞానము కప్పబడి యున్నది.** జ్ఞాని మాత్రమే ఈ కామము ద్వారా నేను అనర్థములందు చిక్కుకొనియున్నానని తెలుసుకొనగలడు. ఆ కారణముగా జ్ఞానియైనవాడు ఎల్లప్పుడూ దుఃఖించుచుండును. అందుచేత **ఈ కామము జ్ఞానికి మాత్రమే శత్రువు. అజ్ఞానికి కాదు.** ఏలయన ? ఆయజ్ఞాని తృష్ణ కలిగియున్నవాడై యున్నందున ఆ తృష్ణను పెంచు కామమును మిత్రుడుగా తలంచును. తరువాత ఆ తృష్ణ మరియు ఆ తృష్ణను కలిగించు కామము ద్వారా దుఃఖము కలిగినప్పుడు అప్పుడు "నేను ఈ తృష్ణ కారణముగానే దుఃఖమును పొందుచున్నాను." అని తెలుసుకొనును. ఈ వివేకము ఆ దుఃఖమును పొందక పూర్వము తాను ఎఱుగడు. అందుచేత ఈ కామము ఒక్క జ్ఞానికి మాత్రమే నిత్య శత్రువు.

కామము ద్వారా ఏ విధముగా జ్ఞానము కప్పబడియున్నది ? అన్నచో - కోరికకే మరియొక పేరు కామము. ఈ కోరికలు అత్యంత కష్టదాయకములు. ఈ కోరికలు అగ్ని

వంటివి. అందుచేత యివి భోగముల చేత తృప్తిని పొంది నశింపవు. అటువంటి కామము అనే శత్రువు చేత జ్ఞానము కప్పబడియున్నది.

జ్ఞానమును కప్పియుంచునదిగావున ఈ కామము జీవులందరికీ శత్రువే. ఈ శత్రురూపియైన కామము ఎచ్చట వుండును ? అనగా ఈ కామము దేనిని ఆశ్రయించుకొని యున్నది ? ఏలయన ? శత్రువు యొక్క ఆశ్రయస్థానమును గుర్తించిన యెడల చాలా సులభముగా ఆ శత్రువును నశింపజేయవచ్చును.

ఇప్పుడు ఆ కామము యొక్క ఆశ్రయస్థానమును గురించి చెప్పుచున్నారు.

**3.40.** **ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠాన ముచ్యతే,**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్.**

అనగా – **ఇంద్రియములు, మనస్సు, బుద్ధి యివన్నియు ఈ కామభావమునకు అధిష్ఠానములు అనగా ఆ భావము వుండు స్థానములుగా చెప్పబడినవి.** ఈ కామము తనకు ఆశ్రయభూతములైన యింద్రియముల ద్వారా జ్ఞానమును కప్పివేసి జీవుని నానావిధములుగా మోహింపజేయుచుండును.

అట్టి స్థితియందు –

**3.41.** **తస్మాత్త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ,**
**పాప్మానం ప్రజహిహ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్.**

అనగా – అందువలన ఓ భరతర్షభా ! నీవు ముందుగా ఇంద్రియములను వశము నందుంచుకొని జ్ఞాన విజ్ఞానములను నశింపజేయునటువంటి పైన చెప్పబడిన పరమ శత్రువు. మరియు పాపములను చేయించునటువంటి కామభావమును త్యజించుము.

తాత్పర్యమేమన ? శాస్త్రము మరియు ఆచార్యుల (గురువు) వారిచే ఆత్మానాత్మలను గురించి మరియు విద్యా అవిద్యలను గురించి చేయబడిన బోధను జ్ఞానమందురు. ఆజ్ఞానము ద్వారా కలిగిన విశిష్టానుభవమును విజ్ఞానమందురు. **మానవుని శ్రేయప్రాప్తికి కారణస్వరూపమైన యీ జ్ఞాన–విజ్ఞానములను ఆ కామభావము నశింపజేయుచుండును.** కావున అర్జునా ! నీవు యీ కామభావమును త్యజింపుము.

ముందుగా యింద్రియములను వశపరచుకొని కామరూపమున వున్న నీ శత్రువును త్యజింపుము. ఇలా చెప్పడం బాగానే వుంది. కాని దేనిని లేక ఎవరిని ఆశ్రయించి అనగా ఏ బలముతో యీ కామరూపమునవున్న శత్రువును త్యజించ లేక జయించవలయును ? అన్నచో– ఇలా చెప్పుచున్నారు –

**3.42.** **ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః,**
**మన సస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః.**

అనగా – పండితులైనవారలు బాహ్యము, పరిచ్ఛిన్నము మరియు స్థూల దేహము కంటె సూక్ష్మము; అంతస్థము అనగా లోపలనుండునది మరియు వ్యాపకత్వాది గుణములతో కూడియున్న కారణముగ క్షేత్రాది పంచ జ్ఞానేంద్రియములను పర అనగా శ్రేష్ఠములైనవిగా చెప్పుచున్నారు.

ఏ ఆత్మ పదార్థము బుద్ధిమొదలు సమస్త దృశ్యమానమగుచున్న పదార్థములయందు దృశ్యముకాని విధముగా వ్యాపించియున్నదో దానిని యింద్రియములతో కూడియున్న కామము ఆవరణరూపమున కప్పియుంచి మోహింపజేయుచున్నది. అటువంటి బుద్ధిని కూడ చూడగలిగిన ద్రష్టయైన పరమాత్మ ఒక్కడే అన్నిటికంటెను శ్రేష్ఠమైనవాడు.

**3.43.** **ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా,**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్.**

అనగా – ఈ విధముగా ఆత్మను బుద్ధికంటె గూడ అతి శ్రేష్ఠమైనదిగా ఎరింగి ఆత్మ ద్వారానే ఆత్మను యింద్రియములతో సంబంధము లేకుండ స్తంభింపజేసి అనగా శుద్ధమైన మనసునందు అనగా **లోకవాసనలు లేనటువంటి మనస్సునందు ఆత్మతత్వమును సమాధిచేసి** అనగా నింపి ఓ అర్జునా! ఈ కామరూపమున వున్న అజేయమైన శత్రువును సంహరించుము. అనగా ఏది దుఃఖము చేత వశమునందుంచుకొనబడునో అట్టి అనేకములైన జయించరాని విశేషణములతో కూడియున్న కామమును జయించి నీ నుండి దూరము చేసుకొనుము.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*కర్మయోగమను మూడవ అధ్యాయమునకు*
*శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విరిచిత భాష్యమునకు*
*తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు – శ్రీ సదానంద భారతి*
*ప్రణవాశ్రమము.*

# నాలుగవ అధ్యాయము

కర్మయోగమే ఉపాయముగా సర్వరూప సంన్యాససహితము మరియు జ్ఞాననిష్ఠా రూపమైన యోగము ఇంతకు పూర్వపు రెండు, మూడవ అధ్యాయముల యందు చెప్పబడినది. వానిలో వేదసారమైన ప్రవృత్తి ధర్మరూపము మరియు నివృత్తి ధర్మరూపము ఆ రెండు విధములైన ధర్మముల సంపూర్ణ తాత్పర్యము చెప్పబడినది. ఇంక ముందు వున్న సంపూర్ణమైన గీతయందు భగవంతుడు 'యోగ' శబ్దము ద్వారా జ్ఞానయోగమునే చెప్పును. అందుచేత **వేదార్థమంతయు జ్ఞాన యోగమునందే తెలుపబడియున్నదని** తలంచి భగవంతుడు వంశపరంపరా కథనము ద్వారా **జ్ఞాననిష్ఠా రూపయోగమే** చెప్పుచున్నారు.

*భగవంతుడు ఇలా అన్నాడు :*

**4.1 ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్,**
**వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాకవే ఽబ్రవీత్.**

అనగా – జగత్తును శాసించగలిగిన క్షత్రియులయందు బలవీర్యాది శక్తిని స్థాపించుట కొఱకు భగవంతుడనైన నేను యింతకు పూర్వము చెప్పబడిన రెండు మూడు అధ్యాయములందు చెప్పినటువంటి యోగమును ఈ సృష్టికి పూర్వమే ఆదికాలమునందే సూర్యునికి చెప్పి యున్నాను. అట్లేలయన ఆ యోగబలము కలిగియున్న క్షత్రియులు బ్రహ్మత్వమును రక్షించగల సమర్థత కలిగి యున్నారు. మరియు బ్రాహ్మణ మరియు క్షత్రియుల పాలన సరిగా వున్నంత కాలము ఈ రెండు వర్ణములవారు సర్వజగత్తును చక్కగా పాలించగలరు.

ఈ యోగము యొక్క ఫలము అవినాశి అనగా నశించునది కాదు. అందుచే యిది అవ్యయము అనగా ఎన్నడూ తరగనిది. ఏలయన ? సమ్యక్ అనగా సర్వాంగ పూర్ణమైన జ్ఞాననిష్ఠా రూపమైన ఈ యోగము యొక్క మోక్షరూపమైన ఫలము ఎన్నడూ నశించునది కాదు.

ఆ సూర్యుడు ఈ యోగమును తన పుత్రుడైన మనువుతో చెప్పియున్నాడు. ఆ మనువు తన పుత్రుడు మరియు అందరికంటె ముందుగా రాజు కాబోవుచున్న ఇక్ష్వాకునితో చెప్పి యున్నాడు –

**4.2 ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయో విదుః,**
**స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప.**

అనగా – ఈ విధముగా క్షత్రియవర్ణములకు చెందినవారి పరంపరగా లభించిన ఈ యోగమును రాజర్షులు అనగా రాజైయుండియు ఋషియైన మహాత్ములు యెరింగి యున్నారు.

ఓ 'పరంతప' అనగా అర్జునా ! ఇప్పుడు ఈ యోగము చాలా కాలము నుండి మానవ లోకమునందు లోపించినది. అనగా ఆ సంప్రదాయ పరంపర అనగా తండ్రి నుండి కుమారునికి వచ్చు క్రమము తెగిపోయినది. ఎదిటి పక్షమున వున్నవారిని 'పర' అనగా పరాయివారు అని అందురు. అట్టి పరాయి వారిని ఎవడు శౌర్యమనబడు తేజస్సుతో అనగా శౌర్యమనే కిరణముల ద్వారా సూర్యునివలె తపింపజేయునో ఆతడు పరం+తప. అనగా శత్రువులను తపింపజేయువాడు అనగా శత్రువులను జయించువాడు అని అనబడును.

ఇంద్రియములను జయింపజాలనటువంటి బలహీనులకు చిక్కి ఈ యోగము భ్రష్టమైపోయినది. ఇది చూచి దానితోపాటు లోకాలను పురుషార్ధ రహితులుగా చూచి.....

**4.3 స ఏవాయం మయా తే ఽద్య యోగః ప్రోక్తః పురాతనః,**
**భక్తో ఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్.**

అనగా - ఇప్పుడు నేను నీకు చెప్పుచున్నది ఆ ప్రాచీన యోగమే. అలా నీకు నేను ఎందులకు చెప్పుచున్నాననగా నీవు నా భక్తుడవు, మిత్రుడవు కూడాను. అందుచేత జ్ఞాన రూపమైన ఈ గొప్ప యోగమును నేను నీకు చెప్పుచున్నాడను.

భగవంతుడు అసంగతమైన విషయము చెప్పుచున్నాడని ఎవరైనా తలంచుదురేమోయన్న భావముతో అట్టి అపార్థము కలగకుండుటకు గాను అర్జునుడు శంకించుచూ యిట్లనెను -

**4.4 అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః,**
**కథమేత ద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి.**

అనగా - కృష్ణా ! నీ యొక్క జన్మము అత్యంత అర్వాచీనము అనగా ఆధునికము అనగా నిన్న మొన్నటిది. వసుదేవుని యింట జన్మించినవాడవు. మరి సూర్యుడు ఈ సృష్టికి పూర్వము నుండియే వున్నవాడు. అట్టి స్థితియందు నీవు చెప్పు పై విషయమును అనగా మీరు ఈ యోగమును ఎప్పుడో ఆదికాలము నాడు సూర్యునకు జెప్పినారనియు అదియే యిప్పుడు నాతో చెప్పుచున్నారనుట అసంగతముగాక సుసంగతమని ఎట్లు తలంతును ?

భగవంతుడైన వాసుదేవుడు ఈశ్వరుడు కాదనియు, సర్వజ్ఞుడు కాదనియు అజ్ఞానులైన మానవులకు వుండు ఈ సందేహమును అర్జునుని ద్వారా తెలుసుకొని భగవానుడు ఆ శంకానివారణార్థము యిట్లని చెప్పుచున్నాడు.

**4.5 బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున,**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప.**

అనగా - ఓ అర్జునా ! నాకు నీకు గూడ యింతకు పూర్వము ఎన్నో జన్మలు కలిగినవి. వాటినన్నింటిని నేను ఎఱుగుదును. కాని నీవు ఎఱుగవు. అట్లేలయన ? పుణ్యము - పాపము మొదలగు సంస్కారముల కారణముగ నీ యొక్క జ్ఞానశక్తి మరుగున పడిపోయివున్నది.

కాని నేను మాత్రము నిత్యశుద్ధ బుద్ధ ముక్తస్వభావము కలవాడను. అందుచేత నా జ్ఞానశక్తి ఆచ్ఛాదనా రహితముగా వుండి యున్నది. ఆ కారణముచేత ఓ పరంతప ! నేను అంతయు ఎఱుంగుదును.

అయితే మరి మీరు నిత్యమైన ఈశ్వరుడవు గదా ? నీకు పుణ్య పాపములతో ఎటువంటి సంబంధము లేదుగదా అటువంటప్పుడు నీకు జన్మ – మరణములు ఎందుకు కలుగుచున్నవి? అని అర్జునుడు సందేహించగా భగవానుడు యిలా అన్నాడు –

**4.6 అజో ऽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరో ऽపి సన్,**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా.**

అనగా – అర్జునా ! నేను జన్మరహితుడను. అవ్యయాత్ముడను అనగా క్షీణించు గుణము లేనటువంటి జ్ఞానశక్తియే స్వభావముగా కలవాడను. మరియు పిపీలికాది బ్రహ్మ పర్యంతము సమస్త భూతములను నియమించు ఈశ్వరుడను కూడ అయివున్నాను. అయినప్పటికి గూడ నాయందు గల త్రిగుణాత్మికమైన **వైష్ణవమాయను, దేనియందు చిక్కి సమస్త జగత్తు నానా అవస్థలు పడుతూ వుంటుందో, మరియు దేనిచేత మోహించబడి మానవుడు వాసుదేవరూపుడైన తనను తాను గుర్తించలేక యున్నాడో,** అటువంటి ప్రకృతిని, అటువంటి మాయను నేను నావశము నందుంచుకొని నా ఆనందము కొఱకు నేను దేహము వున్నవానివలె, జన్మించిన వానివలె యితరులకు తోస్తూ వుంటాను. ఇతర ప్రాణులవలె, యితర మానవులవలె నిజముగా నేను జన్మించుట లేదు.

మరి యీ జన్మ ఎప్పుడు, ఎందుకు జరుగుచున్నది ? అంటే చెప్పెద, వినుము –

**4.7 యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.**

అనగా – ఓ భరతవంశ సంజాతుడా ! వర్ణాశ్రమాది లక్షణములు కలిగి ప్రాణికోటి యొక్క ఔన్నత్యమునకు మరియు వాటికి శుభములు కలిగించునటువంటి ధర్మమునకు ఎప్పుడు హాని సంభవించునో మరియు అధర్మము అతిగా పెరిగిపోవునో అనగా ప్రాణులకు బాధాకరముగా పరిణమించునో అప్పుడు ఆ ధర్మమును పునరుద్ధరించుటకు నేను నా మాయ ద్వారా నన్ను సృష్టించుకొందును.

ఇంకా ఎందుకనగా –

**4.8 పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం,**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.**

అనగా – ధర్మ మార్గమున చరించు సాధుజనులను రక్షించుట కొఱకు, అధర్మ మార్గమున చరించి పాపకర్మలు చేయుచూ సాధుజనులను పీడించునటువంటి దుష్టులను నశింపజేయుట –

కొఱకు, మరియు ఆ విధముగా చెడిపోయిన ధర్మమును పునరుద్ధరించుట కొఱకు నేను ప్రతియుగమునందును. ప్రత్యక్షమగుచుందును. అది ....

**4.9 జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః,**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సో ऽర్జున.**

అనగా - నా యొక్క యీ మాయామయజన్మ మరియు నేజేయు సాధుజన రక్షణ మొదలగు కర్మలన్నియు అత్యంత దివ్యములు. అనగా అలౌకికములు. అనగా ఆ కర్మలు కేవలము ఈశ్వర శక్తి ద్వారా జరుగవలసినవే గాని మానవశక్తి ద్వారా జరుగరానివి. ఎవడు యీ తత్త్వమును అనగా యీ సత్యమును యథార్థముగా తెలుసుకొనునో.... అతడు యీ ప్రస్తుత స్థూల, సూక్ష్మ మరియు కారణ శరీరములను త్యజించి తిరిగి పునర్జన్మను అనగా మరియొక దేహమును పొందదు. అంతేగాక అట్టి జీవుడు నా వద్దకు వచ్చును అనగా జన్మ మరణ రాహిత్య రూపమైన మోక్షస్థితిని పొందును.

ఈ మోక్షమార్గము యిప్పుడు ఆరంభమైనది కాదు యింతకు పూర్వము గూడ......

**4.10 వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః,**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః.**

అనగా - రాగము (ఆసక్తి) భయము, క్రోధము ఎవనికిలేవో, అట్టి రాగాదిదోష రహితుడు, ఈశ్వరునియందు తన్మయత్వమును పొందిన వాడు, **ఈశ్వరునికి తనకు ఎటువంటి భేదము లేదని తలంచువాడు, బ్రహ్మవేత్త అనగా సర్వవ్యాపక పరబ్రహ్మతత్త్వమును ఎఱింగినవాడు,** పరమేశ్వరుడనైన నన్ను ఆశ్రయించినవాడు, కేవలము జ్ఞాన నిష్ఠయందే మనస్సును, బుద్ధిని లగ్నము చేసినవాడు, యింకా అటువంటి అనేకమంది మహాత్ములు పరమాత్మ విషయిక జ్ఞానరూపమైన తపస్సుచే పరమ పవిత్రతను అనగా **లోకవాసనలు లేని శుద్ధత్వమును పొంది, ఈశ్వర భావముతో మోక్షస్థితిని పొందియున్నారు.**

**"జ్ఞానతపసా"** అను విశేషణ శబ్దమును యిచ్చట వాడుటకు కారణమేమన - **జ్ఞాన నిష్ఠ యితర విధములైన తపస్సులను అనగా ప్రయత్నములను అపేక్షించదు.**

దీనిని బట్టి చూడగా మీలో అనగా భగవంతునికి గూడ రాగద్వేషములున్నట్లుగా తోచుచున్నది. ఏలయన ? ఆయన కొంత కొంత మందికి మాత్రమే ఆత్మభావము ప్రదానము చేయుచుందును. అందరికి అట్టి ఆత్మ భావమును ఎందుకు కలుగజేయరు ? అన్నచో - అందులకు సమాధానముగా -

**4.11 యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్,**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః.**

అనగా - ఏ భక్తుడు ఏ విధముగా, ఏ ప్రయోజనము కొఱకు, ఎటువంటి ఫలప్రాప్తిని ఆశించి నన్ను అనగా ఈశ్వర స్వరూపుడైన శ్రీ కృష్ణుని భజించునో ఆ భక్తునికి నేను అతని

యిచ్ఛానుసారముగ ఫలమును కలుగజేసి అతనిని అనుగ్రహించెదను. ఏలయన ? అటువంటి వారికి మోక్షమును పొందవలయునన్న కోరిక వుండదు.

ఒకే పురుషుని యందు మోక్షమును పొందవలయునను బుద్ధి, సాంసారిక ఫలములములను పొందవలయుననెడి బుద్ధి ఒకేసారి అనగా ఒకే కాలమందు వుండదు.

అందుచేత సాంసారిక వస్తు రూప ఫలమును కోరువారికి అట్టి ఫలములను కలుగ జేయుదును. సాంసారిక వస్తురూప ఫలమును కోరక శాస్త్రోక్త ప్రకారముగా కర్మలు చేయు ముముక్షువులకు, జ్ఞానమును ప్రసాదింతును. సంన్యాస ధర్మమును స్వీకరించి, ముముక్షువులై అనగా మోక్షమును మాత్రమే కోరుచుండువారికి మోక్షమునే కలుగజేసెదను. ఆర్తులు అనగా ప్రాపంచిక దుఃఖములననుభవించుచూ నన్ను భజించువారి దుఃఖములను దూరము చేయుదును. ఈ విధముగా ఎవరు నన్ను ఏ విధముగా ఏది కోరుచూ భజింతురో వారికి నేను అవియే కలుగజేయుచుందును.

రాగద్వేషములు గలవారికి, లేక మోహమునందు పడియున్నవారికి నేను ఏమియు కలుగజేయను.

ఓ పార్థా ! మానవులు అన్ని విధములుగా వ్యవహరించుచూ గూడ సర్వవ్యాపకుడనైన, ఈశ్వరుడనైన నా మార్గమునే అనుసరించుచుందురు. **ఎవరు ఎటువంటి ఫలములను కోరుచూ, ఏ కర్మకు అధికారులై తదనుసారముగ ప్రయత్నించుచుందురో వారే సరియైన మానవులని చెప్పబడుదురు.**

రాగాదిదోషములు లేనందున ఈశ్వర స్వరూపులైన మీకు అన్ని ప్రాణుల మీద మీ దయ సమానముగా వుండును. మరియు తమరు అన్ని విధములైన ఫలములు యివ్వగల సమర్థులై యున్నారు. అటువంటి స్థితియందు మనుష్యులందరూ ముముక్షువులు అనగా మోక్షమును మాత్రమే కోరువారై - "ఈ ప్రపంచమంతయు వాసుదేవుని రూపముననే యున్నదను" జ్ఞానము కలిగి కేవలము తమరినే అనగా వాసుదేవ స్వరూపుడైన శ్రీ కృష్ణునినే ఎందులకు భజించుట లేదు ? అన్నచో....

అందులకు కారణము చెప్పుచున్నారు.

**4.12 కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః,**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా.**

అనగా - తాము ఆచరించు కర్మల ఫలములను కోరువారు అనగా ఫలములను పొందగోరువారు ఈ లోకమందు ఇంద్రుడు, అగ్ని మొదలగు దేవతలను పూజించుచుందురు.

ఎవడు పై దేవతలు తమకంటే వేఱుగా వున్నారని తలంచి ఆ దేవతలు, వుపాస్య మనియు పూజించునటువంటి తాను వుపాసకుడనినియు తలంచి ఆ దేవతలను పూజించు చుండునో అటువంటి వుపాసకులు అజ్ఞానులు, వారు ఏమియు తెలియనివారు. పశువులు వంటివారు. దేవతల పశువులు.

ఆ విధముగా ద్వైతభావము అనగా తాను వేరు దేవతలు వేరుగా వున్నారని తలంచు భావము కలిగి ఆ దేవతలను పూజించుచు ఫలేచ్ఛగల మానవులు తాము చేయు కర్మ ఫలమును అనగా దేవతల సంతృప్తి కొఱకై యజ్ఞయాగాది కర్మలు చేయువారు ఆ కర్మ ఫలములను త్వరలోనే పొందుదురు. ఏలయన ? మానవలోకమునందు శాస్త్రమునకు అట్టి అధికారము కలదు.

**"క్షిప్రం హి మానుషే లోకే"** అను వాక్యము ద్వారా 'క్షిప్ర' విశేషణ శబ్దము ద్వారా భగవంతుడు **అన్యలోకములందు గూడ కర్మఫల ప్రాప్తిని చూపించి యున్నాడు.**

కాని మనుష్యలోకమునందు వర్ణ, ఆశ్రమాదులకు సంబంధించిన కర్మలకు ఆధిపత్యము కలదు. ఇది విశేషము. ఆ వర్ణాశ్రమాదులయందు అధికారము కలిగియున్నవారల కర్మల యొక్క కర్మ జనిత ఫలసిద్ధి వెంటనే కలుగతుంది.

మానవ లోకమునందే వర్ణాశ్రమాదికమైన కర్మాధికారము కలదు. ఇతర లోకములందు యిటువంటి నియమము లేదు. ఇట్టి నియమము ఏ కారణమువలన వున్నదనగా –

## 4.13 చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః,
## తస్య కర్తారమపి మాం విద్ధ్య కర్తారమవ్యయం.

అనగా – బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, మరియు శూద్రులు ఈ నాలుగు వర్ణములకు **"చాతుర్వర్ణ్యము"** అని పేరు. సత్వ, రజ, తమో గుణముల ఆధారముగ ఆ వర్ణములవారు చేయు **కర్మల ఆధారముగ** ఈ నాలుగు వర్ణముల విభజన ఈశ్వరుడనైన నా చేతనే చేయబడినది. అనగా ఏర్పరచబడినది. "బ్రాహ్మణుదు విశ్వమానవరూప పురుషునకు ముఖము వంటి వాడు." అను శ్రుతి వాక్యము ద్వారా ఈ విషయము ప్రామాణిక మగుచున్నది.

వర్ణవిభజననుసరించి కర్మ విభజన చేయబడినది –

అందులో సత్వగుణము ప్రధానముగా కలిగియున్న పురుషులందరూ బ్రాహ్మణులనియు, శమము, దమము, తపస్సు మొదలగు సాత్విక కర్మలు వారు చేయదగు పనులు.

ఎవరియందు అనగా పురుషులయందు సత్వగుణము గౌణముగా అనగా తక్కువగా వుండి రజోగుణము ప్రధానముగా వుండునో వారందరూ క్షత్రియ వర్ణము వారనియు, శూరత్వ, వీరత్వములు, తేజస్సు, యుద్ధము చేయుట, రాజ్య పాలన చేయుట వారికి విధించిన కర్మలు.

ఏ వర్ణము వారి యందు అనగా ఏ పురుషుల యందు తమో గుణము గౌణముగా వుండి రజోగుణము ప్రధానముగా వుండునో వారందరూ వైశ్య వర్ణమునకు చెందిన వారనియు, వ్యవసాయము వ్యాపారము మొదలగునవి వారికి విధించబడిన కర్మలు.

చివరకు ఏ పురుషుల యందు రజోగుణము గౌణముగాను, మరియు తమోగుణము ప్రధానముగాను వుండునో వారందరూ శూద్రవర్ణమునకు చెందిన వారనియు, పై మూడు వర్ణములవారికి అవసరమగు సేవలు చేయుచుండుట ఈ వర్ణము వారికి విధించబడిన కర్మలు.

ఈ విధముగా గుణములు తదనుసారముగ చేయబడు కర్మలు ఆధారముగ ఏర్పాటు చేయబడిన ఈ వర్ణ కర్మ విభజన నా ద్వారానే చేయబడినది.

ఈ విధమైన నాలుగు వర్ణముల వేఱు వేఱు వ్యవస్థ ఈ భూలోకమందు తప్ప వేరే యే లోకమందును లేదు. అందుచేత పూర్వశ్లోకమునందు **"మనుష్యలోకే"** అను విశేషణ శబ్దము వాడబడినది.

పూర్వ పక్షము – నిజముగా పైన చెప్పబడిన నాలుగు వర్ణముల రచన మరియు ఆయా వర్ణముల వారికి విధించబడిన కర్మలు మొదలగు వాటికి మీరే (భగవంతుడే) కర్త అయివున్నట్లయితే ఆయా కర్మల ద్వారా కలుగు ఫలములతో కూడ మీకు అనగా భగవంతునికి సంబంధము వుండవలయును గదా ? అటువంటి స్థితిలో తమరు (భగవంతుడు) నిత్యముక్తులు, నిత్య ఈశ్వరులు గూడ కాకపోవచ్చును గదా? అన్నచో...........

సమాధానము –

కేవలము నా మాయా వ్యవహారము ద్వారానే నేను ఆయా కర్మలన్నింటికి కర్తను. అయినప్పటికీ గూడ నీవు (అర్జునుడు) మాత్రము నన్ను అకర్తగానే తలంచుము. అంగీకరించుము. అందుచేత నన్ను అనగా భగవంతుని అవ్యయునిగాను, మరియు సంసారబంధము లేనివానిగానూ తలంచుము.

ఏఏ కర్మలకు నీవు నన్ను కర్తగా తలంచుచున్నావో నేను నిజముగా వాటికి కర్తనుగాను.

ఏలయన ? –

**4.14 న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా,**
**ఇతి మాం యో ఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే.**

అనగా – నాయందు ఎటువంటి అహంకారము లేదు. అందుచేత ఆ కర్మలు దేహాదుల వుత్పత్తికి కారణమై నాకు అంటవు, చుట్టుకొనవు. అంతేగాక ఆయా కర్మ ఫలములయందు నాకు ఎటువంటి ఆసక్తి గాని పొందవలయునను కోరిక గాని లేదు.

ఏ ప్రాపంచిక మానవులకు కర్మలయందు "నేను కర్తను" అని అభిమానముండునో మరియు ఏ మానవునికి ఆయా కర్మలు చేయుట యందు మరియు వాటి ఫలములను పొందుట యందు ఆసక్తి వుండునో వారిని కర్మలు బంధించును. ఇది నిజము. కాని ఆ రెండూ అనగా అభిమానము. ఆసక్తి నా యందు లేనందువలన ఆ కర్మలు నన్ను బంధించజాలవు.

ఈ విధముగానే అనగా నావలెనే ఇతరులు ఎవ్వరైనా నన్ను తన ఆత్మగా గుర్తించునో అనగా "నేను ఎటువంటి కర్మలకు కర్తనుగాను" నాకు ఆ కర్మఫలముల యందు ఎటువంటి ఆసక్తి లేదు." అని తలంచునో ఆతనిని గూడ ఈ కర్మలు బంధించక దేహాదులకు కారణము కావు.

"నేను కర్మలకు కర్తనుగాను మరియు నాకు ఆ కర్మ ఫలములములను పొందవలయునను ఆసక్తియు లేదు." అని ఎవడు తలంచునో........

**4.15 ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః,**
**కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్.**

అనగా – అలా తలంచియే పూర్వకాలమునందలి ముముక్షువులైన వారలు గూడ కర్మలు చేసియున్నారు. అందుచేత నీవు గూడ కర్మలే చేయుము. ఎటువంటి కర్మలు చేయకుండా కదలక మెదలక కూర్చుండుటగాని, సంన్యసించుటగాని ఆరెండు కర్మలు నీకర్తవ్యములు కావు.

ఏలయన ? మీ పూర్వీకులు గూడ కర్మలే చేసియున్నారు. అందుచేత నీవు ఆత్మజ్ఞానివి కాకుండినచో, అంతఃకరణ శుద్ధి కొఱకు ఒకవేళ తత్వజ్ఞానివి అయివున్నచో లోక సంగ్రహార్థము జనకాది పూర్వీకుల ద్వారా పరంపరగా వచ్చుచున్న రీతిగా కర్మలు చేయుము. క్రొత్త పద్ధతిలో కర్మలు చేయబోకుము.

కర్మలు చేయుటయే నా కర్తవ్యమై యున్నచో మీ ఆజ్ఞ ప్రకారమే చేయుటకు సిద్ధముగా యున్నాను. అటువంటి స్థితియందు మీరు **"పూర్వే :, పూర్వతర కృతమ్"** అని విశేషించి చెప్పుట ఎందులకు ? అట్టి అవసరమేమున్నది ? అని అర్జునుదడుగగా –

భగవానుడు యిలా అన్నాడు – కర్మలను గురించి చాలా వ్యత్యాసమున్నది. అనగా కర్మకు సంబంధించిన విషయము దురూహ్యమైనది.

అదెట్లన –

**4.16 కిం కర్మ కిమకర్మేతి కవయో ఽప్యత్ర మోహితాః,**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా మోక్ష్యసే ఽశుభాత్.**

అనగా – ఏది కర్మయో, ఏది కర్మకాదో అను ఈ కర్మాదిక విషయమై మహా మహా పండితులు కూడ భ్రాంతిని జెందియున్నారు. అందువలన యిప్పుడు నేను నీకు **ఏది కర్మయో, ఏది కర్మకాదో వివరముగా చెప్పెదను.** ఆ కర్మాకర్మాది విషయమును చక్కగా ఎఱింగి నీవు ఈ మాయా ప్రపంచము నుండి ముక్తుదవగుదువు.

కేవల దేహాదుల చేష్టలే కర్మలని తలంచరాదు. మరియు అటువంటి చేష్టలేమియు చేయక కూర్చుని యుండుటకు అకర్మయనియు, యిందులో యింక తెలియదగినదేమున్నదని తలంచరాదు. ఈ మాత్రం లోకములో అందరికీ తెలియును. మరి ఎందులకు అలా తలంచరాదో చెప్పెద వినుము –

**4.17 కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః,**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః.**

అనగా – కర్మల యొక్క శాస్త్ర విహితమైన క్రియ యొక్క రహస్యము కూడ తెలియవలయును. అట్లే వికర్మ యొక్క శాస్త్ర వర్జితమైన క్రియ యొక్క రహస్యము గూడ

తెలియవలసి యున్నది. మరియు అదే విధముగా అకర్మ యొక్క అనగా నిర్వ్యాపారముగ అనగా ఏమియు చేయక కూర్చుండుట యొక్క రహస్యము గూడ తెలియవలయును.

అట్లేలయన ? కర్మల యొక్క అనగా **కర్మ, అకర్మ, మరియు** వికర్మల యొక్క గతి అనగా వాటి స్వరూపము అనగా వాటి తత్వము చాలా గహనము అనగా తెలియరానిదై యున్నది. అందుచే దానిని తెలుసుకొనుటకు గూడ చాలా కష్టము.

ఈ కర్మాదికముల తత్వమేమిటో, తెలియదగిన రహస్యమేమిటో, దేనిని చెప్పెదనని మీరు ముందుగా ప్రతిజ్ఞ చేసియున్నారో 'చెప్పెదను' అని యున్నారో అది స్పష్టముగా చెప్పండి అని అడుగగా ఇప్పుడు చెప్పుచున్నారు.

**4.18 కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః,**
**స బుద్ధి మాన్మనుష్యేషు స యుక్త ః కృత్స్నకర్మకృత్.**

అనగా – **ఏదో ఒకటి చెయ్యడం అను చేష్టను 'కర్మ' అని అందురు.** ఆ కర్మయందు ఎవడు అకర్మను చూచునో అనగా కర్మ యొక్క లేమిని చూచునో మరియు అకర్మయందు శరీరాదుల యొక్క చేష్టల లేమిలో కర్మను చూచునో అనగా కర్మచేయుట, మరియు చేయకుండుట రెండూ కూడ కర్త (అనగా చేయువాడు చేయనివాడు) యొక్క అధీనమునందున్నవి. మరియు ఆత్మతత్వమును పొందక పూర్వము అజ్ఞానావస్థయందే సర్వవిధ క్రియా కారక వ్యవహారమంతయు ఉండును. అందుచేతనే క్రియను అనగా **కర్మను త్యజించుట గూడ ఒక క్రియయే** అనగా కర్మయే. ★ (కర్మలు చేయుట లేక వాటిని త్యజించుట రెండూ కూడ కర్త యొక్క వ్యాపారాధీనమునందే యున్నవి. అది ప్రవృత్తికి సంబంధించినది కాని, లేక నివృత్తికి సంబంధించినగాని కర్త యొక్క వ్యాపారాధీనమునందున్నంతవరకు అది కర్మయే. అందువలన అహంకారముతో కూడిన కర్మత్యాగము గూడ కర్మయే. ఏలయన ? ఆతడు త్యజించుట ? అను క్రియకు కర్తయే గదా ?)

అందుచేత **అకర్మయందు గూడ కర్మను చూచువాడు బుద్ధిమంతుడు,** అనగా విద్వాంసుడు. ఆతడే యోగి. ఆ విధముగా సర్వవిధ కర్మలు చేయువాడు ఆతడే. ఈ విధముగా **కర్మయందు అకర్మను అకర్మయందు కర్మను చూచువాడే విద్వాంసుడు.**

**పూర్వపక్షము** –

కర్మయందు అకర్మను మరియు అకర్మయందు కర్మను చూచువాడు విద్వాంసుడు అను పరస్పర విరుద్ధమైన మాట ఏ భావముతో చెప్పబడుచున్నది ? ఏలయన ? కర్మ అకర్మ కాజాలదు. అట్లే అకర్మ కర్మ కాజాలదు. అప్పుడు పై విధముగా పరస్పర విరుద్ధముగా చూచుటయనునది ఎట్లు కుదురును ?

**సమాధానము** – నిజముగా విచారించి చూచిన అకర్మయే మూఢమతులకు కర్మవలె తోచుచుండును. అదేవిధముగా కర్మయే అకర్మగా తోచుచుండును. అదేవిధముగా కర్మయే

అకర్మగా తోచుచుండును. ఈ వాక్యములందు మూఢమతులకు తోచు పరస్పర విరుద్ధభావమును తొలగించుటకై భగవానుడు **"కర్మణి అకర్మయః పశ్యేత్"** మొదలగు వాక్యములు చెప్పియున్నారు. అందుచేత వారు చెప్పిన దానియందు విరుద్ధ భావము ఏమియు లేదు. ఏలయన ? 'బుద్ధిమంతులు' అనుమాట అనగా విశేషణము అప్పుడే కుదురును. ఇంతేగాకుండా యథార్థమైన జ్ఞానమే తెలియదగియున్నది అని చెప్పవలసి వుంటుంది. అంతేగాని మిథ్యాజ్ఞానమును కాదు.

మరియు "దేనిని తెలసుకొని అశుభము నుండి ముక్తుడగునో" అని గూడ చెప్పబడినది గదా ? అందువలన విపరీత జ్ఞానము ద్వారా జన్మ మరణరూపమైన అశుభము నుండి ముక్తి సంభవము కాదు గదా ? అందువలన కర్మను అకర్మను పరస్పర విరుద్ధముగా తెలుసుకొనిన వారు ఆ విపరీత జ్ఞానమును తొలగించుకొనుటకే భగవంతుడు **"కర్మణ్య కర్మ యః"** మొదలగు వాక్యములు చెప్పి యున్నారు.

ఇచ్చట **"తొట్టి యందు రేగు పండ్లు"** వలె **కర్మకు ఆధారము అకర్మ కాదు. అట్లే అకర్మకు ఆధారం కర్మకూడ కాదు.** ఏలయన ? **కర్మ యొక్క అభావము (లేమి) పేరు అకర్మ.**

కావున సారాంశమేమనగా ఎండమావుల యందలి జలము వలె మరియు ముత్యపుచిప్ప యందలి వెండివలె లోకులు కర్మ **అకర్మలను పరస్పర విరుద్ధమైనవిగా తలంచి యున్నారు.**

**పూర్వపక్షము** –

కర్మను అందరూ కర్మగనే తలంచుచున్నారు. ఇందులో ఎన్నడూ మార్పేమియు జరుగదు.

**సమాధానము** –

విషయము అదికాదు. ఏలయన ? నావ నడుస్తూ వున్నప్పుడు ఆ నౌక యందు కూర్చునియున్న పురుషునకు ఒడ్డున వున్న వృక్షములు నడుస్తూ వున్నట్లుగా విపరీత భావము తెలుగుచుండును. అనగా ఆ వృక్షములు వ్యతిరేకముగా అనగా వెనుకకు నడుచుచున్నట్లుగా కనుపించును. ఆ విధముగానే నక్షత్రాది పదార్థములు మన కన్నులకు దూరముగా వుండును. చాలా దూరముగా వుండును. ఆ నడుస్తూ వున్న పదార్థముల యందు గూడ గతిలేనట్టుగా మనకు తోచుచుండును. అనగా ఆ నక్షత్రాదులు అచలముగా అనగా స్థిరముగా వున్నట్లు తోచును.

ఇదే విధముగా అకర్మయందు అనగా **ఎటువంటి క్రియలు లేనటువంటి ఆత్మయందు "నేను చేయుచున్నాను" అను కర్మను చూచుట** మరియు **కర్మయందు అనగా "నేను ఏమియూ చేయుట లేదు" అని అకర్మత్వమును చూచుట మొదలగు వ్యవహారమునే విపరీతముగా చూచుట అని యందురు.** కావున అట్టి విపరీత భావమును తొలగించుటకొఱకే **"కర్మణి అకర్మయః పశ్యేత్"** మొదలగు వచనములను భగవంతుడు చెప్పియున్నాడు.

ఈ విషయం యింతకు ముందే అనేకసార్లు శంకా సమాధానముల ద్వారా చెప్పబడియే యున్నది. అయినప్పటికి అత్యంత విపరీత భావముతో అతి ఎక్కువగా లోకులను మోహింపజేసి అనగా భ్రాంతిని కల్పించి అనేక పర్యాయములు విన్నప్పటికి విన్న తత్త్వమును గూడ మరపింపజేసి

మిధ్యా ప్రసంగములతో శకింపజేయుచున్నది. అదుచేతను మరియు ఆత్మ తత్వమును తెలుసుకొనుట అత్యంత కష్టసాధ్యమని తలంచి భగవంతుడు చెప్పిన విషయమునే మరల మరల చెప్పుచున్నాడు.

శ్రుతి, స్మృతి మరియు న్యాయ సిద్ధాంతానుసారముగను ఆత్మయందు కర్మలు సంభవముకాదని తలంచి **"అవ్యక్తో ౾యమచింత్యో ౾యమ్"** నజాయతేనమ్రియతే (చూ.గీత. 2-25) మొదలగు శ్లోకముల ద్వారా చెప్పబడినది. ఇంక ముందు గూడ చెప్పబడును.

ఆ క్రియారహితమైన ఆత్మయందు అనగా అకర్మయందు కర్మను చూచుటయను ఏ విపరీత బుద్ధికలదో అది లోకులకు అత్యంత సహజము మరియు స్వాభావికముగా మారిపోయినది.

అట్లేలయన ? "కర్మ అనగా ఎద్ధియో, మరియు అకర్మ అనగా ఎద్దియో" ఈ విషయమునందు బుద్ధిమంతులు అనగా పండితులైనవారుకూడ మోహమును అనగా భ్రాంతిని జెందియున్నారు.

అనగా - **దేహేంద్రియాదుల ద్వారా జరుగు లేక చేయబడు కర్మలను ఆత్మయందు ఆరోపించి "నేను కర్తను"** ఈ కర్మలు నావలన చేయబడినవి" దీని ఫలమును నేను అనుభవించవలసి యున్నది. అని లోకులు సాధారణముగా తలంచు చుందురు.

మరియు "నేను ఎటువంటి కర్మలు చేయక కదలక మెదలక కూర్చొనియున్నాను. అందుచే నేను శ్రమలేనివాడనై, కర్మలు చేయనివాడనై సుఖముగా వుందును." ఈ విధముగా దేహేంద్రియాదుల కర్మరాహిత్యమును అనగా ఎటువంటి కర్మలు చేయక యుండుటను, అందువలన కలుగు సుఖత్వమును ఆత్మయందు ఆరోపించి "నేను ఎటువంటి కర్మ చేయుటలేదు. కదలక మెదలక సుఖముగా కూర్చొని వున్నాను" అని లోకులు అసహజముగా తలంచుచుందురు.

లోకుల యొక్క యీ విపరీత జ్ఞానమును తొలగించుటకు **"కర్మణి అకర్మయః పశ్యేత్"** మొదలగు వాక్యములు భగవంతుడు చెప్పియున్నారు.

ఇచ్చట దేహేంద్రియాదుల ద్వారా జరుగు కర్మలు క్రియా రూపముగా వున్నప్పటికి లోకులు ఆ కర్మలను కర్మరహితుడు మరియు క్రియారహితుడు అయిన ఆత్మయందు అజ్ఞానము చేత ఆరోపించుచున్నారు. ఉదాహరణకు శాస్త్రగ్రంథములు చదివిన విద్వాంసులు గూడ "ఈ కర్మలు నేను చేయుచున్నాను" అని అంటున్నారు.

అందువలన నదీ తీరములయందున్న వృక్షములయందు భ్రాంతి వలన విపరీత గతి కనుపించువిధముగా అజ్ఞానము వలన అత్మతోనిత్య సంబంధము కలిగి వున్నట్లుగా తలంచి లోకమునందు ఏవి కర్మలగా తలంచబడుచున్నవో ఆ కర్మలయందు యదార్ధముగ నదీతీరము లందున్న వృక్షములకు గతిలేనట్లుగా చూచిన విధముగానే **ఆత్మయందు అకర్మలను చూచును.**

మరియు ఆ విధముగానే అనగా కర్మలయందు వలెనే ఆత్మయందు అజ్ఞానముచేత ఆరోపించబడియున్న శరీరము, ఇంద్రియములు మొదలగువాని జడత్వములోని అకర్మత్వమందు అనగా క్రియయొక్క త్యాగమునందు "నేను కొంచెం కర్మగూడ చేయకుండా కదలక మెదలక

సుఖముగా కూర్చొనియున్నాను." అను ఈ అహంకార సంబంధము కారణముగ ఎవడు కర్మను చూచునో **అనగా ఆ త్యాగమునందు గూడ కర్మను చూచునో,**

ఈ విధముగా ఎవడు ఈ కర్మ అకర్మల భిన్నత్వమును తత్వతః గుర్తించునో ఆతడు మనుష్యులయందు బుద్ధిమంతుడు అనగా తెలివిగలవాడు, పండితుడు. అతడు నిజమైన యోగి. మరియు సంపూర్ణముగ కర్మచేయువాడుగూడ ఆతడే. అనగా ఆతడు పుణ్య-పాప రూపమైన అశుభములనుండి ముక్తుడైనవాడగును. ఆతడే కృతకృత్యుడు.

చాలామంది యీ గీతకు వ్యాఖ్యానములు వ్రాసినవారు ఈ శ్లోకమునకు మరొక విధముగా వ్యాఖ్యానము వ్రాసియున్నారు. అదెట్లన ? ఈశ్వరుని కొఱకు చేయబడు పంచయజ్ఞాది నిత్యకర్మలకు ఫలము వుండదని ఆ కారణముగ అవి గౌణీవృత్తిననుసరించి అకర్మలని వ్రాసియున్నారు. ఆ విధముగా ఆనిత్యకర్మలను చేయుకుండటయే అకర్మలట. అవిగూడ పాపరూపమైన ఫలములిచ్చునవి గావున గౌణ రూపముగానే కర్మలని చెప్పబడునట.

ఆ చెప్పుట ఎట్లున్నదనగా ఆవు ఈనినప్పటికి పాలు యివ్వనిచో ఆ యావు 'అగో' అనగా అది ఆవు కానిది అని చెప్పబడుచున్నట్లుగా. ఆ విధముగానే నిత్యకర్మలయందు ఎటువంటి ఫలములు లేనందువలన వాటిని అకర్మలుగా తలంచునో మరియు నిత్యకర్మలు చేయకపోవుటయను అకర్మలయందు కర్మలను చూచునో అట్లేలయన ? అవి నరకాది విపరీత ఫలములను యిచ్చునవి అగును. అని వ్రాసియున్నారు.

ఇటువంటి వ్యాఖ్యలు సత్యములు కావు. ఏలయన ? ఈ విధముగా తలంచినచో అశుభములనుండి ముక్తి లభించదు. అనగా జన్మ – మరణ బంధము తెగిపోదు. అందుచేత యిలాంటి వ్యాఖ్యలను ఒప్పుకొనిన ఎడల భగవంతుడు చెప్పిన "దేనిని ఎరిగినందున నీవు అశుభముల నుండి ముక్తుడవగుదువో" అను మాటలు వ్యర్థములగును.

ఏలయన ? నిత్యకర్మల అనుష్ఠానము వలన బహుశా అశుభముల నుండి విడుదల అనగా ముక్తి జరిగిన జరుగవచ్చు కాని ఆ నిత్య కర్మల ఫలము మాత్రము కలుగదు. ఈ విధమగు జ్ఞానము వలన మోక్షము కలుగనే కలుగదు. ఏలయన ? "నిత్య కర్మలకు ఫలము కలుగదు" అను జ్ఞానము లేక నిత్యకర్మల వలన కలుగు జ్ఞానము అశుభముల నుండి ముక్తిని కలిగించును అను యిటువంటి మాటలు ఏ శాస్త్రమునందును వ్రాయబడి యుండలేదు. అంతేగాక భగవంతుడైన శ్రీకృష్ణుడు గూడ గీతా శాస్త్రమునందెచ్చటను యిటువంటి మాటలు చెప్పియుండలేదు.

ఈ యుక్తిద్వారా ఆయన చెప్పినటువంటి మాటల ద్వారా అ కర్మల యందు కర్మలను దర్శించు విషయము గూడ ఖండించబడుచున్నది. ఏలయన ? యిచ్చట అనగా యీ గీతయందు నిత్యకర్మల అభావరూపమైన అ కర్మలయందు కర్మలను చూచుటను ఎచ్చటను కర్తవ్య రూప విధానము చేయబడలేదు. కేవలము నిత్యకర్మల కర్తవ్యతా విధానము చెప్పబడినది.

ఇది తప్పు "నిత్య కర్మలు చేయనందున పాపము సంభవించును" అని ఎఱిగినంత మాత్రమున ఎటువంటి ఫలము కలుగదు. అంతేగాక ఈ నిత్యకర్మలు చేయక వుండునటువంటి అకర్మ శాస్త్రములందు తెలియదగిన విషయముగా ఎచ్చటనూ చెప్పబడియుండలేదు.

అదేవిధముగా యితర టీకాకారులు చెప్పినట్లుగా 'కర్మయందు అకర్మను, మరియు అకర్మయందు కర్మను చూచుట' మొదలగు మిథ్యా దర్శనము వలన, 'అశుభము అనగా జన్మ మరణ బంధము నుండి ముక్తి, బుద్ధితత్వము, సమానతత్వము అనగా యుక్తి యుక్తత్వము, సర్వకర్మకర్తృత్వము' మొదలగు ఫలములు గూడ సంభవము కాదు. మరియు యిటువంటి మిథ్యాజ్ఞానము మంచిదని కూడ చెప్పుట తగదు.

మిథ్యాజ్ఞానము తనంతటతానుగానే అశుభరూపమైయుండగా అది మరియొక అశుభమునుండి ఎవరిని ఎట్లు రక్షించగలదు ? అట్లేలయన ? అంధకారము అనగా చీకటి చీకటిని తొలగించజాలదు గదా ?

**పూర్వపక్షము** – ఇచ్చట కర్మయందు అకర్మను చూచుట అట్లే అకర్మయందు కర్మను చూచుట మొదలగు సిద్ధాంతము ఏ యితర టీకాకారుల ద్వారా చెప్పబడినదో అది మిథ్యాజ్ఞానము కాదు. కాని ఫలము కలుగుట కలుగక పోవుటననుసరించి గౌణరూపముగా చెప్పబడినది.

**సమాధానము** – అలా చెప్పుటగూడ సరికాదు. ఏలయన ? గౌణరూపముగా కర్మను అకర్మగాను, అకర్మను కర్మగాను తెలుసుకొనినందువలన గూడ కలుగు లాభమేమియులేదు. ఇదేకాకుండా శ్రుతి సిద్ధమైన మాటను వదలి శ్రుతి విరుద్ధమైన మాటను (యుక్తిని) కల్పించుటలో ఎటువంటి విశేషత్వము కానరాదు.

నిజముగా భగవంతునికి అలా చెప్పుటయే యిష్టమైవుంటే ఆయన అదే విధమైన శబ్దములతో నిత్యకర్మలకు ఎటువంటి ఫలము లేదు మరియు అవి చెయ్యకపోతే నరకప్రాప్తి కలుగును అని చెప్పి వుండెడివారు. అట్టి స్థితియందు ఈ విధముగా "కర్మయందు ఎవడు అకర్మను చూచునో" మొదలగు యితరులను మోహింపజేయు మాయతో కూడిన మాటలు చెప్పినందువలన ప్రయోజనమేమి కలదు ?

ఈ ప్రకారముగా విచారించి చూచిన పై విధముగా అర్థము చెప్పువారి అభిప్రాయము ననుసరించి భగవంతుని ద్వారా చెప్పబడిన మాటలు ప్రపంచములోని వారిని మోహింపజయుట కేయని స్పష్టమగుచున్నది.

ఇలా కాకుండా ఈ నిత్య కర్మానుష్ఠానరూపమైన విషయము మాయతో కూడిన మాటల ద్వారా గుప్తముగా దాచివుంచుటయే మంచిదను మాటను చెప్పినట్లయినది. పై ఈ విషయము చాలా గహనము అనగా పండితులకు గూడ అర్థము కానిది అందుచేతనే శబ్దములను మార్చి మార్చి మరల మరల చెప్పుట ద్వారా సుభోధకమగునని చెప్పుట కూడ సరికాదు.

ఏలయన **"కర్మణ్యేవాధికారస్తే"** (చూ.గీత 2-41) అను శ్లోకమునందు స్పష్టముగా చెప్పబడిన విషయమును మరల చెప్పుట అనావశ్యకము గదా ?

పైగా అన్ని ప్రదేశములందు చెప్పదగియున్నమాటను చెప్పుట ప్రశంసార్హము. అంతేగాక **తెలియతగినది** అని కూడ చెప్పబడుతుంది. నిరర్ధకమైన మాటను 'తెలుసుకొన తగియున్నది' అని చెప్పుట మంచిదని చెప్పబడదు.

మిధ్యాజ్ఞానము లేక ఆ మిధ్యాజ్ఞానము ద్వారా ఋజువు చేయబడిన లేక **ఆభాసమాత్రముగ తెలియబడు వస్తువు తెలియతగినది కాదు.**

ఇంతేకాకుండా నిత్యకర్మలు చేయనందువలన ప్రత్యవాయ రూపమైన అ భావోత్పత్తి గూడ కలుగదు. ఏలయన ? **"నాసతో విద్యతే భావో"** (చూ.గీత. 2-16) మొదలగునవి భగవంతునిచే చెప్పబడిన వాక్యములు. మరియు అసత్తు నుండి సత్పదార్ధము ఎట్లు వుత్పన్నమగును ? మొదలగు శ్రుతి వాక్యములు గూడ యింతకు పూర్వమే చెప్పబడియున్నవి.

పై విధముగా అసత్తు నుండి సత్తు కలుగదని నిషేధించినప్పటికీ అసత్తు నుండి సత్పదార్ధము కలుగునని చెప్పువారు చెప్పునది ఎట్లున్నదనగా అసత్తు నుండి సత్తు కలుగును. **అట్లే** సత్తు అసత్తుగా పరిణమించును. కాని యిది యంతయు ప్రమాణములకు విరుద్ధమైనందున **అయుక్తము** అనగా ఒప్పుకోబడనిది.

శాస్త్రము గూడ నిరర్ధకమైన కర్మలను విధించజాలదు. ఏలయన ? **కర్మలన్నియు శ్రమదృష్టితో చూచిన ఎడల దుఃఖజనకములే.** అందువలన తెలిసి తెలిసి ఎవ్వడూ కూడ దుఃఖములను కొనితెచ్చుకొను ప్రయత్నము చేయడు.

ఆనిత్య కర్మలను చేయకుండిన యెడల నరకము ప్రాప్తించును. అని శాస్త్ర గ్రంధములందు వ్రాసి యున్నదని వొప్పుకొన్ననూ కర్మ చేసినందువలనను, కర్మ చేయకుండినను రెండు విధముల శాస్త్రము అనర్ధదాయకమేనని, అందుచేత శాస్త్రము వ్యర్ధమని ఋజువగును గదా ?

ఆ విషయం అలా వదలి "నిత్యకర్మలకు ఎటువంటి ఫలము లేదు. అని తలంచి అవి మోక్షరూపమైన ఫలమును యిచ్చును." అని చెప్పినచో పై వ్యాఖ్యాకారులకు స్వవచన వ్యాఘాత దోషము సంభవించును గదా ?

అందువలన **'కర్మణి అకర్మయః పశ్యేత్'** మొదలగు శ్లోకములకు గురుపరంపర ద్వారా విన్న విధముగా మేము చెప్పిన అర్ధమే సరియైనది. అందుచేతనే మేము కూడ యీ శ్లోకమునకు అటువంటి వ్యాఖ్యయే చేసినాము.

ఇప్పుడు పైన చెప్పబడిన కర్మయందు అకర్మ, అకర్మయందు కర్మను దర్శించుట శుభకరమని దానిని స్తుతించుచున్నారు.

**4.19 యస్య సర్వే సమారంభాః కామ సంకల్ప వర్జితాః,**
**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః.**

అనగా - ఏదైనా పనిని ఆరంభించుటను సమారంభము అని అందురు. ఈ శబ్దమునకు గల ఈ వ్యుత్పత్తి అర్ధముననుసరించి అన్ని విధములైన కర్మలకు సమారంభము అని పేరు.

పైన చెప్పిన విధముగా కర్మయందు అకర్మను మరియు అకర్మయందు కర్మను చూడసామర్థ్యము కలిగిన పురుషుని యొక్క సర్వ సమారంభములు కోరికల వలన మరియు కోరికలకు కారణ రూపమైన సంకల్పము కూడ లేనివగును. అనగా ఎవనివలన తనకు ఎటువంటి ప్రయోజనము లేకుండానే ఒకవేళ ఆతడు ప్రవృత్తి మార్గమునందున్న వాడైనచో లోక సంగ్రహము కొఱకు, ఒకవేళ అతడు నివృత్తి మార్గము నందున్న వాడైనచో కేవలము జీవనయాత్ర జరుగుటకు మాత్రమే అనగా ఎటువంటి ఫలభావము లేకుండ చేష్ట అనగా ఫలమును కోరని కర్మ చేయుట అనబడును.

మరియు కర్మయందు అకర్మ మరియు అకర్మయందు కర్మదర్శన రూపమైన జ్ఞానాగ్నిచేత ఎవనియొక్క పుణ్య-పాప రూపమైన సంపూర్ణ కర్మఫలములు దగ్ధమై పోయినవో అటువంటి జ్ఞానాగ్నిదగ్ధ కర్ముడు అయిన పురుషుని బ్రహ్మతత్వమును ఎఱింగిన మహాత్ములు పండితుడు అనగా సర్వజ్ఞుడని ప్రశంసించెదరు.

ఏ మహాత్ముడు కర్మయందు అకర్మను మరియు అకర్మయందు కర్మతత్వమును చూడ నేర్చునో ఆతడు తనకు యిటువంటి వివేకము కలుగక పూర్వము ఎటువంటి కర్మలు చేసి యున్నప్పటికి కర్మయందు అకర్మను అకర్మ యందు కర్మజ్ఞానము కలిగినందువలన కేవలము శరీరపోషణ కొఱకు మాత్రమే చేష్టలు – కర్మలుకాదు – చేయుచు కర్మరాహిత్యము కలిగియున్న సంన్యాసితో సమానుడగును. ఆతనికి తిరిగి ఎన్నడూ కర్మలు చేయవలయునన్న సంకల్పము గూడ కలుగనేరదు.

అనగా ఎవడైన అంతకు పూర్వము కర్మలు చేయువాడై యున్నను తరువాత ఆతనికి ఆత్మతత్వము యొక్క సమ్యక్ జ్ఞానమయు కలిగియున్నచో అటువంటి పురుషుడు కర్మలు చేయుటయందు ఎటువంటి ప్రయోజనము లేదని చక్కగా ఎఱింగి సర్వవిధ సాధనములతో సహా కర్మలన్నింటిని చేయుట వదలి వేయును.

ఒకవేళ యే కారణముచేతనైనా కర్మాచరణ త్యజించుట సాధ్యపడని యెడల ఏ పురుషుడైనా కర్మలయందు మరియు వాటి ఫలములయందు ఆసక్తిరహితుడై కేవలము లోక కల్యాణార్థ భావముతో మనస్సును నింపుకొని పూర్వము వలెనే కర్మలు చేయుచుండినచో ఆతనికి గూడ కర్మలయందు స్వప్రయోజనము లేదు గావున ఆతడు కర్మ త్యాగము జేసిన సంన్యాసితో సమానుడే.

ఏలయన ? జ్ఞానమను అగ్ని ద్వారా భస్మీభూతము అయిపోయినందువలన ఆతనిచే చేయబడు కర్మలన్నియు అకర్మలేయగును. ఈ భావమును తెలుపుట కొఱకు భగవానుడు యిట్లు చెప్పుచున్నాడు –

### 4.20 త్యక్త్వా కర్మఫలా సంగం నిత్యతృప్తో నిరాశ్రయః, కర్మణ్యభిప్రవృత్తో ఽపి నైవ కించిత్కరోతి సః.

అనగా – ఏ మానవుడు పైన చెప్పబడిన జ్ఞానమును పొంది, దాని బలము వలన కర్మల యందు అభిమానమును మరియు ఆ కర్మల వలన కలుగు ఫలములయందు ఆసక్తిని గూడ త్యజించి నిత్యతృప్తుడై అనగా విషయములయందు కోరికలు లేనివాడగునో –

అనిష్టకారకమైన పుణ్య-పాపముల రెంటిని పొందదు. **బంధమునకు కారణమగుటచేత ధర్మము గూడ ముముక్షువునకు అనగా మోక్షమును పొందవలయునను కోరిక గలవానికి పాపహేతువే అగును.**

ఈ శ్లోకమునందు "శారీరం కేవలం కర్మ" అను పదమునందు శరీరము ద్వారా చేయబడు కర్మలు శారీరిక కర్మలని చెప్పబడినవి. లేక శరీర పోషణార్థము మాత్రమే చేయబడు కర్మలు శారీరిక కర్మలని చెప్పబడినవి.

కేవలము శరీరము ద్వారా చేయబడు కర్మలు శారీరిక కర్మలని చెప్పబడినను లేక శరీర పోషణార్థము మాత్రమే చేయబడు కర్మలు శారీరిక కర్మలని చెప్పబడినను అందువలన కలుగు ప్రయోజనమేమి కలదు ? అన్నచో -

శరీరము ద్వారా చేయబడు కర్మలు శరీరిక కర్మలని ఒప్పుకొన్నప్పటికి ఈ లోకమునందును మరియు పరలోకమునందును ఫలములనిచ్చునటువంటి నిషిద్ధ కర్మలను గూడ శరీరము ద్వారానే చేయుచు మానవుడు పాపమును పొందదు. అని చెప్పినందువలన భగవంతుని కథనమునందు "పరస్పర విరోధ"మను దోషము సంభవించుచున్నది. మరియు ఈ లోకమునందును మరియు పరలోకమునందును ఫలములను యిచ్చునటువంటి శాస్త్రవిహితమైన కర్మలను శరీరము ద్వారానే చేయుచు మానవుడు పాపమును పొందదు అని చెప్పినప్పటికి గూడ ప్రాప్తించకుండానే దోషమును నిషేధించుటకు అవకాశము కలుగుచున్నది.

మరియు "శారీరిక కర్మలు చేయుచు" అను విశేషణము వలన మరియు "కేవలము' ' అను శబ్ద ప్రయోగము వలన పైన చెప్పబడిన సిద్ధాంతము ననుసరించి "శరీరము (తప్ప) కాకుండా మనస్సు వాక్కుల ద్వారా చేయబడు ధర్మయుక్తము మరియు ధర్మవిరుద్ధము అయిన కర్మలను - వేటిని మనము ధర్మము మరియు అధర్మము పేరుతో పిలుస్తూ వుంటామో - చేయు మానవుడు పాపమును పొందును అని భగవంతుడు చెప్పినట్లగుచున్నది గదా !

"అందులో గూడ మనోవాక్కుల ద్వారా విహిత కర్మలు అనగా వేదాది ధర్మగ్రంథముల ద్వారా విధించబడిన కర్మలు చేయుచూ పాపమునే సంపాదించును" అని చెప్పుట మరీ విరుద్ధముగా తోచుచున్నది. ఆ పైన "నిషిద్ధ కర్మలు చేయుచుండినను పాపమే ప్రాప్తించును" అని చెప్పుట కేవలము అనువాదము వలె వుండుటచే అర్థము లేని వాక్య మగుచున్నది.

కాని **కేవలము స్థూల శరీర పోషణార్థము మాత్రమే చేయబడు కర్మలు శారీరిక కర్మలు** మాత్రమే యని తలంచిన యెడల ఈ లోకము లేక పరలోకమునకు సంబంధించిన భోగములే ప్రయోజనముగా గలిగియున్న విధి నిషేధాత్మక కర్మలుగా శాస్త్రాది గ్రంథముల ద్వారా తెలియబడుచున్నది. అవన్నియు గూడ శరీరము మనస్సు లేక వాక్కుల ద్వారా చేయబడుచున్నవి

గదా ? అటువంటి యితర కర్మలు చేయకుండా ఆ శరీరము, మనస్సు లేక వాక్కుల ద్వారా శరీర పోషణార్థమే అవసరమైన కర్మలు లోకదృష్టితో చేస్తూ వున్న పురుషుడు కిల్బిషుడు అనగా ఆత్మవంచకుడుగా వుండును గదా ? ఇచ్చట కేవలము అను శబ్దమును వుపయోగించుటకు కారణమేమన ఆ పురుషుడు "నేను చేయుచున్నాను" అను అభిమానము లేనివాడై కేవలము లోక దృష్టితోనే శరీరము వాక్కు మొదలగు వాటిద్వారా చేష్టలు మాత్రమే చేయునుగాని, ఫలాపేక్ష కలిగిన కర్మలు చేయడు.

అటువంటి పురుషునకు పాపరూపమైన వంచనా దోషము సంభవించుట అసంభవము. అందుచేత ఆతడు కిల్బిషము అనగా ప్రాపంచిక భావదోషము పొందదని యిచ్చట తలంచవలయును.

జ్ఞానరూపమైన అగ్నిద్వారా ఆతనియొక్క సమస్తమైన కర్మఫలములు నశించి పోయినందున ఆతడు ఎటువంటి ప్రతిబంధకములు లేకుండగనే ముక్తత్వమును పొందును.

ఇది అంతా గూడ యింతకు పూర్వమే చెప్పబడిన యధార్థమైన ఆత్మజ్ఞానము వలన కలుగు ఫలముయొక్క పునరుక్తి మాత్రమే. **"శరీరం కేవలం కర్మ"** అను వాక్యమునకు ఈ పైన చెప్పబడిన విధముగా అర్థమును గ్రహించినచో ఆ యర్థము నిర్దోషమైనదిగా తలంచబడును.

అన్ని విధములైన సంగ్రహ కార్యములను త్యజించిన మానవుడు అనగా సంన్యాసి వద్ద శరీర నిర్వహణకు కారణరూపమైన అన్నాదుల సంగ్రహము కూడా వుండదు. అందుచేతనే అట్టివానికి యాచక వృత్తిద్వారా శరీర పోషణాధికారము లభించినది. అంతేగాక "యాచన చేయకుండానే అనగా తనంతట తానుగా ఎవ్వరిని అడగకుండానే. ఎటువంటి సంకల్పము లేకుండానే లేక తాను కోరకయే లభించినటువంటి" అను మొదలగు వాక్యముల ద్వారా శాస్త్రాది గ్రంథముల యందు సంన్యాసికి శరీర నిర్వహణ కొఱకు అవసరమైన అన్నాదులను పొందే మార్గము చూపబడినదో దానిని గురించి ముందు శ్లోకము చెప్పుచున్నారు.

**4.22 యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః,**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే.**

అనగా – యాచించకుండా అనగా అడకుండా తనంతట తానుగా లభించిన పదార్థమునే భుజించి సంతుష్టిని చెందునో అనగా మనస్సులో యింతే చాలునన్న భావము కలుగునో

ఎవడు యింద్రియములకు అతీతముగా వ్యవహరించునో అనగా ఎటువంటి వైరబుద్ధి అనగా ఎవ్వరియందును శత్రుమిత్రభావము లేక యుండునో మరియు దొరికినదానితో తృప్తిపడి లాభనష్టభావము లేక సమభావము కలిగియుండునో.

ఎవడు శరీరాదులకు కారణరూపమైన అన్నాదులు లభించినను లభించకున్ననూ హర్ష శోకాదులు లేక సమభావము, సమదర్శత్వము కలిగియుండునో

మరియు కర్మాదులయందు అకర్మత్వాదులను చూచువాడు. యధార్థముగా ఆత్మ దర్శన నిష్ఠగలవాడు.

మరియు కేవలము శరీర స్థితికొఱకు మాత్రమే చేయబడు మరియు శరీరాదుల ద్వారా జరుగు భిక్షాటనాది కర్మలయందు గూడ "నేనెటువంటి కర్మలు చేయుట లేదు గుణములే గుణములయందు ప్రవర్తించుచున్నవి" అని సర్వకాల సర్వావస్థలయందును తలంచువాడు అయిన యతి అనగా సంన్యాస ధర్మమును స్వీకరించిన పురుషుడు తనయందు కర్తృత్వ హీనత్వమును ఎఱింగినందువలన అనగా ఆత్మకు కర్తృత్వము వేదని ఎఱింగినందువలన కొంచము గంభీరముగా విచారించి చూచిన ఆతడు భిక్షాటనాది కర్మలు గూడ చేయుట లేదని తెలియును.

ఇటువంటి మానవుడు లోకవ్యవహారమునకు సంబంధించిన సాధారణ దృష్టితో చూచువారికి సాంసారిక పురుషుల చేత ఆరోపించబడి భిక్షాటనము మొదలగు కర్మలు చేయుచున్న కర్తవలెనే తోచును. కాని శాస్త్రప్రమాణాదుల ద్వారా కలిగిన అనుభవముతో చూచిన యెడల ఆతనియందు గల అకర్తృత్వము బోధపడును.

ఈ విధముగా యితరుల ద్వారా ఎవరియందు కర్తృత్వము ఆరోపించబడుచున్నదో అటువంటి ఆ పురుషుడు కేవలము దేహధారణ కొఱకు మాత్రమే చేయబడు **భిక్షాటనాది కర్మలు గూడ ఆ మహాత్మునకు బంధ హేతువులు కాజాలవు.** ఏలయన ? జ్ఞానరూపముగా వున్న అగ్నిద్వారా బంధమునకు కారణములైన సమస్త కర్మఫలములు భస్మీభూతములై పోయినవి. ఈ మాట యింతకు పూర్వము గూడ చెప్పబడినది.

ఏ పురుషుడు కర్మలు చేయుట ఆరంభించియున్నాడో ఆతడు ఆ కర్మలు చేస్తూ వుండగానే జ్ఞాన సంపన్నుడగునో అనగా "నిష్క్రియ బ్రహ్మ పదార్థమే ఆత్మ" అని తెలుసుకొనునో అప్పుడు ఆతడు తన కర్మలవలన కలుగు ప్రయోజనాదుల అభావమును అనగా లేమిని చూడగలిగిన ఆ పురుషునికి యింక కర్మలు ఆచరించుటకు అవకాశమేవుండదు.

కాని ఏవో కొన్ని కారణాంతరముల వలన కర్మాచరణమును త్యజించుట సంభవము కాదేని, అందువలన ఆతడు పూర్వమువలెనే కర్మాచరణమునందు లీనమై యున్నప్పటికి ఆతడు కర్మలు చేయనివాడే అగును. ఈ విధముగా **"త్యక్త్వాకర్మఫలాసంగమ్"** (చూ. గీత 4-20) అను శ్లోకము ప్రకారము జ్ఞానియందు కర్మాభావము చెప్పబడినది. ముందు శ్లోకమునందు గూడ యీ విషయమై చెప్పబడుచున్నది.

**4.23. గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః,**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే.**

అనగా - ఏ మహాపురుషునికి అన్నివైపుల నుండి ఆసక్తి నివృత్తి చెందియున్నదో, ఎవని సమస్త పుణ్య పాపముల రూపమైన బంధములు విడిపోయినవో, ఎవని చిత్తము సర్వకాల సర్వావస్థలయందును జ్ఞానభావముతో నిండియున్నదో అట్టివాని యొక్క కేవలము యజ్ఞ సంపాదన కొఱకు మాత్రమే కర్మాచరణము చేయు సంగహీనత్వము ముక్తత్వమును పొంది

జ్ఞానముతో నిండియున్న చిత్తము గల పురుషుని సర్వవిధ కర్మలు మరియు వాటి ఫలములు గూడ నశించియే యుండును. "సమ అగ్ర" అను శబ్దము ఫలమును సూచించుచున్నది. అటువంటి ఫలముతో కూడిన కర్మలను సమగ్ర కర్మలందురు. అందువలన చెప్పు నిర్ణయ మేమన – ఆతనియొక్క సమస్తమైన ఫలములతో కూడియున్న కర్మలు నశించిపోవుచున్నవి.

చేయబోవు కర్మలు తమ క్రియలను ఆరంభించకుండగనే ఎటువంటి ఫలములను గలుగజేయకుండగనే ఏ విధముగా తమ ఫలములతో సహా ఎట్లు నశించును ? అన్నచో –

ఈ క్రింది విధముగా చెప్పుచున్నారు –

**4.24. బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్,**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా.**

అనగా – బ్రహ్మవేత్త అయిన పురుషుడు ఏ సాధనము ద్వారా అగ్నియందు హవిస్సును (సమిధను) అర్పించునో ఆ సాధనమును ఆతడు బ్రహ్మరూపముగానే తలంచును. అనగా ఆత్మ తప్ప యితరమైనదంతటి అభావమును (లేమిని) తెలుసుకొనును.

అదెట్లనగా – ముత్యపు చిప్పను చూచువాడు ఆ ముత్యపు చిప్పయందు వెండిని చూడడు. కావున "బ్రహ్మమే అర్పణము" అను పదము ద్వారా ఆపై మాటే చెప్పబడుచున్నది. అదెట్లనగా – వెండివలె తోచుచున్న వస్తువు ముత్యపు చిప్పయే అని ఎఱింగినవానికి ముత్యపు చిప్పయందు వెండి తోచదు గదా !

ఆ విధముగానే బ్రహ్మవేత్త అనగా బ్రహ్మ తత్వమును చక్కగా ఎఱింగినవాడు. అయినవాడు; తాను అర్పించు పదార్థము మరియు అర్పించుటకు ఉపయోగించు సాధనము అనగా సర్వమును బ్రహ్మముగానే చూచును.

తాత్పర్యమేమన ? ప్రపంచమునందు అర్పించబడు వస్తువులన్నియు "స్రుక్ . స్రువ" మొదలగు పదార్థములన్నియు బ్రహ్మవేత్త అయినవాని దృష్టిలో బ్రహ్మమే.

ఆ విధముగానే 'హవిస్సు' రూపమున అర్పించబడు పదార్థము గూడ బ్రహ్మమే.

ఆ బ్రహ్మకర్మము చేయు పురుషుని ద్వారా పొందదగిన ఫలము గూడ బ్రహ్మమే. అనగా బ్రహ్మరూపమైన కర్మయందు సమాధానమును అనగా పరమశాంతిని పొందిన చిత్తముగల పురుషుని ద్వారా పొందదగిన ఫలము గూడ బ్రహ్మ పదార్థమే.

ఈ విధముగానే లోకసేవ చేయగోరు పురుషుని ద్వారా చేయబడిన కర్మలు గూడ బ్రహ్మ బుద్ధివలన బాధింపబడుచున్నందున అనగా ఆ కర్మలకు ఫలములనిచ్చు శక్తి లేకుండా పోవుచున్నందువలన ఆ కర్మలన్నియు అకర్మలే అగుచున్నవి.

ఈ విధమగు అర్థమును ఒప్పుకొన్నందున కర్మలన్నింటిని త్యజించినట్టి సంన్యాసి యొక్క జ్ఞానమును గూడ యథార్థమైన జ్ఞానము యొక్క విశేషత్వమును తెలుపుట కొఱకు యజ్ఞరూపగా తలంచుటకు ఎటువంటి అభ్యంతరము వుండబోదు. అధియజ్ఞమునందు స్రవాది

ప్రసిద్ధ వస్తువులు అన్నియు యథార్థమైన జ్ఞానియైన సంన్యాసి యొక్క ఆత్మయజ్ఞమునందు బ్రహ్మపదార్థమే అగుచున్నవి.

పైన చెప్పిన అర్థమును ఒప్పుకొనని యెడల అన్ని పదార్థములు **నిజముగా బ్రహ్మ రూపమే అయివున్నందున** కేవలము స్రువ్ మొదలగువాటినే ప్రత్యేకించి బ్రహ్మ రూపములని చెప్పుట వ్యర్థమగును.

అందువలన – **"ఈ ఉన్నదంతయు బ్రహ్మమే" అని తలంచు జ్ఞానికి యథార్థముగా అన్ని కర్మలు లేనివే అగుచున్నవి.**

మరియు అతని అనగా జ్ఞానియొక్క అంతఃకరణమునందు క్రియలు మరియు **వాటి** ఫలములు మొదలగునవన్నియు కారక సంబంధమైన భేదబుద్ధి లేని కారణముగా గూడ పైమాటే సిద్ధమగుచున్నది. ఏలయన ఏ పురుషుడు గూడ యజ్ఞమను పేరుగల కర్మకారక సంబంధమైన భేదబుద్ధి లేనివానిగా చూడబడలేదు.

తాత్పర్యమేమన ? అగ్నిహోత్రాది సర్వకర్మలు (ఇంద్రాయ, వరుణాయ మొదలగు) శబ్దముల ద్వారా హవి మొదలగు ద్రవ్యములు అర్పించబడుచున్నందున ఆ దేవతల యొక్క విశిష్ఠ రూపములు మొదలగు కార్యకరణ బుద్ధులు ఏర్పడినవారు కర్తృత్వాభిమానము మరియు తాము చేసిన కర్మల ఫలములయందు కోర్కెలు గలవారుగా యుందురు.

**క్రియ, కారకము మరియు ఫలసంబంధమైన భేదబుద్ధి నశించినటువంటిన్నీ మరియు కర్తృత్వాభిమానము మరియు ఫలాపేక్ష లేనటువంటి యజ్ఞములు గాని, యాజ్ఞికులు గాని కానరారు.**

కాని పైన చెప్పబడిన కర్మలు అటువంటివి కావు. ఏలయన ? ఆ కర్మలయందు భేదబుద్ధికి బదులుగా బ్రహ్మబుద్ధి నిండియుండును. నేను అర్పించుచున్నాను. నేను ఫలమును పొందుదును అను భేదబుద్ధితో కూడిన కోరికలు కూడ వుండవు. అందుచేతనే యిటువంటి కర్తృత్వాభిమానము మరియు కర్మఫలాపేక్ష మొదలగు కోరికలు నశించియున్నందున చేయబడు కర్మలు అకర్మలుగా చెప్పబడినవి.

ఈ మాటే **"కర్మణ్య కర్మయః పశ్యేత్"** చూ. గీత 4.18, **"కర్మణ్యభి ప్రవృత్తో ఽపి నైవ కించిత్కరోతి సః"** చూ. గీత 4.20 **"గుణాగుణేషు వర్తంత"** చూ. గీత 3.28, **"నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్వవిత్"** చూ. గీత 5.8 మొదలగు శ్లోకముల ద్వారా గూడ చెప్పబడినది.

మరియు ఈ విధముగానే భగవంతుడు సందర్భానుసారముగ యింక అనేకచోట్ల క్రియ, కారకము మరియు ఫలేచ్ఛా సంబంధమైన భేదబుద్ధిని నిషేధించియున్నారు.

అట్లే సకామ అనగా కోరికలతో కూడియున్న అగ్నిహోత్రాదులందు కామము అనగా ఫలేచ్ఛ లేకుండిన అవి అనగా ఆ అగ్నిహోత్రాదులు సకామ అగ్నిహోత్రాదులు కాకుండా పోవును.

ఈ విధముగా చూచిన కేవలము బ్రహ్మ దృష్టిని సంపాదించి పెట్టు జ్ఞానము వలన మోక్షరూపమైన ఫలము లభించదు. పైగా యిచ్చట వారిచే స్పష్టముగా చెప్పబడిన దేమనగా– 'స్రువ' మను అర్పణ ద్వారా పొందునటువంటి ఫలము బ్రహ్మమే అయి వున్నది. అటువంటి స్థితిలో యధార్థ జ్ఞానము లేకుండగనే మోక్షరూపమైన ఫలము లభించును. అని చెప్పుట శుద్ధ వ్యతిరేకము గదా ?

అంతేకాకుండా వారు చెప్పుచున్నట్లుగా ఒప్పుకొన్నట్లయితే శ్లోకార్థమంతయు మరో విధముగా వుండును. సారాంశమేమన ? "ఎవడు కర్మయందు అకర్మను చూచునో అని యిచ్చట ఆరంభమునందు సమ్యక్ జ్ఞానమును గురించియే శ్లోకార్థము చెప్పబడినదో అది ఆ విషయమునందే ఉపసంహారము గూడ చేయబడినది. అందువలన అంతమునందు గూడ **యధార్థ జ్ఞానమే మోక్ష ఫలదాయకమని చెప్పబడినది.**

అట్లేలయన ? "ద్రవ్యమయమైన అనగా **అనేక విధములైన బాహ్య సాధన సామగ్రి సహాయముతో చేయబడు యజ్ఞము కంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠతరము.** అటువంటి జ్ఞానమును పొంది జీవుడు వెంటనే పరమశాంతిని పొందును" మొదలగు వాక్యముల ద్వారా యధార్థ జ్ఞానమునే శ్రేష్ఠతరమని చెప్పుచూ యీ అధ్యాయము ముగించబడినది.

అట్టి స్థితిలో సందర్భము లేకుండగనే అకస్మాత్తుగా మూర్తి అనగా రాతిబొమ్మ యందు విష్ణువును వీక్షించు దృష్టివలె 'స్రువ' మొదలగువాటియందు బ్రహ్మ దృష్టిని కల్పించుట సరికాదు.

అందుచేత పైన చెప్పబడిన శ్లోకార్థమే సరియైనది.

పైన చెప్పబడిన శ్లోకమునందు యధార్థ జ్ఞానమును యజ్ఞరూపముగా సంపాదించి యిప్పుడు ఆ జ్ఞాన విశేషమును ప్రస్తుతించుట ద్వారా **"దేవమ్ ఏవ"** మొదలగు శ్లోకముల ద్వారా యింకా యితరేతరమైన యజ్ఞముల వ్యాఖ్యానము చేయబడుచున్నది.

**4.25. దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే,**
**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి.**

అనగా – ఏ యజ్ఞము ద్వారా దేవతలు పూజింపబడుదురో అది దేవతలకు సంబంధించిన యజ్ఞము. యోగులు అనగా కర్మలు చేయు మానవులు ఆ దేవ యజ్ఞములనే అనుష్ఠింతురు.

ఇతరులు అనగా బ్రహ్మవేత్తలైన పురుషులు బ్రహ్మాగ్ని యందు హవనము చేయుదురు. అనగా **"బ్రహ్మ సత్యజ్ఞాన అనంత స్వరూపుడు" "విజ్ఞానము మరియు ఆనందమే బ్రహ్మ" "సాక్షాత్తు అనగా అపరోక్షముగా వున్నదియే బ్రహ్మ. సర్వాంతరము అనగా అంతటా నిండియున్నదే బ్రహ్మము.** అను మొదలగు వాక్యముల ద్వారా ఏ పదార్థము యొక్క వర్ణనము చేయబడినదో, ఏది ఆకలిదప్పులు మొదలగు సమస్తమైన ప్రాపంచిక ధర్మములు లేనిదై యున్నదో ఏది 'న యితి, న యితి' అనగా యిదికాదు యిదికాదు అని వేదవాక్యముల ద్వారా సర్వవిశేషణ రహితముగా చెప్పబడినదో అదియే 'బ్రహ్మ' శబ్దము ద్వారా చెప్పబడినది.

హవనము యొక్క గొప్పతనమును గురించి చెప్పుటకే యిచ్చట ఆ బ్రహ్మమునే అగ్నిగా
నది. ఆ బ్రహ్మరూపమైన అగ్నియందు ఎంతోమంది **బ్రహ్మవేత్తలు అయిన జ్ఞానులు**
**ద్వారా యజ్ఞమునే హవనము చేయుదురు.** ఆత్మకు సంబంధించిన నామములందు
ను శబ్దము కూడ వున్నందున **ఆత్మయొక్క నామము యజ్ఞము. వాస్తవముగా అది**
**త్మమే.** కాని బుద్ధి మొదలగు వుపాధులతో కూడియున్నందున ఆ ఉపాధులయొక్క
లను అనగా గుణములను తనవిగా అనగా తనకు (ఆత్మకు) సంబంధించినవిగా
చున్నారు. ఆ ఆహుతి రూపమైన ఆత్మను పైన చెప్పబడిన ఆత్మ ద్వారానే హవనము
రు.

సారాంశమేమన ? – ఉపాధులతో కూడియున్న ఆత్మను ఉపాధులతో కూడక
పముతో యున్న పరమాత్మయందు సాక్షాత్కరింపజేయవలయును. అదియే ఆత్మను
ు చేయుట అను యజ్ఞక్రియ. బ్రహ్మ మరియు ఆత్మయొక్క ఐక్యతా జ్ఞానమునందు
ున్న సంన్యాసులు యిటువంటి హవనక్రియను నిర్వహింతురు.

**"శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞా జ్ఞాన యజ్ఞః పరంతప"** (చూ. గీత 4.33)
ు శ్లోకముల ద్వారా వర్ణించుటకు గాను ఈ సమ్యగ్ దర్శనరూపమైన యజ్ఞము
**ప్పణమ్"** (చూ. గీత 4.24) మొదలగు శ్లోకముల ద్వారా దేవయజ్ఞము మొదలగు
ల యందు కలుపబడు – ఏకీకృతము చేయబడు చున్నది.

**శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి,**
**శబ్దాదీ న్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి.**

అనగా – ఇతరులైన యోగులు సంయమము అను అగ్నులయందు చెవ్వు మొదలగు
యములను హవనము గావింతురు. **సంయమమే అగ్నులు** ఆ అగ్నులయందే తమ
యములను హవనముగా అర్పింతురు. అనగా తమ యింద్రియములను సంయ
ు అనగా తమ యింద్రియములను తమ అధీనమునందుంచుకొందురు. ఒక్కొక్క
యముయొక్క సంయమనము వేఱు వేఱుగా వుండును. అందుచేతనే "అగ్నులు" అని
నము చెప్పబడినది.

ఇందులకు భిన్నముగా వ్యవహరించు సాధకులు యింద్రియములనెడు అగ్నులయందు
షయములను హవనముగా అర్పింతురు. అందుచేత **యింద్రియములే అగ్నులు.** ఆ
యాగ్నులయందు **విషయరూప పదార్థములను హవనముగావింతురు.** అనగా ఆ శ్రోత్రాది
మొదలగు) యింద్రియముల ద్వారా శాస్త్రసమ్మతమైన విషయములను మాత్రమే
టను హోమమందురు.

మరియు -

**4.27. సర్వాణీంద్రియ కర్మాణి ప్రాణకర్మాణి చాపరే,**
**ఆత్మ సంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే.**

అనగా - ఇతర సాధకులు యింద్రియముల ద్వారా జరుగు సమస్త కర్మలను మరియు దేహములోపల నున్న వాయువు (దానినే ప్రాణమని గూడ అందురు) యొక్క లోపలికి పోవుట, బయటకు వచ్చుట అనగా ఉచ్ఛ్వాస, నిశ్వాసలను మొదలగు క్రియలను జ్ఞానముచేత ప్రకాశింపబడిన ఆత్మసంయమ రూపమైన యోగాగ్నియందు హవనము గావింతురు.

**ఆత్మవిషయకమైన** సంయమమును ఆత్మసంయమమందురు. ఆ సంయమమే యిచ్చట **యోగాగ్ని** అని చెప్పబడినది. ఘృతము అనగా నెయ్యి మొదలగు ద్రవపదార్థముల ద్వారా ప్రజ్వలింపబడిన ధారణ, ధ్యానము, సమాధి రూపమైన ఆత్మసంయమము అనెడి యోగాగ్నిలో ఆ ప్రాణము మరియు యింద్రియముల ద్వారా చేయబడు కర్మలను హవిస్సు రూపములో అర్పించి భస్మము గావింతురు.

**4.28. ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాపరే,**
**స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః.**

అనగా - తీర్థాదులయందు ద్రవ్యము వెచ్చించువారు ద్రవ్యసంబంధమైన యజ్ఞము చేయువారు.

తపములు చేయువారు తపరూపమైన యజ్ఞము చేయువారని చెప్పబడుదురు.

ప్రాణాయామము, ప్రత్యాహార రూపమైన యోగమునే యజ్ఞముగా తలంచువారు యోగరూపమైన యజ్ఞము చేయువారని చెప్పబడుదురు.

ఆ విధముగానే యింకా ఎన్నో స్వాధ్యాయ యజ్ఞములు జ్ఞానయజ్ఞములు చేయువారు కూడ వుందురు. ఏ మహాత్ములు యధావిధిగా అనగా పరంపరగా వచ్చు ఋగ్వేదాదుల యొక్క అభ్యాసరూపమైన స్వాధ్యాయ యజ్ఞము నాచరింతురో వారు స్వాధ్యాయ యజ్ఞము చేయువారుగా చెప్పబడుదురు. మరియు శాస్త్రజ్ఞానమును పొందుటయే రూపముగా గలిగిన యజ్ఞము చేయుదురో వారు జ్ఞాన యజ్ఞము చేయువారని చెప్పబడుదురు.

ఈ విధముగానే వ్రతములు, వుపవాసములు, ఉపాసనలు అత్యంత నియమ పూర్వకముగాను, కఠోరముగాను అనగా అతి శుద్ధముగా ఆచరించుచుందురో అట్టి పురుషులు "సంశిత వ్రతధారులు" అని చెప్పబడుదురు.

మరియు -

**4.29. అపానే జుహ్వతి ప్రాణం ప్రాణే ఽపానం తథాపరే,**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః.**

అనగా - మరికొంతమంది అపాన వాయువునందు ప్రాణవాయువును హవనము గావింతురు. అనగా 'పూరకము' అను ప్రాణాయామము చేయుచుందురు.

మరికొంతమంది ప్రాణవాయువునందు అపాన వాయువును హవనము చేయుదురు. అనగా "రేచకము" అను ప్రాణాయామము చేయుదురు.

నోరు మరియు ముక్కుద్వారా వాయువును బయటికి పంపుటను 'ప్రాణగతి' అని అందురు. అందులకు వ్యతిరేకముగా అనగా వాయువును పొట్టనుండి క్రిందికి పోవునట్లు చేయుట అపానము యొక్క గతియని అందురు. ఆ ప్రాణగతిని మరియు అపానగతిని రెంటిని గూడ నిలిపివుంచి ప్రాణాయామము యొక్క పారాయణము చేయుదురు. అనగా ప్రాణాయామము నందు అభిరుచి కలిగియున్నవారు కేవలము **"కుంభకము"** అను ప్రాణాయామము చేయుదురు.

మరియు –

## 4.30. "అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి, సర్వే ఽప్యేతే యజ్ఞ విదో యజ్ఞక్షపిత కల్మషాః.

అనగా – ఇంకా యితరులు ఎంతోమంది నియతాహారులు అనగా ఏ మహాత్ములు తన ఆహారమును మితముగా స్థిరపరచుకొని యున్నారో అటువంటి పరిమితమైన ఆహారమును గ్రహించువారు ప్రాణమును అనగా వాయువు యొక్క భిన్న భిన్న భేదములను ప్రాణమునందే హవనము చేయుదురు. (వాయు భేదములు – ప్రాణము, వ్యానము, ఉదానము, అపానము, సమానము ఇవి పంచప్రాణములు) తాత్పర్యమేమన ? వారు ఏ యే వాయువును జయించుదురో అనగా తన వశమునందు వుంచుకొను సామర్థ్యము కలిగియుందురో దానియందే వాయువు యొక్క యితర భేదములను హవనము గావింతురు. అనగా మిగిలివున్న వాయు భేదములన్నియు ఆతని వశమునందున్న వాయువునందు విలీనమగును.

ఈ విధమగు యజ్ఞములు చేయు పురుషులందరూ ఆ యా యజ్ఞములు చేయుటచేత 'నిష్పాపులు' అనగా పాపములు నశించిన వారగుదురు. అనగా పైన చెప్పబడిన యజ్ఞముల ద్వారా ఎవరి పాపములు పూర్తిగా నశించిపోయినవో వారు **"యజ్ఞ క్షపిత కల్మషులు"** అనబడుదురు.

## 4.31. యజ్ఞ శిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్, నాయం లోకో ఽస్త్యయజ్ఞస్య కుతో ఽన్యః కురుసత్తమ.

అనగా – యజ్ఞము చేయగా శేషించినదానిని **"యజ్ఞశిష్ఠము"** అని అందురు. అదియే అమృతము. దానిని భుజించినవారు **"యజ్ఞశిష్ట అమృతభోజీ"** అని అనబడుదురు.

పైన చెప్పబడిన యజ్ఞములు చేసి అటుపైన మిగిలిన సమయమందు యధావిధిగా లభించినటువంటి అమృతరూపమైన అన్నమును భుజించువారు – యజ్ఞశిష్ట అమృత భోజీపురుషులు – సనాతనము అనగా చిరంతనమైన బ్రహ్మమును పొందుదురు.

ఓ కురుశ్రేష్ఠుడైన అర్జునా ! పైన చెప్పబడిన యజ్ఞములలో ఏ ఒక్క యజ్ఞము చేయనట్టి

పురుషునకు అన్ని యితర ప్రాణులకు సాధారణముగ లభించు ఈ లోకము గూడ లభించదు. ఇంక విశిష్టమైన సాధనముల ద్వారా లభించు ఇతర లోకములు ఎట్లు దొరకును ? అనగా అసలే లభించవు.

**4.32. ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే,**
**కర్మజాన్విద్ధి తాన్సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే.**

అనగా – ఈ విధముగా పైన చెప్పబడిన అనేక విధములగు యజ్ఞములు బ్రహ్మయొక్క అనగా వేదముయొక్క ముఖమునందు వ్యాపించియున్నవి. వేదము ద్వారానే సర్వవిధములగు యజ్ఞములు తెలియబడుచున్నవి. అందుచేతనే "బ్రహ్మయొక్క ముఖమునందు (నోటియందు) విస్తరించబడియున్నవి" అని చెప్పడమైనది.

మనము వాక్కునందే ప్రాణములను ఏ విధముగా హవనము చేయుదుమో ఆ విధముగానే యితరములైన అన్ని యజ్ఞములు చేయు విధానమంతయు వేదములందు విశదముగా చెప్పబడియున్నది.

ఆ యజ్ఞములన్నింటిని నీవు కర్మజ కాయిక వాచిక మరియు మానసిక క్రియల ద్వారానే జరుగునవిగా తెలిసికొనుము. **ఆ యజ్ఞములు ఆత్మ ద్వారా చేయబడునవి కావు.** ఏలయన ? **ఆత్మ చలనాదిక్రియలు లేనిది.**

అందుచేత ఈ విధముగా తెలుసుకొని నీవు అశుభముల నుండి ముక్తుడవు కాగలవు. అనగా "యీ యజ్ఞాది కర్మలన్నియు నా ద్వారా చేయబడుట లేదు. నేను నిష్క్రియుడను అనగా ఎటువంటి కర్మలు చేయువాడను కాను. మరియు ఉదాసీనుడను అనగా కర్మలు చేయుటయందు యిష్టాయిష్టములు లేనివాడను." అని తెలుసుకొని **యిటువంటి సమ్యక్ అనగా సర్వాంగపూర్ణమైన జ్ఞానము యొక్క ప్రభావము చేత నీవు ఈ సంసార బంధమునుండి ముక్తుడవు కాగలవు.**

**"బ్రహ్మార్పణమ్"** (చూ. గీత 4.24) మొదలగు శ్లోకముల ద్వారా యధార్థ జ్ఞానమును యజ్ఞముల రూపమున పొందియున్నాడు. అంతేగాక యింకా అనేక యజ్ఞములను గురించి గూడ చెప్పియున్నాడు. ఇప్పుడు అసలు నిజము అనగా పురుషుని యొక్క కోర్కెలకు అనుగుణమైన ప్రయోజనము ఎటువంటి యజ్ఞముల ద్వారా సిద్ధించును ? అని అన్నచో అందుచేత పైన చెప్పబడిన **అనేక యితర యజ్ఞముల కంటె జ్ఞాన యజ్ఞమే గొప్పదని, అనుకూలమైనదని వాంఛితములను సిద్ధింపజేయునదని చెప్పుచున్నారు.**

*అదెట్లనగా ? చెప్పుచున్నారు –*

**33. శ్రేయాన్ద్రవ్యమయాద్యజ్ఞా జ్జ్ఞానయజ్ఞః పరంతప,**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే.**

అనగా – ఓ పరంతపా ! ద్రవ్యమయ యజ్ఞము కంటె అనగా ద్రవ్యరూపమైన సాధనముల రా చేయబడు యజ్ఞము కంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠతరమైనది.

ఏలయన ? ద్రవ్యమయ **యజ్ఞము ఫలములను యిచ్చుటకు ఆరంభించునది. మరి జ్ఞాన యజ్ఞమో జన్మాది ఫలములను కలుగజేయదు. అందువలన అది అనగా జ్ఞాన యజ్ఞము శ్రేష్ఠతరమైనది.** అనగా ఎక్కువగా ఆదరించతగినది.

అట్లేలయన ? ఓ పార్థా ! సర్వవిధ కర్మలు మోక్షమునకు సాక్షాత్తు సాధనరూపమైన జ్ఞానమునందు సముద్రమునందు ప్రపంచమునందలి నదులన్నియు సంగమించుచున్నట్లుగా సమాప్తమగును. అనగా ఆ కర్మలన్నియు జ్ఞానమునందు లీనమైపోవును.

ఈ విధముగా సర్వశ్రేష్ఠమైనదిగా చెప్పబడిన **జ్ఞానము మానవులకు ఏ ప్రకారముగ లభించును** ? అన్నచో చెప్పుచున్నారు –

**4.34. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా,**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః.**

అనగా – అట్టి జ్ఞానము ఏ విధముగా లభించునో నీవు చక్కగా తెలుసుకొనుము. వినుము – సర్వజ్ఞుడైన ఆచార్యుని వద్దకు చేరి అతి వినయవిధేయలతో సాష్టాంగ దండ ప్రణామము లర్పించి అటుపైన "నాకు ఈ బంధము ఎట్లు కలిగినది ? ఆ బంధము నుండి నేను ఎట్లు ముక్తుడను కాగలను ? అసలు 'విద్య' అనగా ఏది ? అవిద్య ఎట్లుండును ? అని ఈ విధముగా నిష్కపట బుద్ధితో ప్రశ్నించిన యెడల మరియు తగు రీతిని గురువును సేవించుట ద్వారా పైన చెప్పబడిన జ్ఞానము కలుగును.

ఈ విధముగా సేవలు మరియు వినయ విధేయతలతో కూడిన సపర్యలను పొంది ప్రసన్నుడైన మరియు తత్త్వదర్శి, జ్ఞాని అయినటువంటి గురువుగారు నీకు పైన చెప్పబడిన విశేషణములతో కూడిన జ్ఞానమును ఉపదేశించెదరు.

జ్ఞానులయందు గూడ కొంతమంది మాత్రమే యధార్థమైన తత్త్వమును ఎఱింగిన వారుందురు. అందరికి తత్త్వము బోధపడదు. అందులకే "జ్ఞాని" అను శబ్దముతో పాటు "తత్త్వదర్శి" అను విశేషణ శబ్దము గూడ చేర్చబడినది.

దీనివలన భగవంతుని అభిప్రాయ మెట్లున్నదనగా – యధార్థమైన తత్త్వమును ఎఱింగిన వారు మాత్రమే మరియు అటువంటి వారి ద్వారా ఉపదేశింపబడిన జ్ఞానమే జీవుని సర్వవిధ బంధముల నుండి విముక్తుని చేయ సామర్థ్యము కలిగియుండును.

అట్టి స్థితియందు ఈ విధముగా చెప్పుట కూడ మంచిదే. అదెట్లన ? –

**4.35. యజ్జ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యసి పాండవ,**
**యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి.**

అనగా – ఓ అర్జునా ! ఆ విధముగా తత్త్వము నెఱింగిన ఆచార్యునిచేత జ్ఞానోపదేశమును పొందిన నీవు తిరిగి యిప్పటివలె మోహమును పొందవు.

తత్త్వమును ఎఱింగిన ఆచార్యుల ద్వారా పొందిన జ్ఞానముగల నీవు సంపూర్ణముగా సర్వభూతములను అనగా **"అంబోజాసనుదాది గాగ తృణపర్యంతంబు సర్వాత్ముడై"** యున్న బ్రహ్మతత్త్వము అన్ని ప్రాణులను "ఈ భూతములన్నియు నాయందే యున్నవి మరియు వాసుదేవుడు పరమాత్ముడనైన నాయందు గూడ నీవు సర్వభూతములను చూడగలవు. అనగా సర్వోపనిషత్తులయందును ఏ జీవాత్మ పరమాత్మల ఏకత్వము ప్రసిద్ధముగా చెప్పబడియున్నదో దానిని ఆ ఏకత్వమును నీవు స్వయముగా అనుభవించగలవు.

ఇటువంటి జ్ఞానము యొక్క మహాత్మ్యమేమనగా - వినుము.

**4.36. అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః,**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి.**

అనగా - నీవు పాపము చేయువారందరి కంటె ఎక్కువగా చేయువాడవై యున్ననూ జ్ఞానమే రూపముగా కలిగినటువంటి నౌక అనగ పడవ ద్వారా అనగా జ్ఞానమునే పడవగా తయారుచేసుకొని సమస్తములైన పాపములనెడు సముద్రమును అతి చక్కగా అనగా నిరపాయముగా తరించగలవు అనగా దాటగలవు. ఇచ్చట ముముక్షువునకు అనగా జన్మమరణ బంధమునుండి (చక్రమునుండి) విముక్తిని కోరు సాధకునకు **ధర్మాచరణము గూడ పాప హేతువనియే చెప్పబడినది.**

జ్ఞానము పాపములను ఏ విధముగా నశింపజేయును ? అన్నచో - దృష్టాంత సహితముగా చెప్పుచున్నారు -

**4.37. యథైధాంసి సమిద్ధో ఽగ్నిర్భస్మసాత్కురుతే ఽర్జున,**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా.**

అనగా - ఓ అర్జునా ! ఏ విధముగా బాగుగా మండుచున్న అగ్ని కాష్టమును అనగా కొయ్యముక్కలను తగులబెట్టి భస్మము చేయునో ఆ విధముగానే **జ్ఞానరూపమైన అగ్ని మానవునిచే చేయబడిన సమస్త విధములైన కర్మల ఫలములను నివర్తింపజేయును.**

ఏలయన ? కట్టెలను అగ్నిభస్మము గావించినట్లుగా జ్ఞానరూపమైన సామాన్యమైన అగ్ని కర్మలను, ఆ కర్మ ఫలములను పూర్ణముగా భస్మము చేయజాలదు. అందుచేత యిచ్చట భావమేమన ? **యథార్థమైన జ్ఞానము సర్వవిధ కర్మలను ఫలములు లేనివానిగా అనగా నిర్జీవముగా చేయును.**

**కర్మలవలన మనకు దేహములు కలుగుచున్నవి.** అట్లేలయన ? మనము యింతకు పూర్వము అనగా పూర్వ పూర్వ దేహధారణా కార్యములు జరిగినప్పుడు చేసిన కర్మలు యిప్పుడు ఫలములనిచ్చుట ప్రారంభించినవి. ఆ కారణముచేత ఫలమునిచ్చుట ఆరంభించిన కర్మలు జ్ఞానము వలన నశించవు. భోగము ద్వారానే ఆ కర్మ ఫలములు నశించును. ఇది వివాద రహితమైన విషయము.

అందువలన ఈ జన్మమునందు మనకు జ్ఞానము కలుగుటకు పూర్వము మరియు జ్ఞానసంపాదనా కాలమునందు యింకనూ యింతకు పూర్వపు అనేక జన్మలయందు చేయబడిన కర్మలు యింకా ఫలములనిచ్చుటకు ఆరంభించకయున్న కర్మలు మొదలగు వాటినన్నింటిని జ్ఞానరూపమైన అగ్ని, భస్మము చేయును. అనగా నివర్తింపజేయును. కాని ప్రారబ్ధ కర్మఫలములను నశింపజేయజాలదు. అట్లేలయన ?

జ్ఞానమునకు ఎంతటిశక్తి కలదన్నచో.........

**4.38. నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే,**
**త త్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి.**

అనగా - కావున **జ్ఞానముతో సమానముగా జీవులను పవిత్రము చేయునది అనగా శుద్ధము చేయునది ఈ లోకమునందు రెండవది లేదు.**

కర్మయోగము లేక సమాధియోగము ద్వారా మోక్షమును పొందగోరువారు చాలాకాలము అతిశ్రద్ధతో కర్మలద్వారా తమ అంతఃకరణములను శుద్ధము చేసుకొని అనగా అంతఃకరణము శుద్ధమగునంత శ్రద్ధగా కర్మలాచరించి అనగా జ్ఞానమును పొందుటకు తగు యోగ్యతను సంపాదించుకొన్నప్పుడు వారి మనోబుద్ధులయందు లేక ఆత్మయందు జ్ఞానమును తనంతట తానుగానే పొందును. అనగా ఆత్మసాక్షాత్కారమును పొందును.

ఏ విధముగా జ్ఞానము తప్పక లభించునో ఆ ఉపాయము చెప్పుచున్నారు.

**4.39. శ్రద్ధావాన్లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః,**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిమచిరేణాధి గచ్ఛతి.**

అనగా - శ్రద్ధావాన్ అనగా కర్మచేయుటయందు అలసట ఎఱుంగనివాడు అట్టి శ్రద్ధాభావము బలముగా కలిగియున్న మానవుడు త్వరగా అనగా కొద్దికాలములోపలనే జ్ఞానమును పొందును.

శ్రద్ధాభావము వున్నప్పటికి కొందరు ప్రయత్నము చక్కగా చేయనివారుందురు. అందువలన **"తత్పరః"** అనగా జ్ఞానమును పొందుటకు మంచి గురువును సమీపించి, వారిని శ్రద్ధగా సేవించి వారి ఉపదేశమును పొందవలసియుండును.

శ్రద్ధకలిగి తత్పరుడై యుండియు కొందరు యింద్రియములను జయించలేనివారై యుందురు. అందుచేత **"సంయతేంద్రియః"** అనగా యింద్రియములను అదుపునందుంచు కొన్నవారు అయి వుండవలయును. తన యింద్రియములను విషయముల నుండి విరమింప జేసుకొని యున్నట్టివారు సంయతేంద్రియులు అనబడుదురు.

ఈ విధముగా శ్రద్ధ గలవాడు, తత్పరుడు మరియు సంయతేంద్రియుడు అయినవాడు తప్పక జ్ఞానమును పొందును.

సాష్టాంగ దండప్రణామాదులు బాహ్యములు. ఇటువంటి ప్రణామాదులు కపట స్వభావము గల మనుష్యుల ద్వారా గూడా చేయబడుచుండును. అందుచేత జ్ఞానరూపమైన ఫలము యిటువంటివారికి లభించకపోవచ్చును. కాని శ్రద్ధాభావము బలముగా కలిగియున్నవారి యందు యిటువంటి కపటము వుండదు. కావున శ్రద్ధ, తత్పరత మరియు సంయతేంద్రియత్వము గలవారు తప్పక జ్ఞానమును పొందుదురు.

అయితే జ్ఞానము ప్రాప్తించినందువలన కలుగు లాభమేమి ? ఈ విషయము ఉత్తరార్ధమునందు అనగా తరువాత చెప్పబడును.

**జ్ఞానమును పొందిన మానవుడు మోక్షరూపమైన పరమశాంతిని అనగా కలవరము, భయము, దుఃఖము లేనటువంటి మానసిక స్థితిని పొందును.**

యధార్థమైన జ్ఞానము వలన అతి శీఘ్రముగా మోక్షము కలుగును. ఈ విషయము సర్వశాస్త్రముల ద్వారాను మరియు అనేక విధములైన యుక్తుల ద్వారానూ సిద్ధించిన మాట.

ఈ విషయమునందు సంశయమునకు తావులేదు. ఏలయన ? సత్యమైన విషయము నందు గూడ సంశయము కలిగియుండువాడు పరమ పాపాత్ముడు. అదెట్లన చెప్పుచున్నారు –

**4.40. అజ్ఞశ్చా శ్రద్ద ధానశ్చ సంశయాత్మా వినశ్యతి,**
**నాయం లోకో ఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః.**

అనగా – అజ్ఞుడు అనగా ఆత్మజ్ఞానము లేనివాడు. శ్రద్ధ లేనివాడు మరియు సంశయాత్ముడు అనగా సంశయము గలవాడు. ఈ ముగ్గురు అనగా పై మూడు గుణములు గలవారు దుఃఖములను అనుభవింతురు.

అజ్ఞానియై శ్రద్ధ గలవాడైనను దుఃఖమును అనుభవించును. కాని సంశయాత్మునివలె సర్వనాశమును చెందదు. ఏలయన ? **అందరిలో సంశయాత్ముడు అధిక పాపాత్ముడు.**

సంశయాత్ముడు అధిక పాపి ఎట్లన ? సంశయాత్మునికి అనగా ఎవని చిత్తమునందు సంశయము కలదో ఆతనికి యిటు సర్వ సాధారణమైన మానవ లోకమునందుగాని అటు పరలోకమునందుగాని సుఖశాంతులు లభించవు. ఏలయన ? అచ్చట గూడ ఆతని సంశయము ఆతని వెన్నంటియే యుండును. కావున సుఖశాంతులు కోరువాడు సంశయమును త్యజించవలయును.

అదెట్లనగా –

**4.41. యోగ సంన్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్,**
**ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ.**

అనగా – పరమార్థమును ఎఱింగిన పురుషుడు పరమార్థ జ్ఞానరూపమైన యోగము ద్వారా పుణ్య పాపరూపములైన సర్వవిధ కర్మలను మరియు వాటి ఫలములను గూడ

త్యజించియుండును. అటువంటివాడు **"యోగ సంన్యస్త కర్మా"** అనబడును. అటువంటివానిని అనగా కర్మలను, కర్మఫలములను త్యజించినవానిని కర్మలు బంధించవు.

ఆతడు **"యోగసంన్యస్తకర్మ"** ఏ కారణము వలన అనబడుచున్నాడు ? అన్నచో –

ఆత్మ మరియు ఈశ్వరునియొక్క ఏకత్వ దర్శన రూపమైన జ్ఞానము ద్వారా ఆతని సంశయములన్నియు నివర్తించియుండును.

అందువలన అటువంటివాడు **"జ్ఞానసంఛిన్న సంశయుడు"** అనబడుచున్నాడు. అందుచేతనే ఆతడు **"యోగసంన్యస్తకర్మా"** అనబడుచున్నాడు.

ఈ విధముగా **"యోగసంన్యస్త కర్మ"** అయి వున్న ఆత్మగలవాడు, అనగా ఆత్మబల సంపన్నుడై ప్రమాద రహితుడై యున్న పురుషునకు ఓ ధనంజయా ! గుణములే గుణములందు ప్రవర్తించునట్లు **గుణముల యొక్క చేష్టల రూపమున మాత్రమే అయివున్న కర్మలు బంధములు కానేరవు.** అనగా యిష్టము, అనిష్టము మరియు మిశ్రమము ఈ మూడు విధములైన కర్మఫలములు అతనికి భోగ్య పదార్థములు కాజాలవు.

అట్లేలయన్న ? కర్మయోగానుష్ఠానము చేసియున్నందున అంతఃకరణము మలరహితము అనగా లోకవాసనారహితము అయివున్నందున కలిగిన ఆత్మజ్ఞానము ద్వారా ఏ పురుషుని సంశయము లన్నియు నివర్తించిపోయినవో ఆ పురుషుడు ఆతని కర్మలు మరియు కర్మఫలము లన్నియు జ్ఞానాగ్నిచేత భస్మమై పోయినందువలన కర్మలచేత బంధించబడడు.

అట్లుగాక జ్ఞానయోగమునందు మరియు కర్మయోగానుష్ఠానమునందు సంశయభావము కలిగియున్నవాడు దుఃఖములను అనుభవించుచుండును.

## 4.42. తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః, ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత.

అనగా – అందువలన అజ్ఞానము అనగా అవివేకము వలన కలిగిన మరియు అంతఃకరణమునందు దాగియున్న తన నాశమునకు కారణరూపమైన మరియు అత్యంత పాపరూపమైన సంశయమును జ్ఞానఖడ్గము ద్వారా అనగా శోకము, మోహము మొదలగు దుఃఖ హేతువులను నశింపజేయునటువంటి యథార్థ దర్శన రూపమైన జ్ఞానమే ఖడ్గము. ఆ స్వరూప జ్ఞానరూపమైన ఖడ్గము ద్వారా నరికి నశింపజేయును. అట్లు ఛేదించి కర్మయోగమునందు నిలిచియుండుము.

ఇచ్చట సంశయము ఆత్మవిషయికమైనది. అందుచేత సంశయ శబ్దముతోపాటు "ఆత్మనః" అను విశేషణ శబ్దము చేర్చబడినది.

అట్లేలయన ? ఒకనికి కలిగిన సంశయము రెండవ వానిద్వారా ఛేదించబడునను శంక కలుగుటకు అవకాశము లేదు. అట్టి శంక ఒకవేళ కలిగినచో దానిని నివారించుట కొఱకు **"ఆత్మనః"** అను విశేషణ శబ్దము వాడబడినది. సంశయము ఆత్మవిషయికమైనదైనప్పటికి

తనదిగా తలంచు అవకాశము కలదు. ఏలయన ? సంశయమును తనకు సంబంధించినదిగా తలంచుట సహజము.

అందుచేత తన నాశమునకు కారణ రూపమైన ఈ సంశయమును పైన చెప్పిన విధముగా ఖండించి సమ్యక్ జ్ఞానప్రాప్తికి సాధన రూపమైన కర్మయోగమునందు స్థిరముగ నుండుము. ఓ అర్జునా ! యిప్పుడు నీవు యుద్ధము చేయుటకు లేచి నిలబడుము.

శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి
జ్ఞానకర్మ సంన్యాసయోగమనబడు నాల్గవ అధ్యాయమునకు
శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విరిచిత భాష్యమునకు
తెనుగు అనువాదము సమాప్తము.
అనువాదకులు - శ్రీ సదానంద భారతి
ప్రణవాశ్రమము.

# ఐదవ అధ్యాయము

"కర్మణ్యకర్మయః పశ్యేత్" (చూ. గీత 4-18) అను ఈ శ్లోకము మొదలుకొని "సంయుక్తః కృత్స్నకర్మకృత్" (చూ. గీత 4-18) జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్" (చూ. గీత 4-19) "శరీరం కేవలం కర్మ కుర్వన్" (చూ. గీత 4-21) "యదృచ్ఛాలాభ సంతుష్టో:" (చూ. గీత 4-22) "బ్రహ్మార్పణం బ్రహ్మహవి" (చూ. గీత 4-24) "కర్మజాన్విద్ధి తాన్ సర్వాన్" (చూ. గీత 4-32) "సర్వకర్మాఖిలంపార్థ" (చూ. గీత 4-33) "జ్ఞానాగ్ని సర్వ కర్మాణి" (చూ. గీత 4-37) "యోగసంన్యస్త కర్మాణం" (చూ. గీత 4-41) మొదలగు పదముల ద్వారా **భగవంతుడు సర్వకర్మల సంన్యాసము ముముక్షువులకు ఆవశ్యకమని** చెప్పియున్నారు.

మరియు "ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠ" (చూ. గీత 4-42) అను వాక్యము ద్వారా కర్మానుష్ఠానమను యోగమునందు స్థిరముగా వుండుము, అనగా కర్మలు చేయుము అని కూడ చెప్పియున్నాడు.

ఆ రెంటి యొక్క అనగా **కర్మయోగము** మరియు **కర్మ సంన్యాసము** యొక్క స్థితి మరియు గతివలె అనగా నిలిచి వుండుట మరియు నడుస్తూ వుండుటవలె పరస్పర విరోధము కానవచ్చుచున్నందున ఒకే పురుషుని ద్వారా ఒకే కాలమునందు ఆ రెంటిని అనుష్ఠించుట అసంభవముగా తోచుచున్నది. మరియు కాలభేదము ద్వారా అనుష్ఠించు విధానము కానరాదు. అందుచేత స్వాభావికముగనే ఈ రెండింటిలో ఏదో ఒకదానినే అనుష్ఠించుట కర్తవ్యముగా తోచుచున్నది. అందుచేత కర్మయోగము అనగా కర్మానుష్ఠానము మరియు కర్మ సంన్యాసము అనగా కర్మలు చేయకుండుట ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠతరమైనదో దానినే చేయవలయును. శ్రేష్ఠముకాని దానిని త్యజించవలయును. అన్నట్లు తలంచి అర్జునుడు రెండింటిలో ఏది శ్రేష్ఠతరమైనదో తెలుసుకొన తలంచినవాడై "సంన్యాసంకర్మణాం కృష్ణ" (చూ. గీత 5-1) అని అడిగియున్నాడు.

**పూర్వపక్షము** - ఇంతకు పూర్వము చెప్పబడిన వచనములననుసరించి చూచిన భగవంతుడు జ్ఞానయోగము ద్వారా ఆత్మజ్ఞాన నిష్ఠను ప్రతిపాదించదలచి కేవలము ఆత్మజ్ఞాన నిష్ఠ కలగగలందులకే ఆత్మజ్ఞానమును పొందదలచినవానికి సర్వకర్మ సంన్యాసమును వుపదేశించియున్నారు. అంతేగాని ఆత్మతత్వమును ఎరుంగ తలంచనివానికి సర్వకర్మ సంన్యాసము చేయమని చెప్పియుండలేదు. అందువలన కర్మానుష్ఠానము మరియు కర్మ సంన్యాసము యివి రెండూ భిన్నభిన్నములైన అనగా వేరువేరుగా యున్న పురుషుల ద్వారా అనుష్ఠింపదగియున్న కారణముగ ఆ రెంటిలో ఏదో ఒకదానిని శ్రేష్ఠతరమైనదిగా ఎరుంగగోరు కోరికతో ప్రశ్నించుట కుదరదు.

**అంచులకు సమాధానము** - మీరు చెప్పినది మంచిమాటే. మీ అభిప్రాయమునను సరించి చూచిన అట్లు ప్రశ్నించుట కుదరదు. కాని యీ స్థితిలో మేము చెప్పునదేమనగా- ప్రశ్న కర్త యొక్క అభిప్రాయము ననుసరించి చూచిన అట్లు ప్రశ్నించుటకు తగిన అవకాశము కలదు.

**పూర్వపక్షము** - అదెట్లు ?

**సమాధానము** - పైన చెప్పబడిన వచనములననుసరించి చూచిన **భగవంతుడు కర్మ సంన్యాసమును ప్రతి మానవుని కర్తవ్యముగా వర్ణించి యున్నారు.** అందుచేత కర్మ సంన్యాసము యొక్క ప్రాధాన్యత సిద్ధించుచున్నది. కాని కర్త లేకుండా ఆతని కర్తవ్యత అసంభవము. అందువలన ఒకవైపు నుండి చూచిన అజ్ఞాని కూడా కర్మ సంన్యాసమునకు కర్తగా అగుచున్నాడు. అందుచేత దానినే ఒప్పుకొనుట జరుగుచున్నది. కేవలము **ఆత్మజ్ఞాని అయిన కర్త మాత్రమే సంన్యసించినవాడు కాగలడు** అని చెప్పుట మాకు యిష్టము కాదు.

ఈ విధముగా కర్మానుష్ఠానము మరియు కర్మ సంన్యాసము - ఈ రెండూ అర్జునుని ద్వారా కూడా చేయబడవచ్చునని తలంచువారు అర్జునుడు ఆ రెండింటిలో ఒకదానిని శ్రేష్ఠతర సాధనమైనదిగా తెలుసుకొనగోరి ప్రశ్నించుట అయుక్తము అనగా అసంగతము కాదు. ఏలయన పైన చెప్పబడినట్లుగా ఆ **రెంటికి పరస్పర విరోధము వున్న కారణముగా** ఆ రెండింటిలో ఒకదానిని ఆచరించు కర్తృత్వమే ప్రాప్తించును. అట్టి స్థితియందు ఆ రెండింటిలో ఏది శ్రేష్ఠతరమైనదో దానిని చేయవలయును. రెండవ దానిని కాదు.

ప్రత్యుత్తర రూపంలో భగవంతుడు చెప్పిన మాటలకు అర్థమును నిరూపించినప్పుడు గూడ ప్రశ్నకర్త యొక్క అభిప్రాయము అదేనని తెలియుచున్నది.

**పూర్వపక్షము** - అదెట్లు ?

**సమాధానము** - సంన్యాసము మరియు కర్మయోగము అవి రెండూ కూడా జీవునకు శుభకరములైనవే. వాటిలో అనగా ఆ రెంటిలో కర్మయోగము శ్రేష్ఠమైనది అని భగవంతుని సమాధానము.

ఇందులో ఆలోచింపదగిన విషయమొకటున్నది. అదేమనగా - ఈ సమాధానము వలన ఆత్మజ్ఞాని ద్వారా చేయబడిన సంన్యాసము మరియు కర్మయోగము యొక్క శుభకరమైన పరిణామము యొక్క ప్రయోజనము చెప్పి ఆ రెండింటిలో నుండి ఏదో ఒక విశిష్టత కారణముగ కర్మ సంన్యాసము కంటే కర్మయోగమే శ్రేష్ఠమని చెప్పబడినదా ? లేక అజ్ఞాని ద్వారా చేయబడిన సంన్యాసము మరియు కర్మయోగము యొక్క విషయమునందు ఈ రెండు మాటలు చెప్పబడినవా?

**పూర్వపక్షము** - దీనివలన కలుగు లాభమేమి కలదు ? ఆత్మతత్వమును బాగుగా ఎరింగినవాని ద్వారా చేయబడిన కర్మసంన్యాసము మరియు కర్మయోగము వలన కలుగు శుభకర పరిణామము ఈ రెండింటిలో సంన్యాసము కంటే కర్మయోగమే క్షేమకరమని చెప్పబడియున్నచో లేక అజ్ఞాని ద్వారా చేయబడిన కర్మసంన్యాసము మరియు కర్మయోగమునకు సంబంధించిన విషయమును గురించియే ఆ పై రెండు మాటలు చెప్పబడినవేమో ?

**సమాధానము** – ఆత్మజ్ఞానము గలవానిచేత చేయబడిన కర్మ సంన్యాసము మరియు కర్మయోగము ఈ రెండూ ఒకనియందు సంభవము కాదు. అందుచేత ఆ రెంటినీ ఒకే విధముగా జీవునికి శుభకరములని చెప్పుట ఆత్మజ్ఞానము గల పురుషుడు చేసిన కర్మ సంన్యాసము కంటే కర్మయోగము శ్రేష్ఠమైనదని చెప్పుట కుదరదు.

కర్మ సంన్యాసము మరియు అందులకు విరుద్ధముగా కర్మానుష్ఠానరూపమైన కర్మయోగము యీ రెంటిని అజ్ఞాని చేత చేయబడినట్లుగా ఒప్పుకొన్నచో అట్టి స్థితియందు యీ యిద్దరి సాధకులకు శుభకరములని చెప్పుట మరియు కర్మసంన్యాసము కంటే కర్మయోగమును శ్రేష్ఠమని చెప్పుట యీ రెండు మాటలు కుదరవు.

**పూర్వపక్షము** – ఆత్మజ్ఞాని ద్వారా కర్మ సంన్యాసము మరియు కర్మయోగము యీ రెండూ జరుగుట అసంభవము.

లేక రెంటిలో ఏదో ఒకటి వుండుట లేక జరుగుట గూడ అసంభవమేనా ? రెండింటిలో ఏదో ఒకటి జరుగుట మాత్రమే అసంభవమైన ఎడల కర్మ సంన్యాసము జరుగుటయే అసంభవమా లేక కర్మయోగము జరుగుట అసంభవమా ? అందుచేత ఆ అసంభవత్వమునకు సరియగు కారణము చెప్పవలసి యుండును.

**సమాధానము** – ఆత్మజ్ఞానియందు మిథ్యాజ్ఞానము పూర్తిగా నశించి లేక నివర్తించి యుండును. అందుచేత ఆతని ద్వారా విరుద్ధజ్ఞానమూలకమైన కర్మయోగము జరుగుటయే అసంభవము.

ఏలయన ? జన్మాది సమస్తమైన వికారములు లేనటువంటి నిష్క్రియమైన ఆత్మను తన స్వరూపముగా గుర్తించినవాడు, యథార్థమైన జ్ఞానము ద్వారా మిథ్యాజ్ఞానమును నివర్తింపజేసుకొనినవాడు. అయినందున అటువంటి ఆత్మజ్ఞానము గల పురుషునికి నిష్క్రియమైన అనగా ఎటువంటి కర్మలు చేయనటువంటి ఆత్మస్వరూపముతో కూడియుండి సర్వవిధ కర్మలను సంన్యసించినట్లు చెప్పి, ఈ గీతాశాస్త్రమునందు అచ్చటచ్చట ఆత్మస్వరూపమునకు సంబంధించిన విషయమును నిరూపించు ప్రకరణములందు యదార్థజ్ఞానము, మిథ్యాజ్ఞానము మరియు వాటియొక్క కార్యములందు పరస్పర విరోధము వున్నందు వలన పైన చెప్పబడిన సంన్యాసమునకు విరుద్ధముగా వున్న మిథ్యాజ్ఞానమూలకమైన కర్తృత్వముతో కూడియున్న అభిమానపూర్వకమైన క్రియలయందు నిమగ్నమైయున్న ఆత్మ స్వరూపమునందు స్వయంసిద్ధమగు కర్మయోగము యొక్క అభావమునే ప్రతిపాదించియున్నది. అందుచేత మిథ్యాజ్ఞానము పూర్తిగా ఎవనియందు నివృత్తిని చెందియున్నదో అటువంటి ఆత్మజ్ఞానికి మిథ్యాజ్ఞానమూలకమైన కర్మయోగము చెప్పబడుట సంభవము కాదు అని చెప్పుటయే సరియైన సమాధానము.

**పూర్వపక్షము** – ఆత్మస్వరూపమును నిరూపించునటువంటి ఏ ఏ ప్రకరణములయందు జ్ఞానికి కర్మాభావము చెప్పబడినది ?

**సమాధానము** – "తూ" అవినాశితుతద్విద్ధి" (చూ. గీత 2-17) అనగా ఆయాత్మను నీవు అవినాశి అనగా నాశము లేనిదిగా తెలుసుకొనుము.

ఇచ్చట నుండి ప్రకరణమును ఆరంభించి "యఏనం వేత్తి హంతారం, వేదావినాశినం నిత్యం (చూ. గీ. 2.20) అనగా ఎవడు ఈ ఆత్మను చంపువాడుగా తలంచునో, ఎవడు అవినాశము మరియు నిత్యమైయుండునటువంటి ఆత్మను గుర్తించునో" మొదలగు వాక్యముల ద్వారా అనేక చోట్ల జ్ఞానికి కర్మాభావమును అనగా జ్ఞానికి కర్మలు వుండవు అని చెప్పియున్నాడు.

**పూర్వపక్షము** – ఈ విధముగా చూచినట్లయిన ఆత్మనిరూపణము చేయు ప్రతిచోట గూడ కర్మయోగమును గురించి గూడ చెప్పియే యున్నాడు. అదెట్లన ? "తస్మాద్యుధ్యస్వ భారత" (చూ. గీత 2-18) మరియు "స్వధర్మమపి చావేక్ష్య" (చూ. గీత 2-31) అనగా అందుచేత ఓ భారత ! నీవు యుద్ధము చేయుము. స్వధర్మమును చూచిగూడ నీవు యుద్ధమును గురించి భయపడుట వుచితము కాదు. అంతేగాక "కర్మణ్యేవాధికారస్తే" (చూ. గీత 2-47) నీకు కర్మలు చేయుట యందే అధికారమున్నది. మొదలగు వాక్యములు గూడ చెప్పబడియున్నవి గదా ? అందువలన ఆత్మజ్ఞానికి గూడ కర్మయోగమును కలిగియుండుట అసంభవము ఎట్లు కాగలదు ?

**సమాధానము** – ఏలయన ? సమ్యక్జ్ఞానమునకు మరియు మిథ్యా జ్ఞానమునకు మరియు వాటి కార్యములయందు పరస్పర విరోధమున్నది.

ఆత్మతత్వమును గుర్తించిన సాంఖ్యయోగుల నిష్క్రియమైన అనగా క్రియారహితమైన ఆత్మస్వరూపముతో కూడియున్న జ్ఞాననిష్ఠను "జ్ఞానయోగేన సాంఖ్యానామ్" (గీ. 3-3) అనువాక్యము ద్వారా అజ్ఞానుల ద్వారా చేయబడు కర్మయోగ నిష్ఠ నుండి వేరుచేసియున్నారు.

కృతకృత్యుడు అనగా తాను పొందిన జ్ఞానమునకు ఫలమును పొందినవాడు అయినందువలన అనగా తన స్వరూపమును గుర్తించినవాడు అగుట వలన ఆత్మజ్ఞానికి యింక పొందవలసినది ఏమీ వుండదు. "తస్యకార్యం న విద్యతే" (చూ. గీత 3-17) అనగా **అటువంటి ఆత్మజ్ఞాని చేయవలసిన కార్యము ఏదీ వుండదు.** ఈ వాక్యము ద్వారా జ్ఞానికి యితర కర్తవ్యములంటూ ఏమీ వుండవని చెప్పినట్లయినది.

"న కర్మణామనారంభాత్" (చూ. గీత 3-4) "సంన్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః" (చూ. గీత 5-6) అనగా కర్మలు చేయుట ఆరంభించకుండా జ్ఞాననిష్ఠ కలుగనేరదు. కర్మయోగము లేకుండా సంన్యాసమును గ్రహించుట చాలా కష్టము. ఈ విధమగు వాక్యముల ద్వారా **కర్మయోగము ఆత్మజ్ఞానమునకు సాధనముగా చెప్పబడినది.**

"యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే" (చూ. గీత 6-3) అనగా ఆ యోగారూఢునికే వుపశమము కర్తవ్యమై వున్నది. ఈ వాక్యము వలన **యదార్థమైన జ్ఞానము గలవానికి కర్మయోగము** అవసరములేదని చెప్పబడినది.

"శరీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషం" (చూ. గీత 4-21) అనగా కేవలం శరీర సంబంధమైన కర్మలు చేయుచుండెనేని అటువంటి మనుష్యునకు పాపములు అంటవు. ఈ విధముగా యిచ్చట గూడ జ్ఞాని శరీరము కలిగి యున్నందున చేయు కర్మలను వదలి యితర కర్మలు చేయుట నిషేదించబడినది.

"నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్" (చూ. గీత 5-8) అనగా తత్వవేత్త అయిన యోగి "నేను ఎటువంటి కర్మలు చేయుటలేదు అని తలంచినచో" అను యీ మాట వలన కేవలము శరీర పోషణార్థమే చేయబడు ధర్శనము, శ్రవణము మొదలగు కర్మలయందు గూడ "నేను చేయుచున్నాను" అను భావమునకు జ్ఞానముతో కూడియున్న చిత్తము ద్వారా తొలగించుకొనవలయునని చెప్పబడుచున్నది.

ఈ కారణములు వున్నందున ఆత్మ నెరింగిన పురుషునకు యథార్థమైన దర్శనమునకు విరుద్ధముగా మరియు మిథ్యాజ్ఞానముచే చేయబడుచున్న కర్మయోగము స్వప్నమునందు గూడ సంభవము కాదు.

అందువలన యిచ్చట **అజ్ఞాని యొక్క సంన్యాసము కర్మయోగమునకు మాత్రమే శుభకరమని చెప్పబడినది.** మరియు ఆ అజ్ఞాని యొక్క సంన్యాసము కంటే ఆతనికి కర్మయోగమే క్షేమకరమని చెప్పబడినది. అనగా యింతకుముందు చెప్పబడిన ఆత్మజ్ఞాని యొక్క సంన్యాసము కంటే యిది విలక్షణమైనది మరియు అది కర్తృత్వ భావముతో కూడియున్న కారణముగ ఏకదేశీయము అనగా యిటువంటి సంన్యాసము వలన గృహస్థాశ్రమమునకు సంబంధించిన కర్మలను మాత్రమే త్యజించగలదు. కాని సంన్యాస **ఆశ్రమమునకు సంబంధించిన కర్మలయందు అభిమానము వుంటుంది.** అందుచేత అది పూర్ణ సంన్యాసముగాక ఏకదేశీయ అనగా **అసంపూర్ణమైన సంన్యాసమనబడును.** అందుచేత అది ఏకదేశీయ సంన్యాసము మరియు యమ, నియమాది సాధనములతో కూడియుండుట వలన దానిని అనగా పూర్ణ సంన్యాసమును అనుష్ఠించుట కష్టము. **ఇటువంటి సంన్యాసము కంటే కర్మయోగమే సుకరము.** కావున కర్మసంన్యాసము గూడ మంచిదనియే చెప్పబడినది.

అనగా యింతకుముందు చెప్పబడిన ఆత్మజ్ఞాని యొక్క సంన్యాసము కంటే అజ్ఞాని యొక్కసంన్యాసము విలక్షణమైనది.

"జ్యాయసీ చేత్కర్మణస్తే" (చూ. గీత 3-1) అను శ్లోకమునందు జ్ఞానము కర్మలు రెండూ కూడ మోక్షమునకు సాధనములేయని చెప్పబడుటచే అవి రెండూ ఒక్కసారిగా ఆచరించుట అసంభవములని తలంచి ఆ రెండింటిలోను ఏది ఎక్కువ శుభకరమైనదో "అది నాకు చెప్పండి' ' అని అర్జునుని ద్వారా అడుగబడినప్పుడు ఆ భగవంతుడు (శ్రీకృష్ణుడు) **సాంఖ్యయోగులు** అనగా **సంన్యాసుల యొక్క నిష్ఠ జ్ఞాన యోగముద్వారాను** మరియు **అజ్ఞానులైన యోగుల యొక్క నిష్ఠ కర్మ యోగము ద్వారాను సాధ్యములు, సుకరములు అని నిర్ణయించి చెప్పియున్నాడు.**

కేవలము సంన్యసించినంత మాత్రమున ఎవ్వరును సిద్ధిని పొందజాలరు. **అను మాట ద్వారా జ్ఞానముతో కూడియున్న సంన్యాసము ద్వారానే మోక్షమును, సిద్ధిని పొందవచ్చునని**

చెప్పినట్లయినది. దానితోపాటు కర్మయోగమును గురించి కూడ చెప్పుచు జ్ఞానరహితమైన సంన్యాసము కూడ కల్యాణదాయకమే అని చెప్పినప్పటికి జ్ఞానయోగము మరియు కర్మయోగము ఈ రెంటియందు ఏది ఎక్కువ కల్యాణదాయకమో యెరుంగోరి అర్జునుడు ఇలా అన్నాడు -

**5.1. సంన్యాసం కర్మాణాం కృష్ణ పునర్యోగం చ శంససి,**
**యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్.**

అనగా - మీరు ముందుగా శాస్త్రోక్తమైన అనేక విధములైన అనుష్ఠానములకు సంబంధించిన కర్మలను త్యజించమని చెప్పియున్నారు. అటుపైన తిరిగి మరల మీరు అనుష్ఠానమునకు తప్పనిసరిగా కర్తవ్యరూపములైన యోగమును గురించి గూఢ చెప్పుచున్నారు. అందువలన నాకు వీటన్నింటిలో ఏది కల్యాణదాయకమో తెలియకున్నది.

శ్రేష్ఠమైనది కల్యాణకరమైన అనుష్ఠానమునే చేయవలయును గదా ! అందువలన **ఈ కర్మసంన్యాసము** మరియు **కర్మయోగములందు** ఏది శ్రేష్ఠమైనదో అనగా ఎటువంటి అనుష్ఠానము చేసినందువలన నాకు సర్వవిధ కల్యాణము జరుగునని మీరు తలంచుచున్నారో దానిని గూర్చి చక్కగా నిశ్చయించి ఒకే అభిప్రాయమును వేరుపరచి చెప్పండి. ఏలయన ? ఒక పురుషుని ద్వారా ఒకేసారి రెండు కార్యములు చేయుట సంభవము కాదు గదా ?

అర్జునుని ప్రశ్నకు సరియైన సమాధానము చెప్పుటకు భగవంతుడు తన అభిప్రాయమును యిలా చెప్పుచున్నారు -

**5.2. సంన్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ,**
**తయోస్తు కర్మసంన్యాసాత్కర్మయోగో విశిష్యతే.**

అనగా - సంన్యాసము మరియు కర్మల యొక్క పరిత్యాగము మరియు కర్మయోగము, వాటి అనుష్ఠానము చేయుట యివి రెండూ కూడ కల్యాణకరములే అనగా ముక్తిదాయకములే.

జ్ఞానోత్పత్తికి హేతువు అగుట వలన యివి రెండూ కూడా కల్యాణకారకములే అయినప్పటికీ కల్యాణకారకములైన ఆ రెండు కారణములు అనగా సాధనమార్గములలో **జ్ఞానరహితమైన కేవల సంన్యాసము కంటే కర్మయోగము శ్రేష్ఠమైనది.** ఈ విధముగా భగవంతుడు **కర్మయోగమును స్తుతించుచున్నారు.**

కర్మయోగము ఎట్లు శ్రేష్ఠము ? అన్నచో -

**5.3. జ్ఞేయః స నిత్యసంన్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి,**
**నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ప్రముచ్యతే.**

అనగా - ఎవడు ఎన్నడూ ఎవ్వరినీ ద్వేషించడో మరియు ఈ ప్రపంచము నందలి ఎటువంటి వస్తువును ఆకాంక్షించడో అటువంటి కర్మయోగిని ఎల్లవేళలా సంన్యాసిగానే

గుర్తించవలయును.  అనగా ఎవడు సుఖదుఃఖములు మరియు ఆ సుఖదుఃఖములకు కారణ స్వరూపములైన సాధన సామగ్రియందు పై విధముగానే రాగద్వేషరహితుడైయుండునో ఆతడు కర్మలు ఆచరించుచూ వున్నప్పటికీ ఆతనిని ఎల్లవేళల సర్వసంగసంన్యాసిగానే గుర్తించవలయును.

అట్లేలయన ? రాగద్వేషాది ద్వంద్వములు లేనటువంటి పురుషుడు సుఖముగాను, అనాయాసముగాను లోకబంధములనుండి ముక్తుడగును.

భిన్న పురుషుల ద్వారా అనుష్ఠించదగియున్న పరస్పర విరుద్ధమైన కర్మ సంన్యాసము మరియు కర్మయోగము యొక్క ఫలముల యందు విరోధ ముండవలయును.  రెంటియొక్క కల్యాణఫలముల యందు విరోధముండవలయును.  రెంటియొక్క కల్యాణ రూపములకు ఒకే ఫలమని చెప్పుట గూడ సరికాదు.

*ఇటువంటి శంక కలిగినప్పుడు యిలా చెప్పబడును -*

**5.4. సాంఖ్యయోగౌ పృథక్‌బాలాః ప్రవదంతి న పండితాః,**
**ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విందతే ఫలమ్.**

అనగా - అల్పబుద్ధి గలవారు మాత్రమే సాంఖ్యము మరియు యోగము ఈ రెంటిని వేరువేరు ఫలములు, కలుగజేయునవని చెప్పుదురు.  పండితులైనవారు అలా చెప్పరు.

జ్ఞానులైన పండితులు మాత్రము ఆ రెంటియందు పరస్పర విరోధములు లేని ఫలములే యిచ్చునని తలంచుదురు.

ఏలయన ?  సాంఖ్యము మరియు యోగము ఈ రెంటియందును ఏ ఒక్కదానిని చక్కగా అనుష్ఠించువారైనను అటువంటి పురుషులు ఆ రెంటి ఫలములను పొందుదురు.

కారణమేమనగా - అవి రెండూ ఒకే విధమైన పరమపదమునే ఫలములుగా కలిగి యున్నవి.  అందుచేత ఆ రెంటి యొక్క ఫలములయందును ఎటువంటి భేదముగాని విరోధము గాని లేదు.

**పూర్వపక్షము** - సంన్యాసము మరియు కర్మయోగము ఈ రెండు శబ్దముల ద్వారా భేదము చెప్పి తిరిగి యిచ్చట ఆ ప్రకరణమునకు విరుద్ధముగా సాంఖ్యము మరియు యోగముల యొక్క ఫలములయందు విరోధములేదనియు ఏకత్వమే కలదనియు ఎట్లు చెప్పుచున్నారు ?

**సమాధానము** - ఇందు దోషమేమియు లేదు.  అర్జునుడు కేవలము సంన్యాసము **మరియు కర్మయోగమును తెలుసుకొను అభిప్రాయంతోనే** ప్రశ్నించియున్నాడు.  కాని భగవంతుడు ఆతని అభిప్రాయమును వదలకయే వాటి యందు గల తన అభిప్రాయమును జోడించుచూ సాంఖ్యము మరియు యోగము యీ రెండు శబ్దముల ద్వారా వాటిని చక్కగా పట్టించి సమాధానము చెప్పియున్నారు.

అట్లేలయన ?  అటువంటి సంన్యాసులు మరియు కర్మయోగులే క్రమక్రమముగా జ్ఞానము మరియు వుపాసన వలన కలిగిన సమబుద్ధి మొదలగు భావముల నుండి ముక్తులై సాంఖ్యులు మరియు యోగుల పేరుతో పిలువబడుదురు.  ఇది భగవంతుని అభిప్రాయము.  అందుచేత పై వర్ణనము ప్రకరణ విరుద్ధము కాదు.

**5.5. యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే,**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి.**

అనగా - సాంఖ్యయోగుల ద్వారా అనగా జ్ఞాన నిష్ఠ కలిగియున్న సాంఖ్య సంన్యాసుల ద్వారా మోక్షమనెడు ఏ స్థితి పొందబడునో అదే స్థితి కర్మయోగుల ద్వారా గూడ పొందబడును.

ఏ పురుషుడు తన కొరకు కర్మ ఫలమును కోరక సర్వకర్మలను మరియు వాటి ఫలములను ఈశ్వరార్పణగావించి దానినే జ్ఞానప్రాప్తికి వుపాయముగా తలంచి కర్మల ననుష్ఠించునో అట్టివాడు **యోగి** అనబడును. అందుచేత అటువంటివారికి గూడ పరమార్థ జ్ఞానరూపమైన సంన్యాసము లభించుట ద్వారా ఆ మోక్షఫలము లభించును.

అందుచేత ఆ విధముగా ఫలమునందు సమానత్వము కలిగి యున్నందున **సాంఖ్యమును యోగమును ఒకటిగా చూడనగును.** అట్లు చూచువాడే యధార్థమును ఎరింగిన వాడు.

**పూర్వపక్షము** - ఈ మాటే నిజమైతే అలాంటి దశయందు కర్మ సంన్యాసమే శ్రేష్ఠమైనదనియు మరియు ఆ రెండింటిలో అనగా కర్మ సంన్యాసము మరియు కర్మయోగములలో కర్మ సంన్యాసము కంటే కర్మయోగమే శ్రేష్ఠమైనదని ఎట్లు చెప్పియున్నారు ?

**సమాధానము** - అట్లు చెప్పుటకు కారణమేమనగా - వినుము -

నీవు కేవలము కర్మ సంన్యాసము మరియు కేవలము కర్మయోగమును గురించి చెప్పమని అడిగియున్నావు. పైగా ఆరెండింటిలో నీకు ఏది కల్యాణదాయకమో చెప్పమని అడిగి యున్నావు. నీ ప్రశ్నకు అనుగుణముగానే **జ్ఞానరహితమైన కర్మసంన్యాసము కంటే కర్మయోగమే** శ్రేష్ఠమని నేను సమాధానము చెప్పియున్నాను.

ఏలయన ? **జ్ఞానముతో కూడియున్న సంన్యాసమును నేను సాంఖ్యమని తలంచుచున్నాను. పైగా అదియే పరమార్థయోగము కూడాను.**

**నిష్కామ కర్మయోగము ఆ జ్ఞానయోగమునకు సాధనముగా వుపయోగపడు చున్నందున గౌణరూపముగా యోగము సంన్యాసము రెండుగా చెప్పబడుచున్నవి.**

అది అనగా కర్మయోగము జ్ఞానయోగమునకు ఏ విధముగా సాధనమగుచున్నదో చెప్పెద వినుము.

**5.6. సంన్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తుమయోగతః,**
**యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి.**

అనగా - **కర్మయోగము లేకుండా పారమార్థికమైన సంన్యాసము లభించుట కష్టము,** దుష్కరము గూడాను.

మరియు ఫలాసక్తిని విడిచి ఈశ్వర సమర్పిత భావముతో చేయబడిన వైదిక కర్మయోగముతో కూడియున్న, ఈశ్వర స్వరూపమును మననము చేయు సాధకుడు బ్రహ్మమును

అనగా పరమార్థ జ్ఞాన నిష్ఠారూపమైన పారమార్థిక సంన్యాసమును అతి శీఘ్రముగా పొందగలడు. అందుచేతనే **కర్మయోగము శ్రేష్ఠమైనదని నేను చెప్పుచున్నాను.**

పరమాత్మ జ్ఞానమును కలిగించు సాధనముగా వున్నందున ఈ ప్రకరణమునందు వర్ణించబడిన సంన్యాసమే బ్రహ్మనామముతో చెప్పబడినది. ఇంకా ఏమన **సంన్యాసమే బ్రహ్మము. ఆ బ్రహ్మమే పరము.** "న్యాస యితి బ్రహ్మ బ్రహ్మ హిపరః" (నారాయణోపనిషత్తు 2-78) ఈ శ్రుతి ద్వారా కూడా ఆ మాట సిద్ధించుచున్నది.

ఎప్పుడు ఈ పురుషుడు సమ్యక్ జ్ఞానప్రాప్తికి సంబంధించిన వుపాయ రూపమైన....

**5.7. యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః,
సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే.**

అనగా - యోగముతో కూడినవాడై, విశుద్ధ అంతఃకరణము కలిగినవాడై అనగా లోకవాసనలు లేనట్టి అంతఃకరణము కలవాడై విజితాత్ముడు అనగా ఆత్మను తన వశమునందుంచుకొన్నవాడై శరీరమును జయించినవాడై, జితేంద్రియుడు అనగా సర్వేంద్రియములను తన వశమునందుంచుకొనినవాడై మరియు సర్వభూతముల యందును తన ఆత్మను చూచువాడై అనగా ఎవని ఆత్మ బ్రహ్మ మొదలు స్తంభ పర్యంతము సర్వ భూతముల యందును తానే వ్యాపించి యున్నట్లుగా చూచువాడు నిజమైన జ్ఞానియగుచున్నాడు.

"తనయందు నఖిలభూతములందు, నొకభంగి సమహితత్వంబునజరుగువాడు" "అంబోజాసనుడాదిగాగ, తృణపర్యంతంబు, సర్వాత్ముడై, సంభావంబున నుండు ప్రోడ"...(చూ. భాగ. సప్తమ స్కంధము)

అప్పుడు ఈ విధముగా స్థితి కలిగియున్న పురుషుడు లోక హితార్థము కర్మలు ఆచరించుచుండియు వాటితో తాదాత్మ్యమును పొందడు. అనగా ఆ కర్మలకు బద్ధుడు కాడు.

యథార్థముగా ఆతడు కొంచము కూడా కర్మలు చేయడు.

**5.8. నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్,
పశ్యంశృణ్వ న్స్పృశంజిఘ్రన్న శ్నంగచ్ఛన్ స్వపం శ్వసన్.**

అనగా - **ఆత్మ యొక్క యథార్థ స్వరూపము పేరు తత్త్వము.** దానిని గుర్తించినవాడు తత్త్వజ్ఞాని అనగా తత్త్వమును ఎరింగినవాడు. సమాహితచిత్తుడై నేనేమియు చేయుటలేదు అని తలంచును.

తత్త్వమును గురించి తెలుసుకొని ఆతడు ఎప్పుడు మరియు ఏ విధముగా అట్లు తలంచును - అది చెప్పుచున్నాడు.

**5.9. ప్రలపన్వి సృజన్ గృహ్ణన్నున్మిషన్మిషన్నిమిషన్నపి,
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్.**

అనగా - చూస్తూ, వింటూ, తాకుతూ. వాసన చూస్తూ, తింటూ. నడుస్తూ, నిద్రించుచూ, వుఛ్వాస నిఛ్వాసములు చేస్తూ. త్యజించుచూ. గ్రహించుచూ మరియు కన్నులు

మూయుచూ, తెరుస్తూ కూడా యింద్రియములు యిద్రియముల యందే వ్యవహరించుచున్నవని ఎరింగియూ, "నేనేమియు చేయుటలేదు" అని తలంచువాడు తత్వవేత్తయగును.

ఇటువంటి తత్వజ్ఞాని అయినవాడు అనగా అన్ని యింద్రియములందును మరియు అంతఃకరణము యొక్క చేష్టల రూపమైన కర్మలయందు అకర్మత్వమును చూచువాడు తనయందు కర్మాభావమును అనగా కర్మలు లేని స్థితిని చూచును. అందుచేత **అటువంటి నిజమైన జ్ఞానికి సర్వకర్మ సంన్యాసమునందు అధికారము కలదు.**

అట్లేలయన ? మృగతృష్ణ అనగా ఎండమావులయందు జలమున్నదని, దానిని సేవించి తన దాహమును తీర్చుకొనగోరు పురుషుడు ఆ ఎండమావుల యందలి జలాభావమును తెలుసుకొన్నప్పుడు మరల మరల ఎండమావుల యందలి జలము ద్వారా తన దాహమును తీర్చుకొనుటకు ప్రయత్నించడు.

కాని **తత్వజ్ఞాని కాని పురుషుడు కర్మయోగమునందు ప్రవృత్తికలవాడు....**

**5.10. బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః,**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా.**

అనగా – ఎవడు తన యజమాని కొరకు సేవలు (కర్మలు) చేయు నౌకరు వలె "నేను సర్వవిధ కర్మలు ఆ ఈశ్వరుని కొరకే చేయుచున్నాను" అను భావముతో కర్మలను కర్మ ఫలములను ఈ ఆశ్వరునికే అర్పించుచూ **చివరకు మోక్షరూప ఫలమునందు గూడ ఆసక్తిని విడిచి కర్మలు చేయుచుండునో...**

ఆతడు తామరాకుపైన గల నీటిబొట్టువలె ఈ కర్మభూమియైన ప్రపంచము మరియు ప్రాపంచిక భావముతో లిప్తము కాకయుండును.

**అటువంటి పురుషుని కర్మఫలములు కేవలము అంతఃకరణ శుద్ధికి మాత్రమే తోడ్పడును.**

అట్లేలయన ?

**5.11. కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి,**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వా త్మ శుద్ధయే.**

అనగా – యోగులు కేవలము అనగా "నేను సర్వవిధ కర్మలను ఈశ్వరుని కొరకు చేయుదును. నా సొంత లాభము కొరకు కాదు" అని తలంతురు. ఈ భావము వలన వేటియందు నావి అను బుద్ధిలేదో అట్టి శరీరము, మనస్సు, బుద్ధి మరియు యింద్రియములతో ఫలసంబంధమైన ఆసక్తిని వదలి ఆత్మశుద్ధి కొరకు అనగా అంతఃకరణశుద్ధి కొరకు కర్మలు చేయుదురు. అన్ని క్రియల యందును మమత్వమును త్యజించుట కొరకు 'కేవల' శబ్దమునకు శరీరాదులు మొదలగు అన్ని శబ్దములతో సంబంధము కలదు.

నీకు గూడ కర్మలయందే అధికారము గలదు. కావున నీవు కూడ కర్మలే చేయుము.

**5.12. యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్,**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే.**

అనగా – "సర్వకర్మలు ఈశ్వరుని కొరకే, నేను అనుభవించుటకు కాదు" అని ఆ విధముగా నిశ్చయించుకొన్నటువంటి యోగి కర్మఫలములను త్యజించి జ్ఞాన నిష్ఠ వలన కలుగు మోక్షరూపమైన పరమశాంతిని పొందును.

**ఇచ్చట ముందుగా అంతఃకరణము శుద్ధమై అనగా లోకవాసనలు లేనిదై జ్ఞానమును పొంది అటుపైన సర్వకర్మ సంన్యాస రూపమైన జ్ఞాన నిష్ఠను పొంది ఈ విధముగా క్రమముగా చివరకు పరమశాంతిని పొందును.**

కాని ఎవరు పైన చెప్పబడిన నిష్ఠ కలిగియుండలేదో ఆతడు కామప్రేరితుడై కర్మఫలము నాశించి "ఈ కర్మలు నేనే చేయుచున్నాను" అని ఆ కర్మఫలము నందు ఆసక్తిగలవాడై బంధమునందు చిక్కువడును. కావున నీవు పైన చెప్పిన విధముగా ఫలాసక్తిలేని వాడవుకమ్ము.

కాని యధార్థజ్ఞాని అయినవాడు

**5.13. సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే సుఖం వశీ,**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్నకారయన్.**

అనగా – ఇంద్రియములను జయించిన పురుషుడు సమస్తమైన కర్మలనుండి, మనస్సును తొలగించుకొని అనగా నిత్య నైమిత్తిక, కామ్య మరియు నిషిద్ధమైన వివేక సంపన్నమైన బుద్ధి ద్వారా త్యజించి సుఖస్థితిని పొందును.

మనస్సు, వాక్కు మరియు శారీరకమైన చేష్టలను త్యజించి శ్రమ శూన్యము, ప్రసన్నచిత్తత్వము మరియు ఆత్మ సంబంధమైనవిగాక యితరమైన అన్ని ప్రయోజనకరములైన కర్మల నుండి నివృత్తిని పొంది ఆతడు సుఖపూర్వకమైన స్థితియందు స్థిరపడును.

ఇంద్రియములనన్నింటిని జయించిన పురుషుడు ఎచ్చట, ఎట్లు వ్యవహరించునో చెప్పుచున్నారు.

నవద్వారములు కలిగిన గ్రామమునందు నివశించును అనగా చెవులు, కన్నులు, రెండు నాశికలు మరియు నోరు, శబ్దాది విషయములను గ్రహించు ఈ ఏడు ద్వారములు శరీరమునకు బైట అనగా వెలుపల వున్నవి. మరియు మలమూత్రములను త్యజించుటకొరకు రెండు ద్వారములు శరీరమునకు క్రింది భాగమున వున్నవి. ఈ విధముగా నవద్వారములు కలిగియున్న ఈ స్థూలదేహము పురము అనగా జీవునకు నివాస స్థానము అని చెప్పబడుచున్నది. దేహమంతయు ఒక నివాస గ్రామము వంటిది. ఆ గ్రామమునకు (యింటికి) యజమాని ఆత్మ ఏ ప్రయోజనములన్నియు ఆ ఆత్మ కొరకే అయివున్నచో మరియు ఏ అనేక ఫలములు

మరియు విజ్ఞానమునకు ఉత్పాదకములై యున్నవో ఆ యింద్రియములు, మనస్సు, బుద్ధి మరియు విషయములనెడి పేరులతో అనగా పురవాసులతో కూడియున్నవో అటువంటి నవద్వారములు కలిగియున్న పురము (దేహము) నందు దేహి అనగా **జీవుడు సర్వకర్మలను త్యజించి నివసించుచుండును.**

**పూర్వపక్షము** – ఇట్టి విశేషణము వలన కలుగు ఫలమేమి కలదు ? సంన్యాసియైనను, కాకున్నను జీవులందరూ దేహములయందే నివసించుచున్నారు గదా ? అందుచేత యిచ్చట ఆతనికి విశేషత్వమును కల్పించుట వ్యర్థము.

**సమాధానము** – అజ్ఞానముతో కూడియున్న జీవులు స్థూలదేహమును మరియు యింద్రియ సమూహమునే ఆత్మగా తలంచుచున్నారు. ఆ అజ్ఞానులైన జీవులందరూ "ఇంటి యందు, భూమిమీద, మరేదైన ఆసనము మీద (కుర్చీ, పీట మొదలగు) కూర్చుంటున్నాము" అని అనుకొంటున్నారు. అట్లేలయన ? దేహమునందు మాత్రమే ఆత్మబుద్ధి కలిగియున్న అజ్ఞానులందరకూ "యింటిలోవలె శరీరమునందుంటున్నాము" అనునట్టి జ్ఞానము కలుగుట సంభవము కాదు.

కాని **"దేహేంద్రియాది సంఘాతము కంటే ఆత్మ భిన్నమైనదని"** తెలుసుకొనువారు వివేకులు. అట్టి వివేకులకు **"నేను శరీరమను యింటియందు వుంటున్నాను"** అను భావము స్థిరముగా వుండును.

అంతేగాక నిర్లేపమైన అనగా ఎటువంటి యితర వస్తువుతోనూ సంబంధము కలిగియుండనటువంటి ఆత్మయందు అవిద్య వలన ఆరోపించబడిన దేహేంద్రియాది కర్మ లన్నియు వివేకముతో కూడియున్న విజ్ఞానరూపమైన విద్యద్వారా మనస్సు నుండి తొలగిపోవుట సంభవమగును.

అటువంటి వివేకముతో కూడిన విజ్ఞానరూపమైన విద్యను పొందిన సర్వకర్మ సంన్యాసి కూడ శరీరమను యింటియందు అనగా తొమ్మిది ద్వారములు కలిగియున్న శరీరమనెడి పురమునందు ప్రారబ్ధకర్మల కారణముగ మిగిలియున్న సంస్కారముల కారణముగ వుంటున్నాను అని తలంచును. అట్లేలయన ? **దేహాదుల యందే ప్రారబ్ధ ఫలభోగానుభవము కుదురును.**

అందుచేత జ్ఞాని మరియు అజ్ఞానుల అనుభవ భేదము చేత "దేహేయేవ ఆస్తే" అను విశేషణ ఫలము తప్పక కలుగును.

కార్యము, కరణము మరియు కర్మలు అవిద్య కారణముగ ఆత్మయందు ఆరోపించబడినప్పటికి, వివేకముతో కూడియున్న జీవుడు వాటితో సంబంధము లేకయే యుండును అని చెప్పబడినప్పటికీ ఆత్మతో నిత్య సంబంధము కలిగి యుండుట చేత కలుగు కర్తృత్వ భావము మరియు కర్మలు చేయించవలయునన్న భావము ఈ రెండూ గూడ ఆత్మయందు దాగియే యుండును అను శంకకు సమాధానము చెప్పుచూ తనంతట తానుగా చేయకయే మరియు దేహము యింద్రియములు మొదలగు వాని ద్వారా చేయించకయే అనగా వాటిని కర్మలయందు నియోగించకయే వుండును.

శంక – మరి అట్టి స్థితియందు భక్తుల ద్వారా పూజ మొదలగు సత్కర్మలు మరియు యజ్ఞములు, దానములు, హోమములు మొదలగు సత్కర్మలు ఆయనకు ఎందుకు అర్పించబడుచున్నవి ?

అందులకు సమాధానముగా చెప్పుచున్నారు –

జీవుల యొక్క వివేకరూపమైన విజ్ఞానము అజ్ఞానముచే కప్పబడియున్నది. అందుచేత వివేకము లేనటువంటి **లోకమాయయందు చిక్కువడియున్న జీవులే అట్టి కర్మలు చేయుచున్నారు.** "చేయుచున్నాను, తింటున్నాను, తినుపించుచున్నాను" మొదలగు భావములతో మోహమును చెందియున్నారు.

**5.16 జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః,**
**తేషామాదిత్యవజ్జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్.**

అనగా – ఏ జీవుల యొక్క అంతఃకరణములు అజ్ఞానము చేత కప్పబడి యున్నందున మోహితులగుచున్నారో వారి అజ్ఞానము ఆత్మ విషయికమైన వివేక విజ్ఞానము చేత తొలగిపోవును. అప్పుడు వారి ఆ వివేక విజ్ఞానము సూర్యునివలె ఆ పరమార్థతత్త్వమును ప్రకాశింపజేయును. అనగా ఏ విధముగా **సూర్యుడు సమస్త వస్తురూపములను ప్రకాశింపజేయుచున్నాడో** ఆ విధముగానే వారి జ్ఞానము సమస్తమైన జ్ఞేయవస్తువును అనగా దేనిని యదార్థముగా తెలియవలయునో అనగా ఆ సత్య నిత్య నిర్వికార పరమార్థ తత్త్వమును ప్రకాశింపజేయును.

ఆ విధముగా ప్రకాశింపబడిన ఏ పరమ తత్త్వము కలదో...

**5.17. తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః,**
**గచ్ఛన్త్య పునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః.**

అనగా – ఆ పరమార్థతత్త్వమును తెలుసుకొనిన బుద్ధిగలవాడు "తద్బుద్ధి" అనబడును. ఆ పరబ్రహ్మమునే తన ఆత్మగా తలంచువాడు అనగా **ఆ పరమాత్మయే తానని గుర్తించివాడు "తదాత్మా" అనబడును.** అట్లే ఆ బ్రహ్మతత్త్వమునందే దృఢమైన నిష్ఠగలిగి ఆయాత్మభావమునందే లీనమైయున్నవాడు అనగా ఎవడు సర్వకర్మ సంన్యాసము జేసి బ్రహ్మభావము నుందే స్థిరబుద్ధి కలిగి యుండునో అటువంటివాడు **"తన్నిష్ఠ"** అనబడును.

ఆ పరబ్రహ్మయే ఎవనికి నిలయమై యుండునో అనగా ఏకమాత్ర ఆశ్రయమై యుండునో అనగా పరమాత్మ భావముతోడనే నిండియుండునో అటువంటి వాడు **"తత్పరాయణుడు"** అనబడును.

ఈ విధముగా ఎవని అంతఃకరణము నుండి అజ్ఞానము జ్ఞానము ద్వారా తొలగిపోయినదో మరియు ఆ జ్ఞానము ద్వారా ఈ సంసారమునకు కారణరూపమైన పాపాది సమస్త దోషములు నశించిపోయినవో అటువంటి జ్ఞాననిర్ధూతకల్మషుడైన సంన్యాసి పునరావృత్తిలేనివాడై

అనగా పునర్జన్మలేనివారై అనగా ఎటువంటి అవస్థను పొందినందువలన తిరిగి దేహాదులతో సంబంధము కలుగుట లేకుండా పోవునో అటువంటి స్థితి కలవాడగును. దానిని మోక్ష స్థితియని చెప్పుదురు.

ఎవని అజ్ఞానమంతయు జ్ఞానము ద్వారా నశించి పోయినదో అటువంటి జ్ఞానులు పరమాత్మ తత్వమును ఎట్లు చూచెదరు అని అన్నచో ఇట్లు చెప్పుచున్నారు -

**5.18. విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః.**

అనగా - పండితులైనవారలు అనగా బ్రహ్మతత్వమును బాగుగా ఎరింగిన విద్వాంసులు. విద్య మరియు వినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందు అనగా ఆత్మబోధ కలిగియుండి మరియు నిత్యానిత్యవస్తువివేకము కలిగి ప్రాపంచిక విషయముల యందు అభిలాష లేకయున్న సత్ బ్రాహ్మణునియందు, గోవుయందు, ఏనుగుయందు, కుక్కయందు చివరకు చాండాలునియందు గూడ సమభావమును కలిగియుండును.

తాత్పర్యమేమనగా -

నిర్వికార బ్రహ్మమును మాత్రమే చూచు స్వభావము గల సమదర్శియైన పండితుడు వుత్తమ ప్రాణి అనగా చక్కని సంస్కారము కలిగి విద్యావినయ సంపన్నుడై సాత్విక గుణయుక్తుడైన బ్రాహ్మణునియందు, మధ్యమప్రాణి అనగా సంస్కార రహితమై రజోగుణయుక్తమైన గోవునందును మరియు కనిష్ఠప్రాణి అనగా అత్యంత అజ్ఞానముతో కూడి కేవలము తమోగుణయుక్తమైన ఏనుగు మొదలగు వాటియందు సత్వగుణము నుండి మరియు వాటి సంస్కారములతో మరియు రాజస, తామస గుణయుక్త సంస్కారములతోడను ఎటువంటి సంబంధము లేక నిర్లేపముగా అనగా వాటితో ఎటువంటి సంబంధము లేక సమదృష్టి కలిగి యుండును.

**పూర్వపక్షము** - ఆ విధముగా సమదృష్టి కలిగియున్నవారు దోషముతో కూడియున్న వారలే. ఏలయన ? వారి అన్నము భోజ్యయోగ్యము కాదు. ఏలయన ? సమాన గుణశీలము కలిగియున్నవారలకు భేదయుక్తమైన పూజలు సలిపినందున మరియు భేదముతో కూడియున్న గుణశీలము కలిగియున్న వారలకు ఒకే విధమైన పూజలు చేసినా అట్లు చేయు యజమాని దోషిగా పరిగణించబడును.

సమాధానము - అట్టివారు దోషులు కాదు - ఏలయన ? -

**5.19. ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః,**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః.**

అనగా - ఎవని అంతఃకరణము సమత్వమునందు అనగా అన్ని భూతములయందు అంతర్గతముగా అనగా లోపలగా వ్యాపించియున్న బ్రహ్మరూపమునందు సమదృష్టి కలిగి

నిశ్చలమై యున్నదో అటువంటి సమదృష్టి గల పండితులు అనగా జ్ఞానులు యిచ్చట స్థూలదేహాదులు గలిగి జీవించియుండగానే జన్మమరణములను జయించినవారై ముక్తులగుదురు. **అనగా జన్మ-మరణములను తమ స్వాధీనమునందుంచుకొనగలరు.**

అట్లేలయన ? బ్రహ్మదోషరహితుడు, అనగా అజ్ఞానులకు దోషములతో కూడియున్న చాండాలాదులయందు వారి దోషముల కారణముగ వారియందు అంతర్గతముగా యున్న ఆత్మ పదార్థము గూడ దోషయుక్తమై యున్నట్లుగా తోచుచుండును. అయినప్పటికి యదార్థముగా ఆయాత్మ వారి దోషములతో ఎటువంటి సంబంధము లేక పవిత్రముగానే అనగా దోషరహితము గానే యుండును.

చైతన్యత్వము కలిగియున్న ఆత్మ గుణరహితము అనగా నిర్గుణమైనదై యున్నందున తన గుణరూపంతో జూచినను దాని యందు భిన్నత్వము అనగా భేదము కానరాదు. భగవంతుడు- కృష్ణుడు గూడ యిచ్ఛాదులను క్షేత్ర ధర్మములనియే వచింతురు మరియు **"అనాది మరియు నిర్గుణము అయిన కారణముగ ఆత్మ తనకంటే యితరమైన దేనితోడను ఎటువంటి సంబంధము కలిగియుండదు.** ఈ మాట కూడా భగవంతుడే చెప్పియున్నారు. వైశేషిక శాస్త్రమునందు చెప్పబడియున్న నిత్యద్రవ్యగతమైన అంత్య విశేషణము గూడ ఆత్మయందు భేదమును కలిగించునదికాదు. అట్లేలయన ? వేరు వేరు దేహముల యందు ఆ అంత్య విశేషణములు కలవనుటకు ఎటువంటి ప్రమాణము (కానరాదు) చూపుటకు సంభవము కాదు.

ఆ కారణము చేత యిచ్చట లభించిన సారాంశమేమన ? బ్రహ్మమునందు అనగా **బ్రహ్మపదార్థమునందు విషమత్వము అనగా భేదము లేదు. అది ఒక్కటియే.** అందుచేత సమదర్శియైన పురుషుడు బ్రహ్మయందే లీనమై యుండును. అందుచేత అతనికి ఎటువంటి దోషములు అంటవు. అట్లేలయన ? అటువంటి సమదర్శియైన పురుషునికి ఆత్మరూపముగా నుండి యితరమను అభిమానము పూర్తిగా తొలగిపోవును.

**"సమాసమాభ్యాం విషమసమే పూజాతః"** ఈ సూత్రము పూజావిషయక విశేషణము లతో కూడియున్నందున దేహాది సంఘాతమునందు ఆత్మదృష్టి కలిగి అభిమానము కలిగియున్న పురుషుని గురించి చెప్పబడియున్నది.

ఏలయన ? పూజ, పాత్రలు, దానము మొదలగు కర్మలయందు భేదబుద్ధియున్న కారణమున, "బ్రహ్మవేత్త ఆరు అంగములను ఎరింగియున్నవాడు, నాలుగు భేదములు తెలిసినవాడు మొదలగు విశేష గుణములతో సంబంధము చెప్పబడుచున్నది.

కాని బ్రహ్మ పదార్థము సర్వవిధ గుణ-దోష రహితము. అందువలననే **"బ్రహ్మవేత్తలైన వారందరూ ఆ బ్రహ్మతత్వమునందే లీనమైపోవుదురు"** అని చెప్పుట తప్పుకాదు.

అంతే కాకుండా "సమాసమామ్యమ్" మొదలగు పదములు కర్మయోగులను గురించి చెప్పినవి. మరియు ఈ **"సర్వ కర్మాణి మనసా"** (గీ. 5-13) శ్లోకము మొదలు ఈ అధ్యాయము అంతము వరకు ప్రకరణమంతయు సర్వకర్మ సన్యాసిని గురించియే చెప్పబడినది.

అట్లేలయన ? దోషరహితము విషమత్వములేని బ్రహ్మయే ఆత్మ. అందువలన -

**5.20.** న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్,
స్థిరబుద్ధి ర సంమూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః.

అనగా - ప్రియమైన అనగా తాను కోరిన వస్తువు లభించినప్పుడు హర్షము అనగా సంతోషము, అప్రియమైన అనగా తనకు యిష్టము కాని వస్తువు ప్రాప్తించినప్పుడు దుఃఖమును పొందకుండుట జ్ఞానుల లక్షణము.

ఏలయన ? స్థూల సూక్ష్మాది దేహాదులయందు ఆత్మబుద్ధి గలవానికి మాత్రమే యిష్ట వస్తువు ప్రాప్తించినప్పుడు హర్షము అనగా సంతోషము కలుగును. అట్లే అప్రియ వస్తువు ప్రాప్తించినప్పుడు దుఃఖము కలుగుచుండును. **కేవలము ఉపాధి రహితమైన ఆత్మ భావము కలిగియున్న పురుషునకు అటువంటి హర్ష విషాదములు అనగా సంతోష దుఃఖములు కలుగనేరవు.** అట్లుండుటకు కారణమేమన ? **ఆత్మ సాక్షాత్కారము పొందిన పురుషునకు ప్రియాప్రియములు కలుగుట సంభవించదు.**

అన్ని భూతములయందును ఒకే ఆత్మ వ్యాపించి యున్నది. అది సమమైనది. అనగా వికారము లేనిది. అంతేకాకుండా దోషరహితమైనది. అనగా సాంసారిక వాసనలు లేనిది. ఇటువంటి సంశయ రహితమైన బుద్ధి ఎప్పుడు ఆత్మభావముతో కూడి, అందు లీనమై స్థిరపడునో అనగా వికారములను పొందుట వుండదో మరియు మోహము అజ్ఞానరహితమై యుండునో అటువంటి నిర్వికారమైయున్న స్థిరబుద్ధి బ్రహ్మజ్ఞానియొక్క బ్రహ్మమునందే లీనమై స్థిరముగా వుండును. అనగా ఆ బుద్ధి ఎటువంటి కర్మలు చేయనదియై సర్వకర్మలను త్యజించినదై యుండును.

మరియు ఆ విధముగా బ్రహ్మతత్వమునందు స్థిరపడియున్న పురుషుడు ఎట్లుండుననగా -

**5.21.** బాహ్య స్పర్శేష్వసక్తాత్మా, విందత్యాత్మని యత్సుఖమ్,
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే.

అనగా - ఇంద్రియముల ద్వారా కలుగు జ్ఞానము 'స్పర్శ' అనబడును. ఈ వ్యుత్పత్తి అర్థమునుసరించి **శబ్దాది విషయములన్నింటికి స్పర్శ** అని పేరు. **అవన్నీ మనలోపల లేవు, బయట వున్నవి.** ఆ బాహ్య స్పర్శలయందు ఎవని అంతఃకరణము ఆసక్తి కలిగియుండదో అటువంటి విషయాసక్తి లేనటువంటి పురుషుడు ఈ **బాహ్యేంద్రియముల ద్వారా లభించు స్పర్శలను గాక తనలోపల కలుగు సుఖమును అనుభవించును.**

మరియు ఆ బ్రహ్మయోగముతో కూడియున్న ఆత్మ అనగా **బ్రహ్మయందు కలుగు సమాధిని బ్రహ్మయోగమని అందురు.** అట్టి బ్రహ్మయోగముతో ఎవని అంతఃకరణము

సమిశ్రితమైయున్నదో, చక్కగా దానితో సమాగమును చెందియున్నదో, లగ్నమైయున్నదో అటువంటి పురుషుడు అక్షయమైన అనగా ఎన్నడూ తరగనటువంటి నశించనటువంటి సుఖమును ఆనందమును అనుభవించును, పొందియుండును.

అందుచేత తనంతటతానుగా ఆ అక్షయ సుఖమును పొందగోరు పురుషుడు క్షణికమైన బాహ్యవిషయముల ద్వారా కలుగు సుఖముల నుండి తన యింద్రియములను తొలగించుకొనవలయును. ఇదియే ఈ శ్లోకము యొక్క తాత్పర్యము.

అంతేకాకుండా ఈ క్రింది కారణముల వలన గూడ తన యింద్రియములను విషయముల నుండి వెనుకకు మరల్చుకొనవలయును.

**5.22. యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే,**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః.**

అనగా – ఏలయన ? విషయములు మరియు యింద్రియముల సంబంధము వలన కలుగు భోగములు అన్నియు అవిద్య అనగా అజ్ఞానము కారణముగ కలుగుచున్నవైనందు వలన అవి కేవలము దుఃఖమునకు మాత్రమే కారణములగును. ఏలయన ఆధ్యాత్మిక ఆధిభౌతిక, ఆది దైవికముల వలన కలుగు త్రివిధములైన దుఃఖములు వాటి వలన కలుగుచున్నట్లుగా చూడబడుచున్నవి.

'ఏవ' అను శబ్దము ద్వారా అవి ఈ లోకమునందు ఏ విధముగా దుఃఖహేతువులో ఆ విధముగానే అవి పరలోకమునందు కూడా దుఃఖప్రదములుగానే తెలియబడుచున్నవి.

**ఈ ప్రపంచమునందు సుఖముల యొక్క వాసన కూడా లేదు.** అలా అని తలంచి విషయరూపమైన ఎండమావుల నుండి మనస్సును మరల్చుకొనవలయును.

**ఈ విషయ జ్ఞానభోగములన్నియు దుఃఖములకే హేతువులగుచున్నవి.** అంతేగాక ఈ భోగములన్నియు ఆద్యంతములు కలిగి యున్నవి. విషయములు మరియు యింద్రియముల యొక్క సంయోగము అనగా సమాగమము అనగా కలయికయే భోగములకు ఆరంభము. మరియు అవి రెండు విడిపోవుటయే ఆ భోగములకు అంతము.

అందుచేత ఆద్యంతములు కలిగియున్న ఆ భోగములు కేవలము మధ్యకాలమునందు మాత్రమే తోచునవి అయినందున అనిత్యములై యున్నవి.

ఓ కౌంతేయా ! పరమార్థతత్త్వమును ఎరింగిన వివేకము కలిగియున్న బుద్ధిమంతుడైన పురుషుడు ఆ భోగములయందు ఆసక్తుడు కాడు, లీనముకాడు. ఏలయన ? కేవలము పూర్తిగా మూఢత్వము కలిగియున్న పురుషుని యందు మాత్రమే పశువులు మొదలగువానివలె విషయములయందు ఆసక్తి చూడబడుచున్నది.

కల్యాణదాయకములైన మార్గమునకు అవరోధముగావున్న కామక్రోధాది వేగవంతములైన యీ దోషములు చాలా గొప్ప దుఃఖహేతువులు. సర్వానర్థముల లబ్ధికి యివి

కారణములు. అంతేగాక వీటిని నివారించుట కూడా చాలా కష్టతరము. అందుచేత వీటిని నశింపజేయుటకు బాగుగా ప్రయత్నించవలయునని భగవంతుడు మరల మరల చెప్పుచున్నారు.

**5.23. శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్,**
**కామక్రోధోద్భవం వేగం సయుక్తః స సుఖీ నరః.**

అనగా - ఏ పురుషుడు ఈ లోకమునందు పంచభూతాత్మకమైన దేహము నందుండగానే అనగా తనకున్న స్థూలదేహమును త్యజించక పూర్వమే, కామ, క్రోదాదుల వలన కలుగు మనోవేగములను సహించగలడో అనగా వాటి వేగమును అణచివుంచగల లేక వాటిని తన అధీనమునందుంచుకొనగల సామర్థ్యము కలిగివుండునో ఆతడే, యోగముతో కూడినవాడే సుఖవంతుడగును.

శరీరముతో కూడియున్న పురుషుని అంతఃకరణమునందు కామక్రోధములు మరియు వాటి వేగము తప్పకయుండును. అందువలన మరణపర్యంతము అనగా స్థూలశరీరము వున్నంత కాలము అని హద్దు నిర్ణయించబడినది. అట్లేలయన ? ఆ కామక్రోధముల వలన జనించు భావావేగము అనేక విధములుగా అనేక కారణముల ద్వారా ప్రకటితమగును. అందుచేత స్థూలదేహ పరిత్యాగ పర్యంతము దానిని నమ్మి, పరాకుగా వుండరాదు. అనగా ఆ కామక్రోధాదులను గురించి సర్వకాల సర్వావస్థలయందును జాగరూకతతో సావధానచిత్తుడై యుండవలయును.

ఇంతకు పూర్వము ఎన్నడో అనుభవించబడియున్న సుఖదాయకము మరియు బాగుగా యిష్టమైన విషయము యిప్పుడు యింద్రియ గోచరమయ్యేనేని లేక దానిని గురించి విన్నప్పుడో లేక ఆ అనుభవించబడిన విషయము లేక వస్తువు స్మరణకు వచ్చినప్పుడు దానిని తిరిగి పొందవలయునన్న లాలస, తృష్ణ అనగా కోరిక కలుగును. **అట్టి తృష్ణనే కామమందురు.**

అదే విధముగ తన బుద్ధికి లేక చిత్తమునకు ప్రతికూలమైన అనగా దుఃఖమును కలిగించు విషయమును లేక వస్తువును చూచినప్పుడుగాని, లేక దానిని గురించి విన్నప్పుడుగాని, లేక ఆ విషయము లేక వస్తువు స్మరణకు వచ్చినప్పుడు గాని దాని పట్ల మన మనస్సు లేక చిత్తమునందు కలుగు ద్వేష భావము లేక కలుగు **ఆక్రోశమే క్రోధమనబడును.**

ఆ కామక్రోధాదుల వలన చిత్తమునందు కలుగు ఆవేశమే కామావేశము లేక క్రోధావేశమనబడును. శరీరమునందు గగుర్పాటు కలుగుట, ముఖము, నేత్రములు వికసించుట లేక ఎర్రబారుట మొదలగు చిహ్నములు మన అంతఃకరణము నందు రేగిన ఆవేశమునకు గుర్తులు. ఇదంతయు **కామము వలన కలుగు మనోవేగము.** అట్లే దేహము కంపించుట, చెమర్చుట, పెదవులను పండ్లతో నెక్కుట, కన్నులు చింత నిప్పులవలె ఎర్రబారుట మొదలగు లక్షణములన్నియు మన **అంతఃకరణమునందు కలుగు క్రోధమునకు గుర్తులు.**

ఇటువంటి కామమును మరియు క్రోధమును ఏ పురుషుడు సహించి, అణచు

కొనగలడో అనగా ఆ భావములు వికసించుటకు అవకాశము కలుగనివ్వడో, అటుపైన వాటిని అలా అణిచి వుంచుటయందే సుఖమును పొందగలడో, అట్టి పురుషుడే ఈ ప్రపంచమునందు నిజమైన యోగి మరియు ఆతడే నిజమైన సుఖమును అనుభవింప సమర్థుడు.

బ్రహ్మ భావమునందు స్థిరపడిన పురుషుడు ఎట్లు బ్రహ్మమును పొందును ? అన్నచో చెప్పుచున్నారు -

**5.24. యో ఽన్తఃసుఖో ఽన్తరారామ స్తథాంతర్జ్యోతిరేవ యః,**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతో ఽధి గచ్ఛతి.**

అనగా - తన అంతరాత్మయందే పరమ సుఖమును అనుభవించు పురుషుడు అంతఃసుఖమును పొందువాడు అనబడును మరియు అంతరాత్మయందే రమించు పురుషుడు అనగా తన అంతరాత్మయందే క్రీడించు పురుషుడు **అంతరారామీ** అనబడును. అట్లే తన అంతరాత్మ యందే జ్యోతిని ప్రజ్వలింప జేసుకొన్న పురుషుడు **అంతర్జ్యోతిమయుడు** అగును.

అటువంటి యోగి ఈ లోకమునందే స్థూలదేహాదులు కలిగియుండగానే అనగా జీవించి యుండగానే బ్రహ్మరూపమును బొంది బ్రహ్మయందు లీనమగుటయను మోక్షస్థితిని పొందును.

ఇంతేకాకుండా -

**5.25. లభంతే, బ్రహ్మనిర్వాణమృషయః క్షీణకల్మషాః,**
**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః.**

అనగా - జ్ఞానము కలుగుట చేత ఎవరి పాపాది దోషములన్నియు నశించినవో, ఎవని సంశయములన్నియు తొలగిపోయినవో, ఎవరు తమ యింద్రియముల నన్నింటిని తమ వశము నందుంచుకొన్నారో, ఎవరు సర్వభూతములయందును సమ భావము కలిగి వాటి కల్యాణార్థము వ్యవహరించుచున్నారో, ఎవరు హింసను విడనాడి అహింసను అవలంభించి యున్నారో, అటువంటి పుణ్యపురుషులు అనగా ఋషులు మరియు సమ్యక్జ్ఞానము కలిగి లోకభావమును సంన్యసించియున్నారో వారు బ్రహ్మ నిర్వాణమును అనగా ప్రాపంచిక బంధముల నుండి విడువడి మోక్షస్థితిని అనుభవింతురు.

మరియు -

**5.26. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్,**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్.**

అనగా - ఎవరు కామక్రోధములను ఈ రెండు దోషములు లేనివారో, ఎవరు తమ అంతఃకరణమును తమ వశమునందుంచుకొని యున్నారో, ఎవరు ఆత్మ తత్వమును

గుర్తించియున్నారో అటువంటి ఆత్మజ్ఞానము గల సమదర్శియైన యతులు అనగా సంన్యాసులు అయినవారికి రెండువైపుల నుండి అనగా జీవించియున్న కాలమందును మరియు దేహత్యాగము చేసిన తరువాత గూడ అనగా రెండు అవస్థలయందును బ్రహ్మాత్మైకత్వము అనగా మోక్షము లభించును.

యదార్థమైన జ్ఞాననిష్ఠ కలిగియున్న సర్వసంగ పరిత్యాగులకు సద్యః మోక్షము కలుగునని చెప్పబడియున్నది. మరియు అన్ని విధముల ఈశ్వరార్పిత భావము కలిగి పూర్ణబ్రహ్మ పదార్థమైన పరమాత్మయందు సర్వవిధకర్మ ఫలములను అర్పించినట్టి కర్మయోగము కూడ అంతఃకరణ శుద్ధి, తదుపరి జ్ఞానప్రాప్తి మరియు సర్వకర్మసంన్యాస క్రమము ద్వారా మోక్షమును పొందింపజేయును. ఈ విషయమును ఈ గ్రంథమునందు భగవంతుడైన శ్రీకృష్ణుడు అనేక పర్యాయములు చెప్పియున్నారు. ఇంకముందు గూడ చెప్పెదరు.

ఇప్పుడు సమ్యక్జ్ఞానమునకు అంతరంగ సాధన రూపమైన ధ్యానయోగమును గురించి సవిస్తరముగా చెప్పెదను. ఆ వుద్దేశ్యముతో ఆ ధ్యానయోగము యొక్క సూత్ర స్థానమందున్న శ్లోకములు చెప్పుచున్నారు.

**5.27. స్పర్శాంన్కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాంతరే భ్రువోః,**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ.**

అనగా – ఏ శబ్దాది విషయములు చెవులు మొదలగు యింద్రియముల ద్వారా అంతఃకరణమునందు చేరి వుండిపోయినవో వాటిని గురించి చింతించుట అనగా విచారించుట లేకుండుటయే వాటిని అంతఃకరణము నుండి బయటకు త్రోలివేయుటగా తలంచవలయును. ఆ విధముగా విషయములనన్నింటిని అంతఃకరణమునందు లేకుండ జేసుకొని రెండు నేత్రముల దృష్టిని కనుబొమల మధ్య భాగమున నిలిపి వుంచి అటుపైన ముక్కు కంఠము మొదలగు వాటి లోపలి భాగములందు విహరించుచున్నటువంటి ప్రాణవాయువును మరియు అపానవాయువును సమముగా జేసి –

**5.28. యతేంద్రియమనోబుద్ధి ర్మునిర్మోక్ష పరాయణః,**
**విగతేచ్ఛా భయక్రోధో యః సదా ముక్త ఏవ సః.**

అనగా – ఇంద్రియములు, మనస్సు, బుద్ధి మొదలగు వాటిని తన వశము నందుంచుకొన్న పురుషుడు, ఈశ్వర స్వరూపమును గుర్తించి మననము చేయుచుండుట చేత సర్వమును సంన్యసించియున్నాడో **శరీరమందు వుంటూ గూడ దానితో సంబంధము లేనివాడై, ముక్తుడై యున్నాడో** అనగా మోక్షస్థితినే పరమార్థముగా తలంచియున్నాడో కోర్కెలు, భయము మరియు క్రోధము ఎవని అంతఃకరణము నుండి పూర్తిగా తొలగిపోయినవో అటువంటి

సర్వసంగపరిత్యాగి సర్వకాల సర్వావస్థలయందునూ ముక్తుడే. ఆతనికి యితర విధములైన ఎటువంటి ముక్తి అవసరము లేదు.

ఈ విధముగా సమాహిత చిత్తుడైన పురుషునకు యింకా తెలియదగినదేముండును? అన్నచో -

**5.29. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్,**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి.**

అనగా - ఎవడు నన్ను అనగా భగవత్స్వరూపుడైన నారాయణుని సర్వకర్మలకు కర్తగాను, సర్వలోకములకు దైవముగాను, సమస్తమైన యజ్ఞములు మరియు తపములకు భోక్తగాను, ప్రత్యుపకారమును కోరక లోకులందరికి వుపకారము చేయువానిగాను, సర్వవిధ కర్మల ఫలములకు భోక్తగాను, యజమానిగాను, సర్వ సంకల్పములకు సాక్షిగాను వున్నాడని గుర్తించి, సమస్త సాంసారిక విషయములు మరియు వాటి వలన కలుగు సుఖదుఃఖములకు లోనుగాక శాంతచిత్తుడై యుండునో ఆతడు బ్రహ్మానందమును పొందును.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*కర్మసన్యాస యోగమనబడు అయిదవ అధ్యాయమునకు*
*శ్రీశ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య విరచిత భాష్యమునకు*
*తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు : **శ్రీ సదానందభారతి***
*ప్రణవాశ్రమము.*

# ఆరవ అధ్యాయము

అంతరంగ సాధనమే యథార్థ జ్ఞానమును పొందుటకు ముఖ్యమైనది. అంతరంగ సాధనమైన ధ్యానయోగము యొక్క సూత్రరూపమైన "స్పర్శాంన్కృత్వా బహిః" (చూ. గీత 5. 27) మొదలగు శ్లోకముల ద్వారా యింతకు ముందు అధ్యాయపు చివరన ఉపదేశింపబడినది. ఆ శ్లోకముల అర్థమును సవివరముగా వ్యాఖ్యానించునదిగా ఈ ఆరవ అధ్యాయము చెప్పబడు చున్నది.

కాని **ధ్యానయోగమునకు బహిరంగ సాధనము కర్మ.** అందుచేత **ధ్యానయోగము చక్కగా కుదరనంతవరకు అధికారియైన గృహస్థునకు కర్మలు చేయుట తప్పదు.** అందుచేత ఆ కర్మలు యిచ్చట స్తుతించబడుచున్నవి.

**పూర్వపక్షము** – "ధ్యానయోగమును చక్కగా సాధించవలయును" అను హద్దు ఎందులకు నిర్ణయించబడినది ? జీవించియున్నంతవరకు అందరూ విహిత కర్మానుష్ఠానము చేయుచునే యుండవలయును గదా ?

**సమాధానము** – అట్లనుట సరికాదు. ఏలయన ? **యోగమార్గమున పయనించు మునికి కర్మలు కర్తవ్యములుగా చెప్పబడినవి.** యోగారూఢుడైన యోగికి కేవలము ఉపశమముతో మాత్రమే సంబంధము చెప్పబడినది.

ఆరురుక్షు మరియు ఆరూఢుడు అయిన యిరువురకు శమము కర్మలు రెండూ కర్తవ్యములుగా చెప్పబడి వున్నట్లయితే ఆరురుక్షు మరియు ఆరూఢునికి శమము మరియు కర్మలు వేఱు వేఱు విషయములుగా చెప్పబడి విశేషణములను కల్పించుట మరియు వాటిని విభజించి వేఱు వేఱుగా చెప్పుట వ్యర్థమగును గదా !

**పూర్వపక్షము** – ఆ యాశ్రమ వాసులయందు కొంతమంది యోగ రూఢత్వమును పొందు కోరిక కలవారై వుండవచ్చును. అందులో కొంతమంది ఆరూఢులై యుండవచ్చును. కాని అటువంటివారిలో కొంతమంది ఆరూఢులు కారు మరియు ఆరురుక్షులు కాకపోవచ్చును. అటువంటివారిని దృష్టియందుంచుకొని ఆరురుక్షు మరియు ఆరూఢులు అని విశేషణము చెప్పుట మరియు ఆ విధమగు రెండు విధములైన యోగులను సాధారణ పురుషుల నుండి వేరుచేసి, వారిని విభజించుట ఈ రెండు మాటలు కుదురును గదా ?

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? **"తస్యైవ"** అను శబ్దము ప్రయోగించబడినది. మరియు "యోగారూఢస్య' అను ఈ విశేషణమునందు 'యోగ'మను శబ్దము గూడ ప్రయోగించబడినది. అనగా ముందుగా ఆరురుక్షుడైనవాడు అతడే తరువాత యోగమునందు ప్రవేశించినచో ఆ యోగారూఢుని యొక్క యోగ ఫలప్రాప్తి కొఱకు శమమే

కారణము. అనగా శమము కర్తవ్యముగా చెప్పబడినది. అందువలన **ఎటువంటి కర్మకైనను జీవించియున్నంత కాలము కర్తవ్యము లభించదు.**

మరియు యోగభ్రష్టత్వ విషయమును చెప్పినప్పుడు గూడ యీ మాటే సిద్ధించుచున్నది. తాత్పర్యమేమన ? కర్మలు చేయు గృహస్థుని కొఱకు గూడ యీ ఆరవ అధ్యాయమునందు చెప్పబడిన యోగము ఆచరణీయమైనచో ఆతడు యోగ భ్రష్టత్వమును పొందినప్పటికి కర్మలయొక్క పరంపరను అనగా కర్మలయొక్క ఫలమును పొందియే తీరును. అందుచేత అవి నశించునని శంకించుట సరికాదు.

అట్లేలయన ? **కర్మలు నిత్యములై యున్నందున** ఆ కర్మలవలన మోక్షము లభించనే లభించదు. అందుచేత **చేయబడిన కామ్య లేక నిత్యకర్మలు తమ ఫలములను యిచ్చుట తప్పక ఆరంభించును.**

**నిత్యకర్మలు గూడ వేదప్రమాణముల ద్వారా ఋజువు చేయబడియున్నందున తప్పక ఫలములను కలుగజేయును.** అట్లు జరుగని యెడల వేదములకు అప్రామాణికత్వపు దోషము ఆపాదించబడును. ఈ విషయము యింతకు పూర్వము గూడ చెప్పబడియున్నది. కర్మలను నశింపజేయు మరొక కారణమేదియు లేనందున కర్మలు జరుగుచున్నంత కాలము గృహస్థునకు ఉభయ భ్రష్టత్వము సంభవించునని చెప్పుట సరికానేరదు.

పూర్వపక్షము - ఆ కర్మలన్నియు ఈశ్వరార్పణ బుద్ధితో చేయబడి యున్నచో అని తలంచినచో అవి కర్తకు ఫలములను కలుగజేయుట ఆరంభించకనే యుండును గదా ?

సమాధానము - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? ఈశ్వరార్పణ బుద్ధితో చేయబడిన కర్మలు యింకా అధికముగా ఫలములను యిచ్చునవియే యగుట **యుక్తి సంగతము** కదా ?

**పూర్వపక్షము** - ఆ కర్మలన్నియూ మోక్షప్రాప్తి కొఱకే చేయబడినవని తలంచినచో- అనగా తానుచేసిన కర్మలనన్నింటిని సమభావముతో ఈశ్వరార్పణ చేసిన యెడల అప్పుడు అట్టి కర్మలవలన మోక్షము లభించును గదా ? ఇతరమేమియు కలుగనేరదు గదా ! అప్పుడు ఆతడు ఆ యోగమునుండి భ్రష్టత్వమును పొందును. అందువలన ఆతనికి (వాటికి) నశించునను ఆశంక సరియైనదియే గదా !

**సమాధానము** - ఇట్లు చెప్పుట గూడ సరికాదు. ఏలయన ? **"ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీర పరిగ్రహః"** (చూ. గీత 6-10) **"బ్రహ్మచారీ వ్రతేస్థితః"** (చూ. గీత 6-14) మొదలగు వాక్యముల ద్వారా **కర్మసంన్యాసము విధించబడినది.**

ఇచ్చట ధ్యానకాలమునందు స్త్రీ యొక్క సహాయమును గురించి ఎటువంటి అభ్యంతరము చెప్పబడియుండలేదు. అందువలన **గృహస్థునికి ఒంటరితనము చెప్పబడి యుండలేదు. "నిరాశీరపరిగ్రహః"** మొదలగు వాక్యములు గూడ గృహస్థునికి అనుకూలముగా లేవు. మరియు ఉభయ భ్రష్ట విషయికమైన ప్రశ్నకు గూడ యిచ్చుట అవకాశము లేనందున పై అభిప్రాయము సరికాదు.

పూర్వపక్షము - "అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః" (చూ. గీత 6-1) ఈ శ్లోకము ద్వారా కర్మలు చేయువానినే సంన్యాసి యనియు మరియు యోగి యనియు చెప్పబడినది. అగ్నిరహితము మరియు క్రియా రహితునికి సంన్యాసత్వము యోగిత్వము నిషేధించబడినది.

సమాధానము - అలా చెప్పుట గూడ సరికాదు. ఏలయన ? ఈ శ్లోకము కేవలము ధ్యానయోగము కొఱకు బహిరంగ సాధన రూపమైన **కర్మలయొక్క ఫలములను ఆశించు సంన్యాసిని స్తుతించుట కొఱకు** చెప్పబడినది.

కేవలము అగ్నిరహితుడు మరియు క్రియారహితుడు అయినవాడు మాత్రమే సంన్యాసి మరియు యోగి కాగలడు అనుట సరికాదు. **కర్మలు చేయు ప్రతివాడు కర్మఫలములను ఆ ఫలములయందలి ఆసక్తిని వదలి అంతఃకరణ శుద్ధి కొఱకు కర్మయోగమునందు నిమగ్నుడై యున్నాడో ఆతడు గూడ సంన్యాసి మరియు యోగి కాగలడు.** కర్మయోగిని గురించి యిలాగే చెప్పబడినది.

ఒకే వాక్యముతో కర్మఫల విషయిక ఆసక్తిని త్యజించు సంన్యాసమును స్తుతించుట మరియు చతుర్థ ఆశ్రమరూపమైన మోక్షమును వ్యతిరేకించుట కుదరదు.

అగ్నిరహితము మరియు క్రియారహితము వాస్తవికము అయిన సంన్యాసి యొక్క సంన్యాసిత్వము మరియు యోగిత్వము, శ్రుతులు, స్మృతులు, పురాణములు, చరిత్ర మరియు యోగశాస్త్రాదులయందు చెప్పబడిన, సర్వప్రసిద్ధమైన దానిని భగవంతుడు నిరాకరించుట లేదు. ఏలయన ? అట్లు చెప్పిన యెడల ఆయన చెప్పినదానిని ఆయనయే కాదని నట్లగును.

సారాంశమేమన ? **"సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే"** (గీ. 5-13) అనగా సర్వవిధ కర్మలను మనస్సు నుండి త్యజించి, **"నైవ కుర్వన్నకారయన్ ఆస్తే"** 5.13 అనగా తాను చేయక యితరులచే చేయించక యుండును. **"మౌనీ సంతుష్టో ఏనకేనచిత్"** గీ. 12-19 అనగా మౌనమును వహించినవాడై అన్ని విధముల సర్వకాల సర్వావస్థలయందును తృప్తిని పొందినవాడై **"అనికేతః, స్థిరమతిః"** గీ. 12.19 ఇల్లువాకిళ్ళు లేనివాడై, స్థిరబుద్ధి కలిగి **"విహాయ కామాన్యః"** గీ. 2.71 అనగా ఏ పురుషుడు సమస్తమైన కోరికలను త్యజించి నిస్పృహా భావముతో విహరించుచుండునో **"సర్వాన్పుమాంశ్చరిత నిఃస్పృహః"** గీ. 2.71 **సర్వారంభ పరిత్యాగీ"** గీ. 12.16 అనగా సమస్తమైన ఆరంభములను త్యజించినవాడై" అని ఈ విధముగా అనేక సందర్భములందు భగవంతుడు తన మాటల ద్వారా ప్రకటించియున్నాడు. అందువలన వాటి కారణముగ నాల్గవ ఆశ్రమమును నిషేధించుట కుదరదు.

అందువలన గృహస్థాశ్రమమునందు స్థిరపడిన పురుషుడు యోగారూఢత్వమును పొందగోరువాడు మరియు మనన శీలుడు తాను చేయు కర్మఫలములను కోరక అనుష్ఠించు **అగ్నిహోత్రాది కర్మలు ఆతని అంతఃకరణమును శుద్ధిచేయుట ద్వారా ధ్యానయోగమునందు నిమగ్నమగుటకు సాధన రూపముగా వుపయోగపడును.**

ఈ భావము ఆధారముగానే **"ఆతడు సంన్యాసి మరియు యోగి"** అని స్తుతించబడు చున్నాడు.

తిరిగి శ్రీకృష్ణుడు ఇలా చెప్పినాడు –

**6.1. అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః,**
**స సంన్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః.**

అనగా – ఆశ్రయమును గ్రహించనివాడు అనాశ్రితుడు. దేనికి ? కర్మఫలమునకు. అనగా **కర్మఫలమును ఆశ్రయించనివాడు కర్మఫల తృష్ణ లేనివాడు.**

ఏలయన ? కర్మఫలమునందు తృష్ణ గలవాడు మాత్రమే కర్మఫలమును ఆశ్రయించును. పై దానికి యిది విపరీతము. అందుచేత కర్మఫలమును ఆశ్రయించనివాడు.

ఇటువంటి అనగా కర్మఫలమును ఆశ్రయించనివాడుగా వుండి ఏ పురుషుడు తన కర్తవ్య కర్మలను అనగా కామ్యకర్మలకు విరుద్ధముగా నిత్యము అగ్నిహోత్రాది కర్మలను ఆచరించుచుండునో అటువంటి కర్త యితర కర్మలు చేయువారికంటె శ్రేష్ఠుడు. ఈ అభిప్రాయము తోనే అటువంటివాడు సంన్యాసియనియు మరియు యోగి అనియు చెప్పబడినది. **త్యాగమునకు సంన్యాసమని పేరు. అట్టి త్యాగము ఎవనియందుండునో ఆతడే సంన్యాసి. మరియు చిత్తమును సమాధాన పరచుటనే యోగమందురు. అటువంటి సమాధానచిత్తుడు యోగి. అందుచేత అట్టివాడు కర్మయోగి అనబడును.**

కేవలము అగ్నిరహితుడు మరియు క్రియారహితుడు అయిన పురుషుడు మాత్రమే సంన్యాసియనియు యోగి యనియు తలంచరాదు.

కర్మలకు అంగములైన గార్హ్య పత్యాది అగ్నిని త్యజించినవాడు 'నిరగ్నుడు' అనబడును. మరియు అగ్ని లేకయే జరుగు తప–దానాది క్రియలు గూడ ఏ పురుషుడు చేయడో ఆతడు అక్రియుడు అనగా క్రియారహితుడు అనబడును.

**పూర్వపక్షము** – నిరగ్ని మరియు అక్రియుడైన పురుషులకే శ్రుతి, స్మృతి మరియు యోగశాస్త్రాదులయందు సంన్యాసిత్వము మరియు యోగిత్వము చెప్పబడి యుండగా యిచ్చట అగ్నిహోత్రుడు మరియు క్రియలు చేయువాడు అయిన పురుషునికి అప్రసిద్ధమైన సంన్యాసత్వము మరియు యోగిత్వము కలదని ఎట్లు చెప్పబడుచున్నది ?

**సమాధానము** – ఇట్లు చెప్పుటయందు దోషమేమియు లేదు. ఏలయన ఏదో ఒక గుణవిశేషమును గ్రహించి సంన్యాసిత్వము మరియు యోగిత్వము యీ రెంటినీ అనగా యీ రెండు గుణములను గృహస్థుని యందు ఆరోపించుట భగవంతునికి యిష్టము.

**పూర్వపక్షము** – అదెట్లు కుదురును ?–

**సమాధానము** – **కర్మఫలమును పొందవలయునన్న సంకల్పమును త్యజించుటయే సంన్యాసిత్వము** మరియు యోగమునకు అంగరూపముగా కర్మలను అనుష్ఠించుట వలన లేక

చిత్తవిక్షేపము అనగా **చాంచల్యమునకు కారణరూపమైన కర్మఫల సంకల్పమును పరిత్యజించుట వలన యోగిత్వము కుదురును.** ఈ విధముగా రెండు భావములు గౌణముగా అనగా అప్రధానముగా సమ్మతించబడినవి.

ఇది కారణముగ ముఖ్యమైన సంన్యాసిత్వము మరియు యోగిత్వము సమ్మతించ బడలేదు. ఈ విషయమును యింక విపులముగా చెప్పుచున్నారు.

**6.2. యం సంన్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాండవ,**
**న హ్యసంన్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన.**

అనగా – శ్రుతి మరియు స్మృతుల యధార్థ తాత్పర్యమును ఎఱింగిన మహాపురుషులు సర్వవిధ కర్మలను మరియు ఆ కర్మ ఫలత్యాగ రూపమైన ఏ భావమును వాస్తవికమైన సంన్యాసముగా తలంతురో దానినే ఓ అర్జునా ! కర్మానుష్ఠాన రూపమైన యోగమును అనగా **నిష్కామ కర్మయోగమును నీవు గూడ వాస్తవికమైన సంన్యాసముగా ఎఱుంగుము.**

ప్రవృత్తిరూపమైన కర్మయోగమును దానికి విరుద్ధముగా నున్న నివృత్తి రూపమున నున్న పరమార్థ భావముతో కూడియున్న సంన్యాసముతో సమానమని స్వీకరించుట ఎట్లు కుదురును ? అని ప్రశ్నించినచో యీ క్రింది విధముగా చెప్పబడుచున్నది –

పరమార్థమును అభిలషించు సంన్యాసముతో కర్మయోగమునకు సంబంధించి కర్మ విషయకత్వము సమానమే. ఏలయన ? **పరమార్థమును పొందగోరు సంన్యాసి సమస్తమైన కర్మ సాధనములను త్యజించి యుండును.** అందువలన సర్వవిధ కర్మలను మరియు ఆ కర్మలకు సంబంధించిన ఫలవిషయకమైన సంకల్పములను ప్రవృత్తి హేతువు అయిన కామమునకు కారణమగుచున్నందున వాటినన్నింటిని త్యజించును. అటులే **కర్మయోగి కూడ కర్మలు చేస్తూ వుండి కూడ కర్మలకు సంబంధించిన విషయ సంబంధమైన సంకల్పమును త్యజించియుండును' అనగా కర్మయోగి కూడ కర్మలు చేయుచూ వుండియు కర్మ ఫలభోగ విరాగము కలిగియుండును.** ఆ విధముగా యిరువురి యందును త్యాగభావము కలదు గావున యిరువురి యందును సమానత్వము గోచరమగుచుండును. ఈ అభిప్రాయమును స్పష్టము చేయుటకు గాను యింకా యిలా చెప్పుచున్నారు –

కర్మ ఫలవిషయకమైన సంకల్పమును అనగా **కోరికలను త్యజించని పురుషుడు ఆతడు ఎటువంటి కర్మలు చేయువాడు అయినప్పటికి యోగి కాజాలడు.** అనగా అటువంటివాని చిత్తము సమాధిస్థితి యందు నిలువజాలదు. అట్లేలయన ? **ఫలమును పొందవలయుననెడి సంకల్పమే చిత్త స్థిరత్వమునకు పెద్ద అవరోధము.**

అందుచేత ఫలవిషయికమైన సంకల్పములను త్యజించిన పురుషుడే యోగి అనబడును. చిత్తవిక్షేపమునకు ముఖ్య కారణము కర్మఫల విషయిక అభిలాషయే. అట్టి అభిలాషను త్యజించిన సాధకుడే చిత్తవిక్షేపము నుండి తప్పించుకొని యోగి కాగలడు.

ఈ విధముగా పరమార్థమును అభిలషించి సర్వకర్మ సంన్యాసము చేసిన సంన్యాసికి మరియు కర్మయోగము నందుండియు కర్తృత్వ భావముతో సంబంధము కలిగియుండు భావమును త్యజించుటయందు సమానత్వము గోచరమగుచున్నది. ఆ కారణముగ కర్మయోగమును స్తుతించుటకుగాను "యం సంన్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాండవ" (చూ. గీత 6.2) అను శ్లోకమునందు **ఫలభోగ భావరహితమైన కర్మయోగము గూడ సంన్యాసమని చెప్పబడినది.**

ఫలభోగ భావరహితమైన కర్మయోగము ధ్యానయోగమునకు బహిరంగ సాధనమై యున్నది. ఆ కారణముగానే సంన్యాసము పేరుతో దానిని స్తుతించి యిప్పుడు **కర్మయోగ మంతయు ధ్యానయోగమునకు బహిరంగ సాధనమే**యని చెప్పబడుచున్నది.

**6.3. ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణ ముచ్యతే,**
**యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే.**

అనగా - ధ్యానయోగమునందు ప్రవేశము పొందనివారు ధ్యానయోగమునందు స్థిరముగ నిలువజాలరు. అటువంటి యోగమును పొందగోరు (వారు) మునులు అనగా కర్మఫలమును త్యజించిన పురుషులకు ధ్యానయోగమునందు ప్రవేశమును పొందుటకు సాధన రూపముగా కర్మలు చెప్పబడినవి.

ఎప్పుడు ఆతడు యోగారూఢుడు అనగా యోగమునందు ప్రవేశము గలవాడగునో అప్పుడు ఆతనికి ధ్యానయోగమునందు నిలిచియుండుటకు సాధనమైన శమదమాదులు అనగా సర్వవిధ కర్మలనుండి ముక్తత్వము కుదురునని చెప్పబడినది.

మానవుడు కర్మలు చేయుట ఎంత ఎక్కువగా విరమించునో అంతే ఎక్కువగా ఆ కర్మల శ్రమలేనటువంటి జితేంద్రియుడు అనగా యింద్రియములను తన స్వాధీనము నందుంచుకొన్న పురుషునియొక్క చిత్తము లోకభావములకు దూరమై ఆతని స్వాధీనము నందుండును. **అలా చిత్తము స్వాధీనము అయిన వెంటనే ఆతడు యోగారూఢుడగును.**

వ్యాసమహర్షులవారు గూడ సద్బ్రాహ్మణునికి ఏకత్వము సమత్వము, సత్యత, శీలము, స్థైరత్వము, అహింస, ఆర్జవము మరియు సర్వకర్మ సంన్యాసము కంటె గొప్ప ధనము మరియొకటి లేదని చెప్పియున్నారు. (చూ. మ.భా.శాం. 175.37)

సాధకుడు ఎప్పుడు యోగారూఢుడగును ? అన్నచో చెప్పుచున్నారు -

**6.4. యదా హి నేంద్రియార్థేషు న కర్మ స్వనుషజ్జతే,**
**సర్వసంకల్ప సంన్యాసీ యోగారూఢస్తదోచ్యతే.**

అనగా - తన చిత్తమును స్వాధీనమునందుంచుకొన్న యోగి శబ్దాది యింద్రియ గోచరములగు విషయముల యందును వాటిలో గూడ **నిత్య, నైమిత్తిక, కామ్య మరియు నిషిద్ధ కర్మలయందు తనకు కలుగు లాభమేమియు లేదని తెలుసుకొని వాటియందు ఆసక్తుడు కాడు.**

అట్టి స్థితియందు ఆతడు సర్వవిధ సంకల్పములను త్యజించినవాడై, అనగా ఇహలోకము మరియు పరలోకమునందు లభించు భోగముల పట్ల కోరికలకు కారణరూపమైన సమస్త సంకల్పములను త్యజించుట స్వభావముగా మారిపోయినదో, అటువంటి పురుషుడు **యోగారూఢుడు అనగా యోగమును పొందిన వాడగును.**

"సర్వసంకల్ప సంన్యాసి" అని చెప్పుటలో తాత్పర్యమేమన ? **మోక్షార్థి అయిన సాధకుడు సర్వవిధములైన కోరికలను మరియు సర్వవిధములైన కర్మలను త్యజించవలయును.**

అట్లేలయన ? సమస్తమైన **కోరికలకు మూలము** సంకల్పమే. **"సంకల్ప మూలః కామో వై యజ్ఞాః సంకల్ప సంభవాః"** (చూ. మనుచరిత్ర 2-3) అనగా **యజ్ఞములన్నియు సంకల్పము వలననే చేయబడుచున్నవి.**

కామ జానామి తే మూలం సంకల్పాత్వం హి జాయసే,
న త్వాం సంకల్పయిష్యామి తే న మే న భవిష్యసి. (మ.భా.శాం. 177/25)

అనగా - ఓ కామమా ! నేను నీ యొక్క మూలకారణమును ఎఱుంగుదును. **నిస్సందేహముగా నీవు సంకల్పము నుండియే జన్మించుచున్నావు. నేను నిన్ను సంకల్పించను. అందుచేత నీకు నాకు ఎటువంటి సంబంధములేదు.**

**సమస్త కోరికలను పరిత్యజించినందువలననే సర్వవిధ కర్మల పరిత్యాగము (సంన్యాసము) సిద్ధించును.** "సర్వకామ పరిత్యాగే చ సర్వకర్మ సంన్యాసః సిద్ధోభవతి", "స **యథాకామో భవతి తత్క్రతు ర్భవతి, యత్క్రతుర్భవతి తత్కర్మకురుతే** (చూ.బృ.ఉ. 4-4-5) అనగా **ఆతడు ఎటువంటి కోరికలు కలవాడగునో అటువంటి నిశ్చయము కలవాడగును. ఎటువంటి నిశ్చయము కలవాడగునో అటువంటి కర్మలే చేయుచుండును"** ఇట్టి శ్రుతులద్వారా **"జీవుడు ఏ ఏ కర్మలు చేయునో అవన్నియు కామప్రేరితములే.** అని ధృవపడుచున్నది. ఈ విధముగా శ్రుతి స్మృతుల ద్వారా గూడ ఋజువగుచున్నది.

యుక్తుల ద్వారా గూడ ఈ విషయమే సిద్ధమగుచున్నది. ఏలయన ? **సర్వవిధ సంకల్పములను త్యజించిన పురుషుడు లేక సాధకుడు కొంచము కదలను కూడ కదలజాలడు.**

ఈ విధముగా **"సర్వసంకల్ప సంన్యాసి"** అని చెప్పి భగవంతుడు సమస్తమైన కామములను అనగా కోరికలను మరియు సమస్తమైన కర్మలను త్యజింపచేయుచున్నాడు.

ఈ విధముగా సర్వమును త్యజించిన పురుషుడు ఎప్పుడు యోగారూఢుడగునో అప్పుడు ఆతడు సర్వానర్థ సమూహమైన ఈ సంసార సముద్రము నుండి స్వయముగా తనను తానే వుద్ధరించుకొనును. అందుచేత........

**6.5. ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్,**
**ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః.**

అనగా - సంసార సాగరమునందు మునిగిపడియున్న తనను తానే ఆ సంసార సముద్రము నుండి ఆత్మబలము ద్వారా బయటకు అనగా ఒడ్డునకు తెచ్చుకొనవలయును. అనగా యోగారూఢావస్థను పొందవలయును.

తన పతనావస్థను తాను కొని తెచ్చుకొనగూడదు. అనగా **తన ఆత్మను అన్యథా తలంచరాదు. అనగా మనిషిగా జీవునిగా తలంచరాదు.**

ఏలయన, **ఆత్మ తనకు తానే బంధువు. ఆత్మకు సంబంధించిన యితర వస్తువుగాని వ్యక్తులుగాని లేరు.** ఆత్మను ప్రపంచము నుండి వేరు చేయగల యితరు లెవ్వరూ లేరు. ప్రేమ **మొదలగు భావములు** గూడ **బంధమునకు కారణములే** అగుటచేత ఈ **ప్రపంచమందలి బంధువులు** గూడ **మోక్షమార్గమునందలి అవరోధములే.** అందుచేత నీకే నీవే బంధువు. నిన్ను నీవే వుద్ధరించుకొనవలయును. ఇతరు లెవ్వరును నిన్ను వుద్ధరించజాలరు.

**నీకు నీవే శత్రువువు కూదాను. నీకు అపకారమును చేయు శత్రువు లెవ్వరునూ, నీకంటె వేఱుగ లేరు. నీపట్ల శత్రువుని నీవే పోషించెదవు. అందుచేత నీకు నీవే శత్రువు.** ఈ విధముగా తననే తనకు శత్రువుగా తలంచుట అన్ని విధములా సబబే.

**నీకు నీవే మిత్రుడవు. నీకు నీవే శత్రువువు.** ఇలా చెప్పబడినందువలన ఎటువంటి లక్షణములు గలవాడు తనకు తాను మిత్రుడగును ? మరియు ఎటువంటి లక్షణములు గలవాడు తనకు తాను శత్రువగును ? అన్నచో - చెప్పుచున్నారు -

**6.6. బంధురాత్మాత్మనస్తస్య యోనాత్మైవాత్మనా జితః,**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్.**

అనగా - **జీవాత్మకు మిత్రుడు జీవాత్మయే.** అట్లేలయన ? ఎవడు తనంతట తానుగా కార్యకరణ సముదాయమైన శరీర రూపమున వున్న ఆత్మను తన వశమునందుంచుకొనునో అనగా **తన యింద్రియములను తన స్వాధీనమునందుంచుకొనునో ఆతడు తనకు తానే మిత్రుడు.** ఎవడు **కార్య-కరణ-సంఘాత రూపమైన తన శరీర రూపమున వున్న ఆత్మను తన వశమునందుంచుకొనలేదో ఆతడే తనపట్ల తానే శత్రువుగా వ్యవహరించును.** అనగా ఏ విధముగా మనకు శత్రువు అయినవాడు మనకు అపకారము చేయునో ఆ విధముగానే జ్ఞానహీనుడు తనకు తానే అపకారము చేసుకొనుచూ శత్రువు వలె వ్యవహరించును.

**6.7. జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః,**
**శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానాపమానయోః.**

అనగా – ఎవడు మనస్సు, యింద్రియములు మొదలగువాటి సంఘాతరూపమైన (సమూహ రూపమైన) తన దేహమును తన అధీనమునందుంచు కొనియున్నాడో మరియు ఆ విధముగా ప్రపంచ విషయములు లేక ప్రశాంత చిత్తుడై యున్నాడో, ఎవని అంతఃకరణము సర్వకాల సర్వావస్థల యందును ప్రసన్నముగా అనగా దుఃఖము లేనిదిగా అనగా ఆనందముతో కూడినదిగా యున్నదో అటువంటి సాంసారిక వాసనలు లేని సంన్యాసికి సర్వత్రా చక్కగా పరమాత్మ సాక్షాత్కారము కలుగుచుండును. అనగా అట్టి సంన్యాసి సాక్షాత్తూ పరమాత్మ రూపముననే యుండును.

మరియు అట్టి సంన్యాసి శీతోష్ణములను మరియు సుఖదుఃఖముల యందును మరియు మానావమానములయందును అనగా పూజా – తిరస్కారముల యందును సమముగా అనగా ఎటువంటి వికారములు లేక శాంతుడై యుండును.

**6.8. జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః**
**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః**

అనగా – శాస్త్రగ్రంథములయందు చెప్పబడిన పదార్థములను గురించి తెలుసుకొను **తెలివి పేరే 'జ్ఞానము' మరియు శాస్త్రగ్రంథముల ద్వారా తెలుసుకొన్నటువంటి భావములను తన యంతఃకరణము నందు ప్రత్యక్షముగా అనుభవించు అనుభవము పేరే విజ్ఞానము.** ఇటువంటి జ్ఞానవిజ్ఞానముల ద్వారా ఎవని అంతఃకరణమునందు "ఇంక నేను తెలుసుకొనదగిన విషయమేదియు లేదని మంచి నమ్మకము కుదిరియున్నదో ఆ విధముగా జ్ఞాన విజ్ఞానముల ద్వారా తృప్తిని పొందియున్న అంతఃకరణము గల పురుషుడు, మరియు కూటస్థుడు అనగా యింద్రియ జితుడై ఎటువంటి వికారములు లేక స్థిరచిత్తుడై యున్నాడో అటువంటి పురుషుడు యుక్తుడు అనగా సమాహితుడు అనగా సమాధియందు స్థిరముగా వున్నవాడు అని చెప్పబడును.

అటువంటి యోగి మట్టి, రాయి మరియు బంగారమును సమదృష్టితో చూచు వాడగును. అనగా ఆతని దృష్టియందు మట్టి, రాయి మరియు బంగారమునకు భేదము వుండదు. అన్నియు సమముగానే అనగా బ్రహ్మరూపముననే తోచును. మరియు –

**6.9. సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్యబంధుషు,**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే.**

అనగా – "సుహృత్" శబ్దము మొదలు సగము శ్లోకమంతయు ఒక్కటే పదము.

"సుహృత్" అనగా ప్రత్యుపకారమును కోరక యితరులకు ఉపకారము చేయువాడు. మిత్రుడు అనగా ప్రియుడు, అరి అనగా శత్రువు వుదాసీనుడు అనగా పక్షపాత రహితుడు

అనగా మిత్రుడు కాదు, శత్రువు కానివాడు. మధ్యస్థుడు అనగా పరస్పర విరుద్ధముగా నుండు యిరువురను సమానముగా ఎంచువాడు. ద్వేష్య అనగా తనకు అప్రియమైనవాడు మరియు బంధు అనగా తన కుటుంబమునకు చెందినవాడు. వీరందరియందును మరియు శాస్త్రానుసారముగ వ్యవహరించు శ్రేష్ఠ పురుషులయందును మరియు నిషిద్ధకర్మలు అనగా శాస్త్రము ఎటువంటి కర్మలు చేయకూడదని చెప్పుచున్నదో అటువంటి కర్మలు చేయు పాపాత్ములయందును ఎవడు సమబుద్ధి కలిగియుండునో అంతేగాక వీరందరియందును ఎవడు ఎటువంటి కర్మలు చేయుచున్నాడో అని తలంచకయుండునో ఆతడు శ్రేష్ఠుడు. అనగా అటువంటి యోగి యోగారూఢులైన అందరికంటె వుత్తముడు. ఇచ్చట "విశిష్యతే" అను శబ్దమునకు బదులుగా "విముచ్యతే" అనగా ముక్తుడగును" అను పాఠాంతరము గూడ కలదు.

*అందుచేత అటువంటి వుత్తమ ఫలమును పొందుటకొఱకు –*

**6.10. యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః,**
**ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః.**

అనగా – ధ్యానము చేయు యోగి ఒంటరిగా అనగా ఎవ్వరూ వెంట లేకుండ కొండగుహలు మొదలగు ఏకాంత స్థానమునందు తగిన ఆసనవిధానముతో కూర్చొని తన అంతఃకరణమును ధ్యానమునందు లగ్నము చేయవలయును అనగా స్థిరముగా అనగా **ఎటువంటి వికారము కలుగనీయక నిలిపి వుంచవలయును.**

"ఏకాంతమైన స్థలమునందు స్థిరముగా కూర్చొని" మరియు "ఒంటరిగా" అను ఈ రెండు విశేషణముల ద్వారా **"సంన్యాసమును స్వీకరించి యోగసాధన చేయవలయును"** అని హెచ్చరించబడినది.

ఎవని చిత్తము అనగా అంతఃకరణము మరియు ఆత్మ, చిత్తమును మరియు దేహమును జయించి యున్నవో అటువంటి యతచిత్తాత్మా, **నిరాశీ అనగా ఈ లోకమునందలి ఎటువంటి వస్తువును ఆశించనివాడు,** తృష్ణ లేనివాడు మరియు తనకంటె వేఱుగా రెండవ వస్తువుతో సంబంధము లేనివాడు అయి అనగా సంన్యాసి **అయినప్పటికి సర్వవిధ వస్తువులను సంగ్రహించుట మాని యోగాభ్యాసము చేయవలయును.**

యోగాభ్యాసము చేయువానికి యోగము చేయుటకు సాధన రూపములైన ఆసనము, ఆహారము మరియు విహారము మొదలగు వాటి నియమనిబంధనములను గురించి చెప్పవలసి యున్నది. మరియు యోగమును పొందిన పురుషునియొక్క లక్షణములు మరియు యోగము వలన కలుగు ఫలము మొదలగువాటిని గూర్చి చెప్పవలసియున్నది. అందులకే యీ ప్రకరణము ఆరంభించబడుచున్నది. ముందుగా ఆసనమును గురించి చెప్పబడుచున్నది.

**6.11. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః,**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజిన కుశోత్తరమ్.**

అనగా - పరిశుభ్రమైన చోటునందు అనగా స్వభావము చేతనో లేక వూడ్చుట, అలకుట మొదలగు సంస్కారములచే శుభ్రము చేయబడిన పవిత్రమైన మరియు ఏకాంతమైన స్థానమై యుండవలయును. ఆ స్థలము అతి ఎత్తుగాను లేక పల్లముగాను వుండనటువంటి స్థలమునందు తన ఆసనమును ఏర్పాటు చేసుకొనవలయును. మరియు ఆ ఆసనముపై మంచి వస్త్రము, మృగచర్మము మరియు దర్భగడ్డితో తయారుచేయడిన చాపవంటిది పరచి వుంచవలయును. అటువంటి ఆసనముపై స్థిరమైన భావముతో కూర్చొనవలయును. ఇచ్చట పాఠక్రమము ననుసరించి ఆసనముపై ముందుగా దర్భగడ్డితో తయారుచేసిన చాప, దానిపైన మృగచర్మము, అటుపైన శుభ్రమైన వస్త్రముపరచి వుంచవలయును.

అలాంటి ఆసనముపై స్థిరముగా కూర్చొని ఏమి చేయవలయునన్నచో - చెప్పుచున్నారు -

**6.12. తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియ క్రియః,**
**ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మ విశుద్ధయే.**

అనగా - ఆ యాసనముపై కూర్చొని యోగసాధన చేయవలయును. ఎట్లు చేయవలయును ? అన్నచో - **మనస్సును లోకసంబంధమైన సర్వవిషయముల నుండి తొలగించి ఒక్కచోటనే నిలిపివుంచి** మరియు **"యతచిత్తేంద్రియ క్రియః"** అనగా చిత్తమును మరియు యింద్రియముల కర్మలను జయించినవాడై యోగసాధన చేయవలయును. **ఎవడైతే మనస్సు మరియు యింద్రియముల ద్వారా జరుగు కర్మలనన్నింటిని సంయమించి** అనగా ఆపి వైచి యుండునో అటువంటి వానిని **"యతచిత్తేంద్రియ క్రియః"** అని అందురు.

ఆతడు ఏ ఫలమునాశించి యోగసాధన చేయవలయును ? అని అన్నచో - **ఆత్మశుద్ధి కొఱకు యోగసాధన చేయవలయును.** అనగా **అంతఃకరణ శుద్ధికొఱకు యోగసాధన చేయవలయును.**

బాహ్య ఆసనమును గురించి చెప్పబడినది. శరీరమును ఎలా వుంచుకొనవలయును? అను విషయము యిప్పుడు చెప్పుచున్నాడు.

**6.13. సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః,**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్.**

అనగా - శరీరమును, శిరస్సును మరియు మెడను సమముగాను స్థిరముగాను అనగా కదలక వుంచుకొని స్థిరముగా కూర్చొనవలయును. సమభావముతో స్థిరముగా వుంచుకొనబడని దేహావయవములయందు చలనత్వము కలుగవచ్చును. అందుచేత "అచలమ్" అను విశేషణము చెప్పబడినది.

మరియు తన ముక్కుయొక్క అగ్రభాగమును చూచుచూ అనగా ఆతడు దానినే బాగుగా చూచుచున్నట్లుగా తన దృష్టిని వుంచుకొనవలయును.

ఇచ్చట "సంప్రేక్ష్య"తో పాటు "ఇవ" అను శబ్దము లోపించినట్లుగా గుర్తించవలయును. అట్లేలయన ? ఇచ్చట తన ముక్కుయొక్క అగ్రభాగమును చూచుటయే లక్ష్యము కాదు గావున.

మరి యింక లక్ష్యమేమి ? యన్నచో - కేవలము **నేత్రములయొక్క దృష్టిని విషయములమీదికి పోనివ్వక వుంచుటకై నాశికాగ్రభాగమున నిలిపి వుంచవలయును** అని చెప్పబడినది.

ఈ విధముగా దృష్టిని నిలిపి వుంచుట కూడ అంతఃకరణ శుద్ధికొఱకు ఆవశ్యకము అయినందున కూడ అలా చెప్పబడినది. ఏలయన ? తన నాశికాగ్ర భాగమును చూచుటయే లక్ష్యముగా తలంచిన యెడల మనస్సు అచ్చటనే స్థిరముగా వుండును. ఆత్మయందు నిలువజాలదు.

కాని అటు తరువాత **"ఆత్మ సంస్థం మనః కృత్వా"** (గీ. 6.25) అను పదము ద్వారా **మనస్సును ఆత్మయందే స్థిరపరచవలయును** అని చెప్పబడును. అందువలన "ఇవ" శబ్దము లోపించుట ద్వారా నేత్రముల యొక్క దృష్టిని నాశికయొక్క అగ్రభాగమున నిలుపుటయే ముఖ్యముకాదని "సంప్రేక్ష్య" అను శబ్దము ద్వారా చెప్పబడినది.

ఈ విధముగా నేత్రముల యొక్క దృష్టిని నాశికాగ్రభాగమందు నిలిపి, ఇతర దిశల వైపునకు చూడకుండ అనగా మధ్య మధ్య అటు యిటు దృష్టిని మరల్చక -

మరియు -

**6.14. ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారివ్రతే స్థితః,**
**మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః.**

అనగా - 'ప్రశాంతాత్మా' అనగా అన్నివైపుల నుండి శాంతిని పొందిన అంతఃకరణము గలవాడు, 'విగతభీ' అనగా ఎటువంటి భయములు లేనివాడు, మరియు బ్రహ్మచారుల వ్రతమునందు స్థిరపడిన మనస్సు గలవాడు. అనగా బ్రహ్మచర్యము అనగా స్త్రీ సంపర్కమును కోరనివాడు రెండవ అర్థము బ్రహ్మమునందు చరించువాడు, **గురుసేవ, భిక్షాటనముచే లభించిన భోజనమును సేవించి తృప్తిని పొందువాడు.** ఈ లక్షణములు గలవాడు బ్రహ్మచర్య వ్రతమును స్వీకరించినవాడు. ఆ విధముగా బ్రహ్మచర్య వ్రతము అనుష్ఠించువాడై మరియు **మనస్సును భ్రాంతి కల్పిత విషయముల మీదికి వెళ్ళనివ్వక నియమించినవాడు** అనగా మనోవృత్తులనన్నింటిని ఉపసంహరించి, భగవంతునియందు అనగా భగవత్తత్త్వము నందు చిత్తమును లగ్నమును చేసినవాడు, అనగా **ఆ పరమేశ్వర తత్త్వమునందే మనస్సు గలవాడై,** సమాహిత చిత్తుడై అనగా చిత్తమునందు వికారములు లేనివాడై, ఆ భగవత్తత్త్వమే సర్వశ్రేష్ఠమైనదని తలంచి నిశ్చింతగా కూర్చున్నవాడు నిజమైన యోగి.

కొంతమంది స్త్రీలయందు చిత్తము కలవారై యుందురు. కాని అటువంటివారు స్త్రీని సర్వశ్రేష్ఠమైనదిగా భావించరు. మరి ఏమని భావించెదరు ? అటువంటివారు రాజును లేక మహాదేవుడను స్త్రీకంటె శ్రేష్ఠమైనవారుగా భావించెదరు. అలా అయివుండి గూడ నిజమైన సాధకుడు తన చిత్తమును భగవత్తత్త్వమునందే లగ్నము చేసి యుంచెదరు. దానినే అనగా ఆ భగవత్తత్త్వమునే సర్వశ్రేష్ఠమైనదిగా భావించుచుందురు.

ఇప్పుడు యోగముయొక్క ఫలము చెప్పబడుచున్నది –

**6.15. యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః,**
**శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి.**

అనగా – స్థిరపడియున్న మనస్సు గల యోగి అనగా తన మనస్సును జయించిన యోగి పైన చెప్పబడినట్లుగా సర్వకాల సర్వావస్థలయందును తన మనస్సును భగవత్తత్త్వమునందే నిలిపివుంచి చివరకు ఆ భగవత్తత్త్వమునందు లీనమై పోవును. అట్లు లీనమై సంపూర్ణమైన శాంతిని పొందును. అట్టి పరమశాంతినే మోక్షమని చెప్పుదురు. ఇప్పుడు పరమశాంతిని పొందిన యోగియొక్క ఆహారాది నియమములను గురించి చెప్పుచున్నారు.

**6.16. నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంత మనశ్నతః,**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున.**

అనగా – అధికముగా భోజనము చేయువాని యొక్క అనగా తన శక్తిని అధిగమించి భోజనము చేయువాని యోగము సిద్ధించదు. అంతేగాక అసలే ఆహారము తీసుకొనని వానియొక్క యోగము గూడ సిద్ధించదు. ఏలయన ? శ్రుతివాక్య మిట్లున్నది ?

"తన శరీరము యొక్క శక్త్యానుసారముగ తినబడిన అన్నము ఆ శరీరమును రక్షించును. అటువంటి భోజనము శరీరమునకు కష్టమును కలుగజేయదు. అనగా దేహమును పాడు చెయ్యదు. శక్తికి మించి గ్రహించబడిన ఆహారము ఆ దేహమును కష్టపెట్టును. అట్లే తన శరీర పోషణకు తగినంత ఆహారము గ్రహించని ఎడల దేహము కృశించి చివరకు నశించును.

అందువలన యోగి అయినవాడు తన శరీర పోషణకు తగినంత ప్రమాణములో ఆహారమును గ్రహించవలయును. ఎక్కువగానూ గ్రహించరాదు తక్కువగాను గ్రహించరాదు.

యోగశాస్త్రమునందు చెప్పబడినట్లు తగు పరిమాణములో అన్నమును గ్రహించనివాని యోగము సఫలీకృతము కానేరదు. తగు పరిమాణమెట్టిదనిన –

పొట్టయందలి అర్ధభాగము శాకాహారము మొదలగు కూరలతో కూడిన భోజనముతో మరియు మూడవ భాగమును జలముతో పూరించవలయును. నాల్గవ భాగమును వాయువు యొక్క రాకపోకల కొఱకు ఖాళీగా వుంచవలయును.

అంతేగాక ఓ అర్జునా ! అధికముగా నిద్రించువాని యొక్క యోగము కూడ సిద్ధించదు. మరియు మరీ ఎక్కువగా మేల్కొని అనగా జాగ్రదావస్థయందు వుండువాని యోగము కూడ సిద్ధించదు. మరి యోగము ఎట్లు సిద్ధించును ? అన్నచో - చెప్పుచున్నారు -

**6.17. యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు,**
**యక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా.**

అనగా - తినబడునది ఆహారము మరియు నడచుట, కూర్చుండుట, లేచుట మొదలగు కాళ్ళతో చేయబడు క్రియ 'విహార' మనబడును. ఈ కార్యములు అనగా ఆహార - విహారములు తగు పరిమాణముతో చేయువాడు. తగు పరిమాణములో క్రియలు, కర్మలు చేయువాడు, నిద్రించుట మేల్కొని యుండుట తగినంత కాలములో తగు పరిమాణముతో చేయువాడు, అటువంటి తగినంత ఆహార-విహారము, తగినంత క్రియాకర్మలు. అట్లే తగినంత నిద్రా మెలకువలు కలిగియున్న యోగికి సర్వదుఃఖ నాశకమైన యోగము సిద్ధించును.

సర్వదుఃఖములను హరించు దానిపేరు 'దుఃఖహా' ఈ విధముగా **సమస్త ప్రపంచరూప దుఃఖములను నశింపజేయునది యోగము.**

ఇప్పుడు సాధకుడైన పురుషుడు ఎప్పుడు సమాధి అవస్థను పొందును ? అన్నచో-

**6.18. యదా వినియతం చిత్తమాత్మన్యేవావ తిష్ఠతే,**
**నిస్పృహః సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా.**

అనగా - వశమునందుంచుకొన్న చిత్తము అనగా విశేషముగా ఏకాగ్రతను పొందిన **చిత్తము బాహ్య విషయములను గురించి తెలుసుకొనుట, విచారించుట మొదలగు వ్యవహారమును పూర్తిగా త్యజించి కేవలము ఆత్మయందే లగ్నమై యుండునో** అప్పుడు తన స్వరూపమునందు తానే నిలిచియుండును.

అట్టి స్థితియందు సర్వ విధములైన భోగములయందు కోరికలు లేనివాడైన యోగి అనగా దృష్టము అనగా దృశ్యరూపములుగా వున్న మరియు అదృష్ట అనగా దృశ్య రూపములుగా లేనటువంటి సర్వవిధ భోగములనుండి ఎవని తృష్ణ పూర్తిగా నశించినదో అట్టి యోగి పరమాత్మయందు ఏకత్వమును పొందినవాడగును.

సమాధి స్థితియందు నిలిచియున్న చిత్తము గల యోగియొక్క స్థితి ఎట్లుండుననగా-

**6.19. యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా,**
**యోగినో యత చిత్తస్య యుంజతో యోగమాత్మనః.**

అనగా - ఏ విధముగా వాయువు యొక్క చలనము లేనటువంటి చోట వుంచబడిన దీపము ఎటువంటి కదలికలు లేక స్థిరముగా వెలుగుచుండునో అదే విధముగా సమాధియందు

చిత్తమును లగ్నముచేసిన యోగియొక్క అంతఃకరణము స్థిరముగా ఎటువంటి విషయ వాసనలు లేనిదై పరమాత్మ స్వరూపముతో నిలిచియుండును. **సమానత్వమును తెలుపునది ఉపమానము.**

ఈ విధముగా యోగాభ్యాస బలముతో గాలిలేనిచోట పెట్టి వుంచిన దీపమువలె ఏకాగ్రతను పొందినటువంటి.

**6.20. యత్రోపరమతే చిత్త నిరుద్ధం యోగసేవయా,**
**యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి.**

అనగా - యోగసాధన ద్వారా నిలిపి వుంచినట్టి మరియు అన్నివైపుల నుండి వెనుకకు మరల్చి దాని చంచలత్వమును పోగొట్టుకొన్నట్టి చిత్తము ఎప్పుడు విషయ రహితమై స్థిరత్వమును పొందునో మరియు ఎప్పుడు సమాధి ద్వారా లౌకిక వాసనలన్నింటినీ త్యజించి శుద్ధమైన అంతఃకరణముతో పరమ చైతన్యము మరియు జ్యోతి స్వరూపముగా యున్న ఆత్మను సాక్షాత్కరింపజేసుకొనునో ఆ చిత్తము తనలో తానే లీనమై పరమశాంతిని పొందును. సంపూర్ణ తృప్తిని అనుభవించును.

**6.21. సుఖమాత్యంతికం యత్తద్బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్,**
**వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః.**

అనగా – ఏ సుఖము అంతము లేనిదై యున్నదో అనగా అనంతమైనదై యున్నదో, ఏ సుఖము యింద్రియములతో ఎటువంటి సంబంధము లేక కేవలము బుద్ధిగ్రాహ్యమై యున్నదో ఏ సుఖము యింద్రియాతీతమై యున్నదో అనగా విషయముల ద్వారా లభించు సుఖము కాదో, అటువంటి సుఖమును యోగియైనవాడు అనుభవించునో మరియు ఏ సమయమునందు తన స్వరూపమునందు నిలిచియున్న జ్ఞాని ఆ స్థితినుండి ఎటువంటి చలనము లేక స్థిరముగా వుండునో ఆతడు ఆ పరమ తత్వమును గ్రహించినవాడగును.

మరియు -

**6.22. యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః,**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే.**

అనగా - ఆత్మప్రాప్తి రూపమైన లాభమును పొందిన సాధకుడు యింక దేనిని కూడ యింతకంటె పెద్ద లాభమని తలంచడో, అంతేగాక యింక యితరమైన లాభములను గురించి స్మరించను కూడ స్మరించడో మరియు **ఆత్మతత్వమును పొందిన యోగి శస్త్రాఘాతముల వలన కలుగు దుఃఖములను గూడ దుఃఖములుగా తలంచడో అటువంటి యోగి దుఃఖములకు గూడ చలించక ఆత్మానందమునందే నిమగ్నమై యుండును.**

"యత్రోప రమతే" (చూ. గీత 6.20) అను శ్లోకము మొదలు యిక్కడివరకు సమస్తమైన విశేషణములతో కూడియున్న ఆత్మయొక్క అవస్థా విశేషరూపమును గురించిన యోగము చెప్పబడినది.

**6.23. తం విద్యాద్దుఃఖ సంయోగవియోగం యోగ సంజ్ఞితమ్,**
**స నిశ్చయేన యోక్తవ్యో యోగో ऽనిర్విణ్ణచేతసా.**

అనగా - ఈ యోగమను పేరుగల అవస్థను దుఃఖముల యొక్క సంయోగ వియోగములుగా తెలియనగును. దుఃఖములు కలుగుట దుఃఖముల సంయోగము. దుఃఖములు తొలగిపోవుట దుఃఖముల వియోగమనబడును. **ఆ విధమగు దుఃఖముల సంయోగ-వియోగములను యోగమను విపరీతమైన పేరుతో తెలియనగును.**

యోగఫలమును గురించి యింతవరకు సవిస్తరముగా చెప్పబడినది. ఇప్పుడు సాధకుని దృఢ నిశ్చయమును మరియు యోగవిషయికమైన అభిరుచిని యోగమునకు ముఖ్య సాధనములుగా చెప్పుచున్నారు.

పైన చెప్పబడిన ఫలదాయకమైన యోగమును విసుగు విరామము ఎఱుంగని చిత్తముతో నిశ్చయ పూర్వకముగా చేయవలయును.

ఆ వేగ రహితమైన చిత్తము, విసుగులేని చిత్తముతో నిశ్చయ పూర్వకముగా అనగా ఎటువంటి తొందర తొట్రుపాటు లేనటువంటి చిత్తముతో సాధకుడు యోగమును సాధించవలయును.

మరియు -

**6.24. సంకల్ప ప్రభవాన్కామాంస్త్యక్త్వా సర్వానశేషతః,**
**మనసైవేంద్రియగ్రామం, వినియమ్య సమంతతః.**

అనగా - దృఢమైన సంకల్పమువలన కలిగినటువంటి, సమస్త కోరికలను నిశ్శేషముగా అనగా కొంచము గూడ మిగలకుండా నిర్లిప్త భావముతో త్యజించి, మరియు వివేకముతో నిండియున్న మనస్సుతో ఇంద్రియ సమూహమునంతటిని అన్నివైపుల నుండి అడ్డగించి అనగా సంయమించి.........

**6.25. శనైః శనైరుపరమేద్బుద్ధ్యా ధృతి గృహీతయా,**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్.**

అనగా - శనైః శనైః అనగా తొందరపడక మెల్లగా మెల్లగా అనగా క్రమక్రమముగా ఉపరతిని అనగా ప్రాపంచిక విషయవాసనలు మనోబుద్ధులయందు లేనటువంటి స్థితిని పొందవలయును.

దేనిద్వారా అట్టి స్థితిని పొందవలయును ? అన్నచో - బుద్ధి ద్వారా పొందవలయును. ఎటువంటి బుద్ధి ద్వారా పొందవలయును ? అన్నచో - ధైర్యముతో కూడియున్నట్టి అనగా ధైర్యముతో కూడియున్న బుద్ధిద్వారా అట్టి స్థితిని పొందవలయును.

మరియు మనస్సును, ఆత్మయందు లగ్నము గావించి అనగా ఈ **"జగత్తుగా, తోచునదంతయూ ఆత్మతత్త్వమే; అది తప్ప యిచ్చట మరొక పదార్థమేదియు లేదు"** అని ఆ విధముగా మనస్సును సమాధానపరచుకొని మనస్సును ఆత్మతత్త్వమునందే స్థిరపరచి **ఆత్మకాక భ్రాంతివలన తోచు పదార్థములను గురించి ఆలోచించుట మానివేయవలయును.** ఇది యోగి యైనటువంటి పురుషుని పరమ శ్రేష్ఠమైన ధర్మము అనగా విధి అనగా తప్పనిసరిగా చేయవలసిన విషయము.

ఈ విధముగా మనస్సును ఆత్మయందు లగ్నము చేసి నిలిపియుంచిన యోగి...

**6.26. యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్,**
**తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్.**

అనగా - తన స్వభావము చేతనే అత్యంత చంచలమైనదియు, మరియు అదే కారణముచే అస్థిరమై యున్న మనస్సు ఏ ఏ శబ్దాది విషయముల కారణముగా వికారమును చెందుచుండునో; బయటతోచు విషయముల పైకి వెళ్ళుచుండునో ఆ యా శబ్దాది విషయరూప కారణముగ బయటకు పోయి విషయాకారమును పొందు మనస్సును నిరోధించి మరియు ఆ యా విషయరూప కారణములను యధార్థమైన తత్వనిరూపణ ద్వారా అవన్నియు అభాసము లేయని తెలియునట్లుగా చేసి వైరాగ్యభావముతో ఈ మనస్సును ఆత్మతత్త్వము యొక్క వశమునందే వుంచవలయును. **ఈ విధమగు యోగాభ్యాస బలముతో యోగి యొక్క మనస్సు ఆత్మయందే శాంతించును.**

**6.27. ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్,**
**ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్.**

అనగా - ఏలయన ? ఎవని మనసు చక్కగా శాంతముగా వుండియున్నదో, ఎవని రజోగుణము శాంతించియున్నదో అనగా ఎవనియొక్క మోహాది క్లేశరూపమైన రజోగుణము పూర్తిగా క్షీణించిపోయినదో, అంతేగాక ఎవడు **"అహంబ్రహ్మాస్మి"** అను **బ్రహ్మ భావముతో బ్రహ్మరూపుడై జీవన్ముక్తుడైయున్నాడో** అనగా "ఈ దృశ్యమానమగుచున్న దంతయూ **బ్రహ్మమే అయి వున్నది"** అను నిశ్చయ భావము కలిగియున్నాడో మరియు ఎవడు అధర్మాది దోషములు లేనివాడై యున్నాడో, అటువంటి యోగికి నిరతిశయమైన పరమోత్తమ సుఖము ప్రాప్తించును

**6.28. యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః,**
**సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యంతం సుఖమశ్నుతే.**

అనగా - యోగవిషయకమైన సమస్తవిధ విఘ్నములను తొలగించుకొనినవాడై ఎటువంటి కల్మషము అనగా లోకభావము లేనివాడై, నిష్పాపుడు అనగా ఎటువంటి పాపములు

లేనివాడై యున్న యోగి పైన చెప్పబడిన క్రమము ననుసరించి ఎల్లవేళల యందును చిత్తమును తన స్వాధీనమునందుంచుకొని అనాయాసముగ అనగా ఎటువంటి కఠోరమైన శ్రమ లేకుండగనే బ్రహ్మప్రాప్తి రూపమైన, నిరతిశయమైన, సర్వోత్కృష్టమైన ఆనందమును అనగా సుఖమును అనుభవించును. అనగా పరబ్రహ్మ తత్త్వముతో సంబంధము కలిగియున్న మరియు అంతమనునది లేనటువంటి అనంతమైన యిటువంటి పరమ సుఖమును ఆతడు పొందును.

ఇప్పుడు ఏ **యోగము యొక్క ఫలము సమస్త సంసారమును నశింపజేయునో మరియు బ్రహ్మతత్త్వముతో ఏకము చేయునో** దానిని గురించి చెప్పుచున్నారు.

**6.29. సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః.**

అనగా – సమాహిత చిత్తము అనగా **లోకవాసనలు లేనటువంటి అంతఃకరణము కల** యోగి సర్వత్రా సమదృష్టి కలిగియుండును. ఆ బ్రహ్మైకాత్మ జ్ఞానము అనగా ఆత్మ బ్రహ్మతత్త్వము అను జ్ఞానము కల యోగి బ్రహ్మ మొదలు చీమ వరకు అనగా సర్వప్రాణుల యందును అవి అన్నియు వేఱు వేఱు వుపాధులు కలిగియున్నప్పటికి అన్నింటియందును ఒకే ఆత్మ తత్త్వము అనగా బ్రహ్మతత్త్వము వ్యాపించి యున్నదనియు అందుచేత వాటియందు ఎటువంటి భేదభావములేదు అన్న ఒకే తత్త్వముతో నిండియున్నవని తెలుసుకొన్న పురుషుడు అన్ని భూతములయందును అన్ని ప్రాణులయందును ఒకే ఆత్మ తత్త్వమును వ్యాపించి యున్నట్లుగా చూచును. మరియు ఒకే **ఆత్మతత్త్వమునందు సర్వభూతములను చూచును.** అనగా "అంబోజాసనుడాదిగాగ తృణ పర్యంతంబు సర్వాత్ముడై సంభావంబున నుందు ప్రోడ" (భాగ స.స్క.) అనగా ఒకే ఆత్మ తత్త్వమునందు సర్వవిధ ప్రాణులను ఏకరూపమున చూచును.

ఈ ఆత్మయొక్క ఏకత్వమును గుర్తించినందువల్ల కలుగు ఫలమును గురించి చెప్పుచున్నారు.

**6.30. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి,**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి.**

అనగా – ఏ మహాత్ముడు **అన్ని ఆత్మలకు ఏకరూపుడైన** అనగా ఆ సర్వవ్యాపక బ్రహ్మతత్త్వ స్వరూపుడైన వాసుదేవుని సర్వత్రా అనగా సర్వభూతములయందును చూచుచుండునో మరియు **బ్రహ్మ మొదలు సర్వప్రాణుల యందును సర్వాత్ముడైన పరమేశ్వరుని చూచుచుండునో** ఈ విధముగా ఆత్మయొక్క సర్వవ్యాపకత్వమును మరియు ఏకత్వమును చూచు జ్ఞానికి ఈశ్వరుడనైన నేను అదృశ్య పదార్థముగా వుండను. అనగా ఎన్నడును అప్రత్యక్షముగా వుండను. అంతేగాక అటువంటి జ్ఞాని గూడ నాకు అనగా వాసుదేవుడనైన నాకు అదృశ్యముగా అనగా పరోక్షముగా వుండడు. **అట్లేలయన ఆతనిది నాది ఒకే స్వరూపమైనది. జ్ఞానికి నా కంటె వేరైన స్వరూపము వుండనే వుండదు.**

నిస్సందేహముగా నా ఆత్మ నాకు అత్యంత ప్రియమైనదిగా వుండును. మరియు ఏ మహాపురుషుడు సర్వాత్మ భావముతో బ్రహ్మ మరియు జీవుని ఏకత్వ స్వరూపమును గుర్తించి చూచుచుండునో ఆతడు మరియు నేను ఒక్కరముగానే యుందుము అనగా మా యిరువురకు భేదమేమియు వుండదు. **ఆతడే నేను నేనే ఆతడు. ఇద్దరము ఒక్కటియే.**

**6.31. సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః,**
**సర్వథా వర్తమానో ఽపి స యోగీ మయి వర్తతే.**

అనగా – ఏకత్వ భావముతో కూడియున్న పురుషుడు సర్వభూతముల యందు వ్యాపించియున్న వాసుదేవుడనగు నన్ను భజించుచుండునో అటువంటి పరిపూర్ణ జ్ఞాని – యోగి అన్ని విధములుగా వ్యవహరించుచూ గూడ పరమపద స్వరూపుడనైన మరియు పరమేశ్వరుడనైన నాయందే వ్యవహరించుచుండును. అనగా ఆతడు సర్వవేళలా ముక్తత్వమునే అనుభవించుచుండును. ఆతని ముక్తత్వమును ఎవ్వరూ అడ్డుకొనజాలరు. ఇంకా ఏమి చెప్పుచున్నారనగా –

**6.32. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యో ఽర్జున,**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః.**

అనగా – ఆత్మ అనగా స్వయముగా తాను దేనిద్వారా ఉపమించబడునో అనగా పోల్చబడునో అది; ఆ ఉపమానము యొక్క భావమును అనగా సాదృశ్యమును ఔపమ్యము అని అందురు.

ఓ అర్జునా ! ఆ యాత్మయొక్క ఉపమానము ద్వారా అనగా యోగియైనవాడు తనతో సమానము అనగా తనవలెనే సర్వత్రా సర్వ భూతములయందును ఆ పరబ్రహ్మ తత్వమును చూచునో – అప్పుడు ఆతడు బ్రహ్మ స్వరూపుడుగానే యుండును.

తనతో సమానముగా ఆ యోగి దేనిని చూచును అన్నచో – నాకు ఏది సుఖదాయకమైనదో, ఏది ప్రియమైనదో అదియే సర్వప్రాణులకు సుఖదాయకము మరియు ప్రియము అయి వున్నది. అట్లే ఏ దుఃఖము నాకు అప్రియము మరియు ప్రతికూలమై యున్నదో అదియే సర్వప్రాణులకు అప్రియము మరియు ప్రతికూలము అయి వున్నది. ఈ విధముగా సర్వప్రాణులయందును తనయందువలెనే సుఖదుఃఖములను సమాన భావముతో అనుకూలముగను మరియు ప్రతికూలముగను చూచునో మరియు ఏ ప్రాణికిని ప్రతికూలముగా వ్యవహరించడో అనగా తనకు వలెనే ఏ ప్రాణికి అపకారము చేయడో ఆతడు సర్వశ్రేష్ఠుడైన యోగి యనబడును.

ఇటువంటి అహింసా భావముతో నిండియున్న పురుషుడు పూర్ణజ్ఞానమును కలిగియుండి యితర యోగులందరి కంటె శ్రేష్ఠుడనబడును.

పైన చెప్పబడిన పూర్ణజ్ఞానరూపమైన యోగము అత్యంత ప్రయాసతో సంపాదించ యోగ్యమైనదని తలంచి దానిని పొందుటకు తేలికయైన మరియు అతి స్పష్టమైన మార్గమును అనగా ఉపాయమును పొందదలంచి అర్జునుడు శ్రీకృష్ణునితో యిట్లనెను -

**6.33. యో ఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన,**
**ఏతస్యాహం న పశ్యామి చంచలత్వా త్థ్సితిం స్థిరామ్.**

అనగా - ఓ మధుసూదనా ! మీరు చెప్పిన సమత్వ భావరూపమైన యోగమును నేను నా యొక్క మనస్సు యొక్క చంచలత్వము కారణముగ ఈ యోగము యొక్క అచల స్థితిని చూడజాలకయున్నాను.

**6.34. చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢం,**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరం.**

అనగా - ఏలయన ? కృష్ణా ! ఈ మనస్సు అత్యంత చంచలమైనది. "కృష" అను ధాతువు నుండి "కృష్ణ" అను శబ్దము ఏర్పడినది. భక్తజనుల పాపాది దోషములను నివృత్తింపజేయువాడు గావున భగవంతునకు "కృష్ణుడు" అను పేరు కలిగినది.

ఈ మనస్సు పూర్తిగా అత్యంత చంచలమైనది అనగా నిలకడలేనిది. అంతేకాదు యిది శరీరమును క్షోభపరచి యింద్రియములను గూడ పరవశముగా మార్చి వేయును.

మరియు ఈ మనస్సు చాలా బలముతో కూడియున్నది. దేని ద్వారాను దీనిని అదుపు చేయడం అశక్యము అనగా శక్తికిమించిన పని. అంతేగాక ఈ మనస్సు చాలా దృఢమైనది గూడాను. అనగా తంతునాగమను అభేద్యమైన జీవము వంటిది. అందుచేత ఈ మనస్సు నుచ్ఛేదించుట అనగా జయించుట అనగా తన వశమునందుంచుకొనుట చాలా ప్రయత్న సాధ్యమైన కార్యము.

ఇటువంటి లక్షణములు కలిగియున్న మనస్సుతో పోరాడుట మరియు దానిని జయించి వశమునందుంచుకొనుట వాయువును వశమునందుంచుకొనుటవలె చాలా దుష్కరమైన కార్యము. అభిప్రాయమేమన ? ప్రచండ వాయువును అదుపు చేయుట ఎంత దుష్కర్మమైన కార్యమో అంతకంటే గూడ ఈ మనస్సును తన అధీనమునందుంచుట దుష్కరమైన కార్యమని నేను తలంచుచున్నాను.

నీవు చెప్పినదంతయు యధార్థమేనని భగవంతుడు చెప్పుచున్నాడు.

**6.35. అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్,**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే.**

అనగా - బలవంతుడైన ఓ అర్జునా ! మనస్సు చంచలమైనది. అందుచేత దానిని వశమునందుంచుకొనుట అత్యంత దుష్కర కార్యము అనగా కష్టమైన పని. ఈ విషయమునందు

ఎటువంటి సందేహము లేదు. కాని అభ్యాసముచేత అనగా చిత్తమునందు ఒకే విధముగా ఒకే వృత్తిని మాటి మాటికి వల్లించినందువలన మరియు దృష్టము మరియు అదృష్టము అనగా యింద్రియములకు కనుపించునటువంటి మరియు కనిపించనటువంటి ప్రియమైన భోగములు మరియు ఆ భోగములను యిచ్చునటువంటి విషయములు లేక పదార్థములయందలి దోషములను మాటి మాటికి చూచుచుండినందువలన ఉత్పన్నమగు ద్వేషభావము లేక వాటిని పొందకూడదనెడి అనిచ్ఛారూపమైన వైరాగ్యభావ బలముతో చిత్తము అనగా మనస్సు యొక్క చంచలత్వమును ఆపుట అనగా లేకుండ చేయుట సాధ్యపడును. అనగా ఈ విధముగా మనస్సును నిగ్రహించుట సాధ్యపడును.

కాని ఎవనియొక్క అంతఃకరణము ఆతని వశమునందు లేదో అటువంటి......

**6.36. అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః,**
**వశ్యాత్మనా తు యతతా శక్యో ఽవాప్తుముపాయతః.**

అనగా – మనస్సును తన వశమునందుంచుకొనజాలని పురుషుని ద్వారా అనగా – ఎవని అంతఃకరణము అభ్యాసము మరియు వైరాగ్యభావము ద్వారా **విషయముల మీదికి పోకుండా నిలిచియుండు స్వభావముకలిగి యుండలేదో** అటువంటి పురుషుని ద్వారా యోగ ఫలమును అనుభవించగలుగుట అసంభవము. అనగా ఆతనికి యోగఫలము లభించదు. ఇది నా నిశ్చయము.

కాని ఎవడు తన మనస్సును తన స్వాధీనము నందుంచుకొని యున్నాడో, ఎవని మనస్సు, అభ్యాసము మరియు వైరాగ్య భావబలము వలన అతని వశమునందే యున్నదో అనగా **విషయముల మీదికి పోకుండా అంతఃకరణమునందే నిలిచియున్నదో** మరియు ఆ విధముగ తన మనస్సును తన వశమునందుంచుకొనుటకు అన్నివేళల ప్రయత్నము చేయుచునే యుండునో అటువంటి పురుషుడు యింతకు పూర్వము చెప్పిన ఉపాయముల ద్వారా యోగమును యోగఫలమును తప్పక పొందగలడు.

యోగాభ్యాసమును చేయుచున్నప్పటికి, ఈ లోకము మరియు పరలోకమును రూపొందించునటివంటి సాధనములైన కర్మలను త్యజించినప్పటికి యోగఫలము అనగా మోక్షప్రాప్తికి సాధన రూపమైన పూర్ణజ్ఞానమును పొందజాలనట్టి పురుషుడు అయిన యోగియొక్క చిత్తము చివరకు అనగా దేహత్యాగ సమయమున యోగమునందు నిలిచియుండక చలించినచో అటువంటి యోగియొక్క వినాశమును శంకించి అర్జునుడు యిలా అన్నాడు.

**6.37. అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసః**
**అప్రాప్య యోగ సంసిద్ధిం కాం గతి కృష్ణ గచ్ఛతి**

అనగా – ఓ కృష్ణా ! సాధకుడు యోగమార్గమున పయనించ ప్రయత్నించక కాని అతి శ్రద్ధతో అనగా ఆస్తికబుద్ధి కలిగినవాడై మరియు అంత్యకాలమున ఆతని మనస్సు యోగమునుండి చలించినదై పోవునో ఆచంచలచిత్తుడు, స్మృతిభ్రష్టుడు అయిన యోగి యోగము

యొక్క సిద్ధిని అనగా యోగఫలమును అనగా పూర్ణజ్ఞానమును పొందనివాడై కలిగియుండును ?

**6.38. కచ్చిన్నోభయవిభ్రష్ట శ్ఛిన్నాభ్రమివ, నశ్యతి,**
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి.**

అనగా – ఓ కృష్ణా ! ఆయాశ్రయ రహితుడు మరియు బ్రహ్మమును వి మార్గ మధ్యమున మోహితుడై అనగా తిరిగి ప్రాపంచిక విషయములందు చిక్కినవాడై కర్మమార్గము మరియు జ్ఞాన మార్గము రెంటినుండి భ్రష్టుడై ముక్కలు ముక్కలుగా మేఘమువలె నశించిపోవునా ? లేక నాశమనునది లేక మిగిలియుండునా ? ...

**6.39. ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః,**
**త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే.**

అనగా – ఓ కృష్ణా ! నా యీ సంశయమును నిశ్శేషముగా తొలగించుటక సమర్థులైయున్నారు. ఏలయన ? మీరు తప్ప యితరులైన ఎ ఋషిగాని లేక దే యీ సంశయమును తొలగించగల సమర్థుడు కానరాడు. కావున తమరే నా యీ సం తొలగించవలయును. ఇదియే నా దృఢమైన అభిప్రాయము.

*అప్పుడు భగవంతుడు యిట్లు చెప్పినాడు –*

**6.40. పార్థ నైవేహ నా ముత్ర వినాశస్తస్య విద్యతే,**
**న హి కల్యాణ కృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి.**

అనగా – ఓ పార్థా ! ఆ విధముగా యోగభ్రష్టుడైన పురుషుడు ఈ లో గాని పరలోకమునందు గాని ఎచ్చటనూ నాశమును పొందడు. ఇప్పటి దేహముకం దేహమును పొందుటను నాశమందురు. యోగ భ్రష్టత్వము కలిగినవానికి అటువం సంభవించదు.

హేతాత్ ! ఓ తాత ! అట్లేలయన ? శుభకార్యములు చేయు పురుషు అనగా యిప్పుడున్న దానికంటె నీచమైన స్థితిని పొందడు. తండ్రి పుత్రుని రూప ఆత్మను విస్తరించుకొనును. అందుచేత అతనిని 'తాత' అని అంటారు. మరియు పుత్రుని రూపముతో దేహమును పొందును. అందుచేత పుత్రుని గూడ 'తాత' అని **శిష్యుడు గూడ పుత్రసమానుడే.** అందుచేత అతనిని గూడ "తాత" అని అందురు

*అయితే అప్పుడు ఈ యోగభ్రష్టుని గతి ఏమి యన్నచో –*

**6.41. ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః,**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టో౽భిజాయతే.**

అనగా – యోగమార్గమున పయనించుచూ యోగభ్రష్టుడైన సంన్యాసి శ చేయునటువంటి అనగా అశ్వమేధాది యజ్ఞములు చేసినవారు పొందిన లోకము అచ్చట బహుకాలము అనగా లెక్కలేనన్ని వత్సరములు నివసించి తాను చేసిన ఫలమైన భోగములు క్షయించగా శాస్త్రోక్త కర్మలు చేయునటువంటి శుద్ధమైన

శ్రీమంతులైనవారి యింట తిరిగి శరీరమును పొందును. ఈ ప్రకరణాంతము నుండి యింతవరకు యోగభ్రష్టుని సంన్యాసియని చెప్పబడినది.

**6.42. అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్,
ఏ తద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్.**

అనగా – అట్లుకాని యెడల, శ్రీమంతుల కులముగాక యితరమైన సద్బుద్ధి కలిగి దరిద్రుడైన యోగి యింట జన్మను అనగా వేరు దేహమును పొందవచ్చును.

కాని అటువంటి జన్మ అనగా పైన చెప్పబడిన దరిద్రులైనను విశేష గుణయుతులైన యోగుల మధ్య క్రొత్త దేహమును పొందుట యనునది యింతకు పూర్వము చెప్పబడిన శ్రీమంతుల యింట దేహమును పొందుట కంటె అత్యంత దుర్లభమైన కార్యము. అట్లేలయన?-

**6.43. తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్,
యతతే చ తతో భూయఃససిద్ధౌ కురునందన.**

అనగా – అటువంటి యోగుల యింట శరీరమును పొందిన పూర్వజన్మము నందు యోగభ్రష్టత్వమును పొందిన సంన్యాసి ముందుగా యిప్పటి శరీరమునందు కలిగిన బుద్ధితో సంయోగమును పొందును. అనగా – అటువంటి యోగి యింట శరీరమును పొందిన తరువాత అంతకు ముందరి అనగా పూర్వజన్మము అనగా **పూర్వ దేహమునందు లభించియున్న బుద్ధితో యిప్పటి బుద్ధికి సంబంధము ఏర్పడును. అంతేగాక ఆతడు పూర్వదేహమునందు వుండి కర్మలుచేసి సంపాదించిన సంస్కార బలముతో పూర్ణసిద్ధిని పొందుటకు యింతకు పూర్వము చేసినదానికంటె ఎక్కువగా ప్రయత్నించును.**

అంతకు పూర్వపు శరీరమునందు ఏర్పడి జ్ఞానమును పొందిన బుద్ధితో యిప్పటి శరీరమునందు ఏర్పడిన బుద్ధి పునస్సంయోగము ఎట్లు కలుగును ? అని అన్నచో చెప్పుచున్నారు-

**6.44. పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశో ఽపి సః,
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే.**

అనగా – అట్లేలయన ? యోగభ్రష్టుడైన పురుషుడు పూర్వజన్మ కర్మపరిపాకము చేత పరవశత్వమును పొందినప్పటికి పూర్వాభ్యాస బలముతో అనగా యింతకు ముందు పొందిన దేహము ద్వారా చేసిన అభ్యాస బలముతో తనంతటతానుగా బలపూర్వకముగా యోగము వైపునకు ఆకర్షింపబడును.

యోగభ్యాసము వలన కలిగిన సంస్కారముల కంటె అధిక బలవత్తరమైన అధర్మాది కర్మలు చేయకయుండినచో యోగాభ్యాసము వలన కలిగిన సంస్కారముల బలముతో యోగము వైపనకు ఆకర్షింపబడును. ఒకవేళ యోగాభ్యాసము వలన ఏర్పడిన సంస్కారముల కంటే ఎక్కువగా బలమైన అధర్మ పూర్వక కర్మలు చేసినట్లయితే ఆ కర్మల వలన ఏర్పడిన బలమైన సంస్కారముల చేత పూర్వపు యోగజన్య సంస్కారము అణచివేయబడును.

కాని ఆ యా పాపకర్మల ఫలములు భోగానంతరము క్షయించినప్పుడు పూర్వపు యోగజన్య సంస్కారములు తనంతట తానుగానే తిరిగి యోగాభ్యాసమునకు ఉత్సాహపరచును. **చాలా దీర్ఘకాలము వరకు అణచివేయబడి వున్నప్పటికి ఆ సంస్కారములు పూర్తిగా నశింపవు.**

యోగమునందు జిజ్ఞాస గలవారు గూడ అనగా యోగ స్వరూపమును స్పష్టముగా తెలుసుకొనగోరినవారైన యోగమార్గమున యింతకు పూర్వము ప్రయత్నించి యోగభ్రష్టత్వమును పొందిన సంన్యాసులు శబ్దబ్రహ్మమును అనగా వేదాది శాస్త్రగ్రంథముల యందు చెప్పబడిన కర్మఫలమును అతిక్రమించి యోగమార్గమున పయనించుటకు ప్రయత్నింతురు. అట్టి యోగమును చక్కగా తెలుసుకొని అందు దృఢముగా నిలిచి యోగాభ్యాసమును చేయుదురు.

ఇచ్చట ప్రసంగ సందర్భమున జిజ్ఞాసువును గూడ సంన్యాసి అని చెప్పబడినది. దీనిని గమనించనగును.

యోగిత్వము ఏ కారణము వలన శ్రేష్ఠమని చెప్పబడుచున్నది ?

**6.45. ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః,**
**అనేక జన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్.**

అనగా - ప్రయత్న పూర్వకముగా అత్యధిక సాధనయందు నిమగ్నమై యున్న విద్వాంసుడైయున్న సాధకుడు అనేక దేహములను పొంది యున్నప్పుడు చేసియున్న చిన్న చిన్న సంస్కారయుక్త కర్మల ఫలములను ప్రోగుచేసి ఆ సంస్కారయుక్త కర్మల ఫలములతో పాపరహితుడై సమ్యక్ జ్ఞాన సంపన్నుడై మోక్షమును పొందును.

అట్లు జరుగుటకు కారణమేమనగా -

**6.46. తపస్విభ్యో௨ధికో యోగీ జ్ఞానిభ్యో௨పి మతో௨ధికః,**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున.**

అనగా - **తపస్సు చేసిన వారికంటెను జ్ఞానుల కంటెను నిజమైన యోగిశ్రేష్ఠుడు. ఇచ్చట శాస్త్ర విషయిక పాండిత్యమే జ్ఞానమనబడుచున్నది. అట్టి శాస్త్రవిషయిక పాండిత్యముతో కూడియున్న జ్ఞానికంటె యోగి శ్రేష్ఠుడు** మరియు అగ్నిహోత్రాది కర్మలు చేయునట్టి వారికంటె గూడ యోగి శ్రేష్ఠుడు. అందువలన అర్జునా ! నీవు నిజమైన యోగివి కమ్ము.

**6.47. యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా,**
**శ్రద్ధావాన్భజతే యో మాం స మే యుక్త తమో మతః.**

అనగా - రుద్రుడు, ఆదిత్యుడు అనగా సూర్యభగవానుడు మొదలగు దేవతలు ధ్యానమునందు నిమగ్నమై యున్న అందరి యోగుల కంటెను ఏ యోగి శ్రద్ధాభావముతో తన మనస్సును నింపుకొనినవాడై వాసుదేవుడనైన నాయందు లగ్నమైయున్న అంతఃకరణముతో నన్నే భజించునో అటువంటివానిని నేను అత్యంత శ్రేష్ఠుడైన యోగిగా తలంతును.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*ధ్యానయోగమను ఆరవ అధ్యాయమునకు*
*శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య విరచిత సంస్కృత భాష్యమునకు*
*తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు శ్రీ సదానందభారతి.*
*ప్రణవాశ్రమము.*

# ఏడవ అధ్యాయము

యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా,
శ్రద్ధావాన్భజతే యో మాం స మే యుక్తతమో మతః.

ఆరవ అధ్యాయం చివరిలో ప్రశ్న రూపములో బీజారోపణము చేసి మరల స్వయముగానే "నా తత్వము యిలాంటిది" అందుచేత సాధకుడు యీ విధముగా నాయందు అంతరాత్మ కలిగినవాడుగా కావలయును అను మొదలగు మాటలను విశదపరచదలంచి భగవంతుడు యీ క్రింది విధముగా ఏడవ అధ్యాయమును ఆరంభించుచున్నారు.

**7.1. మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్మదాశ్రయః,**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి త చ్ఛృణు.**

అనగా - ముందు చెప్పబోవుచున్న విశేషణములతో కూడియున్న పరమేశ్వరుడను అయి వున్న నాయందు మనస్సును లగ్నము చేసినవాడు **"మయ్యాసక్తమనా"** వాడై యుండునో మరియు పరమేశ్వరుడనైన నేనే ఎవని ఏకమాత్ర లక్ష్యము (అవలంబము) గా వున్నానో ఆతడు **'మదాశ్రయ'** అనగా నా ఆశ్రయమునందు వుండునో ఓ పార్థా ! అటువంటి **"మయ్యాసక్తమనా"** అనగా నాయందు మాత్రమే ఆసక్తి కలిగిన మనస్సు గలవాడుగా వుండునో, మరియు ఆతడు **"మదాశ్రయ"** నన్నే ఆశ్రయించినవాడుగా వుండునో అట్టివానిగా వుండి నీవు యోగసాధన చేయుచూ అనగా మనస్సును నాయందే నిలిపివుంచి నన్ను సంశయ రహితముగా సమగ్రముగా ఎఱుంగు వాడవగుదువో అట్టి విధానమును చెప్పెద సావధాన చిత్తుడవై వినుము-

పురుషార్థములైన ధర్మ, అర్థ, కామ, మోక్షాదులయందు దేనినో ఒకదానిని కోరినవాడై దానికి సాధనరూపమైన అగ్నిహోత్రాది కర్మలు, తపములు, లేక దానములు మొదలగు వాటిలో దేనినో ఒకదానిని ఆశ్రయించి, అనగా సాధనముగా చేసుకొని, నన్ను పొందగోరు యోగి యితర పై సాధనములన్నింటిని వదలుకొని కేవలము నన్నే ఆశ్రయముగా గ్రహించునో మరియు నాయందే ఆసక్త చిత్తము కలవాడగునో ఆతడు సులభముగా ప్రాపంచిక విషయముల నుండి ముక్తుడగును.

అందువలన నీవు పైన చెప్పబడిన గుణములతో కూడినవాడవై విభూతి (సంపద) బలము, ఐశ్వర్యము మొదలగు గుణములతో కూడి పరమేశ్వరుడనైన నాయందు సంశయ రహిత చిత్తము కల వాడవగుదువో అనగా "భగవంతుడు నిస్సందేహముగా సరియైన మార్గమునే చూపుచున్నాడు" అని తెలుసుకొను విధానము చెప్పుచున్నాను వినుము -

ఆ భగవంతుని స్వరూపమును గురించి -

**7.2. జ్ఞానం తే ఽహం సవిజ్ఞానమిదం, వక్ష్యామ్యశేషతః,**
**యజ్ఞాత్వా నేహ భూయో ఽన్యజ్ఞాతవ్యమవశిష్యతే.**

అనగా - ఇప్పుడు నేను నీకు జ్ఞానమును విజ్ఞానముతో కలిపి అనగా నా అనుభవ సహితమైన సర్వాంగపూర్ణమైన జ్ఞానమును వినుపించెదను.

శ్రోతను సావధానచిత్తునిగా చేయుటకు ఎటువంటి వర్ణనము అవుసరమో అట్టి జ్ఞానమును స్తుతించుచున్నారు.

ఎట్టి జ్ఞానమును పొందినవానికి యీ జగత్తునందు పురుషార్థమును పొందుటకు మరొక యితర సాధనము అక్కరలేదో అనగా ఎవడు నా తత్వమును సవివరముగా తెలుసుకొనునో అతడు సర్వజ్ఞుడగును. అందువలన యీ జ్ఞానము అత్యంత ఉత్తమ ఫలమును కలుగజేయునదిగావున అన్యత్ర దుర్లభమైనది.

ఈ జ్ఞానము ఏ విధముగా దుర్లభమైనదో చెప్పెద సావధాన చిత్తుడవై వినుము.

**7.3. మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే,**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః.**

అనగా - వేలమంది మానవులలో ఎవ్వరో ఒక్క మహా పురుషుడు మోక్షరూపమైన సిద్ధిని పొందుటకు ప్రయత్నించును. ఆ విధముగా సిద్ధిని పొందుటకు ప్రయత్నించు సిద్ధులలో కూడ ఎవ్వరో ఒక్క మహాత్ముడే నన్ను అనగా నా తత్వమును యధార్థ రూపముగా ఎఱుంగ జాలును.

ఈ విధముగా శ్రోతకు తత్వజ్ఞానమును పొందుటకు అవుసరమైన జిజ్ఞాసను కలిగించి అటుపై చెప్పుచున్నారు.

**7.4. భూమిరాపో ఽనలో వాయుః మనో బుద్ధిరేవ చ,**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా.**

అనగా - "భిన్నా ప్రకృతి రష్టధా" అను పదము చెప్పబడిన కారణముగ యిచ్చట భూమి శబ్దము ద్వారా కేవలము మట్టిగాక దానియందు మమేకమై యున్న నాలుగు భూతములు గూడ చెప్పబడుచున్నవి. అదే విధముగా జలము మొదలగు భూతములు గూడ యితర భూతాంశములతో కలిపి యే చెప్పబడుచున్నవి.

ఈ విధముగా పృథ్వీ (భూమి) జలము, అగ్ని, వాయువు మరియు ఆకాశము మరియు మనస్సు - యిచ్చట మనస్సనగా దానికి కారణభూతమైన అహంకారము గూడ చెప్పబడినది మరియు బుద్ధి అనగా అహంకారమునకు కారణము మహత్తత్వము మరియు అహంకారము అనగా అవిద్యతో కూడియున్న అవ్యక్తము అనగా మూలప్రకృతి.

ఏ విధముగా విషముతో కూడియున్న అన్నము కూడ విషమనియే చెప్పబడునో ఆ విధముగానే అహంకారము మరియు విషయ వాసనలతో కూడియున్న అవ్యక్తము గూడ అనగా మూలప్రకృతి గూడ అహంకారమనియే చెప్పబడుచున్నది. అట్లేలయన ? అహంకారము అన్నింటికి కారణరూపమైనది. ప్రపంచమునందు అహంకారమే సర్వ ప్రవృత్తులకు బీజ **రూపముగా చూడబడుచున్నది.**

ఈ విధముగా యీ పైన చెప్పబడిన ప్రకృతి అనగా సర్వేశ్వరుడనైన నామాయా శక్తి ఎనిమిది రూపములతో భిన్న భిన్నముగా విభజింపబడుచున్నది.

**7.5. అపరేయమిత స్త్వన్యాం ప్రకృతి విద్ధి మే పరామ్,**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్.**

అనగా – ఇచ్చట పైన చెప్పబడినది భగవంతుడనైన నా అపరా ప్రకృతి.

అనగా – 'పరా' కాదు, అది నికృష్టమైనది, అశుద్ధమైనది మరియు అనర్థమును కలిగించునది. అంతేగాక సంసారబంధ రూపమైనది. అంతేగాక అర్జునా ! ఈ పైన చెప్పబడిన ప్రకృతియందు రెండవదియైన జీవరూపము గలది అనగా ప్రాణధారణకు కారణరూపమైనది దాగియున్నది. దానినే క్షేత్రజ్ఞ రూపా ప్రకృతి అని అందురు. **లోపల ప్రవేశించియున్న ఏ ప్రకృతి ద్వారా ఈ సమస్తమైన జగత్తు కల్పించబడుచున్నదో దానిని నీవు నా యొక్క పరా ప్రకృతిగా గుర్తించుము.** అనగా దానిని నీవు నా యొక్క ఆత్మరూపమైన ఉత్తమమైనది మరియు శుద్ధమైన ప్రకృతిగా గుర్తించుము.

**7.6. ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుప ధారయ,**
**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా.**

అనగా – ఈ క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని రూపము కలిగియున్న రెండూ 'పరా' మరియు 'అపరా' ప్రకృతులే తమ యోనినుండి ఈ సమస్త భూతప్రాణుల రూపమైన ప్రకృతిరూప కారణముచేతనే పుట్టుచున్నవని అనగా కల్పించబడుచున్నవని నీవు చక్కగా తెలిసికొనుము.

అట్లేలయన ? ఆ నా రెండు ప్రకృతులే సమస్త భూతములకు యోని (కారణము లేక రూపములను కల్పించునది) అనగా కారణమై యున్నవి. అందుచేత సమస్తమైన జగత్తు యొక్క రూపకల్పన లేక జన్మ – ఉత్పత్తి మరియు ప్రళయము అనగా లయము అనగా నివర్తించుట, వినాశము నేనే అయి వున్నాను. అనగా – ఈ రెండు ప్రకృతుల ద్వారా సర్వజ్ఞుడను మరియు ఈశ్వరుడను అయిన నేనే ఈ సమస్త జగత్తునకు కారణరూపుడనై యున్నాను.

అట్లగుటకు కారణమేమనగా –

**7.7. మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ,
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ.**

అనగా - పరమేశ్వరుడ (సర్వేశ్వరుడ) నైన నాకంటె వేఱుగా జగత్తునకు వేఱగు మరొక కారణము లేదు. అనగా **సర్వేశ్వరుడనైన నేనే యీ సమస్త జగత్తునకు ఏకమాత్ర కారణ రూపమై యున్నాను.**

ఎందువలన యిలా వున్నదనగా - అది అలాగే వున్నది గనుక. సమస్తమైన ప్రాణులు సర్వేశ్వరుడనైన నాయందు దీర్ఘములైన దారములతో కూడిన వస్త్రము వలె మరియు దారమునందు పొదగబడిన మణులవలె కూర్చబడి కూర్పించబడి, ఏర్పాటు చేయబడి, కల్పించబడి యున్నది.

ఈ సమస్త ప్రపంచము ఏ యే ధర్మములతో కూడి తనలో తాను కూర్చబడి యున్నది? అని అన్నచో -

ఇట్లు చెప్పుచున్నారు -

**7.8. రసో ౽హమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః,
ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు.**

అనగా - నేను జలమునందు రసమునై యున్నాను అనగా రస రూపమున వుండియున్నాను. అనగా జలముయొక్క సారమును నేనైయున్నాను. జలముయొక్క సారమునే 'రస' మని యందురు. పరమాత్ముడనైన నాయందు అనగా **రసరూప పరమాత్ముడనైన నాయందు ప్రపంచమునందలి జలమంతయు యిమిడి వున్నది.** ఈ ప్రకారముగానే పంచభూతములను ఎఱుంగవలయును.

ఏ విధముగా నేను జలమునందు రసరూపమున వ్యాపించియున్నానో ఆ విధముగానే చంద్ర సూర్యాదులయందలి ప్రకాశమును నేనే. సమస్త వేదములయందు 'ఓం' కార రూపమున యున్నది నేనే. అనగా 'ఓం' కార రూపుడనైన పరమాత్ముడగు నాయందు సర్వవేదములు యిమిడివున్నవి.

ఆకాశము యొక్క సారభూతమైన శబ్దమును నేనే అనగా ఆ శబ్దరూపుడనైన నాయందే సమస్త ఆకాశము యిమిడి యున్నది.

అంతేకాదు పురుషుల యందలి పౌరుషమును అనగా పురషత్వమును నేనే. **పురుషులయందు ఏ తత్వము వ్యాపించియున్నందువలన అతడు పురుషుడనబడుచున్నాడో ఆ తత్వమును నేనే.** ఆ పౌరుష రూప తత్వమునందే సమస్తమైన పురుషులు యిమిడి యున్నారు.

**7.9. పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ,
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు.**

అనగా - భూమియందలి గంధమును అనగా సుగంధమును నేనే. అనగా ఆ సుగంధ రూపీశ్వరుడనైన నాయందు సమస్తమైన పృథ్వి అనగా భూగోళము యిమిడి యున్నది.

జలము మొదలగు వాటియందు ఆ భూతములయొక్క పవిత్రతను చూపించుట కొఱకే యిచ్చట గంధమునందలి స్వాభావిక పవిత్రతయే పృథివియందు చూపెట్టబడినది.

గంధ రసము మొదలగు వాటియందు ఏర్పడుచున్న అపవిత్రత ప్రాపంచిక పురుషుల యందు గల అజ్ఞానము, అధర్మము మొదలగు వికారముల ఆధిక్యముచేత మరియు భూతములతో వారికి గల సంపర్కము చేత ఏర్పడుచున్నదే గాని ఆ భూతముల స్వాభావిక లక్షణము కాదు.

అగ్నియందలి ప్రకాశమును నేనే అనగా ఆ బ్రహ్మతత్వమే మరియు **సర్వజీవుల యందలి ప్రాణమును కూడ నేనే. అనగా దేనివలన ప్రాణులన్నియు చేతనత్వము కలిగియున్నవో ఆ చేతనత్వము ఆ బ్రహ్మతత్వమే అనగా నేనే.** మరియు తపోధనులయందలి తపమును నేనే. అనగా తపరూపమైన పరమాత్మయైన నాయందే సర్వతపోధనులు మిళితమై యున్నారు.

## 7.10. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్,
## బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినా మహమ్.

అనగా - ఓ పార్థా ! నన్ను నీవు సర్వభూతముల యొక్క సనాతనమైన, **అత్యంత అనాదియైన బీజము అనగా వాటన్నింటియొక్క వుత్పత్తికి మూల కారణముగా ఎఱుంగుము.** మరియు నేనే బుద్ధిమంతుల యొక్క బుద్ధి అనగా వారి వివేక శక్తిగాను మరియు తేజముగల వారి అనగా ప్రభావశాలురైన పురుషులయొక్క ప్రభావమును గూడ నన్నుగానే గుర్తించుము.

## 7.11. బలం బలవతాం చాహం కామరాగ వివర్జితమ్,
## ధర్మావిరుద్ధో భూతేషు కామో ఽస్మి భరతర్షభ.

అనగా - బలవంతులయందు కామము మరియు ఆసక్తి లేనటువంటి బలము, తేజస్సు మరియు సామర్థ్యము అన్నియు నేనే అయి వున్నాను.

**తాత్పర్యమేమన - అప్రాప్య వస్తువులయందు గల తృష్ణకు మారు పేరే కామము. అట్లే ప్రాప్తించిన విషయములు లేక వస్తువులయందు గల ప్రీతి లేక తన్మయత్వమును 'రాగము' లేక ఆసక్తియని యందురు.** ఆ రెండూ లేనటువంటి కేవలము స్థూలదేహ పోషణార్థము ఉపయోగపడు బలమును నేనైయున్నాను. సాంసారిక జీవితము గడుపునటువంటి జీవులయందు గల బలము మరియు ఆసక్తి లేక కామముతో నాకు ఎటువంటి సంబంధము లేదు. అనగా ఆ బలము మరియు కామము నేను గాదు.

ఇంకా విశేషమేమన ? ఓ అర్జునా ! ప్రాణులయందు అనగా మానవ దేహము కలిగియున్నవారియందు గల శాస్త్రబద్ధమైన మరియు ధర్మానుకూలమైన కామము అనగా ఏ కామము వలన కేవలము దేహధారణ మాత్రమే జరుగుచుండునో ఆ కోర్కెల రూపమైన కామమును నేనే. అనగా ఆ పరిశుద్ధమైన కామము నాకు సంబంధించినదే.

మరియు -

**7.12. యే చైవ సాత్వికా భావా రాజసాస్తామసాశ్చయే,**
**మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి.**

అనగా - సత్యగుణము ప్రధానముగా కలిగి స్థూల శరీరమును పొందిన జీవుడు, రాజసగుణము ప్రధానముగా కలిగి స్థూలదేహమును పొందిన జీవుడు మరియు అట్లే తామసగుణము ప్రధానముగా కలిగి స్థూల దేహమును పొందిన జీవుడు అనగా ఈ **జీవులందరికి యింతకు పూర్వపు దేహములతో కూడియున్నప్పుడు చేసిన కర్మల ననుసరించి ఆ యా గుణములు ప్రాప్తించుచున్నవి.** ఆ విధముగా సర్వము నేను అనగా ఆ భగవత్తత్వము ననుసరించియే జరుగుచున్నట్లుగా తెలియవలయును.

ఈ విధముగా స్థూలదేహములను పొందుట, పూర్వ పూర్వ దేహములతో కూడియున్నప్పుడు చేసిన కర్మల ననుసరించి తిరిగి ఆ యా కర్మల ననుసరించి ఆ యా గుణ ప్రధానములైన దేహములు లభించుట మొదలగునదంతయు నా కారణముగానే జరుగు చున్నప్పటికి అందులకు నేను బాధ్యుడను కాను. అనగా **వారి కర్మజన్మలతో నాకు ఎటువంటి సంబంధము వుండదు.** లేదు అనగా ప్రాపంచిక ప్రాణులవలె నేను ఆ యా గుణములకు కట్టుబడి యుండువాడనుగాను అయినప్పటి ఆ ప్రాణులన్నియు నా వశమునందే యున్నవి.

నేను సాక్షాత్తు పరమేశ్వరుడను. నిత్య శుద్ధ, బుద్ధ ముక్త స్వభావము కలవాడను. మరియు సర్వభూతములకు ఆత్మ స్వరూపుడను. అయినప్పటికి అనగా అందుచేత నేను సర్వవిధ గుణములకు అతీతుడను అనగా సత్వ, రజ, తమో గుణములతో ఎటువంటి సంబంధము లేనివాడను. సంసారరూపమైన దోషమునకు కారణమైన అజ్ఞానమను బీజమును నశింపజేయు వాడనైయున్నాను. నా యీ తత్వమును **యీ లోకమునందు తోచు ప్రాణులు** ఎఱుంగవు. ప్రాణుల అజ్ఞానమునకు భగవంతుడు చింతించుచున్నాడు. అందుచే ఆ యా ప్రాణులకు యీ అజ్ఞానము ఎట్లు కలుగుచున్నదో సవివరముగా చెప్పుచున్నారు.

**7.13. త్రిభుర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్,**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయం.**

అనగా - **గుణములయందు వికారదోషము కలుగుచుండుటచేత, ఆ గుణముల యందు సాత్వికము, రాజసము మరియు తామసమను భేదములు కలుగుచున్నవి.** ఈ మూడు గుణయుక్త భావముల వలన అనగా పైన చెప్పబడిన రాగము, ద్వేషము, మరియు మోహము మొదలగు భావముల కారణముగ ఈ జగత్తునందలి ప్రాణులన్నియు మోహమునకు లోనగుచున్నవి. అనగా వివేకము అనగా నిత్యానిత్య వస్తు వివేకము లేనివగుచున్నవి. అందుచేత ఈ పైన చెప్పబడిన గుణములకు లోనుగాక వాటికి అతీతముగా వినాశము లేనటువంటి

మరియు అనాది మరియు జన్మాది సమస్త భావ వికారములు లేనటువంటి పరమాత్మ స్వరూపుడనైన నాయందు అనగా నన్ను ఈ ప్రాణులు గుర్తించలేకున్నవి.

అయితే మరి ఈ దైవసంబంధమైన త్రిగుణములతో కూడియున్న వైష్ణవీ అనగా విష్ణువునకు సంబంధించిన మాయను మానవులు ఎట్లు అధిగమించగలరు ? అనగా దానికి అతీతముగా ఎట్లు వ్యవహరించగలరు ? అని అన్నచో యిట్లు చెప్పుచున్నారు.

**7.14. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే.**

అనగా - అదెట్లన ? ఈ పైన చెప్పబడి దైవీమాయ అనగా నేనుగా వ్యాపించియున్న ఈశ్వరశక్తి రూపమున వున్న త్రిగుణమయీ మాయ అనగా సాత్విక, రజ, స్తమో గుణములతో కూడియున్న మాయ జయింపశక్యము కానిది. అనగా 'మాయా రూపమున వ్యాపించియున్న మహాసముద్రము) తరించ శక్యముకానిది. అందువలన సర్వ ధర్మములను త్యజించి తన ఆత్మరూపముననే యున్న మాయాధిపతియైన పరమేశ్వరుడనైయున్న నన్నే సర్వాత్మ భావముతో శరణుజొచ్చుట మంచిది. అట్లు పరమేశ్వరుడను మాయా పతిని అయిన నన్ను శరణుజొచ్చిన వారు బహు తేలికగా ఆ మాయా సముద్రమును తరించగలరు. అనగా దాటగలరు. అనగా సంసార బంధమునుండి ముక్తులగుదురు.

మరి తమరి శరణుజొచ్చిన వారందరూ మహామాయా సముద్రమును అతి తేలికగా తరించగలిగియున్నప్పుడు మరి వారినందరినీ మీ శరణుయందు ఎందులకు చేర్చుకొనటలేదు?

అందులకు సమాధానముగా శ్రీకృష్ణుడు చెప్పుచున్నారు -

**7.15. న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః,**
**మాయయా ఽపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః.**

అనగా- పాపకర్మలు చేయు మూర్ఖులు, అనగా మానవులలో నీచులు అనగా నిమ్న వర్గమువారు అనగా మాయకు లోబడి జ్ఞానము లేక యున్నవారు హింసతో కూడిన కార్యములు చేయువారు, అబద్ధములాడుచూ అనగా అసత్యభాషణములు చేయుచూ తామస భావముతో కూడియున్న మానవులు పరమేశ్వర స్వరూపడనైన నన్ను అనగా నావద్ద శరణుపొందరు.

కాని పుణ్యకార్యములు చేయు మానవోత్తములు అనగా సాత్విక గుణసంపన్నులైన శ్రేష్ఠ మానవులు ఏమి చేయుదురో చెప్పెద వినుము -

**7.16. చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినో ఽర్జున,**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ.**

అనగా - అర్జునా ! ఆర్తులు అనగా ప్రాపంచిక దుఃఖములచే పీడింపబడుచున్నవారు అనగా ప్రాపంచిక భావముతో కూడి ప్రాపంచిక బాధలు అనుభవించువారు. జిజ్ఞాసువులు

అనగా భగవత్తత్త్వమును గురించి తెలియగోరువారు అర్థార్థులు అనగా ప్రాపంచిక దృష్టి కలిగి ప్రకృతి సంబంధమైన వస్తు సముదాయమును అనగా సంపదను అభిలషించువారు. జ్ఞానులు అనగా విష్ణుతత్త్వమును ఎరింగినవారు (బ్రహ్మతత్త్వమును కాదు) యిటువంటి నాలుగు విధములైన పుణ్యకర్మలు చేయు మానవులు నన్ను భజించుచూ నన్ను సేవించుచుందురు. అనగా నా శరణు కోరుదురు.

**7.17. తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే,**
**ప్రియో హి జ్ఞానినో௨త్యర్థమహం స చ మమ ప్రియః.**

అనగా - పై నాలుగు విధములైన మనుష్యులలో జ్ఞానులైనవారు అనగా సత్యము, నిత్యమూ అయిన నా తత్త్వమును ఎఱింగినవారు, వారు తత్త్వవేత్తలు అనగా నా తత్త్వమును ఎఱింగి యున్నందువలన సర్వకాల సర్వావస్థలయందును నాయందే నిలిచియుందురు. మరియు వారి దృష్టియందు భజించుటకు వారికంటె యితరమైన వస్తువేదియు తోచనందున కేవలము పరమాత్మ స్వరూపుడనైన నాయందే అనన్య అనగా యితరమేదియు లేనటువంటివారై నిలిచియుందురు. అందుచేత అటువంటివారు నాకు అనన్య ప్రియులుగా శ్రేష్ఠమైనవారుగా తోచుచుందురు. మిగిలియున్న మూడు విధములైన వారికంటె మిక్కిలిగా సర్వశ్రేష్ఠులుగా నాచే తలంచబడు చుందురు.

అట్లేలయన ? నేను జ్ఞానియొక్క ఆత్మనై యున్నాను. అందుచేత నాకు అటువంటి జ్ఞానులు అత్యంత ప్రియమై యున్నారు.

ఆత్మయే అందరికి అత్యంత ప్రియమైనదై యున్నందున జ్ఞాని ఆత్మగా కలిగి యున్నందున భగవంతుడైన వాసుదేవుడు వారికి అనగా జ్ఞానులకు అత్యంత ప్రియుడై వుంటాడు.

మరియు జ్ఞాని కూడ వాసుదేవుడనైన నా యొక్క ఆత్మయే అయివున్నందున ఆ జ్ఞానులు నాకు అత్యంత ప్రియులై వుందురు.

అయితే మరి ఆర్తులు మొదలగు మూడు విధములైన భక్తులు వాసుదేవులైన తమకు ప్రియులు కారా ? అట్లు కాని పక్షమున వారి గతి ఎట్లుండును ? ఏమగును ? అన్నచో -

**7.18. ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్,**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్.**

అనగా - ఈ విధమైన భక్తులందరూ గూడ చాలా ఉదార స్వభావము గలవారు. శ్రేష్ఠులు గూడాను. అనగా ఈ మూడు విధములగు భక్తులు గూడ నాకు ప్రియమైనవారలే. అట్లేలయన ? వాసుదేవుడనైన నాకు నా భక్తులైనవారలెవ్వరూ గూడ నాకు అప్రియులు కారు. **కాని జ్ఞానియైనవాడు నాకు అత్యంత ప్రియమైనవాడుగా వుంటాడు.** వారిరువురి మధ్య ఈ మాత్రపు భేదమున్నది.

అలా భేదము ఎందుకు కలదో చెప్పుచున్నారు - జ్ఞానియైనవాడు నా స్వరూపమే అయి వున్నాడు. ఆతడు నా కంటె వేఱుగా లేడు. ఇదియే నా నిశ్చయము. ఏలయన ? యోగారూఢుడగుటకు ప్రయత్నించు జ్ఞాని స్వయముగా వాసుదేవ భగవానుడనైన నేనే అయి వున్నాను. అంతేగాని ఆతడు నా కంటె వేఱుగ లేడు. అటువంటి యుక్తాత్ముడు అనగా జీవత్వమును త్యజించి ఆత్మయందు లీనమైయున్న జ్ఞాని ప్రాప్తవ్యుడనైన నాయందు లీనమై నా రూపముననే అనగా నేను గానే అనగా పరమ పరబ్రహ్మ తత్వముగానే నిలిచియుండును.

అలా తన రూపననే యున్నప్పటికి భగవంతుడు జ్ఞానులైనవారిని స్తుతించుచున్నారు.

**7.19. బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే,**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః.**

అనగా - జ్ఞానప్రాప్తికొఱకు సంస్కారములను పెంపొందించుకొనుటకై ప్రయత్నించు మహాత్ములు జన్మాంతరమునందు అనగా అనేక జన్మ-మరణములు పొంది అంతిమ దేహమును పొందినప్పుడు పూర్వపు సంస్కారములన్నియు పరిపక్వ దశను పొందిన జ్ఞాని అంతరాత్మ రూపుడనైయున్న వాసుదేవుడనగు నన్ను "అంతయు వాసుదేవుడే" అను భావముతో నిండినవాడై నన్నే అనగా నా తత్వమునే పొందును.

ఈ విధముగా ఏ పురుషుడు సర్వాత్మరూపుడనై యున్న వాసుదేవుడనగు నన్ను ప్రత్యక్షముగా పొందునో ఆతడే మహాత్ముడు. అటువంటివానితో సమానుడైనవాడు లేక అతని కంటే శ్రేష్ఠుడు మరియొకడు వుండడు. అందుచేత కొన్ని వేలమంది మనుష్యులలో కూడ అటువంటి పురుషుడు లభించుట అత్యంత దుర్లభము.

"ఈ ప్రపంచమంతయు ఆత్మ స్వరూపముననున్న వాసుదేవుడే" అను భావము లోకమునందలి పురుషులకు కలుగకుండుటకు కారణము చెప్పుచున్నాడు -

**7.20. కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతే உన్యదేవతాః,**
**తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా,**

అనగా - పుత్రులు, పశువులు, స్వర్గము మొదలగు భోగముల యొక్క ప్రాప్తి సంబంధమైన అనేక కోర్కెలవలన విజ్ఞాన వివేకములను పోగొట్టుకొన్న పురుషులు తమ స్వభావముచేతనే అనగా జన్మ-జన్మాంతరములందు ప్రోగు చేసుకొనియున్న సంస్కార సముదాయ రూపమైన స్వభావముచే ప్రేరేపించబడినవారై యితర దేవతలను అనగా ఆత్మస్వరూపుడనైయున్న వాసుదేవుడనైన నాకంటె భిన్నముగా తోచు దేవతలను సేవించుచూ ఆ దేవతలను తృప్తిపరచుటకై ఏ యే పద్ధతులు లేక నియమ కర్మలు ప్రసిద్ధములై యున్నవో వాటిని ఆశ్రయించి ఆ దేవతలనే ఆరాధించుచుందురు. అనగా అటువంటి చిల్లర దేవతల శరణు జొచ్చెదరు. అందుకే కాబోలు పూర్వము ఒక కవి యిలా అన్నాడు -

"చక్కెర మాని వేము దినజాలినకైవడి మానవాధముల్
పెక్కురు బక్క దైవముల వేమరు గొల్చెద రట్లకాదయా
మ్రొక్కిన నీకె మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవెయీవలెన్
తక్కిన మాటలేమిటికి............
అటువంటి కాముకులైన పురుషులలో నుండి .........

**7.21. యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి,
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్.**

అనగా – అనేక విధములగు కోర్కెలు కలిగియున్న భక్తులు సకామ భక్తులనబడుదురు. అటువంటి సకామభక్తులు ఏ యే దేవతలను మరియు వారి ఆ యా స్వరూపములను శ్రద్ధ మరియు భక్తిభావముతో కూడి అర్చన మరియు పూజలు చేయుటకు ప్రయత్నించుచుందురో ఆ యా భక్తులకు ఆ యా దేవతలకు సంబంధించిన ఆ శ్రద్ధాభావమును నేను పరమ దయా భావముతో స్థిరపరచుచుందును.

ఇట్లు చెప్పుట యందలి భావమేమన –

ఏ పురుషుడు ముందుగా తన స్వభావము ననుసరించి చిగురించిన ఏ శ్రద్ధాభావముతో ఏ దేవతా స్వరూపమును పూజించి, అర్చించగోరునో ఆ పురుషుని ఆ శ్రద్ధాభావమునే నేను స్థిరపరచుచుందును.

**7.22. స తయా శ్రద్ధయా యుక్తస్తస్యా రాధనమీహతే,
లభతే చ తతః కామాన్మయైవ విహితాన్హి తాన్.**

అనగా – నాచేత స్థిరపరచబడిన ఆ శ్రద్ధాభావముతో కూడియున్న ఆ పురుషుడు ఆ దేవతా స్వరూపమునే సేవించుచూ, పూజించుచూ వుండుటయందే నిమగ్నమై యుండును.

మరియు తనచే ఆరాధించబడుచున్న దేవతా విగ్రహము నుండి కర్మఫల విభాగమును ఎఱింగియున్న సర్వజ్ఞుడు ఈశ్వరుడను అయిన నా ద్వారా నిశ్చయించబడిన యిష్ట భోగములను ఆ పురుషుడు పొందుచుండును. ఆ భోగములన్నియూ పరమేశ్వరుని ద్వారా నిశ్చయించ బడియుండును. అందుచేత ఆతడు వాటిని తప్పక అనగా అనివార్యముగా పొందును.

ఇచ్చట **"హితాన్"** అను శబ్దమును వేఱుచేసి చూచినచో **భోగములందు హితత్వ మనునది ఏది కలదో** దానిని అప్రసిద్ధమని **తలంచవలయును.** ఏలయన ? వాస్తవముగా **భోగములు ఎటువంటివానికి గూడ మేలు చేయునవి అనగా శుభకరములు కానేరవు.**

ఏలయన ? ఆ కాముకులు మరియు అవివేకులు అయిన పురుషులు వినాశకరమైన వాటిని సాధించుటకు ప్రయత్నించుచుందురు. అందుచేత –

**7.23. అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్,
దేవాన్దేవయజో యాంతి మద్భక్తా యాంతిమామపి.**

అనగా - ఆ యల్పబుద్ధి కలిగియున్నవారి ఆ ప్రయత్న ఫలము అతి అల్పకాలమునందే నశించునదై యుండును. దేవయాజీ అనగా దేవతలను పూజించువారు దేవతలనే పొందుదురు. కాని నన్ను భజించు నా భక్తులు మాత్రము నన్నే పొందుదురు.

అన్నింటికంటె అతి పెద్ద దుఃఖకరమైన విషయమేమన - నిరంతరము శ్రమించుచూ వున్నప్పటికి మూర్ఖులైన యీ మానవులు అనంతమైన ఆనంద ఫలమును పొందుటకు కేవలము పరమేశ్వర స్వరూపుడనైన నన్ను అనగా నా యొక్క శరణు పొందుటకు ప్రయత్నించరు. ఈ విధముగా భగవంతుడు మూర్ఖులైన మానవులయందు దయాభావమును కలిగియున్నారు.

వారందరూ పరమేశ్వరుడనైన నన్ను ఎందులకు శరణుజొచ్చరు ? అంటే అందులకు కారణము చెప్పుచున్నారు -

**7.24. అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః,
పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్.**

అనగా - నాయొక్క వినాశరహితమైన, నిరతిశయమైన, అత్యుత్తమ భావమును అనగా నా యొక్క పరమాత్మ స్వరూపమును ఎఱుంగనటువంటి బుద్ధిహీనులైన, వివేకము లేనటువంటి మానవులు నేను నిత్య ప్రసిద్ధుడను మరియు సర్వలోకములకు ఈశ్వరుడను అయి వున్నప్పటికి నన్ను తెలియజాలక అనగా నా పరమేశ్వరత్వమును గుర్తింపజాలకయున్నారు. అంతేగాక యీయన ఇంతకు పూర్వము వేరు, యిప్పుడు ప్రకటితమైనారు అని నన్ను ఒక అనిత్యుడుగా తలంచుచున్నారు. అసలు భావమేమన - వీరు నాయొక్క వాస్తవికమైన ప్రభావమును అనగా శక్తిని రూపమును గుర్తించలేనివారై అట్లు తలంచుచున్నారు.

వారికి అటువంటి అజ్ఞానము కలిగియుండుటకు కారణమేమి ? అని అన్నచో యిట్లు చెప్పుచున్నారు -

**7.25. నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః,
మూఢో ఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్.**

అనగా - మూడు గుణములు అనగా సాత్విక, రజ, తమో గుణముల సమన్విత రూపమునే యోగమందురు. మరియు అదియే మాయ యనబడుచున్నది. ఆ యోగమాయ వలననే ఆచ్ఛాదితమై-కప్పబడి-యున్న నేను సమస్తప్రాణి సముదాయమునకు అవ్యక్తుడను అనగా ప్రత్యక్షముగా తోచనివాడనైయున్నాను. ఎచ్చటనో ఎవ్వరో ఒక మహాభక్తునికి నా రూపము ప్రత్యక్షమగుచుండును. ఆ కారణముచేత యీ మూర్ఖభావమునందు మునిగియున్న ప్రాణి సముదాయము జన్మరహితుడను, అవినాశిని, పరమాత్మ స్వరూపుడనైయున్న నన్ను గుర్తింపజాలక యున్నది.

ఏ యోగ మాయచే కప్పబడి పరమాత్ముడనై యున్న నన్ను లోకము ఎఱుంగదో అట్టి యోగమాయ నాకంటె వేఱుగా లేని వస్తువై యున్నందున మాయాధీశ్వరుడనైన నా ఈశ్వరత్వము జ్ఞానమునకు ప్రతిబంధకము కాజాలదు. అదెట్లన ? మాయావియైన పురుషుడు తన మాయకు తాను లోబడక యితరులను మాయకు లోబడునట్లు చేయునో అట్లే యీ మాయ జ్ఞానులను మాయ జేయజాలదు. అందువలన –

**7.26. వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన.**

అనగా – అర్జునా ! ఇంతకు పూర్వము రూపమును దాల్చియున్న ప్రాణులకు మరియు యిప్పుడు అనగా వర్తమాన కాలమునందు రూపములను పొందియున్న ప్రాణులకు మరియు యికముందు అనగా భవిష్యత్తులో రూపములను పొందనున్న ప్రాణులకు కారణ రూపమైన సర్వభూతములను నేనెరుంగుదును. కాని నన్ను శరణుజొచ్చిన భక్తుడు (జ్ఞాని) తప్ప మరి యే: యితర ప్రాణులు నన్నెఱుంగవు. ఆ విధముగా నా ప్రధాన తత్వమును యెఱుంగజాలకుండుటయే కారణముగ ఆ నాతత్వమును ఎఱుంగని మూఢజనులు నన్ను గుర్తించజాలకయున్నారు. ఆ కారణముగానే వారు నన్ను భజించుట లేదు.

మీ అనగా తమరి తత్వమును ఎఱుంగజాలకుండుటకు నిజమైన కారణమేమి ? ఆ ప్రతిబంధకము ఎటువంటిది ? జన్మించు స్వభావము కలిగియున్న ప్రాణులన్నియు దేనియందు మోహమును జెంది తమను అనగా మిమ్ములను గుర్తించలేకయున్నవి ? అని శ్రోత తెలియగోరినందున యిట్లు చెప్పుచున్నారు –

**7.27. ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వమోహేన భారత,**
**సర్వభూతాని సంమ్మోహం సర్గే యాంతి పరంతప.**

అనగా – ఇచ్ఛ అనగా కామము అనగా కోరికలతోను మరియు ద్వేషాది దుర్గుణములతోను జన్మించినవారు "ఇచ్ఛాద్వేషసముద్భావులు" అనబడుదురు. అలా జన్మించుటయే కారణముగ వారు ప్రాపంచిక విషయములందు మోహితులై నా తత్వమును ఎఱుంగజాలక యుందురు.

అటువంటివారు ఎవరు ? మరియు ఎట్లుందురు ? అని అన్నచో – చెప్పుచున్నారు–

ద్వంద భావము కలిగియున్నందువలన పుట్టిన మోహము వలన ప్రాణులన్నియు అసత్యములు మరియు అనిత్యములగు వస్తువుల ఎడల మోహమును చెందుచున్నవి. చల్లదనము మరియు వేడివలె పరస్పర విరుద్ధ స్వభావములు కలిగియున్న మరియు సుఖ–దుఃఖములు, మరియు వాటికి కారణములుగా వుండునటువంటి ఆ యిచ్ఛ మరియు ద్వేషభావములే సమస్త భూత తత్వముతో కూడియున్న ప్రాణులతో సంబంధము కల్పించుకొని ద్వంద్వములనబడు

చున్నవి. అందుచేత యీ ఇచ్ఛా-ద్వేషములు ఈ విధముగా సుఖదుఃఖములు మరియు వాటికి ఆ సుఖదుఃఖములకు కారణరూపములైన విషయములు ప్రాప్తించినపుడు ప్రకటితమగుచుండును. అప్పుడు అవి అనగా ఆ యిచ్ఛా ద్వేషాదులు సమస్త భూతముల యొక్క బుద్ధిని తన యధీనమందుంచుకొని పరమార్థతత్వ విషయికమైక జ్ఞానమును ప్రతిబంధించునటువంటి అనగా జ్ఞానము కలుగకుండ చేయునటువంటి మోహమును ఉత్పన్నము అనగా కలుగజేయుచున్నవి.

ఇచ్ఛా (కామ) ద్వేషరూపములైన దోషములందు చిక్కుకొన్న వాని చిత్తము బయట వుండియున్న విషయముల యొక్క యథార్థ తత్వజ్ఞానమును కలుగకుండజేయును. అప్పుడు ఆ రెంటివలన అనగా రాగ (కామ) ద్వేషాదుల వలన ఆచ్ఛాదితమైన బుద్ధిగలవాడు మూఢ బుద్ధిగలవాడై అనేక విధములుగా ప్రతిబంధ రూపములుగా వుండియున్న అంతరాత్మను గురించిన జ్ఞానమును పొందజాలకయున్నాడు.

అందుచేత ఓ అర్జునా ! ఆ యిచ్ఛా, ద్వేషజనితమైన ద్వంద్వ భావమును కలిగించుటకు కారణరూపమైన మోహము ద్వారా మోహమును జెంది ప్రపంచమునందలి ప్రాణులన్నియు తమ తమ నూతన దేహములను పొందుకాలము నందే మూఢభావమునందు చిక్కుబడిపోవు చున్నవి.

సారాంశమేమన ? **జన్మమును పొందు స్వభావములతో ఆ యా ప్రాణుల యొక్క జ్ఞానమునకు ప్రతిబంధకము ఏర్పడుచున్నది.** అలా మోహమును పొందియున్న ప్రాణులన్నియూ **తమకు ఆత్మరూపముగానే యుండి యున్నటువంటి** పరమాత్ముడనై యున్న నన్ను **అనగా నా తత్వమును** ఎఱుంగజాలకయున్నవి. అందుచేత ఆ ప్రాణులన్నియు ఆత్మభావముతో నన్ను భజించుట లేదు. అయితే యీ ద్వంద్వ మోహములకు వశీభూతులు కానటువంటి యే మహాత్ములు (మనుష్యులు) మిమ్ములను శాస్త్రములందు చెప్పబడిన ఆత్మభావ పద్ధతిలో భజించుచున్నారు ?

ఈ విధముగా కోరిన అర్థమును సవివరముగా చూపుట కొఱకు చెప్పుచున్నారు -

## 7.28. యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్, తే ద్వంద్వమోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః.

అనగా - పూర్వ పూర్వ దేహధారణ కాలములందు ఏ పుణ్యాత్ములు తమ పుణ్యకర్మల ద్వారా తాము చేసిన పాపకార్యముల ఫలములను అంతముచేసికొని యున్నారో అనగా ఏ పురుషులు తమ పవిత్ర కర్మల ద్వారా తమ యంతఃకరణములను శుద్ధము గావించుకొని యున్నారో వారు పుణ్యకర్ములు చేసినవారగుదురు. అటువంటి పైన చెప్పబడిన ద్వంద్వ మోహాదుల నుండి విముక్తులైయున్నారో ఆ దృఢవ్రతులైన పురుషులు పరమాత్ముడనై యున్న నన్ను భజింతురు. "పరమార్థ తత్వము సరిగ్గా యిలాగే యున్నది. రెండవ విధముగా అనగా యిందులకు విరుద్ధముగాలేదు" అని తెలిసికొనిన నిశ్చిత విజ్ఞానమును గుర్తించిన పురుషులు **"దృఢవ్రతులు"**

అని చెప్పబడుదురు. అటువంటి దృఢవ్రతులు ఏ లాభము కొఱకు భజింతురు? అన్నచో చెప్పుచున్నారు -

**7.29. జరామరణ మోక్షాయ మామాశ్రిత్య యతంతి యే,**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలం.**

అనగా - ఏ పురుషులు ముసలితనము మరియు మృత్యువు నుండి విడువడుటకు పరమేశ్వరుడనైన నన్ను ఆశ్రయించి అనగా తమ చిత్తములను నాయందు లీనముగావించ ప్రయత్నింతురో అట్టివారు పరబ్రహ్మతత్వమును ఎరింగినవారగుదురు. మరియు సమరత అధ్యాత్మ అనగా అంతరాత్మ విషయమైన వస్తువును మరియు సమస్త సమరత కర్మలను ఎఱింగివారగుదురు.

**7.30. సాధి భూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః,**
**ప్రయాణకాలే ఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః.**

అనగా - ఈ ప్రకారముగా ఏ పురుషులు పరమేశ్వరుడనైయున్న నన్ను **అధిభూతములు మరియు అధి దైవముల సమేతముగా** ఎఱుంగుదురో మరియు సాధియజ్ఞము అనగా అధియజ్ఞ సమేతముగా నన్ను గుర్తింతురో అట్టివారు నిరుద్ధ చిత్తయోగి అనగా తన చిత్తమును తన యధీనము నందుంచుకొన్నటువంటి యోగులు మరణ సమయమునందు గూడ నన్ను పూర్వమువలెనే ఎఱింగియుందురు.

శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి
జ్ఞాన విజ్ఞానయోగమనబడు ఏడవ అధ్యాయమునకు
శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు
తెనుగు అనువాదము సమాప్తము .
అనువాదకులు : శ్రీ సదానందభారతి. ప్రణవాశ్రమము.

# ఎనిమిదవ అధ్యాయము

"తేబ్రహ్మ తద్విదుః కృత్స్నమ్" మొదలగు పదముల ద్వారా పూర్వ అధ్యాయము నందు భగవానుడు అర్జునుని కొరకు ప్రశ్నాబీజములను వుపదేశించి యున్నాడు. అందువలన ఆ ప్రశ్నలను భగవంతుని ముందుంచుతూ అర్జునుడు యిట్లు ప్రశ్నించుచున్నాడు -

**8.1. కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ,**
**అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే.**

**8.2. అధియజ్ఞః కథం కో ఽత్ర దేహే ఽస్మిన్మధుసూదన,**
**ప్రయాణకాలే చ కథం జ్ఞేయో ఽసి నియతాత్మభిః.**

అనగా - ఓ పురుషోత్తమా ! బ్రహ్మమనగా ఎట్లుండును ? అధ్యాత్మమనగా ఏమి? '**అధిభూత**'మని దేనినందురు ? అధిదైవమని దేనిని చెప్పుదురు ? ఈ దేహమునందు '**అధియజ్ఞ**' మేది ? అది ఎట్లుండును ? అదియును గాక సంయత చిత్తులైన యోగుల ద్వారా వారి మరణ కాలమందు వారికి మీరు ఎట్లు తెలియబడుదురు ?

ఈ ప్రశ్నలన్నింటిని ముందుగా క్రమబద్ధము జేసి నిర్ణయించి వ్యాఖ్యానించ దలంచి భగవానులు యిట్లు చెప్పినారు -

**8.3. అక్షరం బ్రహ్మ పరమం స్వభావో ఽధ్యాత్మ ముచ్యతే;**
**భూత భావోద్భవకరో విసర్గః. కర్మ సంజ్ఞితః**

అనగా - "పరమము అక్షర బ్రహ్మము అయి వున్నది. అనగా ఓ గార్గీ ! ఆ యక్షరమైన బ్రహ్మ యొక్క శాసనమందే అనగా అధీనమునందే ఈ సూర్యుడు ఈ చంద్రుడు స్థిరముగా వుండియున్నారు."

"అక్షరం నక్షరతి యితి పరమాత్మా తస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి" (చూ. బృ.ఉ. 3.8.9) ఇతి శ్రుతేః మొదలగు శృతుల ద్వారా ఏ వస్తువు - తత్వము - వర్ణించబడినదో మరియు ఏది అక్షరమో అనగా నాశము లేనిదై యున్నదో అదియే ఆ పరమాత్మయే 'బ్రహ్మము' అయివున్నది.

"పరమ" అను విశేషణ శబ్దము ద్వారా చెప్పబడిన కారణముగా యిచ్చట "**అక్షరము**" అను శబ్దము ద్వారా "ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ" అను ఈ వాక్యమునందు వర్ణించబడిన 'ఓం'కారము గ్రహించబడలేదు. అట్లేలయన ? "పరమ" అను విశేషణ శబ్దము నిరతిశయమైన అక్షరబ్రహ్మయందే మిక్కిలి వుపయుక్తముగా వుండియున్నది.

ఆ పరబ్రహ్మమే ప్రతి ప్రాణియొక్క శరీరమునందు అంతరాత్మ రూపముతో - భావముతో నిండియున్నది. దానినే స్వభావము అని అందురు. ఆ స్వభావమే "అధ్యాత్మ"ము అని చెప్పబడుచున్నది.

ఇచ్చట వక్త యొక్క అభిప్రాయమేమనగా - **ఆత్మ అంటే** శరీరమును ఆశ్రయించి **అంతరాత్మభావముతో ఆ దేహమునందుండునది. మరియు పరిణామ క్రమములో పరమార్థమైన బ్రహ్మమే, ఆ బ్రహ్మతత్వమే స్వభావమనబడుచున్నది. ఆ స్వభావమునే అధ్యాత్మమందురు. అనగా ఆ బ్రహ్మతత్వ స్వభావమే 'అధ్యాత్మ'ము అను నామముతో పిలువబడుచున్నది.**

"భూతభావ ఉద్భవకర" అనగా భూతముల యొక్క సత్త అనగా వునికి అనగా శక్తి భూతభావ మనబడుచున్నది. దానియొక్క ఉత్పత్తి **"భూతిభావోద్భవము"** అయి వున్నది. అలా భూతభావములను కల్పించువాడు **"భూతభావోద్భవకరుడు"** అనగా భూత పదార్థములను కల్పించువాడు. ఇలా విసర్గ అనగా దేవతల వుద్దేశ్యానుసారముగా 'చరు' "పురోదాశ్" మొదలగు హవనము చేయుటకు తగియున్న ద్రవ్యములను త్యజించవలసి యున్నది. **ఆ త్యాగరూప యజ్ఞము "కర్మ" అను పేరుతో పిలువబడుచున్నది.** ఈ బీజరూప యజ్ఞము వలననే వృష్టి (వర్షము) మొదలగు క్రమముతో స్థావర - జంగమము మొదలగు సమస్త భూత సముదాయ రూపములైన ప్రాణులు కల్పించబడుచున్నవి.

**8.4. అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్,**
**అధియజ్ఞో౽హమేవాత్ర దేహే దేహభృతాం వర.**

అనగా - సర్వ ప్రాణులను ఆశ్రయించియుండునది **'అధిభూత'మనబడును.** 'అధిభూత'మనగా ఏమి ? అన్నచో - **క్షరము అనగా నశించు స్వభావము గల పదార్థము. అనగా జన్మించు అనగా రూపము దాల్చు స్వభావము గల పదార్థములన్నియు 'అధిభూత' ములే.**

**పురుషుడు అనగా** ఎవనిచే యీ ప్రపంచమంతయు నిండియున్నదో లేక ఏ పదార్థము **శరీర (దేహ) రూప పురమునందు నిండియున్నదో అట్లు నిండియుండుటచే అది 'పురుషుడు' అని చెప్పబడుచున్నది.** అది సర్వప్రాణుల యొక్క యిద్రియాది కారణములకు కారణమై సూర్యలోకమునందుండు **హిరణ్యాగర్భుడు "అధిదైవతము"** అనబడుచున్నది.

**'యజ్ఞమే విష్ణువు'** అను శృతిననుసరించి సర్వవిధ **యజ్ఞములకు మూలము 'విష్ణువు' అనబడు దేవతయే.** అదియే అనగా **ఆ దేవతయే "అధియజ్ఞము"** అనబడును. మానవుని దేహమునందు యే యజ్ఞము అనగా దేహమునకు కారణ రూపమైన పదార్థము కలదో దానికి అధిష్ఠాత అనగా కారణరూపమైన అనగా విష్ణురూపమైన అధియజ్ఞమును అనగా మూల పదార్థమును నేనే. **యజ్ఞము దేహము ద్వారానే సిద్ధించును. అందుచే యజ్ఞమునకు దేహాదులతో నిత్య సంబంధము కలిగియుండును.** అందుచేతనే యజ్ఞమనబడునది దేహాదులయందే నిండి **యుండును అని** చెప్పబడుచున్నది.

**8.5. అంతకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కలేవరమ్,**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః.**

అనగా - మరియు యే పురుషుడు అంత్యకాలమునందు అనగా మరణ కాలమునందు అనగా స్థూల దేహమును త్యజించి వెళ్ళు సమయమందు పరమేశ్వరుడను అనగా విష్ణుతత్త్వముతో కూఢియున్న నన్ను స్మరించుచూ దేహత్యాగము చేయునో ఆతడు నా భావమునే అనగా విష్ణువనబడు పరమతత్త్వ రూపమునే పొందును. ఈ విషయమునందు అనగా విష్ణుతత్త్వము ప్రాప్తించునా లేదా అను విషయమునందు ఎటువంటి సంశయమున్నూ లేదు.

కేవలము నా విషయమునందే యిట్టి నియమము లేదు. కాని .....

**8.6. యం యం వాపి స్మరంభావం త్యజత్యంతే కలేవరమ్,**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః.**

అనగా - జీవునకు దేహముతో, ప్రాణములతో వియోగము కలుగుచున్నప్పుడు జీవుడు అనగా సూక్ష్మశరీరధారి తన అంతరింద్రియములైన మనోబుద్ధులయందు ఏ ఏ భావములు అనగా ఏదో తనకు తోచిన లేక నచ్చిన దేవతను గురించి తలంచుచూ దేహత్యాగము చేయునో, ఆ భావముతో భావితుడై ఆ దేవతనే స్మరించుచూ ఆ దేవతనే పొందును. ఇతరులను పొందజాలడు. ఉపాసనా దేవతాభావము కలిగి యుండుటను **"తద్భావము"** అని అందురు. ఎవడు ఎటువంటి దేవతా భావము కలిగి ఆ దేవతను గురించి చింతించు, స్మరించుచుండునో అట్టి భావమును **"తద్భావభక్తి"** అందురు. అందుచేత ఆ తద్భావభక్తి కారణముగ అటువంటి ఫలమునే పొందును. **"యద్భావం తద్భవతిః"** అనగా **ఎటువంటి భావము స్థిరపడి యుండునో అటువంటి ఫలమే కలుగును.**

అట్లేలయన ? ఈ విధముగా ప్రస్తుత దేహవియోగకాలమందు స్థిరపడియున్న భావమే తదుపరి దేహప్రాప్తికి కారణమగుచున్నది -

**8.7. తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ,**
**మయ్యర్పితమనో బుద్ధిర్మామేవైష్యస్యసంశయః.**

అనగా - అందువలన నీవు ప్రతిక్షణము నన్నే స్మరించుచుండుము. మరియు శాస్త్రము ఆజ్ఞాపించినట్లుగా స్వధర్మరూపమైన యుద్ధము కూడ చేయుము. ఈ విధముగా వాసుదేవనామధారియైన నా యందు ఎవడు తన మనోబుద్ధులను అర్పించునో నీవు కూడ ఆ విధముగానే నీ మనోబుద్ధులను నాకు అర్పించినవాడవై నన్నే అనగా నా యొక్క తత్త్వమునే నీవు ఆరాధించిన నా రూపమును పొందుదువు. ఇందు యిసుమంతయు సందియము లేదు.

మరియు -

8.8. అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా,
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్.

అనగా - ఓ పార్థా ! అభ్యాసముచే యోగయుక్తమైన మరియు అనన్యగామి అనగా యితరమును గురించి చింతించనటువంటి చిత్తము ద్వారా అనగా చిత్తమును సమర్పించుటకు ఆశ్రయభూతమైన పరమాత్మ స్వరూపుడనైయున్న ఒక్క **నాయందే విజాతీయమైన అనగా నా కంటే భిన్నముగా లేనటువంటి హితమైనటువంటి** సమప్రతీతి యొక్క **ఆవృత్తినే అభ్యాసమందురు. అటువంటి అభ్యాసమునే యోగమందురు.** అటువంటి అభ్యాసరూపమైన యోగముతో కూడియున్న, ఆ ఒక్క ఆధారవస్తువునందే లగ్నమైయున్న మనస్సును విషయాంతరములయందు యున్న మనస్సును పోనివ్వకుండ నాయందే నిలిపి వుంచినట్టి యోగి యొక్క చిత్తము ద్వారా శాస్త్రమును మరియు గురుదేవుల వుపదేశానుసారముగ ధ్యానించుచూ వున్న యోగి పరమ నిరతిశయమైన **దివ్యపురుషుని అనగా ఆకాశమంతయు నిండి సూర్యమండలము నందు వెలుగుచున్న** పరమ **పురుషుని** (పొందెదవు) పొందును.

ఎటువంటి లక్షణములు కలిగియున్న పరమపురుషుని యోగియైనవాడు పొందును? అన్నచో చెప్పుచున్నారు -

8.9. కవిం పురాణమనుశాసితారమణోరణీయాం స మనుస్మరేద్యః,
సర్వస్య ధాతారమచింత్యరూప మాదిత్య వర్ణం తమసః పరస్తాత్.

అనగా - ఏ పురుషుడు భూత, భవిష్యత్ వర్తమానములను ఎరింగినవాడై యుండునో అనగా సర్వజ్ఞుడై యుండునో పురాతనుడు అనగా **ఆదియను** నది లేనివాడు, సమస్త ప్రపంచమును శాసించువాడు మరియు అణువుకంటే గూడ అనగా సూక్ష్మము కంటే గూడ సూక్ష్మతరమైన పరమాత్మని యొక్క గుణములు గలవాడు అనగా సంపూర్ణమైన కర్మఫలములను విధించు సామర్థ్యము గలవాడు అనగా అతి విచిత్రముగా విభజించి సర్వవిధ ప్రాణులకు ఆ యా ప్రాణులచే చేయబడిన కర్మల యొక్క ఫలములను వారికే చెందునట్లుగా చేయువాడు మరియు **అచింత్య స్వరూపుడు అనగా ఆయన స్వరూపమిట్లుండునని ఊహించుటకు గూడ సాధ్యపడని రూపముగలవాడై** అనగా ఆయన యొక్క రూపము ప్రత్యక్షముగా వుండి సర్వము నందు వ్యాపించి యున్నప్పటికి ఎవని చేతను యిట్లున్నదని చెప్పుటకు అలవిగానటువంటిదై యున్నది. మరియు సూర్యునివంటి వర్ణము గలవాడు అనగా సూర్యునివలె నిత్యమై, చైతన్యవంతమై ప్రకాశముగల వర్ణము గలవాడై వున్నాడు. మరియు అజ్ఞానరూపమయిన అంధ కారమునకు పూర్తిగా భిన్నత్వము గలవాడై యున్నాడు. అటువంటివానిని యోగియైన పురుషుడు సర్వవేళలయందును స్మరించుచుండును.

ఆ విధమగు యోగి ఆ పరమపురుషుని స్మరించుచూ ఆ పరమ పురుషునే యీ స్థూల దేహవియోగానంతరము పొందును. ఈ విధముగా పూర్వ శ్లోకముతో ఈ శ్లోకము సంబంధమును కలిగి యున్నది.

మరియు –

**8.10. ప్రయాణకాలే మనసా౽చలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ; భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరంపురుషముపైతి దివ్యమ్.**

అనగా – ఏ యోగియైనవాడు తన స్థూల దేహ వియోగ సమయమున భక్తి మరియు యోగము వలన లభించిన బలముతో కూడిన మనస్సుగలవాడై అనగా భక్తి యనగా భజనతో కూడియున్న మనస్సుగలవాడై మరియు **సమాధి ద్వారా సంపాదించబడిన సంస్కారముల సంగ్రహము వలన కలిగియున్నట్టి చిత్త స్థిరత్వమును యోగబలమందురు,** అటువంటి బలముతో కూడియున్నవాడై చాంచల్యము లేనట్టి అచలమైన మనస్సుతో, ముందుగా హృదయ కమలమునందు చిత్తమును స్థిరపరచి అటుపైన పై వైపునకు వెళ్ళుచున్నట్టి నాడి ద్వారా చిత్తము యొక్క ప్రతి అంశమును క్రమముగా జయించుచూ భ్రుకుటి మధ్య భాగమునందు ప్రాణములను నిలిపియుంచి అతి సావధాన చిత్తుడైన అనగా పరమాత్మ స్వరూపమును చిత్తమునందు నింపినవాడైన బుద్ధిమంతుడైన యోగి "కవిం పురాణం" మొదలగు లక్షణములు కలిగియున్న ఆ దివ్య అనగా **చేతనత్వ రూపమున సర్వ వ్యాపకుడైయున్న ఆ పరమ పురుషుని పొందును.**

ఇలా అయినప్పటికీ భగవంతుడు ముందు చెప్పబడునటువంటి వుపాయముల ద్వారా పొందయోగ్యమైన మరియు "వేదవిదో వదంతి" మొదలగు విశేషణముల ద్వారా వర్ణించదగియున్న బ్రహ్మ పదార్థమును ప్రతిపాదించుచున్నారు.

**8.11. యదక్షరం వేదవిదో వదంతి విశంతి యద్యతయో వీతరాగాః, యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే.**

అనగా – ఓ గార్గి ! బ్రాహ్మణులైనవారు అనగా బ్రహ్మతత్త్వమును బాగుగా ఎరింగిన వారు యీ అక్షరమైన పదార్థమునే వర్ణించుచుందురు. (యద్ అక్షరం న క్షరతి యితి అక్షరమ్, అవినాశి వేదవిదో వేదార్థజ్ఞా, వదంతి 'తద్వా ఎతదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంతి. (చూ. బృ.ఉ. 3.8.8))

ఈ శృతిననుసరించి వేదము యొక్క పరమార్థమును ఎరింగిన మహనీయులు – విద్వాంసులు – ఏ అక్షర పదార్థమును గురించి అనగా దేనికి త్రికాలములయందును నాశము లేదో అటువంటి పరమాత్మ తత్త్వమును గురించి "అది స్థూలమైనది కాదు. సూక్ష్మమైనది గూడ కాదు" అని సర్వవిధ విశేషణములను నిరాకరించి వర్ణించుచుందురో – (సర్వ విశేషనివర్తకత్వేన అభివదంతి అస్థూలమనణు" (బృ.ఉ. 3.8.8.)) మొదలగునవి.

మరియు ఎవని యొక్క ఆసక్తి పూర్తిగా నశించిపోయినదో అటువంటి వీతరాగుడు, మరియు నిరంతరము ప్రయత్నశీలుడైన సంన్యాసి యదార్థమైన జ్ఞానము కలిగిన తదనంతరము దేనియందు ప్రవేశించునో -

మరియు 'అక్షర' తత్త్వమును ఎరుంగగోరువారు అనగా సాధకులు గురువుల నాశ్రయించి ఆశ్రమముల యందుండి బ్రహ్మచర్యమును అవలంభించి సాధన చేయుచుందురు.

ఈ "అక్షరము" అను పదము అనగా స్థితిని పొందగోరు స్థానము నేను యిప్పుడు నీకు సంక్షిప్తముగా చెప్పెదను వినుము -

పూర్వము సత్యకాముడు అను సాధకుడు అడిగినప్పుడు పిప్పలాదుడను ఋషి యిట్లు చెప్పియున్నాడు -

సత్యకాముడు - గురువునుద్దేశించి - "ఓ భగవత్స్వరూపా ! మనుష్యుల యందు ఒకానొకడు స్థూలదేహత్యాగ పర్యంతము 'ఓం'కారమును చక్కగా ధ్యానించుచుండిన ఎడల **ఆతడు ఆ సాధన ద్వారా స్థూల దేహత్యాగానంతరము ఎటువంటి లోకమును పొందును ?"** అని అడుగగా అప్పుడు ఆ మహర్షి - "ఓ సత్యకామా ! ఈ 'ఓం' కారమే నిస్సందేహముగా పరబ్రహ్మమే. మరియు యిదియే అపర బ్రహ్మము కూడాను" అని చెప్పి యున్నాడు. ఈ విధముగా విషయమును ఆరంభించి మరల "ఎవ్వడైనా సరే ఈ మూడు మాత్రలు కలిగియున్న **'అ, ఉ, మ' 'ఓం'** అను అక్షరమును ధ్యానించుట ద్వారా ఆ పరమపురుషునే వుపాసించుచుండును ప్రశ్నోపనిషత్తునందు -

"అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్" ఇతి చ ఉపక్రమ్య "సర్వే వేదా యత్పదమామనంతి తపాంసి సర్వాణి చ, యద్వదంతి, యదిచ్ఛంతో బ్రహ్మచర్య చరంతి తత్తేపదం సంగ్రహేణ బ్రవీమ్యో మిత్యేతత్" (చూ. కఠోపనిషత్తు 1-2-14-15) ఇత్యాదిభిః చ వచనైః.

అనగా - "ధర్మము కంటే విలక్షణముగా ఏది వున్నదో మరియు అధర్మము కంటే గూడ విలక్షణముగా యున్నదో" ఈ విధముగా ఆరంభించి, మరల "సమస్తమైన వేదములు" ఏ పరమపదమును గురించి వర్ణించుచున్నవో మరియు సమస్త తపములు దేనిని గురించి చెప్పుచున్నవో మరియు ఏ పరమపదమును పొందగోరువారు బ్రహ్మచర్య వ్రతమును పాటించుచున్నారో అట్టి ఆ పరమ పదమును గురించి నీకు నేను సంక్షిప్తముగా చెప్పెదను. అది 'ఓమ్' అన అక్షరము. ఇదియే కఠోపనిషత్తు నందు చెప్పబడినది.

**పరబ్రహ్మమునకు వాచ్యార్థమును చెప్పునదై యున్నందున** మరియు ప్రతిమ వలె **దానికి ప్రతీక (చిహ్నము, గుర్తు)గా యున్నందున** మందులు అనగా మందబుద్ధిగలవారు. మరియు మధ్యమ బుద్ధి గల సాధకుల కొరకు పరబ్రహ్మ పరమాత్మను పొందుటకు సాధన రూపముగా చెప్పబడినదో **ఆ ఓంకారము యొక్క వుపాసన కాలాంతరమునందు ముక్తి రూపమైన ఫలమును యిచ్చునదై యున్నదని చెప్పబడినది.**

ఇచ్చట గూడ "కవిం పురాణమను శాశితారమ్" "యదక్షరం వేదవిదో వదంతి" ఈ విధముగా ప్రతిపాదించిన పరబ్రహ్మ ప్రాప్తికి పైన చెప్పబడినట్లుగా ఉపాయసాధనమైన

ఓంకారము, కాలాంతరమందు ముక్తి రూపమైన ఫలమును కల్పించునట్టి ఆ వుపాసనయే యోగధారణా సహితముగా చెప్పవలసి యున్నది. మరియు దానిని చెప్పు సందర్భమునందే తోచు అనేక విషయములు గూడ చెప్పవలసి యున్నవి. అందుకొరకై ముందు చెప్పబోవు గ్రంథము ఆరంభించబడుచున్నది.

**8.12. సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ,**
**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్.**

అనగా – సమస్త ద్వారములను అనగా విషయములను కల్పించునటువంటి ద్వార రూపములుగా యున్న సమస్త యింద్రియ గోళకములను సంయమించి మరియు మనస్సును హృదయకమలము నందు నిలిపి వుంచి అనగా సంకల్ప – వికల్పములను కలుగనీయక. అటుపైన వశమునందుంచుకోబడిన మనస్సు యొక్క సహాయముతో హృదయము నుండి పైకి పోవుచుండు నాడి ద్వారా పైకి ఎక్కి తమ ప్రాణములను తల (నుదుటి) యందు స్థిరపరచి యోగధారణను నిలిపి వుంచుటకై ప్రయత్నించు సాధకుడు పరమగతిని అనగా మోక్షమును పొందును.

ముందు శ్లోకమును గూడ దీనితో కలిపి చూడుము.

అచ్చటనే అనగా మస్తకమునందే ప్రాణములను స్థిరముగా వుంచి –

**8.13. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్,**
**యః ప్రయాతి త్యజందేహం స యాతి పరమాం గతిమ్.**

అనగా – 'ఓం' అను ఈ ఒక్క అక్షరరూపమైన బ్రహ్మయొక్క అనగా బ్రహ్మ యొక్క స్వరూపమునకు ప్రతీకయైన 'ఓం'కారమును వుచ్చరించుచూ మరియు దానియొక్క అర్థరూపమైన **ఈశ్వరుడగు నన్ను ధ్యానించుచూ** ఏ పురుషుడు తన స్థూలదేహమును త్యజించి పరలోకమునకు పయనమైపోవునో

ఆతడు, ఈ విధముగా స్థూలదేహమును త్యజించి వెళ్ళువాడు పరమగతిని పొందును. ఇచ్చట "త్యజందేహమ్" అను పదము అనగా విశేషణము 'మరణమును' సూచించుటకై చెప్పబడినది. కాని అభిప్రాయమేమన – దేహ త్యాగముతో ఆత్మకు మరణము సంభవించును గాని స్వరూపమునకు నాశము కలుగదు. ఆత్మయనగా దేహమునందున్న చైతన్యము సముద్రమునందు నీటితో నిండియున్న ఘటము పగిలినప్పుడు ఘటజలము నశించును గాని అసలు జలము నశించదు. ఘటజలము మహాజలరూపమును దాల్చును.

మరియు –

**8.14. అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః,**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః.**

అనగా – అనన్య చిత్తుడు అనగా ఎవని చిత్తము యితరమైన ఏ విషయమును తలంచక కేవలము నన్నే స్మరించుచూ వుండునో అట్టి చిత్తముగల యోగి సర్వదా నిరంతరము

ప్రతిక్షణము పరమేశ్వరుడనైన నన్నే స్మరించుచుండునో ఇచ్చట 'సతతమ్' అను శబ్దము ద్వారా నిరంతరము అనగా తెంపులేనటువంటి అను అర్థము చెప్పబడినది. మరియు 'నిత్యశః' అను శబ్దము ద్వారా అనంత కాలము వరకు అను భావము చెప్పబడినది. అందువలన ఆరు మాసములో లేక ఒక సంవత్సర కాలమో లేక జీవన పర్యంతము ఎవడు నన్ను స్మరించుచుండునో అని తాత్పర్యము. అటువంటి నత్య సమాధియందున్న యోగికి నేను అత్యంత సులభముగా లభించెదను. అనగా అట్టి యోగికి నేను అనాయాసముగా లభింతును. యదార్థమైన స్థితి యిట్లున్నది గావున ప్రతి మానవుడు నాయందే చిత్తము గలవాడై సర్వకాల సర్వావస్థలయందును మనస్సును నాయందే లగ్నము చేసి వుంచుకొనవలయును.

ప్రశ్న – తమరు సులభముగా లభించినందువలన కలుగు ఫలమేమి ?

**సమాధానము** – నన్ను సులభముగా పొందినందువలన ఎట్టి ఫలము కలుగునో చెప్పెద, వినుము –

**8.15. మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్,**
**నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః.**

అనగా – ఈశ్వరుడైన నన్ను పొంది అనగా నా భావమును పొందిన ఆ మహాత్ములు తిరిగి స్థూల సూక్ష్మకారణ దేహాదులను అనగా తిరిగి జన్మమును పొందరు.

ఏ విధమైన పునర్జన్మను పొందరు ? అను విషయమును విశదపరచుచూ చెప్పుచున్నారు.

ఆధ్యాత్మికము మొదలగు దుఃఖములకు ఆలవాలమైన అనగా ఆధారరూపమైన అనగా సర్వవిధ దుఃఖములు దేనియందుండునో, కేవలము దుఃఖములకు కేంద్రమగుటయే గాక అశాశ్వతమైనదియు అయివున్నదో అనగా దేనియొక్క స్వరూపము స్థిరమైనదికాదో, అటువంటి పునర్జన్మను మోక్షరూపమైన పరమస్థితిని పొందిన మహాత్ములు, సంన్యాసులు పొందరు. కాని ఎవరు నన్ను పొందరో వారు మాత్రము తిరిగి ప్రపంచమును పొందుదురు.

అయితే మిమ్ములను తప్ప యితర స్థానములను పొందువారు తిరిగి సంసారమును పొందుదురా ? అన్నచో చెప్పుచున్నారు –

**8.16. ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినో ఽర్జున,**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే.**

అనగా – దేనియందు ఈ ప్రపంచమందలి ప్రాణులన్నియు రూపములు దాల్చి కొంతకాలము పాటు తమ జీవిత వ్యాపారమును సాగించుచున్నవో ఆ ప్రపంచమును "భువనము' ' అని అనుచున్నారు. బ్రహ్మ నివసించు లోకము బ్రహ్మభువన మనబడుచున్నది. అర్జునా ! బ్రహ్మలోక పర్యంతము అనగా బ్రహ్మలోకముతో సహా సమస్త లోకములు పునరావృత్తి

కలిగియున్నవి. అనగా కొంతకాలము వున్నట్లుగా తోచి, మరికొంత కాలము లేకుండా పోయి మరల తిరిగి వచ్చి వున్నట్లుగా తోచుచుండును. కాని ఎవడు నన్ను పొందునో ఆతనికి ఆ పునరావృత్తి కలుగదు. బ్రహ్మలోకముతో సహా సమస్త లోకములకు పునరావృత్తి కలిగిష్టండుటకు కారణమేమి ? అన్నచో అవి కాలమునకు లోబడియున్నవి. అందుచేత కాలముతో పాటు వచ్చుచూ పోవుచూ అనగా కలుగుచూ గుప్తమగుచూ వుండును. కాలముతో ఈ లోకములకు పరిచ్ఛిన్నత్వము ఎట్లు కలుగుచున్నది ? అని అన్నచో చెప్పుచున్నారు -

**8.17. సహస్ర యుగపర్యంత మహర్యద్బ్రహ్మణో విదుః,**
**రాత్రిం యుగసహస్రాంతాం తే ౽హోరాత్ర విదో జనాః.**

అనగా - బ్రహ్మ - ప్రజాపతి అనగా విరాట్టు యొక్క ఒక్క దినమును ఒక వేయి సంవత్సరములు గడువు కలదిగా అనగా ఏది ఒక వేయి సంవత్సరముల కాలమందు అంతమొందునో దానిని అట్లు తలంచెదరు.

మరియు బ్రహ్మ యొక్క ఒక్క రాత్రిని గూడ సహస్ర యుగములు కాలము కలిగినదిగా అనగా పగలువలెనే తలంతురు.

అలా అని ఎవరు తలంచుచున్నారు ? అన్నచో యిట్లు చెప్పుచున్నారు -

ఆ పగలు మరియు రాత్రిల యొక్క తత్వమును ఎరింగినవారు అనగా కాలము యొక్క పరిమాణమును ఎరింగినటువంటి యోగులు అలా ఎరుంగుదురు. ఈ విధముగా కాలముతో పరిచ్ఛిన్నత్వము (వేరుగా తొలగిపోవుట) కలుగుచున్న కారణముగ ఆ లోకములన్నియు పునరావృత్తి స్వభావము కలిగియున్నవే అయివున్నవి.

ప్రజాపతి యొక్క పగలు మరియు రాత్రులయందు ఏమి జరుగుచుండునో ఆ విషయమును చెప్పుచున్నారు -

**8.18. అవ్యక్తా త్వ్ యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే,**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్త సంజ్ఞకే.**

అనగా - పగటి యొక్క ఆరంభకాలము పేరు **"అహరాగమ"** అయి వున్నది. బ్రహ్మ యొక్క దినము (పగలు) యొక్క ఆరంభకాలమందు అనగా బ్రహ్మ యొక్క ప్రబోధకాలమందు అవ్యక్తము నుండి ప్రజాపతి యొక్క నిద్రావస్థ నుండి సమస్తమైన వ్యక్తులు - స్థావర - జంగమ రూపములు గల సమస్త ప్రజలు అనగా ప్రాణులు ఉత్పన్నమగుచున్నవి. అనగా స్థూలరూపమును పొందుచున్నవి. అనగా ప్రకటితమగుచున్నవి. వ్యక్తమగు పదార్థములన్నియు వ్యక్తములు - లేక **వ్యక్తులు అనబడుచున్నాయి.**

అటు తరువాత రాత్రి కలిగినప్పుడు - బ్రహ్మము నిద్రించు కాలము నందు ఆ పైన చెప్పబడిన అవ్యక్తమనబడు ప్రజాపతియొక్క నిద్రావస్థయందు సమస్త ప్రాణులు లీనమై పోవును

చేయని కర్మల ఫలము ప్రాప్తించుట మరియు చేసిన కర్మల యొక్క ఫలము లభించకపోవుట అను దోషమును పరిహరించుట కొరకు, బంధము మరియు విముక్తి మార్గములను గురించి చెప్పుశాస్త్ర వాక్యముల యొక్క ఋజుత్వమును సార్ధకపరచుట కొరకు మరియు అవిద్య మొదలగు ఐదు దుఃఖకారకములైన కర్మ సంస్కారముల యందు చిక్కుకొని పరాధీనమైయున్న ప్రాణి సముదాయము పుట్టుట చచ్చుటయును దుఃఖమును అనుభవించుచున్నది. వీటినన్నింటిని సప్రమాణముగ వివరించి ప్రపంచము పట్ల వైరాగ్య భావమును కలిగించుటకై ఈ క్రింది విధముగా చెప్పుచున్నారు -

**8.19. భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే,**
**రాత్ర్యాగమే ఽవశః పార్థ ప్రభవత్యహరాగమే.**

అనగా - మొదటి కల్పమునందున్నదే తిరిగి రెండవ కల్పమునందు రాదు. ఈ స్థావరజంగమ అనగా జడ చేతన రూపమున వున్న భూతముల యొక్క సముదాయము బ్రహ్మ యొక్క పగలుతో ఆరంభమై పగటి యొక్క అంతము నందు బ్రహ్మ యొక్క రాత్రి ఆరంభమైనప్పుడు పరాధీనత్వమును పొందినదానివలె ప్రతిసారి జన్మమరణములను అనగా స్థితిలయములను పొందుచుండును.

ఏ అక్షరమైన దానిని గురించి యింతకు పూర్వము కొంచము చెప్పబడినదో దానిని పొందు వుపాయము "ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ" మొదలగు పదముల ద్వారా చెప్పబడినది. ఇప్పుడు ఆ అక్షర పదార్ధము యొక్క స్వరూపమును గురించి చెప్పదలంచి యీ క్రింది విధముగా చెప్పబడుచున్నది. అదేమన యోగమార్గము ద్వారా ఫలానా వస్తువు లేక తత్వము లభించునని చెప్పబడుచున్నది.

**8.20. పరస్తస్మాత్తు భావో ఽన్యో ఽవ్యక్తో ఽవ్యక్తా త్సనాతనః,**
**యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి.**

అనగా - ఇచ్చట 'తు' అను శబ్దము ముందు వర్ణించబోవు అక్షరము యొక్క యింతకు పూర్వము చెప్పబడిన అవ్యక్తము కంటే విలక్షణత్వము కలిగియున్నదని తెలియజెప్పుటకు చెప్పబడినది. ఆ అవ్యక్తము యొక్క భావము అనగా అక్షర నామకమైన పరబ్రహ్మ పరమాత్మ పూర్తిగా భిన్నతత్వము లేక స్వభావము గలవాడు. దేనికంటే విలక్షణత్వము గలవాడు ? అన్నచో - ఇంతకు పూర్వము చెప్పబడిన అవ్యక్తము కంటే భిన్నత్వము కలిగియున్నప్పటికీ ఏదో ఒక విధమైన సమానత్వము కలదా ? యన్నచో - ఈ శంకను తొలగించుట కొరకే యిట్లు చెప్పుచున్నారు. ఎట్లనగా - **ఇంద్రియములకు గోచరించనటువంటి అవ్యక్త భావము వేరుగా వుండి యున్నది. అనగా పూర్తిగా విలక్షణత్వము కలిగియున్నది.**

దానికంటే భిన్నత్వము కలిగియున్నది అని చెప్పియున్నారు. అయితే అది దేనికంటే భిన్నత్వము కలిగియున్నది.

అది యింతకు పూర్వము చెప్పబడిన భూత సముదాయమునకు బీజరూపముగా అనగా కారణరూపముగా అవిద్యారూపమైన అవ్యక్తముకంటే భిన్నముగ అనగా విలక్షణత్వము కలిగి యున్నది. ఇటువంటి ఏ సనాతన భావము అనగా అనాదిగా కలిగియున్న భావము అయి వున్నదో **అది బ్రహ్మ మొదలగు సమస్త ప్రాణులు నశించినప్పటికి అది అనగా ఆ అక్షరమైనది** నశించదు.

**8.21. అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్,**
**యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ.**

అనగా - ఏది అవ్యక్తము మరియు అక్షరము అని చెప్పబడినదో, ఆ అక్షరమనబడు అవ్యక్తభావమును పరమ-శ్రేష్ఠస్థితియని చెప్పుదురు. ఏ **పరమ భావమును పొంది మనుష్యుడు తిరిగి ప్రపంచములోనికి రాడో అదియే నా యొక్క** పరమ శ్రేష్ఠస్థానమై **యున్నది. అదియే విష్ణువనబడు నా యొక్క** పరమపదమై **యున్నది.**

ఆ పరమధామమును పొందు వుపాయము చెప్పబడుచున్నది -

**8.22. పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా,**
**యస్యాంతఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్.**

అనగా - శరీరరూపమైన పురమునందు శయనించినందున లేక సర్వత్రా పరిపూర్ణమై నిండియున్నందున ఆ పరమాత్మునకు 'పురుష'డను నామము కలుగుచున్నది. ఆ నిరతిశయత్వము కలిగియున్న పరమ పురుషుడు ఏ పర అనగా సూక్ష్మము మరియు శ్రేష్ఠము కంటే వేరైనదేమియు లేదు (దో) ఏ పురుషుని యందు సమస్తమైన కార్యరూపమైన భూతములు నిండియున్నవో - అట్లేలయన ? **కార్య పదార్థమెప్పుడును కారణ పదార్థమునందు అంతర్లీనమై యుండును.** మరియు ఏ పురుషుని కారణముగ ఈ సమస్త ప్రపంచము ఆకాశమునందు మేఘములవలె వ్యాపించి యున్నదో, **అటువంటి పరమాత్మ అనన్య భక్తి ద్వారా అనగా ఆత్మ విషయికమైన జ్ఞానముతో కూడియున్న భక్తి భావము ద్వారా పొందదగియున్నాడు.**

ఏ మహాత్ములు ఓంకారమునందు బ్రహ్మభావమును పొందియున్నారో, ఏ మహాత్ములకు కొంతకాలము తరువాత ముక్తత్వము లభించనున్నదో మరియు యిచ్చట ఏ మహాత్ముల జీవన వ్యవహారము నడచుచున్నదో అటువంటి యోగులకు బ్రహ్మమును పొందు మార్గము చూపవలసి యున్నది. అందువలన ఆవశ్యకమైన అర్థమును కలిగించుటకై "యత్రకాలే" మొదలగు శ్లోకములు చెప్పబడుచున్నవి. ఇచ్చట పునరావృత్తి మార్గ వర్ణనము మరొక మార్గమును చూపుటకై చెప్పబడినది.

**8.23. యత్ర కాలే త్వనావృత్తిమావృత్తిం చైవ యోగినః,**
**ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ.**

అనగా - "యత్ర కాలే" అను పదమునకు కొంచము దూరముగా వున్న ప్రయాతా అను పదముతో సంబంధము కలదు.

ఏ కాలమునందు అనావృత్తిని అనగా పునర్జన్మ లేకుండుటను మరియు ఏకాలము నందు ఆ వృత్తిని అనగా తిరిగి జన్మను పొందుటను యోగులు పొందుదురో **"యోగినః" ఈ పదము ద్వారా కర్మలు చేయునటువంటి కర్మవాదులు కూడా యోగులనియే చెప్పబడినారు.** అట్లేలయన ? "కర్మయోగేనయోగినామ్" అను ఈ విశేషణ శబ్దము ద్వారా కర్మలు చేయువారు గూడ ఏదో ఒక గుణవిశేష కారణముగ యోగులని చెప్పబడినారు.

తాత్పర్యమేమన ? ఓ అర్జునా ! ఏ కాలమునందు శరీర వియోగమును పొందిన యోగులు పునరావృత్తిని అనగా తిరిగి దేహమును పొందుటను మరియు ఏ సమయమునందు దేహత్యాగమును చేసిన యోగులు పునఃదేహములను పొందరో అట్టి కాలమును గురించి చెప్పెద, వినుము.

**8.24. అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్,**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః.**

అనగా – ఇచ్చట 'అగ్ని' శబ్దము కాలమునందు అభిమానముగల, అనగా కాలాభిమానీ అనగా కాలాభిమానము గల దేవతను తెలుపుచున్నది. మరియు 'జ్యోతి' అను శబ్దము గూడ కాలాభిమాని అనగా కాలమునకు సంబంధించిన దేవతను తెలుపుచున్నది. అనగా అగ్ని మరియు జ్యోతి అను నామములు గల ఈ యిరువురు ప్రసిద్ధమైన వైదిక దేవతలే.

ఏ వనమునందు ఆమ్ర వృక్షములు అధికముగా వుండునో దానిని ఏ విధముగా ఆమ్రవనమని యందురో ఆ విధముగానే యిచ్చట కాలాభిమానీ దేవతల వర్ణన అధికముగా వుండుటచే **"యాత్రకాలే, తం కాలమ్"** మొదలగు కాలవాచక శబ్దములు ప్రయోగించుట జరిగినది.

ఇచ్చట అభిప్రాయమేమన – ఏ మార్గమునందు అగ్ని దేవత మరియు జ్యోతి దేవత అనగా పగటి దేవతయైన అగ్ని అనగా సూర్యుడు. రాత్రిదేవత అనగా శుక్లపక్షమునందలి పౌర్ణమినాటి చంద్రుడు మరియు వుత్తరాయణమునందుండు ఆరు మాసముల దేవత మొదలగు వారు భూమిమీద తమ ప్రభావము పడునట్లుగా చేయుచున్నప్పుడు తమ స్థూలదేహములను త్యజించిన మహనీయులు అనగా బ్రహ్మోపాసనయందు తత్పరులైన పురుషులు క్రమముగా బ్రహ్మమును పొందుదురు. **ఈ వుత్తరాయణ మార్గము గూడ దేవతావాచకమే.** అట్లేలయన? బ్రహ్మసూత్రముల యందు గూడ యిట్లే చెప్పబడియున్నది.

**ఏ పురుషులు జ్ఞాననిష్ఠగలవారై సద్యోముక్తిని పొందుటకు తగియుందురో అటువంటి వారికి రాకపోకలు కలుగనేరవు.** జీవునకు రాకపోకలు దుఃఖదాయకములని ఓ మహాకవి చక్కగా చెప్పియున్నారు. అదెట్లన –

**"భువిజచ్చున్ దివిజొచ్చు అచ్చటను చావుంగాంచి చొచ్చున్ భువిన్,**
**భువి చావుం దివి చావు నాగనిటు చావుల్రెండు భూతాళికిన్,**

భువి చావుం సుఖ సుప్తివోలె బడయన్ బోనౌనుగా కక్కటా
దివిచావుం నను జావనీకుము కపర్థిస్వామి మృత్యుంజయా." (చూ. కంకణము కావ్యం)

శ్రుతియందు గూడ యిట్లే చెప్పబడియున్నది. "ఆ దేహమును వదలిన ప్రాణములు ఎచ్చటికి పోవును ? "నతస్య ప్రాణా ఉత్క్రామంతి" "ఇతి శ్రుతేః" అవి అనగా ఆ బ్రహ్మమునందు అవిభాజ్యముగానున్నందున మరియు బ్రహ్మము సర్వవ్యాపకతత్వమై యున్నందున అవి బ్రహ్మము నందే లీనమై యుండును.

మహాజ్ఞానియైన కబీరుదాసుగారు గూడా సోదాహరణముగా యీ రహస్యమును చక్కగా చెప్పియున్నారు.

జలమే కుంభ కుంభమే జల బాహర భీతర పానీ.

ఫూటా కుంభ జల జలహి సమానా యహ తథ్ కథౌ గియానీ. అనగా జలమునందు కుండయున్నది. కుండయందు జలము వున్నది. కుండకు బయట లోపలా కూడా జలమే నిండి యున్నది. కుండ పగిలిపోయినది. జలమునందు జలము కలిసిపోయినది. జ్ఞానులు ఈ మాట చెప్పియున్నారు.

**8. 25. ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్,**
**తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే.**

అనగా - ధూమాభిమాని మరియు రాత్రాభిమానులైన దేవతలున్న మార్గములు ధూమము మరియు రాత్రి అనగా అంధకారముతో నిండి యుండును. మరియు దక్షిణాయనము నకు ఆరు మాసముల కాలముండును. అనగా యింతకు పూర్వము చెప్పినట్లుగా దక్షిణాయన మార్గమునందు అభిమానము గల దేవతల అధికారమునందుండు మార్గమున పయనించుచూ దేహత్యాగము జేసిన జీవులు లేక యోగులు అనగా యిష్టార్థములను పొందగోరి కర్మలు చేయు యోగులు చంద్రుని యొక్క జ్యోతిని అనగా వారు ఆచరించిన కర్మ ఫలములను పొంది, వాటిని భోగించి ఆ కర్మఫలములు క్షయమైనప్పుడు తిరిగి ఈ భూలోకమును జేరి తమ యిష్టానుసారమైన దేహములను ధరింతురు.

**8. 26. శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే,**
**ఏకయా యాత్యనావృత్తిమన్యయావర్తతే పునః.**

అనగా - శుక్ల మరియు కృష్ణ ఈ రెండు మార్గములు అనగా దేనియందు జ్ఞానరూపమైన ప్రకాశము గలదో అది శుక్లపక్షము మరియు దేనియందు ఆ ప్రకాశము లేదో అది కృష్ణపక్షము. ఈ రెండు మార్గములు జగత్తునందు నిత్యమై అనాది నుండి ఒప్పుకొనబడి యున్నవి. అట్లేలయన ? జగత్తు నిత్యమైనదై యున్నది. ఇచ్చట 'జగత్తు' అను శబ్దమునకు

ఏ జ్ఞానులు మరియు కర్మవాదులు పైన చెప్పబడిన మార్గములకు అధికారులో అనగా యోగ్యత గల వారైయున్నారో వారినిగానే తలంచవలయును. ఏలయన ? ప్రపంచమంతటికి యీ గతి అనగా ఈ మార్గములు సంభవించవు.

ఆ రెండు మార్గములలో ఒకడు శుక్లమార్గమున వెళ్ళినచో ఆతడు తిరిగి రాడు. అనగా వానికి పునర్జన్మ కలుగదు. అట్లుగాక రెండవ మార్గమున అనగా కృష్ణమార్గమున పయనించిన యోగి తప్పక పునర్జన్మను పొందును.

**8.27. నైతే సృతీ పార్థ జానన్యోగీ ముహ్యతి కశ్చన,
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున.**

అనగా – ఓ పార్థా ! పైన చెప్పబడిన రెండు మార్గములను యీ విధముగా ఎరింగిన యోగి అనగా ఒకటి పునర్జన్మ రూపమైన ప్రపంచమును యిచ్చునదై యున్నదనియు మరియు రెండవది మోక్షమును అనగా పునర్జన్మను యిచ్చునది కానిదైయున్నదనియు బాగుగా ఎరింగిన యోగి దీనికి మోహితుడు కాడు. అందుచేత ఓ అర్జునా ! నీవు సర్వకాల సర్వావస్థలయందును యోగయుక్తుడవై యుండుము. అనగా సమాధియందు నిమగ్నము చెందియుండుము.

ఇప్పుడు యోగము యొక్క మహాత్మ్యమును వినుము –

**8.28. వేదేషు యజ్ఞేషు తపఃస్సు చైవ దా ... యత్పుణ్య ఫలం ప్రదిష్టమ్,
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగి పరం స్థానముపైతి చాద్యమ్.**

అనగా – వీటిని గుర్తించి అనగా ఈ ఏడు ప్రశ్నలయొక్క నిర్ణయము ద్వారా చెప్పబడిన రహస్యమును యదార్థమని యెరింగి మరియు వాటిని యథావిధిగా అనుష్ఠించిన యోగియైన పురుషుడు, చక్కగా వేదాధ్యయనము చేసినటువంటి, శ్రేష్ఠమైన గుణ సంపాదన ద్వారా చేయబడిన యజ్ఞములు గలిగియున్నట్టి, చక్కగా చేయబడిన తపోబలము గలిగినట్టి మరియు నిజముగా పాత్రుడైన వానికి దానమిచ్చినట్టి వానికి ఎటువంటి వారికి ఎటువంటి పుణ్య ఫలము కలుగునని సర్వశాస్త్రములయందును చెప్పబడియున్నదో వాటినన్నింటిని మించిన పుణ్యఫలమును పొందును. **మరియు ఆరంభమునందు జరుగు సర్వకారణ రూపమైన పరమేశ్వర స్థితిని అనగా బ్రహ్మమును పొందును.**

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి తారక బ్రహ్మయోగమనబడు ఎనిమిదవ అధ్యాయమునకు శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.*

*అనువాదకులు – శ్రీ సదానంద భారతి.*

*ప్రణవాశ్రమము.*

# తొమ్మిదవ అధ్యాయము

ఎనిమిదవ అధ్యాయమునందు సుషుమ్నానాడి ద్వారా ధారణాయోగము సర్వాంగ పూర్ణముగా వర్ణించి చెప్పబడినది. మరియు ఆ యోగము యొక్క ఫలములైన అగ్ని, జ్యోతి మొదలగు వాటిని పొందుటచే క్రమముగా కాలాంతరమందు బ్రహ్మప్రాప్తి రూపమైన మరియు అపునరావృత్తి రూపమైన ఫలము కలుగునని చెప్పబడినది.

కాని అచ్చట ఒక శంక కలుగుటకు అవకాశమున్నది. అది యేమనగా - ఇటువంటి సాధన చేసిన మాత్రముననే పురుషునకు మోక్షప్రాప్తిరూపమైన ఫలము లభించునా ? ఇంతకంటే వేరు విధములుగా సాధన చేసినవారికి మోక్షము లభించదా ? అను మొదలగు శంకా నివారణార్థము భగవంతుడు యిట్లు చెప్పుచున్నారు -

**9.1. ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే,**
**జ్ఞానం విజ్ఞాన సహితం యజ్ఞాత్వామోక్ష్యసే ఽశుభాత్.**

అనగా - ఇంతకు పూర్వము చెప్పబడిన బ్రహ్మజ్ఞానమే యిప్పుడు యిచ్చట మరల చెప్పబడుచున్నది. దానిని బుద్ధికి ఎదురుగా వుంచి అనగా తర్కబుద్ధికి సమాధానము కలిగించు విధానముగా 'ఇదమ్' అను శబ్దము వాడబడినది. 'తు' అను శబ్దము గూడ యితర విధములైన జ్ఞానముల నుండి యీ జ్ఞానమును వేరు చేయు దృష్టితో ప్రయోగించబడినది.

ఇదియే యదార్థమైన జ్ఞానము. ఈ జ్ఞానమే పురుషునకు సాక్షాత్తుగా మోక్షమును కలిగించునదై యున్నది. "సర్వము వాసుదేవమే".

**ఈ సమస్తమైన జగత్తంతయు ఆత్మయే అనగా ఆత్మయే జగద్రూపమున తోచుచున్నది. బ్రహ్మము అద్వితీయుము. దానికంటే వేరుగా మరొకటి లేదు.**

"ఇదం ఏవ సమ్యక్జ్ఞానం సాక్షాద్ మోక్షప్రాప్తిసాధనమ్" "వాసుదేవ సర్వమితి" "ఆత్మైవేదం సర్వమ్" (బృహ. ఉ. 2-4-6) "ఏకమేవాద్వితీయం" (ఛాం.ఉ. 6-2-1) మొదలగు శ్రుతుల ద్వారా చెప్పబడినది. అందుచేత దీనికంటే వేరుగా జ్ఞానము. దానికంటే వేరుగా మోక్షమును పొందుటకు మరొక మార్గము లేదు.

పై చెప్పిన దానికి విరుద్ధముగా తలంచువారు, వారు **తమకంటే భిన్నముగా తన స్వామి వున్నాడని తలంచువారైన మానవులు వినాశమును పొందు లోకములనే పొందుదురు.** ఈ విషయములన్నియు శ్రుతుల ద్వారానే ఋజువగుచున్నవి. నీవు అసూయా రహితుడవును నా భక్తుడవై యున్నందున అతి గోపనీయమగు రహస్యమును నీతో చెప్పుచున్నాను.

అది ఏమన ? జ్ఞానము. ఎటువంటి జ్ఞానము ? **విజ్ఞానముతో కూడియున్న జ్ఞానము. అనగా అనుభవము ద్వారా తెలియబడు జ్ఞానము.**

ఏ జ్ఞానమును పొంది అనగా తెలుసుకొని నీవు సంసార రూపమైన బంధమునుండి ముక్తుడవగుదువో అట్టి సమ్యక్ జ్ఞానమును నీకు తెలుపుచున్నాను.

ఆ జ్ఞానమెట్టిదనగా -

**9.2. రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్,**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్.**

అనగా - అతిశయమైనది అనగా అన్నింటిని అధిగమించియున్నది, ప్రకాశముతో కూడియున్నది అయివున్న కారణముగ **యీ జ్ఞానము అన్ని విద్యలకు రాజువంటిది. బ్రహ్మవిద్య విద్యలన్నింటియందును అత్యధికముగా దేదీప్యమానమై వెలుంగుచూ ప్రసిద్ధమైయున్నది.**

మరియు ఈ జ్ఞానము సమస్తమైన గుప్తముగా వుంచదగిన భావములకు గూడ రాజు వంటిదే. మరియు ఇది అతి పవిత్రము మరియు సర్వోత్తమము అయినది. అనగా సంపూర్ణముగా సర్వమును పవిత్రముగా చేయు వారిని కూడా పవిత్రము చేయునదైయున్నది. అటువంటి ఈ బ్రహ్మ జ్ఞానము సర్వశ్రేష్ఠమైనది. **ఈ జ్ఞానము అనేక వేల సంవత్సరముల కాలము నుండి ప్రోగు చేయబడిన పుణ్య పాపాది కర్మల ఫలములను క్షణమాత్రములో భస్మము చేయగల సామర్థ్యము కలిగియున్నది.** అట్టి స్థితి యందు దాని యొక్క పవిత్రత చెప్పనలవిగానిదై యున్నది.

నిజముగానే ఈ **జ్ఞానము** ప్రత్యక్షానుభవము ద్వారానే పొందదగినదై యున్నది. అనగా - **సుఖాదుల వలె ప్రత్యక్ష అనుభవము ద్వారానే అనుభవించదగినదై యున్నది.**

అనేక గుణములు కలిగియున్న వస్తువునకు గూడ ధర్మముతో విరోధము కలిగి యుండుట చూడబడుచున్నది. కాని ఆత్మజ్ఞానము మాత్రము వాటివలె ధర్మ విరుద్ధమైనది కాదు. పైపెచ్చు ధర్మముతో కూడియున్నదై యున్నది.

ఇటువంటి పదార్థము అనగా వస్తువు అనగా విషయము దుఃస్సంపాద్యమై యున్నది. అనగా యిటువంటి జ్ఞానమును పొందుట అతి కష్టతరమైనదై యున్నది. అందుచేతనే రత్నముల యొక్క రహస్యమును గుర్తించు వివేక విజ్ఞానము వలె దీనిని ఎరుంగుట అనగా గుర్తించుట అత్యంత సులభము.

కాని ఈ ప్రపంచమునందు తక్కువ శ్రమ ద్వారా సుఖములను పొందుటకు అవసరమైన కర్మల యొక్క అల్ప ఫలము అనగా అల్పకాలము మాత్రమే వుండు ఫలము మరియు అతి కష్టముతో చేయబడు కర్మల గొప్ప ఫలము అనగా ఎక్కువ కాలము వరకు నిలిచియుండు ఫలము అందరికి తెలిసిన విషయమే. అందుచేత ఈ జ్ఞానము గూడ అతి సులభముగా ఫలమును యిచ్చునదై యున్నందున తన ఫలము క్షీణించిన తరువాత ఆ జ్ఞానము గూడ క్షీణించునని శంక కలిగినందున ఆ శంకా నివారణార్థము చెప్పుచున్నాను -

ఈ జ్ఞానము అవ్యయమైనది. అనగా కర్మలవలె ఫలనాశము ద్వారా యిది నశించునది కాదు. అందుచేత **ఈ ఆత్మజ్ఞానము శ్రద్ధతో పొందదగినదై యున్నది.**

**9.3. అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప,**
**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని.**

అనగా – ఈ ఆత్మజ్ఞానరూపమైన ధర్మమును ఆచరించనివారు, అనగా ఈ ఆత్మజ్ఞాన స్వరూపమును గురించి మరియు దాని యొక్క ఫలమునందు ఆస్తిక భావము లేనివారు, నాస్తికులతో సమానులు, అటువంటివారు అసుర సిద్ధాంతములను నమ్మి, దేహమునే ఆత్మ పదార్థముగా తలంచి, పాప కర్మలు చేయుచూ, యింద్రియములకు దాసులైన మానవులు పరమేశ్వర స్వరూపుడనైన నన్ను పొందక, అసలు అటువంటి వారికి నన్ను పొందవలయునన్న భావము కూడా కలుగనేరదు. నన్ను పొందుటకు అవసరమైన సాధనరూపమైన భేదభక్తిని గూడ పొందజాలక అపమార్గములయందు తిరుగుచుందురు. ఆ అపమార్గములెట్టివనగా –

మృత్యువుతో కూడియున్న సంసార మార్గమున అనగా ఏ ప్రపంచము మృత్యువుతో అనగా వినాశముతో కూడియున్నదో అటువంటి మృత్యు సంసారమనెడు నరకము నుండి పశువులు, పక్షులు మొదలగు వాటి యోనులందు చిక్కువడు మార్గములందు ~~వారు పుట్టుచూ~~ చచ్చుచూ పైకి క్రిందికి తిరుగుచుందురు.

ఈ విధముగా జ్ఞానము వలన కలుగు లాభమును గురించి సంక్షిప్తముగా చెప్పి యిప్పుడు విశదముగా చెప్పుచున్నారు –

**9.4. మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా,**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః.**

అనగా – అవ్యక్తరూపుడను మరియు పరమాత్మ స్వరూపుడను అయివున్న నా ద్వారా అనగా ఏ నా పరమ తత్వము యొక్క స్వరూపము ప్రత్యక్షముగా లేదో అనగా ఏ నా పరతత్వము బుద్ధి మరియు యింద్రియములకు విషయముగాక యున్నదో అటువంటి **అవ్యక్త మూర్తినై యున్న నా కారణముగ ఈ సమస్తమైన జగత్తు వ్యాపించి యున్నట్లుగా తోచుచున్నది.**

ఆ అవ్యక్త స్వరూపుడను మరియు పరమాత్మను అయిన నాయందు బ్రహ్మ మొదలు పిపీలికాది పర్యంతము సమస్త ప్రాణులు స్థితిని పొంది యున్నవి.

అట్లేలయన ? నిర్జీవము అనగా జీవము లేనట్టి అనగా **పరమ చైతన్య బ్రహ్మతత్వము లేనటువంటి ఏ దేహము వ్యవహారమునకు పనికిరాదు.** అందుచేతనే **అవన్నియు చైతన్య స్వరూపుడైన నాయందే స్థితిని పొందియున్నవి.** అనగా పరమాత్మ స్వరూపుడనైన నానుండియే అవన్నియు ఆత్మ కలిగినవి అగుచున్నవి. అందుచేత అవన్నియు నా యందే కలవని అనగా నాకంటే వేరుగా లేవని చెప్పబడుచున్నది.

ఆ భూతములన్నింటి యొక్క నిజమైన స్వరూపము నేనే అయి వున్నాను. అందుచేతనే అజ్ఞానులకు నేను వాటియందు వున్నానను భ్రాంతి కలుగుచుండును. అందుచేత నేను అభూతములయందు లేను అని చెప్పుచున్నాను. ఏలయన ? **ఆకారము గల వస్తువుల యందు వలె నాయందు సంసర్గ దోషము అనగా యితర పదార్థములతో కలసి యుండు గుణము లేదు.** అందువలన నేను ఏ వస్తువుతోడను కలిసి యుండక సూక్ష్మరూపమున ఆకాశము వలె **అంతటా వ్యాపించి యున్నాను.** సంసర్గ దోషము లేని వస్తువు ఎచ్చటనూ, ఎన్నడునూ ఆధేయ భావముతో అనగా మరియొక దానిపై ఆధారపడి వుండదు. స్వతంత్రముగానే వుండును. నేను 'అసంసర్గ' అనగా దేనితోనూ సంబంధము లేనివాడనై యున్నాను – అందువలన–

**9.5. న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్,**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః.**

అనగా – నిజముగా విచారించి చూచిన బ్రహ్మాది ప్రాణులన్నియు గూడ నాయందు **లేవు.** నీవు నా యొక్క ఈశ్వరీయ యోగముతో కూడిన ఘట్టమును చూడుము. అనగా నా యొక్క ఈశ్వరీయ యోగమును అనగా నా యొక్క యదార్థ తత్వమును గుర్తించుము. అనగా చక్కగా తెలుసుకొనుము.

**"సంగరహితమైన ఆత్మ ఎచ్చటనూ దేనితోడను సంబంధము కలిగి యుండదు"**
**"అసంగో నహి సజ్జతే"** (చూ. బృ.ఉ. 3.9.26.)

ఈ విధముగా శ్రుతి గూడ సంసర్గరహితమైనందుననే ఆత్మకు అనగా ఆత్మ యొక్క నిర్లేపత్వమును చెప్పుచున్నది.

ఇచ్చట మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయమేమన – సర్వభూతములకు కారణరూపుడను మరియు ఆత్మరూపుడను అయిన నేను సంసర్గరహితుడను అయివుండి కూడా **ఆ భూతముల స్థితిలయములకు నేనే కారణరూపుడనై యున్నాను. అయినప్పటికీ నేను భూతములయందు** లేను. అట్లేలయన ? పరమాత్మ భూతముల యందుండుట సంభవముకాదు. ఈ విషయము పైన చెప్పిన న్యాయము ద్వారా స్పష్టము చేయబడినది.

**పూర్వపక్షము** – అనగా – శంక –

ఆత్మకంటే వేరుగ భిన్నముగా వుండు వస్తువు ఏదియు లేదని చెప్పియున్నారు గదా! మరి లోకులందరూ ఎవరికి వారు "నాయాత్మ" అని (ఎందులకు) ఎట్లు చెప్పుచున్నారు ?

**సమాధానము** – లోకమునందలి మానవులు భ్రాంతిని జెందినవారై అనగా సత్పదార్థ సాక్షాత్కారమును పొందజాలక లౌకిక బుద్ధిననుసరించి దేహాది సంఘాతములనే అనగా అనేక వస్తువుల సమన్వయము ద్వారా ఏర్పడిన దేహాదులనే ఆత్మ నుండి వేరుచేసి మరల దానిపై అహంకారమును ఆరోపించి అనగా దేహమేనేనను భావమును పొంది "నాయాత్మ" అని అనగా నా దేహమునందున్న యాత్మ అని చెప్పుచున్నారు. ఆత్మ తనంతట తానుగానే వేరువేరు

భాగములుగా విభజింపబడి అన్ని దేహములందు యున్నదని తలంచుచున్నారు. అంతేగాని తమ అజ్ఞానము వలన అలా తలంచుచున్నామని వారికి తెలియుటలేదు.

భూతములను కల్పించు దానిని, వాటిని పోషించుదానిని **'భూతములను భావించునది'** అని చెప్పుదురు.

పై రెండు శ్లోకములకు చెప్పబడిన తాత్పర్యమును దృష్టాంతము ద్వారా స్థిరపరచుచున్నారు -

**9.6. యథా ఽకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్,**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ.**

అనగా - లోకమునందు ప్రసిద్ధి జెందియున్నట్లుగా సర్వత్రా విహరించునటువంటిది మరియు పరిమాణమునందు అత్యంత వ్యాపకమైయున్న వాయువు సర్వకాలములయందును ఆకాశమునందే స్థితి గలిగియుండును. ఆ విధముగానే **ఆకాశము వలె అంతటను పరిపూర్ణమై పరమాత్మనైయున్న నాయందు సమస్త భూతములు నిర్లిప్తభావముతో నిండియున్నవి.** ఈ విషయమును నీవు బాగుగా తెలుసుకొనుము.

ఈ విధముగా జగత్తు తోచుకాలమునందు అనగా జగత్తు వున్నట్లుగా తోచుచున్నప్పుడు ఆకాశమునందలి వాయువువలె నాయందు నిండియున్న భూతములన్నియూ -

**9.7. సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్,**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్.**

అనగా - ఈ ప్రపంచము నందలి ప్రాణులన్నియు ప్రళయ కాలమందు నా యొక్క త్రిగుణాత్మకమైన అపరము, నికృష్టము అయిన ప్రకృతియందు లీనమై పోవును. మరియు తిరిగి కల్పాదికాలమున అనగా తిరిగి ఆ ప్రకృతి నుండి సర్వవిధ ప్రాణులతో కూడియున్న ఆ పూర్వపు ప్రపంచమువంటి నూతన ప్రపంచము వుత్పన్నమగును. **ఈ కార్యమంతయు అనగా సర్వవిధ ప్రాణులతోకకూడిన ప్రపంచమంతయు నా యధీనమునందున్న నికృష్ట ప్రకృతినుండియే ఉద్భవించును.** అనగా **ఆ ప్రకృతి ద్వారానే ఈ ప్రపంచమంతయు మరల అనగా ప్రళయానంతరము కల్పించబడును.**

*ఈ విధముగా అవిద్యారూపమైన -*

**9.8. ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః,**
**భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్.**

అనగా - నాచే కల్పించబడిన ప్రకృతిని నాయధీనమునందే యుంచుకొని ప్రకృతి యొక్క గుణముల చేత కల్పించబడియున్న సమస్తమైన మరియు పరతంత్రమైయున్న మరియు

అవిద్య మొదలగు దోషములతో కూడి పరవశమై యున్న ఈ భూత సముదాయమును ః
ప్రతిసారి కల్పించుచూ వుంటాను.

**పూర్వపక్షము** - అట్టి స్థితియందు అనగా యిట్టి స్థితిలయములు కలిగియ భూత సముదాయమును కల్పించు పరమేశ్వరులైన మీరు స్థితిలయములు కలిగియున్న సృష్టివ కలుగు పుణ్యపాపములతో సంబంధము కలవారై యుందురు కదా ? అని శంకించ భగవంతుడు చెప్పుచున్నాడు.

**9.9. న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ;**
**ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు**

అనగా - ఓ ధనంజయా ! భూత సముదాయము యొక్క విషమ రచనతో కూడియ ఆ కర్మలన్నియు ఈశ్వరుడైన నన్ను బంధించజాలవు.

ఆ కర్మలతో ఈశ్వరునకు సంబంధము లేకుండుటకు గల కారణము చెప్పుచున్నా

నేను ఆ సృష్టి రచనా సంబంధమైన కర్మలయందు ఎటువంటి ఆసక్తిలేనివాడ సంబంధములేనివాడనై, ఉదాసీనునిగా వుందును. అనగా ఆత్మ నిర్వికారమైనది. అన ఎటువంటి వికారమును చెందునది కాదు. అందువలన ఏ విధముగా ఒక ఉదాసీను అనగా ఎటువంటి కర్మ చేయుటయందు కించిత్తు గూడ ఆసక్తి లేనివాడై వుండునో వాని వ నేను గూడ ఈ సృష్టి కర్మయందు ఎటువంటి ఆసక్తి లేని ఉదాసీనుడుగానే వుందును. మరిం ఆ కర్మలయందు గల ఫలముల యందు ఆసక్తి లేనివాడనై మరియు "నేను ఈ క చేయుచున్నాను" అను అభిమానము గూడ లేనివాడనై వుందును. అట్లగుట చేత ఆ కర్మ నన్ను బంధించజాలవు.

ఈ వివేచన యొక్క సారాంశమేమన ? **కర్తృత్వాభిమానము లేకుండుట మరిం తాను చేయు కర్మల యొక్క ఫలమునందు ఆసక్తి లేకుండుట** యీ రెండు భావములు న కాదు యితరులను గూడ బంధ రహితులుగా చేయును.

ఇట్లు తప్ప యితర విధములుగా చేయబడు కర్మలన్నింటి ద్వారా అజ్ఞానుల వారందరూ పట్టుపురుగులవలె బంధముల యందు చిక్కుకొందురు.

**మరో శంక** - ఇచ్చట శంక యేమనగా - "ఈ భూత సముదాయమును నే సృష్టించుచున్నాను." మరియు నేను ఉదాసీనుడను వానివలె వుందును" అని చెప్పు వాక్యము మరియు వాటి అర్థము పరస్పర విరుద్ధముగా తోచుచున్నది.

**సమాధానము** - అట్టి శంకను తొలగించుట కొరకు ఈ క్రింది విధము సమాధానము చెప్పుచున్నారు -

**9.10. మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్,
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే.**

అనగా – అన్నివైపుల నుండి చూచినా ఎవ్వని స్వరూపము కేవలము అదృశ్యముగానే తోచుచున్నదో అట్టి నిర్వికారరూపుడను మరియు అన్నింటికి కారణ స్వరూపుడనై యున్న నా వలన ప్రేరణ పొందినదై అవిద్యారూపమైన నా యొక్క త్రిగుణములతో కూడియున్న మాయ అనగా ప్రకృతి సమస్తమైన చరాచర జగత్తును కల్పించుచున్నది. అందుకే కాబోలు ఓ తత్వవేత్త యిలా పాడుకొన్నాడు –

**"వింత శక్తులుండు విశ్వాంతరాళాన
చేసి బొమ్మలెపుడు చెఱుపుచుండు
తెలియలేరు జనులు దేవుని మహిమలు....
గుణ్యారామరాయ గురువిధేయ"** (చూ. రామరాయ శతకము, రచయిత : డా. బండ్లమూడి ఆంజనేయులు)

వేదమంత్రములు గూడ ఈ తత్వమునే చెప్పుచున్నవి –

"ఏకో దేవః, సర్వభూతేషు గూఢః, సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా, కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః, సాక్షీ చేతా కేవలోనిర్గుణశ్చ" (చూ. శ్వేతా. ఉ. 6–11)

అనగా "సర్వభూతములయందును అదృశ్య భావమున వుండువాడు ఒక్కడే దైవము. ఆతడే సర్వవ్యాపకుడు మరియు సర్వభూతములకు అంతరాత్మ మరియు సర్వకర్మలకు కారణరూపుడు, సమస్త భూతములకు అధిదేవత, సాక్షి, చేతన స్వరూపుడు, పరిశుద్ధుడు మరియు నిర్గుణుడు అయివున్నాడు."

ఓ కుంతీపుత్రా ! ఈ కారణము వలననే అనగా నేనే వీటికన్నింటికీ ఆధార స్వరూపుడను అయివున్నందువలన చరాచర సహితమైన **సాకార–నిరాకార రూపమున నున్న సమస్తమైన జగత్తు అన్ని అవస్థల యందును వికారమును పొందుచునే యుండును.**

అట్లేలయన ? జగత్తుయందలి సర్వ ప్రవృత్తులు సాక్షీచేతనమైన జ్ఞానమునకు విషయరూపమున వుండుటకే. "నేను దీనిని తినెదను" దీనిని చూచుచున్నాను, దీనిని వినుచున్నాను, ఫలానా సుఖమును పొందుచున్నాను, ఫలానా దుఃఖమును అనుభవించుచున్నాను. దాని కొరకు లేక అతని కొరకు ఈ పనిని చేయుదును. ఈతని కొరకు లేక దీని కొరకు ఫలానా పని (కర్మ) చేయుదును. ఫలానా వస్తువును ఎరుంగుదును. మొదలగు జగత్తుకు సంబంధించిన సర్వవృత్తులు జ్ఞానము యొక్క అధీనమునందే యున్నవి. మరియు కాలాంతరమున జ్ఞానమందే లయమై పోవును.

ఈ జగత్తునకు అధికారి, కారణస్వరూపుడు మరియు చేతనత్వమునకు ఆధారమైయున్నవాడు సర్వోత్తమమైన హృదయమునందు నిశ్చలముగా నిండియున్నాడు. (చూ. "యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్" తై.బ్రా 2.8) మొదలగు మంత్రములు గూడ పై అర్థమునే సూచించుచున్నవి.

సర్వమునకు ఏకమాత్ర అధిష్ఠానరూపమున వున్నవాడు, చైతన్యరూపమున వున్నవాడు అయిన ఆ బ్రహ్మస్వరూపుడు నిజముగా సమస్తమైన భోగభాగ్యములతోను సంబంధములేనివాడై

యున్నాడు. మరియు అతడు తప్ప యితరమైన చేతన పదార్థము మరియొకటి లేనందున యితర భోక్తలు గూడ లేరు. మరి అటువంటి స్థితిలో ఈ సృష్టి అంతయు ఎవరి కొరకు ? **యిటువంటి ప్రశ్నగాని ఆ ప్రశ్నకు సమాధానముగాని యీ రెండూ కుదరనే కుదరవు.** అట్లేలయన? ఈ విషయము అనిర్వచనీయమైనది.

ఈ సృష్టిని గురించి స్వయముగా ఎవ్వడెరుంగును ? అందుచేత ఎవ్వడు చెప్పగలడు? ఈ జగత్తు ఎచ్చట నుండి వచ్చినది ? ఏ కారణముచేత ఈ సృష్టి కార్యము జరిగినది ? (చూ. "కో అద్ధావేద క ఇహ ప్రవోచత్, కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః" తై.బ్రా. 2-8-9) మొదలగు మంత్రముల ద్వారా ఈ మాటే చెప్పబడినది. "అజ్ఞానము చేత జ్ఞానము కప్పబడుచున్నది. అందుచేత సమస్తమైన జీవులు మోహమును పొందుచున్నవి.

"అజ్ఞానేనావృతం జ్ఞానం తేన, ముహ్యంతిజంతవః" ఈ విధముగా నేను నిత్యమైనవాడను, శుద్ధమైనవాడను, ముక్త స్వభావము కలవాడను మరియు సర్వ ప్రాణులకు ఆత్మనై యున్నాను. అయినప్పటికీ -

**9.11. అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్,**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్.**

అనగా - మూఢులు మరియు వివేకహీనులు అయిన లోకులు నాయొక్క సర్వ లోకములయందు పరిమితి యనునది లేకుండా ఈశ్వరరూపమున పరమ భావముతో అనగా అందరియొక్క ఆత్మరూపమున వున్న పరమాత్మ రూపమును మరియు సమస్త ప్రాణులకు ఈశ్వరుడనూ అయివున్న నా రూపమును గుర్తించజాలక యున్నారు. ఆకాశమువలె కాదు ఆకాశము కంటే గూడ సూక్ష్మతరము మరియు వ్యాపకత్వము కలిగిన వాడనైయున్నాను. నాయీ పరమ పరమాత్మతత్త్వమును ఎరుంగనందువలన మనుష్య దేహమును ధరించియున్న పరమాత్ముడనైయున్న నన్ను సామాన్య మానవునిగా తలంచుచున్నారు. అనగా మనుష్య రూపమును ధరించి అనేక కర్మలు చేయుచున్న నన్ను, పరమాత్మునిగా గుర్తించక అగౌరవపరచు చున్నారు.

అందుచేత ఆ విధముగా పరమాత్ముడనైన నన్ను హీనదృష్టితో చూచుచుండుట చేత వారు జీవత్వమును త్యజించలేక శవరూపములతో అనగా చచ్చినవారివలె పడియున్నారు.

అట్లేలయన్నచో -

**9.12. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః,**
**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః.**

అనగా - వారందరూ మోఘాశా అనగా ఆశలు నెరవేరనివారు, కోర్కెలు వ్యర్థమైన వారు అటువంటి అడుగంటిన ఆశలు గలవారు మరియు మోఘకర్మా అనగా ఫలహీనములైన

కర్మలు చేయువారు అయివున్నారు. ఏలయన ? వారి ద్వారా చేయబడు అగ్నిహోత్రాది కర్మలు తన అంతరాత్మ రూపమున వున్న భగవంతుని గుర్తించక, ఆదరించకపోవుట వలన వారు చేయు కర్మలన్నియు ఫలహీనములగును. అందుచేత వారు **మోఘకర్మలు** చేయువారు అని చెప్పబడుచున్నారు. ఇంతేగాక వారు **మోఘజ్ఞానులు** గూడ అయివున్నారు. అనగా **ఫలహీనమైన జ్ఞానము గలవారైయున్నారు.** అనగా వారు పొందిన జ్ఞానము గూడ నిష్ఫలమైనదే అగుచున్నది. మరియు వారు **విచేతా అనగా వివేకము లేనివారు గూడ అగుచున్నారు.**

మరియు వారు మోహమును కలిగించునటువంటి దేహాత్మవాదులు మరియు రాక్షస అనగా అసుర సంబంధమైన ప్రకృతి అనగా స్వభావము కలవారగుచున్నారు. తాత్పర్యమేమన? అట్టి వారందరూ తినండి, త్రాగండి, విరగగొట్టండి, నశింప జేయండి యితరుల ధనధాన్యాదులను దోచుకొనండి మొదలగు కేకలు వేయుచూ చాలా గొప్ప క్రూరకర్మలు చేయువారగుచున్నారు. అందువలననే శ్రుతి గూడ – "అసుర్యా నామ తే లోకాః" ఈశా.ఉ. 3 అని చెప్పుచున్నది. అనగా వారు అసురులు నివశించుటకు యోగ్యమైనటువంటి ప్రకాశహీనమైన లోకములందు నివశింతురు అని చెప్పుచున్నది.

కాని అట్లుగాక, నా యందు అనగా పరమాత్మయందు శ్రద్ధతో కూడిన భావము గలవారు మరియు భగవద్భక్తి రూపమైన మోక్షమార్గమునందు పయనించువారు –

**9.13. మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః,**
**భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్.**

అనగా – ఓ పార్థా ! శమము, దమము, దయ, శ్రద్ధ మొదలగు సద్గుణ సంపన్న స్వరూపులైన దేవతల స్వభావమును ఆలంబనగా జేసుకొని, ఉదారమైన చిత్తము గల మహాత్ములు ఈశ్వర స్వరూపుడనైన నన్ను సర్వభూతములకు అనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి మొదలగు పంచభూతములకు మరియు సమస్త ప్రాణులకు ఆది కారణముగా గుర్తించి మరియు వికారరహితునిగాను మరియు అక్షరుడుగాను ఎరింగి అనన్యమైన మనస్సుతో అనగా "నీవే తప్పనితఃపరంబెరుగన్" అని ఎవరు భజింతురో అనగా నన్నే ధ్యానించుచుందురో –

అటువంటివారు ఏ విధముగా భగవానుని ఉపాసింతురోయని ప్రశ్నించగా చెప్పుచున్నారు –

*ఏ విధముగా భజింతురు ? –*

**9.14. సతతం కీర్తయంతో మాం యతంతశ్చ, దృఢవ్రతాః,**
**నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే.**

అనగా – ఆ దృఢమైన వ్రతమును స్వీకరించిన భక్తులు అనగా నిశ్చలము మరియు దృఢము మరియు అచంచలమైన మనస్సు కలిగియున్న ఆ భక్తులు సర్వకాల సర్వావస్థలయందును

పరబ్రహ్మ స్వరూపుడను మరియు భగవంతుడనైన నన్ను కీర్తించుచూ యింద్రియ నిగ్రహము కలిగి శమ, దమ దయ మరియు అహింసాది ధర్మభావములు కలవారై పరమాత్మ స్వరూపుడనైన నన్ను భక్తిభావపూర్వకముగా నమస్కరించుచూ ఎల్లప్పుడూ నన్నే స్మరించుచూ నన్ను వుపాసించుచూ నన్నే సేవించుచుందురు.

వారు భగవంతుని ఎన్ని విధములుగా వుపాసింతురు ? అన్నచో చెప్పుచున్నారు.

**9.15. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే,**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్.**

అనగా - కొంతమంది **జ్ఞానులైనవారు** యితర విధములైన ఉపాసనలనన్నింటిని విడచి **భగద్విషయకమైన జ్ఞానరూపయజ్ఞము ద్వారా నన్ను పూజించుచూ ఉపాసించుచుందురు.** అనగా పరబ్రహ్మ పరమాత్మయనువాడు ఒక్కడేయను ఏకత్వరూపమైన పరమార్థ జ్ఞానము ద్వారా నన్నుపాసించుచుందురు.

మరికొంతమంది ద్వైతభావముతో అనగా ఆదిత్యుడు అనగా సూర్యుడు, చంద్రుడు అను భేదములతో నన్ను తలంచి ఉపాసించుచుందురు. అనగా ఆ ఒక్క భగవంతుడే అయిన విష్ణువు, సూర్యుడు మొదలగు రూపములతో వుండియున్నాడని వారి భావము.

ఇంకా అనేకమంది భక్తులు అన్ని దిక్కులకు ముఖములు కలిగియున్న అనగా చతుర్ముఖుడుగా వున్న విశ్వమూర్తిని అనేక రూపములు గలవానిగా తలంచి ఉపాసించుచుందురు.

మరియు ఆ విధముగా భక్తులైనవారు అనేక రూపములుగా భగవంతుడున్నాడని తలంచి ఉపాసించుచున్నప్పుడు వారందరూ నిన్నే ఉపాసించుచున్నారని తలంచుట ఎట్లు కుదురును అని శంకించగా ఆ శంకానివారణార్థము భగవంతుడైన శ్రీకృష్ణుడు యీ విధముగా చెప్పు చున్నారు-

**9.16. అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్,**
**మంత్రో ఽహమ హమేవాజ్యమహమగ్నిరహం హుతమ్.**

అనగా - ఋతు అనగా శ్రౌతయజ్ఞవిశేషమును నేనే అయివున్నాను. మరియు స్మార్తయజ్ఞ విశేషము గూడ నేనే అయివున్నాను. అవికాక పితృదేవతలకు యివ్వబడు 'స్వధా' అను పేరు గల అన్నమును గూడ నేనే అయివున్నాను. అన్ని విధములగు ప్రాణుల ద్వారా తినబడుతున్న ఔషధమును గూడ నేనే అయివున్నాను.

అట్లు కానిచో సర్వవిధ ప్రాణులు తినునటువంటి సాధారణమైన ఆహారము 'స్వధా' అని అనబడును. మరియు వ్యాధులను నశింపజేయుటకు ఉపయోగించు
ఔషధమును గూడ ఔషధమనియందురు.

మరియు దేవతలకు మరియు పితృదేవతలకు అన్నముగా తలంచి పంపబడు హవిస్సు అను మంత్రమును గూడ నేనే అయి వున్నాను. అంతేగాక నేనే ఆజ్యమును, హవిస్సును, ఘృతమును గూడ నేనే అయి వున్నాను. హోమము చేయబడు అగ్నిని గూడ నేనే అయివున్నాను. మరియు నేనే హవనరూపమైన కర్మను గూడ అయివున్నాను.

**9.17. పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః,**
**వేద్యం పవిత్రమోంకార ఋక్సామయజురేవ చ.**

అనగా - నేనే ఈ జగత్తునంతటిని కల్పించు తండ్రిని మరియు ఈ ప్రపంచమునకు రూపము కల్పించి జన్మింపజేయు తల్లిని గూడ అయివున్నాను. మరియు నేనే ప్రాణులన్నింటి యొక్క కర్మ ఫలములను విధించునటువంటి విధాతను మరియు పితామహుడను అనగా తండ్రి యొక్క తండ్రిని అయివున్నాను. అంతేగాక తెలియ తగినవాడను సర్వప్రాణులను పవిత్రముగా చేయువాడను, ఓంకారమును, ఋగ్వేదమును, సామవేదమును మరియు యజుర్వేదమును అన్నియును నేనే అయి వున్నాను.

అందుకే గాబోలు మహాభాగవతమునందలి సప్తమ స్కంధమునందు ......

**"కలడంబోధి కలండుగాలి కలడాకాశంబునన్ కుంభినిన్,**
**కలడగ్నిం దిశలం, బగళ్ళ, నిశలం ఖద్యోత చంద్రాత్మలన్,**
**కలడోంకారమునం త్రిమూర్తులం త్రిలింగవ్యక్తులందంతటన్**
**గలడీశుండు గలండు తండ్రి వెదకంగా నేల యీయాయెడన్."** అని చెప్పియున్నారు.

(చూ. స.స్కం. శ్రీమహాభాగవతము)

మరియు నేనే -

**9.18. గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్.**
**ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్.**

అనగా - నేనే గతిని, నేనే కర్మఫలమును, భర్తను, సర్వప్రాణులను పోషించువాడను, సర్వమునకు ప్రభువును, అందరికి స్వామిని, ప్రాణుల యొక్క కర్మలకు మరియు అకర్మలకు సాక్షిని, సర్వ ప్రాణులు నివసించుటకు యోగ్యమైన క్షేత్రమును, నా శరణుజొచ్చిన వారినందరి యొక్క దుఃఖములను దూరము చేయువాడను, అయాచిత ఉపకారము చేయువాడను, జగదుత్పత్తికి కారణమైనవాడను మరియు సర్వలోకములు దేనియందు లీనమగునో అట్టి ప్రళయమును గూడ నేనే.

మరియు అన్ని విధములైన ప్రాణులు నివసించు స్థానమును మరియు ప్రాణులన్నియు కాలంతరమందున అనుభవించుటకు యోగ్యమగు కర్మల యొక్క ఫలములకు భాండాగారమును నేనే. మరియు వినాశమనునది ఎరుంగనటువంటి మూల పదార్థమును అనగా బీజమును నేనే. అనగా రూపములు దాల్చుటకు యోగ్యమైన వస్తువులకు నాశములేని మూల పదార్థమును అనగా కారణ పదార్థమును నేనే.

**ప్రపంచము తోచుచున్నంత కాలము దానికి కారణ స్వరూపమైన బీజము తప్పక యుండును. అందువలన బీజము 'అవినాశి' అని చెప్పబడినది.** [illegible] బీజము [illegible]

లేకుండా ఏ ఒక్క వస్తువు గూడ ఉత్పన్నము కాదు. మరియు అట్టి ఉత్పత్తి నిత్యమూ జరుగుచుండుట చూడబడుచున్నది. దీనివలన తెలియబడుచున్నదేమన ? **బీజము యొక్క పరంపర ఎన్నడూ నశించదు.**

మరియు -

**9.19. తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామిచ,**
**అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున.**

అనగా – నేనే సూర్యుడనై నా యొక్క కొన్ని తీక్షణమైన కిరణముల ద్వారా అన్నింటిని తపింపజేయుదును. మరియు కొన్ని కిరణముల ద్వారా వర్షము కురియునట్లుగా చేయుదును. మరియు వర్షము కురింపించిన తరువాత కొన్ని కిరణముల ద్వారా ఎనిమిది మాసముల కాలము వరకు జలమును శుష్కింప జేయుచుందును మరల వర్షాకాలము వచ్చిన తరువాత మరల వర్షమును కురియునట్లు చేయుదును.

**నీవే చండగభస్తి మండలముచే యింకింతు వంభోనిధుల్**
**నీవే లోకహితార్థమై కురియు దంతేవాన మేఘాకృతిన్**
**నీవే జేసెద భస్మరాశిగ వనానీకంబు దావాగ్నివై**
**నీవే బెంచెదవెల్ల వోషధుల రేలిందుండవై వెన్నెలన్.** (చూ. గయోపాఖ్యానము)

ఓ అర్జునా ! దేవతల యొక్క అ మృతత్వమును నేనే. మరియు మర్త్యలోకమునందు నివశించువారియొక్క మృత్యువును నేనే. అంతేగాక సత్పదార్థమును, అసత్పదార్థమును రెండునూ నేనే. **"జడచేతన గుణదోషమయ విశ్వకీన్హకరతార్"** అన్నాడు మహాభక్తుడు, కవి అయిన తులసీదాసు. అనగా భగవంతుడు జడము, చేతనము, గుణము – దోషము అన్నింటిని కలిపి ఈ ప్రపంచమును సృష్టించియున్నాడు. అనగా దేనితో కూడియున్నందు వలన ఈ ప్రపంచము మరియు ప్రపంచమందలి ప్రాణులన్నియు వున్నట్లుగా తోచుచున్నవో మరియు ఏ తత్వముతో సంబంధము లేనందువలన ఈ ప్రపంచము మరియు ప్రపంచమందలి ప్రాణులన్నియు లేనట్లుగా తోచునో ఆ తత్వమును నేనే.

కాని భగవంతుడు స్వయముగా పూర్తిగా అసత్తు అనగా లేనివాడు కాదు. అట్లుగాక సత్తు మరియు అసత్తు అను శబ్దముల యొక్క అర్థము యిచ్చట కార్యము మరియు కారణముగా గుర్తించవలయును. **భగవంతుడు కారణము, జగత్తు కార్యము. కారణములేని కార్యముండదు. కార్యములేని కారణ పదార్థము వుండును.**

ఇంతకు పూర్వము చెప్పినట్లుగా క్రమము తప్పక ఏ జ్ఞాని ఏకత్వ–పృథకత్వాది భేదములను గుర్తించి విజ్ఞానరూపమైన యజ్ఞముల ద్వారా పూజలు జరుపుచూ నన్ను పాసించుచుండునో అటువంటివారు తమకున్న విజ్ఞానమునకు తగినట్లుగా నన్నే పొందుదురు.

అట్లుగాక విషయవాసనతో కూడియున్న అజ్ఞాని -

**9.20. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే,**
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమశ్నంతి దివ్యాందివి దేవభోగాన్.**

అనగా - ఋగ్వేదము, యజుర్వేదము మరియు సామవేదము ఈ మూడు వేదములను పఠించి చక్కగా సారమెరింగినవారు మరియు సోమరసమును పానము చేసినవారు ఆ విధముగా పాపరహితులైనవారు అనగా సోమరసమును పానము జేసినందువలన సర్వవిధ పాపములు తొలగిపోయినవారు అయినటువంటి సకామపురుషులు అనగా లోకమునందలి సంపదలను పొందగోరినవారు వసు మొదలగు దేవతల రూపమున స్థిరపడియున్న పరమాత్మ స్వరూపుడనైన నన్ను అగ్నిష్టోమాది యజ్ఞముల ద్వారా పూజించువారై స్వర్గమును పొందవలయునని కోరుచుందురు. అటువంటివారు తాము చేసియున్న పుణ్యకర్మల ఫలముగా ఇంద్రుని స్థానమును పొంది స్వర్గమునందు దేవతల యొక్క భోగములను పొందుదురు. అనగా స్వర్గమునందు దేవతల చేత అనుభవించబడు అప్రాకృతమైన భోగములను పొందుదురు.

**9.21. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి,**
**ఏవం త్రైధర్మ్యమనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే.**

అనగా - అటువంటి పుణ్యకర్మలు చేసినటువంటి పురుషులు ఆ అతి విశాలమైన, విస్తృతమైన స్వర్గలోక సుఖములననుభవించిన మీదట, ఆ సుఖములు ప్రాప్తించుటకు కారణ రూపమైన పుణ్యకర్మల ఫలములు క్షీణించిపోగా తిరిగి వారు యీ మర్త్యలోకమునకు వత్తురు

పైన చెప్పబడినట్లుగా కేవలము వైదిక కర్మలను ఆశ్రయించి ప్రాపంచిక సుఖముల యందు కోరికలు గలవారు అనగా విషయవాసనలతో నిండియున్న మనస్సు గల మానవులు అనేకమార్లు ఆ వాగమనములను అనగా రాకపోకలను అనగా జన్మ-మరణములను పొందుచునే యుందురు. వారికి ఎచ్చటనూ స్వతంత్రముగా అనగా వారు కోరుకొన్నట్లుగా పొందజాలరు

కాని ఎటువంటి కోర్కెలు లేనటువంటి సమ్యక్‌జ్ఞానము గల మహాత్ములు -

**9.22. అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.**

అనగా - సంన్యాసి అయివున్నవాడు అనన్య భావముతో [illegible] నితఃపరంబెరుగన్" అను భావముతో కూడినవారై అనగా పరమ [illegible] అయి వున్న నన్ను తనయొక్క ఆత్మ రూపముగా దలంచి, నిరంతరము [illegible] శ్రేష్ఠమైన నిష్కామ భావముతో నన్నే ఉపాసించుచూ వుందురో, నిరంతరము [illegible]

లగ్నము చేసి పరమార్థమును ఎరింగియున్న జ్ఞానుల యొక్క యోగక్షేమములను నేనే వహించెదను. అనగా అటువంటివారి భారమంతయు నేనే వహించెదను.

అప్రాప్యమైన వస్తువు యొక్క ప్రాప్తిని అనగా **తనకు లేనటువంటి వస్తువును పొందుటనే యోగమందురు.** మరియు **లభించియున్న వస్తువును రక్షించుటను క్షేమమందురు.** ఆ విధముగా ఆ పరమార్థమును యెరింగిన జ్ఞానుల యోగ క్షేమములను నేను స్వయముగా నెరవేర్చుచుందును.

అట్లేలయన ? **జ్ఞానియైనవానిని నాయొక్క ఆత్మగానే తలంచుచుందును.** ఆ విధముగా ఆతడు నాకు అత్యంత ప్రియుడు. అందుచేత **పరమార్థతత్వమును ఎరింగి నాయందే మనస్సును లగ్నము చేసియున్న నా భక్తులను నా ఆత్మరూపముగాను అత్యంత ప్రేమపాత్రులు గాను భావించుచుందును.**

**పూర్వపక్షము** – అట్లు కానటువంటి యితర విధములైన భక్తులందరి యోగక్షేమములను భగవంతుడే చూచుచుందునేమో ?

**సమాధానము** – ఆ మాట గూడ నిజమే. అవశ్యముగా ఆయన యొక్క భక్తులందరి యోగక్షేమములను ఆయనయే చూచుచుండును. కాని అందులో కొంచెము భేదమున్నది. ఇతరమైన భక్తులు వారి యోగక్షేమములను గురించి వారే ప్రయత్నించుచుందురు. కాని అనన్య భావముతో కూడియున్న భక్తులు మాత్రము తమ యోగక్షేమములను గురించి తాము ఎటువంటి ప్రయత్నము చేయరు. వారి యొక్క యోగక్షేమముల భారమంతయు నాకే వదలివైతురు. అట్లేలయన ? వారు తమ జీవన మరణ భావమును నాకే వదలివైతురు. తమ భారమంతయు భగవంతునికే వదలివైతురు. అందుకే కాబోలు ఒక తత్త్వవేత్త యిలా పాడుకొన్నాడు –

**"భక్తుడైనవాడు బలిమి విశ్వము వీడు**
**దిక్కులేక తుదకు దీనుడగును**
**హరిని జేరగోరు 'హో'యని చింతిల్లు**
**గుణ్యరామరాయ గురువిధేయ** (చూ. రామరాయ శతకము)

అందువలన అటువంటి అనన్య భక్తుల యోగక్షేమములను భగవంతుడే కాపాడుచుండును.

అనేకమంది భగవంతుళ్ళు వున్నట్లుగా చెప్పుచున్నను ఆ భగవంతుళ్ళందరూ మీరేనేమో? అందుచేత అన్య దేవతలను పూజించు భక్తులందరూ గూడ మిమ్ములనే పూజించు నట్లుగా తలంచవచ్చును గదా ? అని అన్నచో తప్పుకాదేమో ?

**9.23. యే ఽప్యన్యదేవతాభక్తా యజంతే శ్రద్ధయాన్వితాః,**
**తే ఽపి మామేవ కౌంతేయ యజన్త్యవిధిపూర్వకమ్.**

అనగా – అన్య దేవతలను పూజించు భక్తులు అతి శ్రద్ధతోను, ఆస్తిక బుద్ధితోనూ ఆయా దేవతలను పూజించుచుందురు. వారు అలా చేస్తూ వున్నప్పటికి అప్రత్యక్షముగా

ఆయా భక్తులందరూ నన్నే పూజించుచున్నారు. కాని విధిపూర్వకముగా అనగా శాస్త్ర గ్రంథములు చెప్పినట్లు గాక శాస్త్ర విరుద్ధముగా ఆ యా కల్పిత దేవతలను పూజించుచుందురు. కావున **వారు అజ్ఞానపూర్వకముగా నన్నే పూజించుచున్నారు.**

శంక – వారు చేయు పూజలు అవిధి పూర్వకములు ఎట్లగుచున్నవి ? అన్నచో – చెప్పుచున్నారు.

**9.24. అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ,**
**న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే.**

అనగా – శ్రౌత మరియు స్మార్త మొదలగు సమస్తమైన యజ్ఞములకు ఆ యా దేవతల రూపమున నేనే భోక్తను, నేనే యజమానిని గూడ. నేనే సర్వ విధయజ్ఞములకు స్వామిని. ఈ మాట "అధియజ్ఞో అహమే వాత్ర" ఈ శ్లోకమునందు గూడ ఆ మాటయే చెప్ప బడినది. కాని అజ్ఞానులైన ఈ మనుష్యులు ఈ విధముగా యదార్థమైన తత్త్వముతో నన్నెరుగరు. అందువలన 'అవిధి' పూర్వకమైన పూజలు చేయుచూ ఆ యజ్ఞముల యొక్క యదార్థ ఫలమును పొందజాలకయున్నారు. అందువలన అటువంటి వారు సత్ఫలితములను గాక అసత్ ఫలితములను పొంది పతనావస్థను పొందుదురు.

భక్తులైనవారు అన్యదేవతలను భక్తిరూపమున సేవించుచున్నారు గావున, అవిధి పూర్వకముగా నన్నే సేవించుచున్నారు. అందుచేత అటువంటివారికి గూడ వారి వారి యజ్ఞఫలములు తప్పక కలుగును. అదెట్లనినచో చెప్పుచున్నాను వినుము –

**9.25. యాంతి దేవవ్రతా, దేవాన్పి తౄన్యాంతి – పితృవ్రతాః,**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి, మద్యాజినో ఽపి మామ్.**

అనగా – దేవతలను పూజించువారు, దేవతలనే ధ్యానించు దేవోపాసకులు ఆ దేవతలనే పొందుదురు. శ్రాద్ధములు, మాసికములు, తద్దినములు మొదలగు క్రియల యందు శ్రద్ధాభక్తులు గలవారు పితృదేవతలనే పొందుదురు. భూతములను పూజించువారు వినాయకుడు. షోడశ మాతృగణము అనగా అమ్మవార్లు మరియు చతుర్భగిని అనగా నాలుగు విధములగు అక్కలు మొదలగు భూత గణములను పొందుదురు. అట్లుగాక నన్ను అనగా పరమాత్మ పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుని అనగా వాసుదేవుని పూజించు వైష్ణవ భక్తులు అనగా విష్ణువుని పరబ్రహ్మ స్వరూపునిగా తలంచువారు తప్పనిసరిగా ఆ విష్ణువునే పొందుదురు. పరిశ్రమయందు సమానత్వమున్నప్పటికీ అన్య దేవతోపాసకులు అజ్ఞానము కారణముగ కేవలము సర్వేశ్వరుడనైన నన్ను భజింపరు. ఆ కారణము చేతనే వారందరు అల్పమైన ఫలములను మాత్రమే పొందుదురు.

నన్ను భజించు భక్తులకు కేవలము పునర్జన్మ లేనటువంటి అనంతమైన ఆనందమైన ఫలము లభించును. ఇంతేగాక నన్ను ఆరాధించు కార్యక్రమము గూడ ఎటువంటి ఆటంకములు లేకుండా నిర్విఘ్నముగా సాగును. అదెట్లన ? చెప్పుచున్నారు –

**9.26. పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి,**
**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః.**

అనగా – ఏ భక్తుడు నాకు భక్తిభావపూర్వకముగా పత్రము, పుష్పము, ఫలము మరియు జలము మొదలగు ఏ చిన్ని వస్తువును సమర్పించునో అట్టి ప్రియతాత్ముడు అనగా నాయందు ప్రేమబుద్ధిగల భక్తుడు భక్తిపూర్వముగా అర్పించినటువంటి ఆ పత్ర, పుష్ప, ఫలాదులను నేను స్వయముగా సంతోషముగా స్వీకరింతును.

అట్లెందుకన ?

**9.27. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,**
**యత్త పస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్.**

అనగా – ఓ కుంతీపుత్రా ! నీవు నీకు తనంతట తానుగా లభించిన కర్మను చేయుదువో, ఏది అప్రయత్నముగా లభించిన దానిని భుజింతువో, నీకు లభించిన శ్రౌతయజ్ఞముగాని లేక స్మార్తయజ్ఞరూపమైన హవనమునుగాని చేయుదువో, సువర్ణమో, అన్నమో, ఘృతమో మొదలగు వస్తువులను బ్రాహ్మణాది సత్పాత్రలకు దానము చేయుదువో మరియు ఏదో నీకు చేతనైనంతగా తపమును ఆచరింతువో దానినంతటిని నాకు అర్పించుము.

అలా చేసినందువలన నీకు కలుగు లాభమేద్దియో చెప్పెద వినుము –

**9.28. శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః,**
**సంన్యాస యోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి.**

అనగా – ఈ విధముగా నీవు ఆచరించు కర్మలను అనగా ఆ యా కర్మఫలములను నాకు భక్తిభావపూర్వకముగా అర్పించినచో నీచే ఆచరించబడిన శుభాశుభ కర్మల ఫలరూపమైన బంధమునుండి అనగా ఆ యా కర్మలకు కలుగు మంచి ఫలముగాని, లేక చెడ్డ ఫలముగాని, దాని వలన కలుగు కర్మరూప బంధము నుండి విడువడుదువు. మరియు ఈ విధముగా నీవు **సంన్యాస యోగముతో కూడిన ఆత్మకలవాడవై** నాకు అర్పించుట అను కర్మ చేసిన కారణముగ కలుగు **"సంన్యాసము"** మరియు **కర్మరూపమైన 'యోగము'** యీ రెంటి కలయిక వలన కలిగిన **సంన్యాస రూప యోగము** వలన నిండియున్న **అంతఃకరణము కలవాడవై** అనగా **సంన్యాసయోగయుక్తాత్ముడవై నీవు ఈ స్థూలదేహమునందు వుండగానే సర్వవిధ కర్మ బంధముల నుండి ముక్తుడవై,** ఈ స్థూల దేహము నశించిన తరువాత నన్నే పొందెదవు. అనగా నాయందే విలీనమై పోయెదవు.

**పూర్వపక్షము** – ఈ చెప్పబడినది నిజమైతే భగవంతుడు రాగద్వేషాది దుర్గుణములు కలవాడగును గదా ? అట్లేలయన ? ఆయన తన భక్తులైనవారినే అనుగ్రహించును గాని అట్లుకాని వారిని అనుగ్రహించడుగదా ? అందువలన భగవంతుడు అట్లు చెప్పుట సరికానేరదు – అన్నచో –

**9.29. సమో௨హం సర్వభూతేషు న మే ద్వేష్యో௨స్తి న ప్రియః,**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్.**

అనగా – నేను ప్రాణులన్నింటి పట్ల ఎటువంటి రాగద్వేషములు లేకుండగనే వ్యవహరింతును. కొందరి పట్ల నాకు ప్రేమగాని మరికొందరి పట్ల ద్వేషముగాని నాయందు

కలుగదు. ఏలయన ? నేను అగ్నివంటి వాడను. అగ్నికి దూరముగా నుండువాని చలిపోదు. దగ్గరగా వుండువాని శీతలత్వము అగ్నికి దగ్గరగా వుండుట చేత త్వరగా దూరమగును అనగా నివారణ పొందును. అదే విధముగా నా యందు భక్తిభావము కలిగి సదా నాకు సమీపముగా నుండువారి పాపములు త్వరగా క్షీణించి అనగా దుఃఖములు తొలగి ఆనందము కలుగును. అట్లుగాక పరదైవములను పూజించుచూ నాయందు భక్తిభావము లేక దూరముగా నుండువారి దుఃఖములు దూరముకావు.

ఈశ్వరుడనైయున్న నా యందు భక్తిభావము కలిగి సదా సర్వదా నన్ను గురించియే ఆలోచించుచూ నన్నే భజించు భక్తులు **తమంతట తాముగానే నా యందే లీనమైయుందురు.** మరికొంతమంది ఆసక్తితోగాని, ప్రేమతోగాని, దయాభావముతోగాని ఎటువంటి నిమిత్తము లేకయే నా యందు ఎడతెగని భక్తిభావముతో ప్రేమ భావముతో ఎల్లప్పుడూ నాతోనే యుందురు. అటువంటివారిని నిజమైన ఆచరణ కలిగినవారుగా తలంచవచ్చును. కారణమేమన ? అటువంటివారు నాయందు దాగియున్న ఈశ్వరత్వమును అనగా సర్వాత్మతత్వమును గుర్తించినవారై యుందురు. అటువంటి వారికి నాయందుగాని, నా ఈశ్వరత్వమును గురించిగాని ఎటువంటి అనుమానము, సందేహము వుండదు. వారు నాయందు దృఢము మరియు నిశ్చయమైన సర్వాత్మభావము కలిగియుందురు.

తమయందు కలిగియున్న నిశ్చిత అనగా స్థిరమగు ఈశ్వరభావము వలన ప్రాపంచిక దోషములు లేనివారై యుందురు.

**9.30. అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్,**
**సాధురేవ స మంతవ్యః స్సమ్యగ్వ్యవసితో హి సః**

అనగా – ఒకవేళ ఎవ్వడైన నిజమగు దుర్మార్గుడు అనగా చెడు పనులు చేయువాడు అయినట్టి మనుష్యుడు కూడ అనన్యమైన అనగా ఏకనిష్టతో ప్రేమభావముతో కూడినవాడై పరమేశ్వరుడనైన నన్ను భజించునో అట్టి వానిని సాధుపురుషునిగానే తలంచవలయును. అనగా అట్టి వానిని నిజమైన ఆచరణ కలవానిగానే భావించవలయును. అట్లేలయన ? ఆతడు నిజముగానే నిశ్చయ భావముతో కూడిన వాడై యున్నాడు. అనగా సర్వోత్తమ గుణవంతుడై యున్నాడు.

ఆంతరికమైన నిశ్చయ భావమును దృష్టియందుంచుకొని బైట వున్న దురాచారిత్వమును పరిగణించరాదు. అలా పరిగణించక –

**9.31. క్షిప్రం భవతి ధర్మాత్మా శాశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి**

అనగా – అటువంటివారు ధర్మాత్ములు అనగా ధర్మచింతన కలిగియున్న చిత్తము కలవారై యుందురు. అందుచేత శాశ్వతమైన అనగా నిత్యమైన, సత్యమైన శాంతిని పొందినవారగుదురు.

ఓ కుంతీపుత్రా ! నీవు అసలు నిజమైన అనగా సత్యమై యున్న ఒక్కమాట సావధాన చిత్తుడవై వినుము. నీవు నిశ్చితమై యున్న చిత్తము కలవాడవై నేచెప్పిన ప్రతిజ్ఞ చేయుము. అనగా దృఢమైన చిత్తము కలవాడవై పరమాత్మ స్వరూపుడనైన నా యందు ఎంత దృఢముగా నీ అంతఃకరణమును సమర్పింతువో అప్పుడు నా భక్తుడైన వాడు ఎవ్వడూ గూడ నీ వలెనే ఎటువంటి కష్టనష్టములను పొందడు. అనగా అతనికి ఎటువంటి పతనము సంభవించదు.

అనగా ఆతడు ఆ బ్రహ్మలోకము నుండి క్రిందికి జారి భూలోకమునందు మరణస్వభావము కలిగియుండు స్థూల, సూక్ష్మ కారణ దేహములను పొందడు.

**9.32.** **మాం హి పార్థ వ్యపాశ్రిత్య యే ఽపి స్యుః పాపయోనయః,**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తే ఽపి యాంతి పరాం గతిమ్.**

అనగా – పార్థా ! అట్లేలయన ? పాపయోనుల యందు దేహములను పొందినవారు అనగా ఎవరి జన్మకు అనగా స్థూల దేహమును పొందుటకు పాపమొక్కటియే కారణమో **అట్టివారే ప్రాణులందరూను. అట్టివారెవరన ? వారు స్త్రీలు, వైశ్యులు మరియు శూద్రులు.** అయిన వారుగూడ నన్ను శరణుజొచ్చి అనగా నాయందు నిశ్చలమైన భక్తిభావము కలిగి, నన్నే తమకు ఏకమాత్ర రక్షకుడుగా నమ్మియున్నవారు తప్పక **పరమగతిని అనగా నా స్వరూపమును పొందుదురు.** ఆ విధముగా ఉత్తమగతిని అనగా **పాపలోకమునకు తిరిగి రాని స్థితిని పొందుదురు.**

**9.33.** **కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా,**
**అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్.**

అనగా – పుణ్యయోనులయందు స్థూలదేహములను పొందు బ్రాహ్మణులు మరియు రాజర్షులైన భక్తులు తప్పక ఉత్తమగతినే పొందుదురు. ఎవడు **రాజైయుండియు ఋషిత్వము కలిగియుండునో ఆతడు 'రాజర్షి' అనబడును.**

అట్లేలయన ? అట్టివారు అనిత్యము, క్షణభంగురము మరియు ఎటువంటి సుఖములు లేనటువంటి మానవలోకమునందు స్థూలదేహమును పొందియు అనగా పరమ పురుషార్థమును పొందుటకు సాధనరూపమైన, దుర్లభమైన మానవ దేహమును పొంది ఈశ్వర స్వరూపుడనైన నన్నే భజించి, నాయందే సేవాభావము కలిగియుందురు –

పరమార్థమును పొందుటకు ఎన్నియో భక్తి మార్గములు చెప్పబడియున్నవి –
**తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా**
**ర్చనముల్, సేవయు, ఆత్మలో నెఱుకయున్, సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబుదైత్యోత్తమా** (చూ. భాగవ. సప్తమ స్కంధము 53)

ఏ విధముగా భగవంతుని భజనలు, సేయవలయునన్నచో –

**9.34.** **మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,**
**మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః.**

అనగా – అర్జునా ! నీవు "మన్మనా" అనగా నాయందే మనస్సు కలవాడవు కమ్ము. **"మద్భక్త"** అనగా నీవు నా యొక్క భక్తుడవు కమ్ము. **"మద్యాజీ"** అనగా నన్ను మాత్రమే పూజించువాడవు కమ్ము. మరియు నాకు మాత్రమే నమస్కరించుము. ఈ విధముగా నీ

చిత్తమును నాయందే లయమొనరించి నా శరణుజొచ్చిన నీవు, నన్నే జపించు నీవు పరమేశ్వరుడనైన నన్నే పొందగలవు. కారణమేమన ? నేనే **సర్వభూతములకు ఆత్మనైయున్నాను.** సర్వమునకు నేనే పరమగతిని అనగా లక్ష్యమునై యున్నాను. ఈ విధముగా **ఆత్మరూపుడనైయున్న నన్నే** నీవు పొందెదవు.

ఈ విధమగు వాక్కుల వలన స్పష్టమగుచున్నదేమనగా –

ఇంతకుముందు వాడిన "మామ్" శబ్దముతో "ఆత్మానమ్" అను శబ్దమునకు సంబంధమేర్పడినది.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి రాజవిద్యారాజగుహ్యయోగమనబడు*

*తొమ్మిదవ అధ్యాయమునకు*

*శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.*

*అనువాదకులు – శ్రీ సదానందభారతి.*

*ప్రణవాశ్రమము.*

# పదవ అధ్యాయము

ఏడవ మరియు తొమ్మిదవ అధ్యాయములందు భగవంతుని తత్వమును గురించి మరియు విభూతులను గురించి విశదముగా చెప్పబడినది. ఇప్పుడు యింక ఏ యే భావములతో భగవంతుని గురించి తెలియదగియున్నదో ఆ భావములను గురించి చెప్పవలసి యున్నది. భగవంతుని యొక్క తత్వమంతయూ యింతకు పూర్వమే చెప్పబడినప్పటికీ ఆ తత్వము మహాపండితమ్మన్యులకు గూడ తెలియరాని దగుట వలన మరల మరల ఆ తత్వమును గురించి చెప్పవలసియే యున్నది.

*ఆ కారణముగ భగవంతుడు యిట్లు చెప్పుచున్నాడు –*

**10.1. భూయ యేవ మహాబాహో ! శృణు మే పరమం వచః,**
**యత్తే ఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా.**

అనగా – ఆజానుబాహువులు గల ఓ అర్జునా ! అయినప్పటికి అనగా యింతకు పూర్వము నాచే నీకు అతి విశదముగా చెప్పబడినప్పటికి మరల యిప్పుడు నీకు బాగుగా తెలియగలందులకై ఆ భగవత్తత్వ వర్ణన వినిపించవలసియే యున్నది. అందువలన మరల చెప్పుచున్నాను శ్రద్ధగా వినుము.

నాయొక్క అత్యంత నిరతిశయ తత్వమును ప్రకాశింపజేయునటువంటి కొన్ని వాక్యములు చెప్పెద వినుము. నేను చెప్పునదంతయూ నీకు ప్రసన్నత్వము అనగా ఆనందము కలిగించుట కొరకే. నీ యొక్క హితమును అనగా నీ మేలును దృష్టియందుంచుకొనియే చెప్పుచున్నాను. నాచే చెప్పబడు మాటలు విని నీవు అమృతమును సేవించునప్పుడు కలుగు ఆనందమును పొందెదవు. అందులకే అమృతత్వముతో కూడియున్న మాటలు నీకు చెప్పుచున్నాను.

నేను ఎందులకు యీ మాటలు చెప్పుచున్నానో ముందు విను –

**10.2. న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః,**
**అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః.**

అనగా – బ్రహ్మాది దేవతలు గూడ నా ఉత్పత్తిని గురించి గాని అనగా సర్వమును మించియున్న నా అధికార శక్తిని గురించిగాని లేక నా యొక్క జన్మాది ఉనికిని గురించి గాని కొంచము గూడ ఎరుంగరు. మరియు భృగుడు మొదలగు మహర్షులు గూడ నా ప్రభవమును అనగా జన్మమును గురించి యెరుంగరు.

ఏ కారణము వలన వారు నా జన్మ రహస్యమును గురించి యెరుంగరో చెప్పెద వినుము –

అట్లేలయన ? దేవతల మరియు ఆ మహర్షుల యొక్క సృష్టికి మూలకారణము నేనే అయివున్నాను.

మరియు -

**10.3. యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్,**
**అసంమూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే.**

అనగా-అట్లేలయన ? నేను మహర్షులకు మరియు దేవతలకు గూడ సర్వ ప్రారంభ కారణుడను. నా యొక్క జన్మకు అనగా ఉనికికి కారణమైన యితర వస్తు వేదియును లేదు. అందువలన నాకు జన్మమనునది లేదు. అనగా జన్మము లేనివాడను, అనాదిని అనగా ఆది అనగా ఆరంభమనునది లేనివాడను. అనాదిత్వమే జన్మరాహిత్యమునకు కారణము. అందుచేత ఎవరు నన్ను జన్మరహితునిగాను, అనాదియైనవానిగాను మరియు లోకములన్నింటికి మహాన్ ఈశ్వరుడు అనగా అధిపతిగాను అనగా అజ్ఞానము మరియు దానివలన జరుగు కర్మలు లేనివానిగాను అనగా జాగృతి, స్వప్నము మరియు సుషుప్తియనబడు మూడు అవస్థలు లేనివానిగను, నాలుగవ అవస్థ అనగా తురీయావస్థ కలిగియున్నవానిగా ఎరుంగుదురో అనగా ఆ విధముగా ఎరుంగువారు మనుష్యులయందు జ్ఞానులనబడుదురు. అనగా మోహాదులు లేనట్టి శ్రేష్ఠమైన పురుషులనబడుదురు. అటువంటివారు పూర్తిగా ఎరింగి యుండియేగాని లేక యెరుంగకయుండిగాని చేసిన సర్వవిధపాపముల నుండి విముక్తులగుదురు.

అందుచేతనే నేను సర్వలోకములకు మహాఈశ్వరుడనై యున్నాను.

**10.4. బుద్ధిర్జ్ఞానమసంమ్మోహః క్షమా సత్యం దమః శమః,**
**సుఖం దుఃఖం భవో ఽభావో భయం చాభయమేవ చ.**

అనగా - సూక్ష్మము, సూక్ష్మతరము మొదలగు బాహ్యేంద్రియములకు తోచనటువంటి అనగా గోచరించనటువంటి పదార్థములను తెలుసుకొనునటువంటి అంతఃకరణమునకు సంబంధించిన జ్ఞానశక్తినే బుద్ధి అని చెప్పుదురు. అటువంటి బుద్ధి కలిగియున్న మానవుని **"బుద్ధిమంతుడు"** అని అందురు.

**జ్ఞానము** - ఆత్మ మొదలగు పదార్థముల జ్ఞానము అనగా బోధ, అసంమ్మోహము తెలుసుకొనతగియున్న పదార్థములు ప్రాప్తించినప్పుడు వాటియందు వివేకముతో కూడియున్న ప్రవృత్తి అనగా బౌద్ధిక స్థితి.

**క్షమ** - ఎవరి ద్వారానైన తాను నిందించబడినప్పుడు లేక ప్రశంసించబడినప్పుడు తన చిత్తము నందు దుఃఖము, క్రోధము, సంతోషము మొదలగు వికారములు కలుగకుండుటను 'క్షమ' అని యందురు.

**సత్యము** - ఏదైన వస్తువును చూచినప్పుడు లేక ఏదైన విషయమును గురించి వినినప్పుడు ఏ విధమైన అనుభూతి తనకు కలుగునో ఆయనుభూతిని 'యితరుల బుద్ధియందు

గూడ కలిగించుటకు ఎటువంటి మార్పులు చేర్పులు లేకుండా కలిగించుటను, అట్లు చేయుటకు చెప్పు మాటలను 'సత్య'మందురు.

**దమము** – తన బాహ్యేంద్రియములను తన వశమునందుంచుకొనుట దమమన బడును.

**శమము** – అంతఃకరణము యొక్క ఉపరతి. అనగా అంతఃకరణము నందు సుఖము, దుఃఖము, సంతాపము, వికారము కలుగకుండుట శమమందురు.

**భవము** – అనగా ఉత్పత్తి. అభావము ఉత్పత్తికి విరుద్ధమైనది అనగా లేకుండుట అనగా నాశము మరియు భయము – అనగా తనకు ఏదో కీడు కలుగునను భావము అభయము – భయమునకు విరుద్ధమైన భావము.

**10.5. అహింసా, సమతా, తుష్టిస్తపో దానం యశోఽయశః,**
**భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః.**

అనగా – **అహింస** అనగా అన్ని విధములగు ప్రాణులకు ఎటువంటి బాధ కలిగించకుండుట.

**సమత** – చిత్తమునందు ఎటువంటి వికారములు కలుగకుండుట,

**సంతోషము** – దొరికిన అనగా లభించిన దానితో తృప్తి పడుట,

**తపము** – ఇంద్రియములనన్నింటిని వశమునందుంచుకొని స్థూల దేహమును గూడ శుష్కింపజేసి దానిని అదుపునందుంచుకొనుట

**దానము** – తన శక్త్యానుసారముగ తన వద్ద నున్న సంపదను యితరులకు పంచిపెట్టుట.

**యశము** – ధర్మమును యథాపూర్వకముగా ఆచరించుట వలన లభించు పొగడ్త.

**అపయశము** – అధర్మముతో ఆచరించుట వలన కలుగు నింద.

ఈ విధముగా ప్రాణుల యొక్క వాటి వాటి బుధ్యానుసారముగ చేయబడు కర్మలననుసరించి ఏ ఏ భావములు కలుగుచుండునో అవన్నియు ఈశ్వరుడనైయున్న నా ప్రేరణవలననే కలుగుచున్నవి.

మరియు –

**10.6. మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా,**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః.**

అనగా – భృగుడు మొదలగు ఏడుగురు మహర్షులు (భృగు, మరీచి, అత్రి, పులస్త్య, క్రతు మరియు వశిష్ఠుడు), యింకా వీరికి పూర్వమే వుండియున్న నలుగురు మనువులు (సావర్ణి, ధర్మసావర్ణి, దక్షసావర్ణి మరియు సావర్ణ), ఆ మనువులకు వారికి ముందు జరిగి పోయిన భూతకాలముతో సంబంధము కలదు. మరియు "సావర్ణులు" అనగా యీ పేరుతోడనే

పురాణములందు ప్రసిద్ధులుగా వుండియున్నవారు, వీరందరూ గూడ నా యొక్క ఈశ్వరీయ శక్తికి లోబడినవారై యున్నారు. అంతేగాక వీరందరూ నా యొక్క మహత్వము ద్వారా కలిగినవారే అనగా జన్మించినవారే. ఆ మనువులు మరియు మహర్షుల ద్వారా రచించబడిన ఈ చరాచర రూపమైన సమస్త ప్రాణులు లోకమునందు అతి ప్రసిద్ధులైయున్నారు.

**10.7. ఏతాం విభూతిం యోగం చ మమ యోవేత్తి తత్వతః,**
**సో ఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః.**

అనగా – పైన చెప్పబడిన నా విభూతిని అనగా వ్యాపకత్వమును మరియు నా యొక్క యోగయుక్తిని అనగా నా మాయా వ్యాపారమును లేక యోగముతో కూడినందున కలుగుచున్న సర్వజ్ఞతారూపమైన సామర్థ్యమును అనగా యోగమను శబ్దము ద్వారా చెప్పబడు నా యొక్క అఘటనాఘటన పూర్వకమైన శక్తిని ఎవ్వడు తత్వరూపమున చక్కగా ఎరుంగునో అటువంటి పురుషుడు తత్వరూపమును దాల్చిన పూర్ణజ్ఞానముతో కూడిన నిశ్చల యోగముతో కూడియుండును. ఈ విషయమునందు ఎటువంటి సంశయము లేదు.

శంక – ఏ విధమైన స్థిరయోగముతో కూడియున్నవాడగును ? అన్నచో –

**10.8. అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే,**
**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః.**

అనగా – వాసుదేవనామకుడను పరబ్రహ్మమును అయివున్న నేను **సమస్తమైన జగదోత్పత్తికి కారణమునైయున్నాను.**

మరియు నాకారణముగనే ఈ జగత్తంతయు స్థితి, లయము, క్రియలు మరియు కర్మఫలోపభోగ రూపవికారములు కలిగియున్నది. నా కారణముగనే ఈ జగత్తు తిరుగుచున్నట్లుగా అనగా నడచున్నట్లుగా తోచుచున్నది. ఈ రహస్యమును సంపూర్ణముగా తెలుసుకొని భావసమన్వితుడై అనగా పరమార్థ తత్వమును బాగుగా ఎఱింగి దానితో తాదాత్మ్యమును పొందిన బుద్ధిమంతుడు అనగా తత్వజ్ఞానియైన పురుషుడు సర్వకాల సర్వావస్థలయందును నన్నే తలంచి భజించు చుందును.

మరియు –

**10.9. మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్:**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ.**

అనగా – నాయందే చిత్తముగలవారు 'మచ్చిత్త' అనగా నా యందే చిత్తము గలవారు అనబడుదురు. మరియు నాయందే కన్నులు, యింద్రియ రూపమైన ప్రాణములను [illegible] గావించి యున్నవారు, అట్లే నాయందే సమస్త కర్మలను ఆ కర్మలకు ఉపయోగపడు సాధనములను సమర్పించి యున్నవారు వారు మద్గత ప్రాణులు అనగా నాయందే మనః ప్రాణములు

గలవారగుదురు. అట్లు గానున్న నాయందే తమ జీవితములనే అర్పించియున్నవారు అనగా "నీవే తప్ప నితః పరంబెరుగన్" అన్నట్లుగా నా శరణు జొచ్చియున్నవారలు "మద్గత ప్రాణులు" అనబడుదురు.

అట్టి నా భక్తులు పరస్పరము ఒకరితో నొకరు నా తత్త్వమును తెలుపుకొనుచు వినుచూ, మరియు తమ జ్ఞానము, బలము, సామర్థ్యము మొదలగు గుణములు గలవారై పరమేశ్వరు డనైయున్ననా యొక్క స్వరూపమును వర్ణించుచూ సర్వకాల సర్వావస్థల యందున తృప్తిని పొందినవారై యుందురో అనగా సంతోషమును పొందినవారై యుందురో మరియు నాయందే అనగా నా తత్త్వమునందే మనో రూపముతో విహరించు చుందురో అనగా తమకు అత్యంత ప్రియమైన మనిషి లేక వస్తువులు లభించినప్పుడు పొందునట్టి ఆనందమును పొందుదురో-

మరియు నన్ను అనగా నాయందు ప్రేమ భావము కలిగి పై విధముగా నన్నే భజించుచుందురో - అట్టివారు -

**10.10. తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్;**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే.**

అనగా - ఆ విధముగా సమస్తమైన బాహ్యవిషయములందు తృష్ణవేనివారై, సర్వకాల సర్వావస్థలయందును నన్ను పొందవలయునను తీవ్రమైన కోరిక గలవారై నన్ను భజించుచూ, నా సేవయందే నిమగ్నమైయున్న పురుషులకు ఏవో లౌకిక వస్తువులను పొందగోరుచూ నన్ను భజించు పురుషులకుకాదు, అట్లుగాక కేవలము నాయందు ప్రేమ భావము గలిగి నన్ను భజించు పురుషుల యొక్క అనగా కేవలము నాయందు గల ప్రేమ భావముతో నన్ను భజించువారలకు నేను బుద్ధి యోగమును ప్రసాదింతును.

**నా యొక్క తత్త్వమును గురించిన యదార్థ జ్ఞానమునే బుద్ధియోగమందురు. అట్టి** నా తత్త్వజ్ఞానమును కలిగియుండుటయే **బుద్ధియోగము.**

ఏ పురుషులు పూర్ణ జ్ఞానరూపమైన బుద్ధి యోగము ద్వారా ఆత్మ స్వరూపుడనైయున్న నా పరమేశ్వరత్వమును తమ ఆత్మరూపముగా గుర్తింతురో అటువంటి వారికే నేను యిటువంటి మహత్వ పూర్ణమైన బుద్ధియోగమును ప్రసాదింతును.

నా ద్వారా ఆ బుద్ధియోగమును పొందినవారు ఎటువంటివారై యుందురు ? అన్నచో **"మచ్చిత్తాః"** అనగా నా యందే చిత్తము గలవారై యుందురు.

తమను పొందుటయందు ప్రతిబంధరూపముగాయున్న ఏ కారణమును తొలగించుటకు వారికి యిటువంటి బుద్ధియోగమును ప్రసాదించుచున్నారు ? మరియు ఎందులకు ప్రసాదించుచున్నారు ? అని శంకించగా భగవంతుడు సమాధానము చెప్పుచున్నారు.

**10.11. తేషామేవానుకంపార్థమహమజ్ఞానజం తమః,**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా.**

అనగా – నా భక్తులను ఏదో ఒక విధముగా వుద్ధరించవలయునన్న భావముతోనే నేను వారియొక్క ఆత్మలయందు వ్యాపించియున్నవాడనై అనగా ఆత్మ భావముతో నిండియున్న అంతఃకరణములయందు వ్యాపించి వారి అంతఃకరణములయందు వ్యాపించియున్న అవివేకము వలన కలిగియున్న మిధ్యా ప్రతీతిరూపమైన మోహముతో కూడియున్న అజ్ఞానరూప అంధకారమును ప్రకాశముతో కూడియున్న వివేకబుద్ధియను జ్ఞానదీపము ద్వారా దూరము అనగా నశింపజేయచుందును.

అనగా భక్తి యొక్క ప్రసాదరూపమైన ఘృతము అనగా నేయితో నిండియున్నట్టియు మరియు నా స్వరూపము యొక్క భావరూప అభినివేశమును వాయువు యొక్క సహాయముతో అజ్ఞానదీపమును ప్రజ్వలింపజేయుచున్నాను. ఆ దీపమునందు బ్రహ్మచర్యము మొదలగు సాధన సంస్కారములతో కూడియున్న బుద్ధిరూపమైన వత్తి కలదు. ఆసక్తిరహితమైన అంతఃకరణమే దానికి అనగా ఆ దీపమునకు ప్రమిద రూపమైన ఆధారమైయున్నది. ఆ దీపము అనగా జ్ఞానరూప దీపము విషయవాసనలు లేనిదై రాగ-ద్వేషములనెడు కాలుష్యము లేనిదై,చిత్త రూపమైన మూత కలిగియున్నదై వున్నది. మరియు నిరంతరము అభ్యాసము చేత ఏర్పడిన ఏకత్వరూపమైన, ధ్యానముతో కూడియున్న పూర్ణజ్ఞాన స్వరూప ప్రకాశముతో నిండి యున్నది. అటువంటి జ్ఞాన దీపము ద్వారా మోహాంధకారము తొలగిపోవును.

పైన చెప్పబడిన భగవద్విభూతిని మరియు యోగమును గురించిన **బోధను** వినినటువంటి అర్జునుడు యిట్లు ప్రశ్నించినాడు.

**10.12. పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్,**
**పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్.**

అనగా – తమరు పరబ్రహ్మ స్వరూపులు. పరమాత్మలు అనగా అన్ని ప్రాణులయందు వ్యాపించియుండు సర్వాత్మ స్వరూపులు. పరంధాములు అనగా విశ్వమంతటా వ్యాపకత్వము గలవారు. పరమ తేజ స్వరూపులు మరియు పరమ పవిత్రులు అనగా ఎటువంటి లోకవాసనలు అంటని మహాత్ములు. మరియు తమరు నిత్యులు అనగా సర్వకాలములంయందును స్థిరముగా ఎటువంటి వికారము లేక యుండువారు. దైవత్యము కలిగియున్న మహాపురుషులు, అనగా దేవలోకమునందుండు అలౌకిక అనగా ఈ మృత్యులోకముతో ఎటువంటి సంబంధము లేనివారు. యింకా చెప్పవలయునన్నచో అందరి దేవతలకు గూడ కారణస్వరూపులైన ఆది దేవులు. జన్మ మరణములు లేనివారు. సర్వవ్యాపకులు.

ఇందుకే కాబోలు ఓ తత్వవేత్త యిలా పాడుకొన్నాడు.
**"ఆదియున్నది లేనివాడను, అంతమన్నది లేనివాడను**
**ఆది అంతము లేకయుండియు అంతటా మరివున్నవాడను.**
**ఓ పరమగురుదా ! నాదు తత్వము తెలుప రావయ్యా !**
**ఓ పరమగురుదా ! నాదు తత్వము తెలుపరావయ్యా !**
చూ. అమృత బిందువులు, రచన శ్రీ సదానంద భారతి

**10.13. ఆహుస్త్వా మృషయః సర్వే దేవర్షిర్నారదస్తథా;**
**అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే.**

అనగా – తమను వశిష్ఠాది మహర్షులందరూ వర్ణించుచుందురు అనగా పొగడచుందురు. చూ –

**వ్యాసాగస్త్య వశిష్ఠ నారద భరద్వాజాది సన్మున్య పన్యాసాధార గుణా లయాయ, భవబంధ త్రాస నాశాయ.......** (చూ. కంకణము (కావ్యము వే.ప్ర. శాస్త్రి)

మరియు తమరుగూడ నాతో అట్లే అనగా ఆ మహర్షులు చెప్పినట్లుగానే చెప్పుచున్నారు.

**10.14. సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ !,**
**న హి తే భగవన్వ్యక్తిం విదుర్దేవా న దానవాః.**

అనగా – ఓ కేశవా ! పైన చెప్పినట్లుగా మహర్షులు చెప్పినది మరియు మీరు చెప్పుమాటలన్నియు యదార్థములేయని నేను ఒప్పుకొనుచున్నాను. అట్లేలయన ? ఓ పరంధామా! మీ జన్మమును గురించి దేవతలూ ఎరగరు, మరియు దానవులు గూడ ఎఱుంగరు.

**10.15. స్వయమేవాత్మనాత్మనం వేత్థ త్వం పురుషోత్తమ,**
**భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే.**

అనగా – **ఓ పురుషోత్తమా !** ఓ భూత ప్రాణులన్నింటిని జన్మింపజేయు **భూతభావనుడా ! ఓ భూతేశ !** భూతములన్నింటికి ఈశ్వరుడైనవాడా ! ఓ దేవతలకు గూడ దేవుడైనవాడా ! **ఓ జగత్పతే !** తమరు స్వయముగానే తమంతట తాముగానే తమను తామే అనగా నిరతిశయమైన జ్ఞానము, ఐశ్వర్యము, సామర్థ్యము మొదలగు శక్తులతో కూడియున్న పరమేశ్వరుని ఎఱుంగుదురు.

**10.16. వక్తుమర్హస్యశేషేణ; దివ్యా హ్యాత్మవిభూతయః,**
**యాభిర్విభూతి భిర్లోకాని మాంస్త్వం వ్యాప్య తిష్ఠసి.**

అనగా – ఓ కృష్ణా ! మీ విభూతులను గురించి చెప్పుటకు నేను సమర్థుడను కాను. అందులకు మీరే సమర్థులు. మీయందు ఏయే విభూతులు కలవో మరియు ఆ విభూతుల ద్వారా మీ మహాత్మ్యమును విస్తరింపజేసి ఈ లోకములన్నింటిని వ్యాపించియుండి స్థిరముగా వుండియున్నారో వాటన్నింటిని వివరముగా చెప్పుటయందు మీరే సమర్థులు.

**10.17. కథం విద్యామహం యోగింస్త్వాం సదా పరిచింతయన్,**
**కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవన్మయా.**

అనగా – ఓ యోగిసత్తమా ! మిమ్ములను గురించి సర్వకాల సర్వావస్థలయందును ధ్యానించుచూ మిమ్ములను అనగా మీ మహత్త్వమును నేనెట్లు ఎఱుంగగలను. ఓ భగవంతుడా! మీరు ఏ యే భావములయందు అనగా ఏ యే వస్తువుల యందు అనగా వస్తువుల రూపముగా నాచే ధ్యానించబడుటకు అనగా భావించబడుటకు తగియున్నారు ? నా యందు దయయుంచి వివరముగా చెప్పగలరు.

**10.18. విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన,**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మే ఽమృతమ్.**

అనగా – ఓ జనార్దన ! మీ యొక్క యోగమును, మీ యొక్క యోగేశ్వరత్వ రూపమైన విశిష్ఠ శక్తిని మరియు మీ యొక్క విభూతిని అనగా ఐశ్వర్యమును అనగా విచారించుటకు తగియున్న పదార్థముల యొక్క వ్యాపకత్వమును గురించి విపులముగా అనగా నాకు తెలియునట్లుగా వర్ణించి చెప్పగలందులకు ప్రార్థించుచున్నాను.

గమనము అనగా ఒకచోట నుండి మరియొక చోటునకు పయనించుచుండుట ఎవని యొక్క కర్మయో అటువంటి అర్థధాతువు యొక్క రూపమే జనార్దనము. అసురలను అనగా దేవతలకు విరోధులైన మనుష్యులను నరకాదులకు పంపించువాడగుటంజేసి భగవంతుని పేరు జనార్దనుడు అనబడుచున్నది. అట్లుగాక ఔన్నత్యము మరియు కల్యాణము యీ రెండు పురుషార్థ రూపమైన ప్రయోజనములు లోకులందరి ద్వారా భగవంతుని నుండి కోరబడుచున్నవి. అందువలన భగవంతునికి జనార్దనుడను పేరు కలుగుచున్నది. జనఅర్థనుడు.

మీ మహాత్మ్యమును గురించి ఇంతకు పూర్వమే మీరు చెప్పియున్నప్పటికి మరల చెప్పగలందులకు కోరుచున్నాను. ఏలయన ? మీ నోటి నుండి వెలువడిన వాక్రూపమైన అమృతమును నేను ఎంత సేవించిననూ, ఆరగించిననూ నాకు తృప్తి కలుగుట లేదు. అనగా యింకా సేవించవలయునన్న ఆకాంక్ష తీరుట లేదు.

**10.19. హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః,**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నా స్త్యంతో విస్తరస్య మే.**

అనగా – అర్జునా – ఇప్పుడు నేను నీకు నా యొక్క దివ్యమైన దేవలోకమునందు జరుగు విభూతులను అనగా మహత్కార్యములను అందులో కొన్ని ముఖ్యమైన విభూతులను గురించియే చెప్పుచున్నాను. అనగా నా యొక్క ప్రధానమైన విభూతులను గురించి వర్ణించి చెప్పెదను. అన్నింటిని గురించి చెప్పవలయునన్నచో కొన్నివందల సంవత్సర కాలమంతయూ చెప్పినను పూర్తిగా చెప్పబడదు. అట్లేలయన ? నా యొక్క వ్యాపకత్వము అనగా నా వైభవమునకు అంతము లేదు.

అందులో నా మొదటి విభూతిని గురించి చెప్పెద వినుము –

**10.20 అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః,**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ.**

అనగా – గుడాకా అనగా నిద్ర, ఆ నిద్రపైన అదుపు సంపాదించినవాడు అనగా నిద్రను జయించినవాడు అయినందున లేక దట్టమైన జుట్టు అనగా కేశములు కలిగియున్న వాడైనందున, అర్జునునకు మరొక పేరు **'గుడాకేశ' అని కలదు.** అందుచేత కృష్ణుడు అర్జునుని 'ఓ గుడాకేశ !' అని సంబోధించి, సమస్త భూతములు అనగా **సర్వవిధములైన ప్రాణుల హృదయములయందు వ్యాపించి యున్న ఆత్మ పదార్థమును నేనే అయివున్నాను.** అధికారియైన వాడు అనగా తన బాహ్య ఆంతరిక యింద్రియములను జయించినవాడు సర్వకాల సర్వావస్థలయందును తన అంతరాత్మ రూపమున వున్న నన్ను మరువక యుండును అని చెప్పుచున్నాడు.

కాని అలా ధ్యానము చేయుటయందు సామర్థ్యము లేనివాడు నేను యిప్పుడు చెప్పబోవుచున్నట్లుగా ప్రయత్నించవలయును. అనగా యిప్పుడు నేను చెప్పబోవుచున్నట్లు నన్ను ధ్యానించవలయును. అట్లేలయన ? **నేనే సర్వభూతములకు ఆది స్వరూపుడను. మధ్య స్వరూపుడను, చివరకు అంత్య స్వరూపుడను గూడ నేనే** అయివున్నాను. అనగా ఆ సర్వభూతముల యొక్క వుత్పత్తి అనగా రూపకల్పన, అటుపైన వాటినన్నింటి యొక్క పోషణ అనగా వాటి రూపములు స్థిరముగా అనగా స్థితి కలిగి యుండుటకు నేనే కారణమైయున్నాను. చివరకు ప్రళయకాలమందు వాటి రూపములన్నియూ లేకుండా పోవుటకు కారణము నేనే అయివున్నాను. **అనగా అవన్నియూ నాయందే కల్పించబడి, నా కంటె వేఱుగా వున్నట్లుగా తోచి చివరకు నాయందే లీనమై అనగా కలిసి అనగా నా రూపమునే చెందును.**

అందుచేత ఈ విధముగా గూడ సాధకులు నన్ను గురించి ధ్యానించవచ్చును.

**10.21. ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్,**
**మరీచి ర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ.**

అనగా – ద్వాదశ అనగా పండ్రెండుమంది ఆదిత్యులయందు అనగా సూర్యులయందు విష్ణు నామముగల ఆదిత్యుడను నేనే. ప్రకాశింపజేయునట్టి జ్యోతులయందు నేను అసంఖ్యాకమైన కిరణములు గలిగిన సూర్యుడను నేనే. వాయువునందు గూడ అనేక భేదములు గలవు. ఉదా: ప్రాణము, వ్యానము, అపానము, సమానము, ఉదానములు కలవు. అందుచేత వాయువునకు సంబంధించిన దేవతలయందు 'మరీచి' అనబడు వాయు దేవతను నేనే. మరియు నక్షత్రముల యందు చంద్రుడను నేనే.

**10.22. వేదానాం సామవేదో ఽస్మి, దేవానామస్మి, వాసవః,**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా.**

అనగా - వేదములయందు సామవేదమును నేనే. రుద్రుడు, ఆదిత్యుడు అనగా సూర్యుడు మొదలగు దేవతలయందు ఇంద్రుడను నేనే. చక్షువులు అనగా కన్నులు (సర్వేంద్రియాణాం నయనం ప్రధానం) మొదలగు పదునొక్క యింద్రియములందు సంకల్ప - వికల్పాత్మకమగు మనస్సును నేనే. కార్యము కరణము కరణమనగా కార్యములు చేయుటకు వుపయోగపడు సాధనములందు అనగా కార్య - కరణ సముదాయ రూపమైన దేహాదులయందు సదా ప్రకాశించునట్టి ఏ బుద్ధి వృత్తి అనగా వృత్తులను కలిగించు బుద్ధికలదో దానినే చైతన్య మందురు. ఆ చైతన్యమును నేనే అయివున్నాను.

**10.23. రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్,**
**వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణామహమ్.**

అనగా - ఏకాదశ రుద్రులయందు నేను శంకరుడను. యక్షులు మరియు రాక్షసులయందు నేను ధనములకు అధిపతియైన కుబేరుడను. ఎనిమిదిమంది వసువులలో నేను పావకము అనగా అగ్నిని. శిఖరములు కలిగియున్న పర్వతములయందు నేను సుమేరు పర్వతమును.

**10.24. పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్;**
**సేనానీనామహం స్కందః సరసామస్మి సాగరః.**

అనగా - పార్థా ! పురోహితులందు (పురము యొక్క హితము అనగా మేలుకోరువారు) అనగా రాజపురోహితులందు నీవు నన్ను ప్రధాన పురోహితుడైన బృహస్పతిగా ఎఱుంగుము. అట్లేలయన వారే ఇంద్రునకు ముఖ్య పురోహితులు. అట్లే సేనాపతులయందు నేను దేవతల సేనాపతియైన కార్తికేయుడను, మరియు సరోవరములయందు అనగా దైవనిర్మిత. సరోవరములయందు నేను సముద్రము వంటివాడను.

**10.25. మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్;**
**యజ్ఞానాం జపయజ్ఞో౽స్మి స్థావరాణాం హిమాలయః.**

అనగా - మహర్షులయందు నేను భృగు మహర్షిని. వాణి అనగా వాక్కునకు సంబంధించిన భేదములయందు అనగా పదములతో కూడిన వాక్యమునందు నేను "ఓం" కారమునై యున్నాను. యజ్ఞములయందు సర్వోన్నతమైన జపయజ్ఞమునై యున్నాను. మరియు స్థావరములయందు అనగా చలనము లేనటువంటి అనగా స్థిరముగా వుండునటువంటి సర్వోన్నతమైన హిమాలయ పర్వతమునై యున్నాను.

**10.26. అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః,**
**గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః.**

అనగా – సమస్తమైన వృక్షములయందును రావివృక్షమును మరియు దేవర్షులయందు అనగా దేవతలైయుండియు మంత్రములను చూచువారై యున్నందున ఋషి భావమును పొందినటువంటి దేవర్షియైన నారద మహర్షిని నేనే. గంధర్వులయందు చిత్రరథుడను శ్రేష్ఠ గంధర్వుడను నేనే. సిద్ధులయందు అనగా దేహమును ధరించినప్పటి నుండియు ధర్మము, జ్ఞానము, వైరాగ్యము మరియు సర్వవిధ ఐశ్వర్యములను పొందియున్నట్టి పురుషులయందు కపిలమునిని నేనే అయివున్నాను.

**10.27. ఉచ్చైః శ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్,**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్.**

అనగా – అశ్వములయందు అమృతమును పొందుటకై చేయబడిన సముద్ర మథనము నుండి బయటపడినటువంటి ఉచ్చైశ్రవా అను పేరుగల అశ్వమును నేను. ఆయశ్వమును నీవు నా యొక్క స్వరూపముగా గుర్తించుము. గజేంద్రములయందు అనగా గొప్ప ఏనుగులయందు అనగా శ్రేష్ఠమైన ఏనుగులయందు ఇరావతమను గజేంద్రుని యొక్క పుత్రుడైన ఐరావతమను గజేంద్రుడనై యున్నాను. ఆ ఐరావతమను గజేంద్రుని నా స్వరూపముగా గుర్తించుము. మరియు మనుష్యులయందు నన్ను నరేంద్రునిగా అనగా రాజుగా ఎఱుంగుము.

**10.28. ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్;**
**ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణామస్మి వాసుకిః.**

అనగా – శస్త్రములయందు నేను దధీచి మహర్షి యొక్క వెన్నెముకతో తయారు చేయబడిన వజ్రాయుధమును. దుగ్ధమును అనగా పాలనిచ్చునటువంటి గోవులయందు వశిష్ఠమహర్షికి సమస్తమైన సంపదలను కలుగజేయునటువంటి కామధేనువను పేరుగల ఆవునైయున్నాను. అట్లు కానిచో సామాన్య భావముతో చూచినా నేను కామధేనువును అయివున్నాను. సమస్తమైన ప్రాణులను కల్పించునటువంటి కామధేనుడను నేనే. మరియు సర్పముల యందు అనేక భేదములున్నను ఆ సర్పములందు సర్వశ్రేష్ఠమైన "వాసుకి" యను సర్పమును నేనైయున్నాను.

బహుశా యీ భావముతోనే ప్రేరేపించబడిన వాడై శ్రీశైలము అను మహా తత్వవేత్త మరియు కవి తన "భీమేశ్వర శతకము" నందు ఈశ్వరుని వునికిని గురించి యిలా అన్నాడు –

'విద్యుచ్ఛక్తి సమస్త తంతువుల వ్యాప్తింజెంది యున్నన్
విద్యుజ్జ్యోతికి గాజుగోళములనే విస్ఫూర్తిగాన్పించెడిన్
విద్యారూప ! స్వసత్తచేత సర్వంబున్ నిండియున్
విద్యోతింతువు శుద్ధబుద్ధి గుహలన్ విశ్వాత్మ భీమేశ్వరా ! చూ. భీమేశ్వరశతకము

**10.29. అనంతశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్,**
**పితౄణామర్యమా చాస్మి యమః సంయమతా మహమ్.**

అనగా - నాగులు అనగా సర్పములు అనేక విధములు. అందులో నేను అనంతుడను నాగును. అనగా నాగులన్నింటికి రాజు అయినటువంటి శేషుడను. మరియు జలమునకు సంబంధించిన దేవతలయందు ఆ దేవతలకు రాజైనటువంటి వరుణుడను నేనే. పితృదేవతల యందు 'ఆర్యమా' అనునటువంటి పితృరాజును నేనే. మరియు ఈ లోకములన్నింటిని శాసించు యమధర్మరాజును నేనే.

**10.30. ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్,**
**మృగాణాం చ మృగేంద్రో ఽహం వైనతేయశ్చ పక్షిణామ్.**

అనగా - దైత్యులు అనగా రాక్షసులయందు దితివంశమునకు జెందిన ప్రహ్లాదుడను దైత్యుడను నేనే. మరియు కలనా-గణనా చేయు వారలయందు నేను కాలుడను. పశువులయందు పశువులన్నింటికి రాజైన సింహమును లేక వ్యాఘ్రము అనగా పులిని నేనే మరియు పక్షుల యందు వినత యొక్క పుత్రుడైన గురుత్మంతుడను నేనే.

**10.31. పవనః పవతామస్మిం రామః శస్త్రభృతామహమ్,**
**ఝుషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ.**

అనగా సర్వమును పవిత్రముగావించు వాయువును మరియు శస్త్రధారులయందు దశరథపుత్రుడైన రాముడను నేనే. చేపలు మొదలగు జలమునందు చరించు ప్రాణులయందు మకరమనబడు **విశిష్ఠ జాతికి చెందిన జలచరమును** నేనే. ప్రవహించునటువంటి నదులయందు విశిష్ఠమైన గంగానదిని నేనే.

**10.32. సర్గాణామాదిరంతశ్చ మధ్యం చైవాహమర్జునా,.**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్.**

*అనగా - ఓ అర్జునా ! సృష్టికి ఆరంభమును మధ్యమును మరియు అంతమును అనగా సర్వపదార్థముల వుత్పత్తి, స్థితి మరియు ప్రళయమును నేనే అయివున్నాను.*

గ్రంధారంభమునందు భగవంతుడైన శ్రీ కృష్ణుడుతనను కేవలము చైతన్యమే ఆధారముగా కలిగియున్న ప్రాణులకు మాత్రమే ఆరంభ మధ్య మరియు అంతములుగా చెప్పుకొని యున్నాడు. కాని యిప్పుడు యిచ్చట **సమస్తమైన జగత్తునంతటికి ఆరంభముగాను అంతముగాను చెప్పుచున్నారు. ఇది విశేషము.**

సమస్తమైన విద్యలయందు మోక్షమును కలిగించునది గావున విద్యలలోకెల్ల ప్రధానమైన **ఆధ్యాత్మికవిద్యను** నేను అని చెప్పుచున్నాడు. శంకా సమాధానములు చెప్పుట జరుగు కాలమందున చెప్పబడు వాక్యములయందు అర్థ నిర్ణయము చేయు వాదమునకు సంబంధించిన వాక్యమును నేను అని చెప్పుచున్నాడు. ఇచ్చట "ప్రవదతాం" అను పదము ద్వారా వక్త చేత చెప్పబడు **వాదము జల్పము మరియు వితండము అను మూడు విధములగు వచన భేదములు గ్రహించదగియున్నవి.** అంతేగాని వక్తకు ప్రాధాన్యత లేదు.

**10.33. అక్షరాణామకారో ఽ స్మి ద్వంద్వః సామాసికస్య చ,**
**అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః.**

అనగా – అక్షరములయందు, అనగా వర్ణములందు అకారమైన 'అ' అను వర్ణమును నేను. సమాస సమూహమునందు "ద్వంద్వ"మను సమాసమును నేను. మరియు నేనే నాశమను నది లేనటువంటి "కాలము"ను అనగా క్షణములు, ఘడియలు మొదలగు నామములతో చెప్పబడు ఆ కాలము లేక కాలమునకు గూడ కాలమైన పరమేశ్వరుడను నేనే అయివున్నాను. మరియు నేనే **"విధాత"** అనగా జగత్తునందలి ప్రాణులన్నియు చేయు కర్మలకు ఫలమును కలిగించు లేక నిర్ణయించువాడను మరియు ఆనంద స్వరూపుడనైన పరమాత్మను నేను.

**10.34. మృత్యుః సర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్,**
**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా.**

అనగా – ధనము మొదలగు సంపదలను నశింపజేయునది మరియు ప్రాణములను అనగా ప్రాణములతో కూడియున్న దేహాదులను నశింపజేయునది అగు రెండు విధములగు మృత్యువు **"సర్వమును హరించునది"** అని చెప్పబడుచున్నది. అటువంటి సర్వమును హరించు మృత్యువును నేనైయున్నాను. అట్లు కానిచో పరమేశ్వరుడు ప్రళయ కాలమునందు సర్వమును నశింపజేయువాడుగావున ఆతడే సర్వహరుడు ఆ సర్వహరుడను నేనైయున్నాను.

భవిష్యత్కాలమునందు అనగా ముందు రాబోవు కాలమునందు ఎవనికి లేక దేనికి వుత్కర్ష అనగా పెంపుదల అనగా ఐశ్వర్యము లభించనున్నదో దాని యొక్క వుద్భవము అనగా పుట్టుట లేక కలుగుట అనగా అట్టి ఔన్నత్యమునకు కారణము నేనైయున్నాను.

స్త్రీలయందు కీర్తి, శ్రీ అనగా సంపద, వాక్ పటుత్వము లేక వాగ్వైభవము, **స్మృతి అనగా జ్ఞాపక శక్తి, బుద్ధి అనగా గ్రహణ శక్తి, ధృతి అనగా పట్టుదల** మరియు **క్షమాగుణము** కలిగియున్న స్త్రీలు అనగా ఏ స్త్రీతో సంబంధము మాత్రము కలిగియున్నందున లోకులు తమను కృతార్థులుగా తలంతురో అటువంటి పుణ్యస్త్రీని నేనై యున్నాను.

**10.35. బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్.**
**మాసానాం మార్గశీర్షో ఽహమృతూనాం కుసుమాకరః.**

అనగా – మరియు సామవేదమునందలి **"బృహత్సామ"** అను పేరుగల ప్రధాన ప్రకరణమును నేనైయున్నాను. ఛందస్సులయందు **"గాయత్రీ"** అను పేరుగల ఛందస్సును నేనైయున్నాను. అనగా గాయత్రి మొదలగు ఛందోబద్ధమైయున్న 'రుచులు' అనగా ఛందోబద్ధ వాక్యములు కలవో వాటియందు **గాయత్రీ ఛందస్సు** నందు చెప్పబడిన వాక్యమును నేనై యున్నాను. మాసములయందు మార్గశీర్షమను మాసమును, ఋతువుల యందు వసంత ఋతువును నేనైయున్నాను.

**10.36. ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్,**
**జయో ఽస్మి వ్యవసాయో ఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్,**

అనగా – మోసముతో కూడిన ద్యూతము అనగా జూదమును నేనే. తేజముతో కూడిన అనగా ప్రతిభావంతులయందున్న తేజమును అనగా ప్రతిభను నేనే. సర్వకార్యములందలి విజయమును నేనై యున్నాను. ప్రయత్నశీలురయందలి ప్రయత్నమును అనగా వుత్సాహమును అనగా కార్యములందు ఫలమును పొందవలయుననెడి పట్టుదలను నేనైయున్నాను. సత్వగుణసంపన్నులైన పురుషులయందలి సత్వమును నేనై యున్నాను.

**10.37. వృష్ణీనాం వాసుదేవో ఽస్మి పాండవానాం ధనంజయః,**
**మునీనామప్యహం వ్యాసః కవీనాం ముశనా కవిః.**

అనగా – వృష్ణి వంశము వారియందు నీ సఖుడను అనగా మిత్రుడనైన వాసుదేవుడను నేనే. పాండవులయందు ధనంజయుడను అనగా నీవే – నీవు నేనై యున్నాను. మునులయందు అనగా మననము చేయు వారియందు మరియు సర్వపదార్ధములను, సత్వరూపమున గుర్తించువారియందు నేను వ్యాసుడను. కవులయందు అనగా భూతవర్తమాన భవిష్యమును త్రికాలములయందు జరుగు కార్యకలాపలను స్థితిగతులను ఎఱుంగువారియందు నేను సర్వశ్రేష్ఠుడగు శుక్రాచార్యుడను.

**10.38. దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్;**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్.**

అనగా – శత్రువులు మొదలగు వారిని అణచువారి ముఖ్య సాధనమైన దండమును నేనే. అనగా దుర్మార్గులను దండించు దండనాశక్తిని నేనే. విజయమును అకాంక్షించు న్యాయభావమును నేనే. విషయములను రహస్యముగ దాచియుంచు మౌనమును నేనై యున్నాను. జ్ఞానులయందలి జ్ఞానమును నేనే.

**10.39. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున,**
**న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్.**

అనగా–ఓ అర్జునా ! సర్వ భూతములకు మూల కారణమైన బీజము అనగా సర్వ భూతముల వుత్పత్తికి కారణమైన మూలపదార్థము అనగా సర్వవ్యాపక బ్రహ్మతత్వమును నేనే.

ఈ ప్రకరణమును ముగించుట కొఱకు సమస్త విభూతుల యొక్క సారమును అనగా సర్వమునకు కారణస్వరూపమైన మూల పదార్థమును గురించి చెప్పుచున్నారు.

**ఈ విధముగా చరాచరమైన ఏ ఒక్క ప్రాణిగూడ నాకంటె భిన్నముగా లేదు. అట్లేలయన? పదార్థములన్నియు సత్తారహితములు అనగా అసలు లేనివై యుండును. అందుచేత తేలిన సారాంశమేమన ఈ బ్రహ్మాండమంతయు నా స్వరూపముననే యున్నది. నాకంటే భిన్నముగా ఏమియును లేదు. సర్వము నేనై యున్నాను.**

**10.40.** నాంతో ఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప,
ఏష తద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా.

అనగా - ఓ పరంతప ! నా యొక్క దివ్య విభూతులయొక్క వ్యాపకత్వమునక అంతమనునది లేదు. అట్లేలయన ? సర్వాత్మరూపుడైన ఈశ్వరుని విభూతులు యింతేన ఎవ్వరును ఎఱుంగజాలరు. అందుచే చెప్పనూ లేరు. ఇప్పుడు నేను చెప్పినది గూడ న విభూతులయందలి కొంతభాగమును మాత్రమే.

**10.41.** యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా,
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోం ఽశ సంభవమ్.

అనగా - ప్రపంచమునందు ఏయే పదార్థములు విభూతితో కూడియున్నవో మరియ శ్రీమంతమైయున్నవో అనగా శ్రీ అనగా లక్ష్మి అనగా శ్రీతత్వముతో కూడియున్నవో అ యన్నియు ఈశ్వరుడనైన నా తేజోమయతత్వము నుండియే వుద్భవించెనని తెలియుము. అన **తేజస్సు యొక్క కొంత భాగము మాత్రమే ఈశ్వర సృష్టికి కారణము. ఈ విధముగా ప్రపంచమునందు తోచు వస్తువులన్నింటికి నన్నే కారణ పదార్థముగా ఎఱుంగుము.**

**10.42.** అథవా బహు నైతేన కిం జ్ఞాతేన తవార్జున,
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్.

అనగా-అర్జునా ! అట్లు కాదంటివేని యిప్పుడు నేను పైన చెప్పిన విధముగా వర్ణిం బడిన అసంపూర్ణమైన నా విభూతివ్యాపకత్వమును గురించి తెలుసుకొనినందువలన నీ కలుగు ప్రయోజనమేమున్నది ? అందువలన యిప్పుడు నేను నీకు నా విభూతి యొక్క సర్వా పూర్ణమైన రూపమును అనగా తత్వమును. అనగా వ్యాపకత్వమును గురించి చెప్పెద సావధ చిత్తుడనై వినుము -

**నేను నా యొక్క అంశతోనే సర్వభూతములకు ఆత్మరూపుడనైయున్నాను. ఆ ఒ అంశతోనే సమస్తమైన జగత్తును కల్పించి దృఢముగా నిలిచియున్నాను. ఆ కారణముచేతనే**

**"పాదో ఽస్యవిశ్వాభూతాని"** చూ.తై. ఆరణ్యా-3.

అని వేద మంత్రములు చెప్పుచున్నవి. అనగా - సమస్త భూతములు ఆ పరమేశ్వర యొక్క ఒక్క పాదము మాత్రమే.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*విభూతి యోగమనబడు పదవ అధ్యాయమునకు శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య*
*విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు - శ్రీ సదానందభారతి. ప్రణవాశ్రమము.*

ఓం

# శ్రీమద్భగవద్గీత

## శ్రీ శంకరభాష్యం యథాతథం

### రెండవ భాగము

అనువాదకులు :

**శ్రీ సదానంద భారతి**

ప్రణవాశ్రమము, గుడివాడ

గురువందన

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః.

గురుదేవులు :

**శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాములవారు,**

ప్రణవాశ్రమము, గుడివాడ

# ఉపోద్ఘాతము

"ఓం నారాయణః పరో ఽవ్యక్తాదండమవ్యక్త సంభవమ్,
అండస్యాంతస్త్విమే లోకాః సప్తద్వీపా చ మేదినీ".

అనగా – అవ్యక్తమువలన అనగా మాయవలన శ్రీ నారాయణుడను ఆదిపురుషుడు సర్వకాల సర్వావస్థలయందును అగోచరుడు. అవ్యక్తమైన ప్రకృతినుండి ఈ బ్రహ్మాండము ఏర్పడినది. ఈ భూ, భువః మొదలగు సర్వలోకములు మరియు ఏడు ద్వీపములుగా ఏర్పడియున్న భూగ్రహమున్నూ ఆ బ్రహ్మాండమునందే ఏర్పడియున్నవి.

ఆ భగవంతుడు తన మాయచేత ఈ జగత్తును రచించి దీనిని చక్కగా పాలించవలయునను కోరిక కలిగి ముందుగా మరీచి మొదలగు ప్రజాపతులను సృష్టించి వారికి వేదోక్తములైన ప్రకృతి రూపమైన ధర్మమును కలుగునట్లుగా చేసెను.

అటు తరువాత వారికంటె భిన్నముగా అనగా వేఱుగా సనక సనందనాది ఋషులను సృష్టించి వారికి జ్ఞానము మరియు దానిచే కలుగు వైరాగ్యము లక్షణముగా గలిగిన నివృత్తి ధర్మమును అనగా జ్ఞానయోగమును బోధించెను.

ఈ విధముగా వేదములందు చెప్పబడిన ధర్మము రెండు విధములుగా యున్నది. ఒకటి ప్రవృత్తి రూపధర్మము, రెండవది నివృత్తి రూపమైన ధర్మము.

ధర్మం సహజంగానే చాలా గొప్ప వ్యవస్థ. ఏలయన ? అది జగత్తు యొక్క ఉత్పత్తికి, స్థితికి, సర్వప్రాణుల ఔన్నత్యానికి, చివరకు మోక్షమునకు గూడ కారణ రూపమైనది. అంతే గాకుండా సర్వప్రాణుల సంరక్షణను కోరునటువంటి బ్రాహ్మణాది వర్ణాశ్రమ వ్యవస్థ ద్వారా కాపాడునదే ధర్మం.

కొంతకాలానికి ధర్మానుష్ఠానము అనగా ధర్మానుసారముగ చరించు మానవుల అంతఃకరణమునందు ధర్మభావము నశించి కామభావము వుత్పన్నమైనది. ఆ కామభావ వికాసము వలన వివేక విజ్ఞానాదులు తరిగిపోయినవి. ఆ విధంగా ధర్మదృష్టి తరిగినందున అధర్మబుద్ధి పెరుగనారంభించినది. అప్పుడు జగత్తు యొక్క స్థితిని కాపాడుటయే కర్తవ్యముగా కలిగియున్న ఈ జగత్తుకు ఆదికర్తయైన నారాయణుడను పేరుగల శ్రీ విష్ణుభగవానుడు భూలోకమునందలి బ్రహ్మణు అనగా భూదేవతలు అనగా బ్రాహ్మణుల యొక్క బ్రాహ్మణత్వమును

రక్షించుటకొఱకై శ్రీ వాసుదేవుడు మరియు దేవకీ దంపతుల గర్భమునుండి తనయొక్క అంశతో అనగా లీలావిగ్రహ రూపముతో శ్రీకృష్ణుని రూపమున అవతరించినాడు. ఇది అతి ప్రసిద్ధమైన విషయము.

బ్రాహ్మణత్వమును రక్షించుట ద్వారానే వైదిక ధర్మము సురక్షితముగా మనగలదు. ఏలయన ? వర్ణాశ్రమాది వ్యవస్థ ఆ వైదికధర్మమునందే యిమిడియున్నది.

ఆ భగవంతుడు జ్ఞానము, ఐశ్వర్యము, శక్తి బలము, వీర్యము, తేజస్సు మొదలగువానితో సదాసంపన్నుడైయున్నవాడై యున్నప్పటికి అజుడు అనగా జన్మమరణములు లేనివాడై సమస్త భూతములకు అనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి మొదలగు వాటికన్నింటికి ఈశ్వరుడు అనగా అధిపతియై వుండియు నిత్యశుద్ధుడు అనగా ఎటువంటి మలినములు అంటనివాడు, బుద్ధుడు అనగా జ్ఞానమే రూపముగా గలవాడు ముక్తుడు అనగా యితరమైన ఏ వస్తువు తోడను ఎటువంటి సంబంధము లేనివాడై యున్నాడు. అయినప్పటికి తనయొక్క త్రిగుణముల (సత్వ, రజ, తమ) తో కూడియున్న మూల ప్రకృతిగా యున్న వైష్ణవీ మాయను తన వశమునందుంచుకొని లీలగా అనగా వుండియు లేనట్లుగా సాధారణ శరీరధారులగు జీవులవలె జన్మించినట్లుగాను, జీవులందరిని అనుగ్రహిస్తున్నట్లుగాను అవతరించియున్నాడు.

తనకు వ్యక్తిగతముగా ఎటువంటి ప్రయోజనము లేకుండిననూ భూతములకై దయచూప తలంచినవాడై అనగా ఎక్కువమంది గుణవంతులైన పురుషుల ద్వార గ్రహించబడియున్న మరియు అట్టివారిచే ఆచరించబడుచున్న ధర్మము అత్యధిక ప్రచారమ పొందునన్న భావము కలవాడై శోకమోహ రూపమైన సముద్రమునందు మునిగియున్న అర్జునునకు (లోకులకు) రెండు విధములైన అనగా ప్రవృత్తిమార్గము, నివృత్తిమార్గము ధర్మములను బోధించెను.

ఆ విధముగా పై రెండు విధములగు ధర్మములను భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడ అర్జునునకు ఎలా బోధించెనో అలా యథాతథంగా అనగా ఎటువంటి మార్పులు చేర్పుల లేకుండా సర్వజ్ఞుడైన మరియు భగవత్స్వరూపుడైన వేదవ్యాసులవారు ఏడువందల శ్లోకములతో "గీత" అనుగ్రంథ రూపమున వెలయించియున్నారు.

ఈ గీతాశాస్త్రము సర్వవేదముల సారసంగ్రహమై యున్నది. అందుచే దీని సక్రమముగా అర్థము చేసుకొనుట చాలా కఠినమైన పని అయి వున్నది. అలా అయినప్పటి గూడ ఆ గూఢార్థమును ప్రకటించుటకు అనేకులైన పండితమ్మన్యులు పదచ్ఛేదము, పద అర్థమ

ాక్యార్థము మరియు ఆక్షేప-సమాధాన పూర్వకమైన వ్యాఖ్యానములు ఈ గ్రంథమునకు చించియున్నారు. అలా అనేకములైన వ్యాఖ్యానములు చెప్పబడియున్నప్పటికి లోకభావముతో ండియున్న మనస్సులు గల మానవులు ఆ గీతాశాస్త్రమునకు అనేక విధములుగా అనగా త్యంత పరస్పర విరుద్ధములైన అర్థములను గ్రహించుచుండగా చూచి ఆ గ్రంథమునకు వేకముతో కూడియున్న అర్థమును నిశ్చయించదలంచి నేను అనగా శ్రీశ్రీశ్రీ జగద్గురువులు ది శంకరాచార్యులవారు – సంక్షిప్తముగా ఈ వ్యాఖ్యానమును రచించితిని..

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ గీతాశాస్త్రము యొక్క ప్రయోజనము లోకకల్యాణమే నగా **కారణ సహితముగా ఈ ప్రాపంచిక వాసనలను తొలగించుటయే.** ఆ పరమ ల్యాణమేమనగా సర్వకర్మ సంన్యాస పూర్వకమైన మోక్షమును **పొందుటకు** గీతయందు చెప్పబడిన త్మజ్ఞాన నిష్ఠారూపమైన ధర్మము సాధనముగా లభించుటయే.

ఈ గీతార్థ రూపమైన ధర్మమును లక్ష్యముగా తలంచియే స్వయముగా బ్రహ్మపదమును నగా మోక్షమును పొందుటకు గీతయందు చెప్పబడిన **జ్ఞాననిష్ఠతో కూడియున్న ధర్మమే** న్నివిధముల సామర్థ్యము కలిగియున్నదని భగవంతుడు చెప్పియున్నాడు.

ఇంతేకాకుండా "ఎవ్వడు ధర్మమును ఆచరించునో లేక ఆచరించకయుండునో, మరియు ఎవ్వడు శుభాశుభములతో సంబంధము లేకయుండునో మరియు ఎవ్వడు ఏ షయమును గురించి కొంచము కూడా ఆలోచించక నిర్విచారముగా వుండునో అలా వుండియు **ఈ సమస్త జగత్తునకు ఆధార స్వరూపుడైన ఆ బ్రహ్మ భావముతో కూడియుండునో ఆతడు ఆ బ్రహ్మమునే పొందును"** అని కూడా చెప్పియున్నాడు.

ఇంకా ఏం చెప్పాడంటే – **"సంన్యాసమే జ్ఞానమునకు లక్షణము లేక గుర్తు"** అని కూడా చెప్పియున్నాడు.

ఇచ్చట కూడా అనగా ఈ గీతాశాస్త్రమునందు గూడ చివరకు అర్జునునితో "సర్వ ధర్మములను పరిత్యజించి నా యందే శరణు పొందుము. **"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ"** గీ. 18.66 అని చెప్పియున్నాడు.

అభ్యుదయం అనగా సాంసారిక ఔన్నత్యమే దేనికి ఫలమో అటువంటి ప్రవృత్తి రూపమైన ధర్మము వర్ణములను ఆశ్రమ వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకొని చెప్పబడినదో ఆ ధర్మము స్వర్గాదులను పొందడానికి మాత్రమే సాధనమై యున్నప్పటికీ "ఫలమును పొంద

వలయును" అను కోరిక లేకుండా కేవలము ఈశ్వరార్పణ బుద్ధితో ధర్మము చెప్పినట్లుగా కర్మలు చేసిననూ ఆ కర్తకు అంతఃకరణ శుద్ధి కలుగును.

మరియు ఆ విధముగా శుద్ధమైన అంతఃకరణము గల పురుషునకు ఆ ప్రవృత్తి రూపమైన ధర్మాచరణము జ్ఞాననిష్ఠకు అవసరమైన యోగ్యతను కలిగించి అటు తరువాత జ్ఞానమును కలిగించుటకు సాధనముగా వున్నందువలన ఆతని అభ్యుదయమునకు కారణ రూపముగా వుంటుంది.

పై అర్థమునే లక్ష్యముగా ఎంచుకొని యికముందు చెప్పబోవునదేమనగా **"కర్మలను, కర్మఫలములను బ్రహ్మమునకే అర్పించండి. యోగులైనవారు గూడ ఫలాసక్తిని వదలి ఆత్మశుద్ధి అనగా అంతఃకరణశుద్ధి కొరకు కర్మలు చేయుదురు".**

లోకమునకు పరమ కల్యాణకరమైన ఈ రెండు విధములైన అనగా ప్రవృత్తి ధర్మము మరియు నివృత్తి ధర్మము - ధర్మములను మరియు ఈ గ్రంథమునకు **లక్ష్యభూతమైన వాసుదేవుడను పేరుగల పరబ్రహ్మ స్వరూపమైన ఆ పరమార్థ తత్వమును విశేషముగా అనగా ముఖ్యముగా** ప్రకటించునటువంటి ఈ గీతాశాస్త్రము అసాధారణమైన ప్రయోజనము, అసాధారణమైన సంబంధము మరియు అసాధారణమైన విషయమును కలిగియున్నది.

ఇటువంటి ఈ గీతాశాస్త్రము యొక్క అర్థమును చక్కగా ఎఱింగిన వారికి సంపూర్ణ పురుషార్థము సిద్ధించును. (అర్థ, కామ, ధర్మ మోక్షములు పురుషార్థములు). అందుచేత దీనిని వ్యాఖ్యానించుటకు నేను ప్రయత్నించుచున్నాను.

ఇట్లు
**శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు**

ఓం

# గ్రంథ ప్రవేశము

మన దేశము భారతదేశము. ఇది చాలా సుదీర్ఘమైన చరిత్ర కలిగిన దేశము.

ఈ దేశము నందు మన పూర్వీకులైన యెంతో మంది ఋషులు, పండితులు, మహాత్ములు, కవులు, గాయములు మొదలగు వారందరూ వారి మాటల ద్వారాను ఆటలు (నాటకములు) మరియు పాటల ద్వారాను ప్రపంచమంతటను "ఇందుగల దందువేదను" సందేహము లేకుండా సర్వమునందును నిరాకార రూపమున వ్యాపించియున్న భగవత్తత్త్వమును మరియు ఆ తత్త్వమునందే కల్పించబడిన ప్రకృతి వర్ణనముల ద్వారా మనముందు సాక్షాత్కరింపజేయుటకు ప్రయత్నించియున్నారు. ఆ ప్రయత్నముల ఫలములే మన వేదములు అనగా శ్రుతులు, స్మృతులు కావ్యములు మొదలగునవి. ఆ ప్రయత్నములలో ఒక మహదంశమే యీ శ్రీమద్భగవద్గీత. శ్రీకృష్ణుని రూపమున ప్రత్యక్షమైన ఆ సర్వవ్యాపక భగవత్తత్త్వమే మహాభారత యుద్ధారంభమునందు యుద్ధ విముఖుడైన అర్జుననకు పాడి వినిపించిన గీతముల సమూహమే యీ శ్రీమద్భగవద్గీత.

ఆ భగవంతుని యందు మాయచే కల్పించబడిన యీ ప్రకృతి అంతయూ అనగా పంచ భూతములు ఆ భగవంతుని స్వరూపమున వున్న ఆయన సంపదయే. అనగా యీ సంపద రూపమైన ప్రకృతి అంతయూ ఆ భగవంతుని రూపమే, ఆ భగవంతునిదే. దీనికి మరియొక యజమాని అనగా, యీ ప్రపంచమును 'నాది' అనువాడు మరియొకడు యీ ప్రపంచమునందు లేడు. "కర్తన్నేను సమస్త భూతములకున్ కౌంతేయ సర్వమ్ములో వర్తింతింతున్" అని చెప్పి యున్నాడు. ఈ శ్రీమద్భగవద్గీతయందే

"మయాతతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా,
మత్స్థాని సర్వభూతాని నచాహం తేష్వవస్థితః"

అని కూడా చెప్పియున్నాడు.

ఆ సర్వము తానే అయి వున్న భగవంతుని మానవ దేహధారియైన జీవుడు (ఆత్మ) యెలా తెలుసుకొనగలడో లేక పొందగలడో యీ భగవద్గీతయందు అనేక విధములుగా చెప్పబడియున్నది.

భగవంతుని పొందుటకు అన్నిటికంటె ముందుగా ధర్మాచరణము ముఖ్యము. ఆ ధర్మము రెండు విధములైనది. ఒకటి ప్రవృత్తి మార్గము, రెండు నివృత్తి మార్గము. ఈ రెండు

విధములైన మార్గములు గీతయందు స్పష్టముగా చెప్పబడినవి. కాని చివరకు భేదమంతము తొలగి నివృత్తి మార్గమే సర్వవిధజనులకు మోక్షప్రదమని తేల్చి చెప్పబడినది.

భగవంతుని పొందు మార్గమే ధర్మము. ఆ ధర్మమును ఆయనయే స్థాపించినాడు. ఆ కారణముగా ఆ ధర్మమును చెడకుండా కాపాడుటకై ఆ నిర్వికార స్వరూపుడైన పరమేశ్వరుడు మానవ శరీర రూపమైన దేహమును ధరించి అనగా నామ రూపములు కలిగి ఆ ధర్మమును తిరిగి స్థాపించుచుండును. ఈ విధముగా ఆయనచే స్థాపించబడిన ధర్మము ననుసరించి మానవులందరూ నాలుగు వర్ణములుగా విభజింపబడినారు. అలా విభజింపబడుటకు వారి వారి స్వభావములు మరియు గుణ సంగ్రహముననుసరించి యేర్పడిన కార్యప్రవృత్తియే కారణము. చూ - గీ. 4.13 -

**చాతుర్వర్ణ్యం, మయా సృష్టం, గుణకర్మ విభాగశః,**
**తస్యకర్తారమపి, మాం విద్ధ్యకర్తార మవ్యయమ్**

అనగా - బ్రాహ్మణ క్షత్రియాదులను నాలుగు వర్ణములు సత్వాది గుణముల యొక్కము, ఆ గుణముల కారణముగ చేయబడు కర్మల యొక్కము విభజన ననుసరించి నాచే చేయబడినవి. ఆ నాలుగు అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు గీతయందు చెప్పబడిన గుణత్రయ విభాగ యోగమునందు యే విధమగు గుణములతో కూడియున్న మనోబుద్ధులు గలవారు యేవర్ణము వారిగా చెప్పబడినారో ఆ వివరణమంతయు ఆ యోగమునందు చెప్పబడినది.

స్థూలముగా - సత్వగుణము అధికముగా గలవారు బ్రాహ్మణులు.

రజోగుణము యెక్కువగా కలిగియున్నవారు క్షత్రియులు.

రజోగుణముతోపాటు తమోగుణము గూడ కలిగియున్న వారు వైశ్యులు

తమోగుణమే అధికముగా యున్న బుద్ధులు గల మానవులు శూద్రులు.

ఈ విధమగు గుణభేద కారణముగ స్వభావ భేదము, స్వభావ భేద కారణముగా కర్మభేదము, కర్మభేదము కారణముగ పాపపుణ్య, సుఖ దుఃఖ, జన్మ-మరణ, స్వర్గ-నరక భేదములు కలుగుచున్నవి. వీటినన్నింటిని తొలగించుకొని జీవుడు అనగా మానవుడు సుఖ, దుఃఖ, జన్మ-మరణ, పాప-పుణ్య, స్వర్గ-నరకముల నుండి తప్పించుకొని జన్మరాహిత్యమును అనగా మోక్ష స్థితిని యెట్లు పొందగలడో యీ గ్రంథమునందు నాలుగు వర్ణముల వారికి సాధ్యయోగ్యములైన వేఱు వేఱు సాధనా మార్గములు బోధించబడినవి.

వాటిలో -1) సాంఖ్యము అనగా జ్ఞానమార్గము

2) కర్మ మార్గము

3) యోగమార్గము

4) ధ్యానమార్గము

5) భక్తి మార్గములు ముఖ్యమైనవి.

అందరూ తమ తమ గుణ భేదము మరియు ఆ భేదము కారణముగ కలిగిన స్వభావ భేదము కారణముగా ఒకే మార్గమున పయనించి జన్మ మరణ రాహిత్య రూపమైన ముక్త స్థితిని పొందజాలరు. కావున యే గుణ ప్రధానమైన స్వభావము గలవారు యే మార్గమున పయనించి ఆ మోక్ష స్థితిని పొందగలరో ఆ వివరమంతయు పైన చెప్పబడిన అయిదు మార్గములను బోధించు యోగముల యందు చెప్పబడినది.

1) కర్మ మార్గము అనగా కర్మయోగము - సాధారణముగ యీ కర్మ మార్గము ముఖ్యముగా గృహస్థులై జీవనము గడుపు వారలకు చెప్పబడినది. దీనినే ప్రవృత్తి మార్గమని చెప్పుదురు. ప్రవృత్తి యనగా ప్రాపంచిక విషయములయందు అభిరుచి కలిగియుండుట. కాని గీతయందు మాత్రము యీ ప్రవృత్తి విషయక కర్మమార్గము గూడా క్రమక్రమముగా చివరకు ఆ సర్వవ్యాపక పరబ్రహ్మతత్త్వమును పొందింపజేయు నివృత్తి మార్గమునందే లయమైపోవును అని చెప్పబడినది.

కర్మకు మోహమే అనగా భ్రాంతి అనగా అజ్ఞానమే కారణము. అజ్ఞాన దశలో మానవుడు సత్పదార్థసాక్షాత్కారమును పొందగల సామర్థ్యము లేక భ్రాంతి జన్యములైన భౌతిక విషయముల - వస్తువుల - ద్వారా సుఖములు పొందవలయునని ప్రయత్నిస్తూ వుంటాడు. అటువంటి అజ్ఞానికి గూడ కర్మలు చేయగా చేయగా అనుభవము ద్వారా అవన్నియు తనకు ఎటువంటి శాశ్వత ఆంనదమును యివ్వజాలవని తోచు జ్ఞానము కలుగును. అట్టి జ్ఞానము కలిగినప్పుడు నిజమైన ఆనందమును యివ్వజాలని కర్మలు చేయుట తనంతట తానుగానే మానివేయును. ఆ విధముగా తన అనుభవజన్య జ్ఞాన బలంతో ప్రాపంచిక విషయములకు దూరమై తన యొక్క నిజస్వరూపమును గుర్తించి మోక్షస్థితిని పొందును. కావున యీ విధముగా కర్మమార్గము గూడ చివరకు నివృత్తియందే లయమైపోవును.

**2) భక్తిమార్గము :** అట్లే భక్తిమార్గము గూడ ఆరంభదశలో అజ్ఞానము చేత జీవుడు తానువేఱు ఈ ప్రపంచమునకు కారణస్వరూపుడైన భగవంతుడు వేఱనియు, తాను దుర్బలుడననియు, తనకు కలుగు సుఖదుఃఖములన్నియు ఆ భగవంతుని దయ తనపై లేనందువలననే కలుగుచున్నవనియు, తాను జన్మజరామరణములు గల వాడననియు, ఆ

సర్వేశ్వరుడు సర్వవిధ సంపన్నుడనియు ఆయనను ఆరాధించు భక్తులకు ఆయన సర్వవిధ సౌఖ్యములతో పాటు రక్షణ గూడ కలుగజేయుననియు, యింకా జన్మజరామరణముల నుండి తప్పించుననియూ ఒక భ్రాంతి జన్యమైన విశ్వాసమును ఏర్పరచుకొనును.

ఈ విధమగు భక్తిభావము గూడ అనేక విధములుగా వుండును. నారద భక్తి సూత్రములు మరియు భాగవత సిద్ధాంతము ననుసరించి యాభక్తి భావము తొమ్మిది విధములుగా వుండునని చెప్పబడినది.

**తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలోయెరుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచుదలతున్ సత్యంబు దైత్యోత్తమా.**

చూ. భాగ. స. స్కం

ఈ తొమ్మిది మార్గములలో యేమార్గమున భగవంతుని వైపుకు పయనించినా, అయితే యెలాపయనించాలంటే మనసా వాచా కర్మణా నాకు ఆభగవంతుడే సర్వస్వము ఆయనయే నాకు దిక్కు ఆయన దయను పొందియే, అయనచే స్థాపించబడిన ధర్మమార్గమున పయనించియే నేను సర్వవిధ దుఃఖముల నుండి ముక్తిని పొందగలను, అంతకంటే వేఱుమార్గము లేదు. లావొక్కింతయు లేదు. ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్ ఠావుల్దప్పెను, మూర్ఛవచ్చెం దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్ నీవే తప్ప నితఃపరంబెఱుగన్ మన్నింపదగున్. దీనునిన్ రావే ఈశ్వర, కావవేవరద, సంరక్షింపు భద్రాత్మకా, గ.మో. 74. అని తలంచి ఆయనను సేవించితే, అదెట్లన ? –

భక్తుడైనవాడు బలిమివిశ్వమువీడు,
దిక్కులేక తుదకు దీనుడగును,
'హరి'ని జేరగోరు 'హా' యనిచింతిల్లు.....

అటువంటి భక్తునికి ఆభగవంతునితో తాదాత్మ్యభావము కుదిరి సాలోక్యముక్తియో, సామీప్య ముక్తియో లేక భక్తిభావ తీవ్రతననుసరించి సారూప్య ముక్తియో అనగా జన్మ – మరణ రాహిత్యరూపమైన బ్రహ్మస్వరూపముగా వుండుస్థితియో లభించును. ఈ విధముగా భక్తి మార్గము గూడ చివరకు సర్వకర్మ సంన్యాస ఫల రూపమైన మోక్షమునే కలిగించును. అట్లే యోగ, ధ్యానమార్గములు గూడాను.

కాని జ్ఞాన మార్గము ఆ యితర మార్గముల వంటిదికాదు. ఇది నిత్యానిత్య వస్తు వివేకము ద్వారా జీవునికి అజ్ఞాన కారణముగ గల ప్రాపంచిక విషయ వాసనలనన్నింటిని సమూలముగా నశింపజేయును. ఎప్పుడైతే జీవుడు తన పూర్వపుణ్యకర్మల సంస్కార బలముతో మాయా కల్పిత ప్రపంచము యొక్క లేమిని తెలుసుకొనునో అప్పుడే అతనికి తనయొక్క నిజమైన, శాశ్వతమైన, వికార రహితమైన, జన్మ–జరా–మరణరహితమైన అపరోక్షానుభూతి కలుగుతుంది. అప్పుదు ద్వైతభావమంతయూ నశించి సర్వకర్మసంన్యాసము ద్వారా "అహంబ్రహ్మాస్మి" "అయమాత్మాబ్రహ్మ" మొదలగు సత్యానుభూతి కలుగుతుంది. తద్వారా ప్రాపంచిక విషయముల యందు, చివరకు తనదేహము నందు గూడ "దేహమేనేనను" భ్రాంతి గూడ తొలగి తానుమాత్రమే మిగిలి వుంటాడు. అప్పుడు దేనియందూ మోహము లేక శుద్ధుడై, వికారరహితుడై పరబ్రహ్మ స్వరూపుడుగా మిగిలి వుంటాడు. అదియే మానవుని, జీవుని పురుషార్థము. అదియే పరమానందస్థితి. అదియే అపరోక్షాను భూతి. అదియే జన్మ–మరణములు లేని మోక్షస్థితి.

ఈ విషయమునే "శ్రీమద్భగవద్గీతకు శ్రీశంకరభాష్యం యంథాతథం" అను ఈ గ్రంథము బోధించుచున్నది.

జీవుడు ముందుగా ధర్మబుద్ధి గలిగి, ఈశ్వరుని ద్వారా తనకు లభించిన కర్మాధికారమును అనుసరించి ఫలాపేక్షలేని బుద్ధితో కర్మలు చేయుచుండినచో అతనికి ఆకర్మల ద్వారా ఎటువంటి సుఖదుఃఖములు గాని పుణ్యాపాపములు గాని అంటక పర్యవసానముగా జ్ఞానోదయము కలిగి దానిద్వారా స్వరూప సాక్షాత్కారము కలుగును. ఇదియే శ్రీమద్భగవద్గీత యందు చెప్పబడినదని శ్రీశంకరాచార్యుల వారు తన భాష్యము ద్వారా విశదీకరించియున్నారు. సమస్త గీతారహస్యమును "గ్రంథోపసంహారము" అను శీర్షికతో తన భాష్యములో అంతర్భాగముగా గ్రంథము యొక్క అంత్యభాగమున చక్కగా సమీక్షించియున్నారు. ఇటువంటి సమీక్ష యింత వరకు యే గీతా వ్యాఖ్యాత గూడ చేసియుండలేదు. శ్రీ శంకరుల వారు నిర్ద్వందముగా గీత ధర్మాన్నివదల కుండానే నివృత్తి మార్గమును బోధించుచున్నదని స్పష్టపరచియున్నారు.

అటువంటి అతి స్పష్టము, సరళము, సర్వజనాను బోధకము అయిన శ్రీశంకర భాష్యమును నా శిష్యుడైన శ్రీసదానందభారతి సులభముగా సర్వులకు విశదముగా అర్థమగునట్లుగా ఆంధ్రభాషలోనికి అనువదించుట నాకెంతో ఆనందమును కలుగజేసినది.

ఈ శ్రీసదానందభారతి తన పూర్వాశ్రమమునందు డాక్టరు బండ్లమూడి ఆంజనేయులుగా లోకవిదితులు. ఆయన హిందీ, తెలుగు, సంస్కృతము మరియు ఇంగ్లీషు భాషల చక్కని పరిచయముగలవారు. హిందీ భాషయందు భక్తితత్త్వమునకు సంబంధించి "తులసీకా వ్యక్తిత్వ" అను పరిశోధనా గ్రంథమును వ్రాసి ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి "పి.హెచ్.డి" డిగ్రీని, దానితో పాటుగా విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘము వారి నుండి గొప్ప 'అవార్డు'ను కూడ పొందిన విద్వాంసులు. అంతేగాక కాలేజీ లెక్చరర్‌గా షుమారు నలుబదివత్సరములు బాలబాలికలకు విద్యాబోధగావించి వారిలో ఎందరినో విద్వాంసులుగా తీర్చిదిద్దిన మహోధ్యాపకులు.

ఈ అనువాదమునకు పూర్వము చాలాకాలముగా షుమారు పన్నెండు వత్సరముల నుండి మా ఆశ్రమము నందుచేరి అద్వైతతత్త్వమునకు సంబంధించిన వివేక చూడామణి, భారతీయ తత్త్వశాస్త్రము, ఉపదేశసహస్రి, మహావాక్యదర్పణము, సర్వవేదాంతసార సంగ్రహము, వేదాంతపంచదశి, నైష్కర్మ్యసిద్ధి, మాండూక్య, శ్వేతాశ్వర, కఠ, తైత్తిరీయ, బృహదారణ్యక, ఛాందోగ్య ఐతరేయ, ప్రశ్న, ఈశావాస్య మొదలగు ఉపనిషద్గ్రంథములు మహాభారత, రామాయణ, శ్రీమదాంధ్ర మహాభాగవతాది స్మృతి గ్రంథములు, ఎంతో శ్రద్ధాభావముతో పఠించిచిత్తశుద్ధిని పొందిన తత్త్వవేత్తలు. ఆకారణముగ "జీవనవేదము", "రామరాయ శతకము", జ్ఞానోపనిషత్తు, పాటలలో సమస్తమైన అద్వైతతత్త్వమును తెలుపు "అమృతబిందువులు", హిందీలో "కలాకార్ కా వ్యక్తిత్వ ఔర్ కావ్యమే వుస్కీ అభివ్యక్తి" మొదలగు అనేక గ్రంథములు వ్రాసిన పండితులు.

ఈ "శ్రీమద్భగవద్గీత —శ్రీశంకరభాష్యం యథాతథం"అను ఈ అనువాద గ్రంథము పండితులకు, తత్త్వవేత్తలకు మరియు సామాన్యులకు గూడ గీతా రహస్యమును ఆంధ్రభాష ద్వారా తేట తెల్లముగా తెలియజేయగలదని ఆశించుచూ నాశిష్యుడైన శ్రీసదానందభారతిని యింత మంచి కార్యమును చేయుటకు శ్రమించినందులకు హృదయపూర్వకముగా ఆశీర్వదించుచున్నాను.

ఇట్లు

**- శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాములు**

ప్రణవాశ్రమము

గుడివాడ 10.3.2002

# కృతజ్ఞతలు

శ్రీమద్భగవద్గీత ఒక అత్యద్భుతమైన శాస్త్రగ్రంథము. ఇటువంటి గ్రంథము ప్రపంచములో మరియొకటి కానరాదనడం అతి శయోక్తి కాదు. ఏలయన ? దీని గ్రంథకర్తయైన శ్రీశ్రీశ్రీ వేదవ్యాస మహర్షుల వారు భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుని ముఖతా మానవులనందరిని పూర్వపూర్వ జన్మలయందు తమచే చేయబడిన కర్మల ఫలముగా నాలుగు వర్ణములుగా విభజించి ఆ వర్ణవ్యవస్థయను ధార్మిక పునాదులపై శ్రీమద్భగవద్గీత యనబడుచున్న మహావిశాలము మరియు సుదృఢమైన భవనమును నిర్మింపజేసి దానియందు అన్ని వర్ణములవారు తమతమ వర్ణధర్మములకు కట్టుబడి తమ స్వభావజనితమైన కర్మల నాచరించుచూ, సుఖజీవనము గడపుచూ తుదకు క్రమక్రమముగా జన్మ - మరణ రాహిత్యరూపమైన మోక్షస్థితిని పొందుటకు తగు వ్యవస్థను యేర్పాటు చేసియున్నారు. అన్ని వర్ణముల వారికి వారివారి స్వభావ కారణముగ యేర్పడిన గుణముల సమన్వయము ననుసరించి విధించబడిన కర్మాధికారమునకు లోబడి ఫలాపేక్షలేక కర్మలు చేయుచూ తుదకు ఆ కర్మల ద్వారానే కలిగిన జ్ఞానబలంతో మోక్ష స్థితిని పొందునట్లుగా యేర్పాటు చేసియున్నారు.

ఈ గ్రంథమునందు అన్ని వర్ణములకు చెందిన మానవులందరికి మోక్షసిద్ధికి అవుసరమగు మార్గములు చూపించియున్నాడు. ఆకారణముగానే కర్మయోగము, భక్తి యోగము, ధ్యాన యోగము, సాంఖ్యయోగము అనగా జ్ఞానయోగము అను వివిధ యోగములు అనగా మోక్షమును కలిగించు మార్గములు పరస్పర విరోధము లేకుండ చూపెట్టబడినవి.

అయితే గ్రంథం మొత్తములోను ధర్మాచరణము కంటె జ్ఞానసంపాదనమే శ్రేయోదాయకమని చెప్పుచూ నిష్కామ కర్మయోగము ద్వారా మానవ సహజమైన కర్మను బహిష్కరించలేదు. భగవదర్పిత భావముతో అన్ని వర్ణముల వారు తమకు విధించబడిన కర్మాధికారము ననుసరించి యెటువంటి కర్మలు చేసినను ఆ కర్మల ఫలములైన పాపపుణ్యములు అనగా సుఖదుఃఖములు వారికి అంటవని మర్మగర్భితముగా చెప్పియున్నారు. పైగా అజ్ఞానము కారణముగ కర్మల యందు మునిగియున్న వారికి నైష్కర్మ్య భావము అనగా శుద్ధ జ్ఞానరూపమైన అద్వైతతత్త్వమును బోధించరాదనియు, బోధించినచో వారు చెడిపోవుదురనియు, అందులకుగాను జ్ఞానియైన వారలుగూడ ఆ యజ్ఞానులకు మార్గదర్శకత్వము లభించునట్లుగా నిష్కామ భావముతో కర్మలు చేస్తూనే వుండవలయునని, అందులకు శ్రీ కృష్ణునినే వుదాహరణముగ గ్రహించవచ్చునని వ్యాసులవారు బోధించియున్నారు.

గీత యందు సారరూపముగా అద్వైతతత్త్వమును మోక్షమునకు సర్వశ్రేష్ఠమైన సాధనముగా బోధించిగూడ వర్ణగతమైన కర్మను వదలరాదని నొక్కి చెప్పియున్నారు. శ్రీ శంకరాచార్యులవారు తమ భాష్యము ద్వారా గీతారహస్యమును సర్వులకు సుబోధకమగునట్లుగా విశదీకరించియున్నారు.

ఇప్పటికి షుమారు మూడువేల సంవత్సరములకు పూర్వమే యీ సర్వాంగపూర్ణము మరియు సర్వజనమోక్షదాయకము అయినటువంటి మయసభా ప్రాంగణమును పోలిన

గ్రంథభవనము సర్వవిధ జనసముదాయమునకు సుఖదాయకముగా వుండునట్లుగా నిర్మించబడినది. ఈ లోకం వున్నంత కాలం యీ గ్రంథము పాతబడదు దీని ఔన్నత్యము చెడదు. యుగయుగాల పర్యంతము యీ గ్రంథం పఠనీయంగానే వుంటుంది. దీనిని త్రోసివేయగల మరొక గ్రంథము రాదు, రాబోదు.

సర్వవిధ ధర్మములకు యీ గ్రంథము శత్రుదుర్భేద్యమైనటువంటి కోట వంటిది. అంతేకాదు యీ గ్రంథము హిందూ ధర్మము యొక్క మహోన్నత్యమును, ఉదార స్వభావమును మరియు సర్వజనీనతను వేలాది నోళ్లతో లోకమునందు చాటుతూనే వుంటుంది.

అందువలననే అనగా యీ గ్రంథరాజము యొక్క మహోన్నత్యము కారణముగానే నేటికి షుమారు అయిదు వేలమంది మహాత్ములు యీ గ్రంథమును తమతమ బుధ్యాను సారముగ వ్యాఖ్యానించియున్నారు. అయినప్పటికి శ్రీశ్రీశ్రీ జగద్గురువులు ఆది శంకరాచార్యుల వారి భాష్యమునకు సరితూగగల వ్యాఖ్యానము ప్రకటితము కాలేదు. ఆ కారణముగానే ఆంధ్రభాషా పరిచితులందరికి శ్రీ శంకరభాష్యమును పరిచయము చేయు సద్భావముతో ప్రేరేపించబడిన వాడనై "శ్రీ మద్భగవద్గీత - శ్రీ శంకరభాష్యం యథాతథం" అను నామముతో యీ అనువాద కార్యమును చేసియున్నాను. ఇందు యేవైన దోషములున్నచో అవన్నియు నా అజ్ఞానమూలముగా దొర్లినవేగాని శ్రీ శంకరుల వారివి కావని విన్నవించుకొనుచున్నాను. నాయందు దయయుంచి, నాదోషములను మన్నించి పండితులైనవారు ఆదోషములను నాకు తెల్పినచో తరువాతి ముద్రణకాలమందు తగురీతిగా సంస్కరించుకోగలవాడనని సవినయముగా ప్రార్థించుచున్నాను.

**కృతజ్ఞతలు** అందరికంటె ముందుగా లోకకల్యాణార్థము శ్రీశ్రీశ్రీ తిరుమలగిరిపై వేంచేసియున్న వేంకటేశ్వర స్వామివారు అప్రత్యక్షముగా తన మహిమచే లోకమును నడిపించుచూ ఈ గ్రంథ ప్రకాశమునకు నలుబడివేల రూపాయిలు తమ ప్రతినిధుల ద్వారా గ్రాంటుగా యిచ్చినందులకు వారికి మరియు వారి ప్రతినిధులకు నాహృదయ పూర్వక శతాధిక సర్వాంగదండ ప్రణామములు ఆచరించుచున్నాను. అట్లే నన్ను అత్యంత ప్రేమభావముతో తమ శిష్యునిగా స్వీకరించి గత పన్నెండు వత్సరములుగా నాకు అద్వైత విద్యను బోధించి నన్ను ఈ మహద్గ్రంథమును అనువదించగల సమర్థునిగా జేసి, అట్లు చేయుటకు అన్నివిధముల ప్రోత్సహించుటయేగాక నాచే అనువదించబడిన యీ 'శంకరభాష్యం యథాతథం' అను గ్రంథమునకు 'గ్రంథప్రవేశము' వ్రాసియిచ్చిన నాగురుదేవులు, ప్రణవాశ్రమాధిపతులు శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీస్వాముల వారికి సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించు చున్నాను.

అట్లే ఈ గ్రంథమును ప్రకాశింపజేయుటకు అవసరమైన అన్ని విధ కార్యములు శ్రమయనితలంచక పట్టుదలతో ప్రయత్నించిన రిటైర్డు చీఫ్ ఇంజనీరు శ్రీ కాజ కృష్ణారావు గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకొంటున్నాను. ఆవిధముగానే నేను కోరినయంతనే అతి సంతోషంతో తన 'నాగేంద్ర ప్రెస్సు'నందు ఈ గ్రంథమును యింత చక్కగా అచ్చువేయించి యిచ్చిన శ్రీ బాబూరావుగారికి కూడా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

ప్రణవాశ్రమము. ఇట్లు అనువాదకుడు

**- శ్రీ సదానందభారతి**

ఓం

# గురుపరంపరాభివందన

ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో,

వంశ ఋషిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః

ఓం సర్వో పప్లవ రహితః ప్రజ్ఞాన ఘనః

ప్రత్యగర్థో బ్రహ్మైవాహమస్మి, బ్రహ్మైవాహమస్మి

ఓం నమో నారాయణం, పద్మభవం, వసిష్ఠం

శక్తిం చ తత్పుత్ర పరాశరం చ

వ్యాసం శుకం గౌడపదం మహాంతం

గోవింద యోగీంద్ర మథాస్య శిష్యం

శ్రీ శంకరాచార్య మథాస్య పద్మ పాదం చ

హస్తామలకం చ శిష్యం తం తోటకం

వార్త్తి కకారమన్యాన్ అస్మద్గురూన్ సంతత మానతోస్మి

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం

నమామి భగవత్పాదం శంకరం లోకశంకరం

శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణం,

సూత్రభాష్య కృతౌ వందే భగవంతౌ పునః పునః

ఈశ్వరో గురురాత్మేతి మూర్త్తిభేద విభాగినే

వ్యోమవత్ వ్యాప్త దేహాయ దక్షిణామూర్త్తయే నమః.

# విషయాను క్రమణిక


| | | పుట |
|---|---|---|
| | ఉపోద్ఘాతము | iii |
| | గ్రంథ ప్రవేశము | vii |
| | కృతజ్ఞతలు | xiii |
| | గురుపరంపరాభివందన | xv |
| | విషయాను క్రమణిక | xvi |
| 11. | పదకొండవ అధ్యాయము (విశ్వరూప సందర్శన యోగము) | 1 |
| 12. | పన్నెండవ అధ్యాయము (భక్తియోగము) | 22 |
| 13. | పదమూడవ అధ్యాయము (క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము) | 34 |
| 14. | పదునాల్గవ అధ్యాయము (గుణత్రయ విభాగయోగము) | 82 |
| 15. | పదునైదవ అధ్యాయము (పురుషోత్తమ యోగము) | 95 |
| 16. | పదునారవఅధ్యాయము (దైవాసుర సంపద్విభాగయోగము) | 109 |
| 17. | పదునేడవ అధ్యాయము (శ్రద్ధాత్రయ విభాగయోగము) | 120 |
| 18. | పదునెనిమిదవ అధ్యాయము (మోక్షసంన్యాస యోగము) | 131 |

# శ్రీమద్భగవద్గీత (రెండవ భాగము)

## శ్రీ శంకరభాష్యం యథాతథం

# పదునొకొండవ అధ్యాయము

ఇంతకుముందలి అధ్యాయమునందు అనగా దశమ అధ్యాయమునందు ఆ ాత్ముని యొక్క విభూతులు వర్ణించి చెప్పబడినవి. ఆ అధ్యాయమునందు భగవంతునిచేత బడిన "నేను ఈ సమస్తమైన జగత్తును నా ఒక అంశము చేతనే వ్యాపింపజేసి నాయందు కము ఎట్టి వికారము లేకుండ వుండియున్నాను" అను మాటల ద్వారా తెలియబడుచున్న ్వరుని **జగదాత్మక స్వరూపమును** మరింత స్పష్టముగా తెలియగోరిన వాడై అర్జునుడు ష్ణునితో యిలా అన్నాడు -

1. మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్,
యత్త్వయోక్తం వచస్తేన మోహో ఽయం విగతో మమ.

అనగా - నన్ను అనుగ్రహించదలంచి మీరు నాకు అత్యంత శ్రేష్ఠము. అతి స్యమయమై గుప్తముగా వుంచదగిన ఆధ్యాత్మిక విషయములు అనగా ఆత్మానాత్మల రణకు సంబంధించిన వాక్యములు చెప్పియున్నారు. మీరు చెప్పిన ఆ వ్యాకముల ద్వారా ునందు నాకు తెలియకుండ వున్న మోహభావమంతయు తొలగిపోయినది. అవివేకముతో ోయున్న నా బుద్ధి యిప్పుడు అవివేక శూన్యమై వివేకముతో కూడియున్నది.

2. భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా,
త్వత్తః కమల పత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్.

అనగా - నేను మీ నుండి సర్వప్రాణుల యొక్క వుత్పత్తి మరియు వాటి యొక్క యము అనగా నాశము యీ రెండు విషయములను గురించి సంక్షిప్తముగా గాక అత్యంత నముగాను విస్తార పూర్వముగాను వినియున్నాను. ఓ కమల నయనా ! మీ యొక్క నాశ తము అనగా అక్షయమైన మహాత్మ్యమును గురించి విశదముగా వినియున్నాను.

3. ఏవమేతద్యథాత్థ ఽ ఽత్వమాత్మానం పరమేశ్వర,
ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ.

అనగా - మీరు మిమ్ముల గురించి ఏ విధముగా చెప్పుచున్నారో సరిగ్గా అట్లే న్నారు. అంతకంటే వేఱుగ అనగా భిన్నముగా లేరు. అట్లయినప్పటికి ఓ పురుషోత్తమా ! ుము, ఐశ్వర్యము, భక్తి, బలము, వీర్యము మరియు తేజస్సుతో కూడియున్న మీ యొక్క **వ రూపమును** నేను నా కన్నులతో చూడగోరుచున్నాను.

**11.4. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో,**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్.**

అనగా – స్వామీ ! అర్జునుడనైయున్న నాచేత మీయొక్క నిజరూపము చూడబడుట సంభవమని తలంచితిరేని అయితే ఓ యోగీశ్వరా ! నేను తమయొక్క ఆ రూపమును చూడవలయునను గట్టి కోరికతో యున్నాను. అందుచే తమరు నాయందు దయ యుంచి తమయొక్క ఆ యక్షర రూపమును దర్శింపజేయుడు.

అర్జునునిచేత ఈ విధముగా కోరబడుట వలన ప్రేరణ పొందినవాడై భగవంతుడు యీ విధముగా చెప్పియున్నాడు.

**11.5. పశ్య మే పార్థ ! రూపాణి శతశో౽థ సహస్రశః,**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ.**

అనగా – ఓ పార్థా ! నీవు నా యొక్క వందలు, వేలసంఖ్యలో వున్న అనగా నా యొక్క అనేక రూపములను చూడుము. ఆ రూపములు అనేక విధములైన భేదములతోను మరియు దివ్యమై దేవలోకమునందు వుండునటువంటి అలౌకిక రూపములు మరియు నానావిధములైన వర్ణములు అనేక రంగులతో కూడియున్నవి మరియు నానావిధములైన ఆకృతులు కలిగియున్నవి అనగా నీలిరంగు, పీత అనగా బంగారంగు మొదలగు అనేక విధములగు రంగులతోడను మరియు అనేక విధములైన ఆకారములు గలిగి, అవయవములు కలిగియున్న ఆ రూపములను చూడుము.

**11.6. పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుత స్తథా,**
**బహూన్యదృష్ట పూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత.**

అనగా – అర్జునా ! నీవు ముందుగా పండ్రెండుమంది ఆదిత్యులు అనగా సూర్యులను, ఎనిమిదిమంది వసువులను, పదకొండుమంది రుద్రులను, ఇరువురు అశ్వనీ కుమారులను మరియు నలుబది తొమ్మిదిమంది మరుత్ గణములను చూడుము. మరియు ఈ మనుష్యలోకమునందుండు నీవుగాని మరి యితరులెవ్వరూ గూడ ఎన్నడూ చూడనటువంటి అనేకమైన అద్భుతమైన దృశ్యములను చూడుము.

ఇంతేగాక –

**11.7. ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్,**
**మమ దేహే గుడాకేశ ! యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి.**

అనగా – ఓ గుడాకేశ ! అనగా అర్జునా ! ఇప్పుడు నీవు నాయీ దేహమునందే, ఒకేచోట చేరియున్నట్టి లేక వుండి వున్నట్టి చరాచరమైన జగత్తుతో సహా సమస్తమైన జగత్తును

చూడుము. మరియు జయపరాజయము మొదలగు దృశ్యములను వేటియందు మేము వారిని జయించెదము లేక వారు మమ్ములను జయింతురు మొదలగు శంకించు విషయములను అంతేగాక యితరముగా యింక నీవేమేమి చూడదలంచితివో వాటినన్నింటిని చూడుము.

కాని -

**11.8. న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా,**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్.**

అనగా - నీవు విశ్వరూప ధారుడనై పరమేశ్వరుడనై యున్న నన్ను యీ ప్రకృతి అనగా పంచభూతములచే ఏర్పడిన కన్నులతో చూడజాలవు. ఏ దివ్య నేత్రములతో నీవు నా యొక్క విశ్వరూపమును చూడగలవో అట్టి దివ్య నేత్రములను నేను నీకు కలుగజేయుచున్నాను. ఆ దివ్య నేత్రముల ద్వారా నీవు సర్వేశ్వరుడనై యున్న నన్ను నా ఐశ్వర్యమును అనగా నాకు సంబంధించిన విభూతులను మరియు నా యొక్క యోగసామర్థ్యమును చూడగలవు. అప్పుడు సంజయుడు ధృతరాష్ట్రునితో యీ విధముగా చెప్పినాడు.

**11.9. ఏవముక్త్వా తతో రాజన్మహాయోగేశ్వరో హరిః,**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్.**

అనగా - ఓ ధృతరాష్ట్ర మహారాజా ! అట్లు చెప్పిన తరువాత మహా యోగేశ్వరుడైన శ్రీహరి అనగా అత్యంత మహనీయుడు మరియు యోగేశ్వరుడు అయినటువంటి ఆ నారాయణుడు అర్జునునకు తన ఈశ్వరత్వముతో కూడియున్న పరమాత్మ రూపమును అనగా ఆయనయొక్క విరాట్ రూపమును దర్శింపజేసెను.

**11.10. అనేక వక్త్రనయన మనేకాద్భుత దర్శనమ్**
**అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్.**

అనగా - ఆ **విశ్వాత్మునకు** అనేకములైన ముఖములు మరియు అనేకములైన నేత్రములు కలవు. అనగా ఆయన యొక్క ఆ విరాట్ రూపమునందు అనేక ముఖములు మరియు అనేక నేత్రములు కలవు. మరియు అనేకములైన అద్భుత దృశ్యములు గల రూపము గలవాడై యున్నాడు. ఆ యొక్క రూపమునందు ఆశ్చర్యమును కలిగించు అనేకములైన దృశ్యములు గలవు. ఆయన రూపము దివ్యమైన ఆభూషణములతో నిండియున్నది. మరియు అనేకములైన ఆయుధములు ధరించియున్న హస్తములు కలిగియున్నాడు. అటువంటి తనయొక్క అత్యద్భుత రూపమును భగవంతుడు అర్జునునకు దర్శింపజేసినాడు. ఈ శ్లోకమునకు యింతకు పూర్వ శ్లోకమునందు గల "దర్శయామాస" అను శబ్దముతో సంబంధము కలదు.

మరియు -

**11.11. దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్,**
**సర్వాశ్చర్యమయం దేవమనంతం విశ్వతోముఖమ్.**

అనగా భగవంతుని యొక్క ఆ విశ్వరూపము దివ్య పుష్పమాలలతోనూ మరియు దివ్యమైన వస్త్రములతో అలంకరించబడియున్నది. ఆయన దేహమంతయు దివ్యమైన గంధముతో లేపనము చేయబడి యున్నది. అంతేగాక అనేకములైన ఆశ్చర్యమును కలిగించు దృశ్యములతో కూడియున్నది. సర్వభూతములకు ఆత్మస్వరూపుడై యున్నందున అన్ని దిశలయందును ముఖములు గలవాడై యున్నాడు. అటువంటి అనంతమైనటువంటిదియు మరియు అనంతము మరియు దివ్యము అయినటువంటి తన విరాట్రూపమును భగవంతుడు అర్జునునకు చూపించినాడు. అర్జునుడు భగవంతుని విరాట్ రూపమును దర్శించినాడు అని అన్వయించుకొనవచ్చును.

భగవంతుని విరాట్ రూపము యొక్క ప్రభను అనగా ప్రకాశమును ఉపమానము ద్వారా వర్ణించుచున్నాడు.

**11.12. దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా,**
**యది భాస్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః.**

అనగా ఆ ప్రకాశము ద్యులోకమునందు అనగా ఆకాశమునందు లేక మూడవ స్వర్గలోకమునందు ఒకే కాలమునందు ఉదయించినటువంటి వేలకొలది సూర్యుల యొక్క ప్రకాశము కంటె గూడ ఎక్కువగా వున్నది.

**11.13. తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్తమనేకధా,**
**అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా.**

అనగా – అప్పుడు పాండుపుత్రుడైన అర్జునుడు విశ్వరూపుడు దేవాధిదేవుడు అయిన హరియందు తన తండ్రులను మనుష్యులు మొదలగు భేదములతో అనేక విధములుగా విభజింపబడియున్న అనేక ప్రాణులను, జగత్తులను దర్శించినాడు.

**11.14. తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః,**
**ప్రణమ్య సిరసా దేవం కృతాంజలిరభాషత.**

అనగా – ఆ విధముగా దర్శించిన ధనంజయుడు ఆశ్చర్య చకితుడైనవాడై మరియు ప్రఫుల్లిత అనగా గగుర్పాటు చెందిన రోమముల గలవాడైనాడు. అనగా అతని ఒడలంతయు పులకరించినది. అటుపైన అతడు విశ్వరూపధారియు పరమాత్మ స్వరూపుడు అయిన భగవంతునికి సాష్టాంగదండ ప్రణామములు చేసి అనగా నమ్రత కలిగి పరంపరానురీతిగా నమస్కరించి, మరల మరల నమస్కరించి చేతులు జోడించి యిట్లనినాడు –

తమరు నాకు తమయొక్క నిజమైన విశ్వరూపమును దర్శింపజేసినారు. ఆ రూపమును తాను ఎట్లు దర్శించినాడో ఆ దర్శనము వలన తనకు ఎటువంటి అనుభూతి కలిగినదో సవివరముగా చెప్పనారంభించినాడు.

**11.15. పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేష సంఘాన్,**
**బ్రహ్మాణమీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వానురాగాంశ్చ దివ్యాన్.**

అనగా - ఓ దేవా ! నేను తమయొక్క దేహమునందు సమస్తమైన దేవతలను మరియు స్థావర జంగమ రూపములుగల అనేక విధములుగా విభజింపబడిన రూపములు గల సమస్త భూతసంబంధములైన సమూహములను మరియు కమలాసనముపై విరాజిల్లు అనగా శోభించు అనగా భూమియనెడు కమలమునందు సుమేరువను చక్రము (సారె)పై కూర్చునియున్న ప్రజలందరినీ పరిపాలించు చతుర్ముఖుడైన బ్రహ్మను, వశిష్ఠాది ఋషులను మరియు వాసుకి మొదలగు సమస్త దివ్యమైన అనగా దేవలోకమునందుండు సర్పములను చూచుచున్నాను.

**11.16. అనేక బాహూదర వక్త్ర నేత్రం పశ్యామి త్వాంసర్వతో ౭నంతరూపమ్,**
**నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప.**

అనగా - స్వామీ ! నేను మిమ్ములను అనేకమైన భుజములు గలవానిగాను, ఉదరములు గలవానిగాను, ముఖములు గలవానిగను, మరియు అనేకములైన నేత్రములు గలవానిగను చూచుచున్నాను. అన్నివైపులా వ్యాపించి అనంతమైన రూపము గలవానిగా చూచుచున్నాను. ఓ విశ్వేశ్వరా ! నేను మీ యొక్క ఆది అంతములు చూడజాలకున్నాను. అందుకే కాబోలు ఈ అనువాదకుడు తన 'అమృత బిందువులు' అను గ్రంథమునందు ఆ పరమాత్మ తత్త్వమును గురించి యిలా పాడియున్నాడు -

"ఆదియన్నది లేనివాడను, అంతమన్నది లేనివాడను
ఆదియంతము లేక యుండియు అంతటా మరి వున్నవాడను
ఓ పరమ గురుడా ! నాదుతత్త్వము తెలుపరావయ్యా !
ఓ పరమ గరుడా ! నాదు తత్త్వము తెలుపరావయ్యా !

**11.17. కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్,**
**పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతా ద్దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్.**

అనగా - శిరమునందలంకరించు ఆభూషణ విశేషము. కిరీటము అట్టి ఆభూషణము శిరముననున్నవాడు "కిరీటి" అనబడును. గద అను ఆయుధము హస్తమునందు గలవాడు 'గదీ' యనబడును. చేతియందు చక్రము అను ఆయుధము గలవాడు "చక్రి" అనబడును. ఈ

కారణముచేత నేను మిమ్ములను కిరీటి అనగా కిరీటము ధరించియున్నవాడు. గదీ గదా దండము కలిగియున్నవాడు. చక్రి చక్రాయుధము కలిగియున్నవాడు, తేజోరాశి, అనగా అత్యంత ప్రకాశము గలవాడు, అన్నివైపులను ప్రకాశము గలవానిగా చూచుచున్నాను. మరియు మిమ్ములను 'దుర్నిరీక్షుకుడు' అనగా యితరులచేత అతి కష్టముగా చూడబడువాడు. మరియు అన్ని దిశలనుండి మండుచున్న అగ్ని మరియు అత్యంత తేజోమయుడై వెలుగుచున్న సూర్యునివలె ప్రకాశించుచున్నవాడవు మరియు బుధ్యాదులచే గ్రహింపబడనివాడవు అయి వున్నావు. అందుచేతనే శ్లోకమునందు "దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్" అని చెప్పబడినది.

ఈ విధముగా తమయొక్క యోగశక్తిని జూచి నేను యిట్లు తలంచుచున్నాను.

**11.18. త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్,**
**త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా సనాతన స్త్వం పురుషో మతో మే.**

అనగా – తమరు ముముక్షువులైనటువంటి పురుషుల ద్వారా మాత్రమే తెలియ దగియున్న అక్షరులు అనగా ఎప్పుడు ఎటువంటి వికారములేనటువంటి పరబ్రహ్మ పరమాత్మ స్వరూపులై యున్నారు. తమరే యీ సమస్త జగత్తునకు సర్వోత్కృష్టమైన సంపద అయి వున్నారు. అందుచేత యీ సమస్త జగత్తునకు ఏకమాత్ర ఆశ్రయమై యున్నారు.

ఇంతేగాక తమరు నిర్వికారులు అనగా ఎటువంటి వికారము లేనివారు అనగా జన్మజరామరణములు లేనివారు. మరియు తమరు సనాతన ధర్మరక్షకులై యున్నారు. మరియు తమరే సనాతన పరమ పురుషులై యున్నారు. ఇది నా అభిప్రాయము.

మరియు –

**11.19. అనాది మధ్యాంతమనంత వీర్యమనంత బాహుం శశిసూర్యనేత్రం,**
**పశ్యామి త్వాం దీప్తహుతాశ వక్త్రం స్వతేజసా విశ్వమిదం తపంతమ్.**

అనగా – నేను మిమ్ములను ఆదిమధ్యాంత రహితునిగా అనగా ఆరంభము అనగా పుట్టుక, మధ్య పుట్టిన తరువాత వుండుట. అంతము అనగా లేకుండా పోవుట లేక నశించుట అనునవి లేనివానిగా చూచుచున్నాను. మరియు మిమ్ములను అంతములేని రూపము గలవారుగాను అనంతవీర్య అనగా హద్దులు లేని శక్తియుక్తులు గలవానిగాను చూచుచున్నాను. మీ సామర్థ్యము తరగనిది. అందువలననే మీరు అనంతవీర్యము గలవారు. మరియు నేను మిమ్ములను అనేకములైన చేతులు గలవానిగా చూచుచున్నాను. చంద్రుడు సూర్యుడువంటి మీ కన్నులు, మండుచున్న అగ్నివంటి తేజోమయమైన మీ ముఖము మరియు తమ తేజముతో ఈ జగత్తునంతటినీ తపింపజేయుచున్నారు. మీ యొక్క ఇటువంటి రూపమును నేను చూచుచున్నాను.

**11.20.** ద్యావాపృథివ్యోరిదమంతరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః,
దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్.

అనగా - **విశ్వమే రూపముగా గలిగిన** పరమేశ్వరులైన మీ చేతనే ఈ స్వర్గము మరియు భూమి మరియు సర్వవ్యాపకమైన, సమస్తమైన ఆకాశము మరియు దిక్కులన్నియు గూడ నిండియున్నవి. 'అమృత బిందువులు' అను గ్రంథములోని ఈ పాటను వినండి -

"దిక్కుయన్నది లేనివాడను, దిక్కులందున వున్నవాడను,
దిక్కులందున నిండివుండియు దిక్కులకు దిక్కైనవాడను...

ఓ మహాత్మా ! అనగా ఓ అక్షుద్ర స్వభావము కలిగియున్న కృష్ణా ! తమ యొక్క ఈ అద్భుతమైన మరియు ఆశ్చర్యజనకమైన, భయంకరము మరియు క్రూరము అయిన రూపమును జూచి ముల్లోకములు భీతిని జెందియున్నవి. అనగా భయముతో వణకిపోవుచున్నవి.

అర్జునునకు యింతకు పూర్వము "మేము వారిని జయించెదము లేక వారు మమ్ములను జయింతురు" అను భావము కలదు అటువంటి అర్జునుని నిర్భయునిగా చేయుట కొరకే భగవంతుడు "నేను పాండవులకు తప్పక విజయమును కలిగింతును" అను భావముతో కూడినవాడై అటువంటి రూపమును ప్రదర్శించినాడు. భగవంతుని ఆ రూపమును చూచి అర్జునుడు యిట్లు చెప్పినాడు -

**11.21.** అమీ హి త్వాం సురసంఘా విశంతి కేచిద్భీతాః ప్రాంజలయో గృణంతి,
స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః.

అనగా - ఇచ్చట యుద్ధము చేయుచున్న యోధులైన దేవగణములు అనగా భూభారమును తగ్గించుటకై యిచ్చట వుద్భవించి యున్నారో వారందరూ మనుష్యులవలెనే ఆకారములు అనగా ఆకృతులు కలిగి యున్నప్పటికీ వారు నిజమైన దేవతలై వారందరూ పరుగులెత్తుచూ మీయందు ప్రవేశించుచున్నట్లుగా చూచుచున్నాను. అందులో కొందరు పరుగులెత్తలేనివారై భయముతో మీకు నమస్కరించుచున్నట్లుగా నేను చూచుచున్నాను.

మరియు మహర్షి మరియు సిద్ధ సముదాయములు యుద్ధము ఆరంభమైనందున ఆపదలు మొదలగు అశుభములైన శకునములు గాంచినవారై "ప్రపంచమునకు శుభములు గలుగుగాక" అని వుచ్చరించుచూ అనేకములైన అనగా సంపూర్ణమైన స్తోత్రముల ద్వారా మిమ్ములను కీర్తించుచున్నారు.

ఇంకా ఏమనగా -

**11.22.** రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వే ఽశ్వినౌ మరుతశ్చోష్మ పాశ్చ,
గంధర్వయక్షాసురసిద్ధ సంఘా వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే.

అనగా - రుద్రుడు, ఆదిత్యుడు, వసువు మరియు సాధ్యుడు మొదలగు దేవగణములు మరియు విశ్వదేవుడు, అశ్వనీకుమారులిరువురూ వాయుదేవుడు మరియు ఉష్మపా అను పేరు గల పితృగణములు మరియు గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధగణములు అనగా ఆహా

హూహూ మొదలగు గంధర్వులు, కుబేరాది దిక్పాలురు, విరోచనుడు మొదలగు రాక్షసులు మరియు కపిలాది సిద్ధులు యీ గణములన్నియు ఆశ్చర్యమును చెందినవారై మిమ్ములనే చూచుచున్నవి.

అట్లేలయన ? -

**11.23. రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహూ బహూ బాహూరుపాదమ్,**
**బహూదరం బహుదంష్ట్రాకరాలం దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాహమ్.**

అనగా - ఓ మహాబాహూ ! తమ యొక్క ఆ రూపము చాలా గొప్పది. చాలా పొడవు, వెడల్పు కలిగియున్నది. అనేకమైన ముఖములు, నేత్రములు కలిగియున్నది. అట్లే అనేకమైన బాహువులు మరియు కాళ్ళు, అనేకమైన పొట్టలు మరియు పెద్ద దంతములు కలిగి భయంకరమైన ఆకృతి గలదైయున్నది. తమ యొక్క యిటువంటి విచిత్ర రూపమును జూచి ప్రపంచమునందలి ప్రాణులన్నియు భయముతో వ్యాకులతను చెందుతున్నవి. మరియు నేను గూడ ఆ ప్రాణులవలెనే భయముతో కంపించుచున్నాను.

అందులకు కారణమేమన -

**11.24. నభఃస్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననం దీప్తవిశాల నేత్రమ్,**
**దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా ధృతిం న విందామి శమం చ విష్ణో.**

అనగా - తమరిని ఆకాశమంతయు వ్యాప్తి జెందియుండుట జూచి, అనగా స్వర్గలోకము వరకు వ్యాపించి యుండుట జూచి, అంతేగాక అతి ప్రకాశవంతమైన మరియు అనేకమైన రంగులతో కూడియున్న అనేకమైన భయంకరమైన ఆకృతులతో కూడియున్న మరియు అనేకమైన తెరచుకొనియున్న నోళ్ళతో కూడియున్న మీ ముఖమును జూచి, అటుపైన మండుచున్న అగ్ని కణముల వంటి మీ నేత్రములను జూచి, అత్యంత భయముతో కూడియున్న అంతఃకరణము గల నేను ఎటువంటి శాంతిని పొందజాలక వ్యాకులపాటును చెందుచున్నాను.

అట్లేలయని అన్నచో -

**11.25. దంష్ట్రాకరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని,**
**దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస.**

అనగా - పెద్ద పెద్ద కోరలు గలిగియున్న భయంకరమైన ఆకృతులు కలిగియున్న కాలాగ్ని అనగా కాలమను అగ్నితో సమానమైన అనగా ప్రళయకాలము నందు లోకము లన్నింటిని భస్మీపటలము గావించునటువంటి కాలాగ్నివలె వున్న తమ అనగా మీ యొక్క ముఖమును చూచి నేను దిగ్భ్రమ కలిగిన వాడనై యున్నాను. ఆ కారణము చేతనే నేను మిమ్ములను చూచుచూ వున్నప్పటికీ నాకు ఎటువంటి సుఖముగాని, శాంతిగాని కలుగుట

లేదు. అందుచేత ఓ దేవేశ్వరా ! ఓ జగన్నివాసా ! మీరు ఆ భయంకర రూపమును త్యజించి ప్రసన్నవదనులు కండి.

ఏ శూరవీరలను జూచి యింతకు పూర్వము నాకు పరాజయము కలుగునేమో అను శంక కలదో అది యిప్పుడు పూర్తిగా తొలగిపోయినది.

ఏలయన -

**11.26. అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వే సహైవావని పాలసంఘైః,**
**భీష్మోద్రోణః సూతపుత్రస్తథా ఽసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః.**

అనగా - దుర్యోధనుడు మొదలగు ధృతరాష్ట్ర పుత్రులందరూ మరియు యితర దేశపు రాజులు మరియు వారి సైన్యముతో సహా గుంపులు గుంపులుగా జేరి అతి వేగముగా మీ భయంకరమైన నోటియందు జొరబడిపోవుచున్నారు. ఇంతేకాదు భీష్ముడు, ద్రోణుడు, సూతపుత్రుడైన కర్ణుడు మరియు మన వైపు నుండి గూడ దుష్టద్యుమ్నుడు మొదలగు యోధులు గూడ మీ భయంకరమైన నోటియందు జొరబడిపోవుచున్నారు.

మరియు -

**11.27. వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రా కరాలాని భయానకాని,**
**కేచిద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః.**

అనగా - వారందరూ ఏ విధమైన నోటియందు జొరబడుచున్నారు ? పెద్ద పెద్ద కోరలు కలిగిన వికారము మరియు భయంకర రూపము గలిగిన నోటియందు చొరబడుచున్నారు.

మరియు ఆ ముఖములయందు ప్రవేశించుచున్న పురుషులలో ఎంతోమంది ముక్కలు ముక్కలుగా అయిన తలలతో ఆ కోరల మధ్య నమలబడిన మాంసము వలె అతికినట్లుగా తోచుచున్నారు.

వారందరూ ఏ విధముగా ఆ భయంకరమైన నోళ్ళయందు ప్రవేశించుచున్నారు ? అనగా చెప్పుచున్నాడు -

**11.28. యథా నదీనాం బహవో ఽంబువేగాః సముద్రమేవాభిముఖా ద్రవంతి,**
**తథా తవామీ నరలోకవీరా విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి.**

అనగా - ఏ విధముగా సముద్రముఖముగా పరుగిడుచున్న నదులు చివరకు సముద్రము నందే విలీనమైపోవునో ఆ విధముగానే ఈ లోకమునందలి శూరులు, వీరులు అయిన భీష్మాది శత్రువులు ప్రకాశవంతమై మండుచున్న అగ్నిగోళము వలెనున్న మీ యొక్క ముఖము అనగా నోటియందు ప్రవేశించుచున్నారు.

వారందరూ ఆ విధముగా ఎందులకు మరియు ఏ విధముగా మీ నోటియందు ప్రవేశించుచున్నారనగా -

**11.29. యథా ప్రదీప్తం జ్వలనం పతంగా విశంతి నాశాయ సమృద్ధవేగాః,**
**తథైవ నాశాయ విశంతి లోకాస్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః.**

అనగా - పతంగములు దీపపు కాంతిచే ఆకర్షింపబడి దానిచుట్టూ తిరుగుతూ చివరకు దానియొక్క అనగా దీపపు కాంతితో కూడిన వేడికి కాలి నశించుచున్నట్లుగా ఈ లోకమునందలి ప్రాణులన్నియూ అతి వేగముతో పరుగులిడుతూ వచ్చి మీ నోటియందు ప్రవేశించి నశించుచున్నవి. ఈ శ్లోకమునందు తీవ్రమైన వేగమునే "సమృద్ధవేగాః" అని చెప్పబడినది.

అప్పుడు మీరు అనగా భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు -

**11.30. లేలిహ్యసే, గ్రసమానః సమంతాల్లోకాన్సమగ్రాన్వద నైర్జ్వలద్భిః,**
**తేజోభిరాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో.**

అనగా - అప్పుడు మీరు దేదీప్యమానమై వెలుగుచున్న మీ నోళ్ళ ద్వారా సర్వ ప్రాణులను మ్రింగుచూ నాకుచున్నారు. అనగా వాటినన్నింటిని అతి ప్రేమతో తినుచూ ఆనందించుచున్నారు. అంతేగాక హే విష్ణో ! సర్వవ్యాపకత్వము కలిగియున్న ఓ పరమాత్మా! తమ యొక్క అత్యంత భయంకరమైన కాంతులు సమస్తమైన జగత్తును మీ తేజస్సుతో వ్యాపించి తపింప జేయుచున్నవి. అట్లేలయన మీరు చాలా వుగ్రస్వభావము గలవారైయున్నారు.

**11.31. ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో న మో ఽస్తు తే దేవవర ప్రసీద,**
**విజ్ఞాతుమిచ్ఛామి భవంతమాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్.**

అనగా - ఇంత భయంకర స్వరూపులైన మీరు నిజముగా ఎవ్వరో నాకు తెలియునట్లుగా చెప్పండి. సమస్త దేవతలకు అధిపతులైన కృష్ణా ! మీకు నేను నమస్కరించు చున్నాను. మీరు నాయందు దయ చూపించగలరు. సృష్ట్యాది మొదలుగా వుండి యున్న మీరు పరమేశ్వరులైయున్న మీ రూపమును అనగా మిమ్ములను గురించి నేను సవివరముగా తెలుసుకొనగోరుచున్నాను. అట్లేలయన ? నేను మీ ప్రవృత్తిని మరియు మీ మాయలను అనగా శక్తియుక్తులను గురించి ఏమీ తెలియకయున్నాను.

అప్పుడు భగవంతుడు యిట్లనెను -

**11.32. కాలో ఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో లోకాన్సమాహర్తు మిహ ప్రవృత్తః,**
**ఋతే ఽపి త్వా న భవిష్యంతి సర్వేయే ఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః.**

అనగా - నేను లోకములను నాశము గావించుటకు భయంకర రూపము ధరించిన కాలమును అనగా మృత్యురూపుడను. నేను యిలాంటి భయంకర రూపముగా ఎందులకు తోచుచున్నానో చెప్పెద వినుము. ప్రస్తుతము అనగా యిప్పుడు ఈ సమయమునందు లోకములను నశింపజేయుటకు వుద్యుక్తుడనై యున్నాను. ఆ కారణము చేత నీవు యుద్ధము

చేయకపోయిననూ అనగా నీవు లేకుండగనే యీ భీష్ముడు, ద్రోణుడు మరియు కర్ణుడు మొదలగు శూరులు వీరులు అయిన యోధులందరూ నా కారణముగ తప్పక నశించెదరు.

అలా ఎందుకనగా -

**11.33. తస్మాత్త్వముత్తిష్ఠ యశోలభస్వ జిత్వాశత్రూన్భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్,**
**మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్.**

అనగా - అందుచేత అర్జునా నీవు లెమ్ము మరియు దేవతల చేత గూడ జయింపబడ నటువంటి భీమ్ముడు, ద్రోణుడు మొదలగు మహారధుల నందరిని అర్జునుడు జయించెను అను గొప్ప కీర్తిని పొందుము. ఇటువంటి కీర్తి అనేక జన్మలయందు చేసిన పుణ్యకర్మల ఫలముగా మాత్రమే లభించును. దుర్యోధనాది యోధులను జయించి సమృద్ధము మరియు నిష్కంటకమైన రాజ్య సుఖమును అనుభవింపుము.

ఈ శూరవీరులందరూ నా చేత నిస్సందేహముగా యింతకు పూర్వమే చంపబడి యున్నారు. అనగా ప్రాణములు లేనివారిగా చేయబడియున్నారు. ఓ సవ్యసాచి ! నీవు కేవలము నిమిత్తమాత్రము కమ్ము. ఎడమ చేతితో గూడ బాణములను సంధించగల నైపుణ్యము గల కారణముగా అర్జునుడు "సవ్యసాచి" అని అనబడుచున్నాడు.

**11.34. ద్రోణం చ బీష్మం చ జయద్రథం చ కర్ణం తథా ఽన్యానపి యోధవీరాన్,**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్.**

అనగా - ద్రోణాది ఏ యే శూరవీరులను జూచి అర్జునునకు తనకు వారితో పోరు సల్పినచో పరాజయము కలుగునేమోయను భయము (ఆ శంక) కలదో వారందరి పేర్లను చెప్పి భగవంతుడు "అర్జునా నీవు నాచేత చంపబడిన వారిని మాత్రమే చంపుము" అని నిరాశ చెందియున్న అర్జునుని ప్రోత్సహించుచున్నాడు.

అర్జునునకు శత్రుసంహారమునందు, యుద్ధమునకు సన్నద్ధులై నిలిచియున్న వారిలో ద్రోణుడు మరియు భీష్మాది వీరులను చూచి తన గెలుపునందు శంకించుట సహజమే. ఏలయన? ద్రోణుడు ధనుర్విద్య యందు గురువు. దివ్యాస్త్రములతో కూడియున్నవాడు మరియు విశేషముగా తనకుధనుర్విద్యయందు గురువు. మరియు భీష్ముడు అందరికంటే పెద్దవాడు మరియు స్వేచ్ఛామృతత్వము అనగా తాను కోరినప్పుడు మాత్రమే మృతత్వమును పొందువాడు. అంతేగాక దివ్యాస్త్రములు కలిగియున్నవాడు. అందుచతేనే పరశురామునితో ద్వంద్వయుద్ధము చేసినప్పటికి పరాజితుడు కాలేదు.

అటువంటివాడే జయద్రధుడు గూడాను. అట్లేలయన ? ఆతని తండ్రి "ఎవడు నా పుత్రుని శిరము నేలపై బడునట్లు చంపునో ఆతని శిరము గూడ దానంతట అదే తెగి నేలపై బడును" అను సంకల్పముతో తపస్సు చేయుచున్నాడు.

కర్ణుడు కూడ గొప్ప వీరుడే. ఏలయన ? ఆతడు యింద్రుని ద్వారా పొందిన అమోఘమైన 'శక్తి' యను అస్త్రము కలిగియున్నాడు. అంతేగాక ఒక కన్యకు సూర్యుని వలన కలిగిన పుత్రుడు. అందుచేత భగవంతుడు ఆతని పేరు గూడ చెప్పియున్నాడు.

ఇచ్చట రచయితయొక్క అభిప్రాయమేమన ? –

ద్రోణుడు, భీష్ముడు, జయద్రధుడు, మరియు కర్ణుడు యింకా అనేకమంది కౌరవయోధులు – వీరందరూ గూడ నాచేత చంపబడియున్నారు. అందుచేత వీరందరిని నీవు ప్రత్యేకముగా చంపనవసరము లేదు. వారిని చంపుటయందు నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము. నీవు వారిని చూచి భయపడకుము. యుద్ధము చేయుము. నీవు ఈ జరుగబోవు యుద్ధమునందు దుర్యోధనాది శత్రువులను జూచి భయపడకుము. వారిని నీవు తప్పక జయింతువు.

అప్పుడు సంజయుడిట్లనెను –

**11.35. ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలిర్వేపమానః కిరీటీ,**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య.**

అనగా – కేశవుని ద్వారా పైన చెప్పబడిన మాటలు విని అర్జునుడు వణకుచున్న చేతులను జోడించి కేశవునికి నమస్కరించి గద్గదమైన గొంతుతో కృష్ణునితో యిట్లనెను – అత్యంత సహించరాని దుఃఖము కలిగినప్పుడు భయమును జెందిన పురుషునకు మరియు అత్యంత సంతోషము కలిగిన – పొందిన పురుషుని నేత్రములు కన్నీటితో నిండిపోవును. కంఠము కఫముతో నిండి మాటలు రావు. అటువంటి స్థితియందు వాక్కునందు అస్పష్టత మరియు శబ్దములు తడబడుట జరుగును. అట్టి స్థితినే గద్గదమగుట అని అందురు. అట్టి గద్గద స్థితిని పొందిన అర్జునుడు యిట్లనెను – ఇచ్చట 'గద్గద' శబ్దము 'మాట్లాడుట' అను క్రియకు విశేషణము. అందుచేత అత్యంత భయమును జెందినవాడై నమస్కరించి కృష్ణునితో అర్జునుడు అతి వినయముగా యిట్లనెను.

ఇచ్చట సంజయుని మాటలయందు ఒక విధమైన గూఢాభిప్రాయము కూడియున్నది. అదెట్లన ? "ద్రోణుడు మొదలగు నలుగురు అజేయులైన శూరవీరులు అర్జునుని ద్వారా చంపబడినచో ఆశ్రయహీనుడైన దుర్యోధనుడు చచ్చినవాని క్రిందే లెక్కవేయబడును." ఈ గూఢార్ధమును గ్రహించిన రాజైన ధృతరాష్ట్రుడు పాండవులతో సంధి కుదుర్చవచ్చును. అప్పుడు యిరుపక్షములవారు సుఖముగా వుందురు. కాని కాలప్రభావమునకు కట్టుబడి యున్న ధృతరాష్ట్రుడు సంజయుని సంకేతమును గ్రహించలేదు.

అప్పుడు అర్జునుడిట్లనెను –

**11.36. స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ,**
**రక్షాంసి భీతాని దిశో ద్రవంతి సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః.**

అనగా – ఓ హృషీకేశా ! మీరు చెప్పినది సత్యమే. అదేమన ? మిమ్ములను కీర్తించి నందువలన, మీ మహిమలను వర్ణించిచెప్పుకొనుట వలన ఈ జగత్తునందలి మానవులందరికి ఎంతో ఆనందము కలుగుచున్నది.

అట్లుగాక ఈ శ్లోకమునకు మరియొక అర్థము గూడ చెప్పుకొనవచ్చును. అదెట్లన? - "స్థానే" అను శబ్దము విషయమునకు విశేషణముగా గూడ అన్వయించబడును. భగవంతుడు హర్షము అనగా సంతోషము లేక ఆనందమునకు విషయమై యున్నాడు. ఇలా అన్వయించినందువలన కలుగు అనర్థమేమియు కలుగనేరదు. ఏలయన ? ఈశ్వరుడు అందరియొక్క ఆత్మ మరియు సర్వభూతములకు ఆధారమై యున్నాడు గదా !

ఇచ్చట ఈ క్రింది విధముగా వ్యాఖ్యానించుట సరియైనది. జగత్తునందలి ప్రాణులన్నియు తమ తమ ఆత్మరూపములో భగవంతునియందు అనురాగము అనగా ప్రేమభావము కలిగియున్నవి. అనగా ప్రాణులన్నియూ సరియైన విషయమునందే ప్రేమ భావమును కలిగియున్నవి. తద్విరుద్ధముగా రాక్షసగణములన్నియు ఆ భగవత్స్వరూపమును గాంచి నలుదిశలకు పరుగిడుచున్నవి. ఇది గూడ సరియైన మాటయే. అట్లే సమస్తమైన కపిలాది సిద్ధ సముదాయమంతయు ఆయన స్వరూపమునకు నమస్కరించుచున్నవి. ఇట్లు చెప్పుట గూడ ఉచితమేయగుచున్నది.

భగవంతుడు హర్షము మొదలగు భావములకు యోగ్యమైన స్థానముగా అనగా విషయముగా ఎట్లు వుండియున్నాడు ? అందులకు కారణము చూపుచున్నారు -

**11.37. కస్మాచ్చ తే న నమేరన్మహాత్మన్ గరీయసే బ్రహ్మణో ఽప్యాదికర్త్రే,
అనంత దేవేశ జగన్నివాస త్వమక్షరం సదసత్తత్పరం యత్.**

అనగా - ఓ మహాత్మా ! మీరు అత్యంత శ్రేష్ఠమైనవారు. అనగా అందరికంటె గొప్పవారు. వారందరూ మీకు ఎందులకు నమస్కరించుచున్నారు ? అన్నచో మీరు హిరణ్యగర్భునకు గూడ ఆది కారణమై యున్నారు. అందుచేత మీరు ఆది కర్తలకు ఎట్లు నమస్కరించగలరు ? కావున పై కారణముచేత తమరు హర్షాదులకు మరియు నమస్కరింపబడుటకు తగియున్నారు అనగా యోగ్యమైన పాత్రత కలిగియున్నారు.

ఓ అనంతుడా ! ఓ దేవేశ ! ఓ జగన్నివాస ! ఆ **పరమ అక్షరము అనగా బ్రహ్మ పదార్థము మీరే అయి వున్నారు. వేదాంతములు గూడ ఈ సత్యమునే తెలుపుచున్నవి.**

ఆ వేదాంతములు తెలుపు సత్యమేమన ? - సత్ మరియు అసత్, అనగా ఏది నిత్యమై, సత్యమై, నిర్వికారమై యున్నదో అది సత్తు. మరియు దేనియందు అది లేదో అనగా ఏది నిత్యమైనది కాదో, సత్యమైనది కాదో, నిర్వికారమైనది కాదో అది అసత్తు. ఆ సత్ మరియు అసత్తులు రెండూ ఏ అక్షరమునకు ఉపాధులో, మరియు వేటి కారణముగ ఆ బ్రహ్మతత్వము చెప్పుకొనబడుటకు వీలుగా సత్ అని మరియు అసత్ అని చెప్పబడుచున్నదో కాని నిజముగా విచారించి చూచిన ఏది యీ సత్, అసత్తులకు గూడ అంటరానిదైయున్నదో అనగా వేఱుగానే యున్నదో, దేనిని బ్రహ్మవేత్తలు అనగా బ్రహ్మతత్వమును గుర్తించిన మహనీయులు 'అక్షర' మని చెప్పుచున్నారో ఆ బ్రహ్మవు మీరే అయి వున్నారు. సారాంశమేమన ? తమరు తప్ప ఈ ప్రపంచమునందు రెండవ పదార్థమేదియును లేదు.

అర్జునుడు యింకా స్తుతించుచున్నాడు -

**11.38. త్వమాదిదేవః పురుషః పురాణస్త్వమస్య విశ్వస్య పరం నిధానం,**
**వేత్తా ౽సి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనంతరూప.**

అనగా - తమరు ఈ జగత్తుకు ఆధారభూతులు గావున ఆది దైవములై యున్నారు. మరియు శరీరమను పురమునందుండు కారణముగ సనాతన పురుషులై యున్నారు. మరియు ప్రళయ కాలమునందు ఈ జగత్తంతయు తమయందే లీనమైయుండును గావున ఈ సర్వజగత్తునకు అన్నివిధముల ఆశ్రయులై యున్నారు.

ఈ ప్రపంచములో మానవుడు తెలుసుకొనదగియున్న వస్తువులలో తమరే ముఖ్యులు. సర్వమును తెలుసుకొనువారు గూడ మీరే అయి వున్నారు. తమరే పరమధామము - పరమ వైష్ణవ పదము అయి వున్నారు - ఓ **అనంతరూపా ! సమస్త విశ్వము తమతోనే నిండియున్నది.** అనగా వ్యాపించియున్నది. తమకు లెక్కించజాలనన్ని రూపములు కలిగియున్నవి.

మరియు -

**11.39. వాయుర్యమో ౽గ్నిర్వరుణః శ్శశాంకః ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ,**
**నమో నమస్తే ౽స్తు సహస్రకృత్వః పునశ్చ భూయో ౽పి నమో నమస్తే.**

అనగా - తమరే వాయువు, తమరే యములు, అగ్ని, జలమునకు దేవతయైన వరుణుడు. చంద్రుడు మరియు కశ్యపాది ప్రజాపతులు గూడ తమరే అయి వున్నారు. తమరే బ్రహ్మదేవునికి గూడ తండ్రులై యున్నారు. సర్వము తమరే అయి వున్నందున తమకు శతకోటి నమస్కారములు. ఇట్లు ఎన్నిసార్లుగా నమస్కరించినను అర్జునునకు తృప్తి కలుగుట లేదు.

మరియు -

**11.40. నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమో ౽స్తు తే సర్వత ఏవ సర్వ,**
**అనంత వీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతో ౽సి సర్వః.**

అనగా - తమకు ఎదురుగాను అనగా తూర్పు దిక్కునుండి నమస్కారము. మరియు వెనుకగా అనగా పడమర దిక్కునుండి గూడ నమస్కారములు. ఓ సర్వరూపా ! తమకు అన్నివైపుల నుండి నమస్కారములు. **తమరు సర్వవ్యాపకులు గావున సర్వ దిక్కులనుండి నమస్కారములు.** తమరు అంతులేనంత శక్తివంతులు. పరాక్రమవంతులు.

వీర్యమునే అనగా వీరత్వమునే సామర్థ్యమందురు. పరాక్రమమును విక్రమమందురు. కొంతమంది వ్యక్తులు సామర్థ్యము కలిగినవారై యుండియు శస్త్రాదులను ప్రయోగించుటయందు తమ పరాక్రమమును ఉపయోగించజాలరు. అనగా పరాక్రమము కలిగియుండియు దానిని సద్వినియోగపరచజాలరు. కాని తమరు మాత్రము అనంతమైన వీర్యము - అనగా వీరత్వము

గలవారు మరియు అమితమైన పరాక్రమము కలిగియున్నారు. అందుచేత తమరు అనంతమైన వీర్యము గలవారు మరియు అనంతమైన పరాక్రమవంతులు.

తమరు తమయొక్క ఒక అంశతోనే సమస్తమైన జగత్తునందు వ్యాపించియున్నారు. అనగా **జగద్రూపమున** వ్యాపించియున్నారు. అందుచే తమరు సర్వరూపులై యున్నారు. అనగా **తమరు తప్ప ఈ ప్రపంచమునందు మరియొక వస్తువు లేదు.**

అట్లేలయన ? నేను తమయొక్క మహిమను తెలియజాలకయున్నందున అపరాధము చేసినవాడనైయున్నాను. అందువలన......

## 11.41. సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ హే యాదవ హే సఖేతి, అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదాత్ప్రణయేన వాపి.

అనగా – ఓ పరమేశ్వరా ! నేను తమయొక్క ఈశ్వర రూపమును అనగా విశ్వరూపమును మూర్ఖుడనై గుర్తించక విపరీత బుద్ధికలిగి తమను మిత్రునిగాను – నాతో సమానుడుగాను తలంచి అవమాన పూర్వకమైన భావముతో ఓ కృష్ణా ! ఓ యాదవా ! ఓ మిత్రమా ! అను మొదలగు శబ్దములతో సంబోధించియున్నాను.

అంతేగాక ప్రమాదము వలన అనగా నిలకడలేని బుద్ధి గలవాడనగుట వలన మరియు ప్రణయము అనగా మన యిద్దరి మధ్య ఏర్పడియున్న స్నేహభావము చేత గూడ తమపట్ల అనుచితముగా ప్రవర్తించి యున్నాను.

## 11.42. యచ్చావహాసార్థమసత్కృతో ఽసి విహారశయ్యాసన భోజనేషు, ఏకో ఽథవాప్యచ్యుత తత్సమక్షం తత్క్షామయే త్వామహమప్రమేయమ్.

అనగా – హాస్యాదుల వలన గూడ తమరు నాచేత అనేకసార్లు అవమానించబడి యున్నారు. ఎచ్చట ? అన్నచో – విహార స్థలములయందు శయ్యా, ఆసన, భోజనాది సందర్భములయందు – ఎటువంటి ప్రయోజనము లేక అటూ యిటూ తిరుగుచుండుటను విహారమందురు. స్థిరముగా వుండుట, విశిష్టమైన భంగిమలో కూర్చుండుటను ఆసనమందురు. శయ్య అనగా నిద్రించుటకు లేక పరుండుటకు ఉపయోగపడు సాధనము. భుజించుటను భోజనమందురు. ఇటువంటి క్రియలన్నియు చేయుచుండునప్పుడు నావెంట ఒంటరిగా వున్నప్పుడు, మీ వెనుక దిశయందు వున్నప్పుడు, లేక మీ ఎదుట వున్నప్పుడు తెలిసి తెలియక లేక స్నేహభావ కారణముగ తమను నేను తిరస్కార భావముతోను లేక మరో విధముగాను అవమానించుట జరిగియుండి యుండవచ్చును. అందువలన ఓ అచ్యుతా ! ఆ నాయపరాధ సమూహములనన్నింటిని నేను యిప్పుడు పరమేశ్వరరూపులైన తమరిని క్షమించమని వేడుకొనుచున్నాను.

*అట్లేలయన ? తమరు –*

**11.43.** **పితా ऽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్,**
**న త్వత్సమో ऽస్త్యభ్యధికః కుతో ऽన్యో లోకత్రయే ऽప్య ప్రతిమ ప్రభావ.**

అనగా – ఓ పరమేశ్వరా ! తమరు స్థావర జంగమమైన జగత్తునకు అనగా ఈ ప్రపంచమందలి ప్రాణులన్నింటికి జన్మదాతలైయున్నారు. కేవలము జన్మదాతలేగాదు పూజ్యులు గూడాను. అట్లేలయన తమరు పెద్దలలోని పెద్దలకు గూడ గురువులై యున్నారు. తమరు ఏ విధముగా అందరికంటె శ్రేష్ఠులై యున్నారు ? అన్నచో – ఓ అసమాన్య ప్రతిమా ప్రభావము గల మహానుభావా ! ముల్లోకములయందును తమతో సమానులైన రెండవ వారెవ్వరూ లేరు. అట్లేలయన ? అనేకమంది ఈశ్వరులను ఒప్పుకొన్నచో వ్యవహారము కుదరదు. అందుచేత ఈశ్వరులు యిరువురుండజాలరు. ఏలయన ? తమతో సమానులైనవారు ముల్లోకములందును యితరులెవ్వరూ లేరు. అట్టి స్థితియందు తమకంటే గొప్పవారు మరొకరుండుట సాధ్యపడదు గదా?

దేనితోనైననూ రెండవది సమానముగా వున్నదని చెప్పుట 'ప్రతిమ' అనబడును. తమ ప్రభావమునకు ప్రతిమ అనగా సమానమైనది లేదు. అందుచేత తమరు అప్రతిమ ప్రతిభావంతులు.

*స్థితి యిట్లుండగా –*

**11.44.** **తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్,**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్.**

అనగా – అందుచేత నేను నా దేహమును చక్కగా క్రిందికి వంచి అనగా నా దేహమును తమరి చరణములపై నుంచి నమస్కరించి స్తుతించుటకు యోగ్యులైన మరియు శాసనకర్తలైన తమకు అనగా ఈశ్వరునకు ప్రణమిల్లుచున్నాను. అనగా తమ అనుగ్రహమునకు నన్ను పాత్రుని గావించుకొనుచున్నాను. ఎట్లు తండ్రి పుత్రుని సమస్తమైన అపరాధములను క్షమించివేయునో అట్లే మిత్రుని అపరాధములను మంచి మిత్రుడు అట్లే ప్రియురాలి అపరాధములను ప్రియుడు క్షమించివేయునో అట్లే ఓ దేవా ! తమరు గూడ నా యొక్క సర్వ విధములైన అపరాధములను క్షమించవలయును. అట్లు చేయుటయే తమ ధర్మము.

**11.45.** **అదృష్టపూర్వం హృషితో ऽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే,**
**తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస.**

అనగా – తమయొక్క ఏ విశ్వరూపమును నేనుగాని లేక యితరులెవ్వరు గాని యింతకు పూర్వము చూచియుండలేదో అటువంటి అపూర్వమైన రూపమును జూచి నేను చాలా హర్షించుచున్నాను. మరియు తమయొక్క ఆ భయంకర రూపమును జూచి నేను భయముతో భీతిల్లుచున్నాను.

అందువలన ఓ మహాదేవ ! తమరు నాకు మిత్రుడుగా తోచినప్పుడు ఏ రూపము కలదో ఆ రూపమునే చూపించండి. ఓ దేవేశ ! ఓ జగన్నివాస ! తమరు ఆ భయంకర రూపమును ఉపసంహరించి ప్రసన్నులు కండి. జగత్తునందంతటను నివసించువాడు జగన్నివాసుడు అనబడును.

## 11.46. కిరీటినం గదినం చక్రహస్తమిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ, తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహూ భవ విశ్వమూర్తే.

అనగా - నేను యిప్పుడు మిమ్ములను పూర్వమువలె శిరముపై నెమలిపింఛముతో కూడిన కిరీటము ధరించియున్నట్లుగా మరియు చేతియందు గద మరియు చక్రము ధరించి యున్నట్లుగా చూడగోరుచున్నాను.

ఇట్టి స్థితియందు ఓ సహస్ర బాహువులు గలవాడా ! ఓ విశ్వమూర్తీ ! అనగా యిప్పు దున్న విశ్వరూపముతో కూడియున్న సర్వేశ్వరా ! తమరు తిరిగి అనగా ఈ విశ్వరూపమును త్యజించి తమయొక్క అపూర్వ రూపమైన వసుదేవుని పుత్రరూపము అయిన చతుర్భుజ స్వరూపమును కలిగియుండండి. అనగా ఈ యిప్పుడున్న విశ్వరూపమును ఉపసంహరించుకొని తమరు వసుదేవుని పుత్రుడైన శ్రీకృష్ణుని స్వరూపముతో నిలిచియుండండి.

అర్జునుని భయపడుచున్నవాడుగ చూచి తన విశ్వరూపమును ఉపసంహరించుకొని ప్రియవచనములతో అర్జునునకు భయమును వీడి ధైర్యము కలుగునట్లుగా భగవంతుడు యిట్లనెను.

## 11.47. మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్, తేజోమయం విశ్వమనంతమాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్.

అనగా - ఓ అర్జునా ! పరమాత్ముడనైన నాకు నీయందు గల అనుగ్రహ బుద్ధిని ప్రసాదమందురు. అటువంటి అనుగ్రహ బుద్ధితో కూడి పరమాత్ముడనైన నేను నీకు ఐశ్వర్యముతో సామర్థ్యముతో ఈ పరమశ్రేష్ఠమైన, తేజోమయమైన, అనంతమయమైన అన్నింటికంటె ముందుగా వున్నటువంటి అనాదియైన నా విశ్వరూపమును చూపించుట జరిగినది. అనగా చూపించి యున్నాను. నా యీ విశ్వరూపమును యింతకు పూర్వము నీవు తప్ప మరి యితరులెవ్వరును చూచి యుండలేదు.

నా యీ విశ్వరూపమును చూచుటచేత నీకు నాయందు గల పూర్వ సందేహములన్నియు తొలగిపోయినవి. తన విశ్వరూపమును గురించి భగవంతుడు యింకా యిలా చెప్పుచున్నారు.

**11.48.** న వేదయజ్ఞాధ్యయనైర్న దానైర్నచ క్రియాభిర్న తపోభిరుగ్రైః,
ఏవంరూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర.

అనగా - నాలుగు వేదములను సాంగోపాంగముగా అధ్యయనము చేసినప్పటికి లేక మరియు యజ్ఞయాగాదులను గురించి సర్వాంగ పూర్ణముగా అధ్యయనము చేసినప్పటికి అట్టివారికి నా యీ విశ్వరూప దర్శనము జరుగనేరదు.

వేదముల అధ్యయనము చేతనే యజ్ఞయాగాదుల అధ్యయన లాభము సమకూరును. అయినప్పటికి గూడ యజ్ఞగ్రహణ జ్ఞానమును గురించి చెప్పబడినది. అట్లేలయన ? యజ్ఞములను గురించి విశేష అధ్యయనము నొక్కి చెప్పబడినది.

అట్లే మనుష్యుని బరువుతో సమానముగా తూచి బంగారాదులను దానము చేసినప్పటికి మరియు శ్రౌత శోత్రియ స్మార్త అగ్నిహోత్ర రూపమైన కర్మల నాచరించినను, చాంద్రాయణము మొదలగు ఉగ్రతపముల నాచరించినప్పటికి నేను అటువంటివారికి నా యొక్క విశ్వరూపమును దర్శించుటకు ప్రసాదించను. ఓ కురువంశపు వీరుడా ! నా ఏ విశ్వరూపము నీచేత దర్శింపజేయబడినదో ఆ రూపము ఈ ప్రపంచమునందలి ఏ మానవునకు దర్శింపజేయబడదు.

**11.49.** మా తే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృంగ్మ మేదమ్,
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూపమిదం ప్రపశ్య.

అనగా - నేను యింతకు పూర్వము చూపించినటువంటి భయంకర రూపమును జూచి నీవు భయపడగూడదు. మరియు చిత్తమునకు మూఢావస్థ కూడ కలుగనీయకూడదు. నీకు భయము కలిగించనటువంటి మరియు సంతోషమును కలిగించునటువంటి నీకు యిష్టమైనటువంటి శంఖ చక్రధారి మరియు చతుర్భుజములు కలిగియున్న రూపమునే చూడుము.

అప్పుడు సంజయుడిట్లనెను -

**11.50.** ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా స్వకం రూపం దర్శయా మాస భూయః,
ఆశ్వాసయామాస చ భీతమేనం భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా.

అనగా - ఈ విధముగా వాసుదేవుడు యింతకు పూర్వము చెప్పిన మాటలు చెప్పి అర్జుననకు తన వాసుదేవుని గృహమునందు అవతరించిన రూపమును చూపించెను. ఇప్పుడు తన విశ్వరూపమైన భయంకర రూపమును త్యజించి సౌమ్యాకారమును బొంది భయపడివటు వంటి అర్జునకు మరల మరల ధైర్యమును కలుగజేసెను.

అప్పుడు అర్జునుడిట్లనెను -

**11.51. దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన,**
**ఇదానీమస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః.**

అనగా - ఓ జనార్దన ! ఇప్పుడు నేను నిన్ను నా మిత్రుడైన నవ్వు ముఖము కలిగియున్న సౌముద్యుగా వున్న మానవాకృతిని చూచి భయమును వీడి సంతోషముగా యున్నాను. అంతేగాక నా వాస్తవిక స్థితిని పొందియున్నాను.

అప్పుడు భగవంతుడిట్లనెను -

**11.52. సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః.**

అనగా - ఇంతకు పూర్వము నీవు చూచిన నా రూపము దుర్దర్శము అనగా సామాన్యులు చూడరానిది. ఎంతో శ్రమించినవారికి గూడ ఆనారూపము చూడయోగ్యము కాదు. దేవతలు గూడ నా యా రూపమును సదా చూడగోరుచుందురు. అలా వారు కోరుకొనుచున్నప్పటికి నీవు చూచిన ఆ రూపమును నీవలె వారెన్నడును యింతవరకు చూడలేదు. ఇంకముందు గూడ చూడజాలరు.

అట్లేలయన్నచో -

**11.53. నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా,**
**శక్య ఎవంవిధో ద్రష్టుం ద్రష్టవానసి మాం యథా.**

అనగా - ఇంతకు పూర్వము నీవు నన్ను ఏ రూపములో చూచియున్నావో ఆ రూపమును ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము లేక అధర్వణవేదము మొదలగు నాలుగు వేదముల ద్వారా గాని, చాంద్రాయణము మొదలగు తపస్సుల ద్వారా గాని, గోవులు, భూమి మరియు సువర్ణాది దానములు చేసిగాని, మహా యజ్ఞయాగాదులు గావించిగాని ఎవ్వరునూ చూడజాలరు.

మరి అలా అయితే దేవతలు మొదలగువారు తమయొక్క ఆ విశ్వరూపమును అనగా తమయొక్క నిజరూపమును ఎట్లు దర్శించగలరు ? అన్నచో భగవంతుడు యీ విధముగా చెప్పుచున్నారు -

**11.54. భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధో ఽర్జున,**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప.**

అనగా - భక్తిద్వారా వారు నన్ను ఆ విశ్వరూపములో దర్శించగలరు. అయితే ఎటువంటి భక్తిద్వారా వారు నా నిజరూపమును చూడగలరు ? అన్నచో - చెప్పుచున్నారు -

ఓ అర్జునా ! అనన్య భక్తిద్వారా వారు నా నిజరూపమును దర్శించగలరు. అనగా **భగవంతునియందు తప్ప ఏ యితర వస్తువునందును ఎవని మనసు లగ్నము కాదో అదియే అనన్య భక్తి.**

భక్తరామదాసుగారు గూడ యీ మాట చెప్పియున్నారు -

చక్కెరమాని వేము దినజాలిన కైవడిమానవాధముల్
పెక్కురు బక్క దైవముల వేమరుగొల్చెద రట్లగాదయా
మ్రొక్కిన నీకె మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవెయీవలెన్
తక్కిన మాటలేమిటికి .................................

మరియు ఎటువంటి భక్తిద్వారా ఎటువంటి **భక్తుడైన** పురుషునకైననూ తన సమస్తమైన యింద్రియముల ద్వారా ఒక్క వాసుదేవరూపుడైన పరమాత్మ తప్ప ఎటువంటి యితరము **తోచదో అట్టిది అనన్యభక్తి.**

ఈ అనువాదకుడు గూడా అనన్యభక్తిని గురించి యిలా అన్నాడు -

**"భక్తుడైనవాడు బలిమివిశ్వము వీడు
దిక్కులేక తుదకు దీనుడగును
హరిని జేరగోరు 'హా' యని చింతిల్లు**
గుణ్యారామరాయ గురువిధేయ (చూ. రామరాయ శతకము)

అటువంటి అనన్య భక్తిద్వారా యిటువంటి రూపము కలిగిన అనగా విశ్వరూపుడనైన నేను, **పరమేశ్వరుడను, శాస్త్రగ్రంథముల అధ్యయన మననము ద్వారా తెలియబడుదును.** కేవలము **శాస్త్ర**గ్రంథముల ద్వారానే తెలియబడుచునన్నచో అట్లుకాదు. ఓ పరంతప ! **తత్వజ్ఞానము ద్వారా గూడా తెలియబడుదును.** అనగా సాక్షాత్కరింపబడుదును. మరియు పొందబడుదును గూడ. అనగా **అటువంటివారికి నేను మోక్షముమ** అనగా **జన్మ - మరణ రాహిత్యమును కలుగజేయుదుమ.** అనగా **అట్టి త్వజ్ఞానులు స్థూలదేహముమ త్యజించి వా రూపముమ పొందుదురు.**

ఇప్పుడు సమస్తమైన గీతాశాస్త్రము యొక్క సారభూతమైన అర్థము సంక్షేపముగా లోకకల్యాణార్థము చెప్పబడుచున్నది.

**11.55. మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః,**
**నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాండవ.**

అనగా - ఏ మానవుడు పరమేశ్వరుడనైన నా కొఱకే కర్మలు చేయునో, మరియు నన్నే ఆరాధించునో అనగా నన్ను పొందుటయే తన జీవిత లక్ష్యముగా తలంచునో - ఏ విధముగా సేవకుడు తన యజమాని కొఱకు కర్మలు చేయునో, తనకొఱకు చేయడో, కాని ఆ సేవకుడు స్థూలదేహ త్యాగానంతరము ఆ యజమానిని తనకు పరమగతిగా తలంచడో, అట్లుగాక

ఎవడు నా కొఱకే కర్మలు చేయుచుండునో మరియు నన్నే తనకు పరమగతిగా అనగా నన్ను పొందుటయే పరమావధిగా ఎంచుకొనునో అటువంటివాడు నా పరాయణుడు.

మరియు అటువంటివాడు నా భక్తుడు. అనగా ఎవడు అన్నివిధములా, సర్వేంద్రియముల ద్వారానూ అత్యంత ఉత్సాహముతో నన్నే భజించుచుండునో అట్టివాడు నా భక్తుడు.

**మరియు ఎవడు ధనముపట్లగాని, పుత్రులు, మిత్రులు భార్యా మరియు బంధుజనులయందు గూడ ఎటువంటి బంధుత్వము అనగా ప్రేమ లేకయుండునో ఆతడు నా భక్తుడు.**

"తనయందు, నఖిలభూతములయందు నొకభంగి సమహితత్వంబున జరుగువాడు" అనగా సర్వప్రాణులయందును ఎటువంటి వైరభావము లేక యుండునో అనగా తనకు ఎంత అపకారము చేయు ప్రాణిని గూడా తనకు శత్రువుగా తలంచడో అట్టివాడు నా భక్తుడు.

అట్టి యే నా భక్తుడు వున్నాడో ఓ అర్జునా ! ఆతడు నన్ను తప్పక పొందును. అనగా ఏలయన ? నేనే ఆతనికి పరమగతిని అనగా నన్ను పొందుటయే ఆతని ఏకమాత్ర లక్ష్యము. నన్ను పొందుట తప్ప ఆతనికి వేఱుగతిలేదు.

నీకు సరియైన జ్ఞానమును కలిగించుటకొఱకు నాకు యిష్టమైన ఈ మంచిమాట చెప్పియున్నాను.

శ్రీ శ్రీ శ్రీ వేదావ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి
విశ్వరూప సందర్శన యోగమనబడు పదునొకండవ అధ్యాయమునకు
శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకును
తెనుగు అనువాదము సమాప్తము.
అనువాదకులు : శ్రీ సదానందభారతి.
ప్రణవాశ్రమము.

# పన్నెండవ అధ్యాయము

"రెండవ అధ్యాయము మొదలు పదవ అధ్యాయము వరకు **సమస్తమైన విశేషములు లేనటువంటి అక్షరబ్రహ్మ పరమాత్మయొక్క ఉపాసనా విధానము** వర్ణించబడినది.

మరియు ఆ అధ్యాయములయందే అచ్చటచ్చట సర్వాంగపూర్ణమైన యోగ ఐశ్వర్యము మరియు **సంపూర్ణమైన జ్ఞానశక్తితో కూడియున్న సత్వగుణమే ఉపాధిగా కలిగియున్న అపరతత్త్వము యొక్క పరమేశ్వరత్వము** మరియు ఉపాసనా పద్ధతి గూడ వర్ణించబడినది.

మరియు పదకొండవ అధ్యాయమునందు ఆయన అనగా భగవత్స్వరూపుడే అయిన శ్రీకృష్ణుడు తనను ఉపాసించుటకొఱకు తనను సంపూర్ణ సర్వ ఐశ్వర్యములతో కూడియున్నవానిగను, సర్వమునకు ఆదికారణుడగును మరియు **సమస్త దృశ్యమానమై యున్న జగత్తుకు ఆత్మరూపముగానూ** తన విశ్వరూపమును గూడ దర్శింపజేసియున్నారు. మరియు ఆ విశ్వరూపమును ప్రదర్శించి ఆయనగారు అర్జునునకు "నాకొఱకే కర్మలు చేయువాడవు కమ్ము" మొదలగు ఉపదేశ వాక్యములు గూడ చెప్పియున్నారు.

అందుచేత భగవంతునిచే యిలా చెప్పబడిన రెండు విధానములలో అనగా రెండు పక్షములలో ఏ పక్షము అనగా ఏ విధానము శ్రేష్టతరమైనదో తెలుసుకొనగోరి నేను తమను అడుగుచున్నాను" అని అర్జునుడు తన అభిప్రాయమును భగవంతునికి విన్నవించుకొన్నాడు –

**12.1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే,**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః.**

అనగా – **"ఏవమ్"** అను శబ్దము ద్వారా దానికి ముందున్న **"మత్కర్మకృత్"** అను పదము కలదు. ఆ పదమునందు చెప్పబడిన శ్లోకమునకు అర్థము అనగా పదకొండవ అధ్యాయము యొక్క చివరి శ్లోకమునందు చెప్పబడిన అర్థమును చెప్పుచూ అర్జునుడు యిట్లనుచున్నాడు –

ఈ విధముగా అజ్ఞానులు ఎడతెగని స్థితివలన పైన చెప్పబడిన సాధనములలో అనగా భగవంతుని కొఱకు కర్మలు చేయుట మొదలగు వాటియందు లగ్నమైయున్న అనన్య భావముతో భగవంతునియందు శరణుజొచ్చి యింతకు పూర్వము మీరు దర్శింపజేసిన విశ్వరూపము కలిగియున్న పరమేశ్వరుడవైయున్న మిమ్ములను ఉపాసించెదరు. మీ యా రూపమునే ధ్యానించుచుందురు.

మరియు రెండవవారు అనగా సమస్తమైన మానసిక ప్రాపంచిక వాసనలను త్యజించినవారు అనగా సర్వవిధ కర్మలను సంన్యసించిన వారు అనగా జ్ఞానులు పైన చెప్పబడిన విశేషణములతో కూడియున్న పరమ అక్షరము. సమస్తమైన ఉపాధులు లేనటువంటి

కారణముచేత అవ్యక్తముగా అనగా రూపనామములు లేనటువంటి మరియు ఆ విధముగా యింద్రియాది సాధనముల ద్వారా పొందజాలనటువంటి బ్రహ్మతత్త్వమును ఉపాసించుచుందురు.

ఈ ప్రపంచమునందు యింద్రియాది సాధన సామగ్రి ద్వారా తెలియబడు పదార్థము అంతయు వ్యక్తమైనది అని చెప్పబడుచున్నది. అట్లేలయన ? "అంజ" అను ధాతువు యొక్క అర్థము యింద్రియ గోచరమగుటయే. అయితే ఈ అక్షరమైన పదార్థము అందులకు విరుద్ధముగా కరణములకు అనగా యింద్రియములకు గోచరంచని పదార్థమై యున్నది. అంతేగాక మహాపురుషుల ద్వారా చెప్పబడిన విశేషణములు కలిగియున్నది. జ్ఞానులైనవారు అటువంటి బ్రహ్మతత్త్వమును ఉపాసించుదురు.

**ఈ విధముగా రెండు విధములుగా ఉపాసించు యోగులలో ఎవరు శ్రేష్ఠులు ? అనగా అతి తక్కువ కాలములో ఎవరు యోగవేత్తలు అనగా మోక్షమునకు అర్హత పొందువారగుదురు ?** అని అర్జునుడు వివరమడుగగా భగవంతుడు యిట్లనెను -

ఎవరు ఎటువంటి కామభావము అనగా ప్రాపంచిక వస్తువులను కోరు స్వభావము లేనివారు అనగా సంపూర్ణమైన జ్ఞానమును పొందియున్నవారు అనగా అక్షర బ్రహ్మమును ఉపాసించువారిని ప్రస్తుతము అలా వుంచు. వారిని గురించి చెప్పవలసినది తరువాత చెప్పెదను. **అట్లు జ్ఞానులు కానివారిని గురించి ఇప్పుడు చెప్పుచున్నాను -**

**12.2. మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే,**
**శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః.**

అనగా - ఏ భక్తుడు **విశ్వరూప** పరమేశ్వరుడనైయున్న నాయందు తన మనస్సును సమాధిస్థము చేసి అనగా లగ్నము గావించి సర్వవిధ యోగులయందును శ్రేష్ఠుడయినటువంటి మరియు రాగాది పంచక్లేశములు రూపముగా కలిగియున్న అజ్ఞానదృష్టి లేనివాడనైన మరియు సర్వజ్ఞుడనై యున్న పరమేశ్వరుడనైయున్న నన్ను పదకొండవ అధ్యాయమునందలి చివరి శ్లోకమునందు చెప్పబడినట్లుగా నిరంతరమూ నా యందే తమ మనస్సులను లగ్నము గావించి సర్వోత్తమమైన శ్రద్ధాభావముతో ఉపాసించుచుందురో అటువంటివారు శ్రేష్ఠతమమైన యోగులని నా అభిప్రాయము.

అట్లేలయన ? అట్టివారు నిరంతరము నాయందే తమ మనస్సులను లగ్నము గావించి రాత్రింబగళ్ళ కాలమంతటిని గడుపుచుందురు. అందుచేత వారిని శ్రేష్ఠమైన యోగులని చెప్పుట సమంజసముగా వున్నది.

అయితే ఆ రెండవవారు శ్రేష్ఠులైన యోగులు కానట్లే గదా ? అని అందురేమో అట్లనుట సరికాదు. అయితే వారిని గురించి చెప్పవలసినది చెప్పుచున్నాను. వినండి -

**12.3. యే త్వక్షరమనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే,**
**సర్వత్రగమచింత్యం చ కూటస్థ మచలం ధ్రువమ్.**

అనగా - కాని ఏ పురుషులు ఆ యక్షర బ్రహ్మను. అనగా ఏ అక్షర బ్రహ్మము అవ్యక్తము అయివున్న కారణముచేత శబ్దములకు విషయము కానందున అనగా శబ్దముల ద్వారా చెప్పుటకు అలవిగాని పదార్థము అయివున్నందున ఏ విధముగానూ చెప్పబడుటలేదో అందువలన అది అనిర్దేశ్యము అనగా యిట్టిది అని చూపరానిదైయున్నది. మరియు ఎటువంటి ప్రమాణము ద్వారాను ప్రత్యక్షము గావించబడదు. అందుచేత అది అవ్యక్తమనబడుచున్నది. అటువంటి బ్రహ్మతత్త్వమును ఉపాసింతురో -

ఉపాస్య వస్తువును శాస్త్రగ్రంథముల యందు చెప్పబడిన విధముగా అనగా పద్ధతిననుసరించి తన బుద్ధికి విషయముగా జేసుకొని ఆ తత్త్వము వద్దకు జేరి తైలధారవలె సమానమైన వృత్తుల ప్రవాహముతో చాలాకాలము వరకు ఆ స్థితియందు నిలిచియుందురో అట్టి నిలిచి యుండు స్థితిని "ఉపాసన" అని అందురు.

ఇప్పుడు ఆ **అక్షరము యొక్క లక్షణములు** చెప్పుచున్నారు - అది అనగా ఆ **అక్షరబ్రహ్మము ఆకాశమువలె సర్వవ్యాపకమై యున్నది.** మరియు **అవ్యక్తమైయున్నందున అచింత్యమైయున్నది. అనగా విచారించుటకు సాధ్యముకానిదై యున్నది.** అట్లేలయన ? ఏ వస్తువు యింద్రియాది సాధనముల ద్వారా తెలుసుకొనుటకు సాధ్యపడునో దానిని గురించి బుద్ధిద్వారా విచారణ చేయుట సాధ్యపడును. కాని అక్షరతత్త్వము అందులకు వ్యతిరేకముగా వుండి యున్నందున అచింత్యము అనగా విచారింప సాధ్యపడనిది మరియు కూటస్థము అయి వున్నది.

ఏ వస్తువు పైకి గుణములతో కూడియున్నట్లుగా తోచుచుండునో కాని లోపలిగా దోషములతో నిండియుండునో దానిని అనగా అట్టి వస్తువు "కూటము" అనబడును. ప్రపంచమునందు గూడ "కూటరూపము" "కూటసాక్ష్యము" మొదలగు ప్రయోగములందు 'కూట' శబ్దము ప్రసిద్ధమై యున్నది. ఆ విధముగానే ఏ అక్షరము అవిద్య మొదలగు అనేకమైన ప్రాపంచిక బీజభూతమైన అంతర్దోషములతో కూడి ప్రకృతి "మాయాఅవ్యాకృత్" మొదలగు శబ్దముల ద్వారా చెప్పబడుచున్నదో మరియు ప్రకృతిని గూడ మాయ యనియు, మరియు మహేశ్వరుని మాయాపతిగా గుర్తించవలయును. "నా మాయదుస్తరము అనగా తరించరానిది అనగా తెలియరానిది" మొదలగు శ్రుతి మరియు స్మృతి వచనములందు మాయ అను పేరుతో అది ప్రసిద్ధమైయున్నది. అట్టి తెలియరాని దానినే కూటమందురు. ఆ కూటము అనగా మాయయందు ఏది దానికి అధిష్ఠాన రూపముతో నిండియున్నదో దానినే 'కూటస్థము" అని అందురు.

అట్లుగాక ఒక పెద్ద రాశి అనగా గుట్టవలె (తాను ఎటువంటి క్రియలు చేయకనే) నిలిచివుండునో దానిని కూటస్థము అని అందురు. ఈ విధముగా కూటస్థమై యున్నందున

ఏది ఎటువంటి చలనము లేక స్థిరముగా వున్నదో మరియు ఆ విధముగా అచలమైనదై యున్నందున అది ధ్రువము అనగా నిత్యమైనదై యున్నది. అట్టి అక్షర బ్రహ్మమును ఏ పురుషులు వుపాసింతురో –

**12.4. సంనియమ్యేంద్రియ గ్రామం సర్వత్ర సమబుద్ధయః,**
**తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః.**

అనగా – మరియు ఏ పురుషులు తన యింద్రియ సముదాయమును చక్కగా సంయమించి అనగా తన అధీనమునందుంచుకొని అనగా యింద్రియములను విషయముల మీదికి పోనివ్వక నిలిపివుంచి సర్వకాల సర్వావస్థలయందును తన బుద్ధియందు ఎటువంటి వికారము కలుగనివ్వక సమబుద్ధి కలిగియుందురో అనగా తనకు యిష్టమైనది లభించినను లభించకపోయినను, అనిష్టమైనది లభించిననూ సంతోష దుఃఖములను పొందక వుందురో అటువంటి సమబుద్ధి గలవారు సర్వభూతముల యందును సమభావము కలిగియుందురో అటువంటి **అపరోక్షోపాసకులు నన్నే పొందుదురు.**

ఆ యక్షర ఉపాసకులను గురించి "వారు నన్నే పొందుదురు" అను విషయమునందు చెప్పవలసిన పనియే లేదు. అనగా వారు నన్ను అతి సులభముగా పొందుదురు. అట్లేలయన? **"జ్ఞానమును నేను నా యొక్క ఆత్మగానే తలంచుచున్నాను."** ఈ మాట యింతకు పూర్వమే చెప్పియున్నాను. భగవత్స్వరూపులను గురించి యిది మంచిది లేక యిది చెడ్డది అని చెప్పుటకు అవకాశమే లేదు.

**12.5. క్లేశో ఽధికతర స్తేషామవ్యక్తాస క్తచేతసామ్,**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే.**

అనగా – జ్ఞానమార్గమున పయనించు సాధకులకు కష్టం ఎక్కువగా వుంటుంది. కేవలం నా కొఱకు అనగా భగవంతుని కొఱకు కర్మలు చేయు సాధకులకు గూడ కష్టం ఎక్కువగానే వుంటుంది. కాని ఎవరి చిత్తము అవ్యక్తమునందు తగిలియున్నదో అనగా అనురక్తియై యున్నదో ఆ అక్షరచింతనాపరులైన **పారమార్థికులకు దేహాభిమానమును పరిత్యజించ వలసియుంటుంది.** అందువలన వారికి కర్మమార్గమున పయనించువారికంటె ఎక్కువ శ్రమ చేయవలసియుంటుంది.

అట్లేలయన ? అక్షరాత్మకమైన అవ్యక్తము యొక్క గతి అనగా జీవనసరళి దేహాభిమానము కలిగియున్న సాధకులకు మరీ కష్టతరమైయుంటుంది. ఎంతో కష్టించిన తరువాతగాని అలవడదు. అందువలన అట్టి సాధకులు ఎక్కువగా కష్టించవలసి వుంటుంది. ఆ యక్షరోపాసకుల ఆచార వ్యవహారములన్నియు ఎట్లుండునో ముందు రాబోవు "అద్వేషా" మొదలగు శ్లోకములందు వివరముగా చెప్పబడును.

**12.6. యే తు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః,**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే.**

అనగా - కాని ఏ సాధకులు తాము ఆచరించు సమస్త కర్మలను ఈశ్వరుడనైన నాకు అర్పించి, నా పరాయణులై అనగా నన్నే ఆరాధించువారై అనగా నన్నే తమకు పరమగతిగా ఎంచుకొని, కేవలము అనన్య యోగము ద్వారా అనగా విశ్వరూపుడైన ఆత్మదైవమును వదలి, మరి యితరమైన ఏ దేవతలను ఆశ్రయించక అనన్యమైన సమాధి యోగము ద్వారానే నన్నే ధ్యానించుచూ నన్నే ఉపాసించుచుందురో -

అటువంటివారికి ఏమి జరుగునో చెప్పుచున్నారు -

**12.7. తేషామహం సముద్ధర్తా మృత్యు సంసారసాగరాత్,**
**భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్.**

అనగా - ఓ పార్థా ! విశ్వరూపుడనై పరమేశ్వరుడనై యున్న నా యందే ఎవరు ధ్యానమగ్నులైయుందురో, అనగా ఎవరి చిత్తము నాయందే లగ్నమై యున్నదో, కేవలము పరమేశ్వరుడనైయున్న నాయందే ఉపాసనా నిమగ్నులై యుందురో అటువంటి నా భక్తులను నేను తప్పక ఉద్ధరించెదను.

ఏ విధముగా ఉద్ధరించెదనన్నచో - చెప్పెద వినుము -

మృత్యువుతోకూడియున్న ప్రపంచమునుండి వారిని తప్పించెదను. ఈ ప్రపంచమును తరించుట అతి కష్టమైయున్నందున మృత్యువుతో కూడియున్న ప్రపంచము మృత్యు సముద్రమువంటిదని చెప్పబడినది. అటువంటి మృత్యు సాగరమునుండి నా భక్తులను ఎటువంటి ఆలస్యము లేకుండ వెంటనే ఉద్ధరించగలను.

మరి అట్టి స్థితిలో -

**12.8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ,**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః.**

అనగా -

అర్జునా ! నీవు విశ్వరూపుడను మరియు ఈశ్వరుడను అయి వున్న నాయందే నీ యొక్క సంకల్ప వికల్పములతో నిండియున్న మనస్సును స్థిరముగా లగ్నము చేయుము. మరియు నాయందే నీ నిర్ణయశక్తి కలిగియున్న బుద్ధిని గూడ స్థిరపరచుము. అట్లు చేసినందువలన నీకు ఎటువంటి లాభము కలుగునన్నచో - వినుము.

అట్లు నీ యొక్క మనోబుద్ధులను నా యందు స్థిరపరచిన తరువాత నీవు నీ శరీర పతానానంతరము ఏకాత్మ భావముతో నాయందే లీనమైయుందువు. అట్లు జరుగుట యందు ఎటువంటి సందేహము లేదు.

**12.9. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్,**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ.**

అనగా – అర్జునా ! నీవు నేను పైన చెప్పినట్లుగా చేయజాలవేని అనగా నీవు నాయందు చిత్తమును నిలిపి స్థిరముగా వుంచజాలవేని నీవు అభ్యాసయోగము ద్వారా నీ చిత్తమును అన్నివైపుల నుండి అనగా సర్వవిధ విషయముల నుండి వెనుకకు మరల్చి ఏదో ఒకదానిని ఆధారముగ జేసుకొని దానియందు చిత్తమును నిలిపివుంచుట అభ్యాసమందురు. దానిమీద చిత్తమును నిలిపి వుంచుటను సమాధాన రూపమైన యోగమందురు. అటువంటి అభ్యాసయోగము ద్వారా పరమేశ్వరుడను విశ్వరూపుడను అయిన నాయందు చిత్తమును నిలిపి నన్ను పొందుటకు ప్రయత్నించుము.

**12.10. అభ్యాసే ఽప్యసమర్థో ఽసి మత్కర్మపరమో భవ,**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి.**

అనగా – నీవు నేను చెప్పినట్లుగా అభ్యాసయోగము చేయుటయందు గూడ సమర్థుడవు కాదేని, **నా కొఱకు కర్మలు చేయుటయే నీ జీవిత ప్రధాన లక్ష్యముగా వుండవలయును.** అభ్యాసము లేకుండా గూడ నా కొఱకు కర్మలు చేయుచూ గూడ నీవు నీ అంతఃకరణమును శుద్ధమొనర్చుకొని జ్ఞానయోగ ప్రక్రియ ద్వారా పరమసిద్ధిని అనగా జన్మరాహిత్య రూపమైన మోక్షమును పొందగలవు.

**12.11. అథైతదప్యశక్తో ఽసి కర్తుం మద్యోగమాశ్రితః,**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్.**

అనగా – ఒకవేళ నీవు యిది గూడ చేయజాలవేని అనగా నేను యింతకు పూర్వము చెప్పినట్లుగా నా కొఱకు కర్మలు చేయుటయందు గూడ సామర్థ్యము కలవాడవు కావేని మద్యోగమును ఆశ్రయించి అనగా నీచేత చేయబడు సమస్తమైన కర్మలను మరియు అకర్మ ఫలములను నాయందు సమర్పించి ఆ కర్మలను చేయుచుండుటయే "మద్యోగ" మనబడును. ఆ విధముగా మద్యోగమును ఆశ్రయించి మరియు సంయతాత్మా అనగా ఆత్మతత్వమును యింద్రియములతో సంయోగము జరుగుకుండ వుంచుట. అలా సంయతాత్ముడవై అనగా మనస్సును నీ అధీనమునందుంచుకొన్నవాడవై నీచే చేయబడు సమస్తమైన కర్మలయొక్క ఫలములను త్యజించుము.

ఇప్పుడు సర్వకర్మల ఫలత్యాగమును స్తుతించుచున్నారు –

**12.12. శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే,**
**ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాంతిరనంతరమ్.**

అనగా – నిస్సందేహముగా జ్ఞానము శ్రేష్ఠతరమైనది. దేనికంటే శ్రేష్ఠతరమైనది ? అవివేక పూర్వకముగా చేయబడిన అభ్యాసముచే. అట్టి జ్ఞానముకంటె గూడ జ్ఞానముతో కూడిన

ధ్యానము శ్రేష్ఠమైనది. మరియు ఈ విధముగా జ్ఞానముతో కూడియున్న **ధ్యానము కంటె గూడ కర్మఫలత్యాగము అధికశ్రేష్ఠమైనది.**

ఇంతకు పూర్వము చెప్పినటువంటి విశేషణములతో కూడియున్న పురుషునకు **ఈ కర్మఫల త్యాగము వలన వెంటనే శాంతి లభిస్తుంది.** అనగా - **సర్వకారణ సహితముగా సమస్త ప్రాపంచిక భావనివృత్తి ఆ క్షణమునందే కలుగును.** అంతేగాని కాలాంతరము అనగా కొంతకాలము తరువాత లభించును, లేక నివృత్తిని పొందును అనుటకు అవకాశమే లేదు.

కర్మలు చేయుటయందు మునిగి తేలుచున్న అజ్ఞానులకు యింతకు పూర్వము చెప్పిన ఉపాయములను అనుష్ఠించుటకు అనగా ఆచరించుటకు అసమర్థులు అయినందువలననే సర్వకర్మల యొక్క ఫలత్యాగరూపమైన కల్యాణ సాధనోపదేశము చేయబడినది. అంతేగాని అన్నింటికంటె ముందుగానే అలా చెయ్యమని చెప్పబడలేదు. అందుచేత **"శ్రేయో హిజ్ఞానమభ్యాసాత్"** మొదలగు వాక్యముల ఉత్తరోత్తర శ్రేష్ఠత్వమును చెప్పి సర్వకర్మల ఫలత్యాగమును స్తుతించుచున్నారు. అట్లేలయన ? ఉత్తమ సాధనములను అనుష్ఠించుటయందు అసమర్థత కలిగియున్నప్పుడు ఈ సాధనము అనుష్ఠించదగినదిగా చెప్పబడినది.

పూర్వపక్షము - ఎటువంటి సమానత్వమును సాధించుట కొఱకు ఈ స్తుతి చేయబడినది ?

సమాధానము - ఎప్పుడు పురుషుని (మానవుని) మనస్సునందు గల సమస్తమైన కామములు అనగా కోర్కెలు నశించిపోవునో (**యదాసర్వే ప్రముచ్యంతే** చూ.కఠో.నిష. 6-14) అను శ్రు**తి ననుసరించి సమస్తమైన కోర్కెలు నశించినందువలన అమృతత్వము లభించునని చెప్పబడినది.** ఇది సర్వ ప్రసిద్ధమైన విషయమే. సమస్తమైన శ్రౌత, స్మార్త కర్మలయొక్క ఫలములను 'కామ' మందురు. వాటిని త్యజించినందువలన జ్ఞాననిష్ఠుడైన విద్వాంసునికి వెంటనే శాంతి లభిస్తుంది.

అజ్ఞానివలన చేయబడు కర్మఫల త్యాగమునందు గూడ సమస్తమైన కోర్కెల త్యాగము దాగియే యున్నది. అందువలన ఈ సర్వకర్మ ఫలత్యాగము మరియు సర్వ కోర్కెల త్యాగము యిద్దరియందు గూడ సమానముగా వుండియున్నందున వాటియందు రుచిని కలిగించుటకై ఈ సర్వకర్మ ఫలత్యాగమును స్తుతించవలసినది.

ఎప్పుడో అగస్త్యుడు అను బ్రాహ్మణునిచే సముద్రమంతయు త్రాగబడినది. ఆ కారణముగ ఈనాడు గూడ బ్రాహ్మణులనందరిని బ్రాహ్మణత్వపు సమానత్వము వలన స్తుతించుచున్నాము.

ఈ విధముగా కర్మఫల త్యాగమువలన కర్మయోగము యొక్క కల్యాణమయ సాధనత్వము స్తుతించబడినది.

ఇచ్చట **ఆత్మ మరియు ఈశ్వరునియందు** గల **భేదమును అంగీకరించి** విశ్వరూపుడైన **ఈశ్వరునియందు చిత్తమును లగ్నము గావించి** చేయు యోగము చెప్పబడినది. మరియు ఈశ్వరుని కొఱకు కర్మలు చేయుట మొదలగు విషయములు ఉపదేశింపబడినవి.

కాని "అథై తదప్య శక్తోసి" అను వాక్యము ద్వారా (కర్మయోగము)ను అజ్ఞాన కార్యములుగా చెప్పుచూ భగవంతుడు ఉపదేశించునదేమనగా **అవ్యక్తము అక్షరము అయిన పరమాత్మ తత్త్వమును ఉపాసించు భేదము లేనటువంటి తత్త్వమును గాంచువారు కర్మయోగమును ఆచరింపజాలరు. అట్లే కర్మయోగులు గూడ అక్షర బ్రహ్మతత్త్వమును ఉపాసింపజాలరు.**

ఇంతేగాకుండా **"తే(ప్రాప్నువంతి మామేవ"** గీ. 12.4. అను వాక్యము ద్వారా అక్షర తత్వోపాసన చేయువారికి మోక్షప్రాప్తి యందు స్వాతంత్ర్యము వున్నదని చెప్పి **"తేషామహం సముద్ధర్తాం"** గీ. 12.7. అను పదము ద్వారా అక్షరతత్వోపాసన చేయునట్టివారలకు అనగా కర్మయోగులకు పరతంత్రత అనగా ఈశ్వరాధీనత చెప్పబడినది.

అట్లేలయన ? ఆ కర్మయోగులు గూడ ఈశ్వర స్వరూపులేయని చెప్పబడినట్లయితే అప్పుడు అభేదమును దర్శించువారైనందున వారు అక్షర స్వరూపులే అయి వుందురు. అప్పుడు "వారిని వుద్ధరింతును" అని భగవంతుడు చెప్పిన మాట వ్యర్థమగును గదా ?

భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునుని మేలుకోరువారియందు ముఖ్యుడు. అందుచేత **ఆయన అర్జునునకు సమ్యక్ జ్ఞానముతో సంబంధము లేనటువంటి భేదదృష్టితో కూడియున్న కేవల కర్మయోగమునే ఉపదేశించుచున్నారు (జ్ఞానకర్మల సముచ్ఛయమును కాదు)**

ఈశ్వరభావము, సేవకభావము పరస్పర విరుద్ధములైనవనుమాట యుక్తి సిద్ధమైనదే. **ఆ కారణముచేత ప్రమాణముల ద్వారా ఆత్మను సాక్షాత్తుగా ఈశ్వర రూపమేయని ఎఱింగిన తరువాత ఎవ్వడు గూడ మరియొకనికి సేవకునిగా వుండుటకు అంగీకరించజాలడు.**

అందుచేత ఎవ్వడు సమస్తమైన కోర్కెలను త్యజించియున్నాడో అటువంటి అపరోక్షోపాసకుడు అయినటువంటి యధార్థమైన అనగా స్వచ్ఛమైన **జ్ఞాననిష్ఠులైన సంన్యాసులకు** సాక్షాత్తుగా మోక్షమునకు కారణరూపమైన **"యద్వేష్టా సర్వ భూతానాం"** మొదలగు ధర్మ సముదాయమును యిప్పుడు వర్ణించి చెప్పెదను. అట్టి ఉద్దేశ్యముతో భగవంతుడు యిట్లు చెప్పుచున్నారు -

**12.13. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,**
**నిర్మమో నిరహంకారః సమ దుఃఖ సుఖః క్షమీ.**

అనగా - ఏ సాధకుడు సర్వభూతములయందును ద్వేషభావము లేనివాడై వుండునో అనగా తనకు దుఃఖమును కలిగించునటువంటి ఏ ప్రాణిని కూడ ద్వేషించకయుండునో మరియు సమస్త భూతములను అనగా ప్రాణులను ఆత్మరూపముననే చూచునో -

మరియు తనతో మిత్రభావము కలిగియున్న అనగా అన్ని విధములైన ప్రాణులతోనూ మిత్రభావమునే కలిగియుండునో, మరియు కరుణామయుడు అనగా సర్వప్రాణులయందును దయాభావము కలిగియుండునో - దీనులయందును, దుఃఖముతో కూడియున్న ప్రాణులపై దయాభావము కలిగియుండుట "కరుణ" అనబడును - అటువంటి కరుణభావము కలిగి

య్యుండునో, ఇచ్చట ముఖ్యమైన అభిప్రాయమేమన - ఎవడు సర్వవిధ ప్రాణులకు (భూతములకు) **అభయమును కలిగించునో ఆతడు నిజమైన "సంన్యాసి" యనబడును.**

మరియు ఎవడు మమత్వము లేనివాడైయుండునో మరియు అహంకారము లేనివాడై యుండునో మరియు సుఖదుఃఖములయందు సమముగా యుండునో అనగా సుఖముగాని లేక దుఃఖముగాని ఎవని అంతఃకరణమునందు రాగద్వేషములు కలిగించజాలవో.

ఎవడు క్షమించు స్వభావము కలిగియున్నాడో అనగా మరియొకని ద్వారా తిట్టబడినప్పటికి అనగా నిందించబడినప్పటికి లేక కొట్టబడినప్పటికి ఎటువంటి వికారములు కలిగియుండడో -

## 12.14. సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
## మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తః స మే ప్రియః.

అనగా - మరియు ఏ మానవుడు సర్వకాల సర్వావస్థలయందును సంతుష్టుడై యుండునో అనగా **దేహస్థితికి కారణరూపమైన పదార్థములు లభించిననూ లభించకయున్ననూ "అంతయూ నా మేలునకే"** అను అలంభావము అనగా తృప్తి కలిగియుండునో. ఈ విధముగా గుణవంతమైన వస్తువు లభించిననూ మరియు లభించకపోయిననూ రెండు స్థితులయందును సంతుష్టుడై యుండునో మరియు ఎవడు సమాహితచిత్తుడై సర్వమును జయించిన చిత్తము కలవాడై మరియు దృఢమైన నిశ్చయము కలవాడై యుండునో అనగా ఆత్మతత్త్వమును గురించి దృఢమైన నిర్ణయము కలవాడై యుండునో.

మరియు ఎవడు తన మనోబుద్ధులను నాయందు అర్పించియున్నాడో అనగా ఏ సంన్యాసియొక్క సంకల్ప-వికల్పాత్మకమైన మనస్సు మరియు నిశ్చయాత్మకమైన బుద్ధి ఈ రెంటిని నా యందే సమర్పించియుండునో అటువంటి భక్తుడు నాకు అత్యంత ప్రియమైనవాడై యుండును.

**జ్ఞానులకు నేను అత్యంత ప్రియుడను. అట్లే ఆతడు నాకు ప్రియమైనవాడై యుండును.** సప్తమ అధ్యాయమునందు వివరించబడినట్లుగానే యిచ్చట గూడ అతి వివరముగా ఆ విషయమే చెప్పబడుచున్నది.

## 2.15. యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః,
## హర్షామర్ష భయోద్వేగైర్ముక్తో యః స చ మే ప్రియః.

అనగా - ఏ సంన్యాసి వలన ప్రపంచము ఎటువంటి ఆపదలకు గురికాదో. అనగా ఎటువంటి దుఃఖమును పొందదో. అట్లే ఏ సంన్యాసి గూడ ప్రాపంచిక విషయముల వలన ఎటువంటి దుఃఖమును పొందడో.

ఏ సంన్యాసి హర్షమునుగాని విషాదమునుగాని పొందక భయము, ఉద్వేగము అనగా దుఃఖముతో కూడియుండియు ఆవేశము లేనివాడుగా వుండునో, ప్రియమైన వస్తువు

ప్రాప్తించినప్పుడు అంతఃకరణమునందు కలుగు ఉత్సాహము, గగుర్పాటు మరియు కన్నీరు కార్చుట మొదలగు చిహ్నములు కలుగియుండు స్థితిని హర్షమందురు. అసహిష్ణుతను అనగా ఓర్వలేనితనమును "అమర్ష" మందురు. రక్షణలేని స్థితిని భయమందురు. మరియు ఆవేశము లేక తొందరపాటుతనమును ఉద్వేగమందురు. వీటన్నింటినుండి ముక్తుడైయున్నవాడు నాకు అత్యంత ప్రియమైనవాడు.

**12.16. అనపేక్షః శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః,**
**సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః.**

అనగా – ఏ-సాధకుడు శరీరము ఇంద్రియములు, విషయములు మరియు వాటితో గల సంబంధము మొదలగు మానసిక వికారములను కలిగించు విషయములందు ఎటువంటి కోరికలు లేనట్టివాడైయుండునో అట్టివాడు. "నిస్పృహుడు" అనగా స్పృహ లేనివాడు అనబడును. లోపల బయట శుద్ధి కలిగియున్నవాడు అనగా **అంతఃకరణమునందుగాని బయట అనగా యింద్రియములు కల్పించు విషయములందుగాని ఎటువంటి ఆసక్తి లేనివాడు శుద్ధుడనబడును** మరియు చతురుడు అనగా ఒక్కసారిగా అనేక విధములైన కర్మలు చేయవలసి వచ్చినప్పుడు అతివేగముగా తన కర్తవ్యమును నిర్ణయించుకొను సామర్థ్యము గలవాడు, చతురుడు అనబడును.

మరియు ఉదాసీనుడు అనగా మిత్రులయందు ఎటువంటి పక్షపాతము లేకుండ వ్యవహరించువాడు మంచి సంన్యాసియైనవాడు మరియు 'గతవ్యథ' అనగా ఎట్టి స్థితియందును భయము లేనివాడై యుండువాడు.

మరియు ఎవడు సర్వవిధ కార్యములను ఆరంభించక త్యాగబుద్ధి కలవాడైయుండునో, దీని ననుసరించి ఈ లోకమునందలి మరియు పరలోకమునందలి ఫలములను అనగా సుఖములను అనుభవించుట కొఱకు చేయబడు సమస్తమైన కామము కారణముగా కలిగియున్న కర్మలను "కర్మారంభము" అందురు. వాటినన్నింటిని త్యజించుటయే స్వభావముగా కలిగియున్న భక్తుడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడు –

మరియు –

**12.17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి,**
**శుభాశుభ పరిత్యాగీ, భక్తిమాన్యః స మే ప్రియః.**

అనగా – ఏ సాధకు యిష్ట వస్తువు ప్రాప్తించినప్పుడు గూడ హర్షమును పొందడో అనిష్టమైన వస్తువు ప్రాప్తించినప్పుడు ద్వేషభావమును పొందడో, ప్రియమైన వస్తువు అందకుండా పోయినప్పుడు, శోకించడో, అట్లే లేనినటువంటి వస్తువును పొందవలయునను కోరిక (ఆకాంక్ష) లేకయుండునో అటువంటి శుభాశుభ కర్మలను ఆయాసము లేక త్యజించువాడు అయినటువంటి భక్తుడైన పురుషుడు నాకు అత్యంత ప్రియమైనవాడైయున్నాడు.

అయి వున్నది. అటువంటి ఈ **"అద్వేష్టా సర్వభూతానామ్"** మొదలగు శ్లోకముల ద్వారా పైన చెప్పబడిన ఉపదేశానుసారము చక్కగా అనుష్ఠించి సేవించునో, ఆ నా పరాయణులు అనగా అక్షర స్వరూపుడను పరమాత్మనైన నేనే ఏకమాత్ర గతినో అటువంటి జ్ఞానపరాయణులు, ఉత్తమ భక్తిని ఆలంబనగా చేసుకొన్నవారు నా భక్తులు నాకు అత్యంత ప్రియులు.

**"ప్రియోహి జ్ఞానినో ఽత్యర్థమ్"** అను పదము ద్వారా ఏ విషయము సూత్ర రూపముగా చెప్పబడినదో యిచ్చట దానిని విశదముగా వ్యాఖ్యానించి **"భక్తాస్తే ఽతీవమే ప్రియాః"** అను ఈ పదము ద్వారా ఆ వ్యాఖ్యానము ఉపసంహరించబడినది.

ఇట్లు చెప్పుటయందు నా అభిప్రాయమేమనగా – ఈ చెప్పబడిన ధర్మముతో కూడియున్న అమృతరూపమైన ఉపదేశము ననుసరించి అనుష్ఠానము చేయు మానవుడు సాక్షాత్తు పరమేశ్వరుడును అగు విష్ణుభగవంతునికి అత్యంత ప్రియుడగును. అందువలన విష్ణువునకు ప్రియులైనవారు పరమధామమును చేరగోరువారు అనగా ముముక్షువులైనవారు ఈ ధర్మయుక్తమైన అమృతమును అత్యంత ప్రయత్నముతో అనుష్ఠించవలయును.

*శ్రీ శ్రీ శ్రీ వేదవ్యాస విరచిత శ్రీ మద్భగవద్గీత యందలి*
*భక్తియోగమనబడు పన్నెండవ అధ్యాయమునకు*
*శ్రీ శ్రీ శ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు*
*తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు : శ్రీ సదానందభారతి.*
*ప్రణవాశ్రమము.*

# పదమూడవ అధ్యాయము

ఏడవ - అధ్యాయమునందు ఈశ్వరునికి రెండు విధములైన ప్రకృతులు గలవని చెప్పబడినది. మొదటిది ఎనిమిది విధములుగా విభజించబడిన త్రిగుణాత్మికా ప్రకృతి. అది ప్రపంచమునకు కారణమై యుండుట చేత "అపరా" అని చెప్పబడినది. మరియు రెండవది పరాప్రకృతి. ఇది జీవభూతము. క్షేత్రజ్ఞరూపము మరియు ఈశ్వరాత్మికా అయివున్నది.

ఆ విధముగా రెండు విధములైన ప్రకృతితో కూడియున్న ఈశ్వరతత్వము జగత్తు యొక్క ఉత్పత్తి స్థితి మరియు ప్రళయమునకు కారణమగుచున్నది. ఆ క్షేత్రము క్షేత్రజ్ఞరూపమైన రెండు ప్రకృతుల యొక్క నిరూపణ ద్వారా ఆ ప్రకృతులు కలిగియున్న ఈశ్వరుని యొక్క తత్వమును నిర్ణయించుటకు ఈ క్షేత్రవిషయకమైన అధ్యాయము ప్రారంభించబడుచున్నది.

ఇంతకు పూర్వము పన్నెండవ అధ్యాయమునందు "యద్వేష్టాసర్వభూతానామ్" అను శ్లోకము మొదలు ఆ అధ్యాయము సమాప్తమయ్యే వరకు తత్వముమ ఎరింగిన సంన్యాసుల యొక్క నిష్ఠ అనగా వారు ఎలా వ్యవహరిస్తూ వుంటారో చెప్పబడినది. పైన చెప్పబడిన ధర్మమును ఆచరించుట వలన వారు తిరిగి ఏ విధమగు తత్వజ్ఞానముతో కూడి భగవంతుని చేత ప్రేమించబడతారో మొదలగు విషయముల ఆశయముమ తెలుపుట కొరకు గూడ ఈ పదమూడవ అధ్యాయము ఆరంభించబడుచున్నది.

సమస్తమైన కార్యములు, కరణములు అనగా ఆ కార్యములు చేయుటకు అవసరమగు సాధనములు మరియు విషయముల రూపమున పరిణమించియున్న త్రిగుణాత్మిక ప్రకృతి పురుషునికి భోగము మరియు అపవర్గమును సంపాదించుటకు సాధనరూపమైన దేహేంద్రి యములు మొదలగు ఆకారములతో రూపమును దాల్చి యున్నది. ఆ సంఘాతమే అనగా ఆ దేహేంద్రియముల సమూహమే ఈ శరీరము. దానిని వర్ణించుటకు భగవంతుడు యిట్లు చెప్పియున్నాడు -

**13.1. ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే,**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః.**

అనగా - 'ఇదమ్' అను సర్వనామముతో చెప్పబడిన వస్తువు 'శరీరమ్' అను విశేషణము ద్వారా స్పష్టము చేయబడుతూ వుంటుంది.

ఓ కుంతీపుత్రా ! శరీరము దెబ్బలు మొదలగు వాటినుండి రక్షించబడుతూ వుంటుంది. అందుచేత లేక యిది మెల్లమెల్లగా క్షీణిస్తూ వుంటుంది అందుచేత లేక క్షేత్రము వలె దీనియందు కర్మఫలములు లభించుచుండును అందుచేత ఈ శరీరము క్షేత్రము అని చెప్పబడుతూ వుంటుంది. ఇచ్చట 'ఇతి' శబ్దము 'ఏవం' శబ్దము యొక్క అర్థమునందు ప్రయోగించబడినది.

బంధ-మోక్షములు మరియు వాటికి కారణములను, ప్రతిపాదించు శాస్త్రములు వ్యర్థములగును మరియు ప్రత్యక్షాది ప్రమాణములతో కూడ విరోధము కలుగును.

ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా సుఖదుఃఖములు మరియు వాటికి కారణరూపమైన ఈ ప్రపంచమంతయు దృశ్యమానమగుచున్నది. అంతేకాకుండా ప్రపంచము యొక్క వైచిత్ర్యమును చూచి పుణ్యపాపములకు హేతువైనట్టి సంసారము గూడ వున్నట్లుగా అనుమాన ప్రమాణము ద్వారా సిద్ధమగుచున్నది. అట్లుగాక ఆత్మ మరియు ఈశ్వరుడు ఒక్కరేయని ఒప్పుకొన్నచో పైన చెప్పినవన్నీ అర్థహీనములగును.

సమాధానము - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? జ్ఞానమునకు అజ్ఞానమునకు భేదముండుట వలన మేము చెప్పునదంతయు సంభవమేయగును.

శ్రుతులయందు గూడ ఈ మాటే చెప్పబడియున్నది -

**"దూరమేతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యేతిజ్ఞాతా"** (చూ. కఠోపనిషత్తు 1.2.4)

అనగా ప్రసిద్ధములైన అవిద్య మరియు విద్యలు రెండూ గూడ అత్యంత **విపరీతము** మరియు పరస్పర విరుద్ధములుగా చెప్పబడుచున్నవి. మరియు ఆ చోటునే ఆ విద్య మరియు అవిద్యల యొక్క ఫలములు గూడ శ్రేయము మరియు ప్రేయము అని పరస్పర విరుద్ధములుగా చెప్పబడినవి. వీటిలో విద్య యొక్క ఫలము శ్రేయము మరియు అవిద్య యొక్క ఫలము ప్రేయము అనగా ఇష్టభోగముల ప్రాప్తి అని చెప్పబడియున్నది.

శ్రీశ్రీశ్రీ వ్యాసులవారి ననుసరించి యివి రెండూ రెండు మార్గములు. ఈ రెండు **మార్గ**ములు ఇచ్చట గీతాశాస్త్రమునందు గూడ రెండు నిష్ఠలుగా చెప్పబడి యున్నవి.

ఇంతేకాకుండా శ్రుతి, స్మృతి మరియు న్యాయముననుసరించి గూడ "విద్య ద్వారానే కార్యసహితమైన అవిద్యను నశింపజేయవలయునని సిద్ధమగుచున్నది.'

**"మెండైనిండు నవిద్య విద్య లవమై మృగ్యంబుగానుండు, బ్ర**
**హ్మాండబందటులయ్యు విద్యయే అవిద్యన్ గూల్చు నంచున్ మహో**
**ద్దండ ధ్వాంత వితానమున్ దొలచి సద్యస్స్వల్ప శంపాలతా**
**తండంబుల్ వివరింపగా దొడగె విద్యామాన దండంబులై."**

చూ. కంకణము - కావ్యము.

ఈ విషయమునందు శ్రుతులు చెప్పునదేమనగా - ఇచ్చట తెలుసుకొన్నట్లయితే చాలా మంచిది. ఒకవేళ ఈ రహస్యము యిచ్చట తెలుసుకొనకున్నచో చాలా పెద్ద హాని జరుగును. దానిని యీ విధముగా తెలియువాడు అమృతుడగును. **పరమపదమును పొందుటకు విద్య తప్ప అన్య మార్గము లేదు.** విద్యకలవాడు దేనికి భయపడడు. కాని అజ్ఞానమునకు సంబంధించి చెప్పబడినది వేరుగా వున్నది. అదెట్లన ? అవిద్యావంతుడు ఎల్లప్పుడు భయపడు చుండును. అవిద్యయందు పడియున్నవారలు భయపడుచుందురు. కాని **బ్రహ్మతత్వమును ఎరింగినవారలు తాము బ్రహ్మమే అయిపోతారు.** ఈ దేవతలు వేరు మరియు నేను వేరు అని తలంచువారు ఆత్మతత్వమును ఎరుంగరు. అదెట్లన మానవుల అధీనమునందు పశువులు

ఉన్నట్లే వీరు ఆ దేవతలకు పశువులుగా వుంటారు. కాని ఆత్మజ్ఞానము కలవారు అంతా తామే అయిపోతారు. ఆకాశమును చాపగాచుట్టగలిగితే అను మొదలగు శ్రుతులు అనేకములున్నవి.

**జ్ఞానము అజ్ఞానము చేత కప్పబడియున్నది.** అందుచేతనే జీవులు అనగా వుపాధులయందు వ్యాపించి ఆ వుపాధితో తాదాత్మ్యనముజెంది ఆ వుపాధియే నేనని తలంచుచు మోహితులు అగుచున్నారు. సమత్వమునందు స్థిరముగా వున్న చిత్తముగలవారే యీ ప్రపంచమును జయించినవారు. సర్వత్ర సమాన భావముతో చూచుచుండు" మొదలగు మాటలు స్మృతి గ్రంథములయందు చెప్పబడియున్నవి.

యుక్తిద్వారా గూడ యీ విషయము సిద్ధించుచున్నది -

సర్పము, దర్భముళ్ళు మరియు నీళ్ళతో నిండియున్న చెరువులు మొదలగు వాటివలన తనకు కలుగు దుఃఖమును ఎరింగి యున్నందు వల్ల మానవుడు వాటినుండి తప్పించుకొను చుండును. ఆ ప్రమాదమును ఎరుంగని అనేక మంది వాటికి చిక్కి దుఃఖమును అనుభవించు చుందురు. ఈ న్యాయమునకనుసరించి విద్యా ఫలమును గుర్తించుము.

ఈ విధముగా పైన చెప్పబడిన ప్రమాణముల ద్వారా తెలియబడు చున్నదేమనగా దేహాదులయందు ఆత్మబుద్ధి కలిగియుండు మానవులు అనగా అజ్ఞానులు రాగద్వేషాది దోషములచే ప్రేరితులై ధర్మాధర్మరూపములైన కర్మలు చేయుచూ జన్మ మరణములు పొందుచుందురు. కాని దేహాదుల కంటే వేరుగా వున్న ఆత్మను సాక్షాత్కరింపజేసుకొన్న పురుషుల రాగద్వేషములు నివృత్తిని జెందియుండును. అందుచేత వారికి ధర్మాధర్మ విషయకమైన ప్రవృత్తి పూర్తిగా నివృత్తిని చెందియున్నందున వారు జన్మ మరణ బంధము నుండి విముక్తిని పొందియుందురు. ఈ మాటను న్యాయానుసారముగా ఎవ్వరూ గూడ ఖండించజాలరు.

ఆ విధముగా యిప్పుడు సిద్ధించినదేమన ? ఎవడు నిజముగా అనగా తన స్వభావము చేతనే ఈశ్వరుడైయున్నాడో ఆ క్షేత్రజ్ఞునికి అవిద్య ద్వారా ఆరోపించబడిన వుపాధి భేదము చేత సంసారిత్వము ప్రాప్తించినట్లుగా వుండును. అదెట్లన ? జీవునకు దేహాదులయందు ఆత్మబుద్ధి కలిగిన రీతిగా. ఏలయన ? సమస్తమైన జీవులకు దేహాది అనాత్మ పదార్థములందు ఆత్మయను భావము కలుగుచుండుట సహజము. అటువంటి ఆత్మబుద్ధి (భ్రాంతి) నిస్సందేహముగా అవిద్యాజనితమే.

స్తంభమునందు చీకటి కారణముగా మనుష్యుడను బుద్ధి అనగా భ్రాంతి కలుగుచుండును కాని అంతమాత్రము చేతనే మనుష్యుల ధర్మములు స్తంభమునందును మరియు స్తంభము యొక్క ధర్మములు మనుష్యుని యందును కలుగ నేరవుగదా ? అట్లే చేతనతత్త్వము యొక్క ధర్మములు జడమైన దేహమునందును మరియు జడమైన దేహధర్మము చేతనము నందును కలుగనేరవు.

ముసలితనము మరియు మృత్యువువలె అవి అవిద్యాకార్యములగుట వల్లన సుఖదుఃఖములు మరియు అజ్ఞానాదులు గూడ వాటివలెనే ఆత్మధర్మములు కాజాలవు,

పూర్వపక్షము - మీరు చెప్పినది విషయమైనందున సరికాదు. అనగా స్తంభము మరియు పురుషుడు రెండూ జ్ఞేయములు అనగా తెలియబడుచున్నవైనందున వాటిలో అవిద్య కారణముగ తెలుసుకొనువాని ద్వారా ఒకదానియందు మరియొకటి అధ్యాస చేయబడినది అనగా ఒకదానియందు మరియొకటి ఆరోపించబడినది. కాని దేహము మరియు ఆత్మయందు జ్ఞేయము మరియు జ్ఞాతయందే యిట్టి ఆరోపణ జరుగుచున్నది. అందుచేత మీచే చెప్పబడిన ఈ దృష్టాంతము సమముగా లేదు. అందుచేత సిద్ధించుచున్న దేమన దేహము యొక్క జ్ఞేయరూపము అనగా తెలియబడుచున్న రూపము అనగా సుఖదుఃఖాది ధర్మములు గూడ జ్ఞాత అనగా ఆత్మయందు కలుగుచున్నవి.

సమాధానము - మీరు చెప్పినదానిననుసరించి చూచిన ఆత్మను గూడ జడముగా తలంచుట మొదలగు ప్రసంగము కలుగుచున్నది. అందుచేత అలా తలంచుట సరికాదు. అట్లేలయన ? జ్ఞేయరూపములైన శరీరాదులు క్షేత్రము యొక్క సుఖదుఃఖములు మోహము మరియు కోర్కెలు మొదలగు ధర్మములు జ్ఞాతయైన ఆత్మయందు గూడ వుండును. మరికొన్ని అనగా జరామరణాదులు మాత్రము కలుగవు. మరి యిట్టి భేదముండుటకు కారణమేమని చెప్పవలయును ?

మీరు చెప్పినదానిననుసరించి చూడగా ఒక అనుమానము కలుగుటకు అవకాశము కలుగుచున్నది. అదేమన ? - వార్ధక్యము మొదలగు వాటితో సమానముగా అవిద్య వలన ఆరోపించబడుట లేక త్యజించుట మరియు గ్రహించుట మొదలగునవి జరుగుచుండుట వలన ఆ సుఖదుఃఖాదులు ఆత్మధర్మములు కాకపోవచ్చును.

పూర్వపక్షము - పరస్పర విరుద్ధముగా వున్నందున ఈ దృష్టాంతము సరికాదని మా అభిప్రాయము. అనగా స్తంభము మరియు పురుషుడు రెండూ కూడ జ్ఞేయ వస్తువులు అనగా ప్రత్యక్ష ప్రమాణము ద్వారా అనగా జ్ఞానేంద్రియముల ద్వారా అనగా మన నేత్రముల ద్వారా చూడబడుచున్నవై యున్నవి. అందువలన అవిద్య కారణముగ తెలుసుకొనువాని ద్వారా ఒకదాని యందు మరియొకటి అధ్యసించబడినవి. కాని దేహము మరియు ఆత్మలయందు తెలియువాడు, తెలియబడునది ఈ రెంటియందు ఒక దానియందు మరియొకటి అధ్యసింప బడుచున్నవి. అందుచేత ఈ దృష్టాంతము సమముగా లేదు. అందువలన జ్ఞేయవస్తువులైన దేహధర్మములు అనగా సుఖదుఃఖాది ధర్మములు జ్ఞాత అనగా ఆత్మయందు చూడబడుచున్నవి.

సమాధానము - ఈ దృష్టాంతమునందు ఆత్మను జడపదార్థముగా తలంచుట అను పొరపాటు జరుగుచున్నది. అందుచేత అలా తలంచుట సరికాదు. ఏలయన ? జ్ఞేయరూపమైన దేహాదులు అనగా క్షేత్రము యొక్క సుఖములు, దుఃఖములు, మోహము మరియు కోరికలు మొదలగు ధర్మములు ఆత్మకు కూడ కలుగును అని అన్నచో అప్పుడు జ్ఞేయరూపమైన క్షేత్రము యొక్క అవిద్య ద్వారా ఆరోపించబడుచున్న కొన్ని ధర్మములు ఆత్మయందును మరికొన్ని ధర్మములు అనగా జరా-మరణాది ధర్మములు ఆత్మయందు కలుగుట లేదు అని చెప్పవలసి యుండును. అప్పుడు అట్టి విశేషమునకు కారణమెద్దియో చెప్పవలసి యుండును.

జరామరణములవలె అవిద్య కారణముగ ఆరోపించబడుచున్న మరియు త్యజించబడుచున్న మరియు గ్రహించబడుచున్నందున ఈ సుఖదుఃఖాదులు ఆత్మ ధర్మములు కావని చెప్పవచ్చును గదా ?

అలా అయినప్పుడు తెలియబడునదేమన కర్తృత్వ భోక్తృత్వ రూపమైన యీ ప్రపంచము జ్ఞేయ పదార్థముగానే ఎంచబడి అవిద్య కారణముగా జ్ఞాతయందు ఆరోపించబడుచున్నది. అందువలన అనగా అలా తలంచినందువలన జ్ఞాతకు కలుగు ప్రమాదమేమియు వుండదు. అదెట్లన ? మూర్ఖుల ద్వారా ఆరోపించబడిన మలినత్వాదుల వలన ఆకాశమునకు కలుగు ప్రమాదమేదియు లేదు గదా ?

అందువలన సర్వదేహాదులయందు వ్యాపించియున్నను భగవంతుడైన క్షేత్రజ్ఞుడైన ఈశ్వరుని యందు సంసారిత్వము యొక్క వాసన కూడ వుండునని శంకించకూడదు. అట్లేలయన? ప్రపంచమునందు ఎచ్చటనూ అవిద్య ద్వారా ఆరోపించబడుచున్న ధర్మమువలన ఎవనికి ఎటువంటి అపకారముగాని, ఉపకారముగాని జరుగుచున్నట్లుగా చూడబడుట లేదుగదా?

అందుచేత మీరు చెప్పినటువంటిది అనగా స్తంభమునందు మనుష్యుడను భ్రాంతి కలుగునను దృష్టాంతము సరికాదని చెప్పుట పొరపాటు మాత్రమేయగును.

పూర్వపక్షము - అదెట్లు ?

సమాధానము - అవిద్య కారణముగ కలిగినటువంటి అధ్యాసయందు మాత్రమే దృష్టాంతము మరియు దార్ష్టాంతము యొక్క సమానత్వము కుదిరి యుండలేదు. అంతమాత్రము చేత కలిగిన దోషమేమియు లేదు. కాని నీవు చెప్పిన దానియందు జ్ఞాతయందు దృష్టాంతము మరియు దార్ష్టాంతము యొక్క విషమత్వము అనగా భేదమను దోషము కలుగుచున్నది. అందుచేత అట్టి దోషము గూడ లేనట్టి ముసలితనము మరియు మృత్యువు యొక్క దృష్టాంతము ద్వారా చూపబడినది.

పూర్వపక్షము - అవిద్యతో కూడియున్నందువలననే క్షేత్రజ్ఞునికే సంసారిత్వము కలుగుచున్నదని చెప్పవచ్చును గదా ? అని అన్నచో -

సమాధానము - అట్లని చెప్పుట కుదరదు. ఏలయన ? అవిద్య తామస ప్రవృత్తి, వ్యతిరేకమును గ్రహించునదైనను, సంశయము కలిగించునదైనను లేక ఎటువంటి గ్రహణశక్తిలేనిదైనను ఆవరణరూపము కలిగియున్నదై యున్నందున అది అవిద్యయే. అట్లేలయన? వివేకరూపమైన ప్రకాశము వ్యాపించినంతనే అది అనగా అవిద్యారూపమైన తమస్సు - చీకటి - తొలగిపోవుచున్నది. మరియు ఆవరణ రూపమైన చీకటితో కూడియున్న తిమిరాది దోషములు వున్నప్పటికీ అగ్రహణ, అన్యథాగ్రహణాది మూడు విధములైన అవిద్య యొక్క ప్రభావము లేక వునికి వుండియే వుంటుంది.

పూర్వపక్షము - మీరు చెప్పినదానిననుసరించి చూడగా అవిద్య జ్ఞాతయొక్క ధర్మముగా తోచుచున్నది -

సమాధానము - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? తిమిరరోగాదుల వలన కలుగు దోషములు కన్నులు మొదలగు కరణముల యందు చూడబడుచున్నవి. జ్ఞాత అయిన ఆత్మయందు చూడబడుట లేదు. అవిద్య జ్ఞాత యొక్క ధర్మమని మరియు అవిద్యారూపమైన ధర్మముతో కూడియుండుటయే దాని యొక్క సంసారిత్వమని నీవు తలంచుచున్నచో అట్లు తలంచుట సరికాదు. అనగా ఈశ్వరుడే క్షేత్రజ్ఞుడనియు మరియు అతడు సంసారము కలవాడు కాదనియు తలంచుట సరియైనది కాదు. ఏలయన ? నేత్రరూపమైన కరణములయందు విపరీతముగా గ్రహించుట మొదలగు దోషములు చూడబడుచున్నవి. అట్లయినప్పటికీ అట్టి విపరీతాది దోషములు గ్రహించబడినప్పటికి ఆ విపరీత గ్రహణ లేక దానికి కారణరూపమైన తిమిరాది దోషములు జ్ఞాతకు సంబంధించినవి కావు. ఆ విధముగానే దేహధర్మములు కూడ ఆత్మధర్మములు కాజాలవు. కన్నులకు చికిత్స జేసి తిమిరాది దోషములను తొలగించినప్పుడు జ్ఞాత అయిన పురుషునియందు పై దోషములు కానరావు. ఆ కారణము వలన పై దోషములు గ్రహించు పురుషుని ధర్మములు కానేరవు. అదే విధముగా అగ్రహణము, అన్యథాగ్రహణము మరియు సంశయము మొదలగు ప్రత్యయములు మరియు తిమిరాది దోషములు గూడ సర్వత్రా ఏదో ఒక కారణమునకు సంబంధించినవే అగుచున్నవి. జ్ఞాత అయిన పురుషునికి అనగా క్షేత్రజ్ఞునకు సంబంధించినవి కావు.

ఇంతే కాకుండా ఆ ఎరుంగబడుచున్న అనగా జ్ఞానమునకు విషయములగుచున్నందు వలన కూడా దీపము యొక్క ప్రకాశము వలె జ్ఞాత యొక్క ధర్మములు కాజాలవు. ఏలయన? అవిజ్ఞేయములు అనగా యితరులచే తెలియబడునవై యున్నవి.

ఆత్మవాదులందరూ అనగా తనను ఆత్మ పదార్థముగా తలంచువారు సర్వవిధ కరణములు అనగా దేహము యింద్రియము మొదలగు సాధనములతో వున్న సంబంధము తొలగిపోయిన తరువాత కైవల్యావస్థయందు ఆత్మను అవిద్యాది దోషములు లేనిదిగా తలంతురు. దీనివలన గూడ పై సిద్ధాంతమే బలపడుచున్నది. ఏలయన ? అగ్నియందు వుష్ణత్వము వలె ఈ సుఖదుఃఖాది దోషములు గూడ క్షేత్రజ్ఞుని యొక్క ధర్మములై యున్నచో అవి ఆతని నుండి ఎప్పుడూ వేరు కానేరవు.

అంతే కాకుండా **ఆకాశము వలె సర్వవ్యాపకము మూర్తరహితము నిర్వికారము అయివున్న ఆత్మకు దేనితోడను సంయోగము గాని లేక వియోగము గాని జరుగుట సంభవించదు.** దీనివలన గూడ క్షేత్రజ్ఞుని యొక్క నిత్యమైన ఈశ్వరత్వము సిద్ధించుచున్నది.

మరియు "అనాదిత్వాన్నిర్గుణత్వాత్" మొదలగు భగవంతుని వచనముల ద్వారా గూడ క్షేత్రజ్ఞుని యొక్క నిత్యమైన ఈశ్వరత్వమే సిద్ధించుచున్నది.

పూర్వపక్షము - అలా ఒప్పుకొన్నట్లయితే ప్రపంచము మరియు ప్రపంచత్వము లేనిదగుచున్న కారణముగ శాస్త్రమునకు వ్యర్థమగు దోషము కలుగును గదా ?

**సమాధానము** - అట్లు కాదు. ఏలయన ? ఈ దోషమును సర్వులు అంగీకరించియే యున్నారు. అందరు ఆత్మవాదుల ద్వారా ఒప్పుకొనబడియున్న దోషమును ఎవ్వరో ఒకరి కొరకు పరిహరించుట అవసరము కానేరదు.

**పూర్వపక్షము** - దీనిని అందరూ ఎలా ఒప్పుకొని యున్నారు ?

**సమాధానము - ఆత్మవాదులందరూ ముక్తత్వమును పొందియున్న ఆత్మయందు సంసారము మరియు సంసారిత్వపు వ్యవహారము లేదని ఒప్పుకొని యున్నారు.** కాని వారి అభిప్రాయముననుసరించి శాస్త్రాదుల యొక్క అనర్థకత్వపు దోషము ఒప్పుకొనబడలేదు.

సమస్తమైన ద్వైతవాదుల అభిప్రాయము ననుసరించి **బంధావస్థయందే శాస్త్రాదుల సార్థకత్వమున్నది. ముక్తావస్థయందు లేదు.** ఆ విధంగానే మా అనగా అద్వైతుల మతముననుసరించి గూడ జీవులు ఈశ్వరరూపమును పొందియున్నప్పుడు శాస్త్ర గ్రంథముల వ్యర్థత్వము సంభవించిననూ అవిద్యావస్థ యందు వాటి యొక్క సార్థకత్వమున్నది గదా ?

**పూర్వపక్షము** - ద్వైతవాదులైన మా అందరి అభిప్రాయముననుసరించి ఆత్మ యొక్క బంధావస్థ మరియు ఆత్మయొక్క ముక్తావస్థ వాస్తవముగా సత్యములే. అందుచేత ఆ హేయములు, కోరుకొనదగినవే. మరియు వాటికి సంబంధించి సాధనములన్నియూ గూడ సత్యములే. అందుచేత మామతమునందు శాస్త్రము యొక్క సార్థకత్వము వుంటుంది. కాని అద్వైతుల సిద్ధాంతముననుసరించి ద్వైతభావము అవిద్యాజన్యము మరియు మిథ్యగదా ? అందుచేత ఆత్మయందు బంధావస్థ గూడ నిజముగా లేనిదే గదా ? అందుచేత శాస్త్రమను విషయమే మిథ్యయైయున్న కారణము చేత శాస్త్రాదులకు వ్యర్థమను దోషము కలుగుచున్నది గదా ?

**సమాధానము** - అలా చెప్పుట సరికాదు. ఏలయన ? ఆత్మయందు అవస్థాభేదములు సిద్ధించజాలవు గదా ? అనగా ఆత్మయందు అవస్థాభేదములు కలుగజాలవు. ఒకవేళ ఆత్మయందు అవస్థాభేదములు కలుగునని ఒప్పుకున్నచో ఆత్మయందు ఈ బంధావస్థ మరియు ముక్తావస్థ ఈ రెండు అవస్థలు ఒకేసారి అనగా ఏకకాలమునందే కలుగునా ? లేక ఒకదాని తరువాత మరియొకటి కలుగునా ?

స్థితి అనగా స్థిరముగా వుండుట మరియు గతి అనగా స్థిరముగా లేక ముందుకు కదలుచుండుట వలె పరస్పర విరోధమున్న కారణముగ రెండు అవస్థలు ఒకేసారి అనగా ఒకే కాలమునందు ఒకే వస్తువునందు కలుగజాలవు. ఒకవేళ ఒకదాని తరువాత మరియొక అవస్థ కలుగునన్నచో కారణము లేకుండ బంధావస్థ కలుగునని తలంచితిమేని మరియింక ఆయవస్థ నుండి విముక్తి ఎన్నటికిని కలుగజాలదు. ఒకవేళ ఏదో ఒక నిమిత్తముగా అనగా కారణము చేత ఆయవస్థ కలుగునని ఒప్పుకొన్నచో దానంతటకది అనగా ఎటువంటి నిమిత్తము లేకుండ కలగజాలదని అన్నచో అప్పుడు అది మిథ్యగా అనగా అసలు వునికియే లేనిదిగా ఋజువగును. అట్టి స్థితియందు మనము ఒప్పుకొన్న సిద్ధాంతము నిలువజాలదు.

ఇంతే కాకుండా బంధావస్థ మరియు ముక్తావస్థ వెనుక ముందులుగా నిరూపించ బడినప్పుడు ముందుగా బంధావస్థ కలుగునట్లుగా ఒప్పుకొనవలయును. మరియు ఆయవస్థ

ఆరంభములేనిదిగా మరియు అంతము కలదిగాను ఒప్పుకొనవలసి యుండును. అట్లు ఒప్పుకొనుట అనగా అలా జరుగునని తలంచుట ప్రమాణ విరుద్ధమగును. ఆ విధముగానే ముక్తావస్థను గూడ ఆరంభము కలదిగాను మరియు అంతములేనిదిగాను ప్రమాణవిరుద్ధముగా ఒప్పుకొనవలసి వచ్చును.

మరియు ఆత్మకు అవస్థలు కలవనియు మరియు ఒక అవస్థ తరువాత దానికి మరియొక అవస్థ కలుగుననియు ఒప్పుకొన్నచో దానియొక్క నిత్యత్వమును ఋజువుపరచుట అసంభవమగును.

ఆత్మయందు అనిత్యత్వ దోషమును పరిహరించుటకు దానికి బంధావస్థ మరియు ముక్తావస్థ కలుగునని తలంచుట కుదరదు. అందుచేత ద్వైతమతవాదులననసరించి గూడ శాస్త్రము యొక్క వ్యర్థత్వము మొదలగు దోషములు అబాధ్యములు అనగా ఖండించరానివే. ఈ విధముగా ఈ విషయమునందు అభిప్రాయము యిరువురికీ సమానమే అగుటచేత ఈ దోషము యొక్క పరిహారమును కేవలము అద్వైతవాదుల ద్వారానే చేయబడయ వలయునన్న అవసరము లేదు.

మా మతముననుసరించి అనగా అద్వైతుల మతముననుసరించి నిజముగా శాస్త్రము యొక్క వ్యర్థత్వమనునది లేనేలేదు. ఏలయన ? **శాస్త్రము లోక ప్రసిద్ధముగా నున్న అజ్ఞానమునకు సంబంధించిన విషయమే అయి వున్నది.** అజ్ఞానుల యొక్క ఫలము మరియు కారణరూపమైన (జాతి, ఆయువు మరియు భోగమును ఫలమందురు. మరియు శుభాశుభకర్మలు వాటికి కారణములు) అనాత్మ వస్తువుల యందే ఆత్మభావము కలుగుచున్నది. జ్ఞానులయందు కలుగుట లేదు గదా !

ఏలయన ? జ్ఞాని యొక్క బుద్ధియందు ఫలము మరియు అందులకు అవసరమైన కారణములు అనగా సాధనములతో పృథకత్వము అనగా వేరుగా వుండుట ప్రత్యక్షము గదా ! అందువలన జ్ఞానికి అనాత్మ పదార్థములయందు "ఇది నేను" అను ఆత్మభావము కలుగనే కలుగదు.

అతి మూర్ఖులైన మానవులు లేక పిచ్చివారు గూడ జలము మరియు అగ్నిని లేక నీడను అనగా చీకటిని మరియు ప్రకాశమును ఒకటిగా అనగా భిన్నత్వము లేనివిగా తలంచరు. ఇంక జ్ఞానులను గురించి అనగా వివేకముగలవారిని గురించి చెప్పవలసినదేమున్నది ?

అందుచేత ఫలము మరియు హేతువులను ఆత్మకంటే భిన్నములని తలంచు లేక ఎరింగియున్న జ్ఞానికి విధి నిషేధములతో కూడియున్న శాస్త్రముతో పని ఏమి వుండును ?

ఉదాహరణమునకు – "ఓ దేవదత్తా ! నీవు ఆ పనిని చేయుము" అని ఏదో ఒక కర్మయందు దేవదత్తును నియోగించినప్పుడు అతడే లేచి నిలబడును గాని విష్ణుమిత్రుడు ఆ వాక్యమును అనగా ఆజ్ఞను విని గూడ "ఆ పని నన్ను చేయమనుచున్నారు" అని తలంచడు గదా ! కాని ఆ ఆజ్ఞయందు స్పష్టత లేకుండినచో లేక ఆ నియుక్తిని చక్కగా గ్రహించనిచో

అలా తలంచుట సంభవమగును. ఈ విధముగానే ఫలము మరియు హేతువునందు గూడ అజ్ఞానులకు ఆత్మబుద్ధి కలుగవచ్చును.

**పూర్వపక్షము** – ఫలము మరియు హేతువు నుండి ఆత్మయొక్క పృథకత్వము (వేరుగా వుండుట) యొక్క జ్ఞానము కలిగియున్నప్పటికి స్వాభావికమైన సంబంధము కలిగియున్నందున శాస్త్ర విషయకమైన ఈ మాత్రపు జ్ఞానము కలిగియుండుట సమంజసమే. అదేమనగా "నేను శాస్త్రము ద్వారా అనుకూలమైన ఫలము మరియు హేతువు చేత ప్రేరేపించబడి యున్నాను. మరియు ప్రతికూలమైన ఫలము మరియు హేతువు చేత నివారించబడియున్నాను" అదెట్లనగా – తండ్రిని పుత్రుడు మొదలగు వారిని పరస్పరము యిరువురిని వేరువేరుగా తెలిసియున్నప్పటికి ఒకరిని ఆజ్ఞాపించినప్పుడు దానిని మరియొకరు తననే ఆజ్ఞాపించినట్లుగా తలంచుట లోకమునందు చూడబడుచున్నది గదా ?

**సమాధానము** – అట్లనుట సరికాదు. ఏలయన ? ఆత్మ తనకంటే వేరుగా వున్నదను జ్ఞానము కలుగక పూర్వమే ఫలమునందు అభిమానము కలుగుచుండుట సిద్ధించుచున్నది. నియోగమును మరియు నిషిద్ధత్వము యొక్క అభిప్రాయమును చక్కగా తెలుసుకొనిన తరువాతనే మానవుడు ఫలము మరియు హేతువు కంటే ఆత్మ వేరుగా వున్నదను భావమును (జ్ఞానమును) పొందియే వుండును. అంతకు పూర్వము మాత్రము కాదు. అందువలన సారాంశమేమన ? **విధి నిషేధములను విధించు శాస్త్రము కేవలము అజ్ఞానుల కొరకే గాని జ్ఞానుల కొరకు మాత్రము కాదు.**

**పూర్వపక్షము** – ఈ సిద్ధాంతముననుసరించి "స్వర్గమును కోరువాడు యజ్ఞము చేయవలయును. మాంసభక్షణము మాత్రము చేయరాదు." మొదలగు విధి నిషేధములను బోధించునటువంటి శాస్త్రవచనములందు ఆత్మయొక్క పృథకత్వమును ఎరుగువానికి మరియు కేవలము దేహాభిమానము గల వానికి గూడ ప్రవృత్తి లేనందున కర్త లేకుండిన కారణముగ శాస్త్రము వ్యర్థమని తెలియుచున్నదిగదా !

**సమాధానము** – అలా చెప్పుట సరికాదు. ఏలయన ? ప్రవృత్తి మరియు నివృత్తి కలుగుట శాస్త్రముతో పని లేకుండగనే లోకమును చక్కగా చూచినందుననే ప్రత్యక్షమగును.

ఈశ్వరుడు మరియు జీవాత్మయందు ఏకత్వమును చూచు బ్రహ్మవేత్త అనగా బ్రహ్మతత్వమును బాగుగా ఎరింగినవాడు. కర్మలు చేయుట యందు ప్రవృత్తి కలిగి యుండడు. మరియు ఆత్మసత్తను ఒప్పుకొననటువంటి దేహాత్మవాది అనగా దేహమునే ఆత్మగా తలంచువాడు "పరలోకములేదు" అని తలంచి శాస్త్రానుసారముగ వ్యవహరించుచుండును" అనుమాట నిజమే.

కాని లోక ప్రసిద్ధిననుసరించి మనందరకూ తెలియుచున్నది యీ క్రింది విధముగా నున్నది. అదేమన ? విధి నిషేధములను బోధించెడి శాస్త్ర శ్రవణమునకు మరో లక్ష్యము లేనందున ఆత్మయొక్క ఉనికిని అనగా అస్తిత్వమును అనగా ఆత్మ అనునది వున్నది అని కొంచము తెలిసినవాడు మరియు ఎవడు ఆత్మయొక్క నిజమైన తత్వమును గురించి కొంచము

గూడ ఎరుంగడో, మరియు ఎవనికి కర్మఫలములయందు తృష్ణ అనగా కర్మఫలములను అనుభవించవలయునన్న కోరిక కలదో అటువంటి మనుష్యుడు శ్రద్ధాభావము కలిగి య్యునవాడై యున్నందున శాస్త్రానుసారముగ కర్మలు చేయుటయందు ప్రవృత్తి కలిగియుండును. అందుచేత శాస్త్రము ఎన్నడునూ వ్యర్థముకాదు.

**పూర్వపక్షము** – వివేకము గల పురుషులయందు కర్మల యందు ప్రవృత్తి చూడబడనందున వారిని అనుకరించు అవివేకులకు గూడ శాస్త్రము విధించుచున్న కర్మలయందు ప్రవృత్తి కలుగజాలదు. ఆ కారణముగ శాస్త్రము వ్యర్థమగుచున్నది కదా ? యన్నచో –

**సమాధానము** – అలా చెప్పుట సరికాదు. ఏలయన ? ఎక్కడో, ఎవ్వడో ఏ ఒక్క మహాత్మునికో వివేక జ్ఞానము ప్రాప్తించును. అనగా అనేకమైన ప్రాణులయందు విశేషముగా మానవదేహమును పొందిన వారియందు వివేక జ్ఞానము కలుగుచుండును. ఈ విషయము యిప్పుడు మన యందరికి ప్రత్యక్షముగనే యున్నది గదా !

ఇంతేగాక మూర్ఖులైన మానవులెన్నడునూ వివేకము కలిగి జ్ఞానము కలిగియున్న మహాత్ములను అనుకరించరు. ఏలయన ? ప్రవృత్తి రాగాది దోషముల అధీనమునందుండును. (ఉదాహరణమునకు ప్రతి హింసాభావముతో చేయబడు మారణకాండ మొదలగునవి) అభిచారము మొదలగు వాటియందు గూడ ప్రవృత్తి చూడబడుచున్నది. మరియు ప్రాణులకు ప్రవృత్తి స్వాభావికము మరియు సహజము. **"స్వభావమే సర్వ విధ కర్మలకు మూలము"** అనగా స్వభావమే వ్యవహరించుచుండును.

ఈ విధముగా యిప్పుడు సిద్ధించినదేమన ? **సంసారము అవిద్యారూపమైనది** అనగా అవిద్యయే కారణముగా గలది. మరియు అది కేవలము అజ్ఞానులకు మాత్రమే విషయముగా వుండి వున్నది. కేవలము శుద్ధమైన క్షేత్రమునందు అవిద్య మరియు దాని కారణముగా జరుగు కర్మలు రెండూ లేవు.

అంతేగాక విథ్యాజ్ఞానము అనగా మిథ్యయైన విషయములకు సంబంధించిన జ్ఞానము పరమార్థమైన వస్తువు నందు దోషమును కలిగించు సామర్థ్యము కలిగియున్నది కాదు. అదెట్లన? చవిటి నేలను మృగతృష్ణ అనగా ఎండమావుల యందు తోచు జలము తడుపజాలదు గదా ! ఆ విధముగానే అవిద్య గూడ క్షేత్రజ్ఞునికి అపకారముగాని లేక ఉపకారముగాని చేయజాలదు. అందుచేత "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి" మరియు "అజ్ఞానేనావృతం జ్ఞానమ్" అని చెప్పబడినది.

**పూర్వపక్షము** – మరి అలా అయినప్పుడు ప్రాపంచిక భావము కలిగియున్న మనుష్యుల వలెనే పండితులకు అనగా జ్ఞానులకు గూడ "నేను యిట్లున్నాను" "ఈ వస్తువు నాకు సంబంధించినది" అను ప్రతీతి ఎట్లు కలుగుచున్నది ?

**సమాధానము** – వినుము. క్షేత్రమునందు ఆత్మను చూచుట ఎట్టి పాండిత్యమో ఈ పాండిత్యము గూడ అటువంటిదే. కాని మనుష్యుడు క్షేత్రజ్ఞుని నిర్వికారునిగా గుర్తించగలిగితే మరల ఆతడు "నాకు ఫలానా భోగము లభించవలయును" లేక "నేను ఫలానా కర్మ చేయు

దును" అను ఆకాంక్ష (కోరిక) కలిగి యుండదు. ఏలయన ? భోగములు మరియు కర్మలు రెండూ కూడ వికారములే గదా !

అందుచేత యిప్పుడు తెలిసినదేమన ? **ఫలమును కోరినవాడగుట చేత అజ్ఞాని కర్మలు చేయుచుండును.** కాని వికారరహితమైన ఆత్మ సాక్షాత్కారమును పొందియున్న జ్ఞానియందు ఫలేచ్ఛ లేకయుండినందువలన అతనికి ప్రవృత్తి కలుగుట సంభవము కాదు. అందుచేత కార్య – కారణ రూపమైన సంఘాతమైన వ్యాపారము యొక్క నివృత్తి చెందిన పిదప అట్టి జ్ఞానియందు తిరిగి ప్రవృత్తి కలుగనేరదు.

కొందరి అభిప్రాయముననుసరించి యిది ఒక విధమైన విద్వత్తు అనగా జ్ఞానము గూడ కావచ్చును. అనగా క్షేత్రజ్ఞుడు ఈశ్వరుడుగదా మరియు అటువంటి క్షేత్రజ్ఞుని యొక్క విషయమైన క్షేత్రము ఆయన కంటే వేరుగా వుండును గదా ! మరియు నేను ఆ రెంటికంటే అనగా జీవుడు క్షేత్రజ్ఞుడు మరియు ఆతనికి విషయమై యున్న క్షేత్రము కంటే వేరుగ సుఖిని, దుఃఖిని అయివున్నాను గదా ! కావున నేను క్షేత్రము మరియు క్షేత్రజ్ఞునికి సంబంధించిన జ్ఞానము మరియు ధ్యానము ద్వారా ఈశ్వరరూపుడైన క్షేత్రజ్ఞుని సాక్షాత్కరింపజేసుకొని ఆయన స్వరూపముగా నిలిచియుండుటయను ప్రక్రియ ద్వారా సంసారము నుండి నివృత్తిని పొందవచ్చును.

**ఎవడు యీ విధముగా తలంచునో లేక యితరులకు యీ విధముగా బోధించునో ఆ జీవుడు లేక క్షేత్రజ్ఞుడు** బ్రహ్మస్వరూపుడు కానేరదు. మరియు ఎవడు ఇలా అనగా నేను ఈ విధమగు ప్రక్రియ ద్వారా ప్రపంచము, మోక్షము మరియు శాస్త్రము యొక్క సార్థకత్వమును సిద్ధింపజేసుకొనగలను అని తలంచునో ఆతడు పండితులయందు అధముడు అనబడును.

మరియు ఆతడు ఆత్మహత్య జేసుకొనువాడు మరియు శాస్త్రార్థము యొక్క సాంప్రదాయక పరంపరను వదలినవాడైనందున శృతిసిద్ధమైన అర్థమును త్యజించి వేదవిరుద్ధమైన అర్థమును కల్పించి దానియందే మోహితుడై యుండును. మరియు యితరులను గూడ మోహమునందు ముంచిన వాడగును.

అందుచేత ఎవ్వడు శాస్త్రార్థ పరంపరను ఎరుంగడో అట్టివాడు సర్వశాస్త్రములను ఎరింగినవాడైయున్నప్పటికి మూర్ఖులయందే గణించబడును.

ఈశ్వరుడు మరియు క్షేత్రజ్ఞుడు ఒక్కరేయని ఒప్పుకొన్న ఎడల ఈశ్వరునకు సంసారిత్వము కలుగును. అట్లే క్షేత్రజ్ఞుడు ఈశ్వరుడు ఒకరేయని ఒప్పుకొన్నందు వలన యింక సంసారి అనేవాడు ఎవ్వడూ వుండని కారణముగ సంసారమే లేకుండాపోవును. అందుచేత విద్య మరియు అవిద్య యొక్క విలక్షణత్వ ప్రతిపాదన ద్వారా పై రెండు దోషములు పరిహరించబడినవి.

పూర్వపక్షము – అదెట్లు ?

**సమాధానము** – అవిద్య చేత కల్పించబడిన దోషము చేత ఆ విషయమునకు సంబంధించిన పారమార్థికమైన అనగా యదార్థముగా వున్న వస్తువునందు ఎటువంటి వికారము అనగా దోషము కలుగదు.

ఈ వాక్యము ద్వారా మొదటి శంక నివారించబడినది. మరియు అట్లే మృగతృష్ణయందు తోచిన జలము వలన చవిటి నేల తడిసి బురద కానేరదు. మరియు సంసారి అనువాదు లేనందువలన సంసారమే వుండదు అని చెప్పబడిన దోషము గూడ **సంసారము, సంసారిత్వము అవిద్యాకల్పితమని చెప్పుట ద్వారా నిరాకరించబడినది.**

**పూర్వపక్షము** – క్షేత్రజ్ఞుడు అవిద్యను కలిగి యున్నట్లయితే అతనికి సంసారిత్వమను దోషము సంభవించును గదా ! అట్లేలయన ? అందువల్ల కలుగు దుఃఖము మొదలగు దోషములు ప్రత్యక్షముగా చూడబడుచున్నవి గదా !

**సమాధానము** – అట్లని చెప్పుట సరికాదు. ఏలయన ? జ్ఞేయమైనదంతయు తెలియబడుతూనే వుంటుంది. అది అంతయు క్షేత్రము యొక్క ధర్మమే అయివున్నది. అందుచేత దానిచేత చేయబడు దోషములన్నియు జ్ఞాత అయిన క్షేత్రజ్ఞునికి సంబంధించినవి కానేరవు.

నిజముగాలేని ఏ దోషములు క్షేత్రజ్ఞుని యందు కలవని నీవు ఆరోపించుచున్నావో అవి అన్నియు క్షేత్రమునకు సంబంధించినవి అయినందువలన ఆ దోషములన్నియు క్షేత్రమునకు సంబంధించినవేగాని క్షేత్రజ్ఞునకు సంబంధించినవి కావు. అందుచేత క్షేత్రజ్ఞుడు అనగా ఆత్మ దూషితుడు కాజాలడు. ఏలయన ? ఒకవేళ ఆ దోషములతో క్షేత్రజ్ఞునికి సంబంధము కలదని ఒప్పుకొన్నచో జ్ఞేయపదార్థము యొక్క జ్ఞేయత్వమే సిద్ధించజాలదు.

అభిప్రాయమేమన ? ఒకవేళ అవిద్యకలవాడైవుండుట మరియు దుఃఖితుడగుట మొదలగునవన్నియు ఆత్మధర్మములే అయివున్నచో అవి ప్రత్యక్షముగా ఎట్లు కనబడును ? మరియు అవి క్షేత్రజ్ఞుని యొక్క ధర్మములు ఎట్లు కాగలవు ? ఏలయన ? జ్ఞేయముగా వున్న వస్తువులన్నియు అవన్నియు క్షేత్రములేగదా ! క్షేత్రజ్ఞుడు తెలుసుకొనువాడగును. ఈ విధమగు సిద్ధాంతము స్థాపించబడినప్పుడు అవిద్య గలవాడగుట మరియు దుఃఖము గలవాడగుట మొదలగు దోషములను క్షేత్రజ్ఞునికి సంబంధించిన ధర్మములని చెప్పుట మరియు వాటిని ప్రత్యక్షముగా చూచుచున్నామని చెప్పుట మొదలగునవన్నియు ఆ జ్ఞానము మాత్రమే ఆశ్రయముగా గలిగిన అర్థహీనములైన మాటలు మాత్రమే యగును.

**పూర్వపక్షము** – ఆ అవిద్య ఎవనియందు (దేనియందు) వున్నది ?

**సమాధానము** – ఎవనియందు లేక దేనియందు చూడబడుచున్నదో దానియందే వున్నది.

**పూర్వపక్షము** – దేనియందు లేక ఎవనియందు చూడబడుచున్నది ?

**సమాధానము** – "అవిద్య ఎవనియందు చూడబడుచున్నది ?" ఇట్టి ప్రశ్నయే నిరర్థకమైనది.

**పూర్వపక్షము** – అదెట్లు ?

**సమాధానము** – అవిద్య చూడబడుచున్నదనగా ఆ అవిద్యతో కూడియున్న పదార్థమును లేక వ్యక్తిని గూడ నీవు తప్పక చూచుచునే యుండియుండవచ్చును. అవిద్యగలవాడు కనబడినంతనే ఆ అవిద్య ఎవనియందు కలదు ? అని ప్రశ్నించుటయే యుక్తము (సరి) కాదు గదా ! ఏలయన ? ఆవులుగలవానిని చూచిన మీదట "ఈ ఆవులు ఎవరివి ?" అని అడుగుట తెలివిగల కార్యము కానేరదు.

**పూర్వపక్షము** – మీరు చెప్పిన ఈ దృష్టాంతము విషయమునకు సంబంధించినది. ఆవులు మరియు వాటి యొక్క యజమాని ప్రత్యక్షముగా వుండియున్నందున ఆ యిరువురు అనగా ఆవు మరియు దాని యజమాని ప్రత్యక్షముగా వుండియున్నందున వారి యొక్క సంబంధము గూడ ప్రత్యక్షముగా వుండియున్నది. అందుచేత ఆ యిరువురి సంబంధమును గురించి ప్రశ్నించుట నిరర్థకమే. కాని ఆ యిరువురి వలె అవిద్య గలవాడు మరియు అవిద్య ప్రత్యక్ష విషయములు కావుగదా ? అందుచేత నా యీ ప్రశ్న నిరర్థకము కానేరదు.

**సమాధానము** – అప్రత్యక్షమైన అవిద్యగలవానితో అప్రత్యక్షమైన అవిద్య యొక్క సంబంధమును ఎరింగినందువలన నీకు కలుగు లాభమేమి కలదు ?

**పూర్వపక్షము** – అవిద్య అనర్థమునకు హేతువు. అట్లని తెలిసినందున దానిని త్యజించవచ్చును.

**సమాధానము** – ఎవనియందు అవిద్య కలదో ఆతడే స్వయముగా త్యజించును.

**పూర్వపక్షము** – అయితే నాయందే అవిద్య కలదు.

**సమాధానము** – అలా అయితే నీవు అవిద్యను ఆ అవిద్యతో కూడియున్న నిన్ను చక్కగా ఎరుంగుదువు.

**పూర్వపక్షము** – ఎరుంగుదును. కాని ప్రత్యక్షముగా మాత్రము ఎరుంగను.

**సమాధానము** – అనుమాన ప్రమాణము ద్వారా ఎరుంగుచున్నట్లయితే జ్ఞాత అయిన నీకు మరియు ఆ అవిద్యకు సంబంధము ఎట్లు కలిగినది ? ఏలయన ? ఆ కాలమునందు అనగా అవిద్యను అనుమానము ద్వారా ఎరుంగుచున్నకాలమునందు జ్ఞాత అయిన నీ యొక్క జ్ఞేయరూపము అవిద్యతో సంబంధము కలిగి యుండుటకు అవకాశము లేదు. కారణమేమన? జ్ఞాత యొక్క విషయముగా ఎరింగియే దానిని అవిద్యగా ఒప్పుకొనుట జరిగినది.

మరియు జ్ఞాత మరియు అవిద్య యొక్క సంబంధమును ఎవడు గ్రహించువాడై యున్నాడో అతడు మరియు ఆ అవిద్య మరియు జ్ఞాత యొక్క సంబంధమును విషయముగా చేయు మరియొక జ్ఞానము ఈ రెండూ వుండుట సంభవము కాదు. ఏలయన? అలా జరిగితే అనవస్థాదోషము సంభవించును. అనగా జ్ఞాత మరియు జ్ఞేయము జ్ఞాత యొక్క సంబంధము యివి కూడా మరియొకని ద్వారా తెలియబడును. అలా ఒప్పుకొన్నట్లయితే వాటిని తెలుసుకొను జ్ఞాత మరియొకడు కావలసి యుండును. మరల వాడిని గూడ తెలుసుకొను

మరియొకడు వున్నాడని ఒప్పుకొనవలసి వచ్చును. అప్పుడు అట్టి స్థితికి అంతము లేకుండ పోవును.

కాని జ్ఞేయము అవిద్యయైనను లేక మరింకేమైననూ జ్ఞేయము జ్ఞేయముగానే యుండును. **జ్ఞేయ పదార్థమెన్నడును జ్ఞాత కానేరదు. ఆ విధముగానే జ్ఞాత గూడ ఎల్లప్పుడూ జ్ఞాతగానే యుండును. జ్ఞాత ఎన్నడును జ్ఞేయము కాజాలదు.** ఆ కారణము చేతనే అవిద్య మరియు దుఃఖత్వము మొదలగు దోషముల వలన జ్ఞాత అనగా క్షేత్రజ్ఞునికి ఎటువంటి దోషములు అంటనేరవు.

**పూర్వపక్షము** – క్షేత్రము యొక్క దోషములను ఎరుంగుటయే జ్ఞాత అనగా క్షేత్రజ్ఞుని యొక్క పెద్ద దోషము.

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? ఆత్మ విజ్ఞాన స్వరూపము మరియ అవిక్రియము అయివున్నది. ఆయాత్మయందు జ్ఞాతృత్వము యొక్క వుపచారము మాత్రమే చేయబడుచుండును. అదెట్లన ? వుష్ణత్వమే స్వభావముగా గలిగి యున్నందున అగ్ని యందు తపింపజేయు క్రియ జరుగుచున్నట్లుగా తోచుచుండును.

ఆత్మయొక్క స్వభావముననుసరించి దానియందు క్రియ, కారకము మరియు ఫలాసక్తిభావము వుండదని భగవంతుడు ఈ ప్రకరణమునందు స్పష్టముగా చెప్పియున్నాడు. కేవలము అవిద్య ద్వారా అధ్యారోపణ చేయబడుచున్న కారణముగ క్రియలు, కారకములు మొదలగునవి ఆత్మయందే వున్నట్లుగా తోచుచుండును. అదే విధముగా "ఈ సత్యము తెలిసినవానికే తెలియును, ప్రకృతి యొక్క గుణముల కారణముగానే సర్వవిధకర్మలు చేయబడుచుండును. ఆ పరమాత్మ ఎవ్వని పాప–పుణ్యములను గ్రహించడు" మొదలగు ప్రకరణములయందు అనేకచోట్ల చెప్పబడినది. అదే విధముగా మేము కూడ వ్యాఖ్యానించి యున్నాము. ఇంక ముందు ప్రకరణములందు గూడ ఈ సత్యము చెప్పబడును.

**పూర్వపక్షము** – ఇట్టి స్థితియందు ఆత్మయందు దానియొక్క స్వభావము చేతనే క్రియలు, కారకములు, ఫలప్రాప్తి భావములు లేవని అనగా వుండవనియు మరియు ఇవి యన్నియు అవిద్య ద్వారా అధ్యారోపితములు మాత్రమేయని సిద్ధించినందున కర్మలన్నియు విద్వాంసుడు కానివానికే కర్తవ్యములు గాని విద్వాంసునికి కాదని నిర్ణయమైనది.

**సమాధానము** – మీరు చెప్పినట్లుగానే సిద్ధించినది. ఈ విషయమునే మేము "నహి దేహ భృతాశక్యమ్" అను ప్రకరణమునందు మరియు సమస్త గీతాశాస్త్ర వుపసంహార సందర్భమున చూపెట్టెదము. మరియు **"సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా"** (చూ. 18.50) అను శ్లోకము యొక్క అర్థమునందు యీ విషయమును గురించి విశేషముగా చెప్పెదము. ఇచ్చట యింతకంటే విస్తారముగా చెప్పనవసరము లేదు. అందుచే యింతటితో ముగించుచున్నాము.

"ఇదం శరీరం" మొదలగు శ్లోకముల ద్వారా ఉపదేశింపబడిన క్షేత్రాధ్యాయము యొక్క అర్థము యొక్క పంక్షిప్తరూపము ఈ "తత్క్షేత్రంయచ్చ" మొదలగు శ్లోకము ద్వారా చెప్పబడుచున్నది. అట్లేలయన ? దేనికైనా విస్తార పూర్వకముగా అర్థము చెప్పవలసి వచ్చినప్పుడు దానియొక్క సంక్షిప్తార్థము ముందుగా చెప్పుట సాంప్రదాయమే.

**13.3. తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్,**
**స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు.**

అనగా - ఇంతకు పూర్వము "ఇదం శరీరం" వాక్యము ద్వారా చెప్పబడినదే యిచ్చట **"తత్"** శబ్దము ద్వారా జ్ఞాపకము చేయబడుచున్నది.

ఇంతకు పూర్వము క్షేత్రమను శబ్దమునకు వ్యాఖ్యానము చెప్పబడినది. అది ఎట్లున్నదనగా అది అనగా ఆ క్షేత్రము తనకున్న ధర్మముల కారణముగ ఏ విధమగు వికారములు కలిగియున్నదో మరియు ఏ కారణము వలన ఏ కార్యము జరుగుచున్నదో అది యిచ్చట 'చ' శబ్దము సముచ్చయము కొరకైయున్నది. మరియు "కార్యము కలుగుచున్నది" అనునది వాక్యశేషము అయి వున్నది.

మరియు దేనిని క్షేత్రజ్ఞుడు అని చెప్పబడినదో అది గూడా ఎటువంటి ప్రభావము కలిగియున్నదో అనగా ఏ ఏ ఉపాధుల యొక్క శక్తులతో కూడియున్నదో ఆ క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడు ఆ రెంటికి పైన చెప్పబడిన విశేషణములతో కూడియున్న యదార్థ స్వరూపమును గురించి నీవు నా నుండి సంక్షేపముగా వినుము. అనగా విని నీ కర్తవ్యమును నిర్ణయించు కొనుము.

శ్రోతయొక్క బుద్ధియందు అభిరుచిని కలిగించుటకై ఆ చెప్పబోవు **క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని** యొక్క యదార్థ స్వరూపమును చిత్రించుచున్నారు -

**13.4. ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్,**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః.**

అనగా - ఈ క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క తత్వమును గురించి వసిష్ఠుడు మొదలగు ఋషుల చేత అనేక విధములుగా చెప్పబడియున్నది. మరియు ఋగ్వేదాది నానావిధములైన శృతి వాక్యముల ద్వారా కూడా వేరువేరుగా చాలా విశదముగా చెప్పబడియున్నది.

మరియు సంశయ రహితమై నిశ్చిత జ్ఞానమును కలిగించునటువంటి మరియు నిశ్చితము మరియు యుక్తితో కూడియున్న బ్రహ్మసూత్రముల యందలి పదములలో గూడ యీ విషయమే చెప్పబడియున్నది. బ్రహ్మపదార్థమును సూచించు వాక్యములు "బ్రహ్మ సూత్రములు" అని యందురు. ఆ వాక్యములు అనగా సూత్రముల ద్వారా బ్రహ్మము

పొందబడును, తెలియబడును. అందుచేతనే వాటిని పదములందురు. వాటియందు గూడ క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క తత్వము చెప్పబడియున్నది. ఏలయన ? "కేవలము ఆత్మయే సర్వము అయి వున్నది అని ఉపాసించవలయును" అను మొదలగు బ్రహ్మమును సూచించు పదముల యందే ఆత్మ ఎరుంగబడుచున్నది.

ఈ విధముగా చెప్పినది విని దగ్గరకు చేరిన అర్జునునితో భగవంతుడు యిట్లు చెప్పుచున్నారు -

**13.5. మహాభూతాన్యహంకారో బుద్ధి రవ్యక్తమేవ చ,**
**ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః.**

అనగా - సూక్ష్మభూతములు అవి దృష్టి గోచరమగు వస్తువుల అన్ని వికారముల యందు వ్యాపించి యున్నందున మహాభూతములనబడుచున్నవి. అంతేగాక అవి సామాన్య భూతములు గూడాను. అందుచేత అవి మహాభూతములనబడుచున్నవి. స్థూలపంచభూతములు యింద్రియగోచరములు అను శబ్దము ద్వారా చెప్పబడుచున్నవి. అందుచేత యిచ్చట "మహాభూతములు" అను శబ్దము ద్వారా సూక్ష్మ పంచమహాభూతములుగా గ్రహించనగును.

మహాభూతములకు కారణమైనది అహం - ప్రత్యయరూపమైన అహంకారమై యున్నది. మరియు అహంకారమునకు కారణరూపమైనది నిశ్చయాత్మికమైన బుద్ధి అయి వున్నది. మరియు ఆ నిశ్చయాత్మికమైన బుద్ధికి గూడ కారణమైనది అవ్యక్త ప్రకృతి. అనగా ఏది వ్యక్తము కాదో అటువంటి 'అవ్యక్తము' అను పేరుగల అవ్యాకృతమైన ఈశ్వరశక్తి. దీనినే "మమ మాయా దురాత్యయా" అను మొదలగు వచనముల ద్వారా చెప్పబడినది.

ఇచ్చట 'ఏవ' శబ్దము ప్రకృతిని విశేషరూపముగా చెప్పుటకు వుపయోగించబడినది. మరియు "చ" శబ్దము సమస్త భేదమును సముచ్చయముగా చూపుటకు ప్రయోగించబడినది. అభిప్రాయమేమన ? ఇదియే ఎనిమిది విధములుగా విభక్తమైనటువంటి అపరా ప్రకృతి.

మరియు పది యింద్రియములు అనగా కన్ను, చెవి, ముక్కు మొదలగు ఐదు జ్ఞానేంద్రియములను కలిగించునది అయినందున జ్ఞానేంద్రియము మరియు వాక్కు మొదలగు ఐదు కర్మలనాచరించునట్టివి అయినందున కర్మేంద్రియములు మరియు పదకొండవది సంకల్ప వికల్పాత్మకమైన మనస్సు మరియు శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు యివి పంచేంద్రియముల యొక్క విషయములై యున్నవి. వీటినన్నింటిని కలిపి సాంఖ్యమతస్తులు యిరువదినాలుగు తత్వములుగా చెప్పుదురు.

వైశేషిక మతస్తులు 'యిచ్ఛ' అనగా కోరిక (కామము) మొదలగు వాటిని ఆత్మ ధర్మములని చెప్పుదురు. అవన్నియు గూడ క్షేత్రమునకు సంబంధించిన ధర్మములే గాని ఆత్మకు సంబంధించినవి కావు. ఈ మాట భగవంతుడే చెప్పుచున్నాడు.

13.6. ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః,
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్.

అనగా - ఇచ్ఛ అనగా కోరిక - యింతకు పూర్వము తాను ఎటువంటి సుఖ దాయకమైన విషయమును అనుభవించి యుండెనో తిరిగి మరల అటువంటి పదార్థము లేక విషయము ప్రాప్తించినప్పుడు దాని ద్వారా సుఖము లభించునని తలంచి మానవుడు ఆ వస్తువును పొందవలయునని కోరుకొనును. ఆ కోరికనే యిచ్ఛ లేక కోరిక అని యందురు. ఇలా **కోరికలు కలుగుట అంతఃకరణ ధర్మములు.** ఆ విధముగా అవి **తెలియబడుచున్నందున క్షేత్రములనబడుచున్నవి.**

మరియు ద్వేషము - ఏ విధమైన పదార్థమును దుఃఖమునకు కారణముగా తలంచి అనగా యింతకు పూర్వము అనుభవము ద్వారా ఎరింగినవాడై మరల తిరిగి అటువంటి పదార్థమే లభించినప్పుడు మానవుడు దాని పట్ల విముఖత కలిగియుండునో ఆ విముఖత్వ భావమును "ద్వేష"మందురు. అది గూడ ముందుగానే తనకు తెలియబడుచున్నందున దానిని క్షేత్రమందురు.

అదే విధముగా సుఖము అనగా తనకు అనుకూలమై ఆనందదాయకమై మరియు సాత్వికమై యున్నట్లుగా తెలియబడుచున్నందున అది క్షేత్రము. అట్లే తనకు ప్రతికూలమై బాధను కలిగించునదై వున్నట్లుగా ముందుగానే తెలియబడుచున్నందున అనగా జ్ఞేయపదార్థమై యున్నందున దుఃఖము గూడ క్షేత్రమనబడుచున్నది.

దేహము మరియు యింద్రియముల సమూహము 'సంఘాత'మనబడును. ఆ సంఘాతమునందు ప్రకాశించబడిన అంతఃకరణము యొక్క ఏ వృత్తి కలదో అదెట్లన ? అగ్ని చేత ప్రజ్వలించబడుచున్న యినుప ముక్క వలె, **ఆత్మ చైతన్యము యొక్క ఆభాస చేత వ్యాపించి యున్నదో ఆ చైతన్యము గూడ జ్ఞేయమై యున్నందున క్షేత్రమే యనబడును.**

వ్యాకులత చెందియున్న దేహము మరియు యింద్రియాదులు దేనిచేత ధరింపబడు చున్నవో అట్టి ధృతి కూడ జ్ఞేయమే అయి వున్నందున క్షేత్రమనబడుచున్నది.

అంతఃకరణము యొక్క సమస్త ధర్మములను తెలుపుట కొరుకు యిచ్ఛట యిచ్ఛాది ధర్మములు గ్రహించబడినవి. ఈ చెప్పినదానిని ఉపసంహరించుచున్నారు.

మహతత్వాది వికారములతో సహా క్షేత్రము యొక్క స్వరూపము సంక్షిప్తముగా చెప్పబడినది. అనగా సమస్తమైన క్షేత్రభేదముల యొక్క సమూహము అనగా **యీ స్థూల దేహము క్షేత్రము అయి** వున్నది అని చెప్పబడినది. మహాభూతములు మొదలు ధృతి వరకు అనేక భేదోపభేదములతో నిండియున్న ఆ క్షేత్రమును గురించి చెప్పబడినది.

ఇంకముందు అనేక విశేషణములతో కూడియున్న క్షేత్రజ్ఞుని గురించి చెప్పబడును. ఆ క్షేత్రజ్ఞుని ఆతని యొక్క సర్వవిధ ప్రభావములతో అనగా శక్తులతో తెలుసుకొనినందువలన మానవుడు అమృతరూపుడైపోవునో అటువంటివానిని భగవంతుడు ముందుముందు **"జ్ఞేయం**

**యత్తత్ప్రవక్ష్యామి**" (చూ. 13.12 గీత.) మొదలగు వాక్యములతో సర్వవిశేషణ సహితముగా చెప్పెదరు.

ఇచ్చట ముందుగా ఆ క్షేత్రజ్ఞుని గురించి తెలుసుకొనుటకు సాధనరూపముగా అమానిత్వము మొదలగు ఏ సాధన సముదాయము కలదో, ఎట్టి సాధన సంపత్తి కలిగి యున్నందున ఆ జ్ఞేయ పదార్థమును తెలుసుకొనగలందులకు మానవుడు తగినవాడగునో, ఎవనిని పారాయణ చేసినందువలన సంన్యాసి జ్ఞానియనబడునో మరియు ఎవడు జ్ఞానమునకు సాధనముగా యున్నందువలన జ్ఞానియని పిలువబడునో అటువంటి అమానిత్వాది గుణసముదాయమును గురించి భగవంతుడు వివరించుచున్నారు.

**13.7.** అమానిత్వమదంభిత్వమహింసా క్షాంతిరార్జవమ్,
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః.

అనగా - అమానిత్వ - మానము అను భావము అనగా **తన గొప్పతనమును గురించి చెప్పుకొనుటను మానిత్వమందురు. అలా చెప్పుకోకుండా వుండడం అమానిత్వమన బడుతుంది.**

అదంభిత్వము - తన ధర్మమును గురించి చెప్పుకొనుట దంభిత్వము అనబడును. అలా చెప్పుకొనకుండా వుండడం అదంభిత్వము అనబడును.

అహింస - హింసా కార్యములు చేయకుండుట అనగా యితర ప్రాణులకు ఎటువంటి కష్టము కలుగనీయకుండుట. క్షమ - అనగా యితరులు తనపట్ల అపరాధము చేసినప్పటికి ఎటువంటి వికారము లేకుండుట. ఆర్జవము - అనగా సరళత్వము అనగా యితరులపట్ల ఎటువంటి కపటము లేకుండ వ్యవహరించుట ఆర్జవమనబడును.

ఆచార్యుని ఉపాసించుట - అనగా మోక్షస్థితిని పొందుటకు అవసరమైన సాధనా మార్గమును ఉపదేశించు గురువును సేవించుట మొదలగు సేవాకార్యములు ఆచార్యోపాసన మనబడును.

శౌచము - శారీరిక శుద్ధి అనగా దేహమునందు నిత్యము తయారగు మలమును నీరు - సబ్బు, కుంకుడు రసము మొదలగు సాధనముల ద్వారా దేహమును శుభ్రముగా వుంచుకొనుట శౌచము అనబడును. మరియు అంతఃకరణమునందలి రాగద్వేషాది దోషములను ప్రతిపక్ష భావముతో అనగా వాటిని తనకు శత్రువులుగా తలంచి వాటిని అంతఃకరణమునుండి తొలగించుకొనుట శౌచమనబడును.

స్థిరత్వము - అనగా స్థిరమైన భావము కలిగియుండుట అనగా మోక్షమును పొందు ప్రయత్నమునందు స్థిరత్వము కలిగియుండుట.

ఆత్మవినిగ్రహము - అనగా ఆత్మకు అపకారమును కలిగించు మరియు 'ఆత్మ' శబ్దము ద్వారా చెప్పబడుదానికి కార్యకరణ సంఘాత రూపమైన ఈ దేహమును నిగ్రహించుట

అనగా ఆ దేహమును దానియొక్క స్వాభావిక ప్రవృత్తి నుండి తొలగించి మోక్షమార్గమునందు నియమించుట లేక నియమించి వుంచుట మరియు .....

**13.8.** ఇంద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ,
జన్మ మృత్యుజరావ్యాధి దుఃఖ దోషాను దర్శనమ్.

అనగా – ఇంద్రియములకు శబ్దాది విషయములయందు వైరాగ్యము అనగా లౌకిక మరియు పారలౌకిక భోగములయందు ఆసక్తి లేకుండుట మరియు అహంకారము లేకుండుట.

మరియు జన్మము, మృత్యువు, ముసలితనము, వ్యాధులు మరియు దుఃఖముల యందు అనగా జన్మము మొదలు దుఃఖపర్యంతము వరుసగా అన్నింటియందును దోషములను చూచుట.

జన్మకాలమునందు గర్భమునందుండుట, తరువాత యోనిద్వారా బయటకు వచ్చుట మొదలగు ఏ దోషములు అనగా దుఃఖములు కలవో వాటిని తెలుసుకొనుట. వాటిని గురించి లోతుగా విచారించుట. ఆ విధముగానే మృత్యువునందు గూడ దోషములను చూచుట మరియు వృద్ధావస్థయందు తెలివి, తేజము మొదలగునవన్నియు క్షీణించిపోవుట మరియు దానియందు హీనత్వమను దోషమును చూచుట మరియు తలనొప్పి మొదలగు రోగరూపములైన వ్యాధులయందు గల దోషములను గమనించుట అధ్యాత్మము, అధిభూతము మరియు అధి దైవతములు మొదలగువాటి కారణముగ కలుగు మూడు విధములైన దుఃఖములయందు గల దోషములను గురించి విచారించుట.

అట్లుగాక మరో విధముగా చెప్పవలయునన్నచో **దుఃఖమే అన్నింటికంటె పెద్ద దోషము.** ఈ దుఃఖరూపమైన దోషమును యింతకు పూర్వము చెప్పిన విధముగా జన్మాదులయందు చూచుట అనగా జన్మమే దుఃఖమయము. మరణించుట దుఃఖము. వృద్ధాప్యము దుఃఖముతో నిండియున్నది. అట్లే సర్వవిధ రోగములు దుఃఖమును కలిగించునవే. ఈ విధముగా చూచుట జన్మాదుల వలన కలుగు దుఃఖములకు కారణము జన్మమే అయినందున **జన్మము దుఃఖమే స్వరూపముగా కలిగియున్నది.**

ఈ విధముగా జన్మాదులయందు దుఃఖరూపమైన దోషమును ఒకసారి గాక అనేకమార్లు చూచుచుండినందువలన దేహము, యింద్రియములు మరియు విషయ భోగములయందు వైరాగ్యభావము ఉదయించును. అట్టి స్థితియందు మనస్సు యింద్రియాది సాధనముల యొక్క ఆత్మ సాక్షాత్కారమును పొందుటకు అంతరాత్మయందు ప్రవృత్తి ఉదయించును. ఈ విధముగా జ్ఞానమునకు కారణమైనందున జన్మాదులయందు గల దుఃఖరూపమైన దోషమును మాటిమాటికి చూచుట మరియు దానిని గురించి ఆలోచించుచుండుట 'జ్ఞాన' మని చెప్పబడును.

మరియు –

**13.9. అసక్తిరనభిష్వంగః పుత్ర దార గృహాదిషు,**
**నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు.**

అనగా – అసక్తి – ఆసక్తి నిమిత్తకమైన విషయములయందు ప్రీతి కలిగియుండుటను సక్తి అందురు. అసక్తి అనగా ప్రీతి లేకుండుటయే అసక్తి అనబడును.

అనభిష్వంగ – అభిష్వంగము లేకుండుట అనభిష్వంగము. మోహముతో కూడియున్న అనన్యమైన **ఆత్మ**భావనా రూపమైన విశేషమైన అసక్తిని అభిష్వంగమందురు. అదెట్లన ? ఎవడో యితరుడు సుఖవంతుడుగానో లేక దుఃఖవంతుడుగానో యున్నప్పుడు ఆతనిని చూచి నేనే **సుఖవంతుడు**గా యున్నాను లేక నేనే దుఃఖవంతుడుగా యున్నాను అని తలంచుట లేక ఎవడో **యితరుడు** బ్రతికినా చచ్చినా నేనే బ్రతికియున్నాను లేక నేనే మరణించియున్నాను లేక మరణించెదను అని తలంచుటను అభిష్వంగమందురు.

ఇటువంటి అభిష్వంగము ఎచ్చట సంభవించును ? అన్నచో పుత్రుడు, భార్య మరియు యిల్లు మొదలగు వాటియందు సంభవించును. అనగా పుత్రునియందు, భార్యయందు, యింటియందు సంభవించును. ఇచ్చట ఆది అనగా మొదలగు అను శబ్దము వాడబడినందున పుత్రుడు, భార్య యిల్లేగాక తనకు ప్రీతికరమైన ఏ వ్యక్తి లేక వస్తువునందైననూ ఆ భావము సంభవించవచ్చును. అసక్తి మరియు అనభిష్వంగము, యీ రెండూ గూడ జ్ఞానమును కలిగించు సాధనములే. **అందువలన వీటిని గూడ జ్ఞానమనియే అందురు.**

మరియు నిత్యమూ అనగా స్థిరముగా సమచిత్తత అనగా నిరంతరమైన చిత్తముయొక్క సమానత్వము. దేనియందు యీ సమానత్వము కలిగియుండవలయు నన్నచో – ఇష్టమైన లేక యిష్టము కాకున్న, ప్రియమైనదానియందు అనగా ప్రియాప్రియములు మాటిమాటికి కలుగుచున్ననూ ఆ ప్రియాప్రియములయందు చిత్తము ఎల్లప్పుడూ సమముగానే యుండ వలయును. ఇటువంటి సాధకుడు ప్రియమైనది లభించినప్పుడు పొంగిపోడు మరియు అప్రియమైనది లభించినప్పుడు కోపతాపములు లేక సమచిత్తము కలవాడై యుండును. **అట్టి సమచిత్తత్వము జ్ఞానమనబడును.** మరియు ..........

**13.10. మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ,**
**వివిక్తదేశ సేవిత్వమరతిర్జన సంసది.**

అనగా – ఈశ్వరుడనైన నాయందు అనన్య యోగముతో అనగా ఏకత్వ రూపమైన సమాధి యోగముతో అవ్యచరితమైన భక్తి అనగా ఈశ్వరుడనైన నాయందు అచంచలమైన అనగా ఎడతెగని భావముతో కూడియున్న భక్తి. భగవంతుడైన వాసుదేవునికంటె యితరుడు మరియొకడు ఎవ్వడూ లేడు. అందుచేత ఆతడే మనయందరికి పరమగతి అనగా ఆతడొక్కడే మనకు దిక్కు. అనునటువంటి ఈ విధమైన ఏ స్థిరమైన బుద్ధికలదో, **అదియే అనన్యయోగము.**

అటువంటి స్థిరమైన యోగబుద్ధి కలిగి భజించుచుండుటయే ఎన్నడూ వికారమును చెందనటువంటి భక్తి అయివున్నది. **అటువంటి భక్తిభావము గూడ జ్ఞానముతో సమానమైనదే.**

వివక్త దేశసేవిత్వము – అనగా ఏకాంతమైన పవిత్ర స్థలమునందు వుండి సాధన చేయు స్వభావము. ఏ స్థలము తన స్వభావము చేతనే పవిత్రమైనదైయున్నదో లేక వూడ్చుట, కడుగుట, దులుపుట మొదలగు క్రియల వలన శుద్ధమైయున్నదో మరియు సర్పములు, పులులు మొదలగు క్రూరజంతు రహితమై యున్నదో అట్టి వనము, నదీతీరము లేక దేవాలయము మొదలగు వివిక్త అనగా ఏకాంతమైన ప్రదేశమునందుండి సేవించు స్వభావము ఎవనికి కలదో అటువంటివాడు వివిక్త దేశ సేవి అనబడును. ఆతని భావము వివిక్త దేశ సేవిక్తము అయి వున్నది.

మరియు జనసముదాయమునందు ప్రీతి లేకుండుట. ఇచ్చట వినయ భావము లేనటువంటి, సంస్కార శూన్యమైనటువంటి ప్రాకృత పురుషుల సముదాయము జనసముదాయమని చెప్పబడినది. వినయము గలవారు. సంస్కార సంపన్నులు అయిన మనుష్యుల సముదాయము జనసముదాయము కాదు. ఏలయన ? అటువంటి సముదాయము జ్ఞాన సంపాదనయందు సహాయకారిగా వుండును. అందుచేత **ప్రాకృత జనసముదాయమునందు ప్రీతి లేకుండుట జ్ఞానమునకు సాధనమగుట చేత 'జ్ఞాన' మనబడును.**

మరియు ........

## 13.11. అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థ దర్శనమ్, ఏతజ్జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతో ఽన్యథా.

అనగా – అధ్యాత్మజ్ఞాన నిత్యత్వము అనగా ఆత్మ విషయకమైన జ్ఞానము యొక్క పేరు అధ్యాత్మజ్ఞానము. ఆ జ్ఞానమునందు నిత్యమైన స్థితి కలిగియుండుటను **అధ్యాత్మ జ్ఞాననిత్యము** అని అందురు.

తత్వజ్ఞానము యొక్క అర్థమును విమర్శించుట అనగా విచారించుట, **అనగా** అమానిత్వము మొదలగు జ్ఞాన సాధనముల యొక్క పరిపక్వ భావము వలన కలిగిన**టువంటి** ఏ తత్వజ్ఞానము కలదో దానియొక్క అర్థము సంసారభావము తొలగి మోక్షమును **పొందుట** అను విషయమును గురించి విచారణ చేయుట. అట్లేలయన ? తత్వజ్ఞానము వలన కలుగు ఫలమును గురించి విచారణ చేసినందువలననే మోక్షస్థితిని పొందుటకు అవసరమైన సాధనములయందు ప్రవృత్తి అనగా కోరిక కలుగును.

అమానిత్వము మొదలు తత్వజ్ఞానము యొక్క అర్థమును గురించి చేయు విమర్శ పర్యంతము చెప్పబడిన సమస్తమైన సాధన సముదాయము జ్ఞాన సంపాదనకు సాధనమై యున్నందువలన అది అంతయు 'జ్ఞాన' మనియే చెప్పబడుచున్నది.

పైన చెప్పబడిన జ్ఞానసాధన సముదాయమునకు వ్యతిరేకముగా ఏ మానిత్వము, దంభత్వము, హింస, క్షమయొక్క అభావము, కుటిలత మొదలగు అవగుణ సముదాయము

కలదో అది అంతయు సంసార భావమును కలిగించునదై యున్న కారణముగ దానిని త్యజించుటకు అజ్ఞానమును గురించి తెలుసుకొనుట అవుసరమై యున్నది.

పైన చెప్పబడిన జ్ఞానము ద్వారా తెలియదగినది ఏది ? అను ఆకాంక్ష కలుగుచున్నందున **"జ్ఞేయంయత్తత్"** మొదలగు శ్లోకము చెప్పుచున్నారు. (చూ. గీ.అ. 13.12.)

**పూర్వపక్షము** – అమానిత్వాది గుణములు యమ, నియమములు మొదలగు వాటి ద్వారా జ్ఞేయ వస్తువు తెలియబడజాలదు. ఏలయన ? అమానిత్వాది సద్గుణములు ఎటువంటి వస్తువును తెలియజేయునవిగాను చూడబడలేదు. సర్వత్రా చూడబడుచున్న దేమనగా –

ఏ జ్ఞానము ఏ వస్తువును విషయముగా చేసుకొనునో అదియే దానివలన తెలియబడునదగుచున్నది. ఇతర వస్తు సంబంధమైన జ్ఞానము వలన అన్య వస్తువు అనగా ఆ జ్ఞానమునకు సంబంధించని వస్తువు తెలియబడదు. అదెట్లన ? ఘటవిషయికమైన జ్ఞానము ద్వారా అగ్నివస్తువు తెలియబడదు గదా !

**సమాధానము** – ఇది దోషమనబడదు. ఏలయన ? ఈ అమానిత్వాది సద్గుణములు జ్ఞానసంపాదనకు సాధనములై యున్నందున మరియు ఆ జ్ఞానమును కలిగించుటకు సహాయక సాధనములై యున్నందున జ్ఞానమనబడుచున్నవని మేము యింతకు పూర్వమే చెప్పియున్నాము గదా !

**13.12. జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా ఽమృతమశ్నుతే,**
**అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నా సదుచ్య తే.**

అనగా– ఏది తెలియదగియున్నదో దానిని చక్కగా యథార్థరూపముతో వివరించెదను–

ఈ జ్ఞేయ వస్తువు ఎటువంటి ఫలమును కలిగించునదై యున్నది ? ఈ విషయమునందు శ్రోతకు రుచి కలిగించి తన వైపునకు ఆకర్షింపజేసుకొనుటకు యీ మాట చెప్పుచున్నారు.

**నిజముగా తెలియదగియున్న పరమాత్మ స్వరూపమును తెలుసుకొని మనుష్యుడు అమృతమును అనగా అమరభావమును పొందును. అందుచే ఆతడు మరల మృతుడు కాడు అనగా మరణించడు.**

ఆ జ్ఞేయము అనగా పరమాత్మ అనాది. దేనికి ఆది అనగా ఆరంభము వుండునో అది ఆది అనగా ఆరంభము గలది. దేనికి ఆది అనునది లేదో అది అనాది అనబడును. ఆ అనాది ఏది ? అని అన్నచో అదే పరమ **నిరతిశయబ్రహ్మ అదియే యీ ప్రకరణమునందు జ్ఞేయ పదార్థముగా వర్ణించబడినది.**

ఈ సందర్భమున చాలామంది యీ గ్రంథమునకు టీకాతాత్పర్యములను వ్రాయువారు 'అనాది' అని 'మత్పరం' అని పదవిభజన చేస్తూ వుంటారు. అందులకు వారు చెప్పు కారణమేమన? బహువ్రీహి సమాసము ద్వారా చెప్పబడిన అర్థమునందు 'మతుప్' అను ప్రత్యయము యొక్క ప్రయోగము నిరర్థకమని వారి వాదము కాని అట్లు చెప్పుట సరికాదు.

ఆ టీకాకారులు అలా పదచ్ఛేదము చేసి వేఱు అర్థమును గూడ కల్పించుచున్నారు. అదేమన ? "వాసుదేవ కృష్ణుడనైన నేను దేనికి పరమశక్తినై యున్నానో ఆ జ్ఞేయ పదార్థము మత్పరము అయి వున్నది.

అట్లు చెప్పుట సరే. నిజంగా పైన చెప్పబడిన అర్థము అచ్చట సంభవమైయున్నచో యిలా పరిచ్ఛేదము చేసినట్లయితే పునరుక్తి దోషము నివారింపబడి యుండెడిది. కాని ఆ యర్థము సంభవము కాదు. ఏలయన ? ఇచ్చట బ్రహ్మయొక్క స్వరూపము **"న సత్తన్నాసదుచ్యతే'** ' మొదలగు పదముల ద్వారా సర్వవిధ విశేషణములను నిషేధించట ద్వారా చెప్పుటయే ఆయనకు యిష్టము.

జ్ఞేయ పదార్థమును ఏదో విశిష్టమైన శక్తిగలదిగా చెప్పుట మరల తిరిగి ఆ విశేషణములనన్నింటిని నిషేధించుకొంటూ వెళ్ళడం యిదంతయు పరస్పర విరుద్ధముగా తోచుచున్నది. అందుచేత 'మతుప్' అను ప్రత్యయము యొక్కయు మరియు బహువ్రీహి సమాసము యొక్క సమాన అర్థము కలిగియున్నప్పటికి యిచ్చట కేవలము శ్లోకమును పూరించుట కొఱకు అలా ప్రయోగము చేయబడినది.

అమృతత్వమే ఫలముగా గలిగియున్న జ్ఞేయ పదార్థము యిప్పుడు నాచేత చెప్పబడుచున్నది.

ఆ జ్ఞేయ పదార్థమును సత్తని చెప్పుట కుదరదు. అట్లే అసత్తు అని చెప్పుట గూడ కుదరదు.

**పూర్వపక్షము** – ముందుగా ప్రతిజ్ఞ చేసి అతి గంభీరమైన స్వరముతో "నేను జ్ఞేయ పదార్థమును గురించి చక్కగా తెలియజెప్పెదనని యిప్పుడు "దానిని సత్తనిగాని, అసత్తనిగాని చెప్పుట కుదరదు" అని చెప్పుట ముందు చేసిన ప్రతిజ్ఞకు అనుకూలముగా లేదు.

**సమాధానము** – అట్లుకాదు. భగవంతుడు చెప్పినది. ఆయనగారు చేసిన ప్రతిజ్ఞకు అనుకూలముగనే యున్నది. అదెట్లన ? మాటల ద్వారా చెప్పబడు విషయముకానందున సమస్తమైన **ఉపనిషత్తుల యందును** జ్ఞేయ పదార్థమైన బ్రహ్మతత్త్వము **'అది కాదు అది కాదు' అది స్థూల పదార్థము కాదు. సూక్ష్మపదార్థము గూడకాదు"** అని ఈ విధముగా విశేషముల యొక్క ప్రతి షేధము ద్వారానే చెప్పబడినది. అంతేగాని ఆజ్ఞేయ పదార్థము ఫలానా అనగా అట్లుండును లేక యిట్లుండును అని చెప్పబడలేదు.

**పూర్వపక్షము** – ఏ పదార్థము "అస్తి" అనగా "యిట్లున్నది" అని చెప్పబడదో అది నిజముగా లేనట్లే. ఆజ్ఞేయ పదార్థము 'అస్థి' అనగా "యిట్లున్నది" అను శబ్దము ద్వారా చెప్పబడనిదైయున్నచో అది వాస్తవముగా 'లేనిదే' అని చెప్పవలసి యుండును. అటుపైన "అది జ్ఞేయము" అని చెప్పుట స్వవచన వ్యాఘాతము వంటిది.

**సమాధానము** – "ఆ బ్రహ్మ పదార్థము లేదు" అను మాట నిజముకాదు. ఏలయన? **"అది లేదు" అను జ్ఞానమునకు గూడ అది విషయము కాదు.**

**పూర్వపక్షము** - అన్ని విధములైన జ్ఞానములు అనగా 'జ్ఞాన' మైనా "వున్నది", "లేదు" అను రెండు విధములగు బుద్ధి ద్వారా ఏదో ఒకటి నిర్ణయించబడును. అందుచేత జ్ఞేయము గూడ "వున్నది" అను జ్ఞానమునకో లేక "లేదు" అను జ్ఞానమునకో తెలియబడు విషయమై యుండవలయును.

**సమాధానము** - అట్లనుట సరికాదు. ఏలయన ? **ఆ బ్రహ్మ పదార్థము ఇంద్రియములకు తోచు పదార్థము కానందున రెండు విధములైన బుద్ధికి తోచు విషయము కాకున్నది.**

ఇంద్రియముల ద్వారా తెలియబడు ఘటము, పటము మొదలగు పదార్థములే "వున్నవి" అనిగాని, లేక "లేవు" అనిగాని చెప్పుటకు తగిన జ్ఞానమునకు విషయములై యుండును.

కాని ఈ జ్ఞేయపదార్థము అనగా బ్రహ్మతత్త్వము యింద్రియములకు గోచరించునది కానందున కేవలము ఒక్క శబ్దప్రమాణము ద్వారానే తెలియబడును. అందుచే ఘటాది పదార్థములవలె "ఇది వున్నది" "ఇది లేదు" అను ఈ రెండు విధములైన యింద్రియ జ్ఞానము ద్వారా తోచు విషయము కాకున్నది. ఈ కారణము వలన అది 'సత్' అనిగాని మరియు 'అసత్' అనిగాని చెప్పబడదు.

మీరు చెప్పినట్లుగా అది జ్ఞేయమే అయినను అది 'సత్' పదార్థమని చెప్పబడదు. మరియు అసత్ పదార్థమనియు చెప్పబడదు. అట్లు చెప్పుట విరుద్ధము. మరియు విరుద్ధము కాదు. ఏలయన ఆ పరబ్రహ్మతత్త్వము ఎఱింగినట్లుగాను లేక ఎఱుంగనట్లుగాను లేని పదార్థమై యున్నది. శ్రుతులు యిట్లే చెప్పుచున్నవి.

**పూర్వపక్షము** - మీరు చెప్పిన శ్రుతి. **అన్యదేవ తద్వితాదయో అవిదితాదధి"** కేనోపనిషత్తు 1-3. కూ విరుద్ధమైన అర్థమునే చెప్పుచున్నదేమో ? అనగా యజ్ఞము చేయుట కొఱకు యజ్ఞశాలను నిర్మించి "పరలోకమునందు అది అంతయు వున్నదో లేదో అను విషయము ఎవ్వడెరుంగును" అని చెప్పినట్లుగా ఈ శ్రుతివలె ఆ శ్రుతి గూడ విరుద్ధార్థమునే కలిగి యున్నదేమో?

**సమాధానము** - అట్లుకాదు. ఏలయన ? తెలిసినదానివలె మరియు తెలియనిదానివలె విలక్షణత్వమును ప్రతిపాదించు ఈ శ్రుతి నిస్సందేహముగా, తప్పనిసరిగా జ్ఞేయ పదార్థము కలిగియుండుటను ప్రతిపాదించునదై యున్నది. మరియు "ఇదంతయు పరలోకమునందున్నదో లేదో" యను మొదలగు శ్రుతి వాక్యములు విధిని అంతము చేయు అర్థవాతమై యున్నది. అందుచేత దానితో యిది సమానము కాజాలదు.

యుక్తి ననుసరించి గూడ యీ విషయము సిద్ధించుచున్నది. అదేమన ? బ్రహ్మ పదార్థము సత్తు. అసత్తు మొదలగు శబ్దముల ద్వారా చెప్పబడదు. ఏలయన ? **అర్థమును ప్రకాశింపజేయుటకు వక్తద్వారా చెప్పబడు మరియు శ్రోత ద్వారా వినబడు శబ్దములన్నియు జాతి, క్రియ, గుణము మరియు సంబంధము ద్వారా సంకేతమును గ్రహింపజేసియే అర్థ**

ప్రతీతిని కలిగించును. మరో విధముగా మాత్రము కాదు. కారణమేమన ? అన్య విధముగా అర్థప్రతీతి కలుగుట చూడబడుటలేదు. అదెట్లన ? ఆవు లేక అశ్వము జాతిద్వారానూ, వండుట లేక పఠించుట క్రియద్వారాను, తెలుపు లేక నలుపు అనునది గుణశబ్దము ద్వారానూ మరియు ధనవంతుడు లేక గో సంపన్నుడు యిది సంబంధమును తెలుపు శబ్దము ద్వారానూ తెలియబడుచున్నవి. ఈ విధముగానే అన్నివిధములగు విషయముల జ్ఞానము కలుగుచున్నది.

**కాని బ్రహ్మపదార్థము ఏదో ఒక జాతికి సంబంధించినది కాదు.** అందుచేత 'సత్' మొదలగు శబ్దముల ద్వారా చెప్పబడదు. **బ్రహ్మ పదార్థము నిర్గుణము అయి వున్నందున అది గుణము కలదిగూడ కాదు.** అందువలన అది గుణవాచక శబ్దముల ద్వారా గూడా చెప్పబడదు. మరియు ఆ బ్రహ్మ పదార్థము **క్రియారహితమైనదైనందున** క్రియావాచక శబ్దముల ద్వారా గూడ చెప్పనలవిగాదు. "బ్రహ్మ కళారహితము, క్రియారహితము మరియు శాంతమైనది" **(నిష్కలం, నిష్క్రియం శాంతమ్"** శ్వేతాపనిషత్తు ఉ. 6–19) అను శ్రుతిద్వారా గూడ పై మాటే ఋజువగుచున్నది.

**మరియు ఆ బ్రహ్మము ఏకము అనగా రెండవది లేనిది, అనగా ఒక్కటే అయినందున, అద్వితీయము.** ఇంద్రియములకు విషయమైనది కానందున మరియు అది ఆత్మరూపమై యున్నందున దేనితోడను ఎటువంటి సంబంధము కలిగియున్నది కాదు. అందుచేత బ్రహ్మ **ఎటువంటి శబ్దము ద్వారానూ చెప్పబడదని చెప్పుట సహేతుకమే అయి వున్నది.** "ఎచ్చట వాక్కు నిశ్శబ్దమగునో (**"యతోవాచో నివర్తంతే"** తైత్త. 2.–4.9) మొదలగు శ్రుతులు గూడ పై మాటనే ఋజువు చేయుచున్నవి.

ఆ జ్ఞేయ పదార్థము 'సత్' శబ్దము ద్వారా కలుగు ప్రతీతికి విషయము కాదు. అందువలన జ్ఞేయ పదార్థము అసలు లేనేలేదను ఆశంక కలుగుచున్నందున ఆ శంకను నివృత్తింపజేయుట కొఱకు సమస్త ప్రాణులను యింద్రియాదులైన ఉపాధుల ద్వారా ఆ జ్ఞేయము యొక్క ఉనికిని ప్రతిపాదించుటకై చెప్పుచున్నారు.

**13.13. సర్వతః పాణిపాదం తత్సర్వతో ఽక్షి శిరోముఖమ్,**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.**

అనగా – ఆ జ్ఞేయ పదార్థము సర్వవ్యాపకమై యున్నది. అనగా అది లేనిచోటు లేదు. (ఇందుగల దందు లేదను సందేహమువలదు)

సర్వవిధ ప్రాణులయొక్క యింద్రియముల రూపమున వున్న ఉపాధుల ద్వారా క్షేత్రజ్ఞుని యొక్క వునికి ప్రకటితమగుచున్నది, **క్షేత్రరూపమైన ఉపాధుల కారణముగానే అజ్ఞేయము క్షేత్రజ్ఞుడు అనబడుచున్నది.** క్షేత్రరూపమైన ఉపాధులు చేతులు, కాళ్ళు మొదలగు భిన్నత్వముచేత అనేక విధములుగా విభజింపబడుచున్నవి.

వాస్తవముగా విచారించి చూచిన ఉపాధుల భేదము చేత తోచుచున్న ఉపాధి భేదములన్నియు క్షేత్రజ్ఞునియందు లేనివే అగుచున్నవి. అందువలన "ఆ భేదములన్నింటిని తొలగించి చూడగా జ్ఞేయ పదార్థము యొక్క స్వరూపము" దానిని 'సత్' పదార్థమని చెప్పజాలము. అట్లే ఆ జ్ఞేయ పదార్థమును "అసత్" అని గూడ చెప్పజాలము" అని చెప్పబడినది.

మరియు జ్ఞేయ పదార్థము యొక్క ఉనికిని తెలుపుటకొఱకు ఉపాధుల ద్వారా కల్పించబడిన మిథ్యారూపము గూడ దానియొక్క ధర్మమువలెనే కల్పించి అది 'సర్వవ్యాపకమైనది' అను మొదలగు పద్ధతుల ద్వారా చెప్పబడుచున్నది.

సాంప్రదాయిక పరంపరను చక్కగా ఎఱింగినవారు గూడ యిట్లే చెప్పుచున్నారు. అదెట్లన ? అధ్యారోపణము మరియు అపవాదము అనగా శాస్త్రమునకు గూడ అతీతమైన ప్రపంచమే లేనటువంటి పరమాత్మ తత్వము వ్యాఖ్యానించబడుచున్నది.

సర్వత్ర అనగా సర్వదేహములయందు అంగరూపముగా వుండియున్న చేతులు, కాళ్ళు మొదలగు **యింద్రియములు జ్ఞేయశక్తి యొక్క బలము వలననే తమ తమ కార్యములు చేయుచుండు సామర్థ్యము కలిగియున్నవి.** అందువలన యివి అన్నియు జ్ఞేయ పదార్థము యొక్క శక్తికి చిహ్నములుగా వున్నందుననే ఉపచారముగా అనగా వ్యావహారిక స్థితియందు జ్ఞేయపదార్థము యొక్క ధర్మములే యని చెప్పబడుచున్నవి. ఈ విధముగానే అన్నింటిని వ్యాఖ్యానించుకొనవచ్చును.

ఆ జ్ఞేయ పదార్థము సర్వవ్యాపకమైయున్నందున మరియు అన్నివైపులకు ముఖము (నోరు) తల, కన్నులు కలిగియున్నదై యున్నందున మరియు అది అనగా ఆజ్ఞేయ పదార్థము అన్ని దిక్కులకు చెవులు కలిగివున్నదై యున్నది. దేనికి శ్రుతి అనగా శ్రవణేంద్రియములు అనగా చెవ్వులు కలవో దానిని **"శ్రుతిమత్"** (చెవ్వుల కలది) అని చెప్పుదురు. **ఈ లోకమునందు అనగా సమస్త రూపములు కలిగియున్న ప్రాణి సముదాయమునందు అది వ్యాపించి; నిండియున్నది.**

ఉపాధి రూపములైన చేతులు, కాళ్ళు మొదలగు యింద్రియముల అధ్యారోపణము వలన, అనగా భ్రాంతిచే కల్పించబడినందున జ్ఞేయపదార్థము ఆ యా ఉపాధులనన్నింటిని కలిగియున్నదని ఎవ్వరునూ శంకించరాదు. ఆ అభిప్రాయమును కలిగియుండి యీ క్రింది శ్లోకము చెప్పుచున్నారు -

**13.14. సర్వేంద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితమ్,**
**అసక్తం సర్వ భృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ.**

అనగా - ఆ జ్ఞేయము సమస్తమైన యింద్రియముల యొక్క గుణముల ద్వారా ప్రకటింపబడుచున్నది. ఇచ్చ శ్రోత్రాది (చెవ్వులు మొదలగు) జ్ఞానేంద్రియములు, వాక్కు మొదలగు కర్మేంద్రియములు మరియు మనస్సు మరియు బుద్ధి ఈ రెండు అంతఃకరణములు -

...టనన్నింటిని సర్వేంద్రియములు అని గ్రహించుదురు. అట్లేలయన ? అంతఃకరణము గూ... జ్ఞేయము యొక్క ఉపాధి రూపముగా అన్య యింద్రియములవంటిదే అయి వున్నది. పై... శ్రోత్రాదులకు గూడ ఉపాధిత్వము అంతఃకరణరూపమైన ఉపాధి ద్వారానే కలుగుచున్నది.

అందుచేత నిర్ణయమేమన ? ఉపాధుల రూపముగాయున్న అంతఃకరణము మరియ... శ్రోత్రాది బాహ్యాకరణములు మొదలగు ఈ సర్వేంద్రియముల యొక్క గుణములు అన... ...శ్చయము, సంకల్పము, శ్రవణము మరియు భాషణము మొదలగునవి అయి వున్న... ...టిద్వారానే ఆ జ్ఞేయము భాసించుచున్నది. అనగా ఆ యింద్రియములచేత చేయబ... క్రియలద్వారా అది క్రియావంతునిగా అనగా కర్మలు చేయునదిగా తోచుచున్నది.

"ధ్యానము చేయుచున్నట్లుగా, కర్మలు చేయుచున్నట్లుగా" ("ధ్యాయతీవ, లే... ...యతీవ" బృ.ఉ. 4.3.7) అను ఈ శ్రుతివాక్యము ద్వారా గూడ పై మాటే (నిర్ణయమే... సిద్ధించుచున్నది.

అయితే మరి అజ్ఞేయమనే పదార్థము స్వయముగా క్రియలు చేయునదిగా ఏ... చెప్పబడుట లేదు ? అన్నచో -

ఆ జ్ఞేయము ఎటువంటి యింద్రియములు లేనిది. అనగా సర్వవిధ కరణములు... కర్మలు చేయు సాధనములు - లేనిది. అందుచేత అది యింద్రియముల యొక్క వ్యాపారము... వలన వ్యాపారము (కర్మలు) చేయునది కాదు.

"అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః సశృణో త్యకర్ణః" చూ. శ్వేతా 3.1... అనగా "కాళ్ళు లేకుండ మరియు చేతులు లేకుండ నడుస్తూ గ్రహించుచూ వుండును. కన్ను... లేకుండానే చూచుచూ మరియు చెవ్వులు లేకుండగనే వినుచుండును" ఆ విధముగా... అభిప్రాయమును తెలుపుట కొఱకు ఆ జ్ఞేయము సమస్తమైన యింద్రియ రూపములైన ఉపాధు... యొక్క గుణముల కనుకూలముగా గ్రహించగల సామర్థ్యము కలిగియున్నది. దానిని సాక్షాత్తు... అనగా ప్రత్యక్షముగా గమనాది క్రియలతో కూడియున్నట్లుగా చెప్పుట కొఱకు ఈ మంత్రవ... చెప్పబడియుండలేదు.

"అంధో మణిమవిందత" తైత్త ఆ.1.11" "అనగా గ్రుడ్డివాడు మణిని పొందెన... మొదలగు మంత్రముల యొక్క అర్థము వలెనే ఆ మంత్రమునకు గూడ అర్థము... గ్రహించనగును.

ఆ జ్ఞేయ పదార్థము సమస్తమైన యింద్రియములు లేనిది. అందుచేత సం... రహితమైనది. అనగా దేనితోడను దానికి ఎటువంటి సంబంధములు కలుగజాలవు.

అలా అయినప్పటికి ఆ జ్ఞేయ పదార్థము అన్నింటిని అందరిని ధరించియే వుంటుం... సత్బుద్ధి సర్వవ్యాపకమై యున్నది. అందుచేత సత్తే అన్నింటికి అధిష్ఠానముగా అన...

మూలాధారముగా వుంటుంది. మృగతృష్ణ మొదలగు మిథ్యా పదార్థములు గూడ అధిష్ఠానము లేకుండ నిలువజాలవు అనగా కల్పించబడవు. కావున ఆ **జ్ఞేయ పదార్థము సర్వమునకు మూలాదారమై సర్వమును ధరించుచున్నది.**

ఆ జ్ఞేయము యొక్క సత్తను ప్రకటించునది యిది రెండవ సాధనమై యున్నది. ఆ జ్ఞేయము నిర్గుణమై సత్వ, రజ మరియు తమము అను ఈ మూడు గుణములకు అతీతముగా యున్నది. అలా అయివుండి గూడ ఆ జ్ఞేయము ఆ గుణములకు భోక్త అయి వున్నది. అనగా ఆ జ్ఞేయము సుఖము, దుఃఖము మరియు మోహము మొదలగు రూపములుగా పరిణమించియున్న మూడు గుణములకు శబ్దాదుల ద్వారా భోగించునది అనగా వాటిని పొందునదై యున్నది.

మరియు -

**13.15. బహిరంతశ్చ భూతానామచరం చరమేవ చ,**
**సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్.**

అనగా - అవిద్య ద్వారా ఆత్మభావముతో కల్పించబడిన శరీరమును చర్మపర్యంతము హద్దుగా తలంచి దాని సహాయముచేతనే జ్ఞేయమును దానికంటె బయటగా వున్నట్లు చెప్పుదురు. అదే విధముగా అంతరాత్మను లక్ష్యముగా తలంచి మరియు శరీరమును హద్దుగా ఒప్పుకొని జ్ఞేయమును దానిలోపల వ్యాపించియున్నట్లుగా చెప్పుదురు.

"బయట లోపల వ్యాపించియున్నది" అని చెప్పినందువలన మధ్యభాగము నందు దాని లేమి ప్రకటితమగుచున్నది. అందుచేత వారు చెప్పునదేమన - **చరము అచరము రెండూ అదియే (జ్ఞేయ పదార్థమే)** అయి వున్నది.

అనగా రజ్జువునందలి సర్పమువలె తోచునటువంటి చర అచర రూపమైన శరీరాభాసములన్నియు ఆ జ్ఞేయ పదార్థము యొక్క స్వరూపములే.

మరి చర అచర రూపమున సమస్త వ్యవహారమునకు విషయము ఆ జ్ఞేయ (పరమాత్మ) మే అయి వుండగా మరల అది యిది అయి వున్నది. అనునట్లుగా అందరిచేత ఎందుకు తెలియబడుట లేదు ? అని అన్నచో -

నిజమే. మనకు తోచు దృశ్యమంతయు దానియొక్క స్వరూపమే అయినప్పటికి ఆ జ్ఞేయ పదార్థము ఆకాశమువలె అతి సూక్ష్మమై యున్నది. అది ఆత్మరూపమున జ్ఞేయమై యున్నప్పటికి అత్యంత సూక్ష్మము అయివున్నందున అజ్ఞానులందరికి **అవిజ్ఞేయముగానే వుంటుంది.**

కాని జ్ఞానవంతులైన పురుషులకు **మాత్రమే వున్నదంతయు ఆత్మగానే తోచుచుండును. అది అంతయు బ్రహ్మమే.**

"ఆత్మై వేదం సర్వం", ఛాం 7.25.2 "బ్రహ్మైవేదం సర్వం" బృ 2.5.1 మొదలగు
ాణములు ద్వారా అది అనగా ఆ జ్ఞేయ పదార్థము సర్వకాల సర్వావస్థలయందును
క్షముగనే వుండును.

ఆ జ్ఞేయము అజ్ఞాతముగా అనగా తెలియబడకుండా వున్న కారణముగ మరియు
ోట్ల సంవత్సరముల వరకు కూడ ప్రాప్తించకపోవడం వలన అజ్ఞానులకు బహు దూరముగా
ియున్నది. కాని జ్ఞానులకు మాత్రము అది వారి ఆత్మయే అయి వున్నది. అందువలన
కి అత్యంత సమీపముననే వుండియున్నది.

మరియు –

**16. అవిభక్తం చ భూతేషు విభక్త మివ చ స్థితమ్,**
**భూతభర్తృ చ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ.**

అనగా – ఆ జ్ఞేయము ప్రతి దేహమునందును ఆకాశమువలె అవిభక్తమై అనగా
ింపబడకయే ఏకమై వ్యాపించియున్నది. అయినప్పటికి గూడ అన్ని ప్రాణులయందును
ింపబడినదానివలె నిండియున్నది. అట్లేలయన ? దానియొక్క వునికి శరీరములయందే
ుబడుచున్నది. (విద్యోతింతువు శుద్ధబుద్ధి గుహలన్).

మరియు ఆ జ్ఞేయ పదార్థము దేహములయందు వ్యాపించియున్న కాలమందు
తభర్తృ అనగా భూతములను ధరించునది మరియు పోషించునది అయి వుండి ప్రళయ
మునందు గ్రసిష్ణు అనగా సర్వమును తనయందు లీనము చేసుకొనునది మరియు
త్తికాలమందు ప్రభవిష్ణు అనగా సర్వమును కల్పించునది అయి వున్నది. అదెట్లన ?
ైన కల్పితమైన రజ్జువునందు సర్పమువలె కల్పించుచుండును.

జ్ఞేయపదార్థము సర్వవ్యాపకమై యుండియు లోకులకు ప్రత్యక్షమగుట లేదు. అయితే
అంధకార రూపమున వున్నదా ? లేదు. అయితే మరి అది ఎట్లున్నది ? అన్నచో –

**17. జ్యోతిషామపి తజ్జ్యోతి స్తమసః పరముచ్యతే,**
**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్.**

అనగా – ఆ జ్ఞేయము అనగా పరమాత్మ సూర్యుడు మొదలగు సమస్తమైన వెలుగు
పములకు గూడ వెలుగు నిచ్చునదై యున్నది. ఏలయన ? ఆత్మ చైతన్యము యొక్క ప్రకాశముచే
ప్యమానమై ఈ సూర్యుడు మొదలగు సమస్తమైన జ్యోతిపదార్థములు ప్రకాశించుచున్నవి

ఏ వెలుగు రూపమువలన ప్రకాశవంతమై సూర్యుడు వెలుంగుచున్నాడో ఆ వెలుగు
నే యిదంతయూ ప్రకాశింపబడుచున్నది. (చూ – "యేన సూర్యస్తపతి తేజసేద్ధః తస్యభాసా
్యమిదం విభాతి" శ్వేతా ఉ. 6–14) మొదలగు శ్రుతి ప్రమాణముల ద్వారా మరియు
ప్పుటనే చెప్పుబడిన "యదాదిత్యగతం తేజః" మొదలగు స్మృతి వాక్యముల ద్వారా గూడ
చెప్పిన విషయమే సిద్ధించుచున్నది.

మరియు ఆ జ్ఞేయము అంధకారముకంటె, అజ్ఞానము కంటె ఆవల అనగా చెప్ప రానిదిగా అనగా తెలియరానిదిగా చెప్పబడుచున్నది.

**"జ్ఞానాదుల సంపాదన అతి కష్టసాధ్యమైన పని"** అని తలంచుబుద్ధిగల వారిని నిరాశ జెందియున్నవారిని ఉత్సాహపరచుట కొఱకు చెప్పుచున్నారు.

జ్ఞానము అనగా అమానిత్వము మొదలగు జ్ఞాన సాధనములు జ్ఞేయము అనగా **"జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి"** మొదలగు వాక్యముల ద్వారా చెప్పబడిన పరమాత్మ యొక్క స్వరూపము మరియు జ్ఞాన గమ్యము అయిన జ్ఞేయమే ఎఱుంగబడిన తరువాత జ్ఞానఫలము అయినందున జ్ఞానగమ్యమని చెప్పబడుచున్నది. మరియు అది ఎప్పుడు **తెలుసుకొనబడునో ఆ అవస్థ అనగా ఆ స్థితియందు జ్ఞేయమని చెప్పబడుచున్నది.**

ఈ మూడు కూడ సమస్తమైన ప్రాణులయొక్క అంతఃకరణములయందు విశేష రూపముగా వుండియున్నవి. అట్లేలయన ? ఈ మూడు గూడ అచ్చటనే ప్రకాశించుచున్నవి.

పైన చెప్పబడిన అర్థమంతటిని ఉపసంహరించుటకొఱకు ఈ శ్లోకము చెప్పబడుచున్నది.

**13.18. ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః,**
**మద్భక్త యతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే.**

అనగా – ఈ విధముగా యిది మహాభూతములు మొదలు ధృతి పర్యంతము జ్ఞేయము యొక్క స్వరూపము. 'అమానిత్వము' మొదలగువాని మొదలుకొని **"తత్వజ్ఞానార్థ దర్శనము"** వరకు జ్ఞానము యొక్క స్వరూపము మరియు **"జ్ఞేయయత్తత్"** మొదలుకొని **'తమసః పరముచ్యతే'** వరకు జ్ఞేయము యొక్క స్వరూపము సంక్షిప్తముగా చెప్పబడినది.

ఇదంతయూ వేదముల యొక్కయు మరియు గీతయొక్కయు అర్థముల నన్నింటిని సంగ్రహించి చెప్పబడినది. ఇటువంటి యథార్థమైన జ్ఞానమునకు అధికారి ఎవడు ? అన్నచో చెప్పబడుచున్నది –

నా భక్తుడు అనగా సర్వజ్ఞుడు పరమ గురువు వాసుదేవ పరమేశ్వరుడనైన నాయందు తన సమస్త భావములను అర్పించినవాడు అట్టి జ్ఞానమునకు అధికారి. ఏ వస్తువుని చూచినా, దేనిని గురించి వినినా, ఏ వస్తువును తాకినా **వాటన్నింటియందు "నిండియున్నది భగవంతుడైన ఆ వాసుదేవుడే"** అని తలంచు నిశ్చితబుద్ధి గల ఏ భక్తుడు కలడో ఆతడే యిట్టి జ్ఞానమునకు అధికారి.

ఈ పైన చెప్పబడిన యథార్థ జ్ఞానమును పొంది నా భావమును అనగా నాయొక్క పరమాత్మ భావమును పొందుటకు సమర్థుడగును. అనగా మోక్షస్థితిని పొందును.

ఏడవ అధ్యాయమునందు ఈశ్వరునియొక్క క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని రూపములైన అపరా మరియు పరా అను రెండు ప్రకృతులు చెప్పబడినవి. దానితోపాటుగా యీ రెండు

ప్రకృతులు సమస్త ప్రాణులయొక్క స్థితిలయములకు కారణములు అని గూడ చెప్పబడినది. ఇప్పుడు యిచ్చట ఆ **క్షేత్రము మరియు క్షేత్రజ్ఞ రూపము** యీ రెండు ప్రకృతులు సర్వభూతముల యొక్క స్థితి లయములకు ఎట్లు కారణమగుచున్నవో చెప్పబడుచున్నది.

## 13.19. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి,
## వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్.

అనగా – ఈశ్వరునకు రెండు ప్రకృతులు కలవు (**ప్రకృతి అనగా స్వభావము**) ఒకటి ప్రకృతి రెండు పురుషుడు. అవి రెండు అనాదులు అనగా ఆరంభము లేనివి అని **ఎఱుంగవలయును**. దేనికి ఆరంభమనునది వుండదో దానిని 'అనాది' అని యందురు.

ఈశ్వరుడు నిత్యుడు అనగా ఆది యంతములు లేనివాడు. ఆ కారణముచేత ఆ రెండు ప్రకృతులకు గూడ నిత్యత్వము ప్రాప్తించుచున్నది. అట్లేలయన ? **ఈ రెండు ప్రకృతులు కలిగియుండుటయే ఈశ్వరుని యొక్క ఈశ్వరత్వము.**

ఈ రెండు ప్రకృతుల ద్వారానే ఈశ్వరుడు జగత్తు యొక్క ఉత్పత్తి స్థితి మరియు ప్రళయములను కారణమగుచున్నాడు. **అనాది సిద్ధులైన ఆ రెండు ప్రకృతులు అనగా ఈశ్వరుని పురుష ప్రకృతి మరియు స్త్రీ ప్రకృతులులే సంసారమునకు అనగా ప్రపంచమునకు కారణములు.**

కొంతమంది టీకాకారులు దేనికి ఆది అనగా ఆరంభము లేదో అవన్నియు అనాదులు అని చెప్పుదురు. ఆ విధముగా వారు అచ్చట తత్పురుష సమాసమును చెప్పుచున్నారు. అందువలన ఈశ్వరుడే జగత్తుయొక్క జన్మస్థితి లయములకు కారణమగుచున్నారు. ప్రకృతిని పురుషుని నిత్యములని అంగీకరించిన యెడల ప్రపంచము వాటిద్వారానే కల్పించబడుచున్నదని ఒప్పుకొనవలసి వచ్చును. అప్పుడు ఈశ్వరుడు జగత్తునకు కర్త కానేరదు.

కాని అలా అంగీకరించుట సరికాదు. ఏలయన ? పురుషుని ప్రకృతిని నిత్యము లైనవిగా అంగీకరించనిచో ప్రకృతి మరియు పురుషుని యొక్క **ఉత్పత్తికి పూర్వము శాసించు** యోగ్యత గల వస్తువు లేనందున **ఈశ్వరునియందు అనశ్వరత్వ భావము సంభవించును.**

మరియు అప్పుడు ఎటువంటి కారణపదార్థము లేకుండగనే ప్రపంచము **కలిగినదని** అంగీకరించవలసి వచ్చును. అలా అంగీకరించినందువలన అప్పుడు ఆ ప్రపంచమునకు అంతము లేదను భావము, శాస్త్రము నిరుపయోగమను భావము మరియు బంధ – మోక్షములు లేవనుభావము స్థిరపడును. ఈ కారణముచేత ఆ టీకాకారులు చెప్పు విధానము సరికాదని చెప్పుచున్నాము.

కాని ఈశ్వరునకు సంబంధించిన ఆ రెండు ప్రకృతులను నిత్యమైనవిగా అంగీకరించిన యెడల ఈ వ్యవస్థ అంతయు సక్రమేనని ఋజువగును.

అది ఎట్లన్నచో – **వికారములను మరియు గుణములను ప్రకృతి నుండి కలిగినవిగా ఎఱుంగుము** అనగా బుద్ధి మొదలు దేహము మరియు ఇంద్రియముల వరకు యింకా ముందు

శ్లోకమునందు చెప్పబడియున్న వికారములను మరియు సుఖదుఃఖములు మరియు మోహము మొదలగు వృత్తుల రూపమున పరిణమించిన సత్వరజ తమోగుణములను ప్రకృతినుండి ఉత్పన్నమైనవిగా నీవు తెలిసికొనుము.

సారాంశమేమన ? **వికారములకు కారణరూపమైన ఈశ్వరుని యొక్క త్రిగుణాత్మకమైన మాయాశక్తి (కలదు) వున్నది. దానినే ప్రకృతి అని అంటారు.** అది ఎటువంటి వికారములను మరియు గుణములను కలిగించునదైయున్నదో ఆ వికారములను మరియు గుణములను నీవు ప్రకృతి జనితములు అనగా ప్రకృతి నుండి పుట్టినవి అనగా ప్రకృతియొక్క పరిణామ రూపములే యని తెలుసుకొనుము.

ప్రకృతినుండి ఉత్పన్నమైన ఈ వికారములు మరియు గుణములు ఎట్లుండును ? అన్నచో -

**13.20. కార్యకారణ కర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే,**
**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే.**

అనగా – శరీరమును 'కార్యము' అని అంటారు. మరియు ఆ శరీరమును ఆశ్రయించు కొని లోపలవున్న మనస్సు, బుద్ధి, అహంకారము మరియు పది యింద్రియములు (కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు) యీ పదమూడు ఆ కార్యమునకు కారణములు. **వీటన్నింటికి కర్తగా వుండునది హేతు ప్రకృతి.**

**శరీరాదులను కలిగించు - కల్పించునవి - పంచభూతములు** మరియు **శబ్దము మొదలగు అయిదు విషయములు.** ఇవి యింతకు పూర్వము చెప్పబడినటువంటి ప్రకృతి జన్యములైన పది వికారములు యిచ్చట కార్యమును గ్రహించు కారణముగ గ్రహించుబడుచున్నవి. మరియు సుఖదుఃఖములు మరియు మోహము మొదలగువాటి రూపమున పరిణమించుచున్న ప్రకృతి జన్యములైన సమస్త గుణములు, బుద్ధి మొదలగు కారణములను ఆశ్రయించియుండుట వలన కారణములుగా అంగీకరించబడుచున్నవి.

ఆ కార్యములకు మరియు కారణములకు కర్తగా యున్నది. అనగా వాటిని కలిగించు భావమును కార్య-కరణ, కర్తృత్వమందురు. ఆ కార్యకరణముల యొక్క కర్తృత్వమునందు ఆరంభించునది అగుట వలన ప్రకృతి కారణమనబడుచున్నది. ఈ విధముగా కార్యకరణములను కలిగించునది - పుట్టించునది - అయినందున **ప్రకృతియే యీ ప్రపంచమునక కారణమై యున్నది.**

"కార్యకారణ కర్తృత్వే" అను పాఠభేదమును అంగీకరించినచో కూడ "దేనియొక్క పరిణామమో అది దానియొక్క కార్యము అనగా వికారమై యున్నది. మరియు కారణము - వికారము - వికృతమగునదై యున్నది" అను అర్థమే వచ్చును. ఆ వికారమును చెందు మరియు వికారరూపమైన కారణము మరియు కార్యములను కలిగించుటకు ప్రకృతి హేతువై యున్నది.

అట్లుగాకున్న పదహారు వికారములు కార్యములు మరియు ఏడు ప్రకృతి - వికృతులు కారణములై యున్నవి. ఈ విధముగా యీ యిరువది మూడు తత్త్వములే కార్యకారణములుగా చెప్పబడుచున్నవి. వీటన్నింటికి కర్తృత్వమునందు ఆరంభము నుండియే ప్రకృతి హేతువుగా కర్తగా చెప్పబడుచున్నది.

పురుషుడు గూడ ఏ విధముగా ప్రపంచమునకు కారణమగుచున్నాడు ? అన్నచో -

**పురుషుడు అనగా జీవుడు, క్షేత్రజ్ఞుడు, భోక్త మొదలగునవన్నియు ఆ పురుషునకు పర్యాయపదములే.** ఆతడు సుఖము - దుఃఖము మొదలగు భోగముల యొక్క భోక్తృత్వమునందు అనగా వాటిని అనుభవించుటయందు కారకుడు అనగా హేతువుగా చెప్పబడుచున్నాడు.

**పూర్వపక్షము** - కాని యీ కార్య-కరణముల కర్తృత్వము వలన మరియు సుఖ-దుఃఖముల యొక్క భోక్తృత్వము కారణముగ ప్రకృతిని మరియు పురుషుడు యిరువురను యీ సంసారమునకు కారణములు - కారకులు - అని ఎట్లు చెప్పబడును ?

**సమాధానము** - కార్య-కరణములు మరియు సుఖ-దుఃఖాదిరూపములైన హేతువు మరియు ఫలముయొక్క ఆకారమునందు ప్రకృతియందు ఎటువంటి పరిణామము జరగకుండుట వలన మరియు చైతన్యమును కలిగియున్న పురుషుని యందు వాటన్నింటియొక్క భోక్తృత్వము లేకుండిన సంసారము ఎట్లు సిద్ధించును ? ఎప్పుడైతే కార్య-కరణ రూపమైన హేతువు మరియు ఫలాకారముగా పరిణమించియున్న భోగ్యరూపము కలిగియున్న ప్రకృతితో దానికంటె విపరీత ధర్మము కలిగియున్న పురుషునియొక్క భోక్తాభావము వలన అవిద్యారూపమైన సంయోగము జరుగును. అట్లు జరిగినప్పుడే సంసారము తోచును అనగా రూపమును దాల్చును.

అందుచేత ప్రకృతియొక్క కార్యకరణ విషయ సంబంధమైన కర్తృత్వము మరియు పురుషుని యొక్క సుఖ-దుఃఖ విషయికమైన భోక్తృత్వమును కలిపి ఆ రెంటియొక్క సంసారమునకు కారణత్వము ప్రతిపాదించబడినది. ఇది సహేతుకముగనే యున్నది గదా ?

**పూర్వపక్షము** - అయితే యీ సంసారమనబడు వస్తువు ఎటువంటిదై యున్నది ?

**సమాధానము - సుఖదుఃఖముల భోగమే సంసారము.** మరియు పురుషుని యందు సుఖ-దుఃఖరూపమైన ఏ భోక్తృత్వము కలదో అదియే ఆతని సంసారిత్వమై యున్నది.

"సుఖదుఃఖముల యొక్క భోక్తృత్వమే పురుషునియొక్క సంసారిత్వమై యున్నదని" మీరు చెప్పినది. ఆతనియందు ఏ కారణముచేత కలుగుచున్నది ? అని అన్నచో -

**13.21. పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్గుణాన్,**
**కారణం గుణసంగ్గో ఽస్య సదసద్యోని జన్మసు.**

అనగా - ఏలయన ? **పురుషుడు అనగా జీవాత్మ** ప్రకృతియందు వునికి కలిగి యున్నాడు అనగా కార్యము మరియు కరణరూపమున పరిణమించియున్న అవిద్యయే రూపముగా కలిగియున్న ప్రకృతియందు వుండియున్నాడు. ప్రకృతినే తన స్వరూపముగా తలంచుచున్నాడు.

అందుచేత ఆతడు ప్రకృతియందు కలుగుచున్న సుఖ-దుఃఖములను మరియు మోహామే కారణముగ జనించిన గుణములను - "నేను సుఖవంతుడను" "నేను దుఃఖవంతుడను" "మూఢుడను" "పండితుడను" అని ఈ విధముగా తలంచుచూ వాటినన్నింటిని అనుభవించు చున్నాడు.

**ఆతని జన్మకు కారణము అవిద్యయే అయి వున్నప్పటికి** భోగింపబడుచున్న సుఖ-దుఃఖములు మరియు మోహరూపమున వున్న గుణములయందు ఆసక్తుడైయున్నందున, తద్రూపమే చెందియున్న ఆతడు **జన్మరూపమున వున్న** సంసారమునకు ప్రధాన **కారణమై యున్నాడు. "ఆతడు ఎటువంటి కోరికలు గలవాడుగా వుండునో అటువంటి కర్మలనే చేయుచుండును"** చూ.

**"స యథాకామోభవతి తత్క్రతుర్భవతి"** బృహ.ఉ. 4-45 అను ఈ శ్రుతి వాక్యము ద్వారా గూడ ఈ విషయమే ఋజువగుచున్నది.

గుణములతో తాదాత్మ్యమును చెందుట చేతనే అనగా గుణములయందు ఆసక్తి కలిగియుండుట చేతనే భోక్తయైన ఈ పురుషునకు మంచి చెడ్డ యోనులయందు జన్మించుటకు అనగా శరీరములను పొందుటకు కారణమగుచున్నదని భగవంతుడు చెప్పుచున్నాడు.

మంచి-చెడ్డ యోనులనగా 'సదసత్' యోనులని అర్థము. వాటియందు జన్మించుట అనగా వాటియందుండి తదనురూపమైన శరీరములను పొందుట "సదసద్యోనిజన్మ" మనబడుచున్నది. ఈ **భోగ్యోపయోగమైన** సదసద్యోని **జన్మలకు కారణము గుణములతో తాదాత్మ్యమును పొందుటయే.**

మరో విధముగా చెప్పవలయునన్నచో - సంసార పదమును తొలగించి యీ క్రింది విధముగా చెప్పుకొనవచ్చును - అదెట్లన - మంచి లేక హీనయోనుల యందు జన్మించి **అనగా స్థూలదేహాదులను పొందిన జీవుడు గుణములతో తాదాత్మ్యమును పొందుటయే ఈ సంసారమునకు కారణము.**

దేహాది యోనులు 'సత్' అనగా శ్రేష్ఠమైన యోనులు. మరియు పశువుల మొదలగు యోనులు అసత్ అనగా హీనమైన యోనులు. ఈ ప్రకరణ సామర్థ్యము ననుసరించి మనుష్య యోనులను గూడ సత్ - అసత్ యోనులుగా విభజించి తెలియుట యందు ఎటువంటి అభ్యంతరము వుండనక్కరలేదు.

అలా చెప్పుటకు కారణమేమన ? ప్రకృతియందు వుండుట లేక కలుగుట అనునదియే అవిద్య మరియు గుణములతో తాదాత్మ్యమును పొందుట అనగా ఆ గుణముల యందు ఆసక్తిని కలిగియుండుట ఈ రెండే సంసారమునకు కారణములు. అందుచే వాటి రెంటినీ త్యజించమనియే చెప్పబడుచున్నది.

**ఈ** గీతాశాస్త్రమునందు పై రెంటినుండి అనగా ప్రకృతి మరియు గుణములయందు **ఆసక్తి నుండి నివృత్తిని పొందుటకు సాధనములుగా సంన్యాసముతో కూడియున్న జ్ఞానము మరియు వైరాగ్యము ముఖ్యముగా చెప్పబడినవి.**

ఆ క్షేత్ర - క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానము (వివరణ) యింతకు పూర్వమే చెప్పబడినది. దానితోపాటు **"న సత్తన్నా సదుచ్చతే"** మొదలగు వాక్యముల ద్వారా యితర ధర్మములన్నింటిని నిషేధించి మరియు **"సర్వతః పాణిపాదమ్"** మొదలగు వాక్యముల ద్వారా అనాత్మ ధర్మములన్నింటిని అధ్యారోపణ జేసి అనగా తొలగించి **జ్ఞేయముయొక్క స్వరూపము "యజ్ఞాత్వా మృతమశ్నుతే"** మొదలగు వచనముల ద్వారా ప్రతిపాదించబడినది.

దానినే తిరిగి విశదముగా ప్రతిపాదించబోవుచున్నాము -

**13.22. ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః,**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహే ఽస్మిన్పురుషః పరః.**

అనగా - ఈ ఆత్మ ఉపద్రష్ట అనగా స్వయముగా ఎటువంటి కర్మలు చేయకుండగనే ఆ జరుగుచుండు కర్మలకు కర్మలు చేయువారికి సమీపమున స్థిరముగా వుండి చూస్తూ వుంటుంది. అదెట్లన ? యజ్ఞ విద్యలయందు ఆరితేరిన పురుషుడు తాను స్వయముగా ఎటువంటి యజ్ఞకర్మలు చేయకుండగనే యజ్ఞకర్మల యందు నిమగ్నమై యున్న పురోహితుడు మరియు యజమాని ద్వారా చేయబడుచున్న యజ్ఞకర్మలకు సంబంధించిన గుణ-దోషములను చూచుచున్నట్లుగా కార్యము మరియు కరణముల వ్యాపారముతో తాను సంబంధము లేకుండగ ఆ కార్యములు మరియు ఆ కార్యములతో సంబంధము లేని ఆత్మ ఆ యా కార్యములను దగ్గరగా వుండి చూస్తూ వుంటుంది.

అట్లు కాదేని - దేహము, కన్నులు, మనస్సు, బుద్ధి మరియు ఆత్మ యివన్నియు ద్రష్టలు - వాటిలో బయటగా వుండియున్న ద్రష్ట దేహము మరియు అచ్చట మొదలు వాటన్నిటికంటె లోపలగా వున్న ద్రష్ట, అత్యంత సమీపమునందున్న ద్రష్ట అంతరాత్మ. దానికంటె మరియొక ఆంతరిక ద్రష్ట లేదు. అత్యంత సమీపమున వుండి చూచునదైయున్నందున **అదియే** ఉపద్రష్ట. అందుచేత **ఆత్మ ఉపద్రష్ట అయి వున్నది.**

అట్లు కూడ కాదేని యజ్ఞమునందలి ఉపద్రష్ట వలె సర్వమును అనుభవించునదై యున్నందున **ఆత్మ ఉపద్రష్ట అనబడుచున్నది.**

ఈ ఉపద్రష్టను కొందరు "అనుమంత" అని అందురు. క్రియలు చేయుటయందు నిమగ్నమైయున్న అంతఃకరణము మరియు యింద్రియాదులు చేయు కర్మలయందు సంతోషమును అనుమోదించుటను "అనుమననము" అందురు. **ఆ అనుమననము చేయువాడు అనుమంతుడు.**

అట్లుగాక కార్యకరణముల ప్రవృత్తియందు తాను స్వయముగా ప్రవృత్తి లేకుండ కూడ ఆ కార్యకరణముల వ్యాపార ప్రవృత్తికి అనుకూలముగా వున్నట్లు తోచుచుండును.

అట్లుగానిచో - తన వ్యాపారమునందు నిమగ్నమైయున్న అంతఃకరణము మరియు యింద్రియాదులు చేయు **కర్మలకు తాను సాక్షిగా వుండియు తాను వాటిని అట్లు చేయకుండ నివారించడు. అందువల్ల గూడ అతడు "అనుమంతుడు" అనబడుచున్నాడు.**

అవిద్యారూపమైన ప్రకృతిని గూడ తనయొక్క వికార రూపమైన గుణముల సహితముగా విద్యచేత నివర్తించబడిన అభావమును పొందినట్లుగా గుర్తించునో ఆతడు సర్వవిధ వ్యవహారములు చేయుచుండిననుఈ విద్వత్తుతో కూడియున్న శరీరము తొలగిపోయిన పిదప తిరిగి రెండవ శరీరమును పొంది జన్మించదు. అనగా రెండవ శరీరమును గ్రహించదు.

ఇచ్చట "అపి" అనగా తన వర్ణాశ్రమ ధర్మమునకు అనుకూలముగా వ్యవహరించు వాడు తిరిగి జన్మించదు అని అభిప్రాయము.

**పూర్వపక్షము - జ్ఞానము కలిగిన తరువాత పునర్జన్మ లేదని చెప్పబడినది.** అలా అయినప్పటికి ఆ జ్ఞానము కలుగుటకు పూర్వము చేసినటువంటివీ మరియు జ్ఞానము కలిగిన తరువాత చేయబడు మరియు యింతకు పూర్వపు జన్మలయందు చేసియున్నట్టి కర్మలు తమ ఫలములను యివ్వకుండానే అవన్నియూ కూడా నశించునని తలంచుట యుక్తియుక్తముగా లేదు. అందుచేత జ్ఞానము ప్రాప్తించిన తరువాత గూడ మూడు జన్మలు యింకా కలుగవలసి యున్నవి.

ఇచ్చట అభిప్రాయమేమన ? **అన్ని విధములైన కర్మలు సమానములే.** వాటియందు ఎటువంటి భేదము (తేడా) కనుపించుట లేదు. అందుచేత ఫలములిచ్చుటకు సిద్ధముగా నున్న జన్మలను ప్రారంభించునటువంటి ప్రారబ్ధకర్మల వలెనే తమచే చేయబడిన యితర కర్మలు **కూడ** తమ ఫలములను యివ్వకుండా నశించునని తలంచుట సరికాదు. అందుచేత మూడు విధములగు కర్మలు మూడు విధములగు జన్మలను కలిగించును. అట్లుకాని యెడల అన్నివిధ కర్మలు కలసి కనీసము ఒక్క జన్మమునైనా తప్పక కలిగించును. అని తలంచవలయును.

అట్లుకాని యెడల చేయబడిన కర్మలయొక్క ఫలములు యివ్వకుండగనే అనగా అనుభవించకుండగనే అవన్నియు నశించునని తలంచుటలో సమంజసమైన నమ్మకము **కలుగుటకు** అవకాశము లేకున్నది. అంతేగాక శాస్త్రము గూడ వ్యర్థమగును. అందుచేత "ఆతడు తిరిగి క్రొత్త దేహమును పొందదు" అని చెప్పుట సరికాదు.

**సమాధానము** - అట్లనుట సరికాదు. ఏలయన ? **"నక్షీయంతే చాస్య కర్మాణి"** చూ. ముం.ద. ఉ. 2.2.8. **"బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి"** చూ. ముండ ఉ. 3.2.9., **"తస్య తావదేవచిరమ్"** చూ. ఛాందో. 6.14.2, **"ఇషీకాతూలవత్ సర్వాణి కర్మాణి ప్రదూయంతే"** చూ. ఛాందో ఉ. 5.24.3" అనగా "ఆతని సర్వవిధ కర్మలు క్షయించిపోవును. **బ్రహ్మమును ఎఱింగినవాడు బ్రహ్మమే అగును.** జ్ఞానము అనగా **"అహంబ్రహ్మోస్మి"** అని కలుగుటయే ఆలస్యము. అగ్నియందు గడ్డిపరక యొక్క అగ్రభాగము వలె ఆతని సమస్త విధములైన కర్మలు మరియు వాటి ఫలములు భస్మమై పోవును. మొదలగు అనేక శ్రుతివాక్యముల ద్వారా **జ్ఞానియొక్క సర్వవిధ కర్మ ఫలములు నశించిపోవునని** చెప్పబడియున్నది.

ఇచ్చట ఈ గీతాశాస్త్రమునందు గూడ **"యథైధాంసి"** మొదలగు శ్లోకముల యందు జ్ఞానము వలన సర్వవిధ కర్మ ఫలములు దహించిపోవును అని చెప్పబడినది. ఇంకముందు గూడ యిలాంటి వాక్యములు చెప్పబడియున్నవి.

మరియు ఈతడు భర్త. చైతన్య స్వరూపమైన ఆత్మయొక్క భోగము మరియు అపవర్గమును సిద్ధింపజేసుకొనుట కొఱకు ప్రయత్నించు చైతన్యము యొక్క ఆభాస రూపమైన దేహము, యింద్రియములు, మనస్సు మరియు బుద్ధి మొదలగు వాటి రూపములను ధరించుట గూడ భరణమే మరియు **ఆ చైతన్యరూపమైన ఆత్మచేతనే చేయబడినది అగుటచే ఆత్మను భర్తయని అందురు.**

**ఆత్మభోక్త అయి వున్నది.** అగ్నియొక్క ఉష్ణత్వము వలె నిత్య చైతన్యమును కలిగియున్న ఆత్మయొక్క సత్తచేత సమస్త విషయములయందు వేఱు వేఱుగా వుండు బుద్ధియొక్క సుఖ-దుఃఖములు మరియు మోహరూపమైన తోపికలు మొదలగునవన్నియు చైతనత్వము కలిగియున్న ఆత్మద్వారా గ్రహించబడుచున్నట్లుగా తోచుచుండును. అందుచేత ఆత్మను భోక్త అని గూడ అందురు.

**ఆత్మ మహేశ్వరుడు.** అది అనగా ఆ యాత్మ అందరియొక్క ఆత్మ అయి వున్నందున మరియు యితర వస్తువుల అపేక్ష లేనిదై యున్నందున మహా ఈశ్వరుడు అయి వున్నది. అందుచేతనే మహేశ్వరుడనబడుచున్నది.

**ఆయాత్మ పరమాత్మ అయి వున్నది.** అవిద్య కారణముగ ఆత్మరూపముగానే తలంచబడుచున్న శరీరము మొదలు బుద్ధి పర్యంతము ఆత్మ శబ్దము ద్వారానే పిలువబడుచున్నవి. వాటికన్నింటికి ఉపద్రష్టగా వుండు లక్షణములు కలిగియున్న ఆత్మ సర్వశ్రేష్ఠమైనదై యున్నది. అందుచేత అది పరమాత్మ అనబడుచున్నది.

శ్రుతియందు గూడ యీ ఆత్మపదార్థము **"సో ఽతః పరమాత్మా"** అనగా లోపలగా సర్వవ్యాపకమైయున్న పరమాత్మ" అని చెప్పబడియున్నది.

ఇటువంటి ఆత్మ ఎచ్చట వున్నది ? అ అవ్యక్తమునకు పరమైన పురుష రూపమున ఈ దేహముల యందే వ్యాపించియున్నది. **"ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః"** చూ. 15.17 గీత అనగా అత్యంత ఉత్కృష్టమైన పురుషుడు వేఱుగనే వుండును. అనగా యీ రెంటియందు అత్యంత విలక్షణముగా వుండును. అందుచేతనే అది పరమాత్మ అని చెప్పబడుచున్నది. మరియు **"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"** అని యింతకు పూర్వము చెప్పబడినది. (చూ. గీత 13.2) అనగా సమస్తమైన క్షేత్రములయందు పై లక్షణములతో కూడియున్న క్షేత్రజ్ఞునిగా **ఎటువంటి సంసారము లేనటువంటి పరమేశ్వరునిగనే ఎఱుంగుము.** ఈ విధముగా యింతకు పూర్వమే చెప్పబడియున్నది. దానిని చక్కగా వ్యాఖ్యానించి ఉపసంహరించబడియున్నది.

ఈ విధముగా ఆపైన చెప్పబడిన లక్షణములు కలిగియున్న ఆత్మను –

**13.23. య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ,**
**సర్వథా వర్తమానో ఽపి న స భూయో ఽభిజాయతే.**

అనగా – ఆ పురుషునకు అనగా మనుష్యుడు పైన చెప్పిన విధముగా అనగా సాక్షాత్తు ఆత్మభావముతో "అదియే నేను" అని గుర్తించునో మరియు పైన చెప్పబడిన

యుక్తుల ద్వారా గూడ యీ మాట సత్యమేనని, సరియైనదియేనని సిద్ధించుచున్నది. ఏలయన ? అవిద్య, కామము మొదలగునవి క్లేశరూపమైన బీజములతో కూడియున్న కారణరూపమైన కర్మలు మరియొక జన్మరూపమైన అంకురమును కలిగించును.

ఇచ్చట గీతాశాస్త్రమునందు గూడ భగవంతుడు అనేక సందర్భములందు **అహంకారము మరియు ఫలాకాంక్షతో కూడియున్న కర్మలు మాత్రమే తిరిగి ఫలములను కలిగించు సామర్థ్యమును కలిగియుండును.** ఇతర విధి కర్మలు అట్లు చేయజాలవు అని చెప్పియున్నాడు.

మరియు **"బీజాన్యగ్న్యుపదగ్ధాని న రోహన్తి యథాపునః**

**జ్ఞానదగ్ధైస్తథా క్లేశైర్నాత్మా సంపద్యతే పునః"** అనగా అగ్నియందు దగ్ధమైన విత్తనము ఏ విధముగా తిరిగి మొక్క రూపమును దాల్చదో ఆ విధముగానే జ్ఞానాగ్నిచేదగ్ధమైనటువంటి కర్మఫలములు కలిగియున్న ఆత్మ తిరిగి శరీరమును ధరించదు అని శాస్త్రవచనము.

**పూర్వపక్షము** – జ్ఞానము కలిగిన తదనంతరము చేయబడిన కర్మఫలములు జ్ఞానము ద్వారా దగ్ధము కావచ్చును. అట్లేలయన ఆ కర్మలు జ్ఞానముతో కూడి చేయబడును. కాని ఈ జన్మమునందు జ్ఞానము కలుగక పూర్వము మరియు యింతకు పూర్వపు అనేక జన్మలయందు చేయబడిన కర్మలు మరియు వాటి ఫలములు ఈ జన్మయందు కలిగిన జ్ఞానము ద్వారా నశించునని చెప్పుట సరికాదు.

**సమాధానము** – అట్లనుట సరికాదు. కర్మలన్నియు జ్ఞానాగ్నియందు దగ్ధమగును. **"సర్వకర్మాణి"** అని విశేషణము చెప్పబడినది.

**పూర్వపక్షము** – జ్ఞానము కలిగిన తరువాత చేయబడు సర్వవిధ కర్మలు మాత్రమే జ్ఞానము ద్వారా దగ్ధమగునని చెప్పినచో –

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? అలా సందేహించుటకు కారణమేమియు కానరాదు. జ్ఞానము కలిగినప్పటికి వర్తమాన (ప్రస్తుత) జన్మమునందు ఫలములను కలుగజేయుటకు సిద్ధముగా వున్న ప్రారబ్ధ కర్మలు నశించవు గదాయని నీవు చెప్పుమాట సరికాదు. అదే విధముగా ఫలములిచ్చుటకు ఆరంభమే కానటువంటి కర్మలు నశించునని చెప్పుట సరికాదని నీవు చెప్పుమాట సరికాదు.

ఏలయన ? ఆ ప్రారబ్ధ కర్మలు విల్లునుండి విడువబడిన బాణమువలె ఫలము లిచ్చుటకు ప్రారంభించబడినవి. అందుచేత వాటి ఫలములు తప్పక అనుభవించబడును. కాని యితర కర్మల ఫలములు అనుభవమునకు రావు. అదెట్లన ? ముందుగా లక్ష్యమును ఛేధించుట కొఱకు ధనుస్సు నుండి విడువబడిన బాణము లక్ష్యభేదము జరిగిన తరువాత గూడ ఆరంభించిన వేగము నశించినందున క్రిందపడి శాంతించును. ఆ విధముగానే దేహమును కల్పించు ప్రారబ్ధ కర్మలు గూడ **శరీర స్థితిరూపమైన** ప్రయోజనము నివృత్తిని పొందియున్నందున గూడ సంస్కారముల యొక్క వేగము తగ్గనంతవరకు అవి పూర్వమువలె జరుగుచునే యుండును.

అదే బాణము ధనుస్సు నుండి వదలబడక పూర్వము ఒకవేళ అది ధనుస్సునందు ఎక్కుపెట్టబడినప్పటికి దానిని ఆపుట సాధ్యమే. ఆ విధముగానే ఏ కర్మల ఫలము భోగమునకు ఆరంభించబడలేదో అవి అన్నియు తన ఆశ్రయమునందే వుండి యున్నందువలన జ్ఞానము ద్వారా వాటినన్నింటిని నిర్జీవముగా చేయవచ్చును.

అందువలన ఈ విద్వత్ శరీరము పడిపోయిన తరువాత **"అది తిరిగి ఉత్పన్నము కాదు"** అని చెప్పుట సమంజసమే.

ఇచ్చట ఆత్మ-దర్శనమునకు సంబంధించిన విషయమునందు **ధ్యానము మొదలగు అనేక భిన్న సాధనములు కేవలము సహాయ సాధనములుగా చెప్పబడుచున్నవి.**

**13.24. ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా,**
**అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే.**

అనగా - శ్రోత్రాది యింద్రియములను శబ్దాది విషయములను తొలగించి వాటి నన్నింటిని మనసునందే నిలిపివేసి మరియు మనస్సును అంతరాత్మయందు బంధించి **ఏకాగ్ర భావముతో ఆలోచించుచు ధ్యానించుచుండుటను ధ్యానమందురు.** ఏ విధముగా కొంగ ధ్యానము చేయుచుండునో, ఏ విధముగా పృథ్వి అనగా భూమి ధ్యానము చేయుచుండునో మరియు ఏ విధముగా పర్వతములు ధ్యానము చేయుచుండునో మొదలగు ఉపమానములు చెప్పినందున **తైలధారవలె నిరంతరము అవిచ్ఛిన్న భావముతో అదే విషయమును గురించి ఆలోచించు చుండుటను ధ్యానమందురు.** అటువంటి ధ్యానము ద్వారా ఎంతోమంది యోగులు ఆత్మయందు బుద్ధియందు ఆత్మను అనగా ప్రత్యక్కుగా యున్న చేతనత్వమును ఆత్మతో ధ్యానాభ్యాసము ద్వారా శుద్ధము చేయబడిన అంతఃకరణముతో దర్శింతురు.

ఇతరమైన అనేకమంది యోగులు సాంఖ్యయోగము ద్వారా సత్వ, రజ, తమ అను ఈ మూడు గుణములు నాచే చూడబడునవైయున్నవి. మరియు నేను వాటికంటె భిన్నముగా వుండి అవి చేయు వ్యాపారములకు సాక్షిగా వుండి ఆ గుణములకంటె భిన్న లక్షణములు కలిగియున్న నిత్యమైన చేతనత్వము కలిగియున్న ఆత్మనై యున్నాను. ఈ విధముగా ఆలోచించు విధానమే సాంఖ్యము. ఇదియే యోగము. **ఇటువంటి సాంఖ్యయోగము ద్వారా ఆత్మయందే ఆ పరమాత్మను చూడగలుగుదురు.**

మరియు యితరులైన యోగులు కర్మయోగము ద్వారా ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్టించబడు అనగా చేయబడు వ్యాపారము లేక చేష్టలను కర్మలందురు. ఆ కర్మలే యోగమునకు సాధనములై యున్నందున గౌణరూపముగా యోగమని చెప్పబడుచున్నవి. అటువంటి కర్మయోగము ద్వారా అంతఃకరణము శుద్ధియగుట మరియు క్రమముగా జ్ఞానము ప్రాప్తించుట ద్వారా ఈ కర్మయోగులు ఆత్మయందే ఆత్మను దర్శించగలుగుదురు.

## 13.25. అన్యే త్వేవ మజానంతః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే,
## తే ఽపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః.

అనగా – అనేకమంది యితరమైన సాధకులు పైన చెప్పబడిన యితర మార్గములలో నుండి ఏదో ఒకదాని ద్వారా పైన చెప్పబడిన ఆత్మతత్వమును ఎఱుంగక ఇతర ఆచార్యుల ద్వారా ఏదో కొంత విని ఆ విధముగా వారిచే ఆజ్ఞాపించబడి "నీవు దీనిని గురించియే ధ్యానించు చుండుము" అని విని దానినే ఉపాసించుచుందురు. అతి శ్రద్ధతో ధ్యానించుచుందురు.

కేవలము వినుటయందే శ్రద్ధ కలిగియున్న పురుషులు గూడ అనగా వారి అభిప్రాయము ననుసరించి శ్రవణము చేయుటయే మోక్షమార్గమునకు సంబంధించిన ప్రవృత్తియందు పరమ ముఖ్య సాధనమైయున్నదో అటువంటివారు కేవలము యితర ఆచార్యుల ఉపదేశములనే ప్రమాణముగా తలంచువారై స్వయముగా వివేకహీనులై శ్రుతులను పారాయణము చేయు పురుషులు గూడ మృత్యువును అనగా మృత్యువుతో కూడియున్న ప్రపంచమును నిస్సందేహముగా తరింతురు.

ప్రమాణముల ననుసరించుటయందు స్వేచ్ఛను కలిగియున్నవారు అనగా **వివేకము కలిగియున్న పురుషులు మృత్యువుతో కూడియున్న యీ సంసారమును అనాయాసముగా తరింతురు అని చెప్పుటయందు సందేహమే లేదు.**

**క్షేత్రజ్ఞుడు మరియు ఈశ్వరుని యొక్క ఏకత్వ విషయమునకు సంబంధించిన జ్ఞానము మోక్షమునకు ముఖ్య సాధనము.** ఈ విషయము **"యజ్ఞాత్వామృతమశ్నుతే"** అను వాక్యము ద్వారా చెప్పబడినది. కాని ఈ జ్ఞానము ఏ కారణమువలన మోక్షమునకు సాధనమై యున్నది? ఆ కారణమును చూపుటకై ఈ క్రింది శ్లోకము ఆరంభించబడుచున్నది –

## 13.26. యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్,
## క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగాత్తద్విద్ధి భరతర్షభ.

అనగా – ఓ భరతవంశమునందు శ్రేష్ఠుడా ! జన్మించిన ప్రతి వస్తువు యిచ్చట అనగా ఈ లోకమునందు సమాన భావముతో కూడిన వస్తువుగా గ్రహించబడుచున్నదా ? అన్నచో – చెప్పుచున్నారు – స్థావర జంగము అనగా చరము మరియు అచర వస్తువుగా జన్మించుచున్నవి. **అవన్నియు క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క సంయోగము ద్వారానే జన్మించుచున్నవి.** ఈ విధముగా నీవు ఎఱుంగవలసి యున్నది.

**పూర్వపక్షము** – ఈ క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క సంయోగమనగా ఎటువంటిది? ఏలయన ? **క్షేత్రజ్ఞుడు ఆకాశము వలె అవయవ రహితుడు** గదా ? అందుచేత ఆతనికి క్షేత్రముతో త్రాడుతో గుఱ్ఱమునకు గల సంబంధము వలె అవయవముల సంసర్గము అనగా సంయోగము అనగా కూడికవలన కలుగు సంబంధ రూపమైన సంయోగము కలుగనేరదు. అదే విధముగా పరస్పరము ఆ రెంటియందు కార్యకారణ భావసంబంధము గూడ లేనందున నూలుబట్టవలె క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క సమవాయ సంబంధ రూపమైన సంయోగము గూడ జరుగనేరదు.

**సమాధానము** - చెప్పెద వినుము - **క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడు యిరువురూ విషయము మరియు విషయి** అయినందున భిన్న స్వభావములు గలవారై యున్నారు. ఆ రెంటియందు ఒకదానియందు మరియొకని ధర్మముల యొక్క అధ్యాసరూపమైన సంయోగ సంబంధము కలదు. ఆ సంయోగ సంబంధము త్రాడు మరియు ముత్యపు చిప్ప మొదలగువాటియొక్క స్వరూప సంబంధమైన జ్ఞానాభావము వలన ఆరోపించబడుచున్న సర్పము మరియు వెండి మొదలగువాని సంయోగమువలె క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క వాస్తవిక స్వరూపములను గుర్తించక పోవుటకు కారణములై యున్నవి.

ఇటు **అధ్యాస్వరూపమైన క్షేత్రము** మరియు **క్షేత్రజ్ఞుని యొక్క సంయోగము మిథ్యాజ్ఞానము అయి వున్నది.**

శాస్త్రగ్రంథముల యందు చెప్పబడియున్నట్లుగా ఏ పురుషుడు క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క లక్షణములను మరియు భేదమును చక్కగా ఎఱింగి యింతకు పూర్వము చూపబడినట్లుగా ఆ క్షేత్రము నుండి మట్టనుండి ధారమువంటి దానిని వేఱుచేసినట్లుగా పూర్వము చెప్పిన లక్షణములతో కూడియున్న క్షేత్రజ్ఞుని వేఱుజేసి చూచునో అనగా ఆ క్షేత్ర స్వరూపుడైన క్షేత్రజ్ఞుని **"న సత్తన్నా సదుచ్యతే"** అను వాక్యానుసారముగ సమస్త ఉపాధి రూపములైన విశేషణములకు అతీతముగా బ్రహ్మరూపమున చూచును.

మరియు ఏ పురుషుడు క్షేత్రమును మాయద్వారా చేయబడిన ఏనుగు, స్వప్నమందు చూచిన వస్తువు లేక గంధర్వ నగరము మొదలగువానివలె "ఇది నిజముగా లేదు అయినప్పటికి సత్ పదార్థము వలె తోచుచున్నది" అని నిశ్చయ పూర్వకముగా ఎఱుంగునో అటువంటి పురుషుని మిథ్యాజ్ఞానము అనగా భ్రాంతివలన కలిగిన విషయ జ్ఞానము యథార్థ జ్ఞానమునకు విరుద్ధముగా వుండి యున్నందున తొలగిపోవును.

**పునర్జన్మకు కారణరూపమైన మిథ్యాజ్ఞానము** తొలగిపోయిన తరువాత **"య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ"** అను శ్లోకమునందు చెప్పబడినట్లుగా **"విద్వాంసుడు తిరిగి జన్మించడు"** అను వాక్యము అక్షర సత్యమే.

**"నస భూయో ఽభిజాయతే"** అను వాక్యము వలన పూర్ణ జ్ఞానము యొక్క ఫలము అవిద్య మొదలగు సంసారమునకు బీజమైన దానిని నివృత్తి చేయుట ద్వారా పునర్జన్మ యొక్క అభావమని చెప్పబడినది. మరియు అవిద్యా జనితమైన క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క సంయోగమును జన్మమునకు కారణముగా చెప్పబడినది. అందుచేత ఆ అవిద్యను నివృత్తింపజేయునట్టి పూర్ణ జ్ఞానము యింతకు పూర్వము గూడ చెప్పబడినది. అయినను మరల చెప్పుచున్నారు -

**13.27. సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్,**
**వినశ్య త్స్వ వినశ్యంతం యః పశ్యతి స పశ్యతి.**

అనగా - బ్రహ్మ మొదలు చీమ పర్యంతము (అంబోజాసనుడాదిగాగ తృణ పర్యంతంబు విశ్వాత్ముడై సంభావంబున నుండు ప్రోడ) సమస్త ప్రాణులయందు సమ భావముతో

వ్యాపించియున్న పరమేశ్వరుని అనగా శరీరము, యింద్రియములు, మనస్సు, బుద్ధి, అవ్యక్తము మరియు ఆత్మకంటె గూడ వేఱుగా ఏ పరమేశ్వరుడు కలడో ఆ పరమేశ్వరుని సర్వభూతముల యందు సమ భావముతో వ్యాపించి యున్నట్లుగా చూచు పురుషుడు - (తనయందు నఖిలభూతములందు నొకభంగి, సమహితత్వంబున జరుగువాడు)

ఇచ్చట భూతములకంటె పరమేశ్వరుని అత్యంత విలక్షణములు గలవానిగా చూపించుట కొఱకు భూతములన్నియు నశించునవనియు మరియు పరమేశ్వరుడు అవినాశి యనియు విశేషణములు చెప్పబడినవి.

**పూర్వపక్షము** - అలా చెప్పినందువలన పరమేశ్వరుని విలక్షణత్వము ఎట్లు సిద్ధించును? అన్నచో -

**సమాధానము** - సమస్తమైన భావవికారములకు కారణమైన జన్మరూప భావ వికారమే మూలము. ఇతరములైన సర్వవిధములైన భావవికారములు జన్మించిన తరువాత జరుగునవి మరియు వినాశమందు సమాప్తమగునవి అయి వున్నవి. భావము అభావముగా అగుచున్న కారణమువలన వినాశము తరువాత ఎటువంటి భావవికారము వుండదు. అట్లేలయన ? **ధర్మి యున్నప్పుడే ధర్మములుండును.**

అందువలన అంతిమ భావవికారము యొక్క అభావమును (అవినశ్యంతం" అను పదము ద్వారా) అనువదించినప్పుడు ముందుగా జరుగు సమస్తమైన భావవికారముల యొక్క ఖండన వాటి కార్యముతో సహా జరుగును.

అందువలన పైన చెప్పబడినట్లుగా సమస్త భూతముల కంటె పరమేశ్వరుని అత్యంత విలక్షణత్వము మరియు నిర్విశేషత్వము మరియు అనన్యత్వము అనగా అద్వైతము అనగా ఏకత్వము చక్కగా సిద్ధించును. అందువలన ఈ విధముగా అనగా పైన చెప్పబడిన భావముతో పరమేశ్వరుని చూచునో అనగా గుర్తించునో ఆతడే చూచినవాడగును.

**పూర్వపక్షము** - అందరూ చూస్తున్నారు అలాంటి స్థితియందు "ఆతడే చూచిన వాడగును" అను విశేషణము వలన ఎటువంటి ప్రయోజనము సిద్ధించుచున్నది ?

**సమాధానము** - నిజమే. ఇతరులందరూ గూడ చూచుచున్నారు. కాని వారందరూ విపరీతముగా అనగా వున్నదానికి విరుద్ధముగా చూచుచున్నారు. అందుచేత "ఆతడే చూచుచున్నాడు" అను విశేషణ శబ్దము వాడబడినది.

అదెట్లన ? తిమిర రోగముతో దూషితమైన దృష్టిగలవాడు ఆకాశమునందు ఒకే కాలములో అనేకమంది చంద్రులను చూచును. అందువలన ఆతనికంటె ఒకే చంద్రుని చూచువాని విలక్షణత్వము అనగా విశేషణత్వము చెప్పబడినది. ఏలయన ? ఆతడే సరిగ్గా అనగా వున్నదానిని వున్నట్లుగా చూచుచున్నాడు. ఆ విధముగానే యిచ్చట గూడ ఏ పురుషుడు ఆత్మను పైన చెప్పబడినట్లుగా భేదరహితముగాను, ఒకటిగాను చూచుచున్నాడో ఆతనికి ఆ బ్రహ్మ పదార్థమును వేఱు వేఱుగాను అనేక ఆత్మలుగాను చూచునటువంటి విపరీత దర్శకులకంటె

వేఱుగా ఈ విశేషణము చెప్పబడినది. 'ఆతడే సరిగా చూచుచున్నాడు' అను విశేషణము చెప్పబడినది.

తాత్పర్యమేమన ? ఇతరులందరూ అనేక చంద్రులను చూచువాని వలె విపరీత భావముతో అనగా వ్యతిరేక దృష్టితో చూచుచున్నవారైనందున వారు చూచుచుండియు చూడనివారగుచున్నారు.

పైన చెప్పబడిన యధార్థ జ్ఞానముయొక్క ఫలమును చెప్పి దానిని స్తుతించవలయును. అందుకొఱకు యీ క్రింది శ్లోకము చెప్పబడుచున్నది.

**13.28. సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్,**
**న హినస్త్యాత్మనా ऽ ऽత్మానం తతో యాతి పరాంగతిమ్.**

అనగా – ఏలయన ? సర్వత్ర – సర్వభూతముల యందును సమభావముతో నిండియున్న ఈశ్వరుని అనగా పై శ్లోకమునందు ఏ ఈశ్వరుని లక్షణములు చెప్పబడినవో ఆ పరమేశ్వరుని సర్వత్ర సమభావముతో చూచు పురుషుడు స్వయముగా తనంతట తానుగా హింసించుకొనడు. అందుచేత అనగా తనను తాను హింసించుకొననందున ఆతడు మోక్షరూపమైన పరమ ఉత్తమగతిని అనగా స్థితిని పొందును.

**పూర్వపక్షము** – ఏ ప్రాణి గూడ తనను తాను హింసించుకొనదు. అటువంటి స్థితియందు ఆ లేనిదానిని గురించి నిషేధపు ఆజ్ఞలు ఎందులకు చేయబడుచున్నవి ? "ఎవ్వడు తనను తాను స్వయముగా హింసించుకొనడు" అని చెప్పుట ఎందులకు ? అనగా అట్లు చెప్పుట వ్యర్థమే గదా ! ఎవ్వడో చెప్పినట్లుగా "భూమిమీద మరియు అంతరిక్షమునందు అగ్నిని వెలిగించరాదు. అన్నట్లుగా –

**సమాధానము** – అలా చెప్పుటయందు దోషమేమియు లేదు. ఏలయన ? అజ్ఞానులు తమను తాము తిరస్కరించుకొనుట సహజమే. అజ్ఞానులందరూ అత్యంత ప్రసిద్ధము మరియు సాక్షాత్తూ ప్రత్యక్షముగా వున్న తన ఆత్మను తిరస్కరించుకొని అనాత్మ పదార్థములైన శరీరాదులను ఆత్మగా తలంచి అటుపైన ధర్మాధర్మములను ఆచరించి ఆ విధముగా ప్రాప్తించిన శరీర రూపమైన ఆత్మను నశింపజేసి తిరిగి మరల క్రొత్త ఆత్మను సంపాదించుకొందురు. మరల ఆ యాత్మను గూడ తమఅజ్ఞానము వలన నశింపజేసి మరొక దేహరూప ఆత్మను అట్లే దానిని గూడ నశింపజేసి మరొక క్రొత్త ఆత్మను (స్థూల దేహమును) పొందుతూ వుంటారు. ఈ విధముగా మరల మరల దేహరూప ఆత్మలను పొంది వాటిని హింసించుతూ వుంటారు. అందుచేత అజ్ఞానులందరూ ఆత్మ హంతకులే.

నిజమైన ఆత్మ కూడ అవిద్య కారణముగ గుర్తించబడనిదగుటచే ఎల్లవేళలా చంపబడిన దానివలెనే నిర్జీవమై పడి వుంటుంది. ఏలయన ? ఆ నిజమైన ఆత్మకు అది ప్రత్యక్షమై యున్నను దానికి తగిన ఫలము లభించదు. ఆ విధముగా విద్వాంసులు కానివారందరూ అనగా తన ఆత్మను గుర్తించని అజ్ఞానులందరూ ఆత్మను హింసించువారే అయి వున్నారు.

కాని ఆ విధముగా అజ్ఞానులుగాక పైన చెప్పబడినట్లుగా తన ఆత్మ స్వరూపమును గుర్తించినవారు రెండు విధములుగాను తమను తాము హింసించుకొనరు. అందుచేత అట్టివారు పరమగతిని అనగా ముక్తస్థితిని పొందుదురు. అనగా వారికి యింతకు పూర్వము చెప్పబడినట్లుగా మోక్షము అనగా జన్మ పరంపర లేని స్థితి కలుగును.

సర్వభూతముల యందును ఈశ్వరతత్వమును సమభావముతో నిండియున్నట్లుగా గ్రహించు పురుషులు ఆత్మద్వారా ఆత్మను నశింపజేసుకొనరు అని చెప్పుట యుక్తి సంగతము కాదు. ఏలయన ? తమ గుణము మరియు కర్మలయొక్క విలక్షణత్వముచేత భిన్న భిన్నములుగా జీవులయందు యీ విధముగా చూచుట కుదరదు. అని అందురేమోయని శంకించి ఈ క్రింది విధముగా చెప్పుచున్నారు -

**13.29. ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః,**
**యః పశ్యతి తథా ఽ ఽత్మానమకర్తారం స పశ్యతి.**

అనగా - **"మాయాం తు ప్రకృతిం విద్యాత్"** (చూ. శ్వేతా.ఉ. 4-10) అనగా **మాయను ప్రకృతిగా తెలియనగును.** మొదలగు మంత్రముల ననుసరించి **భగవంతుని యొక్క త్రిగుణములతో కూడియున్న ప్రకృతినే మాయయని అందురు.** మహతత్వము మొదలగు కార్య-కరణముల ఆకారముగ పరిణమించియున్న ఆ ప్రకృతి ద్వారానే మనస్సు, వాక్కు మరియు దేహముద్వారా జరుగుచున్న సర్వవిధ కర్మలు సర్వవిధములుగా చేయబడుచున్నవి. అట్లు ఏ యితర సాధనములచేత చేయబడుట లేదు అని ఎఱింగియున్న పురుషుడు.

మరియు ఆత్మను అనగా క్షేత్రజ్ఞుని ఏ పురుషుడు సమస్తమైన ఉపాధులు లేనటువంటి అకర్తగా చూచునో ఆతడే చూచును. అనగా ఆతడే పరమార్థ తత్వమును చూచినవాడగును. అట్లేలయన ? ఆకాశమువలె నిర్గుణము మరియు ఎటువంటి విశేషత్వము లేనటువంటి అకర్తయగు ఆత్మయందు భేదభావము కలిగియుండుట ఏ ప్రమాణముచేతను ఋజువు చేయబడదు. ఇది సత్యము.

అయినప్పటికి ఆ యథార్థ జ్ఞానమునే వేఱు శబ్దముల ద్వారా వ్యాఖ్యానించుచున్నారు-

**13.30. యదా భూతపృథగ్భావ మేకస్థ మనుపశ్యతి,**
**తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా.**

అనగా - ఏ కాలమునందు ఆ విద్వాంసుడు భూతములయొక్క వేఱు వేఱు భావములను అనగా భూతములయొక్క భిన్నత్వమును ఒకే ఆత్మయందు చేరి యున్నట్లుగా చూచునో అనగా శాస్త్రము మరియు గురువుయొక్క ఉపదేశ బలముతో మననము జేసి "ఇది యంతయు ఆత్మయే"నని ప్రత్యక్షరూపమున చూచునో

మరియు ఆ యాత్మనుండియే సర్వము కలుగుచున్నట్లుగా అనగా అన్నింటియొక్క ఉత్పత్తి - వికాసములు కలుగుచున్నట్లుగా చూచునో అనగా ఎప్పుడు ఆ పురుషుడు ఆత్మనుండియే

ప్రాణము, ఆత్మనుండియే కామము, ఆత్మనుండియే సంకల్పములు, ఆత్మనుండియే ఆకాశము, ఆత్మనుండియే తేజము అనగా అగ్ని, ఆత్మనుండియే జలము, ఆత్మనుండియే అన్నము ఆత్మనుండియే సర్వము ప్రకటితమై తిరిగి ఆత్మయందే లీనమగుచుండుట మొదలగు విధముగా సమస్తమైన విస్తారము ఆత్మనుండియే కలుగుచున్నట్లుగా చూచునో అప్పుడు ఆతడు బ్రహ్మమును పొందిన వాడగును. అనగా ఆతడు బ్రహ్మస్వరూపుడే అయిపోవును.

ఒకే ఆత్మ సర్వప్రాణులయొక్క శరీరములయందు వ్యాపించియున్నట్లుగా తలంచినచో అప్పుడు ఆ యాత్మకు ఆ యా శరీరముల యొక్క గుణదోషములతో సంబంధము కలిగియుండును. అనుశంక కలుగునేమోయని తలంచి ఈ క్రింది శ్లోకము చెప్పుచున్నారు -

**13.31. అనాదిత్వాన్నిర్గుణత్వా త్పరమాత్మాయ మవ్యయః,**
**శరీరస్థో౽పి కౌంతేయ న కరోతి న లిప్యతే.**

అనగా - మొదటి కారణమును చెప్పుచున్నారు - **దేనికి ఎటువంటి కారణము వుండదో దానిని 'అనాది' యని యందురు.** మరియు అనాది అను శబ్దమునకు భావవాచకము అనాదిత్వము. ఆ పరమాత్ముడు అనాది అయి వున్నందున అవ్యయుడు అయి వున్నాడు. ఏలయన ? **ఏ వస్తువునకు ఆరంభము అంటూ వుండునో ఆ వస్తువు తన రూపమునుండి క్షీణించును.** కాని ఈ పరమాత్మ అనాది అయివున్నందున మరియు అవయవరహితుడు అయి వున్నందున ఆయనకు క్షయము లేదు. **కావున ఆయన అవ్యయుడు.**

మరియు నిర్గుణుడైయున్న కారణముగ ఈ ఆత్మ దేహములయందు అనగా ఉపాధులయందు వ్యాపించి యుండియు అనగా శరీరములయందు నిండియుండియు ఎటువంటి కర్మలు ఆచరించడు. మరియు ఆ విధముగా ఎటువంటి కర్మలు ఆచరించని కారణముననే ఆ కర్మల ఫలములతో కూడ ఎటువంటి సంబంధము కలిగియుండడు. శరీరమునందు ఆత్మ ప్రతిఫలించును. అందుచేత శరీరమునందు వ్యాపించియున్నదని చెప్పుచున్నాము.

అట్లేలయన ? కర్తయైనవాడే కర్మల ఫలములతో సంబంధము కలిగియుండును. కాని ఈ ఆత్మ అకర్త అయి వున్నాడు. అందుచేత కర్మ ఫలములతో ఎటువంటి సంబంధము కలిగియుండడు. ఇదియే దీని తాత్పర్యము.

**పూర్వపక్షము** - అయితే శరీరమునందుండి కర్మలు చేయువాడు ఎవడు ? మరియు ఆ కర్మల ఫలములతో సంబంధము కలిగియున్నవాడు ? పరమాత్మకంటే వేరుగా వుండి శరీరము కలిగియుండి కర్మలు చేయుచున్నవాడు వేరొకడు కలడని తలంచినచో మరియు ఆతడే ఆ కర్మఫలముల యందు ఆసక్తి కలిగియున్నాడని తలంచినచో అప్పుడు "క్షేత్రజ్ఞునిగా కూడ నీవు నన్నే గుర్తించుము" అని క్షేత్రజ్ఞుడు ఈశ్వరుడు ఒక్కరేయని మీరు చెప్పిన మాట సరికాదేమో ?

ఈశ్వరుని కంటె వేఱుగా శరీరము గలవాడు మరియొకడు లేడని తలంచినచో అప్పుడు కర్మలు చేయువాడెవ్వడు ? ఆ కర్మల ఫలములతో తాదాత్మ్యమును పొందువాడెవ్వడో

స్పష్టముగా చెప్పవలసియుండును. అట్లుకాని యెడల విటన్నింటికంటె వేఱుగా ఈశ్వరుడనువాడు లేనేలేడని చెప్పవలసి యుండును.

అసలు ముఖ్యమైన విషయమేమన ? భగవంతునిచేత స్వయముగా చెప్పబడిన ఈ ఉపనిషద్రూప దర్శన శాస్త్రమంతయు దుర్విజ్ఞేయము అనగా ఎటువంటి అర్థము లేనిది మరియు దుర్వాచ్యము అనగా పిచ్చివాని ప్రలాపమనియు అందుచేతనే వైశేషికులు, సాంఖ్యులు, జైనులు మరియు బౌద్ధమతావలంబకులైన అందరిచేత ఈ ఉపనిషద్రూప దర్శనశాస్త్రము త్యజింపబడినదని చెప్పవలసియుండును.

**సమాధానము – "స్వభావస్తు ప్రవర్తతే"** అనగా **స్వభావమే వ్యవహరించుచున్నదని యిందులకు సమాధానము.** అలా అని భగవంతుడు స్వయముగా చెప్పియున్నాడు గూడ. అట్లేలయన ? **అవిద్యయే స్వభావముగా గలవాడు మాత్రమే కర్మలు చేయును.** మరియు ఆ కర్మఫలములయందు తాదాత్మ్యమును పొందును అనగా ఆ ఫలములను అనుభవించుచుండును. అందుచేతనే ఈ ప్రపంచ రూప వ్యవహారమంతయు జరుగుచున్నది. నిజముగా అద్వితీయుడైన పరమాత్మయందు కర్తృత్వముగాని కర్మఫలములయందు లిప్తత్వముగాని లేవు. అందుచేత ఈ వాస్తవికమైన జ్ఞానదర్శనమునందు నిలిచియున్న జ్ఞాననిష్ఠుడై పరమహంస పరివ్రాజిక సన్యాసులకు, అవిద్యాకృతమైన సమస్త కర్మలను తిరస్కరించిన మహాత్ములకు కర్మలు చేయుటయందు ఎటువంటి అధికారము లేదు. **ఈ మాట భగవంతుని ద్వారా యీ గ్రంథమునందు అనేకచోట్ల పలుమార్లుగా చెప్పబడియున్నది.**

పరమాత్మ ఎటువంటి కర్మలు చేయడు మరియు ఆ కర్మ ఫలములయందు లిప్తుడు (ఆసక్తుడు) కాడు. అందులకు ఒక దృష్టాంతము చెప్పుచున్నారు.

**13.32. యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే,**
**సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే.**

అనగా – ఆకాశము అంతటా వ్యాపించియుండియు సూక్ష్మపదార్థము అయి వున్నందున దేనితోనూ ఎటువంటి సంబంధము కలిగియుండదు. దేనితోడను కలసి అనగా ఏకమైయుండదు. అదే విధముగా ఆత్మ గూడ శరీరమునందంతటను వ్యాపించి యుండియు ఆ శరీరము యొక్క గుణదోషములతో ఎటువంటి సంబంధము కలిగియుండదు.

మరియు –

**13.33. యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః,**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత.**

అనగా ఎట్లు ఒకే సూర్యుడు సమస్తమైన జగత్తును ప్రకాశింపజేయుచున్నాడో, అదే విధముగా మహాభూతములు మొదలు ధృతిపర్యంతము చెప్పబడుచున్న సమస్త క్షేత్రములను

ఆతడు ఒక్కడే అయి వుండియు ప్రకాశింపజేయుచున్నాడు. ఎవరు ఆ విధముగా ప్రకాశింప జేయుచున్నారు ? క్షేత్రజ్ఞుడా లేక పరమాత్మయా ?

ఇచ్చట ఆత్మయందు సూర్యుని దృష్టాంతము రెండు విధములుగానూ అన్వయించుచున్నది. ఆత్మ సూర్యునివలె సమస్త శరీరములందు వున్నది ఒక్కడే. అయిననూ ఆ శరీరములతో తాదాత్మ్యమును పొందదు.

సమస్తమైన అధ్యాయము యొక్క అర్థమును సంక్షిప్తముగా చెప్పి ముగించుటకై ఈ క్రింది శ్లోకము చెప్పబడుచున్నది –

**13.34. క్షేత్ర క్షేత్రజ్ఞ యోరేవ మంతరం జ్ఞానచక్షుషా,**
**భూతప్రకృతి మోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్.**

అనగా – ఏ పురుషుడు శాస్త్రము మరియు గురువుయొక్క ఉపదేశము వలన జనించిన ఆత్మసాక్షాత్కారరూపమైన జ్ఞాన నేత్రముల ద్వారా యింతకు పూర్వము చెప్పబడిన క్షేత్రము మరియు క్షేత్రజ్ఞునియందు గల భేదమును ఆ రెంటియందు గల పరస్పర విలక్షణత్వమును యింతకు పూర్వము చూపబడిన పద్ధతి ననుసరించి ఎఱుంగునో మరియు ఆ విధముగానే అవ్యక్తమనబడు అవిద్యా రూపమైన భూతముల యొక్క ప్రకృతియొక్క మోక్షమును అనగా దానిని లేనట్లు చూచుట అను ప్రక్రియను గూడ ఎఱుంగునో అట్టి వారు పరమార్థతత్వ స్వరూపమైన బ్రహ్మమును పొందుదురు. అట్టివారికి పునర్జన్మ అనగా మరియొక దేహము కలుగదు.

శ్రీ శ్రీ శ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీతయందలి
క్షేత్ర క్షేత్రజ్ఞ యోగమనబడు పదమూడవ అధ్యాయమునకు
శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు
తెనుగు అనువాదము సమాప్తము.
అనువాదకులు – శ్రీ సదానంద భారతి.
ప్రణవాశ్రమము.

# పదునాల్గవ అధ్యాయము

ఉత్పన్నములగు అనగా యింద్రియ గోచరములగు రూపములను దాల్చు వస్తువులన్నియు క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క సంయోగము అనగా కలయిక వలన ఉత్పన్నమగుచుండును. ఈ విషయము యింతకు పూర్వమే చెప్పబడినది. అవి ఎట్లు ఉత్పన్నమగుచున్నవి? అనగా ఏ విధముగా రూపములను పొందుచున్నవి ? ఈ రహస్యమును తెలుపుటకొఱకు "పరం భూయః" మొదలగు శ్లోకములతో కూడిన ఈ పదునాల్గవ అధ్యాయము ఆరంభించబడుచున్నది.

అట్లు కాకున్న ఈశ్వరుని స్వాధీనమునందుండియే క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడు జగత్తునకు కారణమగుచున్నారు. **సాంఖ్యుల ననుసరించి స్వతంత్రముగా క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడు జగత్తునకు కారణమగుట లేదు.** ఈ విషయమును తెలియజేయుట కొఱకే ఈ అధ్యాయము ఆరంభించబడుచున్నది.

మరియు **ప్రకృతియందు నిండియుండుట మరియు గుణ విషయికమైన ఆసక్తి యీ రెండే జగత్తునకు కారణములు.** అయితే ఏ గుణమునందు ఏ విధమగు ఆసక్తి కలుగును? గుణములు ఎటువంటివి ? అవి ఎన్ని ? అవి ఎట్లు బంధించుచున్నవి ? గుణముల నుండి ముక్తి ఎట్లు కలుగును ? మరియు ముక్తత్వపు లక్షణము లెట్లుండును ? ఈ విషయములన్నియు చెప్పుట కొఱకు గూడ ఈ అధ్యాయము ఆరంభించబడుచున్నది. భగవంతుడు చెప్పుచున్నాడు-

**14.1.** పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్,
యజ్జ్ఞాత్వా మునయః సర్వే పరాం సిద్ధిమితో గతాః.

అనగా – 'పరమ్' అను ఈ పదమునకు దూరముగా నున్న "జ్ఞానమ్" అను పదముతో సంబంధము కలదు.

సర్వవిధ జ్ఞానములలో ఉత్తమమైన పరమ జ్ఞానమును అనగా పరమైన వస్తువు విషయికమైనందున అది పరమైనది అయి వున్నది. మరియు ఉత్తమమైన ఫలముతో కూడియున్నదై యున్నందున అది సమస్త జ్ఞానములలోను ఉత్తమమైనది అయి వున్నది. ఆ **పరమ ఉత్తమమైన జ్ఞానమును,** యింతకు పూర్వము అన్ని అధ్యాయములయందు అనేకమార్లు చెప్పబడియున్నప్పటికి మరల యిప్పుడు సవివరముగా చెప్పుచున్నాను –

ఇచ్చట "జ్ఞానములలో" అను శబ్దము వలన అమానిత్వము మొదలగు జ్ఞాన సాధనములు గ్రహించబడవు. కాని యజ్ఞము మొదలగు జ్ఞేయము అనగా తెలియబడుచున్న వస్తువులకు సంబంధించిన జ్ఞానములు గ్రహించబడును.

**ఆ యజ్ఞాది విషయికమైన జ్ఞానములు మోక్షమును కలిగించునవి కావు.** అనగా మోక్షస్థితిని కలుగజేయుటకు పనికిరావు. మరి యిప్పుడు ఈ అధ్యాయమునందు చెప్పబడు జ్ఞానము మోక్షస్థితిని కలిగించగల సామర్థ్యము కలదైయున్నది. అందువలన "పరమ" మరియు "ఉత్తమ" అను ఈ రెండు శబ్దముల ద్వారా శ్రోతయొక్క బుద్ధియందు రుచి కలిగించుటకై అట్లు విశేషణముల ద్వారా చెప్పబడుచున్నది.

ఏ జ్ఞానమును పొంది మననశీలురై సంన్యసించియున్న పురుషులు ఈ దేహబంధము నుండి విడువడిన తదనంతరము మోక్షరూపమైన పరమ సిద్ధిని పొందుదురో అటువంటి పరమ ఉత్తమ జ్ఞానమును గురించి చెప్పెదను.

ఇటువంటి పరమ ఉత్తమ జ్ఞానము ద్వారా లభించిన సిద్ధికి అవ్యభిచారిత్వము అనగా నిత్యత్వమును చూపుచున్నారు.

**14.2. ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః,**
**సర్గే ఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ.**

అనగా - పైన చెప్పబడిన పరమోత్తమ జ్ఞానమును జ్ఞాన సాధనముల సావధాన పూర్వకమైన సాధన ననుష్ఠించి నాతో సమానముగా ఏకరూపత్వమును పొందిన పురుషులు సృష్టియొక్క ఉత్పత్తి కాలమునందు గూడ తిరిగి జన్మించరు. మరియు ప్రళయకాలమునందు సృష్టికర్తయైన బ్రహ్మ నశించిననూ పరమోత్తమ జ్ఞానమును పొంది పరమాత్మ రూపముగా స్థిరముగా వుందురు. అనగా **పరమాత్మ రూపముననే యుందురు.** ఈ ఫలవర్ణన జ్ఞానముయొక్క విశిష్టతను తెలుపుటకొఱకు చేయబడినది. ఇచ్చట "సాద్ధర్మ్యము" యొక్క అర్థము సమాన ధర్మము కాదు. ఏలయన ? **గీతాశాస్త్రమునందు క్షేత్రజ్ఞుడు మరియు ఈశ్వరునికి ఎటువంటి భేదము స్వీకరించబడలేదు.**

ఇప్పుడు ఈ విధముగా క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుని యొక్క సంయోగము భూతముల కారణముగా జరుగుచున్నదని చెప్పుచున్నారు.

**14.3. మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్గర్భం దధామ్యహమ్,**
**సంభవః సర్వభూతానాం తతో భవతి భారత.**

అనగా - ఈశ్వరుడనైన నాయొక్క మాయ, త్రిగుణమయీ **ప్రకృతి, సమస్త భూతములకు యోని అనగా కారణమై యున్నది.** సమస్తమైన కార్యములకంటె అనగా ఉత్పత్తి చేయు అన్ని యితర వస్తువులకంటె పెద్దదైన కారణముచే మరియు తన వికారములనన్నింటిని తానే ధరించునదై యున్నందున ప్రకృతియే **"మహత్బ్రహ్మ"** అను విశేషణము ద్వారా విశేషించబడినది.

ఆ "మహత్ బ్రహ్మరూపమైన యోనియందు నేను అనగా **క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడు ఈ రెండు ప్రకృతి రూపముల శక్తితో కూడియున్న ఈశ్వరుడు హిరణ్యగర్భుని యొక్క జన్మమునకు**

బీజరూపమైన గర్భమును అనగా **సమస్త భూతములయొక్క ఉత్పత్తికి కారణరూపమైన బీజమును స్థాపించుచుందును.** అనగా అవిద్య, కోరిక (కామము) కర్మ మరియు ఉపాధుల యొక్క స్వరూపములను కల్పించు క్షేత్రమును క్షేత్రజ్ఞునితో సంయోగము చేయుచుందును.

ఓ భారత ! ఆ గర్భాదానము వలన హిరణ్యగర్భుని యొక్క ఉత్పత్తి ద్వారా సమస్త భూతములు ఏర్పడుచున్నవి.

**14.4. సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః,**
**తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా.**

అనగా - ఓ కుంతీపుత్రా ! దేవతలు, పితృదేవతలు, మనుష్యులు, పశువులు మరియు మృగములు మొదలగు సమస్త యోనులయందు ఏ మూర్తరూపములు అనగా భిన్న భిన్న ఆకృతులు గలిగిన శరీరములు, వాటి అవయవములు మొదలగువాటిని కల్పించు లేక రచించు వ్యక్తులు పుట్టుచుందురో, ఆ మూర్తులన్నింటి యొక్క సర్వవిధములుగా ఉన్న బ్రహ్మరూపమున వున్న **నాయొక్క మహామాయ గర్భమును ధరించు యోని అయి వున్నది.** మరియు ఈశ్వరుడనైన నేను బీజమును ప్రదానము చేయు (వేయు) అనగా గర్భాదానము చేయు తండ్రినై యున్నాను.

ఆ గుణములు ఏవి అనగా ఎటువంటివి ? మరియు అవి ఎట్లు బంధించును ? ఆ విషయము చెప్పుచున్నారు -

**14.5. సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః,**
**నిబధ్నంతి మహాబాహూ దేహే దేహిన మవ్యయమ్.**

అనగా - సత్త్వ, రజ మరియు తమ అను పేర్లు గల ఈ మూడు గుణములు అయి వున్నవి. "గుణ" అను శబ్దము పారిభాషిక శబ్దమై యున్నది. ఇచ్చట రూపము, రసము మొదలగువాటివలె ఏదో ఒక **ద్రవ్యమును ఆశ్రయించి ఈ గుణములు లేవు.** మరియు గుణము మరియు గుణవంతుడు (ప్రకృతి) అను భేదము గూడ యిచ్చట గణింపబడదు. అనగా అట్టి భేదములేదు.

ఏ విధముగా రూపము మొదలగు గుణములు ద్రవ్యమును ఆశ్రయించి యుండునో అదే విధముగా ఈ **సత్త్వాది గుణములు** ఎల్లప్పుడు **క్షేత్రజ్ఞుని అధీనమునందుండియే అవిద్యాత్మకములు** అయి వున్నందున **క్షేత్రమును బంధించుచుందును.** ఆ క్షేత్రజ్ఞుని ఆశ్రయముగా (ఆధారముగ) జేసుకొనియే యీ గుణములు తమ స్వరూపములను ప్రకటించు సామర్థ్యము కలిగియున్నవి. అందుచేత క్షేత్రములను బంధించుచుండును అని చెప్పబడినది.

(ఎవని బాహువులు అనగా చేతులు అత్యంత సామర్థ్యము కలిగి మోకాళ్ళవరకు కలిగి పొడవుగా వుండునో అనగా ఆజానుబాహుడై యుండునో అట్టి మనిషిని మహా బాహువులు గలవాడందురు.)

ఓ మహాబాహో ! భగవంతుని మాయవలన పుట్టిన **ఈ మూడు గుణములు** ఈ శరీరమునందుండి శరీరమును ధరించియున్న నాశము లేనటువంటి అనగా అవినాశియైన **క్షేత్రజ్ఞుని బంధించుచున్నవి.** క్షేత్రజ్ఞుని అవినాశిత్వమును గురించి "అనాదిత్వాన్" మొదలగు శ్లోకములయందు (చూ. 13.31.) వివరముగా చెప్పబడియున్నది.

**పూర్వపక్షము** – మీరు ముందుగా అనగా యింతకు పూర్వము దేహి – ఆత్మలిప్తుడు **కాడు** అని చెప్పియున్నారు. మరి యిచ్చట **"గుణములు ఆతనిని బంధించును"** అను **తద్విరుద్ధమైన** మాట ఎట్లు చెప్పబడుచున్నది ?

**సమాధానము** – "ఇవ" శబ్దమును అధ్యాహారము జేసి అనగా లోపింపజేసి మేము మీరు చెప్పుచున్న దోషమును తొలగించియున్నాము. అనగా **నిజముగా బంధించవు. బంధించుచున్నట్లుగా తోచును.**

**14.6. తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయమ్,**
**సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ.**

అనగా – ఆ సత్త్వము మొదలగు మూడు గుణములలో ముందుగా సత్త్వగుణ **లక్షణముల** గురించి చెప్పబడుచున్నది.

సత్త్వగుణము స్ఫటికమువలె నిర్మలమైనది అయినందున ప్రకాశము గలది మరియు ప్రమాద రహితమైనది. అయినప్పటికి గూడ అది గుణము అయినందున **ఆత్మను బంధించు స్వభావము** కలిగియున్నది.

అది ఎట్లు బంధించును ? అన్నచో – **సుఖాసక్తిని కలిగించుట ద్వారా బంధించు**చున్నది. నిజముగా విచారించి చూచిన విషయరూపమైన సుఖము విషయి **అనగా** విషయములను అనుభవించువాడు అయిన ఆత్మను "నేను సుఖముగా వుండగోరుచున్నాను లేక నేను సుఖముగా వున్నాను" అను భావముతో సంబంధమును కల్పించి **అనగా** సుఖమునిచ్చు విషయముతో సంబంధమును కల్పించి **ఆత్మను మిథ్యా సుఖమునందు బంధించును.** దీనినే అవిద్య అని అందురు. ఏలయన ? విషయము యొక్క ధర్మములు విషయినందు వుండవు. మరియు **కోరిక మొదలు ధృతివరకును గల సమస్త ధర్మములు విషయరూపమైన క్షేత్రమునకు సంబంధించినవే.** ఈ మాటను భగవంతుడే చెప్పియున్నాడు.

అందువలన యిప్పుడు సిద్ధించిన దేమన ? ఏదైతే అవిద్య వలన కలిగిన ఆరోపిత భావముతో ఆత్మయొక్క స్వంత ధర్మరూపముగా పరిణమించుచున్నదో మరియు **విషయము విషయి యొక్క అజ్ఞానమే స్వరూపముగా గలదై యున్నదో ఇటువంటి అవిద్య కారణముగానే సత్త్వగుణము అనాత్మ రూపమైన** సుఖమునందు ఆత్మను ఆసక్తునిగా చేయుచున్నట్లుగా వ్యవహరించుచున్నది. అనగా నిజముగా ఆత్మకు విషయముల వలన కలుగు సుఖములతో ఎటువంటి సంబంధము వుండదు. కాని **అవిద్య ఆ యాత్మను సుఖవంతునిగా సృష్టించుచున్నది.** అదే విధముగా **ఈ సత్త్వగుణము ఆత్మను జ్ఞానము ద్వారా గూడ బంధించుచున్నది.**

జ్ఞానము గూడ సుఖముతో మిత్రభావము కలిగియున్నదై యున్నందున క్షేత్రము అనగా అంతఃకరణము యొక్క ధర్మమే అయి వున్నది. **జ్ఞానము ఆత్మధర్మము కాదు.** అట్లేలయన? జ్ఞానమును ఆత్మ ధర్మమని ఒప్పుకొన్న యెడల దానియందు ఆసక్తి కలిగియుండుట మరియు ఆత్మ బంధింపబడుట కుదరవు. అందుచేత ఓ పాపరహితుడా ! (అనగా ఎటువంటి వ్యసనములు లేనటువంటి అర్జునుడు !) సుఖముల వలెనే జ్ఞానము మొదలగువాటితో సంబంధము గూడ అనగా బంధించు గుణముగలవి గూడ అయిన వాటినన్నింటిని ఒప్పుకొనవలసి యుందును.

## 14.7. రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్, తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్.

అనగా – అప్రాప్య వస్తువు అనగా తనవద్ద లేనట్టి వస్తువును పొందగోరు కోరికను "తృష్ణ" అని యందురు. మరియు ప్రాప్తించియున్న వస్తువుల యందు మనస్సులో ప్రతిరూపమైన స్నేహభావము కలిగియుండుటను "ఆసక్తి" యందురు. ఈ తృష్ణ మరియు ఆసక్తుల యొక్క ఉత్పత్తికి కారణరూపమైన రాగాత్మికా భావమును రజోగుణముగా గుర్తించుము. అనగా కాషాయము మొదలగు రంగులవలె పురుషునకు విషయములతో అనగా విషయములయందు ఆసక్తిని కలిగించి ఆ విషయ రూపముగా చేయునదైయున్నందున దీనిని అనగా ఈ రజో గుణమును రాగరూపము కలదిగా తెలుసుకొనుము.

ఓ కుంతీ పుత్రా ! ఈ రజోగుణము ఈ ఈ స్థూల సూక్ష్మాది శరీరములను ధరించియున్న **క్షేత్రజ్ఞుని కర్మాసక్తి ద్వారా బంధించుచున్నది.** దృష్టము అనగా నేత్రములకు కనుపించు మరియు అదృష్టము అనగా యింద్రియములకు తోచనటువంటి ఫలములను కలిగించు కర్మలు చేయుటయందు గల ఆసక్తిని అనగా తత్పరతను అనగా ఉత్సాహమును కర్మాసక్తి యని అందురు. **ఆ కర్మాసక్తి ద్వారా ఈ రజోగుణము పురుషుని అనగా క్షేత్రజ్ఞుని అనగా ఆత్మను బంధించుచున్నది.**

## 14.8. తమస్త్వ జ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్, ప్రమాదాలస్య నిద్రాభిస్తన్నిబధ్నాతి భారత.

అనగా – మరియు దేహములను ధరించిన పురుషులనందరిని మోహింపజేయు తమోగుణమును అనగా జీవులయొక్క అంతకరణములందు **(దేహమందుండి ఆ దేహముతో తాదాత్మ్యమును చెందియున్న ఆత్మ జీవుడనబడును)** మోహము, అవివేకము మొదలగు దుష్టభావములను కలిగించు (తమో గుణము) తమ అను మూడవ గుణమును అజ్ఞానము వలన కలిగినదిగా నీవు తెలుసుకొనుము. ఓ భారత ! ఆ తమోగుణము జీవులను ప్రమాదము, సోమరితనము మరియు నిద్ర ద్వారా బంధించుచున్నది.

అయినప్పటికి ఆ గుణముల యొక్క అనగా ఆ గుణముల వలన చేయబడు వ్యాపారములను అనగా కర్మలను గురించి సంక్షేపముగా చెప్పబడుచున్నది –

**14.9 సత్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత,**
**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత.**

అనగా – ఓ భారత ! సత్వగుణము సుఖమునందు వుంచును. మరియు రజోగుణము కర్మలు చేయుటయందు లగ్నము గావించును. మరియు తమోగుణము సత్వగుణము ఉత్పన్నమై వివేకముతో కూడిన జ్ఞానమును తన ఆవరణాత్మకమైన స్వభావముచేత కప్పివుంచి పురుషుని మరల ప్రమాదమునందు పడవేయును. ప్రాప్తించిన కర్తవ్యమును చేయకుండుటయే అనగా ఆచరించకుండుటయే ప్రమాదము.

ఈ మూడు గుణములు తమ తమ కార్యములను ఎప్పుడు చేయును ? అన్నచో – చెప్పుచున్నారు –

**14.10. రజస్తమశ్చాభి భూయ సత్వం భవతి భారత,**
**రజః సత్త్వం తమశ్చైవ తమః సత్వం రజస్తథా.**

అనగా – ఓ భారతా ! రజోగుణము మరియు తమోగుణము ఈ రెంటిని తన బలముచే అణచివుంచి ఎప్పుడు సత్వగుణము వృద్ధిని పొందునో అప్పుడు అది తన స్వరూపమును పొందినటువంటి సత్వగుణము తన కార్యములైన జ్ఞాన సంపాదనము మరియు సుఖాదుల ననుభవించుట మొదలగు కార్యములను చేయనారంభించును.

మరియు సత్వగుణము మరియు తమోగుణము ఈ రెంటిని అణచివుంచి ఎప్పుడు రజోగుణము విజృంభించునో అప్పుడు అది కర్మలు చేయుటయందు తృష్ణ అనగా తీవ్రమైన కోరిక మొదలగు వాటితో ప్రేరేపించబడి కార్యములు చేయనారంభించును.

అదే విధముగా సత్వగుణము మరియు రజోగుణము వీటి రెంటిని అధిగమించి ఎప్పుడైతే తమోగుణము వృద్ధిని పొందునో అప్పుడు అది జ్ఞానమును కప్పివుంచుట మొదలగు తన కార్యములను చేయనారంభించును.

ఏ కాలమునందు ఏ గుణము వృద్ధిని పొందియుండునో ఆ కాలమునందు ఆ గుణములక్షు సంబంధించిన ఫ ఏ ఛిహ్నములు ఎట్లుండునో ఛెప్పుచున్నారు –

**14.11. సర్వద్వారేషు దేహే ఽస్మిన్ప్రకాశ ఉపజాయతే,**
**జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత.**

అనగా – ఎప్పుడు ఈ శరీరమునందలి అన్ని ద్వారములందుమ అనగా ఆత్మయొక్క ప్రసారణకు ధ్వారములుగా వున్న కన్నులు, చెవ్వులు మొదలగు సమస్త యింద్రియములందు ప్రకాశము కలిగి అంతఃకరణము అనగా బుద్ధియందు కలుగు వృత్తిని ప్రకాశమందురు. ఆ ప్రకాశమే జ్ఞానమనబడుచున్నది. జ్ఞానమనబడు ఈ ప్రకాశము ఎప్పుడు శరీరమునందలి ద్వారములయందు అనగా యింద్రియముల యందు ప్రకాశించునో అప్పుడు ఈ జ్ఞానముయొక్క

ఈ ప్రకాశ రూపముతో వున్న చిహ్నము ద్వారానే యిప్పుడు సత్వగుణము వృద్ధియందున్నదని గ్రహించవలయును.

రజోగుణము వృద్ధిని పొందియున్నప్పుడు దాని గుర్తులు అనగా దాని చిహ్నములు ఈ క్రింది విధముగా వుందును.

**14.12. లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా,**
**రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ.**

అనగా – ఓ భరత వంశోత్తమా ! లోభము అనగా యితరుల సంపదను అక్రమంగా పొందవలయునను కోరిక, ప్రవృత్తి అనగా సామాన్య భావము ప్రాపంచిక వ్యాపారములందు రుచి, ఆసక్తి మరియు కర్మలు చేయుట ఆరంభించుట మరియు అశాంతి అనిగాని నిశ్చింతగా లేకుండుట, హర్షము మరియు ప్రాపంచిక విషయములందు రాగభావము కలిగియుండుట, మరియు లాలస అనగా సామాన్య భావముతో సమస్తమైన విషయములయందు అనగా ప్రాపంచిక వస్తువులయందు తృష్ణ అనగా వాటినన్నింటిని కలిగియుండవలయునన్న బుద్ధి మొదలగు చిహ్నములన్నియు రజోగుణము అభివృద్ధి చెందియున్నప్పుడు కలుగుచుండును అనగా ప్రకటితమగును.

**14.13. అప్రకాశో ఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ,**
**తమ స్యేతాని జాయంతే వివృద్ధే కురునందన.**

అనగా – ఓ కురునందనా ! అప్రకాశము అనగా మిక్కిలి అవివేకము ప్రవృత్తి అనగా కర్మలు చేయవలయునన్న కోరిక లేకుండుట ఆతని యొక్క కార్యములన్నియు ప్రమాదము మరియు మోహము అనగా అవివేకముతో కూడియున్న మూఢత్వము ఈ చిహ్నములన్నియు తమోగుణము వృద్ధిచెందినప్పుడు తోచునవి.

**మరణ సమయమున కలుగు** స్థితి కలిగినప్పుడు ఏ ఫలము లభించునో అది అంతయు ఆసక్తి మరియు రాగభేదముచేత కలుగునవి మరియు గుణములవలన కలిగినవే అగుచున్నవి. ఆ విషయము చెప్పబోవుచున్నారు.

**14.14. యదా సత్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్,**
**తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతి పద్యతే.**

అనగా – ఎప్పుడైతే ఈ దేహమును ధరించిన జీవుడు సత్వగుణము వృద్ధిని పొందియున్నప్పుడు తన దేహమును త్యజించునో అప్పుడు ఆ జీవుడు సర్వోత్తమ తత్వమును ఎఱింగిన మహనీయుల అనగా మహత్తత్వము మొదలగువాటిని బాగుగా ఎఱింగిన నిర్మలము అనగా మలరహితమైన లోకమును పొందును.

**14.15. రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే,**
**తథా ప్రలీన స్తమసి మూఢ యోనిషు జాయతే.**

అనగా - రజోగుణము బాగుగా వృద్ధి చెందియున్నప్పుడు దేహత్యాగము చేసిన జీవుడు కర్మాసక్తులయందు అనగా కర్మలు చేయుటయందు ఎక్కువ ఆసక్తి కలిగియున్న మనుష్య సమాజమునందు మరల దేహమును పొందును. అట్లే తమోగుణము వృద్ధియందున్న కాలములో దేహ త్యాగము చేసిన జీవుడు మూఢ యోనియందు అనగా పశుపక్ష్యాదుల దేహమును పొందును.

ఇప్పుడు యింతకు పూర్వము చెప్పిన శ్లోకముల యొక్క సారమును చెప్పుచున్నారు-

**14.16. కర్మణః సుకృతస్యాహుః సాత్వికం నిర్మలం ఫలమ్,**
**రజసస్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్.**

అనగా - మహాపండితులైన పురుషులు శుభకర్మలకు అనగా సాత్విక కర్మలయొక్క ఫలము సాత్వికము మరియు నిర్మలమై యుండునని చెప్పియున్నారు.

మరియు రాజస గుణవృద్ధి కాలమందు చేయబడిన కర్మల యొక్క ఫలము దుఃఖమని చెప్పియున్నారు. అనగా కర్మవికారముచేత రాజస గుణవృద్ధియందు చేయబడిన కర్మల ఫలము గూడ ఆ కర్మయొక్క కారణము ననుసరించి దుఃఖరూపమైన రాజసమే యగును. అని చెప్పి యున్నారు.

మరియు ఆ విధముగానే తామసగుణము ప్రధానముగా ఉన్న కాలమందు చేయబడిన కర్మలయొక్క ఫలము అనగా అధర్మము మరియు పాపకర్మల యొక్క ఫలము అజ్ఞానమని చెప్పియున్నారు.

గుణముల వలన ఉత్పన్నమగును; అనగా ఏమి జరుగును ? అన్నచో - చెప్పుచున్నారు -

**14.17. సత్వాత్సంజాయతే జ్ఞానం రాజసో లోభ ఏవ చ,**
**ప్రమాదమోహౌ తమ సో భవతో ఽజ్ఞానమేవ చ.**

అనగా - వృద్ధిని పొందియున్న సత్వగుణము వలన జ్ఞానము కలుగును. మరియు రజోగుణము వృద్ధిని పొందియున్నచో లోభగుణము వృద్ధిని పొందును. అట్లే తమో గుణము వృద్ధిని పొందియున్నచో ప్రమాదము మరియు మోహము ఈ రెండూ ప్రకోపించును. వాటితో పాటు అజ్ఞానము గూడ అభివృద్ధిని పొందును.

మరియు -

**14.18. ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః,**
**జఘన్యగుణవృత్తస్థా అధో గచ్ఛంతి తామసాః.**

అనగా - సత్వగుణము అభివృద్ధి చెందియున్న పురుషుడు పునర్జన్మయందు వుచ్చస్థానమును పొందును. అనగా దేవలోకము మొదలగు ఉచ్చలోకములందు జేరును.

రజోగుణముతో కూడియున్న పురుషుడు మధ్యలోకమునందే యుండును. అనగా మానవ యోనులయందు దేహమును పొందును. ఇంక

జఘన్యమైన అనగా పాపభూయిష్టములైన తమోగుణముతో కూడియున్న పురుషుడు ఆ తమోగుణ ప్రేరితములైన కార్యములు నిద్ర మరియు సోమరితనము మొదలగువాటియందు మగ్నమై క్రింది లోకములందు అనగా పశువులు, పక్షులు మొదలగు నీచయోనులయందు దేహమును పొందును.

ప్రకృతియందు అనగా ప్రకృతిరూపమైన స్థూలదేహాదుల యందుండి అదియే నేనని తలంచు మిథ్యాజ్ఞానముతో కూడియున్న పురుషునకు సుఖము దుఃఖము మరియు మోహరూపము అయిన భోగరూప గుణములయందు కలుగుచున్న "నేను సుఖవంతుడను. నేను దుఃఖవంతుడను లేక నేను మూఢుడను" అను యీ విధమగు భావములతో కూడి వుండుటయే యీ పురుషునకు మంచి చెడ్డ యోనులయందు దేహములను పొందుటకు ప్రతిరూపమైన సంసారమునకు కారణమగుచున్నది. ఈ మాట యింతకు పూర్వము పదమూడవ అధ్యాయమునందు సంక్షేపముగా చెప్పబడినది. దానినే యిచ్చట **"సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవా"** (చూ. గీత 14.5) అను శ్లోకము మొదలు పదునెనిమిదవ శ్లోకము వరకు గుణముల యొక్క స్వరూపము. గుణముల యొక్క కార్యములు ఆ గుణముల కార్యములచే బంధకత్వము మరియు గుణముల యొక్క కార్యముల ద్వారా బంధింపబడియున్న పురుషునికి కలుగు గతి (స్థితి) మొదలగు యీ అన్ని మిథ్యా జ్ఞానరూపమైన అజ్ఞాన మూలక బంధములు కలుగుటకు హేతువులైన కారణములు మొదలగువాటిని విశదముగా చెప్పి, ఇప్పుడు యధార్థ జ్ఞానము వలన కలుగు మోక్షమును గురించి చెప్పవలసి యున్నది. అందులకు భగవంతుడు యిట్లు చెప్పుచున్నాడు –

**14.19. నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టా ౨నుపశ్యతి,**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సో ౨ధిగచ్ఛతి.**

అనగా – ద్రష్టయైన పురుషుడు జ్ఞానమును పొంది, కార్యములు, కరణములు అనగా కార్యములను చేయు సాధనములు మరియు విషయముల ఆకారముగా పరిణమించిన గుణములకంటె వేఱుగ వేఱొక కర్తను చూడడో అనగా అన్ని అవస్థలయందును వున్నటువంటి ఆ గుణములే సమస్త కర్మలకు కర్తలనియు మరియు ఆ గుణములు చేయు వ్యాపారములకు **సాక్షిరూపముగా ఆత్మను గుణములకంటే వేఱుగ ఎఱుంగునో** అప్పుడు కేవలము ద్రష్టరూపమున వున్న ఆ ఆత్మరూప పురుషుడు నా భావమును పొందును. అనగా ఈశ్వర భావమును పొందును.

పురుషుడు ఈశ్వర భావమును ఎట్లు పొందును ? అన్నచో చెప్పుచున్నారు –

**14.20. గుణా నేతానతీత్య త్రీందేహీ దేహసముద్భవాన్,**
**జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తో ౨మృతమశ్నుతే.**

అనగా – దేహోత్పత్తికి కారణభూతమైన ఈ మాయోపాధిని కలిగియున్న యింతకు పూర్వము చెప్పబడినటువంటి సత్త్వ, రజ, తమోగుణముల మూడింటిని అధిగమించి అనగా

దేహాదులయందు వున్నప్పుడే ఈ గుణములను అధిగమించి దేహధారియైన విద్వాంసుడు దేహముతో వున్న కాలమందే జన్మము, మృత్యువు, వృద్ధాప్యము మరియు సర్వవిధ దుఃఖములు తనకు సంబంధించినవి కావని వాటినుండి విడువడి అమృతత్వమును అనగా తనకు మృత్యువు లేదను భావమును పొందును. అభిప్రాయమేమన ? ఈ విధముగా ఆ విద్వాంసుడైన పురుషుడు అనగా యింతకు పూర్వము దేహాదులతో తాదాత్మ్యమును పొంది జన్మమరణములు తనకు కలవని తలంచిన పురుషుడు యిట్టి జ్ఞానమును పొందుట ద్వారా నా భావమును అనగా జన్మమరణాదులు లేని ఈశ్వరభావమును పొందును.

'శరీరమును అనగా పంచభూతాత్మకమైన **దేహమును ధరించియున్న జీవుడు దేహమును ధరించియుండగానే త్రిగుణములను అధిగమించి అమృతత్వమును అనుభవించును'** అను ప్రశ్నకు బీజరూపముగా వున్న ఈ వాక్యమును విని అర్జునుడు యిట్లనెను -

**14.21. కైర్లింగై స్త్రీన్గుణానేతానతీతో భవతి ప్రభో,**
**కిమాచారః కథం చైతాంస్త్రీన్గుణానతివర్తతే.**

అనగా - ఓ ప్రభూ ! ఇంతకు పూర్వము మీచేత వర్ణించబడిన మూడు గుణములకు అతీతముగా అధిగమించియున్న పురుషుడు ఏ ఏ లక్షణములు కలిగియున్నప్పుడు ఆ మూడు గుణముల నుండి ముక్తుడగును ? అప్పుడు ఆతని ఆచరణ ఎట్లుండును ? మరియు మానవ దేహధారియైన పురుషుడు ఏ విధముగా అనగా ఎట్టి ఉపాయములచే ఈ మూడు గుణములకు అతీతుడుగా అనగా అధిగమించినవాడుగా వుండును.

ఈ పై శ్లోకమునందు అర్జునుడు గుణములను అధిగమించియున్న పురుషుని లక్షణము ఎట్లుండుననియు మరియు గుణాతీతుడగుటకు సాధనములైన ఉపాయము లెట్లుండును ? అని అడిగియున్నాడు. ఆ రెండు ప్రశ్నలకు తగు సమాధానము చెప్పుటకై భగవంతుడిట్లనెను. అర్జునా ! నీవు ముందుగా గుణాతీతుడైన పురుషుడు ఎటువంటి లక్షణములు కలిగియుండునో చెప్పెదను - వినుము -

**14.22. ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ,**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి.**

అనగా - **సత్వగుణము యొక్క కార్యము ప్రకాశము రజోగుణము యొక్క కార్యము ప్రవృత్తి మరియు తమోగుణము యొక్క కార్యము మోహము.** ఈ గుణములు వృద్ధిని చెందియున్నప్పుడు అనగా విషయములందు నిమగ్నమై యున్నప్పుడు అప్పుడు ఈ గుణములతో కూడియున్న పురుషుడు వాటిపట్ల విరోధ భావముగాని లేక ద్వేషభావముగాని కలిగియుండడు.

ముఖ్య అభిప్రాయమేమన పురుషుడు అలాంటి గుణముతో తాదాత్మ్యమును చెందియున్నప్పుడు 'నాయందు యిప్పుడు తామస గుణము ప్రకోపించి యున్నది. అందుచే నేను మోహభావమును పొందియున్నాను. అట్లే దుఃఖరూపమైన రజోగుణ ప్రకోపము వలన కలిగిన రాజసీ ప్రవృత్తి నాయందు ప్రకోపించియున్నది. ఆ ప్రవృత్తి నన్ను నా స్వరూపమును గుర్తించుట యందు విఫలము గావించినది. తన యథార్థ స్థితినుండి విచలితుడగుటవలన తనకు చాలా గొప్ప దుఃఖము కలుగుచున్నది. అట్లే ప్రకాశమయమైన సాత్వికగుణము నన్ను

వివేకవంతునిగా జేసి నన్ను అనిత్యమైన ప్రాపంచిక సుఖములందు నియోగించి బంధించుచున్నది. ఈ విధముగా సాధారణ మానవులు యధార్థ తత్త్వమును ఎఱుంగనివారైనందున ఆ గుణములను ద్వేషించుచుందురు. కాని ఆ గుణములను జ్ఞానబలంతో అధిగమించియున్న పురుషులు వాటిని తమ వశమునందుకొనినవారై యున్నందున వాటిని ద్వేషించరు. మరియు సాత్త్విక, రాజస మరియు తామస గుణయుక్తులైన పురుషులు ఎప్పుడు సాత్త్వికము మొదలగు భావములు తమ స్వరూపములను ప్రదర్శించి నివృత్తి చెందునో అప్పుడు వారు తిరిగి వాటిని కోరుచుందురు. ఆ విధముగా గుణాతీతుడైన పురుషుడు ఆ నివృత్తిని చెందియున్న గుణములకు సంబంధించిన కర్మలను కోరడు.

కాని ఈ లక్షణములన్నియు యితరులకు ప్రత్యక్షమగునవి కావు. అయితే మరి అవి ఎటువంటివి ? తమకు మాత్రమే ప్రత్యక్షమగు స్వభావము కలిగియున్న కారణమున **యివి స్వ సంవేద్యములు అనగా తమచేతనే తెలియబడునవై** యున్నవి. అట్లేలయన తమయందు మాత్రమే కలుగునటువంటి ద్వేషము లేక ఆకాంక్షలను యితరులు చూడజాలరు గదా ?

ఇప్పుడు గుణాతీతులైన పురుషులు ఏ విధమగు ఆచరణ కలిగియుందురో ఆ విధమును చెప్పుచున్నారు.

**14.23. ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే,**
**గుణా వర్తంత ఇత్యేవ యో ౨వతిష్ఠతి నేంగతే.**

అనగా – ఉదాసీనుని వలె వున్నటువంటి అనగా ఏ విధముగా ఉదాసీనుడై యున్న పురుషుడు ఏ పక్షమును వహించకయుండునో అదే భావముతో గుణాతీతుడై యున్న ఉపాయ రూపమైన మార్గమునందు స్థిరముగా ఉన్నటువంటి ఆత్మజ్ఞానియైన, సంన్యాసియైన పురుషుడు గుణముల ద్వారా వివేకముతో కూడియున్న జ్ఞానస్థితి నుండి చలింపజేయబడజాలడు.

ఇంకా స్పష్టముగా చెప్పవలయునన్నచో – కార్యము, కరణము మరియు విషయముల ఆకారముగ పరిణమించుచున్న గుణములే ఒకదానియందు మరియొకటి వ్యవహరించుచున్నవి అని తెలుసుకొన్న పురుషుడు చలించక స్థిరముగా వుండునో అనగా స్థిరమగు భావముతో అనగా చలించని భావముతో తన స్వరూపమునందే స్థిరముగా వుండును.

మరియు –

**14.24. సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మ కాంచనః,**
**తుల్య ప్రియా ప్రియో ధీరస్తుల్య నిందాత్మ సంస్తుతిః.**

అనగా – ఎవడు సుఖదుఃఖములందు చలించక సమముగా వుండునో అనగా ఎవనికి ప్రాపంచిక సుఖదుఃఖములు సమముగానే తోచునో, ఎవడు స్వస్థత కలిగి అనగా తన ఆత్మ స్వరూపమునందే స్థిరముగా వుండి ప్రసన్నచిత్తుడైయుండునో మరియు ఎవడు సమలోష్టాశ్మ కాంచనుడై అనగా మట్టి, రాయి మరియు బంగారము ఎవని దృష్టియందు సమముగానే తోచుచుండునో మరియు ఎవడు తుల్యప్రియాప్రియుడై అనగా ప్రియము మరియు అప్రియము అయిన రెండింటి యందును సమభావము కలిగియుండునో మరియు ఎవడు ధీరుడై అనగా బుద్ధిమంతుడై యుండునో మరియు తుల్యనిందాత్మ సంస్తుతి అనగా ఎవని బుద్ధియందు నింద

అనగా పొగడ్త రెండునూ సమానమై యుండునో అటువంటివాడు తన నిందాస్తుతులను
తలంచు యతి యై (యున్నాడు) వుండును.
మరియు -

**మానాపమానయోస్తుల్యస్తుల్యో మిత్రారి పక్షయోః,**
**సర్వారంభ పరిత్యాగీ గుణాతీతః స ఉచ్చతే.**

అనగా - ఎవడు మానావమానములను లెక్కచేయక రెండింటియందును ముగానే యుండునో మరియు మిత్ర శత్రుభావము లేక మిత్రులయందును యందును మిత్రభావము శత్రుభావము లేక యిరువురి పట్ల సమభావముగానే నో ఆతడు గుణాతీతుడనబడును.

మరియు ఎవడు ఎటువంటి కర్మలను ఆరంభించడో; దృష్టము అనగా కనుపించు మరియు అదృష్ట ఫలములను పొందుటకు చేయు ప్రయత్నము ఆరంభమనబడును. సమస్తమైన ఆరంభములను త్యజించునట్టి స్వభావము గలవాడు "సర్వారంభ అనబడును. అనగా ఎవడు కేవలము స్థూలదేహపోషణార్థము అవసరమైన కర్మలు **తర సమస్త కర్మలను త్యజించినవాడు. గుణాతీతుడైన పురుషుడనబడును.**

'ఉదాసీనవత్' అను పదము మొదలు **"గుణాతీతః స వుచ్చతే"** అను శ్లోకము వరకు చెప్పబడినదో అవన్నియు ఎప్పటివరకు సంపాదించుకొనుట కొఱకు యోగ్యములుగా అప్పటివరకు ముముక్షువు అనగా సంన్యాసి కొఱకు అనుష్ఠించుటకు యోగ్యమై ణాతీతత్వ ప్రాప్తికి సాధనములై వుండును. ఎప్పుడు ఆతడు స్థిరపడునో అప్పుడు డైన సంన్యాసికి స్వాభావిక లక్షణములుగా పరిణమించును.

మానవుడు పై మూడు గుణములను ఎట్లు అధిగమించును ? అను ప్రశ్నకు నము చెప్పుచున్నారు -

**మాం చ యో ఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే,**
**స గుణాన్సమతీత్యైతాన్బ్రహ్మ భూయాయ కల్పతే.**

అనగా - ఏ సంన్యాసి లేక కర్మయోగి సర్వభూతములయందు సమముగా వ్యాపించి రమేశ్వరుడను మరియు నారాయుణడను అయి వున్న నన్ను ఎన్నడు చలించనటువంటి ము ద్వారా సేవించుచుండునో, భజన యొక్క పేరు భక్తి. అదియే యోగము కూడాను. భక్తియోగము ద్వారా ఎవడు నన్ను భజించుచుండునో ఆతడు యింతకు పూర్వము ట్టి త్రిగుణములను అతిక్రమించి బ్రహ్మలోకమును పొందుటకు అనగా లోకబంధముల డువడి మోక్షస్థితిని పొందుటకు యోగ్యుడనబడును. అనగా మోక్షమును పొందుటకు గును.

అలా ఎందుకు అగును ? అన్నచో చెప్పుచున్నాడు.

**బ్రహ్మణో హి ప్రతిష్ఠా ఽహమమృతస్యావ్యయస్య చ,**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ.**

అనగా – అట్లేలయన ? బ్రహ్మ అనగా పరమాత్ముని యొక్క ప్రతిష్ఠను నేనై యున్నాను. దేనియందు ప్రతిష్ఠితమగునో అది ప్రతిష్ఠ. ఈ ఉత్పత్త్యర్థము ననుసరించి నేను అంతరాత్మయగు బ్రహ్మను అనగా బ్రహ్మయొక్క ప్రతిరూపము (ప్రతిష్ఠ)ను.

ఎటువంటి బ్రహ్మకు నేను ప్రతిష్ఠ నన్నచో – చెప్పుచున్నారు.

ఎ అమృతము, నాశము లేనిది అనగా అవినాశి, అవ్యయము, నిర్వికారము, శాశ్వతము, నిత్యము, ధర్మస్వరూపము, జ్ఞానయోగ రూపము ధర్మము ద్వారా పొందదగినది మరియు ఏకాంతికము అనగా ఒక్కటైయున్న సుఖస్వరూపము అనగా వ్యభిచారరహితమై ఆనందమయమై యున్నదో అటువంటి బ్రహ్మకు నేను ప్రతిష్ఠను అనగా ప్రతిరూపమును అయి వున్నాను.

అమృతము మొదలగు స్వభావమును కలిగియున్న పరమాత్మయొక్క ప్రతిష్ఠ అంతరాత్మయే అయి వున్నది. ఏలయన ? **యథార్థ జ్ఞానము ద్వారా ఆ ప్రతిష్ఠయే అనగా ఆ అంతరాత్మయే పరమాత్మ రూపముగ నిశ్చయమగును.** ఈ విషయమే **"బ్రహ్మ భూయాయ కల్పతే"** అను పదము ద్వారా చెప్పబడినది.

అభిప్రాయమేమన ? ఎటువంటి ఈశ్వరీయ శక్తిద్వారా భక్తులను అనుగ్రహించుటకు బ్రహ్మ ప్రవర్తించునో ఆ శక్తి ఆ బ్రహ్మస్వరూపడను నేనే. ఏలయన ? **శక్తి మరియు శక్తిమంతునియందు అభేదమేగాని భేదముండదు.**

అట్లుగాక మరియొక దృష్టితో చూచిన – బ్రహ్మ శబ్దమునకు వాచ్యమైనందున యిచ్చట సగుణబ్రహ్మమే గ్రహించబడుచున్నది. అటువంటి సగుణ బ్రహ్మమునకు నేను నిర్వికల్ప నిర్గుణ బ్రహ్మమునకు ప్రతిష్ఠ అనగా ఆశ్రయము అనగా ప్రతిరూపమునై యున్నాను. యింక యితర మేమియులేదు.

ఏ ఏ విశేషణములతో కూడియున్న సగుణ బ్రహ్మమునకు ప్రతిరూపమై యున్నారు? అన్నచో –

**ఏది అమృతము అనగా మరణించు ధర్మము లేనిదై యున్నదో మరియు అవినాశి అనగా క్షయము లేనిదై యున్నదో ఆ సగుణబ్రహ్మకు.**

మరియు జ్ఞాననిష్ఠారూపమై యున్న శాశ్వతము అనగా నిత్యమైయున్న ధర్మము యొక్క మరియు దానివలన జరుగు ఏ కాంతికము అనగా ఒక్కటే అయివున్న నిశ్చితమైన పరమ ఆనందమునకు గూడ నేనే ఆశ్రయమై యున్నాను. **"అహంప్రతిష్ఠా"** ఈ పదము యిచ్చట ఆను వృత్తి ననుసరించి చెప్పబడినది.

*శ్రీ శ్రీ శ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి*
*గుణత్రయ విభాగ యోగమనబడు పదునాల్గవ అధ్యాయమునకు*
*శ్రీ శ్రీ శ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు*
*తెనుగు అనువాదము సమాప్తము.*
*అనువాదకులు : శ్రీ సదానంద భారతి.*
*ప్రణవాశ్రమము.*

# పదునైదవ అధ్యాయము

ఏలయన ? – కర్మలు చేయువారి కర్మఫలములు మరియు జ్ఞానులయొక్క జ్ఞాన ఫలములు నాయధీనమునందున్నవి. అదే విధముగా భక్తియోగము ద్వారా నన్ను భజించువారు గూడ నా కృపవలన గుణాతీతులై జ్ఞానమును పొందుక్రమమునను సరించి మోక్షలాభమును పొందుదురు. అలాంటి స్థితియందు ఆత్మతత్త్వమును యథార్థముగా ఎఱుంగువారిని గుఱించి యింక చెప్పవలసినదేమున్నది ? అందుచేత అర్జునుడు అడుగకపోయినను తనతత్త్వమును గురించి చెప్పదలంచినవాడై భగవంతుడు **"ఊర్ధ్వమూలమ్"** మొదలగు శ్లోకములు చెప్ప నారంభించినారు.

ఇచ్చట ముందుగా వైరాగ్యభావము కలిగించుభావముతో వృక్ష స్వరూపమును కల్పించి సంసార స్వరూపమును వర్ణించుచున్నారు. ఏలయన ? **సంసారమునందు విరక్తిని చెందియున్న పురుషునికి మాత్రమే భగవంతుని తత్త్వమును తెలుసుకొనగల అధికారము ఏర్పడును. అన్యులకు సాధ్యము కాదు.** అందుచే భగవంతుడు యిట్లు పలికినారు –

**15.1. ఊర్ధ్వమూలమధఃశాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్,**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్.**

అనగా – సంసారరూపమైన యీ వృక్షము ఆకాశమువైపునకు అనగా పైకి వ్రేళ్లు కలిగినదై యున్నది. కాలముకంటె గూడ సూక్ష్మమై, అన్నింటికి కారణమైయున్నది. నిత్యమూ మరియు చాలా గొప్పది అయివున్నందున అవ్యక్తము మరియు మాయాశక్తితో కూడియున్నందున బ్రహ్మము అన్నంటికంటె గొప్పదని చెప్పబడుచున్నది. అట్టి బ్రహ్మమే దీనికి మూలము (మొదలు) అయివున్నది. అందుచేతనే ఈ సంసారవృ క్షము ఆకాశవైపునకు మొదలు అనగా వ్రేళ్లు కలిగియున్నది. **"ఊర్ధ్వమూలో ౾వాక్శాఖః"** కఠ. ఉ. 2.6.1. అనగా పైకి మొదలు మరియు క్రిందికి కొమ్మలు కలిగినది అయి వున్నది. పై శ్రుతి ద్వారా యీ మాట ప్రమాణయుక్తమై యున్నది.

పురాణాదులయందు గూడ –

అవ్యక్త రూపమైన మూలము నుండి రూపము దాల్చినట్టియు, ఆ అవ్యక్తము యొక్క అనుగ్రహము వలననే వృద్ధిని పొందినదై, బుద్ధిరూపమైన ప్రధాన శాఖలతో కూడియున్న, మధ్యమధ్య యింద్రియముల రూపమైన తొఱ్ఱలు గలిగి, మహాభూతములనెడి శాఖోపశాఖలు గలిగియున్నదై, విషయరూపమైన ఆకులు గలదై, ధర్మాధర్మ రూపములైన పువ్వులు గలదై మరియు సుఖ–దుఃఖములనబడు ఫలములు కలిగియున్నదైనటువంటి యీ వృక్షము సమస్త

భూతముల నుండి ఆజీవ్య అనగా పోషకపదార్థములను పొందుచున్న సనాతనమైన బ్రహ్మవృక్షమై యున్నది. ఇదియే బ్రహ్మవనము, దీనియందే బ్రహ్మము ఎల్లప్పుడూ వుండును. ఇటువంటి యీ బ్రహ్మవృక్షమును జ్ఞానరూపమైన చక్కని పదునైన ఖడ్గము ద్వారా ముక్కలు ముక్కలుగా ఛేదించి ఆత్మయందే ప్రేమభావము కలిగియున్నవారు తిరిగి అచ్చటి నుండి తిరిగిరారు అని పురాణాదులయందు చెప్పబడియున్నది.

ఇటువంటి పైకి మొదలు, క్రిందివైపునకు కొమ్మలు కలిగియున్న ఈ మాయారూపము గలిగిన సంసారవృక్షమును అనగా మహతత్వము, అహంకారము తన్మాత్రాది శాఖలవలె క్రిందివైపునకు వ్యాపించియున్నవో, అటువంటి ఈ క్రిందికి వ్యాపించియున్న శాఖలు కలిగి మరియు రేపటివరకు గూడ స్థిరముగ వుండనటువంటి ఈ క్షణభంగురమైన **అశ్వద్ధ వృక్షమును అవ్యయమందురు.**

ఈ మాయామయ ప్రపంచము అనాదికాలము నుండి వుండుచునే యున్నది. అందువలననే యీ సంసార వృక్షము అవ్యయమనబడుచున్నది. మరియు యిది ఆది అంత రహితమైన దేహాదులకు పరంపరగ ఆశ్రయమై, ప్రసిద్ధమై యున్నది. అందుచేత దీనిని అవ్యయమని చెప్పుచున్నారు.

అటువంటి సంసారవృక్షమునకే మరికొన్ని విశేషణములు గూడ చెప్పబడుచున్నవి.

ఋగ్వేదము, యజుర్వేదము మరియు సామవేద రూపమైన శాస్త్రములు, ఏ సంసార వృక్షమునకు ఆకులవలె రక్షించునవై యున్నవో అవి ఆకులు అనబడుచున్నవి. ఏ విధముగా ఆకులు చెట్టును రక్షించునవై యుండునో ఆ విధముగానే వేదములు ధర్మము, అధర్మము వాటి కారణములు మరియు ఫలమును ప్రకాశింపజేయునవై వున్నందున అవి సంసారరూపమైన వృక్షమును రక్షించునవై యున్నవి.

ఈ విధముగా విస్తారపూర్వకముగా చెప్పబడిన ఏ సంసారవృక్షము కలదో దానిని ఏ పురుషుడు సమూలముగా ఎఱుంగునో ఆతడు వేదములను ఎఱింగినవాడు అనగా వేదార్థమును ఎఱింగినవాడగును.

ఏలయన ? మూల సహితముగా ఈ సంసారవృక్షము కంటె వేఱుగ ఎఱుంగదగిన మరియొక వస్తువు కొంచెము గూడలేదు. అందుచేత ఎవడు ఈ విధముగా వేదార్థమును ఎఱింగినవాడగునో ఆతడే సర్వజ్ఞుడు. ఈ విధముగా భగవంతుడు సంసారవృక్షమును ప్రశంసించుచున్నాడు.

అటువంటి సంసార వృక్షము యొక్క వేఱు వేఱు అంగములను గురించి విశదముగా చెప్పబడుచున్నది.

**15.2. అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయ ప్రవాలాః, అధశ్చ మూలాన్యనుసంతతాని కర్మానుబంధీని మనుష్యలోకే.**

అనగా - తన యొక్క ఉపాదాన కారణరూపమైన సత్వము, రజము మరియు తమము అను ఈ మూడు గుణముల వలన వృద్ధిని చెందినవై అనగా స్థూలభావమును

(రూపమును) పొందినదై మరియు విషయరూపముల వంటి చిగుళ్ళు కలదైవున్న ఆ వృక్షము యొక్క అనేకమైన శాఖలు తమతమ కర్మలు మరియు జ్ఞానమునకు తగిన (అనురూపమైన) కర్మలు మరియు జ్ఞానమునకు ఫలస్వరూపములైన ఏ యోనులు కలవో అవి క్రిందివైపునకు మానవయోని మొదలు చీమయోని పర్యంతము మరియు పైకి ధర్మము అనగా విశ్వకర్తయైన బ్రహ్మపర్యంతము వృక్షముయొక్క శాఖలవలె వ్యాపించియున్నవి. కర్మఫల రూపమైన దేహాది శాఖలు మొదలగువానిద్వారా శబ్దాది విషయములు, చిగుళ్ళవలె రూపములను దాల్చు చుండును. అందుచేత ఆ దేహాదులవలె వున్న శాఖలు విషయములనెడు చిగుళ్ళవలె వుండి యున్నవి.

సంసారవృక్షమునకు ముఖ్యాధారమైన ఉపాదాన కారణము యింతకు పూర్వమే చెప్పబడినది. ఇప్పుడు కర్మఫలజనితములైన రాగద్వేషాదుల యొక్క వాసనలు యివి మూలముతో సమానముగా ధర్మాధర్మ విషయిక ప్రవృత్తి యొక్క కారణము మరియు అవాంతర ధర్మాధర్మ విషయక ప్రవృత్తి యొక్క కారణము మరియు అవాంతర (అనగా అప్పుడప్పుడు)ముగా కలుగుచుండునో వాటిని గురించి చెప్పబడుచున్నది. అవి మనుష్యలోకమునందు కర్మాను బంధములై వాసనారూపములైన వ్రేళ్లు దేవాదులకంటె యింకా క్రిందికిగూడ అవిచ్ఛిన్న రూపముగా వ్యాపించియున్నవి. పుణ్యాపాపరూపములైన కర్మలు అనగా వుత్పత్తిని అనుసరించునవై యున్నందున కర్మానుబంధములనబడుచున్నవి. **ఇచ్చట విశేషముగా కర్మలయందు మనుష్యలోకముననే అధికారము ప్రసిద్ధమైయున్నది.** అందుచేత ఆమూలములు మనుష్య లోకమునందు కర్మానుబంధములని చెప్పబడినవి.

ఇచ్చట వర్ణించబడిన సంసారవృక్షము ఎట్లున్నదన –

**15.3. న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా;**
**అశ్వత్థమేనం సువిరూఢమూలమసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా.**

అనగా – సంసారవృక్షమునకు పైన చెప్పిన స్వరూపము ఎల్లప్పుడూ పైన వర్ణించ నబడినట్లుగా వుండదు. ఏలయన ? అది స్వప్నమునందు తోచువస్తువువలెను; మృగమరీచి కలయందలి జలము వలెను; మరియు మాయచే రచింపబడిన గంధర్వ నగరము వలెను వున్నందున మనం చూస్తూ వుండగానే అది నశించిపోవుచున్నది. ఈ కారణమువలన ఈ సంసార వృక్షమునకు అంతము అనగా దాని యొక్క అంతిమ అవస్థ, అవసానదశ లేక సమాప్తమగుట అనగా లేకుండపోవుట అనునది లేనేలేదు.

అంతేకాదు ఈ సంసారవృక్షమునకు ఆరంభమనుసది గూడలేదు. అనగా "ఇదిగో యిచ్చట యిప్పుడు ఆరంభమై ప్రపంచమనబడుచున్నది " అను విషయము ఎవ్వని చేతను ఎఱుంగబడదు. మరియు దీనికి ఒక రూపము కలిగి స్థిరముగా వుందు స్థితి గూడ లేదు. అనగా ఆది అనగా ఆరంభము మరియు దాని యొక్క అంతము మరియు మధ్యస్థితిని గురించి గూడ ఎవ్వరికిని ఎటువంటి సమాచారము లేదు.

ఈ పైన చెప్పబడిన అత్యంత దృఢమైన మూలము గలిగియున్నట్టి సంసారరూపము కలిగియున్న ఈ అశ్వత్థ వృక్షమును అసంగమను శస్త్రముచే ఛేదించి అనగా ఏషణత్రయము అనగా పుత్రేషణ అనగా భార్యాపుత్రులయందుండు ప్రేమ, విత్తేషణ అనగా ప్రాపంచిక సంపదలయందుండు ఆసక్తి మరియు లోకేషణాది అనగా యీ లోకము పట్ల కలిగియుండే ప్రేమ మొదలగువన్నిటియందును వైరాగ్య భావము కలిగియుండుటయే "అసంగత్వ"మనబడును. అటువంటి అసంగమను శస్త్రముచే పరమాత్మయందు స్థిరముగా నిలిచియున్న దృఢమైన బుద్ధి కలిగి మరియు అనేక పర్యాయములుగా వివేకమను రాతిపై ఆ అసంగమను శస్త్రమును బాగుగా పదును కలుగునట్లుగా రుద్ధి ఆ శస్త్రమును చక్కని పదునుగలదానిగా జేసి దానితో ఈ సంసారవృక్షమును సమూలముగా నిర్మూలించవలయును.

**15.4. తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్గతా న నివర్తంతి భూయః,**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ.**

అనగా – ఆ తరువాత ఆ పరమవైష్ణవ పదమును వెదుకవలయును అనగా ఏ పదవి యందు చేరిన పురుషుడు తిరిగి ఎటువంటి దేహమును పొందదో అట్టి స్థితిని ఎఱుంగ వలయును.

ఆ పదవిని ఎట్లు పొంద అనగా కనుగొనవలయును ? అన్నచో– "పదము" శబ్దము ద్వారా చెప్పబడినది ఏమనగా–**"ఆ ఆదిమ పురుషుని ఆశ్రయించియే నేను వున్నాను"** అను దృఢమైన భావముతో అనగా ఆతని శరణాగతిని పొందినభావముతో ఆతని సాన్నిధ్యమును పొందు మార్గమును వెదుకవలయును.

ఆ ఆదిమపురుషుడెవడు ? అన్నచో – చెప్పుచున్నారు –

ఏ పురుషుని వలన గారడీవాని మాయవలె ఆ మాయచే ఏర్పడిన సంసార వృక్షమునకు సంబంధించిన సనాతన ప్రవృత్తి విస్తారమును పొందియున్నదో అనగా ప్రపంచమను భావమున స్థిరపడియున్నదో –

అట్టి పరమపదమును పురుషుడు (మనుష్యుడు) ఏలాగున పొందగలడు ? అన్నచో– చెప్పుచున్నారు –

**15.5. నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః,**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖ సంజ్ఞైర్గచ్ఛన్త్యమూఢాః పదమవ్యయం తత్.**

అనగా – మాన మోహాదుల నుండి ముక్తిని పొందినవాడు, అభిమానము మరియు అజ్ఞానమును తొలగించు కొనినవాడు మాత్రమే, మరియు ఎవడు జితసంగదోషములు లేనివాడో అనగా ఆసక్తి రూపమైన దోషమును తొలగించుకొనియున్నాడో, ఎవడు సర్వకాల సర్వావస్థల యందును అధ్యాత్మ చింతనయందు మునిగియున్నాడో అనగా సర్వకాల సర్వావస్థలయందును

పరమాత్మయొక్క స్వరూపమును గురించిన విచారణయందు తత్పరుడై యున్నాడో, ఎవడు ఎటువంటి కామభావము అనగా ఎటువంటి కోర్కెలు లేక యున్నాడో మరియు ఏ మానవుని సమస్తమైన కోరికలు సమూలముగా నశించిపోయినవో అటువంటి యతి అనగా సంన్యాసియైన వాడు అనగా సుఖ-దుఃఖములు అను ప్రియ మరియు అప్రియాది ద్వంద్వముల నుండి తొలగియున్నాడో ఆ మోహరహితుడు, ఆజ్ఞాని ఆ పైన చెప్పబడిన ఎన్నడూ నశింపనటువంటి పరమపదమును పొందును.

ఆ పదము అనగా ఆ పరమపదమును గురించి మరల యితర విశేషణముల ద్వారా వివరించుచున్నారు -

**15.6. న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః,
యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ.**

అనగా - శ్లోకమునందలి "తత్" శబ్దమునకు తరువాత వున్న 'ధామ్' శబ్దముతో సంబంధము కలదు.

ఆ తేజోమయ ధామమును అనగా పరమపదమును సూర్యుడు - ఆదిత్యుడు మొదలగువారు అందరిని ప్రకాశింపజేయు సామర్థ్యము కలవాడైయున్నప్పటికి ప్రకాశింపజేయజాలడు. అట్లే శశాంకుడు అనగా చంద్రుడు మరియు అగ్ని గూడ ఆ పరమధామమును ప్రకాశింపజేయజాలడు. ఏ పరమధామమును పొందిన మనుష్యుడు తిరిగి భూమి మీదికి రాడో మరియు ఏ పరమధామమును సూర్యాదిజ్యోతులు ప్రకాశింపజేయజాలవో అది అనగా **ఆ పరమధామము విష్ణువునై యున్న నా యొక్క నిలయము.**

**పూర్వపక్షము** - "ఎచ్చటకు వెళ్లి మరల తిరిగిరాడో" అనుమాట చెప్పబడినది. కాని సర్వగతులు పునరాగమన స్వభావమును కలిగియుండును. ఈ సిద్ధాంతము సర్వప్రసిద్ధము. అట్టి స్థితిలో ఆ పరమ ధామమును పొందిన పురుషుడు తిరిగిరాడు అని చెప్పుట ఎట్లు కుదురును ?

దానికి గల కారణమెద్దియో చెప్పెదవినుము -

**15.7. మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః,
మనః షష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి.**

అనగా - జీవలోకమునందు అనగా యీ లోకమునందు ఏ జీవరూపము దాల్చి యున్న శక్తి (తత్వము) కర్త మరియు భోక్త మొదలగు నామములతో ప్రసిద్ధి జెందియున్నదో అది అనగా ఆ శక్తి పరమాత్ముడనైన నా యొక్క సనాతన అంశమై యున్నది. అనగా అంగము, దేశము, భాగము అని ఎన్ని విధములుగా చెప్పినను అభిప్రాయము ఒకే వస్తువును సూచించునదై యున్నది.

ఏ విధముగా జలమునందు ప్రతిబింబము సూర్యుని ప్రతిబింబము జలరూపమైన నిమిత్తము అదృశ్యమైనప్పుడు ఆ ప్రతిబింబము తిరిగి సూర్యుని యందే చేరుటకు తిరిగిరాదో

ఆ విధముగానే పరమాత్ముని అంశమైన ఆ జీవరూపము గూడ తన నిజస్వరూపమును గుర్తించినపుడు ఆ పరమాత్ముని యందే కలిసిపోవును. అందుచేత అది తిరిగిరాదు.

మరియొక విధముగా చూచిన - ఘటము మొదలగు వుపాధులయందు పరిచ్ఛిన్నముగా అనగా వేఱుగా వున్నట్లుగా తోచు ఆకాశము. ఆకాశము యొక్క అంశమే అయి వున్నది. ఆ ఆకాశాంశము ఘటాది వుపాధులు నశించినప్పుడు ఆ ఘటాకాశములు మహాకాశము నందు విలీనమై తిరిగి ఘటమునందు చేరవు. ఆ విధముగానే జీవుని విషయమునందు గూడ ఘటింపవలయును. అందుచేత "ఎచ్చటకు చేరి తిరిగిరారో" అని చెప్పుట శాస్త్ర సమ్మతమే.

**పూర్వపక్షము** - అవయవరహితుడైన పరమాత్మ యొక్క ఒక అంశము అనగా అంగము. ఒక దేశము లేక ఒక అంశముగా ఎట్లు విభజింపబడును ? లేక ఆ పరమాత్ముని అవయవములు గలవానిగా ఒప్పుకొన్నచో ఆ అవయవముల విభజన జరిగినచో ఆ పరమాత్మయొక్క వినాశ ప్రసంగము సంభవించును గదా !

**సమాధానము** - ఇందులో దోషమేమియు లేదు. ఏలయన ? **అవిద్యకారణముగ ఉపాధిచేత పరిచ్ఛిన్నమైన అనగా వేఱుగా వున్నట్లుగా తోచుచున్న ఒక దేశమే, అంశమువలె చెప్పబడినది.** ఈ విషయము క్షేత్రాధ్యాయమునందు విస్తార పూర్వకముగా చెప్పబడినది.

నా యొక్క అంశరూపముగా చెప్పబడిన ఆ జీవుడు ఈ ప్రపంచములోనికి ఎట్లు ప్రవేశించుచున్నాడు ? తిరిగి ఎట్లు శరీరమును త్యజించి తిరిగి తన స్థానమును పొందుచున్నాడు? ఈ విషయము యిప్పుడు చెప్పబడుచున్నది -

ఈ జీవనామధారియైన ఆత్మ ఆరవది అయివున్న మనస్సు, చెవులు మొదలగు తమతమ గోళకములయందు ప్రకృతి సిద్ధముగా ఏర్పడియున్న చెవులు మొదలగు యింద్రియములను ఆకర్షించుచుండును.

ఏ కాలమునందు అనగా అట్టి స్థితియందు మనస్సు ఆ యింద్రియములను ఆకర్షించుచుండును ? అన్నచో - చెప్పుచున్నారు -

**15.8. శరీరం యదవాప్నోతి యచ్చా ప్యుత్క్రామతీశ్వరః,**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధా నివాశయాత్.**

అనగా - ఎప్పుడు యీ దేహాది సంఘాతమునకు యజమానియైన జీవుడు దేహమును వదలివెళ్లునో అప్పుడు ఈ యింద్రియములను ఆకర్షించును. మరియు ఈ జీవాత్మ ఎప్పుడు ముందుగా ప్రస్తుత దేహమును వదలి మరియొక దేహమును పొందునో అప్పుడు ఈ ఆరు యింద్రియములతో మనస్సును కూడ వెంటబెట్టుకొని పోవును.

ఏ విధముగా వెంటబెట్టుకొని వెళ్లును ? అన్నచో - చెప్పుచున్నారు. ఏ విధముగా వాయువు పుష్పాదుల నుండి గంధమును అనగా వాసనలను వెంటబెట్టుకొని పోవునో ఆ

విధముగా జీవాత్మ మనస్సుతో పాటు ఆరు యింద్రియములను వెంటబెట్టుకొని మరియొక దేహమునందు ప్రవేశించును.

**15.9. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ,**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే.**

అనగా - ఈ దేహమునందు చేరియున్నట్టి జీవాత్మ చెవ్వులు, కన్నులు, త్వచ అనగా స్పర్శజ్ఞానమును పొందు చర్మము, నాలుక మరియు ముక్కు వీటి నుండి ప్రతి యింద్రియమును మరియు ఆరవదియైన మనస్సును ఆశ్రయముగా జేసుకొని శబ్దాది విషయములను సేవించుచుండును.

ఈ విధముగా దేహమును ధరించియున్న జీవాత్మను దేహము నుండి......

**15.10. ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్,**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞాన చక్షుషః.**

అనగా - ముందుగా లభించియున్న దేహమును వదలి వెళ్లుచున్నటువంటి లేక దేహమునందు వ్యాపించియున్నటువంటి లేక శబ్దాది విషయములను అనుభవించు చున్నటువంటి లేక సుఖ దుఃఖములు, మోహముమ మొదలగు గుణములతో కూడియున్నటువంటి అనగా ఈ విధముగా అతి చక్కగా కనబడుచున్న అనగా అనుభవ గోచరమగుచున్న అనగా తెలియబడుచున్నటువంటి ఆత్మను మూఢులైన వారు అనగా దృష్టము అదృష్టము అయినటువంటి విషయభోగములందలి కలిగియున్న ఆసక్తి బలముతో చిత్తము చిక్కుకొని యున్నందున అనేక విధములుగా మోహితులగుచున్నారు అనగా ఆత్మను చూడజాలకయున్నారు. అయ్యో ! ఎంత దురదృష్టకరమైన అనగా బాధాకరమైన విషయము అని చెప్పి భగవంతుడు అటువంటివారి పట్ల జాలిపడుచున్నారు.

అట్లుగాక ప్రమాణముల ద్వారా కలిగియున్న కన్నులుగల వారు అనగా వివేకముతో కూడియున్న దృష్టిగలవారు ఆయాత్మను చూచుచున్నారు.

**15.11. యతంతో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్,**
**యతంతో ఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః.**

అనగా - నిరంతరము ప్రయత్నము చేయుచున్నటువంటి సమాహితచిత్తులైన అనగా తన చిత్తమును తన యధీనము నందుంచుకొన్నటువంటి యోగులు ఈ యాత్మను అనగా ప్రస్తుత ప్రకరణమునందు చెప్పడుచున్న ఆత్మను తమ యంతఃకరణములందు వ్యాపించియున్నట్లుగా చూచుచుందురు. అనగా "అదియే నేనైయున్నాను" అను భావముతో ఆత్మ స్వరూప సాక్షాత్కారమును పొందుచున్నారు.

కాని తపము మరియు యింద్రియ జయము మొదలగు సాధనముల ద్వారా తమ యంతఃకరణములను శుద్ధి చేసుకొననటువంటి మూఢులు మరియు తమను లోకమునందు బంధించియుంచునట్టి విషయభోగముల నుండి తమ మనస్సును మరల్చుకొని యుండలేదో, మరియు శాంతియనునది లేక దేహ-లోక వస్తు సముదాయ సంగ్రహమును చూచుకొని గర్వముతో నిండియున్న బుద్ధికలవారై యున్నారో వారు అనగా అటువంటి అవివేకులైన పురుషులు శాస్త్రాదిప్రమాణముల ద్వారా ప్రయత్నించు చుండియు యీ ఆత్మను చూడజాలక యున్నారు.

సర్వమును ప్రకాశింపజేయు అగ్ని, సూర్యుడు మొదలగు జ్యోతులు గూడ ఏ పరమపదమును ప్రకాశింపజేయజాలకున్నవో, మరియు ఏ పరమపదమును పొందినట్టి ముముక్షువులు అనగా మోక్షమును పొందియున్నవారు ఏ విధముగా తిరిగి సంసారమువైపునకు రారో మరియు ఘటము, మఠము మొదలగు వాటియందు నిండియున్న ఆకాశము ఆ మహాకాశము యొక్క అవిభాజ్య అంశమే అయివున్నదో ఆ విధముగానే వుపాధులు కారణముగా వేఱువేఱుగా వున్నట్లుగా తోచు జీవులందరూ ఆ పరమ పదము (ఆ పరమాత్మ) యొక్క అవిభాజ్య అంశములే అయివున్నారు.

సర్వాత్మత్వమును మరియు సమస్త వ్యవహారములకు ఆధారరూపముగా వున్నట్టి పరమపదత్వమును గురించి విపులముగా చెప్పదలంచినవాడైన భగవంతుడు నాల్గు శ్లోకముల ద్వారా సంక్షిప్తముగా ఆ విభూతులను వర్ణించుచున్నారు.

**15.12. యదాదిత్యగతం తేజో జగద్భాసయతే ఽఖిలమ్;**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్.**

అనగా - సూర్యుని యందు నిక్షిప్తమైయున్న తేజము, దీప్తి, మరియు ప్రకాశము అనగా ఏ ప్రకాశము సూర్యుని ఆశ్రయించి సమస్త జగత్తును ప్రకాశింపజేయుచున్నదో మరియు ప్రపంచమును ప్రకాశింపజేయు ఏ ప్రకాశము శశాంకుని అనగా చంద్రుని ఆశ్రయించియున్నదో, మరియు ఏ ప్రకాశము అగ్నియందు నిండియున్నదో ఆ ప్రకాశమంతటినీ విష్ణువునైయున్న నా యొక్క ప్రకాశముగా నీవు గుర్తించుము.

అట్లుగాకున్న, సూర్యుని యందు ఏ చైతన్య స్వరూపమైన జ్యోతి నిండియున్నదో మరియు చంద్రునియందు మరియు అగ్నియందు నిండియున్న చైతన్యమయ జ్యోతిని విష్ణువునై యున్న నా యొక్క పరమజ్యోతిగా నీవు గుర్తించుము.

**పూర్వపక్షము** - ఆ చైతన్యముతో కూడియున్న జ్యోతి ప్రపంచమందలి చరాచరములైన అనగా జడచేతనములైన సర్వపదార్థములయందును సమభావముగా నిండియున్నది గదా ! అట్టి స్థితియందు "ఏ తేజస్సు సూర్యునియందు నిండియున్నదో" అను విశేషత్వము ఎట్లు చెప్పబడుచున్నది ?

**సమాధానము** - సత్వము అనగా స్వచ్ఛత వాటియందు అనగా సూర్య చంద్రాదుల యందు అధికముగా వున్నందున అట్లు చెప్పబడినది. అందుచేత అది దోషము కాదు. ఏలయన?

సూర్యుని యందు అత్యధికమగు ప్రకాశము మరియు స్వచ్ఛత నిండియున్నవి. అందుచేత ఆ పరమాత్మ యొక్క వెలుగు అనగా ఆబ్రహ్మాజ్యోతి ఆ సూర్య చంద్రాదులయందు అధిక ప్రత్యక్షముగా చూడబడుచున్నది. అందువలన ఆ సూర్యచంద్రులను జ్యోతిస్వరూపులుగా విశేషించి చెప్పబడినది. అంతేగాని ఆ సూర్య చంద్రాదులయందే ఆ బ్రహ్మజ్యోతి యున్నది మరి యెచ్చటను లేదని మాత్రము కాదు.

సమానభావముతో ఎదుటనున్నప్పటికి కర్రలేక గోడ మొదలగు వాటియందు మన ముఖము యొక్క ప్రతిబింబము బాగుగా కనుపించుటలేదనుసంగతి లోకవిదితమై యున్నది. కాని దర్పణము అనగా అద్దము మొదలగు వాటియందు మన ముఖము యొక్క ప్రతిబింబము ఎంత స్పష్టముగా, స్వచ్ఛముగా ప్రతిబింబించుచున్నదో అదే విధముగా ఆబ్రహ్మాజ్యోతి సూర్యచంద్రాదులయందు ప్రపంచమందలి జడ చేతనములగు సర్వపదార్థములకంటె ఎక్కువ స్పష్టముగా మరియు స్వచ్ఛముగా ప్రతిబింబించుచున్నందున అవి విశేషముగా చెప్పబడినవి.

మరియు –

**15.13. గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా,**
**పుష్ణామి చౌషధీన్ స్సర్వాః సోమో భూత్వా రసాత్మకః.**

అనగా – నేను భూమియందు వ్యాపించి నా స్వశక్తితో కామము మరియు ఆసక్తి లేనటువంటి నా ఐశ్వర్యబలము జగత్తును ధరించియుండుటకు గాను భూమియందు వ్యాపించి యున్నది. ఆ నా బలమువలననే భూమండలము క్రిందికి క్రుంగిపోవుటలేదు. అంతేగాదు అది పగిలిపోవక ఒకటైయున్నది. ఆ విధముగా సమస్తమైన జగత్తును నేనే ధరించియున్నాను.

వేదమంత్రములు గూడ పై రహస్యమును తెలుపుచున్నవి. ఆ బ్రహ్మ బలముతోడనే పైన ఆకాశము క్రింద భూమి దృఢముగా వున్నవి. మరియు "ఆతడు అనగా ఆ భగవంతుడు భూమిని ధరించుచున్నాడు". మొదలగు వాక్యములు ఎన్నో కలవు. అందుచేతనే భగవంతుడు భూమియందు పూర్తిగా వ్యాపించి జడచేతనములతో కూడియున్న ఈ ప్రపంచమును మరియు సమస్తమైన భూత ప్రాణులను గూడ ఆయనయే ధరించుచున్నాడు.

అట్లే నేనే రసస్వరూపుడగు చంద్రుడనై భూమియందు పుట్టుచున్నటువంటి ధాన్యము, యవలు మొదలగు సమస్తమైన ఔషధులను పోషించుచున్నాను అనగా వాటి నన్నింటిని రుచికరములగను మరియు పౌష్టికములగను చేయుచున్నాను.

నీవే చండగభస్తి మండలముచే యింకింతువంబో నిధుల్
నీవే లోకహితార్థమై కురియుదంతేవాన మే ఘాకృతిన్.
నీవే జేసెద భస్మరాశిగ వనానీకంబు దావాగ్నివై
నీవే బెంచెద వెల్ల ఓషధుల రేలిందుండవై వెన్నెలన్

(గయోపాఖ్యానము చూ. శ్రీ కృష్ణుడు సూర్యభగవానుని ప్రార్థించుచున్నాడు)

అట్లే అన్ని రసములకు ఆత్మయైయున్న మరియు రసమే స్వభావముగా గలిగియున్న, సమస్త రసములకు ఆధారభూతమైయున్నట్టి డు చంద్రుడు. ఆతడే తనయందు నిండియున్న రసమును వర్షము, వెన్నెల మరియు మంచు ద్వారా ప్రపంచమంతటా వ్యాపింపజేసి సమస్తమైన వనస్పతులను పోషించుచున్నాడు.

మరియు -

**15.14. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.**

అనగా - నేనే ప్రాణుల పొట్టలయందుండి జఠరాగ్ని రూపమున అనగా **"అహమ్ ఏవ వైశ్వానర ఉదరస్థః అగ్నిః భూత్వా అయమ్ అగ్ని ర్వైశ్వానరోయో ౨యమంతః పురుషే యేనైదమన్నం పచ్యతే"** చూ. బృ.ఉ. 5.9.1. అనగా "ఈ అగ్ని వైశ్వానరుడు ఆ పురుషుల లోపల యందుండును. మరియు ఆతని వలన పురుషులు (ప్రాణులు) తిన్న అన్నమంతయు పచనమగుచుండును." ఇటువంటి శ్రుతుల ద్వారా ఏది వర్ణించబడినదో అదియే వైశ్వానరుడై ప్రాణుల యందు ప్రతిష్ఠితుడై అనగా వ్యాపించియుండి ప్రాణము మరియు అపానవాయువుతో కూడియుండి భక్ష్యము, భోజ్యము, లేహ్యము మరియు చోష్యము మొదలగు నాలుగు విధములగు అన్నములను పచనము అనగా అరుగునట్లుగా చేయుచుండును.

వైశ్వానరరూపమున వున్న అగ్ని పదార్థములను భుజించునదై యున్నది. మరియు సోమము తినబడు అన్నమై యున్నది. కావున **ఈ జగత్తు అంతయు అగ్ని మరియు సోమము అనగా చంద్రుని యొక్క స్వరూపమై యున్నది.** ఈ విధమగు ప్రక్రియను తెలుసుకొన్న పురుషుడు అన్నము తినుటవలన కలుగు దోషము లేనివాడై యుండును.

మరియు -

**15.15. సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనం చ,**
**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృద్వేద విదేవ చాహమ్.**

అనగా - **నేను సమస్త ప్రాణులయందలి ఆత్మనై ఆ ప్రాణుల అంతఃకరణములందు నిండియున్నాను.** అందువలననే సమస్త ప్రాణుల యొక్క స్మృతి, జ్ఞానము మరియు వాటి యొక్క లోపము అవి లేకుండుట మొదలగునవన్ని కార్యములు ఆత్మనైయున్న నాచేతనే చేయబడుచున్నవి. అనగా పుణ్యకర్మలు చేసినటువంటి ప్రాణులకు వారు ఆచరించిన పుణ్యకర్మలననుసరించి వారికి జ్ఞానము, స్మృతి మొదలగునవి ప్రాప్తించుచున్నవి. మరియు పాపకర్మలు చేసినటువంటి పాపులకు జ్ఞానము మరియు స్మృతి మొదలగు వారు చేసిన పాపకర్మలననుసరించి లోపింపజేయబడుచున్నవి. (ఇది యంతయు నావలననే జరుగుచున్నది.)

సమస్త వేదముల ద్వారా పరమాత్ముడనైయున్న నేనే తెలియదగినవాడనైయున్నాను., మరియు వేదాంతములకు కర్తను అనగా వేదాంతార్థము యొక్క సంప్రదాయము యొక్క కర్తను మరియు వేదము యొక్క అర్థమును బాగుగా ఎఱుంగువాడను గూడ నేనే అయివున్నాను.

"యదాదిత్యగతం తేజోః" (చూ.గీత. 15.12) మొదలగు శ్లోకముల ద్వారా నారాయణుడను భగవంతుడగు ఈశ్వరుని యొక్క విశేషములు మరియు సర్వోత్తమములు అయిన వుపాధుల ద్వారా జరుగునటువంటి విభూతులన్నియు సంక్షిప్తముగా చెప్పబడినవి. అనగా ఉత్తమమైన వుపాధులయందు భగవత్తత్త్వము తోచుచుండును. అని చెప్పబడినది. అందుకే కాబోలు ఒక మహాకవి ఇలా అన్నాడు -

**విద్యుశ్శక్తి సమస్త తంతువుల వ్యాప్తింజెందియున్నన్**
**విద్యుజ్జోతికి గాజు గోళములనే విస్ఫూర్తి గన్పించెడిన్,**
**విద్యారూప ! స్వసత్తచేత సర్వంబునన్ నిండియున్**
**విద్యోతింతువు శుద్ధ బుద్ధి గుహలన్ విశ్వాత్మ భీమేశ్వరా !**

చూ. భీమేశ్వర శతకం, శ్రీ శ్రీశైలంగారు

ఇప్పుడు క్షరము మరియు అక్షరము ఈ రెండు ఉపాధులను వేఱుగా చెప్పి ఆ వుపాధి రహితమైన శుద్ధమైన పరమాత్మ యొక్క స్వరూపమును నిశ్చయించు వుద్దేశ్యముతో రాబోవు శ్లోకములు ఆరంభించబడుచున్నవి. వాటిలో ముందుగానూ మరియు ఆపైన అటు తరువాత వచ్చునటువంటి అన్ని అధ్యాయముల యొక్క సమస్త అభిప్రాయములను మూడు భేదములుగా విభజించి చెప్పుచున్నారు.

**15.16. ద్వావిమౌ పురుషౌ లోకే క్షరాశ్చాక్షర ఏవ చ,**
**క్షరః సర్వాణి భూతాని కూట స్థో ఽక్షర ఉచ్యతే.**

అనగా - సముదాయము నుండి వేఱు చేయబడిన యీ రెండు భావములు యీ సంసారము (ప్రపంచము) నందు పురుష శబ్దముతో చెప్పబడుచున్నవి. ఇందులో ఒక సముదాయము క్షీణించునది అనగా నశించు స్వభావముగల క్షర పురుడైయున్నాడు. మరియు రెండవది దానికి విరుద్ధముగా అక్షర అనగా నశించు స్వభావము లేనటువంటి పురుషతత్త్వమైయున్నది. దీనినే భగవంతుని మాయా శక్తియని అందురు. ఇదియే క్షరపురుషుని యొక్క ఉత్పత్తికి బీజమై యున్నది. మరియు అనేకములైన ప్రాపంచిక జీవుల యొక్క కామము మరియు కర్మలు మొదలగు సంస్కారములకు ఆశ్రయమైయున్నది. అది అక్షరపురుషుడు అనబడుచున్నది.

ఈ యిద్దరు పురుషులు ఎవ్వరు ? అన్నచో భగవంతుడే అందులకు సమాధానము చెప్పుచున్నారు.

సమస్త భూతములు అనగా ప్రకృతి యొక్క సమస్త వికారములు క్షర పురుష దనబడుచున్నవి మరియు కూటస్థమైయున్న అనగా ఏది కూటము అనగా ఒక రాశివలె స్థిరముగా వున్నదో అట్లుగాక కూటము అను పేరు మాయకు సంబంధించినది. దాని యొక్క వంచన ఛల్ అనగా మోసము, కుటిలత్వము మొదలగునవి దానియొక్క పర్యాయపదములు. పైన

చెప్పబడిన మాయ మొదలగు అనేక విధములుగా వుండివున్నవన్నియు కూటస్థములనబడును. ఈ ప్రపంచమునకు బీజరూపమైన అక్షరము అంతయు అదృష్టము అయివున్నందున ఆ కూటస్థము నశింపు లేనిదై యున్నది. అందువలననే అది అక్షరమని చెప్పబడుచున్నది.

మరియు ఏది ఈ క్షరాక్షరములకు అనగా ఈ రెంటికంటె విలక్షణముగా వున్నదో మరియు క్షరము మరియు అక్షర రూపములైన రెండు వుపాధులకు సంబంధించిన దోషములు లేనిదై యున్నదో అది నిత్యము శుద్ధము. బుద్ధము అనగా జ్ఞానరూపమైనది మరియు ముక్తత్వ స్వభావము కలిగినదై వున్నది.

**15.17. ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః,**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః.**

అనగా – సర్వోత్తముడు అత్యంతశ్రేష్ఠుడు అయిన పురుషుడు యితరుడే అయి వున్నాడు. అనగా ఈ రెంటికంటె అనగా క్షరము మరియు అక్షరము కంటె మిక్కిలి విలక్షణముగా యున్నాడు. ఆతడే పరమాత్ముడని పిలువబడుచున్నాడు. ఆ భగవంతుడు అవిద్యాజనితమైన శరీరాది ఆత్మలకంటె పరముగా అనగా విలక్షణముగా అనగాశ్రేష్ఠముగా వుండియున్నాడు. మరియు ప్రాణులన్నింటి యొక్క ఆత్మయై అనగా అంతరాత్మగా వుండియున్నాడు. ఈ కారణము చేతనే వేదాంత వాక్యములయందు ఆతడు "పరమాత్మ" పేరుతో చెప్పబడుచున్నాడు.

ఆ పరమాత్మను గురించియే విశేషముగా వివరించుచున్నారు.

భూమి, ఆకాశము, మరియు స్వర్గము మొదలగు యీ మూడు లోకములను తన చైతన్య రూపమైన శక్తిచే వాటన్నింటియందు నిండియుండి కేవలము తన శక్తిస్వరూపము చేతనే వాటినన్నింటిని తాను ధరించుచున్నాడు. అవినాశియైన ఈశ్వరుడు అనగా ఎన్నడునూ నశించు స్వభావము లేనివాడు అయిన నారాయణుడను నామము గల సర్వజ్ఞుడు మరియు సర్వమును శాసించువాడైయున్నాడు.

పైన చెప్పబడిన ఈశ్వరుని యొక్క "పురుషోత్తముడు" అను పేరు చాలా ప్రసిద్ధమైయున్నది. ఆతనికి ఈ పేరు ఎట్లు కలిగినది ? అని అన్నచో దానికి సహేతుకమైన ఆధారము చూపించి, ఆ నామము యొక్క సార్థకత్వమును చూపించుచూ భగవంతుడు తన స్వరూపమును ప్రకటించుచున్నాడు. "నేను నిరతియుడనైన ఈశ్వరుదను" –

**15.18. యస్మాతక్షర మతీతో ఽహమక్షరాదపి చోత్తమః,**
**అతో ఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః.**

అనగా – ఏలయన ? నేను 'క్షర' భావమునకు అతీతుడను. అనగా అశ్వద్ధము పేరుగల మాయామయమైన సంసారవృక్షమును అతిక్రమించి యున్నాను. మరియు సంసార వృక్షమునకు బీజస్వరూపముగాయున్న అక్షరము కంటె (మూల ప్రకృతి కంటె) కూడ ఉత్తముడను,

అత్యంత శ్రేష్ఠుడను లేక మిక్కిలి గొప్పవాడనై యున్నాను. అందువలన అనగా క్షరము మరియు అక్షరము కంటె గూడ వుత్తముడనైయున్నందున లోకమునందును మరియు వేదములందునూ గూడ "పురుషోత్తము" డను పేరుతో ప్రసిద్ధిని పొందియున్నాను. భక్తులందరూ నన్ను ఈ విధముగానే, ఈ నామముతోనే ఎఱుంగుదురు. మరియు కవులైనవారు గూడ తమ కావ్యాదులయందు ఈ నామమునే ప్రయోగించుచుందురు. అనగా "పురుషోత్తమ" అను ఈ పేరుననే నన్ను వర్ణించుచుందురు.

ఇప్పుడు పై విధముగా చెప్పినట్లుగా ఆత్మతత్వమును ఎఱింగినవారు ఎటువంటి ఫలమును పొందుదురో చెప్పుచున్నారు -

**15.19. యో మామేవ మసంమూఢో జానాతి పురుషోత్తమమ్,**
**స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత.**

అనగా - అజ్ఞాన రహితుడైయున్న పురుషుడు పైన చెప్పబడిన విశేషణములతో కూడియున్న పురుషోత్తముడను, ఈశ్వరుడను అయివున్ననన్ను పైన చెప్పబడినట్లుగా "ఈ పురుషోత్తముడను నేను" అని ఎఱుంగునో ఆతడే సర్వజ్ఞుడు. ఆతడు సర్వాత్మ భావముతో సర్వమును ఎఱుంగును. అందుచేతనే ఆతడు సర్వజ్ఞుడు. మరియు ఓ భారతా ! అటువంటి సర్వజ్ఞుడు సమస్తభూతములందును నిండియున్న పరమాత్ముడైన నన్ను సర్వభావముతో సర్వమునకు ఆత్మగా తలంచి నన్ను భజించుచుండును.

ఈ అధ్యాయమునందు మోక్షరూపమైన ఫలమునిచ్చునటువంటి భగవంతుని యొక్క తత్వజ్ఞానమును చెప్పి యిప్పుడు దానిని స్తుతించుచున్నాడు.

**15.20. ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయా ఽనఘ,**
**ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్కృతకృత్యశ్చ భారత.**

అనగా - ఇది గుహ్యతమము, అన్నింటికంటె ఎక్కువ గోపనీయము అనగా అత్యధికముగా గూఢమైన రహస్యము. అది ఏది ? అన్నచో - శాస్త్రము అని సమాధానము.

సమస్తమైన గీత యొక్క నామమే శాస్త్రమని చెప్పబడుచున్నది. కాని ఇచ్చట మాత్రము దాని గొప్పతనమును అనగా మహత్యమును తెలుపుట కొఱకు ఈ పదునైదవ అధ్యాయమేశాస్త్రమని చెప్పబడుచున్నది. అట్లేలయన ? ఈ అధ్యాయమునందు కేవలము సమస్తమైన గీతాశాస్త్రము యొక్క అర్థమంతయు సంక్షిప్తముగా చెప్పుటయేగాక యిందులో అనగా ఈ అధ్యాయమునందు సమస్త వేదముల యొక్క అర్థముగూడ సంక్షిప్తముగా చెప్పబడినది. అందుచేతనే "యస్తం వేద సవేదవిత్" "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" అనగా దానిని ఎఱింగినవాడు అనగా ఆతడే వేదములను ఎఱింగినవాడగును. సమస్తవేదముల ద్వారా నేను మాత్రమే ఎఱుంగదగినవాడనై యున్నాను.

అర్జునా! ఇటువంటి పరమ రహస్యముతో కూడియున్న విషయమును నేను నీకు చెప్పియున్నాను. పైన చెప్పబడిన అర్థముతో కూడియున్న ఈ శాస్త్రమును తెలుసుకొనియే మానవుడు బుద్ధిమంతుడు మరియు సఫల మనోరథుడు కాగలడు. ఇంక మరే విధముగానూ కాజాలడు.

ముఖ్యమైన అభిప్రాయమేమన ? చేయదగిన కార్యములన్నియు చేసినవాడు కృతకృత్యుడు. అందువలన శ్రేష్ఠమైన కులమునందు స్థూలదేహమును పొందు బ్రాహ్మణుని ద్వారా చేయదగిన దంతయు భగవత్తత్త్వముగా ఎఱింగినప్పుడు కృతకృత్యత్త్వమును పొందును. ఇతర విధములుగా ఎవని యొక్క కర్తవ్యము పూర్ణత్వమును పొందదు. **"సర్వం కర్మాఖిలం పార్థజ్ఞానే పరిసమాప్యతే"** అనగా సమస్తమైన కర్మ సముదాయము ఎల్లప్పుడూ జ్ఞానమునందు సమాప్తమును పొందును. **"ఏతద్ధిజన్మ సాఫల్యం బ్రాహ్మణస్య విశేషతః, ప్రాప్యై తత్కృతకృత్యో హి ద్విజో భవతి నాన్యథా"** చూ. మనుస్మృతి. 12.93. అనగా ఆత్మజ్ఞానము, వేదాభ్యాసము బ్రాహ్మణునికి, వివేషించి బ్రాహ్మణుడై జన్మించినందుకు ఫలము. ఏలయన ? **ఆత్మజ్ఞానమును పొంది ద్విజుడు కృతకృత్యుడగును.** ఇంక ఏ విధముగానూ కాజాలడు.

కావున ఓ భారత ! నీవు నా నుండి ఈ పరమార్థతత్త్వమును వినియున్నావు. అందువలన నీవు కృతకృత్యుడవు అయినావు.

*శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీతయందలి*
*పురుషోత్తమయోగమనబడు పదునైదవ అధ్యాయమునకు*
*శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్య విరచిత భాష్యమునకు*
*తెనుగుఅనువాదము సమాప్తము.*
*అనువాదకులు – శ్రీ సదానందభారతి,*
*ప్రణవాశ్రమము.*

# పదునారవ అధ్యాయము

తొమ్మిదవ అధ్యాయమునందు ప్రాణులకు దైవికము, ఆసురీయము, మరియు రాక్షసీయము అను మూడు ప్రకృతులు చెప్పబడినవి. వాటిని విపులముగా చూపుట కొరకు **"అభయం సత్వసంశుద్ధిః"** మొదలగు శ్లోకములతో కూడియున్న ఈ పదునారవ అధ్యాయము ఆరంభించబడుచున్నది.

ఆ మూడింటియందలి దైవీ ప్రకృతి సాంసారిక బంధముల నుండి ప్రాణులను విడిపించునదై యున్నది. మరియు ఆసురీ మరియు రాక్షసీ ప్రకృతులు ప్రాణులను బంధించునవై యున్నవి. అందువలన యిచ్చట దైవీ ప్రకృతిని పొందుటకును మరియు ఆసురీ మరియు రాక్షసీ ప్రకృతులను నిర్మూలించుటకును అవసరమగు, సాధనములను గురించి చెప్పబడుచున్నది. భగవంతుడు యిట్లు చెప్పినాడు -

**16.1 అభయం సత్వసంశుద్ధిర్జ్ఞానయోగవ్యవస్థితిః,**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్.**

అనగా - అభయము అనగా ఎటువంటి భయము లేకుండుట. సత్వగుణ సంపన్నత్వము అనగా అంతఃకరణ శుద్ధి, వ్యవహారాదుల యందు యితరుల పట్ల మోసము, కపటము, మరియు అబద్ధమాడుట మొదలగు అవగుణములను త్యజించుట మొదలగు సద్గుణములతో కూడి శుద్ధభావముతో వ్యవహరించుట.

ఎల్లప్పుడూ జ్ఞానము మరియు యోగముతో కూడియుండుట శాస్త్ర గ్రంథములు మరియు గురువు ద్వారా ఆత్మ తత్వమును ఎఱుంగుట జ్ఞానమనంబడును. మరియు శాస్త్రము ద్వారా మరియు గురువు ద్వారా ఎరింగిన పదార్థము వలన యింద్రియ నిగ్రహము ద్వారా పొందిన ఏకాగ్రత ద్వారా **తన ఆత్మయొక్క ప్రత్యక్షత్వమును పొందుట యోగమనబడును.** ఆ జ్ఞానము మరియు యోగములందు స్థిరముగా వుండుట వాటియందు తన్మయత్వమును పొందుట మొదలగునవన్నియు సాత్విక సంపదలు లేక దైవీసంపదలనబడును.

ఇంకా కొంతమంది అధికారులకు ఏ విషయములందు ఎటువంటి సాత్విక ప్రవృత్తి కలుగవచ్చునో అదిగూడ చెప్పబడుచున్నది.

దానము అనగా తన శక్తికొలది అన్నాది వస్తువులను తగిన అధికారులకు పరోపకార బుద్ధితో పంచిపెట్టుట.

దమము - అనగా బాహ్య యింద్రియములను నియంత్రించుట అంతఃకరణ నిర్వ కారిత్వమును గురించి అనగా అంతఃకరణ శాంతిని గురించి తరువాత చెప్పబడును.

యజ్ఞములు - అగ్నిహోత్రాది శ్రౌతయజ్ఞము, దేవపూజ మొదలగు స్మార్త యజ్ఞములు.

స్వాధ్యాయము - అదృష్టమై యున్నదానిని దృష్టముగా చేసుకొనుటకు ఋక్కులు మొదలగు వేదములను పఠించుట.

తపము - శారీరక తపస్సులను గురించి తరువాత చెప్పబడును. మరియు ఆర్జవము అనగా సర్వవ్యవహారములందు సరళత్వము మరియు కపటము లేకుండ వ్యవహరించుట మరియు -

**16.2. అహింసా సత్యమక్రోధస్త్యాగః శాంతిరపైశునమ్,**
**దయాభూతేష్వలోలత్వం మార్దవం హ్రీరచాపలమ్.**

అనగా - అహింస - అనగా ఏ విధమైన ప్రాణికి ఎటువంటి కష్టము కలుగనీయ కుండుట, సత్వము అనగా అప్రియము మరియు అసత్యమైన వచనములనే పలుకకుండా, యథార్థమైన దానినే పలుకుట, అక్రోధము అనగా ఇతరులు తనను దూషించుచున్నను లేక దండించుచున్నను కలుగు క్రోధమును శాంతపరచుకొనుట, త్యాగము - అనగా సంన్యాసము (దానము చేయుట కాదు) అది ఏలయన ? దానమును గురించి యింతకు పూర్వమే చెప్పబడినది.

శాంతి - అంతఃకరణమునందు ఎటువంటి సంకల్ప వికల్పములు లేకుండుట, అపై శునము - అనగా అపిశునత్వము అనగా ఇతరుల దోషములను ప్రకటించుట పిశునత్వమనబడును. అట్లు చేయకుండుట అపిశునత్వమనబడును.

భూతములయందు దయా భావము కలిగియుండుట, దుఃఖితులయందు కృప కలిగియుండుట

అలోలుపత - అనగా విషయములతో సంయోగము కలిగినప్పుడు గూడ యింద్రియములయందు ఎటువంటి వికారము కలుగకుండుట.

మార్దవము - అనగా కోమలత్వము అనగా క్రూరత్వము లేకుండుట.

హ్రీ - అనగా సిగ్గు మరియు అచపలత్వము అనగా ఎటువంటి ప్రయోజనము లేనప్పుడు వాక్కు బాహువులు, కాళ్లు మొదలగువానిని వ్యర్థక్రియలందు వుపయోగించకుండుట. మరియు -

**16.3. తేజః క్షమా, ధృతిః శౌచమద్రోహో నాతిమానితా,**
**భవంతి సంపదం దైవీమభిజాతస్వ భారత.**

అనగా తేజప్రాగల్భ్యము - (తేజస్విత) అనగా చర్మము కాంతిమగుట కాదు. క్షమ. అనగా యితరులు తన్ను దూషించిననూ లేక దండించిననూ అంతఃకరణము నందు క్రోధ, దుఃఖాది వికారములు కలుగకుండుట, వికారముత్పన్నమైనచో దానిని అణచివేయుట మొదలగునవన్నియు యింతకుపూర్వము అక్రోధము అను పేరుతో చెప్పబడినవి. క్షమ యందును అక్రోధమందును యింతియే భేదమున్నది. ఎక్కువగా భేదము లేదు.

ధృతి - దేహము మరియు యింద్రియాదుల యందు అలసట అనుభవించబడు చున్నప్పుడు ఆ యలసటను తొలగించు ఏ అంతఃకరణ వృత్తికలదో దానినే ధృతియని యందురు.

అలాంటి ధృతియున్నప్పుడు ఉత్సాహముతో కూడియున్న యింద్రియములు మరియు దేహము కర్మలు చేయుట యందు అలసటను పొందకుండుట ధృతి యనబడును.

శౌచము - అనగా రెండు విధములైన శుద్ధి అనగా మృత్తిక మరియు జలము మొదలగువాని ద్వారా చేయబడు బాహ్యశుద్ధి మరియు కపటము మరియు రాగాది భావములు లోపించినప్పుడు మనస్సు మరియు బుద్ధి యొక్క నిర్మలత్వము లోపించకుండుట మొదలగునవి ఆంతరిక శుద్ధి అనబడును. ఈ విధముగా శుద్ధులు రెండు విధములు.

అద్రోహము - అనగా యితరులను బాధించుట యను భావము లేకుండుట అనగా ఏ ప్రాణిని హింసించు భావము లేకుండుట.

అతిమానితత్వము యొక్క లేమి - అత్యంత మానము కలిగియుండుట.

అతిమానము - ఇది దేనియందుండునో అది అతిమానము అనబడును. అది కలిగియున్నవాడు అతిమాని అనబడును. దాని భావము అతిమానిత్వము. అది లేకుండుట 'నాతిమానత్వము' అనగా తనయందు ఎక్కువ పూజ్యభావము లేకుండుట. అనగా తనయందు అభిమానము లేకుండుట.

ఓ భారత ! 'అభయ'ము మొదలు యింత వరకు చెప్పిన లక్షణములు సంపదతో కూడి శరీరమును పొందిన పురుషుని యందుండును. దైవీ సంపదను వెంటబెట్టుకొని దేహమును పొందినటువంటి అనగా దేవ విభూతులు అనగా దైవసంపదను వెంటబెట్టుకొని దేహమును పొందినవాడు అనగా ఎవడు దైవసంపదను పొందియుండుటకు యోగ్యుడో మరియు భవిష్యత్తులో ఎవనికి శుభములు కలుగబోవుచున్నవో అట్టి పురుషునియందు పైన చెప్పబడిన లక్షణములన్నియు నిండి వుండును.

ఇప్పుడు అనగా యికముందు ఆసురీ సంపదను గురించి చెప్పబోవుచున్నారు.

**16.4. దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ,**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్.**

అనగా - దంభము అనగా ఆడంబరముతో కూడిన జీవనము, దర్పము అనగా ధనము లేక పారివారిక బలము మొదలగు వానిచే కలుగు గర్వము, అతిమానము అనగా యింతకు పూర్వము చెప్పినట్లుగా తనయందు అతిశయముతో కూడిన పూజ్యభావము అనగా తానే గొప్పయను భావము, క్రోధము మరియు పారుష్యము అనగా కఠోరవచనములు పలుకుట, అదెట్లన ? ఒంటి కంటివానిని జూచి ఆక్షేపబుద్ధితో మంచి కన్నులు గలవాడని చెప్పి హేళన చేయుట, అట్లే కురూపిని అందగాడని పిలిచి ఆక్షేపించుట మరియు హీనజాతివానిని గొప్పజాతివాడని కించపరచుట మొదలగునవి ఆసురీ ప్రవృత్తికి కొన్ని ఉదాహరణములు.

ఆ విధముగానే అజ్ఞానము అనగా అవివేకము, కర్తవ్యము మరియు అకర్తవ్యము మొదలగు వాటి విషయములందు విరుద్ధ నిర్ణయములు ప్రకటించుట మొదలగు

లక్షణములన్నియ ఆసురీ సంపత్తిని సంగ్రహించి మానవ దేహమును పొందిన పురుషుని యందుండునవి. అనగా ఇవి అన్నియు అసుర సంపత్తితో కూడియున్న పురుషుని గుర్తించు లక్షణములు.

పై రెండు సంపదల వలన కలుగు కార్యములు ఎట్లుండుననగా -

**16.5. దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా,**
**మా శుచః సంపదం దైవీమభిజాతో ఽసి పాండవ.**

అనగా - దైవీసంపద పురుషుని సాంసారిక బంధమునుండి విడిపించి ముక్తిని అనగా మోక్షమును పొందింపజేయునదై యున్నది. అట్లే ఆసురీ మరియు రాక్షసీ సంపదలు నిస్సందేహముగా పురుషుని ప్రాపంచిక వాసనలతో బంధించి బాధించునవై యున్నవి. నిశ్చితమైన బంధమును నిబంధమందురు. ఈ ఆసురీ రాక్షసీ ప్రవృత్తులు నిబంధమును కలిగించునవై యున్నవి.

ఇంత చెప్పిన మీదట అర్జునుని అంతఃకరణమునందు సంశయభావము ఏర్పడినట్లుగా గ్రహించి అనగా "నేను ఆసురీ సంపదతో కూడియున్నవాడనా ? లేక దైవీ సంపదతో కూడియున్నవాడనా ?" అను సంశయ భావముతో కూడియున్న అర్జునుని జూచి భగవంతుడు యిట్లు చెప్పుచున్నాడు - ఓ పాండవ ! నీవు శోకించవలదు. ఏలయన ? నీవు దైవీ సంపదతో కూడియున్న దేహమును పొందియున్నావు. అనగా అందుచేత అనగా దైవీసంపదతో కూడియున్నవాడవై జన్మించినందున భవిష్యత్తులో నీకు శుభములు కలుగబోవుచున్నవి. అందుచే నీవు చింతించరాదు.

**16.6. ద్వౌ భూతసర్గౌ లోకే ఽస్మిన్దైవ ఆసుర ఏవ చ**
**దైవో విస్తరశః ప్రోక్త అసురం పార్థమే శృణు**

అనగా - ఈ ప్రపంచమునందు మానవ సృష్టి రెండు విధములైనదిగా వున్నది. ఏది రచించబడునో అది సృష్టి. అందుచేత దైవీసంపద మరియు ఆసురీ సంపదలతో కలిపి రచించబడిన ప్రాణులే యిచ్చట భూత సృష్టియను పేరుతో పిలువబడుచుండును.

**ప్రజాపతికి సంతానములు రెండు. ఒకరు దేవతలు, రెండు అసురులు. (చూ. ద్వయా హ ప్రాజాపత్యా దేవాశ్చాసురాశ్చ"** బృహ.ఉ. 1.3.1.) ఈ శ్రుతి వలన గూడ పై మాట సిద్ధించుచున్నది. ఏలయన ? ఈ ప్రాణులన్నియు రెండు విధములుగా వుండును.

ప్రాణుల యొక్క ఆ రెండు విధములైన సృష్టులు ఎటువంటివి ? అన్నచో అవి రెండూ దైవీ మరియు ఆసురీయమని చెప్పుచున్నారు.

అట్లు చెప్పబడిన రెండు విధములైన సృష్టులను గురించి మరల చెప్పుటకు కారణము చెప్పుచున్నారు.

దైవీ సృష్టి యొక్క వర్ణన "అభయం సత్వ సంశుద్ధి" మొదలగు శ్లోకముల ద్వారా విస్తారపూర్వకముగా చేయబడినది. కాని ఆసురీ సృష్టిని గురించిన వర్ణన అంత విస్తార పూర్వకముగా చేయబడి యుండలేదు. అందుచేత ఓ పార్థా ! ఆసురీ ప్రవృత్తిని త్యజించుట కొరకు ఆయాసురీ సృష్టిని గురించి నీవు నా నుండి అనగా నా మాటల ద్వారా విస్తారపూర్వకముగా వినుము. అనగా చక్కగా విని నీయందు ఏ ప్రవృత్తి ప్రవృద్ధమానమై యున్నదో నిర్ణయించు కొనుము.

ఇంక ఈ అధ్యాయము సమాప్తమగువరకు ప్రాణుల విశేషణముల ద్వారా ఆసురీ సంపద వర్ణించబడుచున్నది. అట్లేలయన ? ఆ సంపద ప్రత్యక్షముగా చూడబడిన (తెలియ బడిన)ప్పుడే దానిని త్యజించుట సాధ్యపడును -

**16.7. ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః,**
**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే.**

అనగా - ఆసురీ స్వభావము గల మానవులు ప్రవృత్తిని అనగా ఏదో ఒక పురుషార్థమును లక్ష్యముగా నిర్ణయించుకొని సాధనరూపముగా అనగా కర్తవ్యకార్యము నందు ప్రవృత్తిని కలిగియుండుట మంచిది అని తలంచి అందులో ప్రవృత్తమగుటకు మరియు నివృత్తమగుటను అనగా అందులకు వ్యతిరేకముగా ఏదో ఒక అనర్థకారకమైన కర్మనుండి నివృత్తిని పొందుట మంచిది. ఆ విధముగా వారు నివృత్తమగుట యనునది ఎరుగనే ఎరుగరు. అనగా నివృత్తి మార్గమును గుర్తించరు.

అటువంటివారు ప్రవృత్తిని గురించిగాని, నివృత్తిని గురించిగాని కొంచము గూడ ఎరుంగరు. అంతేకాక వారిలో ప్రవృత్తి-నివృత్తులలోని మంచి చెడ్డలను తెలుసుకొనగల బుద్ధి గూడ వుండదు. మంచి నడవడిక గూడ వుండదు. మరియు సత్య పదార్థమును గుర్తించు సామర్థ్యము గూడ వుండదు. అనగా ఆసురీ ప్రవృత్తి కలిగియున్న మనుష్యులు శుద్ధిగా వుండరు. దురాచారులుగా వుందురు. కపట బుద్ధి కలవారై యుందురు. అంతేగాక మిథ్యావాదులు అనగా అజ్ఞానులై సత్యమును గుర్తించని వారై యుందురు.

మరియు -

**16.8. అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్,**
**అపరస్పరసంభూతం. కిమన్యత్కామహైతుకమ్**

అనగా - అటువంటి అసుర స్వభావము గల మనుష్యులు మేము అసత్యముతో నిండియున్న మాట నిజమే. మా వలెనే ఈ సమస్త ప్రపంచమంతయూ అసత్యముతో కూడినదే అయి వున్నది. ప్రతిష్ఠారహితమై యున్నది. అనగా ధర్మముగాని, అధర్మముగాని ఈ ప్రపంచమునకు ఆధారములుగ లేవు. అనగా పుణ్యపాపములను కొలతబద్దగా పెట్టుకొని ఈ

ప్రపంచమును పాలించువాడు ఎవ్వడునూ లేడు. అందుచేత ఈ జగత్తంతయు ఈశ్వరరహితమైనదే అని చెప్పుచుందురు. మరియు కామభావము చేత ప్రేరేపించబడిన స్త్రీ పురుషుల సంయోగము వలననే ఈ జగత్తంతయు ఉత్పన్నమగుచున్నది. అందుచేత ఈ జగత్తునకు మూల కారణము కామభావమే కాని ఈశ్వరుడు కాదు.

అనగా ఈ ధర్మాధర్మాదులకు ఎటువంటి యితరమైన అదృష్టకారణమేదియు లేదు. కేవలము కామమే సమస్తమైన ప్రాణుల ఉత్పత్తికి ఏకమాత్ర కారణము. ఇది లోకాయతుల దృష్టి.

**16.9. ఎతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానో ఽల్పబుద్ధయః,**
**ప్రభవన్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతో ఽహితాః.**

అనగా - ఇటువంటి దృష్టిని ఆధారముగా జేసుకొని నష్టపోయిన బుద్ధి గలవారు మరో లోకమును సాధించవలయునన్న లక్ష్యము లేనివారు, అల్ప బుద్ధులైనవారు అనగా ఎవరి బుద్ధి కేవలము ప్రాపంచిక భోగములను అనుభవించుట యందే లగ్నమైయున్నదో అటువంటి అల్పబుద్ధిగల మనుష్యులు మరియు ఉగ్ర, క్రూర కర్మలయందు ఆనందమును పొందు బుద్ధిగలవారు, హింసాపరాయణులు ఈ ప్రపంచమునకు శత్రువులుగా వుండి ఈ ప్రపంచమును నశింపజేయుట కొరకే పుట్టి యున్నారు.

మరియు అట్టివారు -

**16.10. కామమాశ్రిత్య దుష్పూరం దంభ మాన మదాన్వితాః,**
**మోహాద్గృహీత్వా ఽసద్గ్రాహా న్ప్రవర్తంతే ఽశుచి వ్రతాః.**

అనగా - ఏనాడూ తృప్తిని లేక పూర్ణత్వమును పొందజాలనటువంటి అసంపూర్ణమైన కామభావముతో కూడియున్న లౌకిక కోర్కెలను మాత్రమే ఆశ్రయించి యున్న పాఖండులు, మానము మరియు మదభావముతో కూడియున్న అశుద్ధమైన కర్మలు మాత్రమే చేయువారు, అంతేగాక ఎవరి ఆచరణ అనగా వారు చేయు కార్యములన్నియు ధర్మవిరుద్ధములే అయివున్నవో అటువంటి మనుష్యులు మోహము ఆవరించి యున్నందువలన , అజ్ఞానము వలన అశుద్ధమైన సిద్ధాంతములను గ్రహించినవారై యున్నందున కామభావమునే ఆశ్రయించి ప్రపంచమునందు చేయరాని కర్మలు చేయుచూ వాటి వలన కలుగు సుఖ-దుఃఖములననుభవించుచూ జన్మ మరణములను పొందుచున్నారు.

*మరియు - అనగా మరింకేమనగా -*

**16.11. చింతామపరిమేయాం చ ప్రలయాంతాముపాశ్రితాః,**
**కామోపభోగపరమా ఏతావదితి నిశ్చితాః.**

అనగా - దేని శక్తి తెలియబడజాలదో, అటువంటి అపరిమేయమైన అనగా అంతుచిక్కనటువంటి, అపారమైన అనగా దేనిని దాటుట అసంభవమో అనగా దేని యొక్క

ఆవలి ఒడ్డు కానరాదో, ప్రళయము జరుగువరకు లేక మరణము కలుగు వరకు వుండునటువంటి చింతను అనగా దుఃఖమును కలిగించు భావమును ఆశ్రయించి అనగా ఎల్లప్పుడూ అనగా సర్వకాల సర్వావస్థలయందును దానిని లేక వానిని గురించియే ఆలోచించుచూ వున్నటువంటి మరియు కామోపభోగపరాయణులై యున్న అనగా వేటిని మానవుడు కోరుచుండునో ఆ శబ్దాది విషయములు కామమనబడును, వాటిని అనుభవించుట యందు తత్పరులై యున్నవారు మరియు విషయములను భోగించుటయే అనగా వాటి ద్వారా సుఖములను పొంద ప్రయత్నించుటయే పురుషార్థమని తలంచువారు అట్టి నిశ్చయము కలిగియున్నవారు.

**16.12. ఆశాపాశ శతైర్బద్ధాః కామక్రోధపరాయణాః,**
**ఈహంతే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్.**

అనగా - మరియు వందల కొలది ఆశారూపమైన పాశములు అనగా త్రాళ్ళతో బంధించబడి, గట్టిగా బిగించబడి, అన్నివైపుల నుండి లాగబడుచూ కామక్రోధాదుల యందు చిక్కినవారై అనగా కామక్రోధములను ఆశ్రయించి అనగా వాటికి దాసులై యున్న పురుషులు ధర్మము కొరకు గాక కేవలము తమ భోగము కొరకు అనగా భోగ్యమగు విషయములను అనుభవించుట కొరకు అన్యాయముగా, అధర్మముగా యితరుల సొత్తును అపహరించుట మొదలగు అనేక పాపమయ సాధనముల, మార్గముల ద్వారా ధనసముదాయమును ప్రోగుచేయుట యందు నిమగ్నమై యుందురో అనగా ఏదో ఒక విధముగా ధనమును అనగా వస్తు వాహనములను పొందుటకు ప్రయత్నించు చుందురో,

మరియు వారి దృష్టి ఎట్లుండునన్నచో -

**16.13. ఇదమద్య మయా లబ్ధమిమం ప్రాప్స్యే మనోరథమ్,**
**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్.**

అనగా - నేడు నేను నా ప్రయత్నము ద్వారా యింత ధనమును పొందియున్నాను మరియు ఫలానా మనోరథమును అనగా కోరికను అనగా మనస్సును సంతుష్టపరచునటువంటి పదార్థమును యింకముందు పొందెదను. ఇప్పుడు నా వద్ద యింత ధనమున్నది. మరియు యింకా చాలా ధనము రాబోవు వత్సరము నందు ప్రోగు చేయుదును. ఆ విధముగా నేను గొప్ప ధనవంతుడనని పేరు పొందెదను.

**16.14. అసౌ మయా హతః శత్రుర్హనిష్యే చాపరానపి,**
**ఈశ్వరో ఽహమహం భోగీ సిద్ధో ఽహం బలవాన్సుఖీ.**

అనగా - ఫలానా దేవదత్తుడను శత్రువు నా ద్వారా చంపబడినాడు. ఇప్పుడు నేను మూర్ఖులు, దుర్బలులు అయిన శత్రువులనందరిని గూడ చంపివైచెదను. పాపము ఈ మూర్ఖులు,

దుర్బలులు నన్నేమి చేయగలరు ? వారు ఏ విధముగా జూచినను నాతో సమానులు కాజాలరు. నేనే ఈశ్వరుడను, సర్వమును భోగించదగి యున్నవాడను. అన్ని విధముల నేను యోగ్యుడను మరియు భార్యా పుత్రులు వారి పుత్రులు మొదలగు వారందరితో సంపన్నుడనై యున్నాను. నేను వట్టి మామూలు మనిషిని కాను. నేను సర్వ విధముల బలవంతుడను, సంపన్నుడను. అన్ని విధముల సుఖముగాను, సమృద్ధిగాను యున్నవాడను. నేను తప్ప మిగిలిన వారందరూ పనికిమాలినవారు మరియు భూమికి బరువై వ్యర్థముగా బ్రతుకుచున్న వారలై యున్నారు.

**16.15. ఆఢ్యో ఽభిజనవానస్మి కో ఽన్యో ఽస్తి సదృశో మయా,**
**యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞాన విమోహితాః.**

అనగా - నేను ఎక్కువ ధనము కలిగి సంపన్నుడై యున్నాను. మరియు నా వంశము కంటే నేను పెద్ద కులస్థుడనై యున్నాను. అనగా ఏడు తరములనుండి శ్రోత్రియత్వము మొదలగు సద్గుణములతో కూడిన గుణములు కలవాడనై యున్నాను. ఆ విధముగా ధనము నందుగాని మరియు కులమునందు గూడ నాతో సమానమైనవారు మరియొకరు లేరు. నేను యజ్ఞములను చేయుదును. అనగా యజ్ఞములు చేయుట ద్వారా యతరులను అవమానించెదను అనగా వారిని నా కంటే తక్కువ వారిగా చేయుదును. నటులకు మరియు ఇతర కళాకారులకు ధనమునిచ్చి వారి పొగడ్తలను పొందెదను. ఈ విధముగా అసురప్రవృత్తి కలిగిన మనుష్యులు అజ్ఞానము ద్వారా మోహితులై అనగా అనేక విధములైన అవివేకభావముతో కూడి యుందురు.

**16.16. అనేక చిత్తవిభ్రాంతా మోహజాల సమావృతాః,**
**ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకే ఽశుచౌ.**

అనగా - పైన చెప్పబడిన అనేక విధములైన ఆలోచనలు కలుగుచున్నందున భ్రాంత చిత్తులై మరియు మోహమనెడు వలయందు చిక్కినవారై అనగా అవివేకమే మోహము. అది ఒక పెద్ద వలవలె సాంసారిక బంధములందు యిరికించునది లేక బంధించునది అయినందు వలన దానిని వలవంటిదని తెలియనగును. అందులో ఆ వలయందు చిక్కినవారు మరియు విషయ భోగములందు మిక్కిలి ఆసక్తి కలిగియున్నవారు వాటియందే లోతుగా మునిగి యున్న మనుష్యులు ఆ భోగములను పొందుట ద్వారా అనేక పాపములను ప్రోగు చేసుకొని వైతరణి మొదలగు అశుద్ధమైన నరకమునందు పడియుండెదరు.

**16.17. ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః,**
**యజంతే నామయజ్ఞైస్తే దంభేనా విధిపూర్వకమ్.**

అనగా - అటువంటివారు తమను తామే సర్వసద్గుణ సంపన్నులుగా తలంచి తమను తామే చాలా గొప్పవారమని తలంచువారు. సాధువులైన శ్రేష్ఠపురుషుల ద్వారా శ్రేష్ఠులుగా

తలంచబడక, స్తబ్ధ అనగా నిర్వీర్యముగా వుండి, వినయరహితులై ధనము, మానము అను సంపదలచే గర్వభావముగలవారై, ధనము చేత మాన్యుడను భావమును మరియు మదము చేత కూడియున్న పురుషుడు పాఖండత్వము అనగా లేని గుణములను తనయందు ఆపాదించుకొన్నందువలన కలిగిన గర్వముతో ధర్మత్వ జీవనమునకు దూరమై విధిరహితమైన కర్తవ్యములను అజ్ఞానము వలన ఆచరించుచూ కేవలము నామమాత్రమైన యజ్ఞముల ద్వారా పూజాదులు చేయుచుందురు.

మరియు -

**16.18. అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః**
**మామాత్మ పరదేహేషు ప్రద్విషంతో ऽభ్య సూయకాః**

అనగా - అహంకారము, 'నేను, నేను' అని తలంచుట 'అహకారమ'నబడును. అట్టి అహంకారము కలిగియున్న మానవుడు మరియు తనయందు లేనటువంటి గుణములను తనయందు ఆరోపించుకొని 'నేను అందరికంటే గొప్పవాడను' అని తలంచువాడు అహంకారము గలవాడనబడును. అలా తలంచుట అవిద్య కారణముగా తోచు గొప్ప దోషము. అంతేగాక ఈ అహంకారము సర్వవిధ దోషములకు మరియు సమస్తమైన అనర్థమయ దోషములకు మరియు ప్రవృత్తులకు మూలకారణము అయి వున్నది. కామ అనగా కామము మరియు ఆసక్తితో కూడియున్నటువంటి మరియు ఇతరులను పరాభవించుటకు మాత్రమే వుపయోగపడు బలము, దర్పము - ఈ గుణములు - ప్రవృత్తి కలిగియున్న మానవుడు ధర్మమును అతిక్రమించి అధర్మాచరణమునందు లగ్నమగును. అంతఃకరణమును ఆశ్రయించియున్న దోషవిశేషమునే దర్పమందురు.

మరియు స్త్రీలయందు కలుగు వ్యామోహమును అనగా ఆసక్తిని కామము మరియు ఏదైనా అనిష్టము కలిగినందు వలన కలుగునటువంటి ప్రవృత్తి అనగా క్రోధము మొదలగు అన్ని విధములైన అన్ని దోషములను మరియు యితరమైన గొప్ప గొప్ప దోషములను అవలంభించువారు ఆసురీ వృత్తికలవారని గుర్తింపనగును.

ఇంతే కాకుండా అట్టివారు తన మరియు యితరుల శరీరములందున్న, వాటియొక్క బుద్ధి మరియు వారు చేయు కర్మలకు ప్రత్యక్ష సాక్షి అయివున్నటువంటి ఈశ్వరస్వరూపుడనై యున్న నన్ను ద్వేషించు చుందురు. నా యాజ్ఞలను వుల్లంఘించి వ్యవహరించుటయే నన్ను ద్వేషించుటగా గుర్తింపనగును. అలా వ్యవహరించువారు సన్మార్గమునందు పయనించు పురుషుల గుణములను చూచి సహించలేక వారిని నానా విధములుగా నిందించుచుందురు.

**16.19. తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,**
**క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు.**

అనగా - సన్మార్గమునకు వ్యతిరేకులు మరియు నన్ను మరియు సాధుపురుషులను ద్వేషించు మానవులను, అశుభ కర్మలు చేయు క్రూరులైన నరాధములను నేను ప్రతిసారి

అనగా అనేక పర్యాయములుగా ప్రపంచమునందు నరకమునకు పోవు విధముగా అనగా తరచుగా క్రూరకర్మలు చేయునటువంటి పులులు, సింహములు మొదలగు ఆసురీ యోనులయందు పడవేయుచుందును అనగా నీచ జన్మలను కలుగజేయుచుందును. అట్లేలయన? వారందరూ పాపాది దోషములతో కూడియున్నారు.

### 16.20. ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని, మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాం గతిమ్.

అనగా - అటువంటి మూఢులు అనగా వివేకహీనులు ప్రతి దేహధారణ కాల మందును అనగా ప్రతి జన్మయందును ఆసురీ యోనులను పొందుచూ అనగా తమోగుణము హెచ్చుగా నున్నటువంటి యోనులయందు జన్మమును పొందుచూ, యింకా క్రిందికి జారుచూ ఈశ్వరుడైన నన్ను పొందజాలక అంతకుముందు లభించినటువంటి పశుపక్ష్యాది యోనుల కంటే కూడ యింకా హీనమైన అనగా క్రిమికీటకాది యోనులను పొందుచుందురు.

"నన్ను పొందక" అని చెప్పుటకు తాత్పర్యమేమన ? వారు నేను చెప్పుచున్నటువంటి శ్రేష్ఠమైన మార్గమందు గూడ పయనించక పతనమును పొందుచుందురు. నన్ను పొందు మార్గము అతి సులభమై సర్వవిదితమై యున్నది.

ఇప్పుడు సమస్తమైన ఆసురీ సంపదను గురించి సంక్షేపముగా చెప్పుచున్నారు. పైన కామాది మూడు భేదములందును ఆసురీ సంపత్తికి అనంతమైన భేదములున్నప్పటికి అవన్నియు ఆ కామాది మూడు భేదములందే మిళితమై పోవుచున్నవి. కావున ఆ మూడింటిని నశింపజేసినచో సర్వదోషములను నశింపజేయబడినట్లే. అందుచేత సర్వానర్థములకు మూలకారణమైన ఆ మూడు భేదములను గురించి చెప్పబడుచున్నది.

### 16.21. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః, కామ క్రోధస్తథా లోభ స్తస్మా దేతత్త్రయం త్యజేత్.

అనగా - ఆత్మను మరచినవారి ఈ మూడు విధములగు దోషములు నరకప్రాప్తికి ద్వారములు వంటివి. వీనిలో ప్రవేశించినంత మాత్రము చేత వారి ఆత్మదూషితమగును. అనగా పురుషార్థమును పొందు యొగ్యత లేనిదగును. అందుచేత ఈ మూడు అనగా కామ, క్రోధ లోభములు ఆత్మభావమును బాధించునవై యున్నవి.

ఆ మూడు ఏవి ? అన్నచో - కామము, క్రోధము మరియు లోభములు. అందు వలన పురుషార్థమును ఆశించు పురుషుడు ఈ మూడింటినీ తప్పక త్యజించవలయును. ఏలయన ? కామము మొదలగు ఈ మూడు నరకద్వారముల వంటివై ఆత్మను మరుగు పరచునవైయున్నవి. అందుచే యీ మూడింటిని తప్పక త్యజించవలయును. ఆత్మను యీ విధముగా స్తుతించడమైనది.

**16.22. ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైస్త్రిభిర్నరః,**
**ఆచరత్యాత్మనః శ్రేయ స్తతో యాతి పరాం గతిమ్.**

అనగా - ఓ కుంతీపుత్రా ! ఈ కామాదులు దుఃఖము మరియు మోహరూపమై అంధకారముతో నిండియున్న నరకద్వారములు. ఈ మూడు దుర్గుణముల నుండి తప్పించుకొన్న మానవుడు సత్కర్మాచరణము చేయును, సాధన చేయును. ఇంతకు పూర్వము కామాదుల వశమునందుండి ఏ ఆత్మను పొందుటకు ఆవశ్యకములైన సాధనలు చేయకయుండెనో యిప్పుడా కామాదులు నశించినందున అట్టి సాధన చేయనారంభించును. అట్టి సాధన వలన సాధకుడైన మానవుడు ఆ పరమగతిని అనగా మోక్షమును గూడా పొందగలడు.

ఈ విధమగు సమస్తమైన ఆసురీ సంపత్తిని త్యజించుటకు మరియు మానవునకు అన్ని విధముల శుభములను కలిగించునటువంటి కారణరూపమైన సాధనము శాస్త్రమైయున్నది. శాస్త్ర ప్రమాణము ద్వారానే ఆ రెండు కార్యములు సాధ్యమగును. మరి ఏ విధముగాను సాధ్యపడవు. అందుచేత -

**16.23. యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్.**

అనగా - ఏ మానవుడు శాస్త్రము చెప్పిన పద్ధతిని అనగా కర్తవ్యాకర్తవ్యముల జ్ఞానమునకు కారణమైన ఏ విధి నిషేధకములైన ఉపదేశము కలదో దానిని త్యజించి కామముచే ప్రేరితమైన కర్మలనాచరించుచుండునో అట్టి మానవుడు యిటు సిద్ధినిగాని, అటు పురుషార్థమును పొందుటకు తగిన యోగ్యతను గాని పొందజాలడు. ఈ లోకమునందు ఎటువంటి సుఖమును పొందజాలడు. మరియు పరమగతిని అనగా స్వర్గమునుగాని, మోక్షమునుగాని పొందజాలడు.

**16.24. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి.**

అనగా - అందువలన, కర్తవ్యమేదో మరియు అకర్తవ్యమేదో తెలుసుకొనుటకు నీకు శాస్త్రమే ప్రమాణము అనగా సాధనము. అందుచేత శాస్త్ర విధానము ద్వారా చెప్పబడిన వాక్యమును చక్కగా తెలుసుకొని అనగా శాస్త్రము ఆజ్ఞాపించుటనే విధానమందురు. "ఈ కార్యము చేయుము. ఈ కార్యము చేయవద్దు" అని శాస్త్రము ఆజ్ఞాపించుచున్న ఎడల ఆ శాస్త్రము చెప్పుచున్నట్టి కర్మలను చక్కగా తెలుసుకొని నీవు ఈ కర్మక్షేత్రమగు లోకమునందు కర్మలు చేయుట మంచిది. 'ఇహ' అను శబ్దము ఏ భూమియందు కర్మాధికారము కలదో దానిని సూచించునదై యున్నది.

శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి దైవాసుర సంపద్విభాగయోగమనబడు పదునారవ అధ్యాయమునకు
శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.
అనువాదకులు - శ్రీ సదానందభారతి,
ప్రణవాశ్రమము.

# పదునేడవ అధ్యాయము

"తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే" అను యీ వాక్యము ద్వారా ప్రశ్నించుటకు యే అవకాశము లభించినదో దానిని ఆదారముగ జేసుకొని అర్జునుడు భగవంతుని యిట్లు ప్రశ్నించినాడు -

**17.1. యే శాస్త్రవిధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః,**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః.**

అనగా - ఎవడైనా ఒక సాధారణ మానవుడు శాస్త్రము చెప్పినట్లుగాక అనగా శాస్త విధిననుసరించి గాక, శాస్త్రము అనగా శ్రుతి మరియు స్మృతి మొదలగు శాస్త్ర విధానములన త్యజించి అతి శ్రద్ధతో అనగా అత్యంత ఆస్తిక బుద్ధితో కూడినవాడై అనగా ఆస్తికబుద్ధి సంపన్నుడై దేవతాదులను పూజించును.

ఇచ్చట "ఈ శాస్త్రవిధి మత్సృజ్య యజంతే శద్ధాయాన్వితా" అను వాక్యార్థమునన సరించి శ్రుతిరూపమైన లేక స్మృతిరూపమైన ఎటువంటి శాస్త్రమును ఎరుంగకయే, కేవలమ వృద్ధులైన వారల వ్యవహారమును ఆదర్శముగా తీసుకొని ఎవడు అతి శ్రద్ధాభావముత దేవతాదులను పూజించునో అటువంటి మనుష్యులే యిచ్చట గ్రహించబడి యున్నారు. కాః మరియొక మనుష్యుడు శాస్త్ర విధివిధానమును కొంచముగా ఎరిగి యుండెను. దానిని వద( విధిరహితముగా దేవతాదులను పూజించును. అటువంటివారు "ఈ శాస్త్ర విధి ముత్సృజ యజంతే" ఈ కథనానుసారముగా గ్రహించబడజాలరు.

**పూర్వపక్షము** - అటువంటివారు ఎందుకు జ్ఞానులుగా పరిగణించబడరు ?

**సమాధానము** - శ్రద్ధాభావముతో కూడియున్న (పూజించుచున్నవారు) అన విశేషణము చెప్పబడినందున. ఏలయన ? దేవతలను పూజించుటకు సంబంధించిన శాస్త్రమున ఎరింగియుండియు దానిని శ్రద్ధాభావ రహితముగా త్యజించి, ఆ శాస్త్రము ద్వారా చెప్పబడి అనగా విధించబడిన దేవతాదుల పూజలయందు శ్రద్ధాభావముతో కూడినవారై వ్యవహరించ చున్నారు అనుమాట ఒప్పుకొనబడదు. అనగా ఆ మాట వూహించరానిది. అందువల ముందుగా చెప్పబడినట్టి మానవులు మాత్రమే "యే శాస్త్ర విధముత్సృజ్యయజంతే శ్రద్ధయాన్వితా ఈ మాట ప్రకారము గ్రహించబడుదురు.

ఓ కృష్ణా ! ఈ విధముగా ఆచరించు మనుష్యుల నిష్ఠ ఎటువంటిది ? సాత్వికమా రాజసమా ? లేక తామసమా ? అనగా అటువంటివారి మానసిక స్థితి సత్వగుణ ప్రధానమైనదా లేక రజోగుణ ప్రధానమైనదా ? లేక తమోగుణ ప్రధానమైనదా ? చెప్పునదేమన ? వా దేవాది విషయికమైన పూజ సాత్వికమా ? రాజసమా ? లేక తామస గుణ ప్రధానమైనదా

ఈ ప్రశ్న సాధారణ మానవులను దృష్టియందుంచుకొని అడుగబడిన ప్రశ్న. అందువలన మానవులందరినీ తగు విధముగా అనగా వారి వారి గుణములననుసరించి ఈ ప్రశ్నకు సమాధానము చెప్పవలసి యున్నది. అట్టి భావమును దృష్టియందుంచుకొని భగవంతుడు యిట్లు చెప్పినాడు -

**17.2. త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా,**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు.**

అనగా - అర్జునా ! నీవు అడిగిన నిష్ఠను గురించి చెప్పవలయునన్నచో - మానవులయందుండు స్వభావజన్యమైన నిష్ఠ అనగా శ్రద్ధాభావము అనగా వారు తమ జన్మజన్మాంతరముల యందు చేసి యున్నట్టి ధర్మాధర్మ సంస్కారములు వారు దేహత్యాగము చేయు సందర్భమున ప్రకటితమగుచుండునో ఆ సంస్కార సముదాయమునే స్వభావమందురు. ఆ స్వభావముననుసరించి యున్న శ్రద్ధ మూడు విధములుగా వుండును. సత్త్వగుణము ప్రధానముగా యున్నప్పుడు కలిగిన లేక చేయబడిన దేవపూజాది విషయికమైనది సాత్త్విక శ్రద్ధయనబడును. రజోగుణము వలన కలిగినటువంటి యక్ష-రాక్షసాదుల పూజా విషయికమైన శ్రద్ధ రాజసగుణ ప్రధానమైన శ్రద్ధయనబడును. మరియు తమోగుణము వలన కలిగినటువంటి ప్రేతపిశాచాది పూజావిషయికమైన శ్రద్ధ తామసగుణ ప్రధానమైన శ్రద్ధయనబడును. ఈ విధముగా శ్రద్ధాభావము మూడు విధములుగా వుండును. చెప్పెద వినుము -

శ్రద్ధ మూడు విధములుగా వుండును -

**17.3. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత,**
**శ్రద్ధామయో ఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః.**

అనగా - ఓ భారత ! ప్రాణులన్నింటి యొక్క శ్రద్ధ వారి వారి భిన్న భిన్న సంస్కారములతో కూడి వారి అంతఃసంస్కారముననుసరించి యుండును. అలాంటప్పుడు ఏమి జరుగును, ఎట్లు జరుగును ? అన్నచో చెప్పుచున్నారు. ఈ పురుషుడు అనగా ప్రాపంచిక జీవుడు సహజముగానే శ్రద్ధామయుడు. ఏలయన ? ఏ జీవుడు ఎటువంటి శ్రద్ధగలవాడై యుండునో అనగా ఏ **జీవుని శ్రద్ధ ఎటువంటిదో ఆ జీవుడు స్వయముగా అటువంటివాడే అయి వుండును.** అనగా ఆతడు ఆతని యందు కలిగియున్న శ్రద్ధకు అనురూపముగానే యుండును.

అందువలన ఆ శ్రద్ధాభావముననుసరించి వారు చేయు దేవాదుల పూజ వలన సాత్త్వికము మొదలగు నిష్ఠలను గురించి నిర్ణయించుకొనవలసి యుంటుంది. కావున -

17.4. యజంతే సాత్వికా దేవాన్యక్షరక్షాంసి రాజసాః,
ప్రేతాన్భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః.

అనగా - సాత్త్విక నిష్ఠ కలిగియున్న పురుషులు దేవతలను పూజించుచుందురు. రాజస నిష్ఠ కలిగిన పురుషుడు యక్షులు రాక్షసులు మొదలగు వారిని పూజించుచుందురు. ఇంక యితరమైన తామస నిష్ఠ కలిగియున్న పురుషులు ప్రేతములు మరియు సప్తమాతృకాది అనగా శక్తిరూపిణులుగా తలంచబడుచున్న గ్రామ దేవతలను, భూతగణములను పూజించుచుందురు.

ఈ విధముగా వారు చేయు కార్యములననుసరించి పురుషుల యొక్క సాత్వికాది నిష్ఠల నిర్ణయము చేయబడినది. ఆ విధముగా స్వభావ సిద్ధమైన శ్రద్ధగల వేలమంది మనుష్యులలో ఎవడో ఒక్క మహాత్ముడు శాస్త్ర విధిని త్యజించినప్పటికీ దేవపూజాపరాయణుడై యున్నందున చివరకు సాత్వికనిష్ఠ గలవాడగును. కాని ఎక్కువ శాతం మనుష్యులు రాజసీ, తామసీ నిష్ఠా భావములే కలగియుందురు. అదెట్లన ? చెప్పబడుచున్నది.

17.5. అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః,
దంభాహంకార సంయుక్తాః, కామరాగబలాన్వితాః.

అనగా - శాస్త్ర విధానమును ఎరుంగనటువంటి మనుష్యుడు శాస్త్ర విహితము కానటువంటి మరియు ఘోరమైన అనగా అన్యప్రాణులను మరియు తన దేహమునకు బాధ కలుగునటువంటి తపము, దంభము మరియు అహంకారము మొదలగు దుష్టభావములకు లోనై మరియు కామము మరియు ఆసక్తి వలన కలుగు బలమును ఆధారముగ జేసుకొని లేక కామము మరియు ఆసక్తి మరియు శారీరక బలముతో కూడినవాడై తపించుచుండును.

17.6. కర్శయంతః శరీరస్థం భూతగ్రామ మచేతసః,
మాం చైవాంతః శరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్.

అనగా - ఆ వివేకములేనటువంటి మనుష్యులు శరీరమునందు నిండియున్న యింద్రియాది కరణముల (సాధనముల) రూపమున పరిణమించియున్న భూత సముదాయమును మరియు దేహము లోపల అంతరాత్మ రూపమున వ్యాపించియున్న మరియు వాటియొక్క కర్మలకు మరియు బుద్ధికి సాక్షిగా యున్న ఈశ్వరుడనైన నన్ను కూడ యిబ్బంది పెట్టుచూ - నా ఆజ్ఞలను పాటించకుండుటయే నన్ను యిబ్బంది పెట్టుట - ఆ విధముగా నన్ను యిబ్బంది పెట్టుచూ ఘోరమైన తపస్సు చేయుచుందురు. అట్లు చేయువారిని నీవు ఆసురీవృత్తి గలవారినిగా గుర్తించుము. ఎవరి ప్రవృత్తి ఆసురీ నిష్ఠ కలిగి యుందునో వారే ఆసురీనిష్ఠగలవారనబడుదురు. అటువంటివారి సాంగత్యమును విడనాడుటకై నీవు అట్టివారిని గుర్తించుము. ఇదియే నా ఉపదేశము.

రసయుక్తము మరియు స్నిగ్ధము అనగా నేయి మొదలగు రుచికర పదార్థములతో కూడిన భోజనములయందు తమ రుచియొక్క అధికత్వరూపమైన లక్షణము ద్వారా తమ సాత్వికత్వమును, రాజసత్వమును మరియు తామసత్వమును గుర్తించి రాజసము మరియు తామస గుణవర్థకములైన అహారమును త్యజించుటకు రస్య-స్నిగ్ధ మొదలగు వాక్యముల ద్వారా వర్ణించబడిన మూడు విధములుగా విభజింపబడిన ఆహారమునందు క్రమముగా సాత్వికము, రాజసము మరియు తామస గుణ సంపన్న పురుషుల రుచి చూపబడినది. అదే విధముగా సాత్వికము మొదలగు గుణభేదముల ద్వారా యజ్ఞాది భేదముల ప్రతిపాదన గూడ యిచ్చట చేయబడుచున్న కారణమేమన ? రాజసము మరియు తామస భావముతో కూడిన యజ్ఞాదులను గుర్తించి ఏదో విధముగా లోకులు వాటిని త్యజింతురు గాక యనియు మరియు సాత్విక భావముతో కూడియున్న యజ్ఞాదులనే అనుష్ఠింతురు అని తలంచి -

**17.7. ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవత ప్రియః,**
**యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు.**

అనగా - భోజనము చేయు మనుష్యులనందరిని వారు భుజించు పదార్థములను ఆధారముగా చేసుకొని మూడు విధములుగా విభజింపవచ్చును. అనగా వారందరికి మూడు విధములైన ఆహారములు ప్రియముగాను మరియు రుచికరముగాను వుండును. అట్లే యజ్ఞములు, తపములు మరియు దానములు గూడ మూడు విధములుగా వుండును. కావున ఆయాహారాది విషయములను మరియు వివరణను గురించి చెప్పబోవుచున్నాను. వినుము -

**17.8. ఆయుః సత్త్వబలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః,**
**రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్వికప్రియాః.**

అనగా - ఆయువు, బుద్ధి, బలము, ఆరోగ్యము, సుఖము మరియు వాటి యందు ప్రీతి మొదలగు వాటిని వృద్ధి చేయునటువంటి మరియు రస్య అనగా రసయుక్తము, స్నిగ్ధ అనగా సుఖముగా జారునటువంటి అనగా నేయి మొదలగు తైల పదార్థముతో కూడినటువంటి మరియు స్థిరము అనగా శరీరమునందు చాలా కాలము వరకు సారరూపముగా నిల్వ వుండునటువంటి మరియు హృద్యము అనగా హృదయమునకు ప్రియముగా తోచునట్టి భుజించుటకు వీలైన ఆహార పదార్థములు సాత్విక నిష్ఠ కలిగియున్నట్టి పురుషులకు ప్రియములుగా అనగా భుజించగోరునవిగా వుండును.

**17.9. ఖట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్షవిదాహినః,**
**ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః.**

అనగా - చేదుగాను, పుల్లగాను, ఉప్పగాను, అత్యంత వేడిగాను, మంటగాను, ఎండిన మరియు దాహమును కలిగించునవిగాను, మరియు దుఃఖమును కలిగించునవి,

దిగులును కలిగించునవి, మరియు ఆరోగ్యమునకు భంకరమైనటువంటి ఆహారము రాజస ప్రవృత్తి కలిగియున్న పురుషునకు అత్యంత ప్రియములుగా వుండును.

**17.10. యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్,**
**ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్.**

అనగా - యాతయామ అనగా వుడికీ వుడకనటువంటి, గతరస అనగ రసము లేనిది. పూతి అనగా చద్దిదై దుర్గంధము కలిగియున్నది. మరియు ఉచ్ఛిష్టము అనగా యితరులు తినగా మిగిలిన ఆహారము మరియు అమేధ్యము అనగా యజ్ఞమునకు పనికిరానిది అయినటువంటి ఆహారపదార్థములు తామస ప్రవృత్తి కలిగియున్నటువంటి మనుష్యులకు అత్యంత ప్రియములుగా నుండును.

ఇప్పుడు మూడు విధములైన యజ్ఞములు చెప్పబడుచున్నవి.

**17.11. అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే,**
**యష్ట వ్యమేవేతి మనః సమాధాయ స సాత్వికః.**

అనగా - ఫలమును కోరనటువంటి పురుషుల ద్వారా శాస్త్ర నియమానుసారముగ నిశ్చయించబడిన ఏ యజ్ఞము అనుష్ఠింపబడునో - "యజ్ఞము చేయుటయే కర్తవ్యము" అని మనస్సును స్థిరపరచుకొని అనగా "దీని ద్వారా నేను ఎటువంటి పురుషార్థమును పొంద దలంచలేదు" అని నిశ్చయించుకొని చేయబడు యజ్ఞము సాత్విక భావముతో చేయబడినదిగా చెప్పబడును.

**17.12. అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్,**
**ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్.**

అనగా - అర్జునా ! ఎవడు యజ్ఞ ఫలమును పొందవలయునన్న ఆకాంక్ష కలిగి మరియు లోకమునందు కీర్తి ప్రతిష్టలు పొందవలయునను మహత్వ కాంక్షతో యజ్ఞము చేయునో అటువంటి యజ్ఞమును రాజస యజ్ఞమందురు.

**17.13. విధిహీనమసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్,**
**శ్రద్ధా విరహితం యజ్ఞం తామసం పరిచక్షతే.**

అనగా - ఏ యజ్ఞము శాస్త్రానుసారముగాగాక, శాస్త్రమునందు చెప్పిన దానికి విరుద్ధముగా చేయబడునో, మరియు ఏ యజ్ఞమునందు బ్రాహ్మణులకు భోజనాదులు పెట్టబడవో మరియు మంత్రములు అనగా మంత్రము, స్వరము, మరియు వర్ణములు గూడ లేకుండ మరియు శాస్త్ర గ్రంథములందు చెప్పబడినట్లుగా దక్షిణలు మరియు శ్రద్ధాభావము గూడ లేకుండ

నిర్వహించబడునో అటువంటి యజ్ఞమును తమో గుణముతో కూడియున్న వారు చేసిన యజ్ఞముగా చెప్పబడును.

ఇప్పుడు తపము గూడ మూడు విధములుగా యుండునని చెప్పబడుచున్నది -

## 17.14. దేవద్విజ గురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్,
## బ్రహ్మచర్య మహింసా చ శారీరం తప వుచ్యతే.

అనగా - దేవతలు, బ్రాహ్మణులు, గురువులు, మరియు బుద్ధిమంతులు అనగా జ్ఞానులు మొదలగు వారినందరిని పూజించుట. శౌచము అనగా పవిత్రత, ఆర్జవము అనగా సరళ స్వభావము కలిగి యుండుట బ్రహ్మచర్యము మరియు అహింస, మొదలగునవన్నియు శరీర సంబంధము కలిగి శరీరము ద్వారా చేయబడు తపస్సు అనబడును. అనగా యీ కార్యములన్నింటికి స్థూల దేహమే ప్రధానము. ఇటువంటి కార్యములన్నియు, కరణముల ద్వారా కర్త ద్వారా చేయబడినపుడు శరీరమునకు సంబంధించిన పనియని చెప్పబడుచున్నవి. ఈ శారీరక తపస్సునకు అయిదు కారణములు గలవు. వాటిని గురించి తరువాత చెప్పెదను.

## 17.15. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్,
## స్వాధ్యాయాభ్యాసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే.

అనగా - ఏ వచనములు అనగా వాక్కులు ఏ ప్రాణి యొక్క అంతఃకరణమందున దుఃఖమును కలిగించునవికావో మరియు ఏ వచనములు సత్యములు, ప్రియములు మరియు పరహిత కారకములు, అయి వున్నవో అనగా ఈ లోకమునందు మరియు పరలోకమునందు గూడ అనగా సర్వత్ర హితమును కలిగించునవి అయి వున్నవో అటువంటి మాటలను యిచ్చుట "వుద్వేగమును కలిగించునవి కావు" మొదలగు లక్షణములతో వాక్యము విశేషించబడినది. మరియు 'చ' అను శబ్దము అన్ని శబ్దముల సముచ్చయమును సూచించునదై యున్నది. అందువలన యితరులకు ఏదైన ఒక విషయము చెప్పవలసి వచ్చినప్పుడు ఆ చెప్పబడిన వాక్యమునందు సత్యము, ప్రియత్వము, హితకారిత్వము మరియు అనుద్విగ్నత అనగా దుఃఖమును కలిగించకుండుట, అను ఈ నాలిగింటియందును ఏ ఒక్కటి లోపించినా అది వాక్కుద్వారా చేయబడు తపము అనిపించుకోబడదు.

సత్యముతో కూడిన వాక్యము ప్రియత్వము, హితకారిత్వము ఉద్విగ్న రాహిత్యము లేనిదైనచో అది వాక్కు ద్వారా చేయబడు తపము అనిపించుకోబడదు. సత్యమైన వాక్యము, ప్రియత్వము, హితకారిత్వము మరియు అనుద్విగ్నత్వము మొదలగు గుణములు లేనిచో అది వాక్ తపస్సు అనబడదు. అట్లే ప్రియవచనము గూడ యితరమైన అనగా సత్యత్వము, హితకారిత్వము, అనుద్విగ్నత్వము లేనిదై యున్నచో అది గూడ వాక్ తపస్సునకు సంబంధించినది కానేరదు. మరియు హితకరమైన వచనము గూడ సత్యత్వము ప్రియత్వము మొదలగు మూడు

లేనిదైనచో అది గూడ వాక్ తపస్సు కానేరదు. (సత్యం, బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమ ప్రియమ్)

**పూర్వపక్షము** – మరి అలాంటప్పుడు నిజమైన వాక్ తపస్సు ఎట్లుండును ? అన్నచో –

**సమాధానము** – ఏ వచనము సత్యమైనదో వుద్వేగ రహితమైనదో మరియు ప్రియమైనదో అంతేగాక హితకరమైనదో ఆ వచనమే నిజమైన వాక్ తపస్సు. అదెట్లన ? "ఓవత్సా ! అనగా బాలకా ! నీవు శాంతముగా నుండుము. స్వాధ్యాయము మరియు యోగమునందు నిలిచియుండుము. అందువలన నీకు శుభము కలుగును. మొదలగు వచనములు మరియు యథావిధిగా స్వాధ్యాయ సంబంధమైన అభ్యాసము చేయుట గూడ వాక్ సంబంధమైన తపస్సనబడును.

**17.16. మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః,**
**భావసంశుద్ధి రిత్యే తత్తపో మానసముచ్యతే.**

అనగా – మనఃప్రసాదము అనగా మనస్సు అత్యంత శాంతముగా వుండుట అనగా మనస్సు ప్రాపంచిక విషయములను గురించి ఆలోచించకుండా వుండుట అనగా తనయందు తానే వుండుట. అనగా స్వచ్ఛత్వమును పొందుట, సౌమ్యత్వం – అనగా దీనినే సుమనసత అనగా మంచి మనసు కలిగి యుండుట అనగా మనస్సును మరియు ముఖమును ప్రసన్నముగా వుంచు అంతఃకరణ నిర్మలత్వము, మౌనము అనగా అంతఃకరణము మనసుగా పరిణమించి విషయములతో కూడి యుండక తనలో తానే వుండుట, అట్లేలయన ? **వాక్ సంయమము మనఃశాంతిపైననే ఆధారపడి యుండును.** అందుచేత కార్యము ద్వారా కారణము చెప్పబడుచున్నది. మనో సంయమము అనగా మనస్సును విషయముల మీదికి పోనివ్వక నిలిపి వుంచుట మరియు భావము యొక్క శుద్ధత్వము అనగా యితరులతో వ్యవహరించు చున్నప్పుడు మోసము కపటము లేకుండుట మానసిక తపమనబడును. **కేవలము వాక్కు మరియు మనస్సు ఏకరూపము కలిగియుండుటయే మౌనబడును.** మరియు సామాన్యముగా మనస్సు వాక్కు రెండూ కలసి ఏకరూపముగా నుండుటయే మౌనమనబడును. దీనినే ఆత్మ నిగ్రహమని గూడ అందురు. ఇంతే భేదము.

పైన చెప్పబడిన కాయిక (శారీరక) వాచిక (వాక్ సంబంధమైన) మరియు మానసిక తపము మనుష్యుల ద్వారా చేయబడినప్పుడు సాత్వికము మొదలగు మూడు విధములగు భేదము ఎట్లు కలుగునో అది చెప్పుచున్నారు.

**17.17. శ్రద్ధయా పరయా తప్తం తపస్త త్రివిధం నరైః,**
**అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే.**

అనగా – పై సందర్భముననుసరించి తపము మూడు విధములుగా నుండును. ఒకటి కాయికము అనగా దేహమునకు సంబంధించినది. రెండవది వాచిక తపస్సు అనగా

మాటకు సంబంధించినది. మరియు మూడవది మానసిక తపస్సు ఫలాకాంక్షలేనటువంటిది. మరియు సమాహిత చిత్తముగల పురుషుల ద్వారా సర్వోత్తమమైన శ్రద్ధతో, ఆస్తికబుద్ధిపూర్వకముగా చేయబడునది. ఇటువంటి ఆ తపమును శ్రేష్ఠమైన పురుషులు సత్త్వ గుణయుక్తమైన తపస్సని చెప్పుదురు.

**17.18. సత్కారమాన పూజార్థం తపో దంభేన చైవ యత్,**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్.**

అనగా – సత్కారము, గౌరవము, మరియు యితరులచే పూజాదికములు పొందుట కొఱకు చేయబడు తపము, ఈతడు చాలా శ్రేష్ఠ పురుషుడు, గొప్ప తపోధనుడు. బ్రాహ్మణుడు అని గొప్పగా చెప్పుకొనబడుటకు చేయు తపము సత్కారమును పొందుటకు చేయు తపము. వారు వచ్చునపుడు లేచి నిలబడుట, నమస్కరించుట, మొదలగు క్రియల ద్వారా చేయబడునది మానము. కాళ్లు కడుగుట, అర్చించుట, భోజనాదికములు చేయించుట మొదలగు క్రియలను పూజయందురు. వీటిని పొందుట కొఱకు చేయబడు తపము మరియు దంభముతో చేయబడు తపము యిచ్చట రాజసీ తపమని చెప్పబడును. అంతేగాక అనిశ్చితమైన ఫలము గలది యగుటచే నాశవంతమైనది మరియు అనిత్యమైనది గూడాను అని చెప్పబడినది.

**17.19. మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః;**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్.**

అనగా – ఏ తపము తన శరీరమును బాధించి లేక యితరులకు కీడును కలిగించుటకై మూర్ఖత్వ భావముతో బలవంతముగా అనగా అజ్ఞానముతో నిర్ణయించబడి చేయబడునో అది తామసీ తపమని చెప్పబడును.

ఇప్పుడు దానమునందలి భేదములను చెప్పుచున్నారు –

**17.20. దాతవ్యమితి యద్దానం దీయతే ఽనుపకారిణే,**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్.**

అనగా – "దానం చెయ్యడమే మంచి పని" అని నిశ్చయించుకొన్న మానవుడు తనకు తిరిగి ఎటువంటి వుపకారము చేయజాలని దీనునికి, ఒక వేళ అతడు తిరిగి ఉపకారము చేయగలిగియున్నను అతని నుండి ఎటువంటి ప్రత్యుపకారము కోరక, మరియు ఎవడు పుణ్యక్షేత్రములయందు దీనుడై నివసించుచుండునో, సంక్రాంతి మొదలగు పుణ్యకాలముల యందును, మరియు షడంగములతో కూడియున్న వేదములను చక్కగా చదువుకొన్నవానికి, శుద్ధమైన బ్రాహ్మణుడు మొదలగు దానమును పొందుటకు యోగ్యులైన వారికి దానము

చెయ్యవచ్చును. ఆ విధముగా సత్ పాత్రలకు చేయబడు దానము సాత్విక బుద్ధి కలిగి చేయబడిన దానమని చెప్పబడును.

## 17.21. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్ధిశ్య వా పునః, దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్,

అనగా - ప్రత్యుపకార బుద్ధితో అనగా "కాలాంతరమందు ఆతడు నాకు తిరిగి వుపకారమును చేయగలడు" అను అభిప్రాయమును మనసునందుంచుకొని, లేక "యీ విధముగా దానము చేసినందువలన నాకు పరలోకము నందు తగిన ఫలము లభించును" అను భావమును మనసునందుంచుకొని తనకు దానము చేయుట యిష్టము లేకున్నను అతికష్టముగా యివ్వబడు దానము రాజస దానమని చెప్పబడును.

## 17.22. అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే, అసత్కృతమవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్.

అనగా - అయోగ్యమైన దేశకాలములందు అనగా అశుద్ధమైన వస్తువులు మరియు మ్లేచ్ఛాదులతో నిండియున్న పాపకర్మలు చేయబడు దేశమునందు మరియు పుణ్యసంపాదనకు సాధనములుగా చెప్పబడుచున్న సంక్రాంతి మొదలగు పుణ్యదినములయందుగాక ఎటువంటి విశేషము లేనటువంటి కాలమునందు, మరియు మూర్ఖులకు, దొంగలు మొదలగు అపాత్రులకు యివ్వబడు దానము మరియు మంచి దేశకాలములంధు గూడ ఎటువంటి సద్భావము మరియు సత్కారము అనగా ప్రియమైన వచనములు, పాద ప్రక్షాళనము, మరియు పూజాదులు మొదలగు సమ్మానరహితముగా దానము పుచ్చుకొను వానిని అవమానించుచూ యివ్వబడుదానము తామసదానమని చెప్పబడును.

యజ్ఞము, దానము, తపము మొదలగు వానిని సద్గుణ సంపన్నత గలవానిగా చేయుటకు ఉపదేశింపబడుచున్నది. అదెట్లన ? ----

## 17.23. ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః, బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా.

అనగా - 'ఓం తత్ సత్' ఈ మూడు శబ్దములు మూడు విధములుగా బ్రహ్మతత్వము లను నిర్దేశించుచున్నవి అనగా సూచించుచున్నవి. దేని ద్వారా ఏదైనా ఒక వస్తువు సూచింపబడునో దానిని "నిర్దేశ" మందురు. అందుచేత ఆ మూడు శబ్దములు బ్రహ్మ తత్వమునకు మూడు విధములగు పేర్లు. ఆ విధముగా వేదాంతమునందు బ్రహ్మ జ్ఞానులు అనగా బ్రహ్మతత్వమును ఎఱింగినవారని వొప్పుకొనియున్నారు. పూర్వకాలమునందు ఈ మూడు విధములగు పేర్లతోనే బ్రాహ్మణుడు, వేదములు మరియు యజ్ఞములు మొదలగునవన్నియు సృష్టించబడినవి. బ్రహ్మతత్వమును స్తుతించుట కొఱకు అట్లు చెప్పబడినది.

**17.24. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదాన తపః క్రియాః,**
**ప్రవర్తంతే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్.**

అనగా - అందుచేతనే వేదము చదువ లేక చెప్పుట ప్రారంభించునప్పుడు అట్లు ప్రారంభించు బ్రాహ్మణుల యొక్క శాస్త్రవిధి అనగా శాస్త్రము చెప్పినట్లుగా ననుసరించి చెప్పబడినట్లు యజ్ఞము, దానము, మరియు తపము మొదలగు క్రియలన్నియు బ్రహ్మయొక్క నామమైన 'ఓం' అను శబ్దోచ్చారణజేసిన తరువాతనే ప్రారంభించబడుచున్నవి.

**17.25. తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః,**
**దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః.**

అనగా - "తత్" అను యిటువంటి బ్రహ్మ నామమును ఉచ్చరించి మరియు కర్మ ఫలమును అనేక విధములైన యజ్ఞములు మరియు తపరూపములైన మరియు దానము అనగా భూమి, సువర్ణము, మొదలగు దానము చేయునటువంటి క్రియలు మోక్షమును పొందగోరునట్టి ముముక్షువులైన పురుషుల ద్వారా చేయబడుచుండును.

'ఓం' మరియు 'తత్' శబ్దముల అర్థము మరియు వాటి ప్రయోగము చెప్పబడినది. ఇప్పుడు 'సత్' శబ్దము యొక్క ప్రయోగమును గురించి చెప్పబడును --

**17.26. సద్భావే సాధుభావే చ సదిత్యే తత్ప్రయుజ్యతే,**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే.**

అనగా - అసలు లేనటువంటి వస్తువును వున్నట్లుగా తలంచుటయుంను. మరియు సాధుభావమునందును, ఈ 'సత్' శబ్ద ప్రయోగము ద్వారా అనగా బ్రహ్మ యొక్క నామము యొక్క ప్రయోగము జరుగుచుండెను. అనగా అచ్చట గూడ 'సత్' శబ్ద ప్రయోగము జరుగుచుండును. అందువలన ఓ పార్థా ! వివాహాది శుభకార్యాదులయందుగూడ 'సత్' శబ్దము ప్రయోగించబడుచుండును. అనగా సర్వవిధ శుభకార్యములందును 'సత్' శబ్ద ప్రయోగము జరుగుచుండును.

**17.27. యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే,**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే.**

అనగా - యజ్ఞాది కర్మలయందు ఏది కలదో, తపములయందేది కలదో మరియు దానాదులయందేది సత్యమై యున్నదో అది అంతయు 'సత్' అయి వున్నదని విద్వాంసుల అభిప్రాయము. మరియు యజ్ఞాదుల కొఱకు ఏ కర్మ చేయబడుచున్నదో, లేక ఏ పదార్థమును గుర్తించుటకు ఈ మూడు శబ్దములు ప్రయోగించబడుచున్నవో ఆ పదార్థము అనగా ఆ ఈశ్వరుని కొఱకు చేయబడు కర్మలన్నియు 'సత్' అయి వున్నవనియే చెప్పబడుచున్నది. ఈ విధముగా

చేయబడిన యజ్ఞము మరియు తపము మొదలగు కర్మలు సత్వములుకాకున్నను మరియు గుణహీనములైయున్నను అత్యంత శ్రద్ధాభావముతో పరమాత్ముని యొక్క మూడు నామములను ప్రయోగించుటచేత సాత్వికములు మరియు సగుణములుగా చేయబడుచున్నవి.

అట్లేలయన ? సర్వత్రా శ్రద్ధాభావము ప్రధానముగా వున్నందున సర్వము చేయబడుచుండును - అందుచేత -

**17.28.** అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్,
అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ.

అనగా - శ్రద్ధాభావము లేకుండ అర్పించబడిన హవనము, శ్రద్ధాభావము లేకుండ బ్రాహ్మణులకు యియ్యబడిన దానము, చేయబడిన తపము, మరి యింకేదైనను శ్రద్ధాభావము లేకుండ చేయబడు ప్రార్థనలు, నమస్కారములు, మరేవైన యితర కర్మలు అవన్నియు ఓ పార్థా! నన్ను పొందు సాధన మార్గములకు సంబంధించక వేఱుగ వుందును; గావున అవన్నియు సత్ లేనివి అనగ అసత్‌లు అగుచున్నవి. అట్లేలయిన ? అట్టి కర్మలు ఎంత శ్రమతో కూడినవైనను సాధుపురుషుల ద్వారా నిందనీయములనబడుచున్నందున దేహత్యాగము తరువాత గూడ ఎటువంటి ఫలమును యియ్యజాలవు. దేహముతో కూడియున్నప్పుదు గూడ సుఖదాయకములుః కానేరవు.

శ్రీశ్రీశ్రీ వేదవ్యాస విరచిత శ్రీమద్భగవద్గీత యందలి
శ్రద్ధాత్రయ విభాగయోగ మనబడు పదునేడవ అధ్యాయమునకు
శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు తెనుగు అనువాదము సమాప్తము.
అనువాదకులు - శ్రీ సదానంద భారతి,
ప్రణవాశ్రమము.

# పదునెనిమిదవ అధ్యాయము

ఈ అధ్యాయమునందు సమస్త గీతాశాస్త్రము యొక్క లక్ష్యము మరియు వేదముల యొక్క సంపూర్ణ తాత్పర్యమును క్రోగుజేసి చెప్పవలసి యున్నది. ఇదే అభిప్రాయముతో ఈ పదునెనిమిదవ అధ్యాయము ఆరంభించబడుచున్నది.

ఈ అధ్యాయమునందు ముందుగా యింతకుపూర్వము చెప్పబడిన అన్ని అధ్యాయములయందు చెప్పబడిన విషయము సంక్షిప్తముగా చెప్పబడినది. అట్లయినప్పటికి అర్జునుడు కేవలము సంన్యాసము మరియు తపము ఈ రెండు శబ్దముల యొక్క భేదమును వివరముగా ఎఱుంగ గోరినవాడై యీ క్రింది విధముగా ప్రశ్నించుచున్నాడు –

**18.1. సంన్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్,**
**త్యాగస్య చ హృషీకేశ పృథక్కేశినిషూదన.**

అనగా – ఓ కృష్ణా ! నేను సంన్యాసము యొక్క అనగా సంన్యాస శబ్దము యొక్క అర్థమును, మరియు త్యాగము యొక్క అనగా త్యాగశబ్దము యొక్క అర్థమును మరియు దానియొక్క తత్త్వమును అనగా వాటియొక్క యథార్థ స్వరూపమును వేఱువేఱుగా అనగా విభాగపూర్వకముగా తెలుసుకొనగోచున్నాను.

పూర్వపు అధ్యాయములందు ఈ విషయమును గురించి సందర్భానుసారముగ ఆయాచోట్ల కొంతవరకు చెప్పబడినది. ఆ సంన్యాసము మరియు త్యాగము ఈ రెండు శబ్దములు స్పష్టమైన అర్థమును కలిగి లేవు. అందుచేత వాటియొక్క స్పష్టమైన అర్థమును ఎఱుంగగోరినటువంటి అర్జుననకు వాటియొక్క స్పష్టార్థములను నిర్ణయించి చెప్పుటకు భగవంతుడు యిట్లు చెప్పియున్నాడు –

**18.2. కామ్యానాం కర్మణాం న్యాసం సంన్యాసం కవయో విదుః,**
**సర్వకర్మ ఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః.**

అనగా – చాలా మంది బుద్ధిమంతులైన పండితులు అశ్వమేధము మొదలగు కామభావముతో కూడియున్న కర్మలను త్యజించుటయే అనగా చేయకుండుటయే సంన్యాసమని తలంచుచున్నారు. అనగా తమవంతు కర్తవ్య రూపముగా ప్రాప్తించినటువంటి శాస్త్రవిహితమైన సకామ కర్మలు చేయకుండుటయే సంన్యాస శబ్దమునకు అర్థముగా తలంచుచున్నారు.

ఇంక కొంత ఎక్కువ జ్ఞానము కలిగిన పండితులు అనుష్ఠింపబడుచున్న నిత్య నైమిత్తికమైన సమస్త కర్మలను మరియు వాటికి సంబంధించిన ఫలములను గూడ త్యజించునటువంటి సర్వ కర్మ ఫల త్యాగములను మాత్రమే త్యాగమని చెప్పుచున్నారు. అనగా త్యాగము అను శబ్దమునకు వారు అటువంటి అర్థమునే చెప్పుచున్నారు.

వారు చెప్పునటువంటి అభిప్రాయమెట్లున్నను కామ్య కర్మలను త్యజించుట యన్నను, లేక సమస్త కర్మల ఫలములను త్యజించుట యున్నను ఒక్కటే అర్థము అనగా అన్ని విధములుగాను **సంన్యాసము మరియు త్యాగము ఈ రెండు శబ్దముల అర్థము కేవలము త్యాగమే.** ఈ రెండు శబ్దములు ఘటము మరియు వస్త్రము మొదలగు శబ్దముల వలె భిన్న జాతులకు సంబంధించిన అర్థమును బోధించునవి కావు.

**పూర్వపక్షము** - నిత్యనైమిత్తిక కర్మలకు ఎటువంటి ఫలము వుండదని చెప్పబడుచున్నప్పుడు మరి యిచ్చట, గొడ్రాలి బిడ్డడువలె ఆ కర్మల ఫలములను త్యజించవలయు ననుట, ఎట్లు చెప్పబడుచున్నది ?

**సమాధానము - నిత్యకర్మలకు గూడ ఫలముండును** అని చెప్పుట భగవంతునికి యిష్టము. అందువలన అట్లు చెప్పుటయందు దోషమేమియు లేదు. ఏలయన ? జీవుడు స్థూలదేహమును త్యజించిన తరువాత గూడ అతడు దేహముతో కూడియున్నప్పుడు చేసియున్న సత్కర్మ దుష్కర్మల మరియు రెంటియొక్క సమిశ్రిత ఫలము సంన్యాసులు కాని వారికి తప్పక లభించునని సంన్యాసులకు లభించదని భగవంతుడు స్వయముగా చెప్పుచున్నాడు. ఆ విధముగా యిచ్చట కేవలము సంన్యాసులకు మాత్రమే కర్మఫలముయొక్క లేమిని చెప్పి, సంన్యాసులు కాని వారికి కర్మఫలము తప్పక లభించునని అది అవశ్యం భావ్యమని చెప్పుచున్నారు.

**18.3. త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః,**
**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే.**

అనగా - అనేక సాంఖ్యాది మతావలంబకులు అయిన పండితులు "దోషమున్న వస్తువు దోషము కలది" అని చెప్పుచున్నారు. ఆ దోషమున్న వస్తువు ఏది ? అన్నచో **బంధమునకు హేతువగుచున్నందున కర్మలన్నియు దోషయుక్తములే.** అందువలన కర్మలు చేయునటువంటి కర్మాధికారులైన మనుష్యుల కొఱకు గూడ ఆ కర్మలు త్యాజ్యములే అనగా త్యజించదగినవే అయి వున్నవి. అట్లు గానిచో ఏ విధముగా రాగ-ద్వేషాది దోషములు త్యజించబడుచున్నవో ఆ విధముగానే సర్వవిధ కర్మలు త్యాజ్యములే అనగా విడువదగినవే అయి వున్నవి.

ఈ ఉపదేశములన్నియు ఒక విధముగా లేవు. అదెట్లన ? ఈ విషయమునందే కొంతమంది విద్వాంసులు యజ్ఞములు, దానములు మరియు తప రూపమైన కర్మలు ఎట్టి స్థితియందును త్యజించదగినవి కావు అని చెప్పుచున్నారు.

ఇట్టి వికల్పములు అనగా విధి నిషేధములు కర్మలు చేయునటువంటి కర్మాధికారులను దృష్టియందుంచుకొని చెప్పబడినవి. అన్ని విధములైన భోగముల నుండి విరక్తిని పొందియున్న జ్ఞాన సంపన్నులైన సంన్యాసులను దృష్టియందుంచుకొని చెప్పబడినవి కావు.

ఇచ్చట అభిప్రాయమేమన ? సాంఖ్యయోగుల నిష్ఠ ఎట్టిదో జ్ఞానయోగమను ప్రకరణమునందు నేను యింతకు పూర్వమే చెప్పి యున్నాను. ఆ విధముగా కర్మాధికారము నుండి తొలగించబడిన సంన్యాసులు అయినవారిని గురించి యిచ్చట చెప్పవలసినదేమియు లేదు.

**పూర్వపక్షము** – కర్మయోగులనిష్ఠ కర్మయోగ ప్రకరణమునందు చెప్పబడినది. అయినప్పటికి ఆ కర్మాధికారులను గురించి యిచ్చట అనగా ఈ గీతా శాస్త్రమందలి ఉపసంహారక ప్రకరణమునందు మరల చెప్పబడుచున్నది. మరి అదే విధముగా సాంఖ్యనిష్ఠులయిన సంన్యాసులను గురించి గూడ విచారణ జరుగవచ్చును గదా ?

**సమాధానము** – అట్లు కాదు. ఏలయన ? సాంఖ్యనిష్ఠులయిన సంన్యాసుల త్యాగము మోహము లేక దుఃఖమును నిమిత్తముగా జేసుకొని చేయబడదు.

భగవంతుడు క్షేత్రాధ్యాయమునందు కోరికలు మరియు రాగద్వేషములు మొదలగువన్నియు శారీరక ధర్మములేయని చెప్పియున్నారు. అందువలన సాంఖ్యనిష్ఠులైన సంన్యాసులు శారీరక బాధల కారణముగా కలుగు దుఃఖములను ఆత్మయందు చూడరు. అందుచేతవారు అనగా సంన్యాసులైన వారు శారీరక క్లేశమువలన కలుగు దుఃఖమునకు భయపడి కర్మలను త్యజించరు.

పైగా వారు అనగా సాంఖ్యనిష్ఠులైన సంన్యాసులు ఆత్మయందు కర్మల యొక్క ఉనికిని గూడ చూడరు. అందువలన వారు మోహము వలన కలుగు కర్మలను పరిత్యజించు అవకాశమే వుండదు.

**కర్మలన్నియు గుణములకు అనగా సత్వ రజ, తమో గుణములకు సంబంధించినవి.** "నేనేమియు చేయుట లేదు" అని తలంచియే వారు కర్మ సంన్యాసము చేయుదురు. అట్లేలయన? "**సర్వకర్మలను మనసు ద్వారా త్యజించి,** మొదలగు వాక్యముల ద్వారా తత్వజ్ఞానులైన సంన్యాసుల స్వభావము అనగా వారిచే చేయబడు కర్మసంన్యాసము చెప్పబడినది.

అందువలన, యితరులైన అనగా సంన్యాసులు కానటువంటి ఆత్మజ్ఞానములేని కర్మాధికారులైన మనుష్యుల ద్వారా చేయబడు కర్మత్యాగము మోహము కారణముగాను లేక శారీరక శ్రమకు భయపడి కర్మత్యాగము చేయుట సంభవించుచున్నది అటువంటి వారే రాజస మరియు తామస భావముతో కూడిన త్యాగులని చెప్పబడినది. అలా చెప్పుటకు కారణమేమనగా? ఆత్మజ్ఞానము లేనటువంటి వారి కర్మఫలత్యాగమును స్తుతించుట కొఱకు ఆ రాజస తామస కర్మత్యాగము నిందించబడినది.

అట్లేలయన ? "సర్వారంభ పరిత్యాగీ" గీత 12-16. ఏనకేన చిత్ 12-19, "అనికేతః" "స్థిరమతి" మొదలగు విశేషణ శబ్దముల ద్వారా పన్నెండవ అధ్యాయమునందు 19వ శ్లో. లయందు గుణాతీతుడైనవాని లక్షణములు చెప్పినప్పుడు గూడ యథార్థమైన సంన్యాసులను వేఱుపరచి చెప్పబడినది. మరియు "జ్ఞానము యొక్క పరానిష్ఠను" గురించి ఈ

ప్రకరణమునందు గూడ ఆ మాటే చెప్పబడును. అందుచేత యిచ్చట ఈ **విచారణయంతయు జ్ఞాన నిష్ఠ కలిగియున్న సంన్యాసులను గురించి కాదు.**

కర్మఫల త్యాగరూపమైన సంన్యాసము మాత్రమే సాత్త్వికత్వ రూపము కలిగియున్న గుణముతో కూడియున్నందున యిచ్చట తామస-రాజస త్యాగము కంటె శుభకరమని గౌణరూపముగా సంన్యాసము చెప్పబడుచున్నది. ఈ **సాత్త్విక గుణయుక్తమైన త్యాగము సర్వకర్మ సంన్యాస రూపమైన ముఖ్య సంన్యాసము కాదు.**

**పూర్వపక్షము** – "నహి దేహభృతా" మొదలగు హేతుయుక్తమైన అనగా సకారణముగా చెప్పబడిన ఈ వాక్యము ద్వారా **స్వరూపము ద్వారా సర్వకర్మల సంన్యాసము సంభవము కాజాలదు. అందుచేత కర్మఫలత్యాగమే ముఖ్య సంన్యాసము.**

**సమాధానము** – అట్లు చెప్పుటు సరికాదు. ఏలయన ? ఈ హేతుబద్ధమైన వాక్యము కర్మఫలత్యాగమును స్తుతించుటకు మాత్రమే చెప్పబడినది. ఇంతకుపూర్వము చెప్పబడినట్లుగా అనేక సాధనములను అనుష్ఠించుటయందు అసమర్థుడు మరియు ఆత్మజ్ఞాన రహితుడు అయినటువంటి అర్జునునకు సాధ్యపడునట్లుగా "త్యాగాచ్ఛాంతిరనంతరమ్" (చూ. 12.1.2) అని చెప్పుట కర్మఫలత్యాగమును స్తుతించుట మాత్రమే. అదే విధముగా **"న హి దేహ భృతా శక్యమ్"** అని చెప్పుట కూడ కర్మ ఫలత్యాగమును స్తుతించుటకు మాత్రమే.

ఏలయన? **"సర్వకర్మలను మనస్సు నుండి త్యజించి ఎట్టి కర్మలు చేయక యుండి మరియు చేయించకయుండి యుండునో"** అను ఈ సిద్ధాంతము యొక్క అపవాదమును ఎవ్వరివల్లను చూపించుట సంభవము కాదు.

అందుచేత ఈ సంన్యాసము మరియు కర్మఫలత్యాగమను వికల్పము కర్మాధికారుల విషయమునకు సంబంధించినది మాత్రమే. **యథార్థమైన ఏ సాంఖ్యయోగమునకు సంబంధించిన జ్ఞానులు కలరో వారికి మాత్రము కేవలము** సర్వకర్మ సంన్యాసరూపమైన **జ్ఞాననిష్ఠయందే అధికారము కలదు. మరెచ్చటను లేదు.** కావున అట్టి జ్ఞానులు వికల్పమునకు పాత్రులు కారు.

ఈ సిద్ధాంతమునే మేము **"వేదావినాశినమ్"** అను శ్లోకముయొక్క వ్యాఖ్యయందును మరియు మూడవ అధ్యాయము యొక్క ఆరంభమునందును సిద్ధింపజేసియున్నాము.
ఇంక ఈ వికల్పభేదములందు –

**18.4. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ,**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః.**

అనగా – అర్జునా ! త్యాగము సంన్యాసమునకు సంబంధించిన వికల్పమునకు సంబంధించిన విషయమునందు నా నిశ్చయమును వినుము.

**త్యాగము మరియు సంన్యాసము ఈ రెండు శబ్దముల యొక్క వాచ్యార్థము ఒక్కటియే.** అందుచేత ముందుగా త్యాగమను ప్రశ్నకే సమాధానము చెప్పుచున్నాను. త్యాగమను శబ్దమునకు

గ్రంథములయందు తామసము మొదలగు గుణముల ననుసరించి మూడు విధములుగ
ములతో చక్కగా నిరూపణ చేయబడినది.

ఈ మూడు భేదములతో కూడిన త్యాగమను శబ్దమునకు మూడు విధములగు
ములు ఆత్మజ్ఞానము లేనటువంటి కర్మాధికారియైన అనగా కర్మలు చేయుచున్నట్టి
షునియందే కుదురును. పరమార్థమును ఎఱింగినట్టి జ్ఞానియందు కుదరదు. ఈ భేదముతో
న అర్థమును గ్రహించుట చాలా కష్టము. అందువలన ఈ విషయమునందు యథార్థ
మును చెప్పుటకు యితరు లెవ్వరును సమర్థులు కారు. అందువలన నీవు ఈశ్వరుడనైయున్న
యొక్క శాస్త్ర సమ్మతమైన యథార్థమగు అభిప్రాయముతో కూడియున్న నిశ్చయార్థమును
ము. ఆ నిశ్చయమేమన -

**5. యజ్ఞదాన తపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్,**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్.**

అనగా - యజ్ఞము, దానము, తపము ఈ మూడు విధములైన కర్మలు త్యజించ
గా విడువతగినవి కావు. అనగా ఈ మూడింటిని త్యజించుట అనగా చేయకుండుట
దిది కాదు. ఈ మూడింటిని ఎల్లప్పుడూ చేస్తూనే వుండవలయును. అట్లేలయన ? యజ్ఞము,
ము మరియు తపము ఈ మూడు బుద్ధిమంతులైనవారికి అనగా కర్మఫలమును
నటువంటి పురుషులకు పవిత్రతను చేకూర్చునవై యున్నవి.

**6. ఏ తాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ,**
**కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్.**

అనగా - మానవుని అంతఃకరణమును శుద్ధిచేయుటకు చెప్పబడిన సాధన
పములైన యజ్ఞ, దాన, తపాది కర్మలు గూడ ఆ కర్మలవలన లభించు ఫలములయందు
క్తిని త్యజించియే చేయవలయును. అనగా ఆ కర్మలు మరియు ఆ కర్మల ఫలములయందు
క్తిని మరియు ఫలాపేక్షను త్యజించియే ఆ యా కర్మలను అనుష్టించవలయును. ఇది నా
(శ్రీకృష్ణునిచేత) నిశ్చయించబడిన ఉత్తమ నిర్ణయము.

ఇంకా ఈ విషయమునందు నా నిశ్చయమును వినుము. ఈ విధముగా ప్రతిజ్ఞచేసి
యు ఆ యా కర్మలను నిర్వర్తించుట యందు పవిత్రతను కల్పించుటకై యీ విధముగా
బడుచున్నది. ఈ కర్మలు అనగా యజ్ఞ దాన తపఃకర్మలు తప్పక చేయవలసియే యుండును.
నాయొక్క నిశ్చితము మరియు ఉత్తమమైన అభిప్రాయము. ఇది నేను యింతకు పూర్వము
న ప్రతిజ్ఞ యొక్క ఉపసంహార నిర్ణయమే. ఇది ఏదో అపూర్వ విషయమునకు సంబంధించిన
న కాదు. అట్లేలయన ? "ఏతాని" శబ్దము యొక్క ఆశయము ప్రకరణమునందలి అత్యంత
పమున ఉన్నటువంటి విషయమునే లక్ష్యముగా వుంచుకొనుట నియమమై యున్నది.

ఆసక్తి కలిగి యున్నటువంటి మరియు ఫలమును కోరునట్టి మనుష్యుల కొఱకు ఈ యజ్ఞ, దాన తపః కర్మలు బంధహేతువులే అయినప్పటికి ముముక్షువులు అనగా మోక్షమును పొందగోరువారు ఫలాసక్తిని త్యజించియే ఆ యా కర్మలను చేయుచుండవలయును. 'అపి' అను శబ్దము యీ భావమును సూచించుటకే వాడబడినది. ఇచ్చట యజ్ఞము, దానము మరియు తపము మొదలగు వాటికంటె వేఱుగ యితర కామ్యకర్మలను దృష్టియందుంచుకొని 'ఏతాని' అను శబ్దముతో పాటు 'అపి' శబ్దము వాడబడలేదు. కొంతమంది యితర వ్యాఖ్యాతలు చెప్పుచున్నట్లుగా నిత్య కర్మలకు ఫలము లేని కారణముగ వాటియందు మాత్రమే ఫలము మరియు ఆసక్తిని వదలి కర్తవ్యమును చెప్పుట కుదరదు. అందుచేత **"ఏతాన్యపి"** పదము యొక్క అభిప్రాయము నిత్యకర్మల కంటె వేఱుగ అనగా అదనముగా కామ్యకర్మలు వుండియున్నవి. అవి గూడ చేయవలయును. అట్టి స్థితియందు యజ్ఞము దానము తపమును గురించి వేఱుగ చెప్పవలసినదేమున్నది ?

ఈ విధమగు అర్థము చెప్పుట సరికాదు. ఏలయన ? **"యజ్ఞోదాన తపశ్చైవ పావ నాని"** మొదలగు వాక్యము ద్వారా **నిత్యకర్మలకు గూడ ఫలముండునని చెప్పినట్లయినది.**

నిత్యకర్మలను గూడ బంధ హేతువులేయని తలంచి వాటిని గూడ త్యజించు కోరిక గల ముముక్షువుల ప్రవృత్తి కామ్యకర్మలయందు ఎట్లుండును ?

ఇంతేకాకుండా **"సకామ కర్మలు అత్యంత నికృష్టములైనవి"** అని చెప్పుటయందు కామ్యకర్మలు నిందించబడినందున మరియు 'యథార్థ కర్మలకంటె యితర అదనపు కర్మలు బంధ హేతువులే" అను వాక్యము ద్వారా కామ్యకర్మలు గూడ బంధహేతువులుగా చెప్పబడినందున మరియు "వేదములు త్రిగుణాత్మకమైన ప్రపంచమును విషయముగా చేయునవై యున్నవి" మరియు మూడు వేదములను ఎఱింగినవారు అనగా చక్కగా అధ్యయనము చేసినవారు సోమరసమును త్రాగినవారై పుణ్యఫలములు క్షీణించినప్పుడు తిరిగి మృత్యులోకమునకు వత్తురు' అని చెప్పబడినందున మరియు దానితోపాటుగా కామ్యకర్మలకు సంబంధించిన విషయము చాలా దూరముగా అనగా వ్యవధానము కలిగియున్నందున గూడ "ఏతాన్యపి" అను శబ్దము కామ్యకర్మలకు సంబంధించినది కాదని స్పష్టమగుచున్నది.

అందువలన ఆత్మజ్ఞానము లేనటువంటియు మరియు కర్మాధికారము కలిగియున్న ముముక్షువుల కొఱకు –

**18.7. నియతస్య తు సంన్యాసః కర్మణో నోపపద్యతే,**
**మోహాత్తస్య పరిత్యాగస్తామసః పరికీర్తితః.**

అనగా – విహిత కర్మలు అనగా నిత్యకర్మలను పరిత్యజించుట కుదరదు. ఏలయన? **అజ్ఞానికి నిత్యకర్మలు శుద్ధిహేతువులని చెప్పబడినవి.** అందువలన మోహము కారణముగ అజ్ఞానముతో కూడి అనిత్యకర్మలను త్యజించుట తామస లక్షణమని చెప్పబడినది.

నియత కర్మలనగా కర్తవ్య కర్మలు అనగా తప్పకచేయవలసిన కర్మలు. అందుచేత
ఏ కర్మలను త్యజించుట శాస్త్రవిరుద్ధముగా వ్యవహరించుట యనబడును. అందువలన
ాము నిమిత్తముగా చేయబడు కర్మత్యాగము తామస త్యాగముగా చెప్పబడినది. మోహమనగా
స్సు అనగా చీకటి అనగా అజ్ఞానము. ఇది ప్రసిద్ధిగా వున్న విషయమే.

మరియు –

**8. దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్,**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్.**

అనగా – సమస్తమైన కర్మలు దుఃఖహేతువులే అనగా దుఃఖమును కలిగించునవే
తలంచి శరీరమునకు కర్మలు చేయుటవలన బాధ కలుగునను భయముతో కర్మలను
ంచువారుందురు. అటువంటి రాజసగుణ వృత్తి కారణముగ కర్మలను త్యజించువారు
ఫలము అనగా జ్ఞాన ప్రేరితములై చేయబడు సర్వకర్మ సంన్యాస ఫలరూపమైన మోక్షమును
దజాలరు.

అయితే మరి సాత్విక త్యాగమెట్టిది ? అన్నచో -

**.9. కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతే ఽర్జున,**
**సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్వికో మతః.**

అనగా – ఓ అర్జునా ! "ఈ కర్మలు చేయుట నా కర్తవ్యము" అని నిర్ణయించుకొని
త్యకర్మలు ఆసక్తి మరియు ఫలాసక్తిని త్యజించి చేయబడునో అవి సాత్విక కర్మలనబడును.
కర్మలకు ఫలము కలుగునని యింతకు పూర్వము భగవంతుడు చెప్పినట్లుగా ప్రమాణము
ద చూపబడినది. నిత్యకర్మలకు ఫలమున్నట్లుగా ఎచ్చటనూ చెప్పియుండలేదు. అయిననూ
్ఞానియైన పురుషుడు నిత్యకర్మలు చేసినందువలన అంతఃకరణశుద్ధి కలుగుననియూ లేక
ృత్తి భావరూప ఫలము లభించుననియు తలంచుచుండును. అందుచేత "ఫలంత్యక్త్వా"
శబ్దము ద్వారా అలా తలంచుటను గూడ నిషేధించడమైనది. కావున "సంగం త్యక్త్వా
ంచ" (చూ. గీ. 2.48) అని చెప్పుట సబబుగా వున్నది.

నిత్యకర్మలయందు ఆసక్తి మరియు ఆ కర్మలవలన కలుగు ఫలమును త్యజించుట
్వకగుణముతో చేయబడునటువంటి త్యాగమని చెప్పబడినది.

**పూర్వపక్షము** - ఈ సందర్భమున మూడు విధములైన కర్మపరిత్యాగ
న్యాసముండునని చెప్పియున్నారు. వాటిలో రాజసగుణ ప్రధానమైన త్యాగము మరియు
ుసగుణ ప్రధానమైన త్యాగము రెండూ త్యజించవలసినవిగా చెప్పియున్నారు. కాని మూడవది
ున సాత్విక గుణ ప్రధానమైన త్యాగమును గురించి చెప్పునప్పుడు కర్మలను
జించవలయునని చెప్పక కర్మఫలమునందుండు ఆసక్తిని మాత్రమే త్యజించవలయునని

చెప్పియున్నారు. ఇది సమంజసముగా లేదు. ఇది ఎట్లున్నదన ? ముగ్గురు బ్రాహ్మణులు వచ్చియున్నారు. అందులో యిరువురు వేదములయందలి ఆరు భాగములను చక్కగా తెలిసినవారు. మరి మూడవవాడు క్షత్రియుడు. అన్నట్లుగా మీరు చెప్పు సంన్యాసము అనగా త్యాగము కూడ అట్లే యున్నది. ఇది ప్రకరణ విరుద్ధముగా యున్నది.

**సమాధానము** – అట్లు చెప్పుటయందు దోషమేమియు లేదు. ఏలయన ? త్యాగము అన్నింటియందును సమానముగా యున్నందున కర్మఫల త్యాగమును స్తుతించుటకై అట్లు చెప్పబడినది. **కర్మసంన్యాసమునందును మరియు ఫలాసక్తి యొక్క త్యాగమునందును త్యాగము అనునది సమానముగా యున్నది.** వాటియందు స్వరూపముననుసరించి కర్మత్యాగమును రాజస మరియు తామసత్యాగమని చెప్పి, అట్టి త్యాగమును నిందించి **"సత్యాగః సాత్వికోమతః"** అను వాక్యము ద్వారా కర్మఫలము మరియు ఆసక్తియొక్క త్యాగమును, సాత్విక త్యాగమని చెప్పి దానిని స్తుతించుట జరిగినది.

అధికారియైనవాడు ఆసక్తిని మరియు ఫలమునందలి ఆసక్తిని వదలి నిత్యకర్మలు చేయుచున్నచో ఆతనియొక్క ఫలాసక్తి మొదలగు దోషములతో దూషితము కానటువంటి అంతఃకరణము నిత్యకర్మలను అనుష్ఠించుట ద్వారా సంస్కరించబడి విశుద్ధమగుచున్నది.

ఆ విధముగా విశుద్ధమైనటువంటి మరియు ఆనందముతో కూడియున్న అంతఃకరణమే ఆధ్యాత్మిక విషయములను గురించి విచారించు సామర్థ్యము కలిగియుండును. అందుచేత ఈ విధముగా నిత్యకర్మానుష్ఠానము వలన శుద్ధమైనటువంటి అంతఃకరణము గలవాడు మరియు ఆత్మజ్ఞానమును పొందగోరువాడు అయిన మనుష్యుని యొక్క స్థితి ఎట్లు క్రమక్రమముగా శుద్ధమగుచూ వృద్ధిని పొందునో యిప్పుడు చెప్పెదను –

**18.10. న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే,**
**త్యాగీ సత్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః.**

అనగా – అకుశల్ అనగా కామ్యకర్మలను ద్వేషించనివాడు అనగా **కామ్యకర్మలు పునర్జన్మమును కలిగించునవి అయినందున ప్రపంచమునకు కారణమగుచున్నవి.** కావున అటువంటి కర్మలతో నాకేమి ప్రయోజనము అని తలంచి వాటిని ద్వేషించనివాడు. కుశల్ – అనగా శుభకర్మలైనను నిత్యకర్మలయందు ఎటువంటి ఆసక్తిని చూపనివాడు.

అనగా అంతఃకరణము యొక్క శుద్ధి, జ్ఞానోత్పత్తి మరియు జ్ఞాన స్థితియందే వుండుటకు హేతువుగా వున్నందున నిత్యకర్మలు మోక్షసాధనములు అని తలంచి వాటియందు ఎటువంటి ఆసక్తి కలిగియుండడు. అనగా వాటివలన గూడ తనకు కలుగు ప్రయోజనమేమియు లేదని తలంచి వాటియందు గూడ ఎటువంటి ఆసక్తి కలిగియుండడు.

ఆతడెవరు ? త్యాగభావము స్థిరముగా కలిగియున్నవాడు అనగా యింతకు పూర్వము చెప్పబడిన ఆసక్తి మరియు కర్మలవలన కలుగు ఫలములయందు గూడ ఎటువంటి కోరిక

ేనివాడు. అటువంటి త్యాగబుద్ధి గల ధీరుడు. అనగా కర్మలయందు ఆసక్తిని త్యజించినవాడై మరియు ఆ కర్మలవలన కలుగు ఫలములయందు గూడ ఆసక్తిని త్యజించి నిత్యకర్మలను అనుష్టించువాడు. ఆ విధమగు త్యాగబుద్ధి గలవాడు.

అటువంటి పురుషుడు ఎటువంటి అవస్థ అనగా స్థితియందు కామ్యకర్మలను ద్వేషించడు మరియు నిత్యకర్మల యందు ఆసక్తుడు కాడు ? అన్నచో -

ఎప్పుడు ఆతడు సాత్త్విక భావమునందు లీనమై యుండునో అనగా ఆత్మ మరియు అనాత్మ భావ విషయికమైన వివేక జ్ఞానమునకు కారణ స్వరూపమైన సత్వగుణ ప్రభావముతో నిండియుండునో అనగా సత్వగుణ సంపన్నుడై యుండునో అప్పుడు.

అందుచేత అతడు మేధావి అనగా తెలివిగలవాడు. అనగా **ఆత్మజ్ఞానమే రూపముగా కలిగిన బుద్ధిగలవాడు.** మేధావి అయినందుననే అవిద్యాజనితమైన సంశయహీనుడై యుండును. అనగా ఆత్మస్వరూపముతో సర్వకాల సర్వావస్థలయందును ఏకరూపుడై వుండుటయే పరమ కల్యాణమునకు సాధనమై యున్నది. దీనికి మించిన వేఱుస్థితి మరియొకటి లేదు. ఇటువంటి నిశ్చయ మనస్కుడై యున్నందున ఆతడు సంశయ రహితుడై యుండును.

అధికారియైన పురుషుడు యింతకు పూర్వము చెప్పిన ప్రకారముగా కర్మయోగాను ష్ఠానము ద్వారా క్రమముగా విశుద్ధమైన అనగా లోకవాసనలు లేనటువంటి అంతఃకరణము గలవాడై, జన్మాది వికారములు లేనివాడై మరియు క్రియారహితమైన ఆత్మను చక్కగా తనయొక్క స్వరూపమే యని తెలుసుకొనినవాడగునో అప్పుడు ఆతడు **"సమస్తమైన కర్మలను మనసా త్యజించి,** ఎటువంటి కర్మలు తాను చేయక, యితరులచేత చేయించక వుండువాడు అనగా ఆ విధముగా **ఆత్మజ్ఞానియైనవాడు నైష్కర్మ్యముతో కూడియున్న జ్ఞాననిష్ఠను అనుభవించుచుండును.**

ఈ విధముగా ఈ శ్లోకము ద్వారా యింతకు పూర్వము చెప్పబడిన కర్మయోగము యొక్క ఫలము చెప్పినట్లయినది. కర్మాధికారియైన పురుషుడు మరియు దేహమునందే ఆత్మాభిమానము అనగా దేహమే తాననుభావము కలిగియున్న కారణముగ ఆ దేహధారియైన జీవుడు. అజ్ఞాని అనబడుచున్నాడు. ఆత్మసంబంధమైన కర్తృత్వ జ్ఞానము నశించినందున "నేనే కర్మలు చేయుచున్నాను" అను నిశ్చిత బుద్ధిగలవాడై యుండును. అటువంటి మనుష్యుని ద్వారా అశేషమైన కర్మత్యాగము అసంభవము అయినందున అటువంటివానికి కర్మఫల త్యాగముతో కూడియున్న విహిత కర్మలు అనుష్టించుట యందే అధికారము కలదు. అంతేగాని కర్మలు త్యజించు అధికారము లేదు. అట్టి అభిప్రాయమును తెలుపుట కొఱకు యీ క్రింది శ్లోకము చెప్పబడుచున్నది.

## 18.11. న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్య శేషతః, యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే.

అనగా - దేహమును ధరించియున్నవాడు దేహధారి యనబడును. ఈ ఉత్పత్త్యర్థము అనుసరించి దేహమునందే ఆత్మాభిమానము గలవాడు అనగా దేహముకంటె వేఱుగ జన్మ-

మరణములు లేనటువంటి తత్వము దేహమునందు వ్యాపించియున్నదను జ్ఞానము లేనివాడు ఆత్మవిషయికమైన కర్తృత్వ జ్ఞానము నశించని కారణముగ దేహభృత్ అనబడుచున్నాడు. ఆత్మజ్ఞానము కలవాడు అలా తలంచడు. అట్లేలయన ? **"వేదావినాశినమ్"** (గీ. 2.20) మొదలగు శ్లోకముల ద్వారా అటువంటి వివేకము గల పురుషుడు కర్తృత్వాధికారము లేనివానిగ వేరు చేయబడియున్నాడు. అందువలన మనము తెలుసుకొనవలసిన విషయమేమన ? ఏ కారణము చేత దేహధారియైన అజ్ఞాని ద్వారా సమస్త కర్మలను సంపూర్ణముగా త్యాగము చేయుట సంభవము కాదు గావున తత్వజ్ఞాన రహితుడైన కర్మాధికారి నిత్యకర్మలను అనుష్ఠించుచూ వాటి ఫలములను త్యజించినచో అనగా కర్మఫల వాసనలు లేనివాడైనచో ఆతడు కర్మలు చేయువాడై యున్నప్పటికి కేవలము స్తుతికొఱకు 'త్యాగి' అనబడును.

ఈ విధముగా మనకు సిద్ధించినదేమనగా **దేహాభిమానము లేనటువంటి పరమార్థ తత్వమును ఎఱింగిన జ్ఞాని ద్వారానే నిశ్శేషముగా కర్మసంన్యాసము చేయ సాధ్యపడును.**

సర్వవిధ కర్మలను త్యజించినందువలన ఎటువంటి ఫలము కలుగునో అది యీ క్రింది శ్లోకము ద్వారా చెప్పబడుచున్నది.

**18.12. అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్,**
**భవత్య త్యాగినాం ప్రేత్య న తు సంన్యాసినాం క్వచిత్.**

అనగా – **అనిష్టమనగా** నరకము మరియు పశుపక్ష్యాది యోనులయందు దేహమును ధరించుట **ఇష్టము** అనగా దేవయోనుల యందు దేహధారణ చేయుట, మరియు మిశ్రమము అనగా **ఇష్టానిష్ట మిశ్రితము** అనగా యిష్టమైనది మరియు అనిష్టమైనది రెండు కలిసియున్నటు వంటి మనుష్య యోనియందు దేహమును ధరించుట. ఈ విధముగా ఈ పుణ్య–పాప రూపమైన కర్మల యొక్క ఫలములు మూడు విధములుగా వుండును.

ఏ పదార్థము బాహ్యముగా వున్నటువంటి కర్త, కర్మ, క్రియ మొదలగు అనేక సాధనముల ద్వారా రూపమును దాల్చినదో మరియు గారడీవాని మాయవలె అవిద్య కారణముగా కలిగినదో, అత్యంత మోహభావమును కలిగించునదై యున్నదో మరియు జీవాత్మను ఆశ్రయించుకొని వున్నట్లుగా తోచుచుండునో మరియు సారరహితము అనగా నిత్యము సత్యము అయినది కానందున రూపమును ధరించిన మరుక్షణమునందే లయము అనగా తనకు కారణరూపమైన మూల పదార్థముగా మారిపోవునో **అట్టి పదార్థమునే ఫలమని చెప్పుదురు.** ఇదియే 'ఫల' శబ్దమునకు తాత్పర్యము.

అటువంటి ఈ మూడు విధములుగా వుండు ఫలము, త్యాగము చేయలేనివారికి అనగా పరమార్థ సంన్యాసము చేయలేనటువంటి కర్మనిష్ఠులైన అజ్ఞానులకు మాత్రమే దేహత్యాగానంతరము లభించును. కేవలము జ్ఞాననిష్ఠయందే నిలిచియున్న పరమహంస, పరివ్రాజకులైన నిజమైన సంన్యాసులకు ఎన్నడునూ లభించదు.

అట్లేలయన ? ఆ కేవల సమ్యక్‌జ్ఞాన నిష్ఠులైన పురుషులు సంసారమునకు **బీజరూపమైన అవిద్య** మొదలగు దోషములను త్యజించినవారై యుందురు.

అందువలన, క్రియ, కారకము మరియు ఫలము మొదలగునవి ఆత్మయందు అవిద్య కారణముగ ఆరోపించబడియున్నందున పరమార్థమును దర్శించినట్టి ఆత్మజ్ఞానులు మాత్రమే సర్వవిధ కర్మలయొక్క నిశ్శేష త్యాగము చేయగలిగినవారై యుందురు. కర్మలు చేయువారు అధిష్ఠానము అనగా శరీరము, కర్త, క్రియ మొదలగు కారకములను ఆత్మభావముతో చూచునట్టి అజ్ఞాని సర్వవిధ కర్మలను నిశ్శేషముగా త్యజించజాలడు. ఈ విషయము రాబోవు శ్లోకము ద్వారా చెప్పబడుచున్నది.

**18.13. పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే,**
**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్.**

అనగా – ఓ అర్జునా ! ఇప్పుడు నాచే చెప్పబోవుచున్న అయిదు కారణములను అనగా కర్మలు చేయు సాధనములను సావధానచిత్తుడవై వినుము –

ఈ చేయబోవుచున్న ఉపదేశమునందు అర్జునుని చిత్తమును లగ్నము చేయుటకుగాను మరియు అధిష్ఠానాదుల జ్ఞానమును పొందుటయందు గల కష్టమును ముందుగా తెలియజేయుటకై ఆ అయిదు కారణములను తెలియదగినవిగా చెప్పి వాటిని స్తుతించుచున్నారు.

ఏ శాస్త్రమునందు **తెలియదగియున్న** పదార్థముల సంఖ్య చెప్పబడియుండునో దానిని **సాంఖ్యశాస్త్రము అనగా వేదాంతము అని చెప్పబడును.** కృతాంతము అనునది గూడ దానియొక్క విశేషణమే. 'కృత' అనగా కర్మ అనగా చేయబడిన, ఇచ్చట దానియొక్క అనగా కర్మలయొక్క అంతము అనగా ఎచ్చట **కర్మలు** సమాప్తమును పొందునో అది కృతాంతమనబడును. అనగా కర్మలయొక్క అంతము. **"యావానర్థ ఉదపానే" "సర్వకర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే"** మొదలగు వాక్యములు గూడ **ఆత్మజ్ఞానము కలిగిన పిమ్మట సమస్త కర్మల నివృత్తిని చూపుచున్నారు.**

అందువలన ఆ యాత్మజ్ఞానమును కలిగించునటువంటి కృతాంతము – సాంఖ్యమునందు అనగా వేదాంతశాస్త్రమునందు సమస్తమైన కర్మలయొక్క సిద్ధికొఱకు చెప్పబడిన అయిదు కారణములను నీవు నాచే వినుము –

ఆ అయిదు కారణములు ఏవి ? అన్నచో చెప్పుచున్నారు –

**18.14. అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్,**
**వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్,**

అనగా – అధిష్ఠానము అనగా రాగద్వేషములు, సుఖదుఃఖములు మరియు జ్ఞానము మొదలగువాటిని ప్రకటించుటకు ఆశ్రయము అనగా ఆధారవస్తువు దేహము. కర్త అనగా

ఉపాధి స్వరూపమైన భోక్త అనగా జీవుడు మరియు అనేక విధములైన కారణములు అనగా శబ్దాది మొదలగునవి. విషయములను గ్రహించునటువంటి చెవ్వులు మొదలగు వేఱువేఱుగా వున్న పన్నెండు కారణములు, నానావిధములైన చేష్టలు అనగా క్రియలు. శ్వాసప్రశ్వాస మొదలగు వేఱు వేఱు వాయుసంబంధములైన క్రియలు మరియు పై నాలుగింటితోపాటు అయిదవది అయిదు సంఖ్యను పూర్ణమొనర్చునట్టి కారణము దైవము. అనగా కన్నులు మొదలగు యింద్రియములను ప్రసాదించు సూర్యుడు మొదలగు దైవములు.

**18.15. శరీరవాంగ్మనోభిర్యత్కర్మ ప్రారభతే నరః,**
**న్యాయ్యం వా విపరీతం వా పంచై తేతస్య హేతవః.**

అనగా – మనస్సు, వాక్కు మరియు దేహము అనగా యీ మూటిద్వారా మనుష్యుడు చేయునట్టి న్యాయయుక్తము, ధర్మయుక్తము, శాస్త్రీయము లేక ధర్మవిరుద్ధము మరియు అశాస్త్రీయమైన కర్మలు చేయునో వాటన్నింటికి పైన చెప్పబడిన అయిదు కారణములు. దేహాదులు కలిగియున్న జీవుడు దేహమునందు యింద్రియరూపమున కలిగియున్న కన్నులు మొదలగువాటిని మూయుట, తెరచుట మొదలగు చేష్టలు అనగా అప్రయత్నముగా జరుగుచుండు క్రియలు చేయుచుండును. అటువంటి క్రియలు గూడ యింతకు పూర్వము ధరించియున్న దేహాదుల ద్వారా తెలిసియో తెలియకయో చేసియున్న పుణ్యపాపకర్మల ఫలములే అయి వుండును. అందుచేత న్యాయము అందులకు విరుద్ధముగా నుండు లేక జరుగు అన్యాయము మొదలగు సమస్తమైన చేష్టలు లేక కర్మలు గూడ గణించబడును.

**పూర్వపక్షము** – అధిష్ఠానాదులే సమస్తమైన కర్మలకు కారణములు గదా ? అటువంటి స్థితిలో మనస్సు, వాక్కు మరియు దేహము ద్వారా కర్మలు చేయును అని చెప్పుట ఎట్లు కుదురును ?

**సమాధానము** – అట్లు చెప్పుట దోషము కాదు. **విహిత కర్మలు మరియు నిషిద్ధకర్మలు మొదలగు అన్ని కర్మలు దేహము, వాక్కు మరియు మనస్సు యీ మూడింటిద్వారానే జరుగుచుండును.** (మనసా, వాచా, దేహినా) మరియు చూచుట వినుట మొదలగు జీవితము కారణముగా జరుగు చేష్టలు గూడ పై కర్మలతో సమానముగానే జరుగుచుండును. అందుచేతనే సమస్తమైన కర్మలను మూడు భాగములుగా విభజించి దేహముద్వారా జరుగు కర్మలన్నియు ఎట్లు జరుగుచున్నవో అట్లే ఫలభోగ సమయమునందు గూడ శరీరాది ప్రధాన కారణముల ద్వారానే భోగకార్యములు జరుగుచుండును. అందువలన పైన చెప్పబడిన అధిష్ఠానము మొదలగు అయిదు కారణములను హేతువుగా చెప్పుట తప్పుకాదు. ఇట్లు చెప్పుటయందు పరస్పర విరోధము గూడ ఏమియు లేదు.

**18.16. తత్రైవం సతి కర్తారమాత్మానం కేవలం తు యః,**
**పశ్యత్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతిః.**

అనగా – తత్ర శబ్దము ప్రకాశముతో సంబంధమును కలుపుతుంది. ఇంతకు పూర్వము చెప్పినట్లుగా ఆ అయిదు కరణముల ద్వారానే సమస్తమైన కర్మలు జరుగుచుండును. అందువలన జ్ఞానహీనుడైన పురుషుడు వేదాంత గ్రంథములు అధ్యయనము మరియు సద్గురువుల సద్బోధ ద్వారా మరియు తర్కము ద్వారా సంస్కరించబడిన బుద్ధికలుగుచున్నందున ఆ అధిష్ఠానాది అయిదు కరణములతో పాటు అవిద్య కూడ కలిగియుండుట చేత వాటితో ఆత్మగూడ కలిసియే యున్నదని భ్రాంతినిజెంది ఆ పంచకరణముల ద్వారా జరుగుచున్న కర్మలకు ఆత్మస్వరూపుడై యున్న తననే కర్తగా భావించి "నేనే కర్తను" లేక "నేనే సర్వవిధ కర్మలు చేయుచున్నాను" అని కేవలము కర్మరహితమై యున్న శుద్ధ ఆత్మను కర్మలకు కర్తగా భావించుచుండును.

అట్లు తలంచువాడే నిజమైన అజ్ఞాని.

మరియు ఆత్మను దేహము కంటె వేఱుగా వున్నట్లు తలంచువాడు గూడ శరీరము కంటె వేఱుగ కేవలము ఆత్మనే సర్వవిధ కర్మలకు కర్తగా తలంచుచుండును. అట్టివారు గూడ అల్పబుద్ధి అనగా విద్యద్వారా అనగా జ్ఞానము ద్వారా సంస్కరింపబడిన బుద్ధిగలవాడు కాదు. అందువలన సంస్కరించబడిన బుద్ధిలేని వాడగుట వలన అతడు గూడ ఆత్మతత్త్వమును గాని కర్మతత్త్వమును గాని చక్కగా తెలియని వాడే, ఇది నినిశ్చిత అభిప్రాయము.

అందువలన అట్టివాడు దుర్బుద్ధిగలవాడనబడును. కుత్సితబుద్ధిగలవాడు. విపరీతబుద్ధి గలవాడు, దుష్టుడు మరియు తిరిగి తిరిగి జన్మ, మరణములను కలిగించుట కారణ రూపుడై యుండునో అటువంటివానిని దుర్బుద్ధిగలవాడందురు. అటువంటి మానవుడు చూస్తూ వుండి గూడ వాస్తవముగా చూడని వాడేయగును. తిమిరరోగగ్రస్తుడు ఏ విధముగా నిజముగావున్న ఒక్క చంద్రునే అనేకమైన చంద్రులు వున్నట్లుగా చూచునో లేక బాలుడు అనగా నిజమైన వికసించిన బుద్ధిలేనివాడు పరుగెత్తుచున్న మేఘములను జూచి చంద్రుడే పరుగెత్తుచున్నాడని తలంచునో లేక రైలుబండి యందు కూర్చునియున్న మనుష్యుడు ప్రక్కన వున్న చెట్లు భూములను పరుగెత్తుచున్నట్లుగా తలంచునో అట్లే అజ్ఞానియైన మనుష్యుడు గూడ దేహాదికరణ సముదాయము కర్మలు చేయుచుండగా నిర్వకారమైన ఆత్మయే కర్మలు చేయుచున్నదని తలంచుచుండును.

అటువంటప్పుడు వాస్తవముగా చూచు సుబుద్ధిఎవడు ? అన్నచో – చెప్పుచున్నారు–

**18.17. యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే,**
**హత్వాఽపి స ఇమాన్‌లోకాన్న హంతి న నిబధ్యతే.**

అనగా–శాస్త్రము మరియు సద్గురూపదేశముచే మరియు న్యాయముచే చక్కగా సంస్కరించబడిన అంతఃకరణముగలవాడు అయినటువంటి పురుషుని యొక్క అంతఃకరణమునందు "నేను కర్తను" అను భావము లేక ప్రతీతి కలుగదు. అవిద్య వలన ఆత్మయందు అధ్యవసింపబడిన

అనగా ఆరోపించబడిన ఈ అధిష్ఠానము మొదలగు అయిదు కరణములే సమస్తమైన కర్మలకు కర్తలైయున్నవి. నేను అనగా ఆత్మ మాత్రము కర్త కాదు. నేను కేవలము ఆపంచకరణములచే చేయబడుచున్న సర్వవ్యాపారములు అనగా కర్మలకు సాక్షి మాత్రముగా వుండి ప్రాణరహితుడనై అమనస్కుడనై, శుద్ధమై, శ్రేష్ఠమై, అక్షరముకంటె గూడ పరమై కేవలుడను అనగా అద్వితీయుడను అనగా నా కంటె యితరమైనదేదియు లేనివాడనై మరియు క్రియారహితుడనై యున్న ఆత్మస్వరూపుడను అని తలంచుచుండునో ఆతడు సుబుద్ధిగలవాడన బడును.

మరియు ఎవని బుద్ధి అనగా ఆత్మకు వుపాధి రూపముగా వుండియున్న అంతఃకరణము ఆ పంచకరణములతో తాదాత్మ్యమును పొందదో, వాటి సుఖ దుఃఖములతో సంబంధము లేకయుండునో అనగా "నేను ఫలానా కర్మచేసి యున్నాను, అందువలన నాకు నరకవాసము కలుగును. అని ఎవని బుద్ధి తలంచదో ఆతడు "సుబుద్ధి" అనబడును. ఆతడే నిజముగా చూచువాడనబడును.

అట్టి జ్ఞానము గల పురుషుడు ఈ సమస్త లోకములను అనగా ఈ లోకములయందున్న ప్రాణులన్నింటిని చంపినను నిజముగా చంపని వాడేయగును. అనగా ఆతడు ఏ ప్రాణిని చంపడుగావున చంపనివాడే యగును. అంతేగాక ఆ విధముగా చంపినందువలన కలుగు ఫలరూపమైన పాపమును గూడ పొందడు. అందుచే ఆ పాపఫల రూపమైన జన్మమరణాది, సుఖదుఃఖాది బంధములచే గూడ ఆతడు బంధించబడడు.

**పూర్వపక్షము** – ఇది యంతయు కేవలము జ్ఞానమును స్తుతించుటయే అయినను "చంపి గూడ చంపనివాడేయగును" అని చెప్పుట పూర్తిగా న్యాయవిరుద్ధముగా తోచుచున్నది.

**సమాధానము** – అట్లు చెప్పుటయందు దోషమేమియు లేదు. ఏలయన ? లౌకికము మరియు పారమార్థికము అగు ఈ రెండు దృష్టులతో తారతమ్యమెరింగి చూచినచో అలా చెప్పుట అనగా దోషమేమియు లేదని చెప్పుట కుదురును.

శరీరాదులయందు ఆత్మబుద్ధి కలిగియుండి "నేను చంపువాడను" అని తలంచు లౌకిక బుద్ధి కలిగియున్న మనుష్యుల దృష్టి ననుసరించి చూచినచో "చంపిగూడ" అని చెప్పబడినది. మరియు యింతకు పూర్వము చెప్పబడిన పారమార్థిక దృష్టితో చూచిన ఎడల "చంపుట లేదు మరియు ఆ కర్మఫలములచేత బంధింపబడుట లేదు" అని చెప్పబడినది. ఈ విధముగా విచారించి చూచిన పై రెండు విధములగు మాటలు చెప్పుట కుదురును.

**పూర్వపక్షము** – **"కర్తారమాత్మానం కేవలం తు"** చూ. గీత. 18.16 అను కథనము నందు 'కేవలము' అను శబ్దమును వాడినందువలన **ఆత్మ ఒంటరిగా అనగా తనంతటతానుగా ఎటువంటి కర్మ చేయజాలదు.** కాని **అధిష్ఠానము అనగా దేహాదులతో కూడి అనగా దేహాది అవయములను సాధనములుగా చేసుకొని నిస్సందేహముగా కర్మలు చేయును.**

**సమాధానము** – ఇదేమి దోషము కాదు. ఏలయన ? అవిక్రియ స్వభావము కలది యగుటచే ఆత్మ అధిష్ఠానాదులతో కూడియుండుట సాధ్యపడదు.

ఆత్మ యొక్క అవిక్రియత్వము చెప్పి "వేదా వినాశినమ్" గీత 2.21 అను శ్లోకము ద్వారా చేయబడిన వుపదేశము మొదలగు వాటియందు **విద్వాంసునకు సంక్షిప్తముగా కర్మాధికారములేదని చెప్పి,** ప్రసంగానుకూలముగా అచ్చటచ్చట విస్తారముగా చెప్పబడినది. అటువంటి కర్మాధికార నివృత్తిని గురించి యిప్పుడు శాస్త్రార్థమును ముగించుటకు గాను **"విద్వాంసుడు ఎవరిని చంపడు, మరియు దేని చేతను బంధించబడడు."** అను వచనము ద్వారా ముగించుచున్నారు.

అందువలన, యిప్పుడు సిద్ధించునదేమన ? **విద్వాంసుని యందు దేహమును ధరించితినను అభిమానము లేనందున ఆతని ద్వారా చేయబడిన అవిద్యాజనితమైన సమస్త కర్మలు సంన్యసించబడును.** అందువలన **నిజమైన సంన్యాసులకు అనిష్టము మొదలగు త్రివిధములైన కర్మఫలములు కలుగనేరవు.** దానితోపాటుగా యితరులైన కర్మాధికారులు యిందులకు విరుద్ధముగా వుందురు. అనగా వారికి కర్మఫలములు తప్పక కలుగును. ఈ కారణముగ వీరికి త్రివిధములైన కర్మఫలములు తప్పక కలుగును. ఈ విధముగా ఈ గీతాశాస్త్రము యొక్క అర్థము ముగించబడినది.

ఈ విధముగా సమస్తవేదముల యొక్క తాత్పర్యమునకు సంబంధించిన సారము నిపుణులైన పండితుల ద్వారా సరియగు విచారణ ద్వారా గ్రహించయోగ్యమైనది. ఈ దృష్టి లేక అభిప్రాయముతోనే మేము అచ్చటచ్చట ప్రకరణములను విడదీసి లేక విభజించి శాస్త్ర, న్యాయానుసారముగ ఈ తత్వమును విశదీకరించి యున్నాము.

ఈ విధముగా శాస్త్రము యొక్క ఆశయమును అనగా లక్ష్యమును అనగా అభిప్రాయమును సమీక్షించి అనగా చెప్పి యిప్పుడు కర్మలకు కారణమైన దానిని గురించి చెప్పుచున్నాము.

**18.18. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా,**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మ సంగ్రహః.**

అనగా - జ్ఞానము అనగా దేని ద్వారా మరొక పదార్థము తెలియబడునో, అది ఇచ్చట జ్ఞాన శబ్దము ద్వారా సామాన్యభావముతో అన్నివిధములగు విషయములు తెలుపునదను అర్థముగా ప్రయోగించబడినది. అదే విధముగా 'జ్ఞేయము' అనగా తెలియబడు పదార్థము. ఈ శబ్దము గూడ సామాన్య భావముతో తెలియబడు అన్ని పదార్థములు చెప్పబడినవి. మరియు **'పరిజ్ఞాత' అనగా వుపాధితో కూడియున్న అవిద్యాకల్పితమైన భోక్త,** ఇదియే సామాన్యభావముతో సమస్తమైన కర్మలకు కారణరూపమైన మూడు విధములగు "కర్మచోదన" అనగా కర్మలు చేయబడుటకు కారణరూపమైన వస్తువుగా చెప్పబడినది.

అట్లేలయన ? పైన చెప్పబడిన జ్ఞానము మొదలగు మూడు కలిసియున్నప్పుడే త్యాగము మరియు గ్రహించుట మొదలగునవి వారి వారి ప్రయోజనమునకనుగుణముగా యిటువంటి సమస్త కర్మలు ఆరంభమగుచున్నవి.

ఇప్పుడు అధిష్ఠానము మొదలగు అయిదు హేతువులు ద్వారా వుత్పన్నమగునటువంటి మరియు మనస్సు, వాక్కు మరియు శరీర రూపమైన ఆశ్రయ భేదము వలన ఏది మూడు భాగములుగా విభజింపబడినవో అటువంటి సర్వవిధ కర్మలు, కరణములు, మొదలగు మూడు కారకములందు చేర్చి - సంగ్రహించబడినవి. అది యిప్పుడు చెప్పబడుచున్నది.

కరణము - దేనిద్వారా కర్మచేయబడునో అది కరణమనబడును. అనగా శ్రోత్రము మొదలగు పది బాహ్యేంద్రియములు, మరియు బుద్ధి మొదలగు నాలుగు అంతఃకరణములు.

కర్మ - అనగా ఏది కర్తకు మిక్కిలి యిష్టమైనదో మరియు క్రియ ద్వారా పొందబడునో.

కర్త - శ్రోత్రాది అనగా చెవ్వులు మొదలగు కరణములను అనగా సాధనములను వాటివాటి వ్యాపారములందు అనగా వాటి ద్వారా జరుగు కర్మలయందు నియోగించు అనగా నియమించువాడు **అనగా ఉపాధి స్వరూపుడైన జీవుడు.** ఈ విధముగా యీ మూడు కర్మల యొక్క సాధనములు లేక కర్మ సంగ్రహములు.

ఏది కొంత సంగ్రహించబడునో అనగా సంపాదించబడునో దానిని సంగ్రహమందురు. అందువలన కర్మలయొక్క సమూహమును కర్మసంగ్రహమందురు. అట్లేలయన ? ఈ మూడు కారకముల - సాధన రూపముల - యందే కర్మలు సంగ్రహించబడును. అనగా కర్మలు చేయబడును. అందువలన యివి మూడు విధములుగు కర్మ సంగ్రహములు.

క్రియ, కారకము మరియు ఫలము యీ మూడు త్రిగుణాత్మకములు. అందువలన సత్వము, రజస్సు మరియు తమస్సు ఈ మూడు గుణముల భిన్నత్వ కారణముగ వాటియన్నింటికి సంబంధించిన వివిధములగు భేదములను చెప్పవలసి యున్నది. ఇప్పుడు అది ఆరంభించబడుచున్నది.

**18.19. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః,**
**ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి.**

అనగా - ఇచ్చట కర్మ శబ్దము యొక్క అర్థము క్రియ. అంతేగాని కర్తకు మిక్కిలి యిష్టమైన పారిభాషిక శబ్దము యొక్క కారకరూపమైన కర్మకాదు. జ్ఞానము, కర్మ మరియు కర్త అనగా క్రియలు చేయువాడు ఈ మూడు మాత్రమే గుణముల సంఖ్యను గణించునట్టి శాస్త్రములయందు అనగా కపిల మునీశ్వరుని ద్వారా రచింపబడిన శాస్త్రగ్రంథమునందు గుణభేదముల కారణముగ అనగా సాత్వికము మొదలగు గుణభేదముల కారణముగ పై మూడు మూడు విధములుగా చెప్పబడినవి. ఇచ్చట అనగా ఈ శ్లోకమునందు "త్రిధా" అను శబ్దముతో 'ఏవ' అను శబ్దము గూడ జోడింపబడి "పైన చెప్పబడిన మూడు పదార్థములు. విషయములు - గుణముల కంటె వేఱుగా వేఱుజాతికి చెందినవి కావను భావము ప్రకటించబడినది.

ఈ విధముగా గుణములను గుణించునట్టువంటి కపిలశాస్త్రము పరమార్థ స్వరూపుడైన బ్రహ్మ యొక్క ఏకత్వ విషయమునందు భగవంతుని అనగా శ్రీకృష్ణుని సిద్ధాంతమునకు

విరుద్ధముగా వున్నప్పటికీ గుణముల యొక్క భోక్తయైన జీవుని విషయమునందు మాత్రము ప్రమాణసిద్ధమైయున్నది.

ఆ **కపిల సాంఖ్యమును** అనువర్తించు పండితులు గుణములు మరియు ఆ గుణములకారణముగా జరుగు వ్యాపారములను నిరూపించుటయందు నిపుణులే. అందువలన వారి శాస్త్రము గూడ ముందు చెప్పబోవు అభిప్రాయములను స్తుతించుటకు అనగా సమర్థించుటకు ప్రమాణములుగా స్వీకరించబడుచున్నది. ఆ విధముగా యిచ్చట విరోధమేమియు లేదు.

వాటిని అనగా జ్ఞానము, కర్మ మరియు కర్తను మరియు గుణములననుసరించి చేయబడ్డిన వాటి యొక్క సాత్వికము మొదలగు సమస్త భేదములను నీవు యథాతథముగా అనగా శాస్త్రమునందు న్యాయానుసారముగ చెప్పబడినట్లుగా వినుము. అనగా ముందు చెప్పబోవు విషయమును సావధానచిత్తుడవై వినుము.

ముందుగా మూడు శ్లోకముల ద్వారా జ్ఞానము యొక్క మూడు భేదములను గురించి చెప్పబడుచున్నది.

**18.20. సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే,**
**అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్.**

అనగా – ఏ జ్ఞానము ద్వారా మనుష్యుడు అవ్యక్తము మొదలగు స్థావర పర్యంతము సమస్త భూతములయందును ఒకే భావమును అనగా ఒకే ఆత్మ వస్తువును అనగా ఏ వస్తువు తన స్వరూపమునుండి లేక ధర్మము నుండి ఎన్నడూ క్షయమును పొందదో అటువంటి ఎన్నడూ నాశమును పొందనటువంటియున్నూ మరియు కూటస్థమైయున్న నిత్యమైయున్న తత్వమును గుర్తించునో. ఇచ్చట 'భావ' శబ్దము వస్తువాచకము అనగా వస్తువును తెలుపునదై ప్రయోగించబడినది.

మరియు ఏ జ్ఞానము ద్వారా ఆయాత్మ తత్వమును వేఱు వేఱు దేహములయందు ఎటువంటి విభజన లేనటువంటిదై అనగా ఆకాశమువలె ఏకత్వ భావముతో చూచునో అటువంటి జ్ఞానమును అనగా అద్వైత భావముతో ఆత్మ సాక్షాత్కారమును కలుగజేసుకొనుటకు నీవు సాత్వికజ్ఞానమును అనగా పూర్ణజ్ఞానమును పొందుము.

ద్వైత దర్శన రూపమైన ఏ యదార్థము కానటువంటి జ్ఞానములు కలవో అవి రాజస, తామస జ్ఞానములు. అందువలన ఆ జ్ఞానములు అనగా రాజస తామస జ్ఞానములు ప్రపంచమును మనుష్యుని అంతఃకరణము నుండి తొలగించుటకు సాక్షాత్సాధనములు కావు.

**18.21. పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్పృథగ్విధాన్,**
**వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్.**

అనగా – సర్వభూతములయందును వివిధ ప్రకారములుగా, విభిన్నభావములతో ఆత్మకంటె వేఱుగా, విలక్షణముగా, అనేక రూపములుగా అనగా వేఱు వేఱు దేహములయందు

వేఱువేఱు ఆత్మలు వున్నట్టుగా తెలుసుకొనునో అట్టి జ్ఞానమును నీవు రాజస జ్ఞానముగా అనగా రజోగుణము వలన కలిగిన జ్ఞానముగా గుర్తించుము. **జ్ఞానమునకు కర్తృత్వముండుట అసంభవము** అందుచేత "ఏ జ్ఞానము చూచుచున్నదో" అను వాక్యమునకు అర్ధము మనుష్యుడు ఏ జ్ఞానమును ఆధారముగ జేసుకొని చూచుచున్నాడో యని గ్రహించవలయును.

**18.22.** యత్తు కృత్స్నవదేకస్మిన్కార్యే సక్తమహైతుకమ్,
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్.

అనగా – ఏదో ఒక కార్యమునందు గాని శరీరమునందుగాని, లేక శరీరమునకు వెలుపల ప్రతిమాదులయందుగాని సర్వవస్తు విషయిక సంపూర్ణ జ్ఞానమువలె ఆసక్తిని కలిగించు జ్ఞానము అనగా ఈ యాత్మ లేక ఈశ్వరుడు యిదియేగాని యింతకంటె వేఱుగలేదని, దిగంబరజైనులు ఆత్మయనగా దేహమునందుండునదియే మరియు శరీరము వంటిదేననియు మరియు రాయి లేక కొయ్యతో చేయబడిన ప్రతిమయే ఈశ్వరుడుగాని యింతకంటె వేఱుగలేదని తలంచు చుందురు. అట్లే వారివలెనే **బాహ్య వస్తువుల వంటిదే ఆత్మ పదార్థమని తలంచువారి జ్ఞానము రాజస జ్ఞానముగా తెలియనగును.**

అంతేగాక యే జ్ఞానము హేతురహితముగా, యుక్తి రహితముగా మరియు తత్త్వార్థరహితముగా వున్నదో, యదార్థమైన భావమే తత్త్వార్థము. అటువంటి తత్త్వార్థము ఏ జ్ఞానమునకు జ్ఞేయముగా వుండునో అటువంటి జ్ఞానము తత్త్వార్థ జ్ఞానమనబడును. మరియు అట్లుగాక అనగా తత్త్వార్థ రహితముగా యుండు జ్ఞానమును తత్త్వార్థములేనటువంటి జ్ఞానముగా గుర్తించవలయును. హేతురహితమైనందున అట్టి జ్ఞానము అల్పజ్ఞానమనబడును. లేక సరియగు ఫలమును కలుగజేయునది కాకపోవుటవలన గూడ అట్టిది అల్ప జ్ఞానమనబడును. అట్టి అల్పజ్ఞానము తామసగుణము ప్రధానముగా వుండుటచేత కలిగిన జ్ఞానముగా తలంచబడును. అట్లేలయన ? వివేకము లేనటువంటి మరియు తామస గుణము ప్రధానముగా కలిగియున్న ప్రాణులయందు మాత్రమే యిట్టి జ్ఞానము చూడబడుచుండును.

ఇప్పుడు కర్మలు గూడ గుణములననుసరించి మూడు విధములుగా యుండునని చెప్పబడుచున్నది.

**18.23.** నియతం సంగరహితమరాగద్వేషతః కృతమ్,
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్వికముచ్యతే.

అనగా – ఏ కర్మ నియతము అనగా నిత్యమైనదో మరియు సంగము, అనగా ఫలాసక్తిలేనిదైయున్నదో, మరియు ఫలమును కోరనటువంటి మనుష్యునిచేత రాగద్వేషాదులు లేకుండా చేయబడునో అట్టి కర్మ సాత్విక గుణప్రేరిత కర్మయని లేక సాత్వికకర్మయని చెప్పబడును. అట్లే ఏ కర్మ రాగము మరియు ద్వేషభావ ప్రేరితమై చేయబడునో ఆకర్మ రాగద్వేషాదులతో కూడియున్న రజోగుణ ప్రేరిత కర్మయని చెప్పబడును.

కర్మ ఫలమును పొందగోరు కర్త అతడు కర్మఫల ప్రేప్సు అనగా కర్మఫల తృష్ణకలవాడుగా తలంచబడును. అట్లుగాక తద్విరుద్ధముగా అనగా ఫలాసక్తి లేకుండ కర్మలు చేయు పురుషుడు కర్మఫలము కోరనివాడని తలంచబడును.

**18.24. యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః,**
**క్రియతే బహులాయాసం తద్రాజస ముదాహృతమ్.**

అనగా – భోగరూపమైన ఫలమును ఆశించినపురుషుని ద్వారా లేక అహంకారము కలిగియున్న పురుషుని ద్వారా ఏ కర్మలు చేయబడునో, ఈ శ్లోకమునందు **"సాహంకారేణ"** అను పదము తత్త్వ జ్ఞానమును ఆపేక్షించివాడబడినది కాదు. మరేమనగా – వేదశాస్త్రాది గ్రంథములను చదివి కొంత జ్ఞానము సంపాదించి నిరహంకారులుగావున్నవారిని ఆపేక్షించి ఆ పదము వాడబడినది. అట్లేలయన ? నిజమైన నిరహంకారి ఆత్మతత్త్వమును గుర్తించినవాడు. అట్టివాని యందు ఫలములను అనుభవించవలయునను కోరిక మరియు అధికముగా శ్రమసాధ్యమైన కర్తృత్వముయొక్క ఆసక్తి వుండియుండదు.

సాత్విక కర్మలు చేయుకర్త ఆత్మతత్త్వమును చక్కగా ఎఱుంగనటువంటి అహం కారముతో కూడియున్న పురుషుడే అయి వుండును. ఇంక రాజస, తామస గుణసంపన్నులైన కర్తలను గురించి వేఱుగ చెప్పనవుసరము లేదు గదా ?

ఈ ప్రపంచంలో ఆత్మతత్త్వమును ఎఱుంగని పురుషుడు గూడ వేదములను చదివాడైనచో అహంకారము లేనివాడని చెప్పబడును. అదెట్లన ? ఫలానా బ్రాహ్మణుడు అహం కారములేనివాడు" అని చెప్పబడుచున్నది. ఆ కారణముగానే అనగా అటువంటి పురుషులను దృష్టియందుంచుకొనియే ఈ శ్లోకమునందు **"సాహంకారేణవా"** అను వాక్యము చెప్పబడినది. **"పునః"** అను శబ్దము మాత్రము కేవలము వాక్యమునందు 'పాదపూర్తి' కొఱకు వాడబడినది.

అత్యధిక శ్రమతో కూడియున్న అనగా శ్రమసాధ్యమైన కర్మ రాజస గుణయుక్తమైన కర్మగా చెప్పబడినది.

**18.25. అనుబంధం క్షయం హింసామనపేక్ష్య చ పౌరుషమ్,**
**మోహాదారభ్యతే కర్మ యత్తత్తామస ముచ్యతే.**

అనగా – అనుబంధము – అనగా కర్మాంతకాలమందు కలుగు పరిణామమును అనుబంధమందురు. అటువంటి పరిణామమును అనగా అట్టి కర్మవలన కలుగు నష్టమును అనగా అట్టి కర్మచేయుట యందు కలుగు శ్రమ మరియు ధనహానిని లెక్కచేయక, హింసను అనగా యితర ప్రాణులకు కలుగు బాధను మరియు పౌరుషము అనగా "నేను ఫలానా కర్మను సునాయాసముగా పూర్తిచేయగలను" అను తన సామర్థ్యమును ఈ విధముగా అనుబంధము మొదలు పౌరుషము వరకు గల సమస్త భావములను లెక్కచేయక ఏ ధర్మము మోహముతో

అనగా అజ్ఞానముతో ఆరంభించబడునో అట్టి కర్మలన్నియు తమో గుణప్రేరితములై చేయబడు కర్మలుగా చెప్పబడును.

## 18.26. ముక్తసంగోన 2హంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః, సిద్ధ్య సిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే.

అనగా - ముక్తసంగుడైన కర్త అనగా ఈ మాయా ప్రపంచముతో ఎటువంటి సంబంధములేనివాడైన కర్త, ఆసక్తిని అనగా విషయములయందలి ప్రేమను త్యజించినట్టి కర్త, అహంకారమును త్యజించినటువంటి కర్త "నేను కర్తను" అనుభావమే లేనటువంటి కర్త, కాని ధృతి మరియు వుత్సాహవంతుడైవున్న కర్త, ధృతి అనగా ధారణాశక్తి మరియు ఉత్సాహమనగా ప్రయత్నించు స్వభావము, ఈ రెండూ కలిగియున్న కర్త మరియు తాను చేసిన కర్మలకు ఫలము లభించినను, లభించకయున్నను ఎటువంటి మనోవికారమును పొందనటువంటి కర్త, సాత్వికగుణ సమన్వితుడైయున్న కర్తయనబడును. కేవలము శాస్త్రాది ప్రమాణాలను సారముగానే కర్మలయందు చరించు కర్త, ఫలేచ్ఛ లేక ఆసక్తి మొదలగు భావములు లేనటువంటి కర్త నిర్వికారుడైన సాత్విక కర్తయనబడును.

## 18.27. రాగీ కర్మఫలప్రేప్సుర్లుబ్ధో హింసాత్మకో 2శుచిః, హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః

అనగా – మనస్సునందు ప్రాపంచిక విషయములయందు రాగభావము కలిగియున్న పురుషుడు, అంతేగాక కర్మఫలమునందు ఆసక్తి గల పురుషుడు, లోభియైనవాడు అనగా యితరుల సంపద యందు కోరిక కలిగియున్న వాడు. మరియు తీర్థ స్థానములయందును అనుకూలమైన దేశకాలములందును తనవద్ద వున్నటువంటి సంపదను ఖర్చుచేయనట్టి పురుషుడు మరియు ఇతరులకు హాని కలిగించు స్వభావము గలవాడు, అశుచి అనగా వెలుపల లోపల రెండు విధములుగాను పరిశుభ్రముగా లేనటువంటి పురుషుడు. మరియు ప్రాప్య అప్రాప్యములందు కలుగు హర్ష శోకములయందు మునిగియుండు పురుషుడు అనగా యిష్టమైన పదార్థము లభించినప్పుడు సంతోషమును, యిష్టము కాని పదార్థము వచ్చి పడినప్పుడు శోకమును పొందునటువంటి పురుషుడు అయినవానికి కర్మలు సిద్ధించినప్పుడు సంతోషము, సిద్ధించనప్పుడు శోకము కలుగుచుండును. అందువలన ఆ విధముగా హర్ష శోకాదులతో కూడియున్న పురుషుడు రాజస గుణయుతుడు అనగా రాజస గుణము కలిగియుండి అహంకారముతో కర్మలు చేయుచుండును.

## 18.28. అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో 2నైష్కృతికో 2లసః, విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస వుచ్యతే.

అనగా – అయుక్తుడైయున్నవాడు అనగా ఎవని చిత్తము అతని వశమునందు లేదో, బాలకుని వలె ప్రాకృతుడు అనగా ఎటువంటి సంస్కారబుద్ధి లేనటువంటి పురుషుడు, స్తబ్ధుడు

అనగా కర్ర లేక కాష్టము వలె ఎవ్వని ఎదుట లొంగని లేక వంగి నమస్కరించని వాడు. శఠ్ అనగా తన శక్తిసామర్థ్యములను గుప్తముగా దాచుకొను కపట బుద్ధిగల పురుషుడు. నైష్కృతిక్ అనగా యితరుల మంచి కార్యములను చెడగొట్టు స్వభావము గల పురుషుడు. సోమరి అనగా తాను చేయవలసి, చేయతగిన కర్మలయందు గూడ ప్రవృత్తిలేనటువంటి స్వభావముగలవాడు, విషాదీ - అనగా ఎల్లప్పుడూ ఏడుపు ముఖములేక స్వభావము కలిగియుండు పురుషుడు మరియు దీర్ఘసూత్రీ అనగా తాను చేయవలసియున్న కర్తవ్య కర్మలయందు గూడ ఆలస్యము చేయువాడు అనగా ఈ రోజు చేయవలసిన పనిని రేపటికి, రేపు చేయవలసిన పనిని యింక ముందు రోజుకు వాయిదాలు వేయు పురుషుడు అయినటువంటి కర్త తామస గుణ సంపన్నమైన కర్తయనబడును.

## 18.29. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రి విధం శృణు, ప్రోచ్యమా నమశేషేణ పృథక్త్వేన ధనంజయ.

అనగా– ఓ ధనుంజయ ! బుద్ధికి మరియు ధృతి అనగా ధారణాశక్తికి గూడ సత్వాది గుణముల ననుసరించి మూడు - మూడు విధములగు భేదములుండును. అవన్నియు విడివిడిగా అనగా విభాగపూర్వకముగా మరియు సర్వాంగపూర్ణముగా చెప్పబడుచున్నవి, సావధాన చిత్తుడవై వినుము.

అశ్వమేధయాగమొనర్చినప్పుడు అర్జునుడు అనేకమంది రాజుల నుండి మరియు దేవతల నుండి గూడ చాలా ధనమును పొందియున్నాడు. అందుచే ఆతనికి “ధనంజయుడు” ’ అను పేరు వచ్చినది.

## 18.30. ప్రవృత్తిం చ నివృత్తిం చ కర్యాకార్యే భయాభయే, బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్వికీ.

అనగా - ప్రవృత్తిని అనగా బంధమునకు హేతురూపమైన కర్మ మార్గమును, మరియు నివృత్తిని అనగా మోక్షమునకు హేతు రూపమైన సంన్యాస మార్గమును ఏ బుద్ధి ఎఱుంగునో, బంధము మరియు మోక్షముతో పాటు ప్రవృత్తి మరియు నివృత్తికి సమాన వాక్యత్వమున్నది. అందువలన ప్రవృత్తి అనగా కర్మమార్గమనియు మరియు నివృత్తి అనగా సంన్యాస మార్గమనియు నిశ్చయమగుచున్నది.

మరియు కర్తవ్యమును మరియు అకర్తవ్యమును అనగా విధిని మరియు ప్రతిషేధమును అనగా చేయదగినది మరియు చేయరానిదానిని గూడ ఏ బుద్ధి ఎఱుంగునో, ఇలా దేనికి సంబంధించినదానిని గురించి చెప్పబడుచున్నది ? దేశకాలములకు లోబడి ఎవని యొక్క దృష్టమైన మరియు అదృష్టమైన ఫలములుండునో అ కర్మల యొక్క సంబంధమును గురించి చెప్పబడుచున్నది.

మరియు భయమును, అభయమును అనగా భయములేని స్థితిని గురించి ఏ బుద్ధి బాగుగా ఎఱుంగునో దేని వలన మనుష్యుడు భయమును పొందునో దానిని భయమందురు. మరియు అందులకు విపరీతముగా అనగా విరుద్ధముగా వుండు స్థితిని అభయము అని అందురు. ఆ రెంటిని (అనగా భయమును అభయమును) అనగా దృష్టా దృష్ట విషయకమై యున్న భయాభయములను అనగా అవి రెండూ కలుగుటకు గల కారణములను ఏ బుద్ధి ఎఱుంగునో మరియు సహేతుకముగా బంధమును మరియు మోక్షమును గూడ ఎఱుంగునో ఓ పార్థా ! అటువంటి బుద్ధి సాత్వికబుద్ధియనబడును.

ఇంతకు పూర్వము ఏ జ్ఞానము చెప్పబడినదో అది బుద్ధియందు కలుగు ఒకానొక వృత్తి విశేషము మాత్రమే. బుద్ధి వృత్తులు కలది. అనగా బుద్ధియందు అనేక పరస్పర విరుద్ధ వృత్తులు కలుగుచుండును. ధృతి గూడ బుద్ధియందు కలుగు ఒక వృత్తి విశేషమే.

**18.31. యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ,**
**అయథావత్ప్ర జానాతి బుద్ధిః సా పార్థ రాజసీ.**

అనగా – ఓ పార్థా ! ఏ బుద్ధి ద్వారా మనుష్యుడు శాస్త్రముల ద్వారా విధించబడిన ధర్మమును మరియు శాస్త్రములద్వారా నిషేధించబడిన అధర్మమును మరియు యింతకు పూర్వము చెప్పబఢిన కర్తవ్యమును అనగా చేయవలసిన దానిని మరియు అకర్తవ్యమును అనగా చేయకూడని దానిని యదార్థరూపముతో సర్వతోభావముతో అనగా మనసా, వాచా, కర్మణా నిర్ణయ పూర్వకముగా ఎఱుంగడో అటువంటి బుద్ధి రాజసబుద్ధి అనగా రాజసగుణముతో కూడియున్న బుద్ధియని తెలియనగును.

**18.32. అధర్మం ధర్మమితి యా మన్యతే తమసా ऽऽవృతా,**
**సర్వార్థాన్విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ తామసీ.**

అనగా – ఓ పార్థా ! తమో గుణముతో ఆక్రమించబడియున్న బుద్ధి అధర్మాన్ని అనగా ధర్మ శాస్త్రముల ద్వారా నిషేధించబడిన కర్మలను ధర్మబద్ధమని తలంచును. అనగా ఆ నిషేధింపబడిన కర్మలను శాస్త్రబద్ధమేనని వాదించుచుండును. అంతేగాక తెలుసుకొనదగిన యితరమైన అనేక పదార్థములను విపరీతబుద్ధితో గ్రహించతగినవేయని తలంచి గ్రహించు చుండును. ఆ విధముగా ధర్మవిరుద్ధమైన కర్మలు చేయు బుద్ధి తామస గుణయుక్తమైన బుద్ధిగా చెప్పబడును.

**18.33. ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియ క్రియాః,**
**యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ.**

అనగా – 'ధృతి' శబ్దమునకు దూరముగా వాడబడిన 'వ్యభిచారిణీ' శబ్దమునకు సంబంధము కలదు. వ్యభిచారయుతమైన ధృతిద్వారా అనగా ఎల్లప్పుడూ సమాధి స్థితియందు లగ్నమైయున్న ఏ ధారణాశక్తి (ధృతి) ద్వారా సమాధియోగబలముతో మనస్సు, ప్రాణము

మరియు యింద్రియముల ద్వారా జరుగు సమస్త క్రియలు గ్రహించబడుచున్నవో అనగా మనస్సు, ప్రాణము మరియు యింద్రియముల సర్వవిధ ప్రయత్నములు (చేష్టలు అనగా క్రియలు) ఏ ధృతి ద్వారా శాస్త్ర విరుద్ధమైన ప్రవృత్తులన్నియు నిలిపివేయబడుచున్నవో ఆ ధృతి అనగా ఆ ధారణాశక్తి అనగా ఆ సమాధి స్థితి సాత్త్విక ధృతియని చెప్పబడుచున్నది. సాత్త్విక గుణయుక్తమైన ధృతి ద్వారానే శాస్త్ర విరుద్ధమైన సర్వవిధ ప్రవృత్తులు మరియు ఆ ప్రవృత్తుల ప్రేరణతో కలుగు లేక చేయబడు కర్మలన్నియు లేకుండాపోవుచున్నవి.

ఇట్లు చెప్పుటకు తాత్పర్యమేమన ? ధరించు అనగా తనయందు నిలిపివుంచు మనుష్యుడు, ఏ స్థిరమైన ధారణాశక్తి ద్వారా సమాధి; యోగబలముతో మనస్సు, ప్రాణము మరియు సర్వేంద్రియముల ద్వారా జరుగు సర్వవిధ చేష్టలను అనగా క్రియలను, తన అంతఃకరణమునందే నిలిపి వుంచునో అటువంటి ధారణా శక్తితో కూడియున్నది సాత్త్విక ధృతి అనగా సాత్త్విక గుణయుక్తమైన ధారణా శక్తియే.

## 18.34. యయా తు ధర్మ కామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున, ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ.

అనగా – ఓ పార్థా ! ఏ ధృతి అనగా ధారణాశక్తి ద్వారా మనుష్యుడు ధర్మమును, అర్థమును మరియు కామమమును ధరించియుండునో అనగా ఏ ధృతి ద్వారా మానవుడు వీటినన్నింటిని అనగా ధర్మార్థ కామములను తప్పక ఆచరించి తీరవలసినవియేయని మనస్సుయందు నిశ్చయించుకొనునో,

మరియు ఏ ఏ ధర్మ, అర్థాదులను ధరించు అనగా తప్పక చేయవలయును అను సందర్భము కలుగునో, ఆయా సందర్భముల ననుసరించి తాను చేయు కర్మల యొక్క ఫలములను పొందగోరునో అటువంటివాని ధృతి రాజస గుణసమన్వితమైనదిగా చెప్పబడును.

## 18.35. యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ, న విముంచతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ.

అనగా – ఎటువంటి ధృతి అనగా ధారణాశక్తి ద్వారా మనుష్యుడు స్వప్నమును, నిద్రను, భయమును అనగా ఎవ్వరో యితరులు తనను పీడించుచున్నారు అను భావము భయమనబడును, శోకమును అనగా దుఃఖమును మరియు మదమునే అనగా అహంకారమును వదలక యుండునో, అనగా విషయములను సేవించుటయే అనగా భోగించుటయే తన జీవిత పరమార్థముగా తలంచి వున్మత్తుని అనగా పిచ్చివానివలె మదమునే అనగా అహంకారమునే తన మనస్సునందు తన కర్తవ్యముగా నిశ్చయించుకొని అజ్ఞానముతో కూడిన బుద్ధిగలవాడైన మనుష్యుడు వీటినన్నింటిని వదలక తన మనస్సునందే ధరించి వుంచుకొనునో అటువంటివాని ధృతి తామస ధృతియని చెప్పబడును.

గుణభేదము ననుసరించి క్రియల మరియు కారకములకు మూడు మూడు భేదములు చెప్పబడినవి. ఇప్పుడు వాటికి ఫలరూపమైన సుఖములు గూడ మూడు విధములుగా యుండునని చెప్పుచున్నారు.

**18.36. సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ;**
**అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి.**

అనగా - ఓ అర్జునా ! ఇప్పుడు నీవు నా నుండి మనుష్యులు పొందు మూడు విధములగు సుఖములను గురించి వినుము. అనగా వినుటకు నీ చిత్తమును సిద్ధముగా వుంచుకొనుము.

అభ్యాసము ద్వారా అనగా ఎటువంటి ప్రయత్నము లేకయే మానవుడు ఏ సుఖమును అనుభవించుచుండునో, అనగా ఎటువంటి సుఖబోధయందు మరల మరల భోగించు ప్రవృత్తి కలుగుచుండునో, మరియు ఎచ్చట మనుష్యుడు తనకు ఎటువంటి దుఃఖములు లేవని నిశ్చయించుకొనునో అనగా ఎచ్చట అతనికి నిజముగా ఎటువంటి దుఃఖములు లేకుండునో - అనగా సమస్త దుఃఖములు నివృత్తిని చెందియుండునో -

**18.37. యత్తదగ్రే విషమివ పరిణామే ఽమృతోపమమ్;**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమాత్మబుద్ధి ప్రసాదజమ్.**

అనగా - పైన చెప్పబడిన సుఖము అంత తేలికగా లభించునది కాదు. అట్టి సుఖమును పొందుటకు ప్రయత్నము చేయుట ఆరంభించినప్పుడు, జ్ఞానము, వైరాగ్యము, ధ్యానము మరియు సమాధి మొదలగునవి అత్యంత శ్రమసాధ్యమైనవి అగుటచే విషమువలె దుఃఖాత్మకములుగా తోచును. కాని ఆరంభకాలమందలి ఆశ్రమను ఓర్చుకొని జ్ఞానమును పొందినప్పుడు అనగా ఆ ప్రయత్నములు ఫలించినప్పుడు అనగా జ్ఞానవైరాగ్యాదుల పరిపాకముచే వుత్పన్నమైన సుఖము అమృతమువలె అత్యంత ఆనందదాయకనుగా వుండును.

దేహబుద్ధితొలగి ఆత్మబుద్ధి కలిగినప్పుడు తోచు సుఖమును విద్వాంసులు సాత్విక సుఖమని చెప్పియున్నారు. తన (మన) బుద్ధినే ఆత్మబుద్ధియని యందురు. ఆ బుద్ధి ఎప్పుడు జలమువలె స్వచ్ఛము మరియు నిర్మలము అగునో దానిని ఆత్మబుద్ధియని అందురు. అట్టి సుఖమునుండి కలిగిన నిజమైన సుఖమే ఆత్మబుద్ధి వలన కలిగిన సుఖమనబడును. మరొక విధముగా చెప్పవలయునన్నచో ఆత్మవిషయికమైన లేక ఆత్మను ఆధారముగ జేసుకొని కలుగుబుద్ధియే ఆత్మబుద్ధి. ఆయాత్మబుద్ధి కలిగిన కారణముగా కలుగు సుఖము ఆత్మబుద్ధి ప్రసాదముచే కలిగినదై యుండును. అందువలన ఆ సుఖము సాత్విక సుఖమనబడు చున్నది.

**18.38. విషయేంద్రియ సంయోగాద్యత్తదగ్రే ఽమృతోపమమ్;**
**పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్.**

అనగా – విషయములు అనగా యింద్రియముల ద్వారా లభించు సుఖము ముందుగా అనగా అనుభవించు ఆరంభకాలమునందు అమృతమువలె తోచును. కాని పరిణామదశయందు విషమువలె దుఃఖదాయకమగును. తాత్పర్యమేమన ? బలము, వీర్యము, రూపము, బుద్ధి, మేధస్సు, ధనము మరియు ఉత్సాహము మొదలగువాని హాని జరుగుట వలన మరియు అధర్మము మరియు దానివలన కలుగు నరకాదులకు హేతువు అగుటవలనను, ఆ విషయ సుఖము పరిణామ దశయందు అనగా అనుభవించబడిన తరువాత విషమువలె దుఃఖమును కలిగించునదగును. అందువలన అటువంటి ఈ విషయ సుఖము రాజస సుఖమనబడుచున్నది. అనగా రాజస గుణకారణముగా కలిగిన సుఖమగుచున్నది.

**18.39. యదగ్రే చానుబంధే చ సుఖం మోహన మాత్మనః,**
**నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామస ముదాహృతమ్.**

అనగా – అనుభవించు కాలమునందు మరియు పరిణామమునందు అనగా ఆ సుఖమును అనుభవించిన అనంతరము గూడ ఆత్మను మోహించునదైయున్న సుఖము మరియు నిద్ర, సోమరితనము మరియు ప్రమాదవశమున కలుగు సుఖము అనగా నిద్ర, సోమరితనము మరియు ప్రమాదకారణముగ అనగా ఈ మూడు దుర్గుణముల కారణముగ కలిగిన లేక కలుగునట్టి సుఖము తామస సుఖమనబడుచున్నది.

ఇంతవరకు చెప్పిన తదుపరి యిప్పుడు ప్రకరణములను ఉపసంహరించునటువంటి శ్లోకము చెప్పబడుచున్నది.

**18.40. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః,**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్త్రిభిర్గుణైః.**

అనగా – మనుష్యాది ప్రాణులయందుగాని లేక మరేదైనా యితర ప్రాణములేనట్టి వస్తువులందుగాని, భూమి మీదగాని, స్వర్గము నందుగాని లేక దేవతలయందుగాని ఈ ప్రకృతి ద్వారా పుట్టినటువంటి లేక ఏర్పడినట్టి సత్త్వము, రజము, మరియు తామసము అను ఈ మూడు గుణములు లేనటువంటి వాడు లేక అది లేనేలేదు; లేనేలేదు

క్రియ, కారకము మరియు ఫలమే స్వరూపముగా కలిగియున్న ఈ **ప్రపంచమంతయు సత్వ, రజ తమస్సు అను ఈ మూడు గుణములనే విస్తారముగా కలిగియున్న ప్రపంచము అవిద్య వలన (ద్వారా) కల్పించబడినది.** మరియు అనర్థరూపముగలదై యున్నది. పదునైదవ అధ్యాయమునందు అశ్వద్ధ వృక్ష రూపమును కల్పించి **"ఊర్ధ్వమూలమ్"** మొదలగు వాక్యముల ద్వారా సమూలముగా ఈ ప్రపంచము యొక్క వర్ణన చేయబడినది.

ఆ వర్ణనతో పాటు "దానిని దృఢమైన అసంగ శస్త్రము ద్వారా ఛేదించిన తరువాత ఆ పరమపదమును పొందుటకు ప్రయత్నించవలయును" అని చెప్పబడినది.

అయితే యిచ్చట ఒక శంక కలుగుటకు అవకాశము ఏర్పడుచున్నది. అదేమనగా- సర్వము మూడు గుణముల యొక్క కార్యరూపమే అయివున్నప్పుడు ఈ ప్రపంచమునకు నివృత్తి కలుగుట అసంభవము గదా ? అందువలన ఏ వుపాయముతో ఈ ప్రపంచమును నివృత్తింప చేయవచ్చునో అది అనగా ఆ వుపాయము చెప్పవలసి యుండును.

ఆ వుపాయముతో పాటు సంపూర్ణ గీతా శాస్త్రము యొక్క ఉపసంహారము గూడ చేయవలసి యున్నది. అట్లేలయన ? పరమ పురుషార్థమును పొందగోరుచున్నట్టి వారి ద్వారా అనుష్ఠించుటకు అనుకూలముగా యుండునట్టి ఈ **గీతా శాస్త్రమే సమస్తమైన శ్రుతులు మరియు స్మృతుల యొక్క అభిప్రాయము** అనగా సారాంశమని చెప్పదలంచి **"బ్రాహ్మణ క్షత్రియ విశామ్'** మొదలగు శ్లోకములు ఆరంభించి చెప్పబడుచున్నవి.

**18.41. బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప,**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైర్గుణైః.**

అనగా – ఓ పరంతప ! బ్రాహ్మణుల యొక్కయు, క్షత్రియుల యొక్కయు మరియు వైశ్యుల యొక్క అనగా ఈ మూడు వర్ణముల వారి యొక్కయు, మరియు శూద్రులకు సంబంధించిన కర్మల యొక్క విభజన చేయబడి యున్నది. అనగా ఆ నాలుగు వర్ణముల వారికి సంబంధించిన వేఱువేఱు కర్మలు విబజన పూర్వకముగా చెప్పబడియున్నవి. బ్రాహ్మణాదులతో శూద్రులను గూడ కలిపి సమాస పూర్వకముగా చెప్పకపోవుటకు కారణమేమన? శూద్రులు ద్విజులు అనగా రెండుసార్లు పుట్టిన వారు కానందున వారికి అనగా శూద్రులకు వేద పఠనాధికారము లేదు.

ఇట్టి విభజన ఎవరిచేత చేయబడినది ? అన్నచో – వారి వారి స్వభావము ద్వారా వుత్పన్నమైనటువంటి గుణముల ద్వారా. స్వభావమనగా **ఈశ్వర ప్రకృతి, త్రిగుణములతో కూడియున్న మాయయే త్రిగుణముల వుత్పత్తికి కారణమైయున్నది.** ఆ విధముగా స్వభావము చేతనే కలిగిన గుణముల ద్వారా బ్రాహ్మణులు మొదలగు వారికి శమము మొదలగు కర్మలు విబజింపబడినవి.

అట్లుగాక మరొక విధముగా కూడ ఈ విభజన రహస్యమును తెలుసుకొనవచ్చును. అదెట్లన ? బ్రాహ్మణాదుల స్వభావమునకు కారణము సత్వగుణమై యున్నది. అట్లే క్షత్రియ స్వభావమునకు కారణము సత్వ మిశ్రిత రజోగుణమై యున్నది. అట్లే వైశ్య స్వభావమునకు కారణము తమో మిశ్రిత రజోగుణమై యున్నది. మరియు శూద్ర స్వభావమునకు కారణము రజోమిశ్రిత తమోగుణమై యున్నది. అట్లేలయన ? పైన చెప్పబడిన నాలుగు వర్ణములయందును వారి వారి గుణములననుసరించి క్రమముగా శాంతి, ఐశ్వర్యము, చేష్ట అనగా ప్రయత్నము,

మరియు మూఢత్వము మొదలగు వేఱువేఱు స్వభావములు కారణమగుచున్నట్లుగా తెలియుచున్నది.

మరో విధముగా విచారించిచూచినచో - జన్మాంతరముల యందు ఆయా ప్రాణుల ద్వారా చేయబడిన కర్మల ఫలముగా ఏర్పడిన సంస్కారముల కారణముగ ఆయా స్వభావములు కలిగి వర్తమాన జన్మమునందు ఆ సంస్కారముల కనుకూలముగా అభివ్యక్తమైనవి. దానినే మనము స్వభావమనుచున్నాము. ఆ స్వభావమే ఆయా గుణముల వుత్పత్తికి కారణమగుచున్నది. కావున **ఈ గుణములన్నియు ఆ స్వభావ జనితములే.**

గుణముల వుత్పత్తి (ఏర్పాటు) కారణము లేకుండ జరుగనేరదు. అందువలన **స్వభావమే ఆయా గుణముల వుత్పత్తికి కారణము.** ఈ విధముగా తలంచియే కారణ విశేషము ప్రతిపాదించబడినది.

ఈ విధముగా స్వభావము చేత ఏర్పడినట్టి అనగా ప్రకృతి యొక్క ప్రభావముచేత **ఏర్పడిన సత్వ, రజ మరియు తమ అను ఈ మూడు గుణముల ద్వారా తమ తమ కార్యముల కనురూపముగా శమాది కర్మలు వేఱు చేయబడినవి లేక విభజించబడినవి.**

**పూర్వపక్షము** - బ్రహ్మణాది వర్ణములకు విధించబడిన శమాదికర్మలు శాస్త్రము ద్వారా విభజింపబడినవి గదా ? అనగా శాస్త్రముల ద్వారా నిశ్చయించబడినవి గదా మరియుప్పుడు సత్వము మొదలగు మూడు గుణములు అనగా త్రిగుణముల ద్వారా విభజించ బడినవని ఎట్లు చెప్పుచున్నారు ?

**సమాధానము** - అట్లు చెప్పుటలో దోషమేమియు లేదు. ఏలయన ? శాస్త్రము ద్వారా గూడ బ్రాహ్మణాది వర్ణముల వారికి శమాది కర్మలు
సత్వాది గుణభేదముల ననుసరించియే విభజింపబడియున్నవి. గుణములను వదలి విభజింపబడలేదు. అందువలన శాస్త్రముద్వారా విభజింపబడినప్పటికి కర్మలు గుణముల ఆధారముగానే విభజింపబడినవి. అట్లే తెలియవలయును.

ఆ కర్మలు ఎటువంటివి ? అన్నచో చెప్పబడుచున్నది -

**18.42. శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ,**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రాహ్మంకర్మ స్వభావజమ్.**

అనగా - ఇంతకు పూర్వము చెప్పబడినట్లుగా అశమ, దమములు మరియు యింతకు పూర్వము చెప్పిన శారీరికాది భేదము వలన కలుగు మూడు విధములగు తపస్సు మరియు యింతకు పూర్వము చెప్పబడిన రెండు విధములైన శాంతి క్షాంతి అనగా క్షమ, అర్జవము అనగా అంతఃకరణము యొక్క సరళత్వము మరియు జ్ఞాన-విజ్ఞానముల మరియు ఆస్తికత్వము అనగా శాస్త్రార్థమునందు శ్రద్ధ విశ్వాసము మొదలగునవన్నియు బ్రాహ్మణుని స్వాభావిక కర్మలు అనగా బ్రాహ్మణవర్ణము వారి కర్మలు "**స్వభావప్రభవైః గుణైః ప్రవిభక్తాని**" అనగా స్వభావజన్య

గుణముల కారణముగ కర్మలు విభజించబడినవి. అను విషయమే యిచ్చట "స్వభావజమ్" అను శబ్దము ద్వారా చెప్పబడినది.

**18.43. శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్య పలాయనమ్,**
**దానమీశ్వరభావశ్చ క్షాత్రంకర్మ స్వభావజమ్.**

అనగా - శౌర్యము అనగా శూరవీరత్వము, తేజము అనగా యితరుల ఎదుట లొంగియుండుట అను స్వభావము లేకుండుట, ధృతి అనగా ధారణాశక్తి యీ ధారణాశక్తి కలిగియున్న మానవుడు సదా ఉత్సాహము గలవాడై మనుష్యునకు కలుగు సర్వావస్థలయందును శోకముగాని లేమినిగాని అనుభవించకుండుట, దక్షత అనగా ఎన్ని చిక్కులు లేక ఆకస్మికముగా వచ్చు ఆపదలయందు ఎటువంటి భయము లేకుండ వాటిని ఎదుర్కొను భావము మరియు ధైర్యము కలిగియుండుట మరియు యుద్ధమునుండి వెనుదిరగక విజయమో వీరమరణమునో పొందగోరు స్వభావము కలిగియుండుట.

దానము అనగా యివ్వదగిన పదార్థములను ఉదారముగ పంచిపెట్టుట మరియు ఈశ్వరభావము అనగా పాలితులపట్ల అధికారము కలిగియుండుట, ఇవన్నియు క్షత్రియ వర్ణమువారి కర్మలు అనగా క్షత్రియు పర్ణమువారి స్వాభావిక కర్మలు. అనగా క్షత్రియులకు విధించబడిన కర్మలు.

**18.44. కృషిగౌరక్షవాణిజ్యం వైశ్యంకర్మ స్వభావజమ్**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్.**

అనగా - కృషి, గోరక్ష మరియు వాణిజ్యము అనగా భూమిని దున్ని పంటలు పండించుట కృషి యనబడును. గోవులను రక్షించుట అనగా వాటిని పోషించుట గోరక్ష యనబడును. మరియు క్రయ విక్రయరూపమైన వాణిజ్యము అనగా వ్యాపారము అనగా క్రయ విక్రయము వణిక్ కర్మను వాణిజ్యమందురు. పై మూడు కర్మలు అనగా కృషి, గోపాలనము మరియు వాణిజ్యము వైశ్యకర్మలు. అనగా వైశ్య వర్ణమువారి స్వాభావిక కర్మలు.

ఆ విధముగానే పరిచర్యలు చేయుట అనగా సేవారూపమైన కర్మలు చేయుట శూద్రవర్ణము వారి స్వాభావిక కర్మలు.

స్వాభావికముగా ఏర్పడిన వర్ణముల గుణముల ననుసరించి చెప్పబడిన ఆ యా కర్మలను క్రమము తప్పక అనుసరించి అనుష్ఠించినవారికి స్వర్గమునకు ప్రతిరూపమైన స్వాభావిక ఫలము ప్రాప్తించును.

ఏలయన ? స్మృతి గ్రంథములయందు చెప్పబడినట్లుగా తమ తమ అనగా తమ వర్ణమువారికి విధించబడిన కర్మలయందు అంకితభావము కలిగియున్న పురుషుడు దేహత్యాగానంతరము పరలోకమున కేగి తాను స్థూలదేహముతో కూడి భూలోకమునందు

జేసియున్నట్టి కర్మలు మరియు ఈశ్వర ప్రసాదితమైన వాటి ఫలముల ప్రకారముగ శ్రేష్టమైన దేశ, కాల, జాతి, కుల, ధర్మ ఆయువు, విద్య, ఆచార విచారములు, ధనము, సుఖము మరియు తెలివి మొదలగువానిచే సంపన్నుడై తిరిగి స్థూలదేహమును పొందును. ఇంతేగాక పురాణాదులయందు గూడ వర్ణాశ్రమాదులకు వేఱు వేఱు లోక ప్రాప్తిరూపములైన ఫలభేదములు చెప్పబడియున్నవి.

కాని యితర కారణముల వలన తమకు విధించబడిన కర్మలను భక్తిశ్రద్ధలతో అనుష్ఠించినవారికి యిప్పుడు చెప్పబోవు ఫలములు లభించును.

**18.45.** స్వే స్వే కర్మణ్యభిరతః స్యంసిద్ధిం లభతే నరః,
స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు.

అనగా – కర్మాధికారియైన పురుషుడు అనగా తత్వజ్ఞానమెఱుంగని పురుషుడు అనగా పైన చెప్పబడిన లక్షణములు గలవాడు తన కర్మలయందు తత్పరుడై అనగా ఆ కర్మలు చేయుటయందే ఆసక్తి గలవాడై అనగా తన కర్మలను అతి శ్రద్ధతో అనుష్ఠించిన కారణముగ తాను యింతకు పూర్వము చేసిన పాపములు నశించినవాడై దేహము మరియు యింద్రియములకూ అనుకూలమైన తాను చేసిన కర్మల కనుగుణమైన ఫలమును పొందును.

అయితే తనకు విధించబడిన కర్మలు అనుష్ఠించినంత మాత్రముననే సాక్షాత్తుగా సిద్ధి లభించునా ? కాదు. అయితే మరి ఎట్లు లభించును ? తన కర్మలయందు మగ్నమై యున్న పురుషుడు ఏ విధముగా సిద్ధిని పొందునో చెప్పెద వినుము.

**18.46.** యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః.

అనగా – ఏ అంతర్యామియైన ఈశ్వరుని ద్వారా సమస్త ప్రాణులయొక్క ఉత్పత్తి లేక చేష్టలు కలుగుచున్నవో మరియు ఏ ఈశ్వరునిచే ఈ జగత్తంతయూ వ్యాపించియున్నదో, ఆ ఈశ్వరుని చేత ప్రతి వర్ణమువారికి యింతకు పూర్వము చెప్పినట్లుగా విధించబడిన తన కర్మలద్వారా పూజించి, ఆయనను ఆరాధించిన మనుష్యుడు మాత్రమే జ్ఞాననిష్ఠయను యోగ్యతా రూపమైన సిద్ధిని పొందగలడు.

అలా కలుగుటకు కారణమేమి ? అన్నచో –

**18.47.** శ్రేయాన్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్.

అనగా – తన వర్ణము ననుసరించి ఈశ్వరునిచే విధించబడిన కర్మ గుణ రహితమైనను అనగా హీనమైన కర్మ అయినప్పటికి, బాగుగా అనుష్ఠించబడిన యితరుల ధర్మముకంటె

ఎంతో శ్రేష్టమైనది. ఏ విధముగా విషమునందు లేక అగ్నియందు పుట్టినటువంటి ప్రాణికి ఆ విషము లేక అగ్ని ఎట్లు అపకారికాదో ఆ విధముగానే తన స్వభావము ననుసరించి విధించబడిన కర్మలను శ్రద్ధతో అనుష్ఠించు మనుష్యునకు ఎటువంటి పాపము అంటదు. ఏ మాట యింతకు పూర్వము "స్వభావజమ్" చూ. గీత 18.43 అను పదము ద్వారా చెప్పబడినదో అదే మాట ఇచ్చట "స్వభావనియతమ్" అను పదము ద్వారా చెప్పబడినది. స్వభావము ననుసరించి విధించబడిన కర్మను స్వభావ నియతము అని చెప్పుదురు.

పై శ్లోకమునందు స్వభావము ననుసరించి విధించబడిన కర్మలను అనుష్ఠించువాడు అయిన మనుష్యుడు విషమునందు పుట్టిన పురుగువలె ఎటువంటి పాపమును పొందదు. మరియు మూడవ అధ్యాయమునందు గూడ యితరులకు అనగా యితర వర్ణములవారికి విధించబడిన కర్మలు భయహేతువులై యుండును. మరియు ఎవ్వడైనా అజ్ఞాని కూడా ఎటువంటి కర్మలు చేయక ఒక్క క్షణము గూడ వుండజాలదు. అందువలన -

**18.48. సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్,**
**సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్ని రివావృతాః.**

అనగా - జన్మతో లభించినది సహజమనబడును. ఆ సహజమైనది ఏది ? అన్నచో - కర్మయని సమాధానము. ఓ కౌంతేయా ! త్రిగుణములతో కూడియున్నందున ఏ కర్మ దోషయుక్తమై యున్నదో అటువంటి దోష భూయిష్ఠమైన కర్మ గూడ అది సహజమై యున్నందున దానిని విడువరాదు.

ఏలయన ? ఆరంభించినవన్నియు ఆరంభములనబడును. అందువలన యిచ్చట ప్రకరణానుసారముగా సర్వారంభము అనగా సమస్త కార్యములు అనగా కర్మలు. అందువలన స్వధర్మమునకు సంబంధించిన కర్మలుగాని లేక పర ధర్మమునకు సంబంధించిన కర్మలుగాని ఏ కర్మలైననూ అవి యన్నియు త్రిగుణములకు సంబంధించిన కర్మలే. అందువలన అనగా త్రిగుణాత్మకములై యున్నందున అగ్నితో బుట్టిన పొగవలె అగ్నివలెనే దోషములతో కూడినవై యున్నవి.

అభిప్రాయమేమన ? **స్వధర్మమనబడు సహజ కర్మను పరిత్యజించినందువలన మరియు పరధర్మమును గ్రహించినందువలన గూడ దోషము తొలగదు.** పైగా పరధర్మము భయముతో కూడినదై యున్నది. మరియు అజ్ఞానియైన వానిద్వారా సర్వవిధ కర్మలు పూర్తిగా త్యజించుట గూడ సాధ్యముకాదు. అందుచేత సహజ కర్మలను త్యజించరాదు.

ఇచ్చట మనము విచారణ చేయవలసిదేమనగా - కర్మలన్నింటిని నిశ్శేషముగా త్యజించుట అసంభవమా ? అసంభవమైనచో ఆ కర్మలను త్యజించరాదు. లేక సహజ కర్మలను త్యజించుట దోషము కూడానా ? అందువలన -

**పూర్వపక్షము** - ఇందువలన ఏమి సిద్ధించును ? అన్నచో -

**సమాధానము** – సర్వవిధ కర్మలను నిశ్శేషముగా త్యజించుట సాధ్యము కానప్పుడు సహజ కర్మలను త్యజించుట కూడదు. అప్పుడు సిద్ధించుదేమన ? **కర్మలన్నింటిని నిశ్శేషముగా త్యజించుట గుణయుక్తమే.**

**పూర్వపక్షము** – ఇది బాగున్నది. కాని మరి కర్మలన్నింటిని త్యజించుట సాధ్యము కానప్పుడు యింక గుణ దోషముల సమస్యే లేదు గదా ?

**సమాధానము** – అయితే సాంఖ్యవాదుల గుణములవలె ఆత్మ ఎల్లప్పుడూ చలన స్వభావము కలిగియున్నదా ? లేక బౌద్ధమతావలంబకులవలె ప్రతి క్షణమునందును పుట్టి నశించు స్వభావమును కలిగియున్నదా ? రూపము, వేదన, విజ్ఞానము, సంజ్ఞ మరియు సంస్కార రూపమైన పంచ స్కంధములవలె క్రియలే కారకములైయున్నవా ? పై ఈ రెండు కారణముల వలన కర్మలు నిశ్శేషముగా త్యజించుట సాధ్యపడదు.

అయితే పై రెండుగాక మూడవ పక్షము మరియొకటి కలదు. అదేమన ? ఆత్మ కర్మ చేయుచున్నప్పుడు అది సక్రియము అనగా కర్మలు చేయుటయందు నిమగ్నమైనదిగా యుండును. మరియు అది కర్మలు చేయనప్పుడు అది నిష్క్రియమై యుండును. అలా ఒప్పుకొన్నట్లయితే సర్వకర్మలు నిశ్శేషముగా త్యజించుటకు సాధ్యపడును.

ఈ మూడవ దృక్కోణము ననుసరించి చూచిన మనకు తెలియు విశేషమేమన ? **ఆత్మచలన స్వభావము కలదని ఒప్పుకోబడదు. అంతేగాక క్రియకారకము కానేరదు.** అయితే మరి ఏమిటి అన్నచో – తన స్వరూపమునందే దాగియున్న ద్రవ్యమునందే కానరానటువంటి అనగా లేనిదిగా వున్నట్టి క్రియ ఉత్పన్నమగుచుండగా అంతకుముందున్న క్రియ నశిస్తుందా ? **శుద్ధ ద్రవ్యము క్రియాశక్తి కలిగియుండి అవిద్యమానముగా దాగి వుంటుంది.** అదే అవకాశము కలిగినప్పుడు ప్రకటితమై కారకమగుచున్నది. ఇలా చెప్పువారు వైశేషిక మతావలంబకులు.

**పూర్వపక్షము** – అయితే ఈ పక్షము అనగా అభిప్రాయమునందు గల దోషమేమి? అన్నచో –

**సమాధానము** – ఈ మతమునందు గల పెద్ద దోషమేమన ? ఈ మతము భగవంతునికి నచ్చలేదు. అనగా ఒప్పుదలకాదు.

**పూర్వపక్షము** – అదెట్లు తెలియబడును ? అన్నచో –

**సమాధానము** – భగవంతుని అభిప్రాయము ననుసరించి "అసత్యమైన అనగా భ్రాంతిచేత కల్పితమైన వస్తువునకు స్థితి అనగా వునికియే లేదు. అందుకే ఆయన **"నాసతో విద్యతే భావః"** అని చెప్పియున్నారు. వైశేషిక మతానుయాయులు 'అసత్' ను సత్తుగాను, సత్తును అసత్తుగాను చెప్పుదురు.

**పూర్వపక్షము** – భగవంతునికి యిష్టమైనది కాకపోయినను వైశేషికులు చెప్పు మతము న్యాయయుక్తమైనచో ఒప్పుకొనుటలో దోషమేమి ?

**సమాధానము** – అయితే చెప్పెద వినుము. యితరమైన సర్వమతముల ద్వారాను మరియు ప్రమాణముల ద్వారాను యీ మతమునకు విరోధము కలుగుచున్నందున యీ మతము దోషయుక్తమని చెప్పబడినది.

**పూర్వపక్షము** – ఏ విధముగా చెప్పబడినది ?

**సమాధానము** – ద్వ్యణుకము మొదలగు ద్రవ్యములు తమ ఉత్పత్తికి పూర్వమే సంపూర్ణముగా అసత్తులై యుండియే పుట్టుచుండును. మరియు క్షణకాలము మాత్రము వున్నట్లుగా తోచి మరల వెంటనే అసత్ భావమును పొందును. అనగా క్షణకాలమందే పుట్టి నశించుచుండును. అప్పుడు మీరు చెప్పినట్లుగా ఒప్పుకొన్నచో అసత్తును సత్తుగా ఒప్పుకోవలసి వస్తుంది. అట్లుగానిచో – అభావమును అనగా లేమిని అనగా లేని వస్తువును భావము అనగా వున్నట్లుగా ఒప్పుకోవలసి వస్తుంది.

అనగా సత్యమేమన ? పుట్టుక యనునది లేని వస్తువు తాను పుట్టక పూర్వమే లేడికొమ్ములవలె సర్వథా అసత్యమైనది అయి వుండి గూడ **సమవాయము, అసమవాయము మరియు నిమిత్తము** అనబడు మూడు కారణముల సహాయముతో పుట్టుచుండును.

కాని అభావము అనగా సుతరాం లేని వస్తువు ఈ విధముగా ఉత్పన్నమగుచున్నది లేక తన ఉత్పత్తికి కారణ వస్తువును కోరుచుండును అని చెప్పుట కుదరదు. ఏలయన ? కుందేటి కొమ్ములు మొదలగు వాటియందు యిట్టి స్థితి చూడబడుటలేదు.

పుట్టుక కలిగివుంటున్నటువంటి ఘటాదులు భావరూపములే యగుచున్నవని ఒప్పుకొనినచో అవి అభివ్యక్తి అనబడు ఏదో ఒక కారణము యొక్క సహాయముతో పుట్టుచున్నవి అను మాట సహేతుకముగా వుండును.

మరియు అట్లుగాక అసత్తును సత్తుగాను మరియు సత్తు అసత్తుగా మారుటను ఒప్పుకొన్నచో ఎవ్వనికిని ప్రమాణము ప్రమేయాది వ్యవహారములందు నమ్మకమే వుండదు. ఏలయన ? అలా ఒప్పుకొన్నట్లయితే సత్తు సత్తుగానే యుండును మరియు అసత్తు ఎల్లప్పుడూ అసత్తుగానే యుండునన్న నమ్మకము చెడిపోవును.

దీనితోపాటు ఆ "పుట్టుచున్నది" అను వాక్యము ద్వారా ద్వ్యణుక్ మొదలగు ద్రవ్యములు తమ కారణము మరియు ఉనికితో సంబంధమున్నట్లుగా చెప్పుచున్నవి. అనగా ఉత్పత్తికి పూర్వము జరుగు కార్యము అసత్ అనగా లేనిది అగుచున్నది. అంతేగాక తమ కారణముయొక్క వ్యాపారము సహాయముగా తమకు కారణరూపమైన పరమాణువుల తోడను మరియు శక్తితోడను సమవాయురూప సంబంధము ద్వారా ఏకమగుచున్నది. అట్లు ఏకమై కారణముతో గలసి సత్ అగుచున్నది.

అట్టి స్థితియందు అసత్తుకు కారణమైనది సత్తు ఎట్లగుచున్నదో వారే చెప్పవలసి యుండును. అంతేగాక అసత్ అయిన దానికి మరియొకదానితో సంబంధము మాత్రము ఎట్లు సంభవమగును ? ఏలయన్నచో గొడ్రాలిబిడ్డని యొక్క ఉనికి మరియొక సత్ పదార్థముతో సంబంధముగాని లేక దానికి కారణముగాని ఏ విధముగాను ఎవనిచేతను ప్రమాణ పూర్వకముగా సిద్ధింపజేయబడజాలదు.

పూర్వపక్షము - వైశేషిక మతవాదులు లేమియొక్క సంబంధమును ఒప్పుకొనరు. వారు భావరూపమైన ద్వ్యణుక్ మొదలగు ద్రవ్యముల యొక్క సంబంధమును మాత్రమే దానియొక్క కారణముతో సమవాయ సంబంధమును చెప్పుచున్నారు.

సమాధానము - మాట అదికాదు. ఏలయన ? వారి అభిప్రాయము ననుసరించి కార్యకారణ సంబంధము జరుగక పూర్వమే కార్యము యొక్క ఉనికి ఒప్పుకొనబడలేదు. అనగా వైశేషిక మతస్థుడైన కుమ్మరి మరియు కర్ర చక్రము (సారె) మొదలగు క్రియ అరంభము కాక పూర్వమే ఘటము మొదలగువాని అస్తిత్వమును అనగా వునికిని ఒప్పుకొనరు. అంతేకాకుండా మట్టికే ఘటాది ఆకారము ప్రాప్తించినదని వారు అనగా వైశేషికులు ఒప్పుకొనరు. అందుచేత చివరకు అసత్తు యొక్క సంబంధమునే ఒప్పుకొనవలసి వచ్చుచున్నది.

పూర్వపక్షము - అసత్ యొక్క సమవాయ సంబంధము కలిగియుండుట న్యాయ విరుద్ధము కానేరదు.

సమాధానము - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? గొడ్రాలి బిడ్డనికి దేనితోను సంబంధమున్నట్లుగా యింతవరకు ఎచ్చటనూ చూడబడలేదు.

అభావము అనగా లేమియొక్క సమానత్వము వున్నప్పటికి ఘటాదుల ప్రాగభావము, అనగా అవి లేక పూర్వమే వాటిని వున్నట్లుగా తలంచుట యొక్క తన కారణముతో సంబంధము వుండును. గొడ్రాలిబిడ్డని లేమితో కాదు. అందువలన ఈ అభావములకున్న భేదము అనగా భిన్నత్వమును గురించి చెప్పవలసి యున్నది. అదెట్లన ? -

ఒకటి లేకుండుట, రెండు లేకుండుట, అన్నీ లేకుండుట, ప్రాగభావము, ప్రధ్వంసా భావము, అన్యోన్యాభావము, అత్యంతా భావము. ఈ లక్షణములతో ఎవ్వడూ గూడ అభావము యొక్క అనగా లేనటువంటి వస్తువుయొక్క విశేషత్వము అనగా ఆ లేనిదాని గుణగణములు ఎవ్వడు చూపజాలడు.

మరి ఎటువంటి విశేషత్వము లేకున్నప్పటికి ఘటము యొక్క ప్రాగభావమే. కుమ్మరి మొదలగువాని ద్వారా ఘటభావమును పొందియుండునని చెప్పుట మరియు దానియొక్క కపాలమను పేరుగల తన కారణరూపమైన భావముతో సంబంధము కలిగియుండును. మరియు అది అంతయు వ్యవహారమునకు యోగ్యముగా వుండును. కాని అదే ఘటముయొక్క ఏ ప్రధ్వంసా భావము కలదో అది అభావత్వములో సమభావ సంబంధితము కలిగియుండదు. ఈ విధముగా ప్రధ్వంసము మొదలగు అభావములను ఎట్టి స్థితియందును వ్యవహారమునకు యోగ్యముగా ఒప్పుకొనకపోవుట మరియు కేవలము ధ్వణుక్ మొదలగు ద్రవ్యమను పేరుగల ప్రాగభావమును మాత్రమే ఉత్పత్తి మొదలగు వ్యవహారాదులకు యోగ్యమైనట్లుగా తలంచుట అసమంజసమైన అనగా ఒప్పుకొనుటకు వీలుగానిదియే. ఏలయన ? అత్యంతా భావము అనగా అసలే లేకుండుట మరియు ప్రధ్వంసాభావము వలెనే ప్రాగభావము యొక్క అభావత్వమే అయి వున్నది. కావున అందులో విశేషమేమియు లేదు.

**పూర్వపక్షము** – మేము ప్రాగభావమును భావరూపముగా వుండుట చెప్పియుండలేదు గదా ?

**సమాధానము** – అయితే మీరు అభావమునే భావరూపముగా వుండుట చెప్పియున్నా రన్న మాట. అదెట్లన ? ఘటము ఘటరూపముగా అయిపోవుట. వస్త్రము, వస్త్రరూపము అయిపోవుట. కాని ఇట్లు చెప్పుట గూడ అభావము భావరూపముగా అయిపోవుట వలె ప్రమాణ విరుద్ధమైనదియే. సాంఖ్యమతస్తుల పరిణామవాదము గూడ, దానియందు అపూర్వ ధర్మోత్పత్తి మరియు వినాశమును స్వీకరించడము వలన ఆ మతము గూడ యీ విషయమునందు వైశేషికుల మతము కంటె విశేషత్వమేమియు కలది కానిదగుచున్నది.

అభివ్యక్తి అనగా ప్రకటింపబడుట మరియు తిరోభావము అనగా వెనుకకు వెళ్ళుట మొదలగువాటిని స్వీకరించినప్పటికి, అభివ్యక్తి మరియు తిరోభావముల వునికి లేములను నిరూపించుటయందు యింతకు పూర్వమువలెనే ప్రమాణముల ద్వారా యీ మతమునకు గూడ విరోధము తప్పదు.

ఈ విచారణ ద్వారా కారణము కార్యమునందు వుండి వుండుటయే ఉత్పత్తి మొదలగునవి అని నిరూపించువారి వాదము గూడ ఖండించబడుచున్నది.

ఈ విధముగా పై మతములన్నియు ఖండించబడిన అనంతరము సిద్ధించున దేమనగా – ఒకే సత్యతత్త్వము అనగా ఆత్మతత్త్వము అవిద్య ఆధారముగా నటు (గారడీవాడు) ని వలె ఉత్పత్తి మరియు వినాశము మొదలగు ధర్మములతో కూడి అనేక రూపములుగా కల్పించబడు చున్నది. లేక కల్పితమగుచున్నది. భగవంతుని ఈ అభిప్రాయమే. **"నాసతో విద్యతే భావో"** చూ.గీత. 2.16 అను శ్లోకమునందు చెప్పబడియున్నది. అట్లేలయన ? **'సత్' అను ప్రత్యయము అనగా పదార్థమునందు వ్యభిచారము అనగా వికారము జరుగదు.** తదితరమైన (అసత్) సర్వ ప్రత్యయములందు వ్యభిచారము (వికారము) జరుగును. అందువలన **'సత్' పదార్థమొక్కటియే ఏకమాత్రతత్త్వము.**

**పూర్వపక్షము** – భగవంతుని అభిప్రాయము ననుసరించి ఆత్మ నిర్వికార పదార్థమైనచో "నిశ్శేషముగా కర్మలను త్యజించుటకుదరదు" అని ఎట్లు చెప్పుచున్నారు ?

**సమాధానము** – శరీరము అనగా యింద్రియాది రూపములైన గుణములు సత్యవస్తువు లైనను లేక అవిద్యా కల్పిత వస్తువులైననూ అవన్నియు ఆ దేహముతో కూడియున్న కర్మలన్నియు వాటి ధర్మములే అయినప్పుడు ఆత్మయందు అవన్నియు ఆ విద్య కారణముగ ఆరోపితములే గదా ? ఈ కారణముగ **"ఏ అజ్ఞాని గూడ నిశ్శేషముగా కర్మలన్నింటిని ఒక్క క్షణముపాటు గూడ త్యజించజాలడు"** అని చెప్పబడినది.

కాని విద్యద్వారా అవిద్య అంతయు నివృత్తి చెందినప్పుడు జ్ఞాని కర్మలన్నింటిని విశ్శేషముగా త్యజించగలిగియే యుండును. అదెట్లన ? అవిద్య నశించిన తరువాత అవిద్యవలన అధ్యారోపితమైన అనగా అవిద్యా బలముతో కల్పించబడిన వస్తువులన్నియు మిగిలివుండనే

వుండవు. ఉదాహరణముగా తిమిర రోగము చేత కలిగిన దృష్టిద్వారా అధ్యారోపితమైన అనగా కల్పించబడుచున్న యిరువురు చంద్రులు మొదలగునవన్నియు యింక వాటి అంశములు గూడ తిమిర రోగము తొలగిపోయిన వెంటనే అనగా మరుక్షణమునందే నశించిపోయినందువలన యింక మిగిలివుండవు.

అందువలన "సర్వాకర్మాణి మనసా సంన్యాస్యాస్తే సుఖంవశీ" చూ.గీత 5.13 అనగా సర్వవిధ కర్మలను మనసా అనగా మనస్సు నుండి త్యజించి అని చెప్పిన మాటలు సత్యమైనవే. మరియు "**స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతేనరః**" చూ. గీత 18.45 అనగా తమ తమ కర్మలయందు మగ్నమై యున్న మనుష్యుడు సిద్ధిని పొందును. మరియు "**స్వకర్మణా తమ భ్యర్చ్య సిద్ధిం విందతి మానవః**" చూ. గీత 18.46 అనగా మనుష్యుడైనవాడు తన తన అనగా ఈశ్వరునిచేత తనకు విధించబడిన కర్మల ద్వారా ఆ భగవంతుని పూజించి సిద్ధిని పొందును అను మాటలన్నియూ గూడ సరియైనవే అనగా సత్యములే.

జ్ఞాననిష్ఠ యొక్క యోగ్యతారూపమైన ఏ కర్మజనితమైన సిద్ధి చెప్పబడినదో దానియొక్క ఫలభూత జ్ఞాననిష్ఠారూపమైన నైష్కర్మ్యసిద్ధి గూడ చెప్పవలసి యున్నది. అందులకు గాను ముందు శ్లోకము ఆరంభించబడుచున్నది.

**18.49. అసక్త బుద్ధిస్సర్వత్ర జితాత్మా విగతస్పృహః,**
**నైష్కర్మ్యసిద్ధిం పరమాం సంన్యాసేనాధిగచ్ఛతి.**

అనగా - సర్వత్రా ఆసక్త బుద్ధిగలవాడు, అనగా భార్యాపుత్రులు మొదలగు ఆసక్తిక కేంద్రములైనట్టి వాటియందు ఎవని అంతఃకరణమునందు ఆసక్తి పూర్తిగా నశించినదో అనగా తొలగిపోయినదో, ఎవడు జితాత్మ అనగా తన యంతఃకరణమును తన స్వాధీనమునందు వుంచుకొనియున్నాడో ఎవడు స్పృహారహితుడో అనగా దేహము, జీవితము మరియు ప్రాపంచిక భోగములందు కూడ ఎవనికి తృష్ణ- అనగా ఆసక్తి అనగా కోరిక లేదో, అటువంటి ఆత్మజ్ఞాని పరమ నైష్కర్మ్య సిద్ధిని పొందగలడు.

"**నిష్క్రియ బ్రహ్మమే ఆత్మ**" అను జ్ఞానము కలిగిన కారణముగ ఎవనియొక్క సర్వకర్మలు తొలగిపోయినవో ఆతడు 'నిష్కర్మ' అనబడును. దానియొక్క భావమునే "నైష్కర్మ్యము" అని అందురు. మరియు నిష్కర్మతా రూపమైన సిద్ధినే. "నైష్కర్మ్యసిద్ధి" అని అందురు. అట్లుగాక నిష్క్రియమైన ఆత్మ స్వరూపముతో నిలిచియుండునట్టి నిష్కర్మత్వము సిద్ధించుటనే నైష్కర్మ్యసిద్ధియని అందురు. అటువంటి కర్మల వలన కలుగు సిద్ధికంటె విలక్షణమైన అనగా భిన్నముగా యున్నట్టియు మరియు సద్యోముక్తితో కూడియున్నట్టియు (సత్యోముక్తి అనగా వెంటనే, యిప్పుడే కలిగియున్నట్టి) ముక్తి గలవాడు ఉత్తమ సిద్ధి గలవాడు అయి వున్నాడు. అటువంటి వానికి సంన్యాసము ద్వారా అనగా యథార్థమైన జ్ఞానము ద్వారా లేక జ్ఞానపూర్వకమైన సర్వకర్మ సంన్యాసము ద్వారా మోక్షమను లాభమును పొందినవాడు (కలిగినవాడు) సర్వకర్మలను **మనసా**

**సమాధానము** - కాని **"ఆదిత్యవర్ణమైనది, ప్రకాశ స్వరూపమైనది స్వయంజ్యోతి"** అను శబ్దముల ద్వారా ఆత్మ ఆకారము కలదనియే శ్రుతులయందు చెప్పబడినది ?

**పూర్వపక్షము** - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? ఆ వాక్యములు తమః స్వరూపమైన అజ్ఞానమును నిషేధించుట కొఱకు చెప్పబడినవి. అనగా ఆత్మయందు ద్రవ్య గుణము మొదలగు రూపములను నిషేధించుట ద్వారా ఆత్మను అంధకార రూపము కలదిగా ఆరోపించు అవకాశము కలుగును. కావున అట్టి ఆరోపణను నిషేధించుట కొఱకే "ఆదిత్యవర్ణమ్' ' మొదలగు వాక్యములు చెప్పబడినవి. ఏలయన ? "అరూపమైనది" మొదలగు వాక్యము ద్వారా ముఖ్యముగా ఆత్మకు రూపము నిషేధించబడినది. మరియు **ఆత్మయొక్క రూపము యింద్రియములకు తోచునది కాదు.** అందుచేత అట్టి **ఆత్మను ఎవ్వడు గూడ తన యింద్రియము లతో చూడజాలడు.** అది **శబ్దము ద్వారా చెప్ప సాధ్యము కానిది.** అస్పర్శము అనగా చేతుల ద్వారా తాకబడనిది మొదలగు శబ్దముల ద్వారా కూడ **ఆత్మ దేనికీ విషయము కాదు** అని చెప్పబడినది గదా ? మీరెట్లు చెప్పెదరు ?

కావున ఆత్మ జ్ఞానము వంటిది అని చెప్పుట సరికాదు. మరి అలాంటప్పుడు ఆత్మయొక్క జ్ఞానము ఎట్లుండును ? ఏలయన ? జ్ఞానము లన్నియు వేనిని విషయములుగా చేసుకొని ప్రవర్తించునో ఆ విషయాకారముగానే యుండును మరి **ఆత్మయో నిరాకారమైనది. అనగా సొంత ఆకారము లేనిది.** ఆ విధముగా జ్ఞానము మరియు ఆత్మ రెండూ కూడ ఆకారము లేనివగుటచే వాటియందు భావముగాని లేక నిష్ఠగాని ఎట్లు కలుగును ?

**సమాధానము** - అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? **ఆత్మయొక్క అత్యంత నిర్మలత్వము, స్వచ్ఛత్వము** మరియు దానియొక్క **సూక్ష్మత్వము పూర్వ సిద్ధములే అయి వున్నవి.** మరియు ఆత్మవలెనే బుద్ధియొక్క నిర్మలత్వము మొదలగునవి గూడ పూర్వ సిద్ధములే. అందువలన దానియొక్క ఆత్మచైతన్యాకారముగ ఆభాస కలిగియుండుట సంభవము కావచ్చును.

బుద్ధిచేత ప్రకాశింపబడిన మనస్సు, మనస్సుచేత ప్రకాశింపబడిన యింద్రియములు మరియు యింద్రియములచే ప్రకాశమును పొందుచున్న స్థూలదేహము వున్నవి కదా ? అందుచేత ప్రపంచమునందలి సామాన్యజనులు దేహమునందే ఆత్మ దృష్టి కలిగియుందురు.

దేహాత్మవాదులైన లోకాయతులు "చైతన్యముతో కూడియున్న దేహమునే ఆత్మగా తలంచుచున్నారు. ఇంకా కొంతమంది ఆత్మను యింద్రియములను చైతన్యవంతము చేయునదిగాను మరికొంతమంది మనస్సును చైతన్యవంతము చేయునదిగాను మరికొంతమంది బుద్ధినే చేతన పదార్థముగా చూచుచున్నారు.

అనేకమంది ఆ బుద్ధికి గూడ లోపలగా వ్యాపించియున్న **అవ్యక్తమును అవ్యాకృతమను పేరుగల అవిద్యావవస్థనే** అనగా **చిదా భాసునే ఆత్మరూపముగా తలంచుచున్నారు.**

బుద్ధి మొదలు శరీర పర్యంతము అన్నిచోట్ల అనగా అంతటా ఆత్మచైతన్యము యొక్క ప్రకాశము లేక చైతన్యము కలిగియున్న కారణముగ దేహమునే లేక బుద్ధినే ఆత్మగా తలంచుటకు కారణమై యున్నది.

అందువలన యిప్పుడు తేలిన సారాంశమేమన ? ఆత్మవిషయక జ్ఞానము విధేయము అనగా స్పష్టముగా యిదమిద్ధమని చెప్పబడునది కాదు. అయితే మరి విధేయమైనది ఏది ? నామరూపాదులు కలిగియున్నను అనాత్మ వస్తువులయందు ఏ ఆత్మరూపము అధ్యసింపబడు చున్నదో అనగా ఆరోపించబడుచున్నదో అట్టి ఆరోపణను నివారించుటయే కర్తవ్యము అనగా విధేయము. ఆత్మచైతన్యము యొక్క జ్ఞానమును సంపాదించుట కాదు. ఏలయన ? **జ్ఞానము అవిద్య ద్వారా ఆరోపించబడిన సమస్త పదార్థముల ఆకారముల ద్వారానే విశేషముగా గ్రహించబడుచున్నది.**

ఈ కారణముచేతనే విజ్ఞానవాదులైన బౌద్ధులు విజ్ఞానము కంటె వేఱుగ మరియొక వస్తువు లేదు అని చెప్పుచున్నారు. మరియు ఆ జ్ఞానమును 'స్వసంవేద్య' అనగా తనంతట తానుగా తెలియబడునదిగా ఒప్పుకొనిన కారణముగ ప్రమాణములతో నిమిత్తము లేదని వారి వాదము.

ఆ విధముగా బ్రహ్మమునందు ఏ అవిద్య కారణముగ అధ్యారోపణము చేయబడినదో దానిని నిరాకరించుట అనగా తొలగించుటయే కర్తవ్యము. **బ్రహ్మజ్ఞాన సంపాదన కొఱకు ప్రయత్నించుట కర్తవ్యము కాదు.** ఏలయన ? **బ్రహ్మ సర్వవ్యాపకుడు అందువలన ఆయనను వెదకవలసిన పనిలేదు** – అందుకే భాగవతములో ప్రహ్లాదుడు బ్రహ్మను గురించి తన తండ్రితో యిలా అన్నాడు –

"కలడంబోధి కలండుగాలి కలదాకాశంబునన్ గుంభినిన్
కలడగ్నిం దిశలం బగళ్ళ నిశలం ఖద్యోత చంద్రాత్మలన్
కలడోంకారమునన్ త్రిమూర్తులం త్రిలింగ వ్యక్తులందంతటన్
కలడీశుండు కలండు తండ్రి వెదకంగా నేల యీయాయెడన్ ?

చూ. శ్రీమద్భాగవతము సప్తమ స్కంధము

బ్రహ్మ అత్యంత ప్రసిద్ధుడు అనగా సర్వవ్యాపకుడై యున్నప్పటికి సువిజ్ఞేయుడు అనగా **సులభముగా తెలియువాడు. అతి సమీపమునందున్నవాడు** మరియు ఆత్మ స్వరూపుడు అయి వున్నప్పటికి ఆయన వివేకము లేనటువంటి మనుష్యులకు అవిద్యా కల్పితమైన నామరూపముల భేదముతో వారి బుద్ధి భ్రమించియున్న కారణముగ అప్రసిద్ధుడుగాను, దుర్విజ్ఞేయుడు అనగా అతికష్టముగా తెలియువాడుగను, అత్యంత దూరముగా వున్నవాడుగను మరియు మనతో ఎటువంటి సంబంధము లేనటువంటి పరాయివాడుగను తోచుచున్నాడు.

కాని ఏ సాధకుని యొక్క బ్రహ్మాకార బుద్ధి విరమించిపోయినదో, ఎవరు గురువు మరియు పరమాత్ముని దయకు పాత్రులై యున్నారో వారికి యింతకంటె మరింత ప్రసిద్ధమైన, సువిజ్ఞేయమైన, సుఖస్వరూపము మరియు తమకు సమీపముగా కొంచము గూద వుండదు. **"ప్రత్యక్షము, ఉపలబ్ధము అనగా ప్రాప్తించినట్టి ధర్మమయము"** మొదలగు వాక్యముల ద్వారా గూడ యీ మాటే చెప్పబడియున్నది. (చూ. గీత 9.2.)

తమను గొప్ప పండితులుగా తలంచు ఎంతోమంది "ఆత్మతత్త్వము నిర్వికారము అయి వున్నందున దానిని మానవబుద్ధి పొందజాలదని అందువలన సమ్యక్‌జ్ఞానము దుస్సాధ్యమని చెప్పుచుందురు.

ఆ మాట నిజమే – ఏలయన ? ఎవరు గురుపరంపరలేని వారో, ఎవరు వేదాంత వాక్యములను విధి పూర్వకముగా వినియుండలేదో, ఎవరి బుద్ధి ప్రాపంచిక విషయముల యందే చిక్కుపడియున్నదో, ఎవరు యథార్థ జ్ఞానమును కలిగించునట్టి ప్రమాణముల యందు శ్రమించియుండలేదో వారికి బ్రహ్మతత్త్వము దుర్విజ్ఞేయము అయి వున్నమాట సత్యమే.

కాని ఎవరు అందులకు విరుద్ధముగా వుండియున్నారో వారికి మాత్రము, లౌకిక గ్రాహ్యగ్రాహక భేదయుక్తమైన వస్తువులయందు సద్భావమును కలిగియుండుట అనగా నిత్యానిత్య వస్తువివేకము లేక యుండుట అత్యంత కఠినమైన మాట వాస్తవమే. ఏలయన ? వారికి ఆత్మచైతన్యము కంటె వేఱుగ రెండవ పదార్థము తోచనే తోచదు.

ఈ విషయము సరిగ్గా అంతే, వేఱు విధముగా కాదు. ఈ మాటను మేము యింతకు పూర్వమే అనేక యుక్తుల ద్వారా సిద్ధింపజేసియున్నాము. మరియు భగవంతుడు గూడ దేనియందు ప్రాణులన్నియు మేల్కొనుచుందునో జ్ఞానులకు, మునులైనవారికి అది రాత్రియై యుండును" అని చెప్పియున్నారు.

అందువలన స్వరూపమును గ్రహించుటయందు బాహ్యమైన నానాకార భేదబుద్ధి నివర్తించుటయే కారణము. ఏలయన **ఆత్మ ఎన్నడునూ, ఎవ్వరికినీ గూడ అప్రసిద్ధము అప్రాప్తవ్యము, త్యాజ్యము లేక ఉపాదేయము అనగా పొందదగినది కానేరదు.**

ఆత్మను అప్రసిద్ధమైనదిగా ఒప్పుకొన్నట్లయితే సర్వప్రవృత్తులను నిరర్థకములని ఒప్పుకొనుట సిద్ధించును. అంతేకాకుండా అచేతనమైన శరీరము కొఱకు అన్ని విధములైన కర్మలు చేయబడుచున్నవని కల్పించుటకు అవకాశముండదు. అంతేకాకుండా సుఖము కొఱకు సుఖమనియు, దుఃఖము కొఱకు దుఃఖమనియు తలంచుట కుదరదు. అట్లేలయన ? సమస్త వ్యవహారములు మరియు వాటి ప్రయోజనములు అనగా ఫలములు అన్నియు గూడ చివరకు ఆత్మకు సంబంధించిన జ్ఞానమునకు సంబంధించిన విషయములుగా వున్నవని తలంచవలసి వచ్చును.

అందువలన ఏ విధముగా తన శరీరమును గురించి తెలుసుకొనుటకు యితర ప్రమాణములతో పనిలేదో ఆ విధముగానే ఆత్మ అంతకంటే గూడ అనగా దేహముకంటె కూడ ఎక్కువ సామీప్యమున అనగా తన దేహమునందే వుండియున్నందున ఆత్మను గుర్తించుటకు ఎటువంటి ప్రమాణమలతోనూ పనిలేదు. అందుచేత వివేకము గలవారికి ఆత్మనిష్ఠ అత్యంత సులభము.

ఎవరి మతము అనగా అభిప్రాయము ననుసరించి జ్ఞానము నిరాకారము మరియు అప్రత్యక్షము అని తలంచబడుచున్నదో వారికి గూడ జ్ఞేయ పదార్థము యొక్క అనుభవము

జ్ఞానాధీనమే అయి వున్నందున సుఖాదులవలె జ్ఞానము అత్యంత సమీపమున వున్నందున సులభముగ తెలియబడును. ఈ విషయము సర్వాంగీకారమైనదే.

మరియు జ్ఞానమును తెలుసుకొనుటకు ఎటువంటి జిజ్ఞాసతో గూడ పనిలేదు. అందువలన గూడ **జ్ఞానము ప్రత్యక్షమని తెలుసుకొనవలసి యున్నది.** జ్ఞానము గనుక అప్రత్యక్షమై యున్నట్లయితే, యితర జ్ఞేయ వస్తువులవలె దానిని గూడ తెలుసుకొనవలయునన్న జిజ్ఞాస గలిగియుండెడిది. అనగా జ్ఞాతయైన పురుషుడు ఘటాదిరూపమైన జ్ఞేయ పదార్థములను జ్ఞానము తెలుసుకొనవలయునని కోరుకొనునో అదే విధముగా అజ్ఞానమును గూడ యితర జ్ఞానముల ద్వారా తెలుసుకొనవలయునను కోరిక కలిగియుండెడివాడు. అలా జరుగుట లేదు.

అందుచేత **జ్ఞానము అత్యంత ప్రత్యక్షమైన వస్తువు** మరియు ఆ కారణముగానే జ్ఞాత కూడ సులభముగా తెలియబడుచున్నాడు. అందువలన **జ్ఞానమును పొందుట కొఱకు ప్రయత్నము చేయవలసిన అవసరమేమియు లేదు. అనాత్మబుద్ధిని** నివారింపజేయుట కొఱకు మాత్రమే ప్రయత్నము చేయవలసియుండును. అందువలన జ్ఞానము అనగా **జ్ఞాననిష్ఠ సుసంపాద్యము. అనగా అనాయాసముగ లభించునదై** యున్నది.

ఈ జ్ఞాననిష్ఠ ఏ విధముగా చేయవలసియుండును ? అన్నచో అది చెప్పుచున్నారు-

**18.51. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యా౽౽త్మానం నియమ్య చ,**
**శబ్దాదీన్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ.**

అనగా - నిశ్చితమైన అనగా కపటము లేనటువంటి నిశ్చయాత్మకమైన బుద్ధితో కూడియున్న పురుషుడు ధైర్యముతో కర్మ మరియు కరణముల సంఘాత రూపమైన ఆత్మను అనగా ఆత్మతో తాదాత్మ్యను చెందియున్న దేహమును, సంయమించి అనగా తన స్వాధీనము నందుంచుకొని శబ్దాది విషయములను త్యజించి కేవలము శరీర స్థితికొఱకే అనగా శరీర పోషణకొఱకే అవసరమైన విషయములను గ్రహించుచూ వాటిని మించి యితరమైన అనగా సుఖభోగములకు అవసరమగు విషయముల నన్నింటిని త్యజించి శరీర పోషణకు అవసరముగ వస్తువులందు గూడ రాగద్వేషములను త్యజించి దాని తరువాత -

**18.52. వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయ మానసః,**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః.**

అనగా - వివక్త దేశమునందు నివసించువాడు అనగా అడవులు నదీతీరములు, కొండగుహలు మొదలగు ఏకాంత ప్రదేశములందు నివసించు స్వభావము గలవాడు మరియు తేలికయైన ఆహారమును భుజించువాడు ఏకాంత నివాసము తేలిక భోజనము ఈ రెండూ గూడ నిద్ర మొదలగు దోషములను నిర్వర్తించునవి గావున చిత్తమును నిర్మలము చేయుటకు హేతువులగుచున్నవి. అందువలన ఈ రెండు అంతఃకరణ స్వచ్ఛతకు సాధనములుగా తలంచబడుచున్నవి.

మరియు మనస్సు, వాక్కు మరియు దేహమును వశమునందుంచుకొనువాడై అనగా ఏ జ్ఞాన నిష్ఠుడైన యతి యొక్క దేహము, మనస్సు మరియు వాక్కు ఈ మూడింటిని జయించినవారు **"యతవాక్కాయ మానస"** అని అనబడుదురు. ఈ విధముగా **సర్వేంద్రియములను కర్మలనుండి వేఱుచేసి,**

మరియు నిత్యము ధ్యానయోగమునందు లీనమై యుండువాడగునో **ఆత్మ స్వరూపమును గురించి మనస్సునందు విచారించుచుండుటను అనగా మననము గావించు చుండుటను ధ్యానమందురు.** మరియు **ఆత్మయందు చిత్తమును లగ్నముచేసి యుంచుటను యోగమందురు.** ఈ రెండూ అనగా **మననము యోగము** ప్రధానముగా ఎవని నిత్యకర్మలై యుండునో అతనిని **"ధ్యానయోగ పరాయణుడు"** అని అందురు. ఇచ్చట "నిత్య" అను శబ్దము మంత్రములు, జపములు మొదలగు ఇతర కర్తవ్యములు లేకుండుటకుగాను ప్రయోగించబడినది.

మరియు ఈ లోకము మరియు పరలోకమునకు సంబంధించిన భోగములయందు తృష్ణ అనగా ఆసక్తి, అనగా కోరిక లేకుండుటను వైరాగ్యమందురు. అట్టి వైరాగ్యమును ఆశ్రయించి అనగా సర్వకాల సర్వావస్థలయందును వైరాగ్యభావ సంపన్నుడై యుండువాడు.

మరియు -

**18.53. అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్,**
**విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే.**

అనగా - అహంకారము, బలము మరియు దర్పము అనగా గర్వమును త్యజించి దేహము మరియు యింద్రియములయందు అహంభావము అనగా అవియే 'నేను' అను భావము కలిగియుండుట అహంకారమనబడును. కామము అనగా కోరికలు, మరియు ఆసక్తితో కూడియున్న ఏ సామర్థ్యముకలదో దానిని 'బల' మందురు. ఇచ్చట దేహాదులకు సంబంధించిన సామర్థ్యమును బలమని చెప్పుట లేదు. ఏలయన ? అది స్వాభావికమైనది. అందువలన దానిని త్యజించుట సాధ్యపడదు. హర్షము అనగా సంతోషము వలన మరియు ధర్మమును ఉల్లంఘించి అనగా త్రోసిపుచ్చినప్పుడు కలుగు ఏ గర్వము వుండునో దానినే "దర్పము" అని అందురు. అట్లేలయన ? స్మృతి గ్రంథములయందు **"హృష్టో దృప్యతి దృప్తో ధర్మమతిక్రామతి"** ' అనగా హర్షముతో కూడియున్న మనుష్యుడు దర్పమును ప్రదర్శించును, దర్పమును ప్రదర్శించువాడు ధర్మమును ఉల్లంఘించును అనగా అతిక్రమించుచుండును.

**మరియు కోరికనే కామమందురు. ద్వేషమునే క్రోధమందురు.** ఈ రెంటిని అనగా కామ, క్రోధములను మరియు పరిగ్రహమును అనగా గ్రహించుటను కూడ త్యజించి అనగా యింద్రియములు మరియు మనస్సునందుండు దోషములను పరిత్యజించిన తరువాత కూడ శరీర ధారణను గురించిన ప్రసంగముచే లేక ధర్మానుష్ఠాన నిమిత్తముగ ఏ బాహ్య వస్తు సంగ్రహము ప్రాప్తించునో వాటిని గూడ పరిత్యజించి -

మరియు పరమహంస పరివ్రాజకుడు (సంపూర్ణ సంన్యాసి) అయి మరియు **దేహజీవన మాత్రమునందు గూడ మమత్వము లేనివాడై** మరియు అందువలననే ఎవడు శాంతుడై, ఈ విధముగా ఎవడు సర్వవిధ శ్రమలు (కర్మలు) లేనివాడై, జ్ఞాననిష్ఠుడై యుండునో ఆతడు **బ్రహ్మరూపుడుగా యుండుటకు యోగ్యత గలవాడగును.**

ఈ క్రమము ననుసరించి -

**18.54.** బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి,
సమ స్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్.

అనగా - బ్రహ్మను పొందినట్టి పురుషుడు అంతఃకరణము ఆనందముతో నిండియున్నవాడై అనగా ఆధ్యాత్మ ప్రసాదమును పొందిన పురుషుడు ఎన్నడును శోకించడు **మరియు ఎటువంటి వస్తువును పొందవలయునను కోరిక లేకయుండును.** అనగా ఆతని వద్ద నున్న వస్తువు ఏదైన పగిలిపోయినను, తగులబడిపోయినను, నీటియందు కొట్టుకొని పోయినను లేక దొంగలు లేక యితరులు పట్టుకుపోయినను ఒక్కమాటలో ఆతనికి ఎటువంటి నష్టముగాని, కష్టముగాని కలిగిననూ ఏ విధమైన దుఃఖమును పొందదు. ఎటువంటి వస్తువును తనకు కావలయునని కోరడు.

**"నశోచతి, నకాంక్షతి"** అను పదము ద్వారా బ్రహ్మతత్వమును పొందియున్నట్టి పురుషుని యొక్క స్వభావమును గురించి సంక్షిప్తముగా చెప్పబడినది.

ఏలయన ? బ్రహ్మవేత్తయందు లభించని వస్తువుల పట్ల ఆకాంక్ష ఏర్పడదు. అట్లుగాక **"న కాంక్షతి"** కి బదులుగా **"న హృష్యతి"** అని పాఠభేదము చేసుకొనవలయును.

మరియు **ఎవ్వడు సర్వభూతములందును సమానముగ వ్యాపించియున్నాడో** అనగా ఏ మహాత్ముడు తనయందు వలెనే సమస్త భూతములయందును సుఖదుఃఖములను సమముగా చూచునో ఈ వాక్యమునందు ఆత్మను సమభావముతో చూచుట యని చెప్పబడలేదు. అట్లేలయన ? అదైతే **"భక్త్యామా మభిజానాతి"** అను పదము ద్వారా రాబోవు శ్లోకమునందు చెప్పబడును.

అటువంటి జ్ఞాననిష్ఠుడైన పురుషుడు పరమేశ్వరుడనైన నాయొక్క భజన రూపమైన పరాభక్తిని సులభముగా పొందును. అనగా **"చతుర్విధా భజంతేమామ్"** (చూ. గీత **7.16**) అను వాక్యమునందు ఏ చతుర్థభక్తి చెప్పబడినదో దానిని పొందును.

అటు తరువాత ఆ జ్ఞాన లక్షణములు కలిగియున్న మహాత్ముడు -

**18.55.** భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః,
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్.

అనగా - ఆ భక్తిద్వారా నేనెంతటివాడనో మరియు ఎట్టివాడనో అదంతయు తత్వము ద్వారా తెలుసుకొనును. అభిప్రాయమేమన ? నేను ఎంతటివాడనో అనగా ఉపాధులయందు

వ్యాపించుట ద్వారా ఆ విస్తార భేదముతో ఎంతటివాడనో మరియు నేనేవ్వడనైయున్నానో అనగా నిజముగా సమస్తమైన ఉపాధి భేదములు లేనివాడనై సర్వోత్తమ పురుషుడనై మరియు ఆకాశమువలె సర్వవ్యాపకుడనై నేనున్నానో ఆ అద్వైత మరియు వయోభేద మెఱుంగని జన్మ-మరణములు లేని, భయరహితుడనై యున్న మరియు శాశ్వతుడనైన నన్ను తత్వతః అనగా నా తత్వమును గుర్తించును.

నన్ను ఈ విధముగా అనగా తత్వరూపముగా ఎఱింగిన ఆ క్షణమునందే నా యందు ప్రవేశించును అనగా నా రూపమునే పొందును.

ఈ శ్లోకమునందు **"జ్ఞాత్వా" విశతే తదనంతరమ్"** అను వాక్యము ద్వారా జ్ఞానము మరియు దానిని పొందిన తరువాత జరుగు ప్రవేశ క్రియ యీ రెండు అవస్థలు లేక క్రియలు వేఱు వేఱు అర్థములను లేక స్థితులను కలిగిలేవు. అవి మరి యెట్లున్నవన్నచో - ఫలభేదము లేనట్టి జ్ఞానము మాత్రమే వివక్షత కలిగియున్నది. ఏలయన ? **"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"** (చూ. గీత 13.1) అనగా క్షేత్రజ్ఞునిగా కూడ నీవు నన్నుగానే ఎఱుంగుము అని చెప్పియున్నాడు.

**పూర్వపక్షము** - జ్ఞానము యొక్క ఏ పరానిష్ఠ అనగా పరిపూర్ణత గలదో దానిద్వారా నన్ను గుర్తించుము. అని చెప్పుట విరుద్ధముగా వున్నది. విరుద్ధముగా ఎట్లున్న దందురేమో అన్నచో - జ్ఞాతకు ఎప్పుడు ఏ విషయము యొక్క జ్ఞానము కలుగునో ఆతడు అప్పుడే ఆ విషయమును ఎఱుంగును. జ్ఞానముయొక్క ఆవృత్తి అనగా ఒకే జ్ఞానము మరల మరల కలుగుట యను జ్ఞాననిష్ఠతో పనియుండదు. అందువలన ఆతడు (జ్ఞాని) జ్ఞేయ పదార్థమును జ్ఞానము ద్వారా తెలుసుకొనడు. జ్ఞానావృత్తి రూపమైన జ్ఞాననిష్ఠ ద్వారా తెలుసుకొనును అని చెప్పుట పరస్పర విరుద్ధముగా వున్నది.

**సమాధానము** - అందులో దోషమేమియు లేదు. ఏలయన ?

తన ఉత్పత్తి మరియు దాని పరిపక్వత కారణముగ కూడియున్న మరియు ఎటువంటి **విరోధము** లేనటువంటి **జ్ఞానము తనయొక్క స్వరూపానుభవమునందు నిలిచియుండుటయే సహజము.** ఆ నిశ్చయముగా నిలిచి వుండుటనే నిష్ఠ అని చెప్పియున్నాము.

అభిప్రాయమేమన ? జ్ఞానముయొక్క ఉత్పత్తి మరియు అది పరిపక్వతను పొందుటకుగాను ఏ విశుద్ధబుద్ధి మరియు అమానిత్వాది సహాయక హేతువులు (సాధనములు) గలవో వాటన్నింటి సహాయముతోను మరియు శాస్త్రము మరియు ఆచార్యుని ఉపదేశము వలన కలిగినట్టి ఏ "నేను కర్తను" ఇది నేను చేయవలసిన కర్మ మొదలగు కారకభేద బుద్ధివలన కలిగిన సమస్త కర్మలయొక్క సంన్యాస సహితముగా క్షేత్రజ్ఞుడు మరియు ఈశ్వరుని యొక్క ఏకత్వమునకు సంబంధించిన జ్ఞానము కలదో దానియొక్క మరియు ఈశ్వరునియొక్క అనుభవమునందు నిశ్చయముగా నిలిచి వుండవలయును. అట్లు నిలిచి వుండుటనే పరా జ్ఞాననిష్ఠ అని అందురు.

అటువంటి ఈ జ్ఞాననిష్ఠయే "ఆర్తులు" మొదలగు మూడు విధముల భక్తిని ఆధారముగా చేసుకొని నాల్గవ చతుర్థ పరాభక్తి యని చెప్పబడినది. ఆ జ్ఞాన నిష్ఠారూపమైన

**పరాభక్తి ద్వారా సాధకుడు భగవంతుని తత్వరూపముతో** గ్రహించును. అట్లు గ్రహించగానే ఈశ్వరుడు మరియు క్షేత్రజ్ఞ విషయ రూపమువలన కలిగియున్న భేదబుద్ధి పూర్తిగా నివృత్తిని చెందును. అందువలన **జ్ఞాన నిష్ఠారూపమైన పరాభక్తిచే నన్ను గుర్తించును.** అలా చెప్పుటయందు ఎటువంటి విరుద్ధ భావము లేదు.

ఇలా ఒప్పుకొన్నందువలన వేదాంతము, చరిత్ర మరియు పురాణములు మరియు స్మృతిరూపమైన సమస్తమైన నివృత్తి భావమును కలిగించు శాస్త్రములు మొదలగునవన్నియు సార్ధకములగును. అనగా వాటన్నిటి అభిప్రాయము అవిరోధముగా సిద్ధించును.

ఆత్మ తత్వమును గుర్తించినందువలన ఏ **షణాత్రయము** (లోకేషణ, విత్తేషణ మొదలగు) వాటియందు విరక్తుడై తిరిగి భిక్షాభావమును కలిగియుండును. **పురుషార్ధమును పొందుటకు అంతరంగ సాధనమై వున్నందున సంన్యాసమే అన్ని విధములైన తపస్సుల కంటె మిన్న అనగా శ్రేష్ఠమైనదని చెప్పబడినది.** సంన్యాసమొక్కటియే వాటినన్నింటిని అధిగమించ సామర్థ్యము కలిగియున్నది. **సర్వవిధ కర్మలను త్యజించుటకు మారు పేరే సంన్యాసము.** వేదములను మరియు ఈ లోకమును మరియు పరలోకమును గూడ పరిత్యజించి, ధర్మాధర్మములను త్యజించి మొదలగు శాస్త్రవాక్యములు సంన్యాసము యొక్క శ్రేష్ఠత్వమునకు ప్రమాణముగ ఎన్నో చెప్పబడియున్నవి. మరియు యిచ్చట గూడ సంన్యాసము యొక్క విశిష్టతను గురించి చెప్పు ఎన్నో వాక్యములు చెప్పబడియున్నవి.

ఆ వాక్యములనన్నింటిని వ్యర్థములైనవిగా తలంచుట సరికాదు. మరియు అర్థవాద రూపముగా తలంచుట కూడ సరికాదు. ఏలయన ? అవియు తమ తమ ప్రకరణములందు సార్ధకములై యున్నవి.

ఇంతేకాకుండా **అంతరాత్మయొక్క క్రియారాహిత్యత్వ రూపమునందు నిశ్చయ బుద్ధితో నిలిచియుండుట యే మోక్ష మనబడుచున్నది.** ఆ కారణము వలన గూడ యింతకు పూర్వము చెప్పినమాటయే సిద్దించుచున్నది. అట్లేలయన ? తూర్పు సముద్రము పైకి వెళ్ళగోరుచున్న వానియొక్క మరియు అందులకు విరుద్ధముగా పడమర దిక్కున గల సముద్రము పైకి వెళ్ళగోరు వానివెంట పయనించుట సరియగు మార్గమనిపించుకొనబడదు.

అంతరాత్మ విషయికమైన ప్రతీతిని గురించి నిరంతరము ఆలోచించునటువంటి తీవ్రతను "జ్ఞాననిష్ఠ" యని అందురు. అది అనగా **ఆ నిష్ఠ కర్మలతో కూడియుండుటపై సముద్రయాన ఉదాహరణము వలె అత్యంత విరుద్ధము.**

ప్రమాణవేత్తలైనవారలు పర్వతము మరియు ఆవగింజకు గల భేదముతో సమానమైనదని నిర్ణయించియున్నారు. కావున **సర్వకర్మ సంన్యాస పూర్వకముగానే జ్ఞాననిష్ఠ కలిగియుండవలయునని సిద్ధించినది.** అనగా నిర్ణయమైనది. తన కర్మల ద్వారా భగవంతుని పూజించుట రూపముగా తలంచబడుచున్న **భక్తియోగము యొక్క సిద్ధి అనగా ఫలము జ్ఞాననిష్ఠను కలిగియుండుటకు యోగ్యతను కలిగించు సాధనము. భక్తియోగము వలన కలుగు ఏ జ్ఞాననిష్ఠ కలదో అది చివరకు మోక్షరూపమైన ఫలమును యిచ్చునదై యుండును.** ఆ భగవద్భక్తియోగము యొక్క యిప్పుడు శాస్త్రాభిప్రాయము యొక్క ఉపసంహార ప్రకరణమునందు శాస్త్రాభిప్రాయము యొక్క నిర్ణయమును దృఢపరచుటగాను స్తుతింపబడుచున్నది.

**18.56. సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః,**
**మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్.**

అనగా - సర్వకాల సర్వావస్థలయందును సర్వవిధములైన కర్మలు చేయువాడు అనగా నిషిద్ధ కర్మలను గూడ చేయువాడు మద్వ్యపాశ్రయ భక్తుడో, ఎవడు వాసుదేవుడనైన నన్నే ఆశ్రయించి యున్నాడో తన సర్వస్వమును నాకే అర్పించియున్నాడో, నా భక్తుడో వాడు గూడ **ఈశ్వరుడనైయున్న నా అనుగ్రహము వలన విష్ణువు యొక్క శాశ్వతమైన, నిత్యమైన, ఎన్నడూ నశించనటువంటి స్థితిని పొందును.**

అట్టి స్థితి యున్నది గావున -

**18.57. చేతసా సర్వకర్మాణి మయి సంన్యస్య మత్పరః,**
**బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ.**

అనగా - నీవు దృష్టము అనగా యింద్రియగోచరమగునది మరియు అదృష్టము అనగా యింద్రియగోచరము కానటువంటి ఫలములను యిచ్చునటువంటి సమస్తమైన కర్మలను వివేకముగల బుద్ధితో అనగా "యత్కరోషి యదశ్నాసి (చూ. గీత. 9-27) అను శ్లోకమునందు చెప్పబడిన భావముతో ఈశ్వరుడనైన నాయందు సమర్పించి మరియు నన్నే భజించువాడై అనగా వాసుదేవుడనైన నేనే ఎవనికి పరమగతి; ఏకమాత్ర దిక్కైయున్నానో నాయందే తన బుద్ధినంతటిని లగ్నము చేసినవాడై అనగా ఆ విధమగు బుద్ధియోగమును అవలంభించి, నిరంతరముగా నాయందే చిత్తమును లగ్నము చేసియుండునో...

**భక్తుడైనవాడు బలిమి విశ్వమువీడు,**
**దిక్కులేక తుదకు దీనుడగును,**
**హరిని జేరగోరు 'హో'యని చింతిల్లు**
**గుణ్యరామరాయ గురువిధేయ.**

**18.58. మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి,**
**అథ చేత్త్వమహంకారాన్న శ్రోష్యసి వినంక్ష్యసి.**

అనగా - నాయందు చిత్తము గలవాడవై నీవు సర్వవిధ కష్టములను అనగా జన్మ-మరణరూపమైన ప్రపంచమునకు సంబంధించిన సర్వకారణములను నాయనుగ్రహముచే అధిగమించెదవు. అన్నింటిని దాటిపోయెదవు. కాని నీవు నాచే చెప్పబడినట్టి మాటలను అహంకారము చేత "నేను సర్వజ్ఞుడను" అని తలంచి వినకయున్నచో, గ్రహించనిచో నీవు సర్వనాశమైపోయెదవు. సర్వవిధములైన నష్టములను పొందెదవు.

నీవు "నేను స్వతంత్రుడను" అని తలంచకూడదు. "ఇతరులు చెప్పినది నేను ఎందుకు చేయవలె" అని గూడ తలంచరాదు.

**18.59. యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,**
**మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి.**

అనగా - ఒకవేళ నీవు అహంకారమును ఆశ్రయించి "నేను యుద్ధము చేయను" అని తలంచుచున్నట్లయితే, అలా నిశ్చయించుకొనుచున్నట్లయితే అటువంటి నిశ్చయము నిలువనేరదు. ఏలయన ? నీ యొక్క ప్రకృతి అనగా **నీయందు గల నీ క్షత్రియ స్వభావము నీ చేత యుద్ధమే చేయించును.**

*అట్లేలయన ?*

**18.60. స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా,**
**కర్తుం నేచ్ఛసి యన్మోహాత్కరిష్యస్యవశో ఽపితత్.**

అనగా - ఓ కౌంతేయా ! నీవు నేనే యింతకు పూర్వము చెప్పినట్లుగా శూరత్వము, వీరత్వము మొదలగు నీ స్వాభావిక గుణసంబంధమైన కర్మలు ఆచరించుటకు బద్ధుడవైయున్నావు. వాటికి కట్టుబడియున్నావు. అందుచేత ఏ కర్మను నీవు మోహము వలన మరియు అవివేకము వలన చేయకోరుట లేదో. కాని నీ **స్వభావము కారణముగా నీకు యిష్టము లేకున్నను వివశుడవై ఆ కర్మమునే** అనగా **యుద్ధమునే చేయుదువు.**

**18.61. ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే ఽర్జున తిష్ఠతి,**
**భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా.**

అనగా - అర్జునా ! ఈశ్వరుడు అనగా అందరినీ శాసించుచున్నట్టి **నారాయణుడు** సమస్తమైన ప్రాణుల యొక్క హృదయములయందు నిండియున్నాడు. ఎవడైతే తెల్లని, స్వచ్ఛము మరియు శుద్ధమైనట్టి అంతఃకరణము గలవాడై యుండునో అనగా పవిత్రమైన అంతఃకరణము గలవాడు అర్జునుడు. ఏలయన ? "అహశ్చ కృష్ణమహరర్జునంచ" అను వాక్యమునందలి "అర్జునుడు" అను శబ్దము శుద్ధత్వమును సూచించునదిగా వున్నది.

ఆ ఈశ్వరుడు ఏ విధముగా స్థిరముగా యున్నాడు ? అన్నచో చెప్పుచున్నాడు.

**సమస్తమైన ప్రాణులను - యంత్రముపై ఎక్కిన బొమ్మలవలె భ్రమింపజేయుచు అనగా త్రిప్పుచూ వుండియున్నాడు.** ఇచ్చట ఈ భ్రాంతి అను శబ్దము వ్యర్థముగా వచ్చినది. అనగా ఏ విధముగా యంత్రముపై కూర్చున్న బొమ్మలు మొదలగువాటిని ఆటగాడు మాయగా త్రిప్పుతూ తాను మాత్రము స్థిరముగానే యుండునో ఆ మాదిరిగానే ఈశ్వరుడు అందరి హృదయము - దేహములందు - నిండియున్నాడో ఈ విధముగా దీనికి సంబంధము కలదు.

**18.62. తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత,**
**తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్.**

అనగా - ఓ భారత ! నీవు సర్వభావముతో ఆ ఈశ్వరుని శరణుపొందుము అనగా ఈ ప్రపంచమునకు సంబంధించిన సమస్తమైన దుఃఖములను నశింపజేసుకొనుట కొరకు

మనసా, వాచా మరియు దేహముతో సహా అన్ని విధములుగానూ ఆ ఈశ్వరుని యొక్క ఆశ్రయమునే గ్రహించుము. అప్పుడు ఆ ఈశ్వరుని అనుగ్రహము వలన పరమోత్తమమైన శాంతిని అనగా పరమ సుఖమును మరియు శాశ్వతమైన స్థానమును అనగా విష్ణువునై యున్న నా యొక్క నిత్యధామమును పొందెదవు.

**18.63. ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా,**
**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు.**

అనగా – సర్వజ్ఞుడనగు ఈశ్వరుడనై యున్న నేను నీకు ఈ అత్యంత రహస్యాతి రహస్యమును మరియు అత్యంత గోపనీయము అనగా ఎవ్వరికీ చెప్పక దాచి వుంచదగిన రహస్యముతో కూడిన జ్ఞానమును చెప్పియున్నాను. ఈ పైన చెప్పిన శాస్త్రరహస్యమును అనగా పైన చెప్పిన మాటల యొక్క సమగ్రమైన అర్థమును విచారించి, దీనిని గురించి చక్కగా మననము గావించుకొని అప్పుడు నీవు నీ యిష్టము వచ్చినట్లుగా వ్యవహరించుము.

అయినప్పటికీ యింకొక్క మాట చెప్పెదను. వినుము –

**18.64. సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః,**
**ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్.**

అనగా – దాచివుంచదగిన రహస్యములన్నింటిలోను అత్యంత గోపనీయమైన రహస్యముతో నిండియున్న నా పరమోత్తమములైన మాటలు నీవు తప్పక వినుము. అనగా ఏ మాటలు యింతకు పూర్వము నేను నీతో అనేక పర్యాయములు చెప్పియున్నానో వాటినే నీవు మరల ఒక్కసారి వినుము.

నేను చెప్పునదంతయు దేనికో భయపడిగాని లేక నా స్వలాభము కొరకుగాని చెప్పుట లేదు. కాని నీవు నాకు ఒకే ఒక్క ప్రియమైనవాడవు అనగా నాకు నీకంటే ప్రియమైనవాడు మరొకడు లేడు. ఈ ఒక్క మాటను గుర్తించుకొని, కేవలము ఈ కారణముగానే నీకు మేలును అనగా హితమును కలిగించు మాటను అనగా పరమోత్తమమైన జ్ఞానమును పొందుటకు సాధనమైన దానిని చెప్పెదను. ఏలయన ? ఈ సాధనమే సర్వహితములకంటే ఉత్తమమైన హితమును కలిగించునదై యున్నది.

అట్టి హితమును కలిగించు సాధనమెద్దియో చెప్పుచున్నారు –

**18.65. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే.**

అనగా – నీవు నాయందు మనస్సు గలవాడవుకమ్ము అనగా నాయందే నీ చిత్తమును ఎల్లప్పుడూ నిలిపివుంచుము. నా భక్తుడవు కమ్ము అనగా ఎల్లప్పుడూ నా భజన చేయుచుండుము. నన్నే పూజించుచుండుము. మరియు నాకే నమస్కరించుచుండుము.

ఆ విధముగా చేయుచూ అనగా వాసుదేవుడనైన నాయందే నీ యొక్క సాధ్య, సాధన మరియు వాటి ప్రయోజనములనన్నింటిని నాకే సమర్పించితివేని తుదకు నీవు నన్నే పొందెదవు. ఈ విషయమునందు నేను నిజముగా ప్రతిజ్ఞ చేయుచున్నాను. అట్లేలయన ? నీవు నాకు అత్యంత ప్రియమైనవాడవు.

ఇంత చెప్పుట యందు గల అభిప్రాయమేమన ? ఈ ప్రకారముగా భగవంతుడు చేసిన నిజమైన ప్రతిజ్ఞను విని, తెలుసుకొని మరియు భగవంతుని యొక్క **భక్తి యొక్క ఫలము మోక్షమును ప్రసాదించుటకు ఏకైక సాధనమని తెలుసుకొని ప్రతి మానవుడూ కూడ భగవంతుని శరణుపొంది ఆయనయందే భక్తి భావము కలిగియుండవలయును.**

కర్మయోగనిష్ఠకు సంబంధించిన పరమ రహస్యము అయిన ఈశ్వర శరణాగతిని వుపసంహరించి దాని తరువాత యిప్పుడు కర్మయోగనిష్ఠ యొక్క ఫలరూపమైన, సమస్త వేదాంత గ్రంథములయందు చెప్పబడిన యదార్థ జ్ఞానమును గురించి చెప్పవలసి యున్నది. అందులకు గాను భగవంతుడు యిట్లు చెప్పినాడు -

**18.66. సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః.**

అనగా - సమస్త ధర్మములను అనగా భూమిమీద ఎన్ని ధర్మములు ప్రచారము నందున్నవో వాటినన్నింటిని, యిచ్చట నైష్కర్మ్య అనగా ఎటువంటి కర్మలు లేనటువంటి, సిద్ధాంతమును ప్రతిపాదించవలసియున్నది. అందుచేత 'ధర్మ' శబ్దము ద్వారా అధర్మమని గూడ గ్రహించబడుచున్నది. "ఎవ్వడు చెడ్డ కర్మలు చేయుట నుండి విరక్తిని చెందియుండలేదో అటువంటివాడు ధర్మసమ్మతము, ధర్మసమ్మతము కాని రెండు విధములగు కర్మలను త్యజించి' ' మొదలగు మాటలు శృతి, స్మృతి గ్రంథముల యందు గూడ యీ విషయమే చెప్పబడినది.

**సర్వధర్మములను త్యజించి, సర్వకర్మలను సంన్యసించి ఒక్కడనైన నాయందు శరణుపొందుము.** అనగా అట్లేలయన ? నేను అందరి యొక్క ఆత్మను, సమభావముతో సర్వభూతములయందును నిశ్చలముగా వుండియున్న ఈశ్వరుడను, అచ్యుతుడను మరియు గర్భము, జన్మము, వృద్ధత్వము మరియు మరణము లేనివాడనై యున్నాను. అటువంటి ఏకమాత్రుడనైన నాయందు శరణుపొందుము. అభిప్రాయమేమన ? **పరమేశ్వరుడగు నాకంటే వేరుగ ఏమియూ లేదు. అట్టి నిశ్చయమును పొందుము.**

ఈ విధముగా నిశ్చయించుకొనునట్టి నీవంటివారికి నా స్వరూపమును ప్రత్యక్షము చేయుదును. అట్లు చేసి సమస్తమైన ధర్మాధర్మ బంధన రూపమైన పాపముల నుండి ముక్తులను గావించెదను. "నేను సమస్త ప్రాణుల హృదయముల యందును వున్న ప్రకాశమయమైన జ్ఞానమను దీపము ద్వారా అజ్ఞానజనితమైన అంధకారమును నశింపజేయుదును." (చూ. గీత. 10.11) అందువలన నీవు చింతంచవలదు.

# 19. శాస్త్రము యొక్క ఉపసంహార ప్రకరణము

ఈ గీతాశాస్త్రమునందు నిశ్చయించబడినది పరమకాల్యాణకరమైన మోక్షమునకు సాధనరూపమైనది జ్ఞానమా లేక కర్మలా లేక రెండూనా ? అను ఈ విషయము నిర్ణయించవలసి యున్నది.

**పూర్వపక్షము** – అసలు ఈ సందేహము ఎందుకు కలుగుచున్నది ?

**సమాధానము** - ఏలయన ? "యజ్జ్ఞాత్వా ౭ మృతమశ్నుతే (చూ. గీత. 13.12) తతోమాం తత్వతో జ్ఞాత్వా విశతే తదనంతరం" (చూ. గీత. 18.55) అనగా దేనిని పొంది అమరత్వమును పొందునో, తదనంతరము అనగా దాని తరువాత నన్ను తత్వతః గుర్తించి నాయందే ప్రవేశించునో మొదలగు వాక్యములు కేవలము జ్ఞానము వలననే మోక్షము కలుగునని చెప్పుచున్నవో లేక "నీకు కర్మ చేయుటయందే అధికారము కలదు. కావున నీవు కర్మలే చేయుము." మొదలగు వాక్యములు కర్మలు చేయుట అవశ్యక కర్తవ్యములని చెప్పు చున్నవో ...

ఈ విధముగా జ్ఞానము మరియు కర్మలు రెండూ కర్తవ్యములేయని ఉపదేశించి యున్నందున, బహుశా రెండూ కలిసి మోక్షమునకు సాధనములగునేమోయను సంశయము కలుగవచ్చును.

**పూర్వపక్షము** – కాని ఈ విధముగా చర్చించినందువలన కలుగు ఫలమేమి ?

**సమాధానము** – ఫలమేమన ? ఈ మూడింటిలో నుండి ఏదో ఒకదానిని పరమకల్యాణమునకు అనగా మోక్షమునకు సాధనముగా నిశ్చయించుట. అందువలన ఈ విషయమును గురించి విస్తారపూర్వకముగా చర్చించవలసి యున్నది.

## సిద్ధాంత ప్రతిపాదన

**కేవలము ఆత్మజ్ఞానమే** పరమకల్యాణమునకు **అనగా మోక్షమునకు సాధనమై యున్నది.** ఏలయన ? భేద ప్రతీతి అనగా భేదమున్నట్లుగా కలుగు భ్రాంతిని నివర్తింప జేయునదైయున్న కారణముగ మోక్షప్రాప్తియే దానికి హద్దు అనగా అంతము.

ఆత్మయందు క్రియ, కారకము మరియు ఫలవిషయకమైన భేదబుద్ధి అవిద్య కారణముగ ఆరంభము నుండి కలుగుచున్నదే. "కర్మలు నావి. నేను వాటికి కర్తను. నేను ఫలానా ఫలమునాశించి ఈ కర్మ చేయుచున్నాను" ఈ విధముగా తలంచు అవిద్య అనాది కాలమునుండి వచ్చుచున్నది.

"కేవలము ఒక్కడైన నేను అకర్తను అనగా ఎటువంటి కర్మలు చేయువాడను కాను. క్రియలు లేనటువంటి మరియు వాటి ఫలములను గూడ కోరనటువంటి ఆత్మనై యున్నాను. నాకంటే వేరుగా మరొకడు ఈ ప్రపంచమునందు లేడు" అనునటువంటి ఆత్మ విషయికమైన జ్ఞానము ఈ అవిద్యను నశింపజేయునదై యున్నది. అట్లేలయన ? ఇటువంటి ఆత్మజ్ఞానము కలుగగానే కర్మప్రవృత్తికి కారణరూపమైన భేదబుద్ధి తనంతట తానుగా నశించును.

పై వాక్యమునందలి 'తు' శబ్దము రెండు పక్షములను నిరాకరించుటకు అనగా నివృత్తి చేయుటకు వాడబడినది. అనగా **మోక్షము కర్మల వలన గాని లేక జ్ఞానకర్మల సముచ్చయము వలన గాని లభించదు.** ఈ విధముగా 'తు' శబ్దము రెండు పక్షములను ఖండించుచున్నది.

**మోక్షము అకార్యము అనగా స్వతఃసిద్ధమైనది.** అందువలన కర్మలను మోక్షమును పొందుటకు సాధనముగా ఒప్పుకొనుట కుదరదు. అట్లేలయన ? ఏదైనా నిత్యము అనగా స్వతఃసిద్ధమైన వస్తువు కర్మలు లేక జ్ఞానము ద్వారా ఉత్పత్తి చేయబడదు.

**పూర్వపక్షము** – అలా అయితే కేవల జ్ఞానము గూడ వ్యర్థమన్నట్లే గదా ?

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? అవిద్యను నశింపజేయునదై యున్నందున దానికి అనగా జ్ఞానమునకు మోక్షప్రాప్తి రూపమైన ఫలము లభించువరకు సాధనరూపముగా వుండు అవకాశమున్నది. అనగా దీపము యొక్క ప్రకాశమునకు రజ్జువు అనగా త్రాడు మొదలగు వస్తువుల యందు కలుగునటువంటి సర్పాదుల భ్రాంతిని మరియు అంధకారమును నశింపజేయుటయే ఫలమైయున్నదో మరియ ఏ విధముగా ఆ ప్రకాశము యొక్క ఫలము సర్వవిషయికమైన వికల్పమును అనగా భ్రాంతిని తొలగించి, కేవలము రజ్జువును ప్రత్యక్షముగావించి సమాప్తిని పొందుచున్నదో ఆ విధముగానే అవిద్యారూపమైన అంధకారమును నశింపజేయునటువంటి ఆత్మజ్ఞానము యొక్క ఫలము గూడ కేవలము ఆత్మస్వరూపమును ప్రత్యక్షముగావించిన తరువాతనే సమాప్తిని పొందుట చూడబడుచున్నది.

వేటియొక్క ఫలము ప్రత్యక్షముగా వుండునో, అటువంటి కట్టెలను చీల్చుట లేక అరణీమంథమును అనగా రెండు కర్రముక్కలను రుద్ది అగ్నిని పొందుట అనగా అగ్నిని పుట్టించుట మొదలగు క్రియలున్నవో, ఆ కార్యములందు నిమగ్నమైయున్న కర్త మొదలగు కారకములను అనగా సాధనములను అనగా ఒక కట్టె రెండుగా చీలిపోవుట లేక అగ్ని ప్రజ్వలించుట అనగా మండుట మొదలగు ఫలములకంటే మరేదైన అన్యము అనగా యితర ఫలములను యిచ్చునట్టి కర్మలయందు ప్రవృత్తి కలుగనేరదు. అదే విధముగా దేనియొక్క ఫలము ప్రత్యక్షముగా వుండునో అటువంటి జ్ఞాననిష్ఠారూపమైన క్రియయందు లగ్నమైయున్న జ్ఞాత (ఎరుంగువాడు) మొదలగు కారకముల యొక్క గూడ ఆత్మకైవల్యరూపమైన ఫలముకంటే వేరుగా ఫలమును పొందించు మరో యితర కర్మలయందు ప్రవృత్తి కలుగనేరదు. **అందువలన జ్ఞాననిష్ఠ కర్మతో జరుగనేరదు.**

భోజనము మరియు అగ్నిహోత్రము మొదలగు క్రియలవలె దీనియందు గూడ సముచ్చయము సంభవమగును అని చెప్పుట సరికానేరదు. ఏలయన ? దేనియొక్క ఫలము కైవల్యమో అనగా మోక్షమో అట్టి జ్ఞానము కలిగిన తరువాత కర్మ ఫలమును పొందవలయుననెడి కోరిక కలుగనేరదు. అదెట్లన ? పరిపూర్ణమైన జలాశయము కనుపించిన తరువాత బావి లేక చెరువు మొదలగువాని జలములను పొందవలయుననెడు కోరిక కలుగనేరదు. అదే విధముగా దేనియొక్క ఫలము మోక్షమై యున్నదో అటువంటి జ్ఞానమును పొందిన పిదప

క్షణిక సుఖరూపమైన యితర ఫలములను లేక అందులకు సాధనరూపమైన కర్మలు చేయు కోరిక కలుగనేరదు.

అట్లేలయన ? ఏ మనుష్యుడు రాజ్యమును పొందింపజేయు కర్మలయందు నిమగ్నమైయున్నాడో ఆతని ప్రవృత్తి క్షేత్రప్రాప్తి మాత్రమునే ఫలముగా కలిగియున్న చిన్ని చిన్ని కర్మలయందు కలుగనేరదు. అంతేకాదు. అటువంటి కర్మలు చేయవలయునన్న కోరిక గూడ కలుగనేరదు.

ఆ విధముగా యిప్పుడు సిద్ధించినదేమన ? **పరమకల్యాణమునకు సాధనమైనది కర్మయుకాదు. మరియు జ్ఞాన కర్మల సముచ్చయము కాదు.** మరియు మోక్షము మాత్రమే దేనియొక్క ఫలమై యున్నదో అటువంటి జ్ఞానమునకు కర్మల యొక్క అవశ్యకత లేక సహాయము కించిత్తు కూడా లేదు. ఏలయన ? జ్ఞానము అవిద్యను నశింపజేయునదై యున్నది. అందువలన **జ్ఞానమునకు కర్మలతో విరోధమే గాని సహయోగము లేదు.**

అంధకారమును నశింపజేయునది అంధకారముగాదని అందరకు తెలిసిన విషయమే గదా ! అందువలన కేవలము **జ్ఞానమే పరమ కల్యాణమునకు అనగా మోక్షమునకు ఏకమాత్ర సాధనము.**

**పూర్వపక్షము** – ఈ సిద్ధాంతము సరికాదు. ఏలయన ? నిత్యకర్మలు చేయకుండిన ప్రత్యవాయము అనగా దోషము కలుగును మరియు మోక్షము నిత్యమైనది గదా ! భావమేమన? కేవలము జ్ఞానము వలననే మోక్షము కలుగునని యింతకు పూర్వము చెప్పియున్నారు. అది సరికాదు. ఏలయన ? వేదశాస్త్రములందు చెప్పబడిన నిత్యకర్మలు చేయకుండిన యెడల నరకాది ప్రాప్తి రూపమైన దోషము కలుగును.

అలా అయితే కర్మల నుండి విడుదల జరుగనే జరుగదని చెప్పిన ఎడల మోక్షమునకు అవకాశమే వుండదని చెప్పినను దోషముండదు. ఏలయన ? మోక్షము నిత్యసిద్ధమై యున్నది కదా ? నిత్యకర్మలను ఆచరించినందున ఎటువంటి దోషము వుండదు. నిషిద్ధకర్మలను పూర్తిగా త్యజించినందున అనిష్టము అనగా పాపయోనుల యందు జన్మ కలుగదు. కామ్యకర్మలను త్యజించినందువలన మంచి యోనుల యందు గూడ జన్మ కలుగదు. మరియు వర్తమాన అనగా యిప్పుడున్న శరీరమును కలిగించినటువంటి కర్మల యొక్క ఫలమును యిప్పుడు అనుభవించుచున్నందున అది గూడ నశించినందున ఈ యిప్పుడున్న శరీరము నశించగానే మరల తిరిగి రెండవ శరీరము కలుగుటకు కారణమే వుండనందున మరియు శరీర సంబంధమైన ఆసక్తి మొదలగునవి చేయనందున ఏ స్వరూపమునందు నిలచియుండునో అదియే కైవల్యము. అందువలన ఎటువంటి ప్రయత్నము చేయకయే కైవల్యము సిద్ధించును.

**సమాధానము** – కాని పూర్వ పూర్వ అనేక జన్మలయందు చేసియున్నట్టి స్వర్గ-నరకాది ప్రాప్తి రూపములైన ఫలమును యిచ్చునటువంటి ఏ అనేకానేక అనారబ్ధ ఫలములు అనగా సంచిత కర్మలు గలవో వాటన్నింటి యొక్క ఫలముల భోగము జరుగనందున అవి నశింపనేరవు గదా ? మరి వాటి సంగతేమగును ?

**పూర్వపక్షము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? నిత్యకర్మల అనుష్ఠానమునందు జరుగు పరిశ్రమ రూపమైన దుఃఖము యొక్క భోగము ఆ సంచిత కర్మల ఫలభోగముగా తలంచబడుచున్నది. అట్లుగాకున్న ప్రాయశ్చిత్తము వలె నిత్యకర్మలు గూడ పూర్వము చేయబడిన కర్మల ఫలభోగముగా ఎంచబడుచున్నవి. మరియు ప్రారబ్ధకర్మల యొక్క ఫలము భోగము వలన నశించును. అటుపైన క్రొత్త కర్మలు ఆరంభించనందున కైవల్యము ఎటువంటి ప్రయత్నము లేకయే సిద్ధించును.

**సమాధానము** – ఈ సిద్ధాంతము సరిగాదు. ఏలయన ? ఆ "తమేవ విదిత్వాతి మృత్యుమేతి నాన్యః పంథా విద్యతే ऽయనాయ" (చూ. శ్వేతాశ్వతరోపనిషత్తు 3.8) అనగా **"ఆ పరమాత్మను గుర్తించిన మనుష్యుడు మాత్రమే మృత్యువు నుండి తప్పించుకొనును.** అంతకంటే వేరు మార్గము లేదు". **ఈ విధముగా మోక్షస్థితిని పొందుటకు విద్య కాకుండా యితర మార్గము లేదని చెప్పు శ్రుతులున్నవి.** ఏ విధముగా చాపనో లేక చర్మమునో చుట్టినట్లుగా ఆకాశమును చుట్టుట సంభవము కాదో ఆ విధముగానే అజ్ఞానికి ముక్తి అనగా మోక్షము అసంభవమని చెప్పు శ్రుతులు అనేకములున్నవి. మరియు పురాణములు మరియు స్మృతి గ్రంథములయందు గూడ **"జ్ఞానము ద్వారానే కైవల్యము ప్రాప్తించును"** అని చెప్పబడియున్నది. **"జ్ఞానదేవతు కైవల్యం".**

అదిగాక ఈ సిద్ధాంతమునందు ఏ కర్మల ఫలము భోగించుటకు యింకా లభించుట ఆరంభము కాలేదో అటువంటి పూర్వము చేయబడినట్టి పుణ్యకర్మల నాశము గూడ ఆరంభము కానందున గూడ యీ సిద్ధాంతము సరిగాదు. అనగా ఏ విధముగా పూర్వము చేయబడినట్టి సంచిత పుణ్యములు అనుభవించబడుట సంభవమో ఆ విధముగానే సంచిత పాపములుండుట గూడ సంభవమే. అందువలన పునర్జన్మ కలుగకుండా అవి నశించుట సంభవము కాదు గనుక మీ సిద్ధాంతముననుసరించి మోక్షము సిద్ధించుట కుదరదు.

ఇంతేకాకుండా పుణ్యపాపములకు కారణరూపమైన రాగము, ద్వేషము మరియు మోహము మొదలగు దోషములు ఆత్మజ్ఞానము లేకుండా సమూలముగా నశించుట సంభవము కానందున పుణ్యపాపములు నశించుట అసంభవము.

మరియు శ్రుతులయందు **నిత్యకర్మల వలన పరలోకమునందు సుఖరూప ఫలములు చెప్పబడినందున** మరియు "వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మనిష్ఠాః" (ఆపస్తంభ స్మృతి చూ. 2.2.3) అనగా "స్వకర్మల యందు మునిగియున్న వర్ణాశ్రమావలంబీ" మొదలగు స్మృతి వాక్యముల ద్వారా కూడా ఈ మాటే చెప్పబడినందున కూడా కర్మలు నశించునను మాట సిద్ధించుట లేదు.

నిత్యకర్మలు దుఃఖమును కలిగించునవై యున్నందున పూర్వజన్మల యందు జేసినట్టి కర్మల ఫలమేనని చెప్పువారున్నారు. వారికి తమ స్వరూపము కంటే వేరుగ మరొక ఫలమేదియు

లేదని చెప్పుదురు. అట్లేలయన ? శ్రుతి గ్రంథముల యందు నిత్యకర్మలకు ఎటువంటి ఫలము చెప్పబడియుండలేదు. మరియు వాటి ఏర్పాటు కేవలము జీవితము గడుపుకొనుటకు మాత్రమే చెప్పబడినది. వారు అలా చెప్పుట సరిగాదు. ఏలయన ? ఏ కర్మలు ఫలములనిచ్చుటకు ప్రవర్తించబడలేదో వాటికి ఫలములుండవనుట అసంభవము. మరియు నిత్యకర్మలు చేయుట వలన కలుగు శ్రమ యితర కర్మల ఫలవిశేషమే గాని యితరము కాదు. ఈ మాట కూడా సిద్ధింపజేయబడదు.

పూర్వ పూర్వ జన్మలయందు చేయబడిన పాపకర్మల ఫలము నిత్యకర్మలను అనుష్ఠించుట యందు కలుగు శ్రమ రూపమైన దుఃఖము ద్వారా అనుభవించబడు చున్నదని మీరు చెప్పియున్నారు. ఆ మాట నిజము కాదు. ఏలయన ? మరణకాలము సమీపించు సమయమునకు ఏ కర్మలు తమ ఫలములను కలుగజేయుటకు యింక అంకురించలేదో వాటియొక్క ఫలము యితర కాలముల చేత పుట్టినటువంటి శరీరము ద్వారా అనుభవించబడును అని చెప్పుట అర్థసంగతముగా లేదు.

ఒకవేళ అట్లు జరగనప్పుడు స్వర్గరూపమైన ఫలమును అనుభవించుటకు చేయబడిన అగ్నిహోత్రాది కర్మల ఫలముగా పుట్టినటువంటి జన్మయందు నరకమునకు కారణరూపమైన కర్మల ఫలమును అనుభవించుటకు వెళ్ళుట గూడ యుక్తి విరుద్ధము కానేరదు.

ఇంతేకాకుండా ఈ నిత్యకర్మలు అనుష్ఠించినందు వలన కలుగు దుఃఖరూపములైన పాపములు చేసినందువలన అనగా పాపకర్మల ఫలముగా కలుగు దుఃఖ విశేషముగా సిద్ధించనందువలన కూడా మీరు చెప్పునది సరి కాదు. ఏలయన ? భిన్న భిన్న ప్రకారములుగా కలుగు దుఃఖము సాధనరూపమైన ఫలములనిచ్చు అనేక సంచిత పాపములకు సంబంధించినదగుటకు అవకాశమున్నను నిత్యకర్మానుష్ఠానము చేసినందువలన కలిగిన లేక కలుగుచున్న శ్రమనే వాటన్నింటి యొక్క ఫలముగా తలంచిన యెడల శీతోష్ణాది ద్వంద్వముల యొక్క లేక రోగాదుల వలన కలుగు దుఃఖములను పాపకర్మల యొక్క ఫలముగా ఒప్పుకొనబడదు. మరియు అట్లు జరుగుటకు గూడ వీలులేదు. ఏలయన ? నిత్యకర్మల అనుష్ఠానము వలన కలుగు శ్రమయే పూర్వమునందు చేసిన పాపకర్మల ఫలమై యున్నది. తలమీద రాళ్ళు పెట్టుకొని మోయుట వలన కలుగు దుఃఖము దాని యొక్క ఫలము కాదు.

అంతే కాకుండా నిత్యకర్మలను అనుష్ఠించినందువలన కలుగు శ్రమ రూపమైన దుఃఖము పూర్వజన్మల యందు చేసినటువంటి పాపకర్మల ఫలమై యున్నది అని చెప్పుట ప్రకరణ విరుద్ధముగూడ అయి వున్నది.

**పూర్వపక్షము** – అదెట్లు ?

**సమాధానము** – పూర్వజన్మలయందు చేయబడిన కర్మల ఫలమైన ఏ పాపములు తమ ఫలములనిచ్చుటకు యింకా ఆరంభించబడలేదో ఆ ఫలములు నశింపజాలవు. ఇది ప్రకరణము. అందులో మీరు ఫలములిచ్చుటకు ఆరంభించినటువంటి పూర్వము చేసినట్టి

పాపకర్మల యొక్క ఫలమునే నిత్యకర్మలను అనుష్ఠించినందువలన కలుగు శ్రమ రూపమైన దుఃఖమని చెప్పియున్నారు. అంతేగాని ఏ కర్మలు ఫలములనిచ్చుటకు యింకా ఆరంభము కాలేదో వాటి ఫలములని చెప్పియుండలేదు.

పూర్వము చేసిన పాపములన్నియు కర్మ ఫలములు యిచ్చుట ఆరంభించినవని నీవు తలంచుచున్నచో నిత్యకర్మల అనుష్ఠానము వలన కలుగుచున్న శ్రమయే అనగా ఆ శ్రమ రూపమున కలుగుచున్న దుఃఖమే వాటి ఫలము. అట్లు విశేషించుట న్యాయము కాదు. మరియు నిత్యకర్మవిధాయకమైన శాస్త్రమును గూడ వ్యర్థమనవలసిన స్థితి ఏర్పడును. ఏలయన? ఫలములిచ్చుటకు ఆరంభించిన పాపములు మాత్రము అనుభవించుటద్వారానే నశించును. అవి నశించుటకు నిత్యకర్మలు చేయనవసరము లేదు.

ఇవేకాక వాస్తవముగా వేదముల చేత విధించబడిన నిత్యకర్మల వలన కలుగు శ్రమ రూపమైన దుఃఖము ఒకవేళ కర్మఫలము అయివున్నట్లయితే అది ఆ విధించబడిన నిత్యకర్మల ఫలమే అయివుండవలె. ఏలయన ? అది వ్యాయామము మొదలగు వాని వలె వారి యొక్క అనుష్ఠానము వలననే కలుగుచూ వున్నట్లుగా తోచుచున్నది. కావున అది యితర కర్మల ఫలమని తలంచుట యుక్తి సంగతముగా లేదు.

**నిత్యకర్మల వ్యవస్థ జీవించుట మొదలగు వాటి కొరకు ఏర్పాటు చేయబడినది.** అందువలన నిత్యకర్మలను ప్రాయశ్చిత్తము వలె పూర్వము చేయబడిన పాపకర్మల ఫలుమలుగా తలంచుట కూడదు. అయినప్పటికి ప్రాయశ్చిత్తరూపమైన దుఃఖము ఆ పాపరూప నిమిత్తమైన ఫలముగానే వుండునని ఒప్పుకొనిన ఎడల జీవించుట కొరకు చేయబడు నిత్యకర్మల శ్రమరూపమైన దుఃఖము కూడ జీవనము మొదలగు హేతువుల ఫలమనియే చెప్పవలసి యుండును. ఏలయన ? నిత్యకర్మలు మరియు ప్రాయశ్చిత్త కర్మలు రెండూ గూడ ఏదోయొక నిమిత్తముగా చేయబడుచున్నవే. వాటి రెంటి యందు ఎటువంటి భేదము లేదు.

ఇంతేగాక మరొక దోషమేమన ? నిత్యకర్మల వలన కలుగు శ్రమ మరియు కామ్య కర్మలు అనగా అగ్నిహోత్రాది కర్మల వలన కలుగు శ్రమలయందు సమానత్వమున్నందున **నిత్యకర్మలు ఆచరించుట వలన కలుగు శ్రమరూపమున కలుగు దుఃఖమే పూర్వకృతపాప కర్మల ఫలమైయున్నది.** కామ్య కర్మానుష్ఠానము యొక్క శ్రమ వలన కలుగు దుఃఖము దాని యొక్క ఫలము కాదు. ఇలా తలంచుటకు ఎటువంటి విశేషమైన కారణము కానరాదు. అందువలన అది కామ్య కర్మల యొక్క శ్రమజనితమైన దుఃఖము గూడ పూర్వము చేసినట్టి పాపకర్మల ఫలమేయని తలంచబడును.

అలా అయినట్లయితే నిత్యకర్మల యొక్క ఫలమెట్టిదో చెప్పబడియుండలేదు. మరియు వాటిని అనుష్ఠించు విధానము గూడ చెప్పబడియుండలేదు. ఆ విధానమునకు యితర విధమైన మార్గము లేనందున నిత్యకర్మలను అనుష్ఠించుట వలన కలుగుచున్న శ్రమరూపమైన దుఃఖము పూర్వకృత పాపకర్మల యొక్క ఫలమనియే చెప్పవలసి యుండును. ఈ విధముగా ఏ కల్పన చేయబడినదో అది పూర్తిగా నిరాధారమైనదని తేలిపోయినది.

ఈ విధముగా ప్రకారాంతరముగా **నిత్యకర్మల విధానము కల్పితమని** తెలినందున మరియు నిత్యకర్మల యొక్క అనుష్ఠానమునకు సంబంధించిన శ్రమ రూపమైన దుఃఖము తప్ప మరియొక ఫలము కలుగుచున్నదను సందేహము కలిగినచో అది గూడ ఖండించబడు చున్నది.

ఇంతే కాకుండా అలా ఒప్పుకోవడంలో ప్రతిరోధమున్నది గావున ఈ వాదము ఖండింబడుచున్నది. నిత్యకర్మల అనుష్ఠానము చేయుచు వుండి కూడా యితర కర్మల ఫలములు అనుభవించబడుచుండును అని ఒప్పుకొన్నచో ఆ భోగములే నిత్యకర్మల ఫలములని చెప్పవలసి వచ్చును. మరియు దానితోపాటుగా నిత్యకర్మలకు ఫలములుండవని చెప్పుచున్నావు. అందువలన నీ రెండు అభిప్రాయములు పరస్పర విరుద్ధముగా నున్నవి.

అంతేకాకుండా నీ మతముననుసరించి కామ్యకర్మలైన అగ్నిహోత్రాది కర్మల అష్ఠానము చేయుచు తంత్రము ద్వారా నిత్యకర్మలు మరియు అగ్నిహోత్రాది కర్మలు గూడ వాటితో పాటే అనుష్ఠింపబడుచుండును. అందువలన ఆశ్రమరూపమైన దుఃఖభోగమువలననే కామ్య అగ్నిహోత్రాది కర్మల ఫలములు గూడ క్షీణించును. అట్లేలయన ? అవి దాని యొక్క - వాని యొక్క అధీనమునందే యున్నవి.

కామ్య అగ్నిహోత్రాది కర్మల ఫలముగా స్వర్గాది ప్రతిరూపములైన ఫలములు లభించునని ఒప్పుకొన్నచో, వాటిని అనుష్ఠించుట యందు కలుగు శ్రమరూపమైన దుఃఖము గూడ నిత్యకర్మల ఆచరణ వలన కలుగు దుఃఖమును గూడ నిత్యకర్మల వలన కలుగు శ్రమరూపమైన దుఃఖము కంటే భిన్నముగా వున్నదని తలంచుట ఆవశ్యకమగును.

కాని ప్రత్యక్షప్రమాణమునకు విరుద్ధమగుట వలన అట్లు జరుగనేరదు. ఏలయన? కామ్యకర్మానుష్ఠానము వలన కలుగు శ్రమరూపమైన దుఃఖము కంటే నిత్యకర్మానుష్ఠానము నందు కలుగు శ్రమ రూప దుఃఖమునందు భేదమేమియు లేదు.

అంతేకాకుండా రెండవ మతమేమన ? ఏ కర్మవిహితము కాదో అనగా చేయవలసినది కాదో మరియు ప్రతిసిద్ధము కూడ కాదో, అనగా చేయకూడనిది కూడా కాదో, అటువంటి కర్మయే వెంటనే ఫలము యిచ్చునదై యుండును. శాస్త్ర విహితము లేక నిషిద్ధము అయిన కర్మ తత్కాలమే అనగా వెంటనే ఫలమును యిచ్చునది కాదు. ఒకవేళ అలా అయివుంటే స్వర్గాదిలోకములు కలవని చెప్పుటయందు మరియు అదృష్టఫలములు కలవని చెప్పుటయందు శాస్త్రమునకు ప్రవృత్తి యుండదు అనగా అటువంటి మాటలు శాస్త్రము చెప్పదు.

కర్మలు చేయుటయందు ఎటువంటి భేదము లేనప్పుడు మరియు అంగములందుగాని మరియు ఇతికర్తవ్యత్వము మొదలైన విశేషత్వమేమియు లేనప్పుడు కూడ కేవలము నిత్య-అగ్నిహోత్రాది కర్మల ఫలము మాత్రము ఆ కర్మలు అనుష్ఠించుట వలన కలుగు శ్రమ రూప దుఃఖమును అనుభవించుట వలన నశించును అనగా క్షయమును పొందును. మరియు ఫలేచ్ఛుకతా మాత్రము యొక్క ఆధిక్యము వలన అనగా ఫలమును పొందవలయునను కోరిక

తీవ్రముగా వున్నందు వలన కామ్య మరియు అగ్నిహోత్రాది కర్మల యొక్క స్వర్గాది ఫలములు లభించును అని తలంచరాదు.

అందువలన నిత్యకర్మల యొక్క అదృష్టఫలము కలుగదని తలంచుట ఎన్నడును సిద్ధించదు. అందువలన తేలిన ఫలమేమన ? **అవిద్య కారణముగ జరుగు లేక చేయబడు సమస్తమైన శుభాశుభకర్మల యొక్క ఫలములను నిశ్శేషముగా నాశమొనరించు సాధనము విద్య అనగా జ్ఞానమొక్కటియే. అంతేగాని నిత్యకర్మానుష్ఠానము మాత్రము కాదు.**

అట్లేలయన ? సమస్తమైన కర్మలు అవిద్య అనగా అజ్ఞానము మరియు కామభావమూలకములు అనగా ఫలములను పొందవలయుననెడి తీవ్రమైన వాంఛ కలిగినవై వుండును. అందుచేతనే మేము **అజ్ఞాని యొక్క విషయము అనగా ప్రవృత్తి కర్మ అయి వున్నది మరియు జ్ఞానియొక్క విషయము అనగా ప్రవృత్తి సర్వకర్మ సంన్యాస పూర్వకమైన జ్ఞాననిష్ఠయేయని సిద్ధాంతీకరించియున్నాము.**

"ఉభౌ తౌనవిజానీత, (చూ. గీత. 2-13) "వేదావినాశినం నిత్యమ్ (గీత 2.21) "జ్ఞానయోగేన సాంఖ్యానాం, కర్మయోగేన యోగినామ్ (గీత. 3.3) "యదజ్ఞానాం కర్మసంగినామ్' ' (గీత. 3.26) "తత్త్వవిత్తు, గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే" (గీత 3.28) "సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే" (గీత 5.13) "నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్" (గీత 5.8) మొదలగు వాక్యముల ద్వారా అజ్ఞాని మాత్రమే "నేను కర్మలు చేయుచున్నాను" అని తలంచును. జ్ఞాని అట్లు తలంచదు" అని ఋజువగుచున్నది.

ఆరురుక్ష్యునికి అనగా అజ్ఞానికి కర్మలు కర్తవ్యములుగా చెప్పబడినవి. మరియు ఆరూఢునికి అనగా యోగము నందు లీనమైయున్న పురుషునికి ఉపశమము కర్తవ్యముగా చెప్పబడినది. మరియు మూడు విధములగు **అజ్ఞానులైన భక్తులు గూడ** ఉదారులని చెప్పబడినది. కాని **జ్ఞాని మాత్రము నా సర్వస్వము అని నేను తలంచుచున్నాను.** (ఒప్పుకొనుచున్నాను)

**కర్మలు చేయునట్టి సకామి అనగా ఫలేచ్ఛ కలిగియున్న అజ్ఞానులగు పురుషులు రాకపోకలు కలిగియుందురు.** అనన్య భక్తులు స్థిరచిత్తము గలవారై చింతనా యుక్తులై ఆత్మస్వరూపముగానున్న ఆకాశము వలె పాపరహిత పరమాత్ముడై యున్న నన్ను ఉపాసించుచుందురు. అటువంటి వారికే నేను బుద్ధియోగమును ప్రసాదింతును. దానితో వారు నన్ను పొందెదరు. కర్మలు చేయునట్టి అజ్ఞానులు తగినంత యోగ్యత కలిగియుండియు కర్మలు చేయువారగుట వలన అజ్ఞానులుగానే యుందురు. వారు చిత్త సమాధానము మొదలు అనగా చిత్తమును స్థిరపరచుకొనిన వారైన తరువాత కర్మ ఫలత్యాగ పర్యంతము ఉత్తరోత్తరము హీనములనబడు సాధనములు కలిగియుందురు.

మరియు ఏ సాధకులు నిర్దేశమగు అక్షరోపాసకులై యుందురో వారు "అద్వేష్టా సర్వభూతానామ్" (చూ. గీత. 12.13) మొదలు పన్నెండవ అధ్యాయము నందలి అంతిమ శ్లోకము వరకు చెప్పబడిన సాధన సంపన్నులై మరియు పదమూడవ అధ్యాయము మొదలు మూడు అధ్యాయములందు చెప్పబడిన జ్ఞాన సాధనములు కూడ కలిగినవారుగా యుందురు.

అధిష్ఠానాదులైన ఐదు దేనికి కారణములుగా వున్నవో అటువంటి సమస్తమైన కర్మల యొక్క సంన్యాసమును చేసియున్న వారలు మరియు ఎవరు ఆత్మయొక్క ఏకత్వమును మరియు అకర్తృత్వమును ఎరింగియున్నారో మరియు ఏ మహాత్ములు జ్ఞానము యొక్క పరనిష్ఠయందు లీనమై యున్నారో మరియు ఎవ్వరు భగవంతుని యొక్క స్వరూపము మరియు ఆత్మయొక్క ఏకత్వజ్ఞానమును పొందియున్నారో ఆ విధముగా భగవత్తత్వమును గుర్తించిన పరమహంస పరివ్రాజకులైనవారికి యిష్టము - అయిష్టము మరియు యిష్టాయిష్ట మిశ్రిత రూపమైన మూడు విధములగు కర్మఫలములు కలగనేరవు. వీరికి విరుద్ధముగా వుండి సంన్యాసమును స్వీకరించనటువంటి కర్మపరాయణులైన అజ్ఞానులు కర్మఫలమును తప్పక అనుభవించి తీరవలయును. **ఇదియే గీతాశాస్త్రమునందు చెప్పబడిన కర్తవ్యము అకర్తవ్యము అను విభజన.**

**పూర్వపక్షము** - అన్ని విధములగు కర్మలను అవిద్యాజన్యములుగా తలంచుట యుక్తి సంగతముగా లేదు.

**సమాధానము** - అట్లుకాదు. బ్రహ్మహత్య మొదలగు నిషిద్ధ కర్మల వలె **కర్మలన్నియు అవిద్యామూలకములే అనగా అజ్ఞానము కారణముగా చేయబడుచున్నవే.** నిత్యకర్మలు శాస్త్ర ప్రతిపాదితములైనప్పటికి అవి గూడ అవిద్యతో కూడియున్న పురుషుని ద్వారా చేయబడు కర్మలే.

ఏ విధముగా ప్రతిషేదించబడిన శాస్త్రము ద్వారా చెప్పబడినప్పటికి అనర్ధమునకు కారణరూపములైన బ్రహ్మహత్యాది నిషిద్ధకర్మలు అవిద్య మరియు కామము మొదలగు దోషములతో కూడియున్న పురుషుని చేతనే చేయబడుచున్నవో అట్లేలయన ? వారియందు మరో విధమగు ప్రవృత్తి కలుగనేరదు. అదే విధముగా నిత్య - నైమిత్యకములు మరియు కామ్యాది కర్మలు కూడా అవిద్య మరియు కామముతో కూడియున్న పురుషుని చేతనే చేయబడుట సాధ్యమగుచున్నది.

**పూర్వపక్షము** - కాని ఆత్మను దేహాదుల కంటే వేరుగా వున్నట్లుగా ఎరుంగకుండా నిత్యనైమిత్తికాది కర్మలయందు ప్రవృత్తి కలుగుట సంభవము కాదు గదా !

**సమాధానము** - అలా చెప్పుట సరికాదు. ఏలయన ? ఆత్మ దేనికి కర్త కాదో అటువంటి నడచుట రూపమైన కర్మలయందు గూడ అజ్ఞానులకు "నేను చలన రూపమైన కర్మలు చేయుచున్నాను" అను చిత్త వృత్తి చూడబడుచున్నది గదా ?

శరీరాదులయందు కలిగియున్న అహంభావము గౌణమైనదే గాని మిథ్య కాదు అని అన్నచో - అట్లనుట సరికాదు. ఏలయన ? అలా అన్నందువలన, అనగా అలా తలంచినందువలన వారి కార్యములందు గూడ గౌణత్వము సిద్ధించును.

**పూర్వపక్షము** - "ఓ పుత్రకా నీవు నా ఆత్మమే అయివున్నావు" అన్నట్లుగా ఇదిగో ఈ శ్రుతివాక్యముననుసరించి తన పుత్రుని యందు తండ్రికి అహంభావము వుండును. మరియు ప్రపంచమునందు గూడ "ఈ గోవు నా ప్రాణము" అనబడుచున్నట్లుగా ప్రియమైన వస్తువునందు

అహంభావము వుంటున్నట్లుగా చూడబడుచున్నది. ఆ విధముగానే తన శరీరము మొదలగు వస్తువుల యందు గూడ అహంభావము గౌణమే. **ఇలాంటి చిత్తవృత్తి మిథ్య కాదు. మిథ్యాప్రతీతి** యనగా ఏ చిత్త వృత్తి స్థాణువు (స్తంభము) మరియు పురుషుని యందు గల భేదమును గుర్తించక స్థాణువునే పురుషునిగా తలంచునో అది మిథ్యా ప్రతీతి యనబడును.

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? **గౌణభావ ప్రయోగము లుప్తోపమ శబ్దము ద్వారా అధికరణము అనగా ముఖ్య వస్తువును స్తుతించుట కొరకు చెప్పబడును.** అందువలన గౌణప్రతీతి వలన ముఖ్య వస్తువు యొక్క కార్యము సిద్ధించదు.

"దేవదత్తుడు సింహము" అని ఎవ్వరైనా అన్నచో లేక ఆ "బాలకుడు అగ్ని" అన్నచో దేవదత్తుడు సింహమువలె క్రూరత్వము మరియు బాలుడు అగ్నివలె పింగళవర్ణము కలిగియున్నాడని చెప్పుట స్తుతి కొరకు సమానత్వమును చూపించుటకే గాని దేవదత్తుని సింహరూపమైన అధిష్ఠానమును స్తుతించుటకే చెప్పబడుచున్నది. ఏలయన ? గౌణ శబ్దము లేక గౌణ జ్ఞానము ద్వారా ఎవ్వడును సింహము చేయు కార్యము అనగా ఏదో ఒక జంతువును చంపి తినివేయుట లేక అగ్ని యొక్క కార్యము అనగా దేనినో కాల్చి మసిగా చేయుట సిద్ధింపజేయబడదు. కాని **మిథ్యా ప్రత్యయము యొక్క కార్యము (జన్మ – మరణ రూపమైనది) అనర్థమును (మనుష్యునకు) అనుభవింపజేయును అనగా అనర్థమును కలిగించునదై యున్నది.**

అంతేగాని నిజముగా దేవదత్తుడు సింహము కాదు. మరియు అట్లే బాలకుడు అగ్నియు కాదని గౌణ ప్రతీతికి సంబంధించినదిన విషయమును మనుష్యుడు (శ్రోత) ఎరుంగును.

పైన చెప్పిన విధముగానే శరీరాది సంఘాతమునందు గూడ ఆత్మభావము గౌణమే అయినట్లయితే శరీరాది అవయవ సంఘాతరూపమైన గౌణ ఆత్మ ద్వారా చేయబడిన కర్మలు అహంకారము చేత ముఖ్య విషయమైన ఆత్మచేత చేయబడినవి కావని ఒప్పుకొనబడును. ఏలయన ? గౌణసింహము అనగా దేవదత్తుడు మరియు గౌణమైన అగ్ని అనగా బాలకుని ద్వారా చేయబడిన కర్మలు ముఖ్యమైన సింహము మరియు ముఖ్యమైన అగ్నికి సంబంధించిన కర్మలుగా తలంచబడవు. మరియు ఆ (సింహము యొక్క) క్రూరత్వము మరియు వేడి ద్వారా (అగ్ని యొక్క) ఏ ముఖ్య సింహము మరియు ఏ ముఖ్యమైన అగ్ని యొక్క కార్యములు చేయబడజాలవు. ఏలయన ? అవి కేవలము గౌరవార్థము చెప్పబడినవి గావున శక్తిహీనములైనవే...

దేవదత్తుడు, బాలకుడు కూడా "నేను సింహమును కాదనియు, నేను అగ్నిని కాదనియు" మరియు సింహము చేయు కర్మ నాదికాదనియు, అగ్ని చేయు కర్మ నాది కాదనియు ఎరుంగుదురు. ఈ విధముగానే శరీరాదులయందు గౌణభావము వున్నచో ఆ శరీర సంఘాతము చేయు కర్మలు ముఖ్య ఆత్మనైయున్న నాకు సంబంధించినవి కావను ప్రతీతి కలిగియుం యుండవలసినది. అట్లుగాక "నేను కర్తను" "ఆ కర్మలు నావి" అను భావము వుండరాదు.

అందువలన యిచ్చట సిద్ధించినదేమన - **శరీరమునందు ఆత్మభావము గౌణము కాదు మిథ్య అనగా భ్రాంతి.**

తన స్మృతి, తన కోరిక మరియు తన ప్రయత్నము మొదలగు తన కర్మసాధనముల ద్వారానే ఆత్మ కర్మలు ఆచరించుచున్నది అని తలంచువారి మాట నిజము కాదు. ఏలయన? ఇవన్నియు మిథ్యా ప్రతీతి అనగా నిజముగా లేకపోయినను వున్నట్లుగా తలంచిన కారణముగా జరుగుచున్నట్లుగా అనగా చేయబడుచున్నట్లుగా తోచుచుండును. **అనగా స్మృతి, కోరిక మరియు ప్రయత్నము మొదలగునవన్నియు మిథ్యా ప్రతీతి అనగా భ్రాంతి వలన జరుగు యిష్ట - అనిష్ట రూపములైన అనుభూతి రూపములైన కర్మఫలజనితములైన సంస్కారముల కారణముగనే జరుగుచుండును.**

ఏ విధముగా ఈ అనగా యిప్పుడున్న జన్మయందు ధర్మము, అధర్మము మరియు వాటి ఫలముల అనుభవము అనగా సుఖదుఃఖాదులు శరీరమునందు ఆత్మబుద్ధి చేతను మరియు రాగద్వేషాదుల కారణముగా చేయబడినవగుచున్నవో అట్లే భూతపూర్వ జన్మమునందు మరియు అంతకు పూర్వపు జన్మలయందు గూడ వుండియున్నది. ఈ న్యాయముననుసరించి ఆ గతించిన మరియు ఆ రోబోవు జన్మ-మరణ రూపమైన సంసారము అనాదియనియు అవిద్యాకృతమనియు తలంచవలయును.

ఇంత విచారణ తరువాత సిద్ధించినదేమన ? **జ్ఞాననిష్ఠయందు సర్వకర్మలను సంన్యసించుట ద్వారా సంసారము పూర్తిగా నివర్తించును.** ఏలయన ? దేహాభిమానము అవిద్యారూపమైనది అనగా దేహమే నేనను భావము అజ్ఞానము వలన కలుగుచున్నదే గాని నిజము కాదు. అందుచేత ఆ భావము పూర్తిగా నివృత్తి చెందినప్పుడు మరొక శరీరము లభించనికారణముగ జన్మ - మరణ రూపమైన ప్రపంచము తోచనే తోచదు.

శరీరాదులయందు ఏ ఆత్మాభిమానమున్నదో అది అవిద్య కారణముగ కలుగుచున్నది. ఏలయన ? ఈ ప్రపంచమునందు గూడ "నేను గోవు మొదలగు వాటి కంటే భిన్నముగా వున్నాను" మరియు గోవు మొదలగు వస్తువులన్నియు నాకంటే భిన్నముగా వున్నవి. అని ఈ విధముగా తలంచు ఏ మనుష్యుడైనను "అవన్నియు నేనే అయివున్నానను" అను భావమును కలిగియుండదు.

అలా ఎరుంగని వాడు మాత్రమే స్తంభము నందు పురుషుని భ్రాంతివలె అవివేకము చేత దేహాదులయందు "నేను అనగా ఈ దేహమే నేను" అను ఆత్మభావము కలిగియుండును. కాని వివేకముతో సర్వమును గుర్తించినవాడు అలాంటి భావమును కలిగియుండదు.

మరియు పుత్రునియందు "ఓ పుత్రా నీవు నా ఆత్మవే అయి వున్నావు" అను పుత్రుని యందు ఆత్మరూపబుద్ధి ఏదైతే వున్నదో అది జన్య-జనక సంబంధమును కలిగియున్న కారణముగ ఏర్పడినట్టి గౌణబుద్ధి అయివున్నది. ఆ గౌణ ఆత్మరూపుడైన పుత్రునితో "భోజనాదుల వలె ఏ విధముగా పుత్రుడు భుజించినందున తండ్రి తృప్తిని పొందలేడో అనగా తండ్రి యొక్క ఆకలి

తీరదో ఆ విధముగానే గౌణ ఆత్మ వలన ముఖ్య ఆత్మ యొక్క ఏ కార్యము గూడ జరుగనేరదు. ఏ విధముగా గౌణ సింహము మరియు గౌణ అగ్నిరూపమైన దేవదత్తుడు మరియు బాలకుడు మొదలగు వారి ద్వారా ముఖ్య సింహము మరియు ముఖ్య అగ్ని ద్వారా జరుగు కార్యములు జరుగబడవో అట్లు.

**పూర్వపక్షము** – స్వర్గము మొదలగు అదృష్ట పదార్థముల కొరకు కర్మలు చేయమని చెప్పునట్టి శ్రుతి ప్రమాణమున్నందున, దేహము, యింద్రియములు మొదలగు గౌణ ఆత్మల ద్వారా ముఖ్య ఆత్మ యొక్క కార్యములు జరుగుచున్నట్లు ఋజువగుచున్నది కదా ? యన్నచో-

**సమాధానము** – అలా చెప్పుట సరికాదు. ఏలయన ? వాటియొక్క ఆత్మత్వము అవిద్యాజనితము. అనగా **దేహము, యింద్రియములు మొదలగునవి గౌణ ఆత్మలు కాదు. కేవలము మిథ్యారూపములు అనగా శుద్ధకల్పితములు.**

**పూర్వపక్షము** – అయితే మరి వీటి యందు ఆత్మభావము ఎట్లు కలుగుచున్నది ?

**సమాధానము – మిథ్యా ప్రతీతి కారణముగ సంగరహితమైన ఆత్మతో లేని సంగతిని అనగా సంబంధమును కల్పించి వాటియందు ఆత్మభావము కల్పించబడుచున్నది.** అట్లేలయన? అలాంటి మిథ్యా ప్రతీతి వుండగానే వాటియందు ఆత్మభావరూపమైన సత్త అనగా శక్తి కల్పించబడుచున్నది. అట్టి అభావము చేత ఆత్మభావమునకు గూడ అభావత్వమే కలుగుచున్నది.

అభిప్రాయమేమన ? మూర్ఖులు అయిన మరియు అజ్ఞానులు అయినవారు మాత్రమే తమ అజ్ఞానకాలమునందు – అజ్ఞాన స్థితియందు మాత్రమే "నేను గొప్పవాడను" "నేను అందమైనవాడను" అనునటువంటి దేహము, యింద్రియములు మొదలగు వాటియందు ఆత్మాభిమానము అనగా అవియే ఆత్మ అను భావమును కలిగియుందురు. కాని **"నేను దేహము మరియు యింద్రియముల సమూహమును కాను" అని తలంచునట్టి వివేకము గల వారికి అట్టి స్థితియందు దేహాదులయందు ఆత్మాభిమానము వుండదు.**

అందువలన, మిథ్యాప్రతీతి లేనందున, దేహాత్మబుద్ధి గూడ లేనందున **దేహాదులయందు ఆత్మబుద్ధి అవిద్యాజనితమైనదే గాని గౌణ ఆత్మబుద్ధి కాదని సిద్ధించుచున్నది.**

వేటియొక్క సమానత్వము మరియు విశేషత్వము వేరువేరుగా వుండునని తెలియబడునో అటువంటి సింహము మరియు దేవదత్తులయందు లేక అగ్ని మరియు బాలకునియందు గూడ గౌణప్రతీతి లేక గౌణశబ్ద ప్రయోగము కుదురును. **సమానత్వము మరియు విశేషత్వమును వేరువేరుగా గుర్తించజాలనప్పుడు వాటి భేదమును తెలుసుకొనుట సంభవము కాదు.**

శ్రుతిని ప్రమాణరూపముగా స్వీకరించినందువలన మీరు చెప్పినది సరికానేరదు. ఏలయన ? దానియొక్క ప్రమాణము అదృష్ట వస్తువులకు సంబంధించినది. అనగా ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా లభించనటువంటి అగ్నిహోత్రాదుల యొక్క సాధ్య, సాధన, సంబంధముల విషయమునందే శ్రుతులు ప్రమాణములగును. ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా లభించునట్టి

విషయముల యందు కాదు. ఏలయన ? **శ్రుతుల యొక్క ప్రమాణత్వము అదృష్ట వస్తువులను చూపించుటకు మాత్రమే వుపయోగపడును.** అనగా **అప్రత్యక్షముగా వున్న విషయములను ప్రత్యక్షము చేయుటయే దాని పనియై యున్నది.**

కావున దేహాదుల యందు ప్రత్యక్షముగానే మిథ్యాజ్ఞానము వలన కలుగు అహం ప్రతీతిని గౌణమని ఒప్పుకొనుట కుదరదు.

ఏలయన ? 'అగ్ని చల్లగా వున్నది లేక ప్రకాశము లేనిదిగా యున్నది" అని చెప్పునటువంటి వందల కొలది శ్రుతులు గూడ ప్రమాణరూపముగా ఒప్పుకొనబడవు. "అగ్ని చల్లగా వున్నదని లేక ప్రకాశరహితముగా యున్నదని శ్రుతి చెప్పుచున్నట్లయితే శ్రుతికి ఆ సందర్భమున వేరు అర్థము కలదని ఒప్పుకొనవలసి యుండును. ఏలయన ? ఇతర విధములుగా దానియొక్క ప్రమాణత్వము సిద్ధించనేరదు. కాని ప్రత్యక్షము మొదలగు యితర ప్రమాణములకు విరుద్ధముగా లేక శ్రుతియే తాను చెప్పినదానికి విరుద్ధముగా శ్రుతికి అర్థమును కల్పించుట సరికాదు.

**పూర్వపక్షము** – కర్మలు మిథ్యాజ్ఞానముతో కూడియున్న పురుషుని ద్వారానే చేయబడునవై యున్నవి. అలా ఒప్పుకొనినందువలన వాస్తవముగా కర్త యొక్క లేమి కలుగుచున్న కారణముగ శ్రుతి యొక్క అప్రమాణకత్వము సిద్ధించుచున్నది. అని అన్నచో –

**సమాధానము** – కాదు. ఏలయన ? బ్రహ్మవిద్యయందు దాని సార్థకత్వము సిద్ధించుచున్నది.

**పూర్వపక్షము** – కర్మలను విధించునట్టి శ్రుతివలె బ్రహ్మవిద్యా విధాయకమైన శ్రుతి యొక్క అప్రమాణకత్వము సిద్ధించుచున్నదని చెప్పినచో –

**సమాధానము** – అట్లు చెప్పుట సరికాదు. ఏలయన ? దానిని బాధించు వస్తువు అనగా దానిని లేకుండ చేయు వస్తువు ఈ మూడు లోకములందును లేదు. అనగా ఏ విధముగా బ్రహ్మవిద్యా విషయికమైన శ్రుతి ద్వారా ఆత్మసాక్షాత్కారము కలిగిన పిమ్మట దేహాదులయందు ఆత్మబుద్ధి బాధించబడుతుందో అనగా దేహాదులే నేనను బుద్ధి నశిస్తుందో ఆ విధముగానే **ఆత్మయందే వుండునటువంటి ఆత్మభావము యొక్క బోధ అనగా జ్ఞానము ఎవ్వని ద్వారాను, ఏ కాలమునందును ఏ విధముగాను బాధించబడదు.** అట్లేలయన ? ఈ **ఆత్మజ్ఞానము స్వయముగానే ఫలరూపమైనది.** దానికంటె వేఱుగ ఎటువంటి యితర ఫలము లభించబోదు. అసలు లేదు. ఏ విధముగా అగ్ని ఉష్ణత్వము అనగా వేడిమి మరియు ప్రకాశమును కలిగియుండునో ఆ విధముగానే **బ్రహ్మజ్ఞానము మోక్షమను ఫలమును కలిగియుండును.**

ఇంతే తప్ప వాస్తవముగా కర్మలను విధించు శ్రుతిగూడ అప్రామాణికము కాదు. ఏలయన ? అది పూర్వ పూర్వ స్వాభావికమైన ప్రవృత్తులను ఆపి ఆపి తరువాత తరువాత క్రొత్త క్రొత్త శాస్త్రీయమైన ప్రవృత్తులను కలిగించును. చివరకు అంతఃకరణ శుద్ధి ద్వారా సాధకునికి అంతరాత్మను సాక్షాత్కరింపజేయునట్టి ప్రవృత్తిని కలిగించును. అందువలన ఉపాయము అనగా

సాధనామార్గము మిథ్యయే అయినప్పటికి ఉపేయము అనగా సాధ్యవస్తువు అనగా బ్రహ్మయొక్క సత్యత్వము వలన ఉపాయము గూడ సత్యమే యగును. అదెట్లన ? విధి వాక్యముయొక్క అంతమునందు చెప్పబడెడి అర్థవాద వాక్యములయొక్క సత్యత్వము ఎట్లు ఒప్పుకొనబడుచున్నదో అట్లు.

లోక వ్యవహారమునందు గూడ పిచ్చివానికి లేక పసిబాలురు మొదలగువారికి ఆహారము పెట్టుటకు లేక పాలు వగైరా త్రాగించుటకు ఆహారము తినినందువలన మరియు పాలు త్రాగినందువలన జుట్టు పెఱుగునను మాయ మాటలు చెప్పబడునో అట్లు. చూ. సూరదాసు – "మా కబహి బఢైగీ చోటీ" అనగా

కృష్ణుడు – అమ్మా నా జుట్టు ఎప్పుడు పొడుగుగా పెరుగును ?

యశోద – బాగా ప్రాలు త్రాగినప్పుడు.

మరియు ఆత్మజ్ఞానము కలుగుటకు పూర్వము దేహాభిమాన రూపమైన ప్రత్యక్షాది ప్రమాణముల యొక్క ప్రమాణత్వము వలె ప్రకారాంతరముగా వున్నటువంటి కర్మలను విధించునట్టి శ్రుతుల యొక్క స్వయంసిద్ధమైన ప్రమాణము సిద్ధించును.

**ఆత్మ స్వయముగా ఎటువంటి క్రియలు చేయనప్పటికి సామీప్యత్వము ద్వారా క్రియలు చేయుచున్నట్లుగా తోచుచుండును.** దీనినే ఆత్మయొక్క కర్తృత్వమని సామాన్యులు తలంచుచుందురు. అదెట్లన ? రాజుగారు స్వయముగా యుద్ధము చేయనప్పటికి ఆయనయొక్క సాన్నిధ్యము చేత యితర వీరులు యుద్ధము చేయుచుందురు. అది చూచి జనులు రాజుగారు యుద్ధము చేయుచున్నారని చెప్పుచుందురు. మరియు ఆతడు విజయమును పొందినాడు. లేక ఓడిపోయినాడు అని గూడ అందురు. అదే విధముగా సైన్యాధికారి గూడ తన ఆజ్ఞల ద్వారానే యుద్ధము చేయును. అయినప్పటికి రాజుగారు మరియు సైన్యాధిపతికి గూడ యుద్ధమను క్రియతో సంబంధమున్నట్లుగా చూడబడుచున్నది. ఏ విధముగా ఋత్విక్ అనగా యజ్ఞము చేయువాని కర్మలు యజమానివిగా తలంచబడుచుండునో. **ఆ విధముగానే దేహాదులు చేయు కర్మలన్నియు ఆత్మకే చెందియుండును. అట్లేలయన ? దేహాదులు చేయు కర్మ ఫలములన్నియు ఆత్మకే లభించుచున్నవి.**

ఏ విధముగా సూదంటురాయి తనంతట తానుగా ఎటువంటి క్రియలు ఆచరించదు. అయినప్పటికి ఆ సూదంటురాయి యొక్క ఆకర్షణ వలననే యినుప చక్రములు తిరుగుచున్నవి. అందువలన చక్రము తిరుగుచున్నందువలన జరుగు క్రియకు సూదంటురాయియే కర్త. ఆ విధముగానే ఆత్మకు గూడ కర్తృత్వము ప్రాప్తించుచున్నది.

కాని అలా చెప్పడము మరియు ఒప్పుకొనుట సరికాదు. ఏలయన ? అలా ఒప్పుకొనిన యెడల క్రియ చేయనివానిని కారకముగా ఒప్పుకొనవలసి వచ్చును.

కారకములు అనేక విధములుగా వుంటాయని చెప్పినప్పటికి యిలా ఆత్మకు కర్తృత్వము కలదని చెప్పుట సరికాదు. ఏలయన ? రాజులు మొదలగువారి ముఖ్యమైన కర్తృత్వము చూడబడుచున్నది. అనగా రాజుగారు అవకాశము వచ్చినప్పుడు స్వయముగా కూడ యుద్ధము

చేయును. అటుపైన యుద్ధము చేయు వీరులకు ధనము బహుమానములు యిచ్చుట ద్వారా గూడ రాజుగారికి ముఖ్య కర్తృత్వము కలుగుచున్నది. అదే విధముగా యుద్ధ క్రియయొక్క ఫలమైన జయపరాజయములు ఆయనకే చెందుచున్నవి.

ఆ విధముగానే యజ్ఞయాగాదులు చేయు యజమానికి గూడ ప్రధానమైన ఆహుతి ఆయనయే యిచ్చుచున్నాడు గావున, మరియు యజ్ఞమును ఆచరించు ఋత్వికులకు దక్షిణ మొదలగునవి యిచ్చుచున్నందున నిస్సందేహముగా ముఖ్య కర్తృత్వము ఆయనకే చెందుచున్నది.

క్రియలు చేయునట్టి వస్తువులు లేక పురుషులయందు చూడబడుచున్న కర్తృత్వము గౌణమైనదే గాని ముఖ్యమైనది కాదని పై చర్చద్వారా నిశ్చయమగుచున్నది. రాజుగారు మరియు యజమాని మొదలగువారియందు సొంత వ్యాపార రూపమైన ముఖ్య కర్తృత్వము లేకుండియున్నచో వారి సాన్నిధ్య మాత్రము చేతనే వారియందు ముఖ్య కర్తృత్వము ఒప్పుకొనవచ్చును. అదెట్లన ? యినుప చక్రమును త్రిప్పుటయందు సూదంటురాయియొక్క సాన్నిధ్య మాత్రముచేత సూదంటురాయియందు ముఖ్య కర్తృత్వము చూడబడుచున్నది. కాని సూదంటురాయివలె రాజుగారు మరియు యజమాని యొక్క వ్యాపారములు (క్రియలు) లేవనుట కుదురుట లేదు. అందువలన **సాన్నిధ్య మాత్రమున కలుగు క్రియలు మరియు ఆ క్రియల** వలన కలుగు కర్తృత్వము కూడ గౌణమైనదేనని చెప్పబడును.

అలా అయినందువలన ఆ క్రియల వలన కలుగు ఫలము గూడ గౌణమైనదే యగును. ఏలయన ? **గౌణకర్తచే ముఖ్య క్రియ చేయబడదు.** అందుచేత **ఎటువంటి క్రియలు చేయనట్టి ఆత్మ దేహాదులు చేయు క్రియలు కారణముగ కర్త – భోక్త యగుననుట కేవలము భ్రాంతి జన్యమైనదియే యని చెప్పబడుచున్నది.**

కాని భ్రాంతివలన అంతయూ జరుగుచున్నట్లుగా తోచుచుండును. అదెట్లన ? స్వప్నమునందు మరియు గారడీవాని మాయయందు అంతా జరుగుచున్నట్లుగా తోచుచున్నది గదా ? కాని దేహాదుల యందు ఆత్మబుద్ధి రూపమైన అజ్ఞాన సంతతి నశించినప్పుడు సుషుప్తి మరియు సమాధి మొదలగు అవస్థలయందు కర్తృత్వము, భోక్తృత్వము మొదలగు అనర్థములు కనుపించుట లేదు.

ఈ విధముగా విచారణ జరిపినందువలన సిద్ధించునదేమన ? **ఈ ప్రపంచమంతయు భ్రమ మరియు మిథ్యా జ్ఞాన నిమిత్తకమైనదియే గాని నిజముగా వున్నది కాదు. అందువలన సంపూర్ణ తత్త్వజ్ఞానము కలిగినప్పుడు యీ ప్రపంచమంతయు పూర్తిగా నివృత్తిని చెందును.**

ఈ పదునెనిమిదవ అధ్యాయమునందు సమస్తమైన గీతాశాస్త్రము యొక్క అర్థమును ఉపసంహరించి అనగా ముగించి మరల విశేషముగా ఈ అంతిమ శ్లోకమునందు శాస్త్రముయొక్క అభిప్రాయమును దృఢపరచుట కొఱకు సంక్షేపముగా ఉపసంహరించి యిప్పుడు శాస్త్ర సంప్రదాయ విధానమును చెప్పుచున్నారు –

**18.67.** ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన,
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యో ఽభ్యసూయతి.

అనగా – నీ మేలుకొఱకే అనగా నీకు ఈ సంసారబంధము లేకుండునట్లుగా చేయగలందులకు చెప్పబడిన ఈ శాస్త్రము తపము చేయనట్టి మనుష్యునకు వినిపించరాదు. ఈ విధముగా "వాచ్యమ్" అను వ్యవధానముతో కూడియున్న పదముతో 'న' పదమునకు సంబంధము కలదు.

తపము చేసినవాడైనను ఎవడు భక్తుడు కాడో అనగా గురువు మరియు దేవతలయందు భక్తిభావము కలిగియుండడో అటువంటివానికి ఎన్నడును, ఎట్టి స్థితియందును ఈ గ్రంథమునందలి శ్లోకములను వినిపించరాదు.

భక్తుడైయుండియు మరియు తపము చేసినవాడై యున్నను ఎవడు వినుటకు సిద్ధముగా లేడో వానికి గూడ వినిపించరాదు.

మరియు ఎవడు వాసుదేవుడనైన నన్ను ప్రాకృత మనుష్యునిగా తలంచి,నాయందు దోషదృష్టి గలవాడైయుండునో, నన్ను ఈశ్వరునిగా గుర్తించనందున నాయందు ఆత్మప్రశంశ అనగా నన్ను నేనే పొగడుకొనుట మొదలగు దోషములను ఆరోపించుచుండునో నా ఈశ్వరత్వమును సహించలేకయుండునో అట్టివాడు గూడ ఈ గీతాశాస్త్రమును వినుటకు తగినవాడు కాడు. అందుచేత అట్టివానికి గూడ ఈ గీతాశాస్త్రమును వినిపించరాదు.

పై.వాక్యముల అర్థమును తెలుసుకొనినప్పుడు – ఈ శాస్త్రమును భగవంతునియందు భక్తి భావము గలవానికి, తపము చేసినవానికి ఈ శాస్త్రమును శ్రద్ధాభావముతో వినగోరినవానికి మరియు వాసుదేవుని యందు దోషదృష్టి లేనట్టివానికి వినిపించవలయును.

ఇతర స్మృతి గ్రంథములయందు గూడ మేధావికి మరియు తపస్వికి, ఈ విధముగా ఈ యిరువురి మధ్య భేదము చూడబడుచున్నది. అందువలన శ్రద్ధాభావము గల మరియు భక్తిభావము కలిగియున్న తపస్వికి లేక ఈ మూడు గుణములు కలిగియున్న మేధావికి మాత్రమే ఈ శాస్త్రమును వినిపించవలయును. శుశ్రూష మరియు భక్తిభావము లేనటువంటి తపస్వికిగాని, మేధావంతునికిగాని వినిపించరాదు.

భగవంతునియందు దోషదృష్టి గలవాడు సర్వగుణ సంపన్నుడైనను వానికి వినిపించరాదు. గురువుగారి సేవజేయువానికి మరియు భక్తిభావము గల పురుషునికి మాత్రమే వినిపించవలయును. ఈ విధముగా ఈ శాస్త్రము శాస్త్ర సంప్రదాయమునకు కట్టుబడియున్నది.

ఇప్పుడు ఈ శాస్త్ర పరంపరను ముందుకు నడిపించుటకు ప్రయత్నించువారికి కలుగు ఫలమును చెప్పుచున్నారు –

**18.68.** య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి,
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్య సంశయః.

అనగా – పరమ కల్యాణమే ఫలముగా గల మానవుడు ఈ పైన చెప్పబడిన కృష్ణార్జున సంవాద రూపముగా యున్న అత్యంత గుప్తమైన గీతాగ్రంథమును నాయందు భక్తిభావము

కలిగియున్న భక్తులకు వినిపించునో అనగా గ్రంథరూపముననుగాని, లేక అర్థరూపముననుగాని నేను చెప్పినట్లుగా వినిపించునో.

ఇచ్చట మరల భక్తిని గురించి చెప్పుటచేత మానవుడు కేవలము భగవంతునియందు గల భక్తిభావము చేతనే శాస్త్రమును వినిపించుటకు అర్హత కలిగియుండునన్న భావము తోచుచున్నది.

ఆతడెట్లు వినిపించునో చెప్పుచున్నారు –

నాయందు **పరాభక్తి కలిగి** అనగా నేను పరమ గురువైనటువంటి భగవంతుని సేవ చేయుచున్నాను అని తలంచి ఎవడు దీనిని వినిపించునో వానికి నేనే ఆతనికి లభించుట యను ఫలము కలుగును. అనగా నిస్సందేహముగా ముక్తుడగును. ఈ విషయమునందు సంశయించవలసిన పనిలేదు.

మరియు –

**18.69. న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః,**
**భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి.**

అనగా – ఈ గీతాశాస్త్ర పరంపరను పోషించునట్టి భక్తుడు అందరికంటె ఎక్కువగా నాకు ప్రియమైన కార్యము చేయువాడగుట వలన నాకు అందరికంటె మించిన ప్రియమైన వాడగును. అనగా ఆతడు నాకు అత్యంత ప్రియమైన కార్యము చేయువాడగును. అట్టివాడు నాకు వర్తమాన మరియు భవిష్యత్కాలమునందు గూడ అత్యంత ప్రియమైనవాడుగా వుండును. మరెవ్వడైనా –

**18.70. అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః,**
**జ్ఞానయజ్ఞేన తేనాహమిష్టః స్యామితి మే మతిః.**

అనగా – మానవుడు ఈ మా యిరువురి సంవాద రూపమైన ఈ ధర్మయుక్తమైన గీతాగ్రంథమును పఠించునో, ఆతని ద్వారా **నేను జ్ఞానరూప యజ్ఞముతో పూజింపబడుదును.** విధి యజ్ఞము, జప యజ్ఞము, ఉపాంశు యజ్ఞము మరియు మానస యజ్ఞము ఈ నాలుగు యజ్ఞములలో **జ్ఞాన యజ్ఞము మానసము.** అందువలన **అది అన్ని యజ్ఞముల కంటె శ్రేష్ఠమైనది.** అందువలన ఆ జ్ఞానయజ్ఞము యొక్క సమానత్వము వలన గీతాశాస్త్రము యొక్క అధ్యయనము శ్రేష్ఠమైనది.

ఈ గీతాశాస్త్రమును అధ్యయనము చేయుటవలన కలుగు ఫలము విధి రూపమైనది అనగా దీనియొక్క ఫలము దేవతాది విషయ సంబంధమైన జ్ఞాన యజ్ఞముతో సమానముగా వుండును అని కూడ తలంచవచ్చును.

అలాంటి అధ్యయనము వలన అనగా **అట్టి జ్ఞానయజ్ఞము ద్వారా నేను పూజింపబడుదును.** ఇదియే నా నిశ్చయము.

మరి శ్రోతకు ఎటువంటి ఫలము లభించునన్నచో - చెప్పుచున్నారు.

**18.71.** శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః,
సో ఽపి ముక్తః శుభాంల్లోకాన్ప్రాప్నుయాత్పుణ్యకర్మణామ్.

అనగా - ఏ పురుషుడు ఈ గీతాశాస్త్రమును అత్యంత శ్రద్ధాభక్తులతో మరియు దోష దృష్టిలేనివాడై వినునో విన్నంత మాత్రముననే సమస్త పాపముల నుండి ముక్తుడై అగ్నిహోత్రాది శ్రేష్ఠకర్మలు చేయునటువంటివారు పొందునటువంటి శుభలోకములను అనగా స్వర్గాది లోకములను పొందును.

ఏ శిష్యుడు ఈ గీతాశాస్త్రము యొక్క అభిమతమును చక్కగా గ్రహించదలంచి, అనగా తెలుసుకొనగోరినవాడై అడుగుచున్నాడో. ఆ విధముగా అడుగుచున్నటువంటి గురువుగారి అభిప్రాయ మెటువంటిదనగా శ్రోతయైన నా శిష్యుడు గీతాశాస్త్రము యొక్క అభిమతమును అనగా సరియగు అర్థమును తెలుసుకొనలేదు. కావున ఈతనికి మరియొక్క పర్యాయముగా వేరు విధము చెప్పెదను -

ఈ విధముగా ఆచార్యులవారు ఆతనికి అనగా ప్రియమైన శిష్యునికి ఈ గ్రంథము యొక్క అర్థమును తెలియజేయుట ఆయన తన కర్తవ్యముగా తలంచి అర్థగ్రహణము కొఱకు వేరు ఉపాయమును గ్రహించి ఏదో ఒక విధముగా శిష్యుని కృతార్థునిగా చేయదలంచి -

**18.72.** కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా,
కచ్చిదజ్ఞాన సంమోహః ప్రనష్టస్తే ధనంజయ.

అనగా - ఓ పార్థా ! నీవు నాచే చెప్పబడిన ఈ గీతాశాస్త్రమును ఏకాగ్రచిత్తుడవై విన్నావా ? మరి విని నీ బుద్ధియందు దానిని చక్కగా స్థిరపరచుకొన్నావా ? లేక విని విననట్లుగా గ్రహించలేదా ?

ఓ ధనంజయ ! నీ యొక్క అజ్ఞాన జనితమైనట్టి స్వాభావికమైన మోహభావము, అవివేకము, చిత్తము యొక్క మూఢభావము మొదలగు అనిష్టదాయకములైన సర్వభావములు పూర్తిగా తొలగిపోయినవా ? నీవు ఎంతగానో శ్రమించి ఈ శాస్త్రమును ఆ మూలాగ్రముగా విన్నావా ? మరియు ప్రశ్నించుటయందు నీవు చేసిన శ్రమ ఫలించినదా ? అప్పుడు శిష్య రూపమున వున్న అర్జునుడు యిలా అన్నాడు -

**18.73. నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయా ఽచ్యుత,**
**స్థితో ఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ.**

అనగా– ఓ అచ్యుతా ! సమస్త సంసారరూప అనర్థమునకు కారణమై యుండిన నా యొక్క అజ్ఞాన జన్య మోహమంతయు మరియు సముద్రము వలె దాటరాని అనగా తరించరానిదైయున్నదో అది అంతయూ పూర్తిగా తొలగిపోయినది. మరియు ఓ అచ్యుతా ! తమ దయవలన దేనిని పొందినందువలన సమస్తమైన అజ్ఞానగ్రంథులు అనగా సర్వవిధ సంశయములు తొలగిపోవునో అటువంటి ఆత్మ విషయిక స్మృతిని పొందియున్నాను.

అజ్ఞాన జనితమైన మోహమును నశింపజేయు మరియు ఆత్మవిషయకమైన లాభమును పొందింపజేయునటువంటి మీచే చెప్పబడిన మోహనాశ విషయికమైన ప్రశ్నోత్తర పద్ధతి ద్వారా అతి స్పష్టముగా తెలుసుకొనియున్నాను. సమస్త శాస్త్రములయొక్క అర్థ రూపమైన జ్ఞానము యొక్క ఫలము యింతేనని గుర్తించియున్నాను.

ఈ విధముగానే 'ఛాంధోగ్యోపనిషత్తు' అను శ్రుతి గ్రంథమునందు గూడ "ఆత్మను ఎఱుంగనట్టి నేను శోకించుచున్నాను అని చెప్పి ప్రకరణ సందర్భము ననుసరించి ఆత్మజ్ఞానము కలిగిన వెంటనే సమస్త గ్రంథులు విడిపోవును అని తెలుసుకొన్నాను. అప్పుడు హృదయమునందు గల గ్రంథి విచ్ఛిన్నమై పోవును. అట్టి స్థితియందు సర్వత్రా ఏకత్వమును అనుభవించువానికి యింక మోహ, శోకములు ఎట్లు కలుగును ?

ఇప్పుడు నేను సర్వవిధ సంశయ రహితుడనై మీ ముందు నిలబడియున్నాను. ఇప్పుడు మీరు ఏది చెయ్యమని ఆజ్ఞాపించిన అదియే చేయుటకు సిద్ధముగా వున్నాను. నేను మీ దయవలన కృతార్థుడనై యున్నాను. ఇప్పుడు నాకు ఎటువంటి కర్తవ్యము లేదు.

శాస్త్రము యొక్క అభిప్రాయము సమాప్తమైనది. ఇప్పుడు కథానంబంధమును తెలుపుటకుగాను సంజయుడు యిలా అన్నాడు –

**18.74. ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః,**
**సంవాదమిమమశ్రౌష మద్భుతం రోమహర్షణమ్.**

అనగా – ఈ విధముగా నేను ఈ పైన చెప్పబడిన అద్భుతమైనది మరియు అత్యంత ఆశ్చర్యకరమైన రోమములను గగుర్పాటు చెందించునట్టి శ్రీ వాసుదేవ భగవానుడు మరియు

మహాత్ముడైన అర్జునుని మధ్య జరిగిన ప్రశ్నోత్తర రూపమైన చర్చను - సంవాదమును - విన్నాను.

మరియు దానిని -

**18.75. వ్యాసప్రసాదాచ్ఛ్రుతవానేతద్గుహ్యతమం పరమ్,**
**యోగం యోగేశ్వరాత్కృష్ణాత్సాక్షాత్కథయతః స్వయమ్.**

అనగా - నేను భగవత్స్వరూపుడైన వ్యాసులవారి కృప వలన వారిచే దివ్య చక్షువులను పొంది ఈ పరమ రహస్య పూర్ణమైన సంవాదమును మరియు పరమ యోగమును విన్నాను. ఆ విధముగా ఈ సంవాద రూపమున చెప్పబడిన యోగమును నేను యోగేశ్వరుడు మరియు భగవంతుడు అయిన శ్రీకృష్ణునిచే ఆయన స్వయముగా చెప్పుచూ వున్నప్పుడు విన్నాను. పరంపరగా కాదు.

**18.76. రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్,**
**కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః.**

అనగా - ఓ ధృతరాష్ట్ర మహారాజా ! కేశవుడు మరియు అర్జునుడు మధ్య జరిగినటువంటి పరమ పవిత్రము, విన్నంతమాత్రముననే సర్వపాపములను నశింపజేయునది మరియు అత్యద్భుతమైన సంవాదమును విని మరియు అనేక పర్యాయములు స్మరించుకొని నేను ప్రతిక్షణము గూడ హర్షించుచున్నాను అనగా ఆనందమును పొందుచున్నాను.

**18.77. తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః,**
**విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునః పునః.**

అనగా - మరియు ఓ మహారాజా ! హరియొక్క ఆ అత్యంత అద్భుతమైన విశ్వరూపమును గూడ ఎన్నో పర్యాయములు మనస్సునందు స్మరించుకొని నాకు చాలా ఆశ్చర్యము కలుగుచున్నది. మరియు నేను ఎడతెగని ఆనందమును పొందుచున్నాను.

ఇంకా ఎంతని చెప్పేది ? -

**18.78.** యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.

అనగా - సమస్తమైన యోగము మరియు దానికి సంబంధించిన బీజములు (విత్తనములు) వారినుండియే జనించియున్నవి. అందుచేత భగవంతుడైన శ్రీకృష్ణుడు యోగేశ్వరుడు. ఏ పక్షమునందు (యుద్ధములో) యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు మరియు ఏ పక్షమునందు గాండీవమును ధరించియున్న పృతాపుత్రుడు అర్జునుడు వుండునో, ఆ పాండవుల పక్షమందుననే శ్రీ అనగా లక్ష్మీదేవి ఆ పక్షమునందే విజయము, ఆ పక్షమునందే విభూతి అనగా లక్ష్మీదేవి యొక్క స్వరూపమైన సంపద మరియు అచ్చటనే స్థిరమైన అనగా అచంచలమైన నీతివుండును. ఇది నా అభిప్రాయము.

శ్రీ శ్రీ శ్రీ వేదవ్యాస విరచిత శ్రీ మద్భగవద్గీత యందలి
మోక్ష సంన్యాస యోగమనబడు పదునెనిమిదవ అధ్యాయమునకు
శ్రీ శ్రీ శ్రీ ఆదిశంకరాచార్య విరచిత భాష్యమునకు
తెనుగు అనువాదము సమాప్తము.
అనువాదకులు - శ్రీ సదానందభారతి,
ప్రణవాశ్రమము.



## శ్రీ సదానంద భారతిగారి రచనలు

1) రామరాయశతకము (ఆటవెలదులలో)

2) జీవన వేదము (అద్వైతతత్త్వమునకు సంబంధించిన వ్యాసముల సంపుటి)

3) అమృత బిందువులు, అద్వైతతత్త్వము (పాటల రూపములో)

4) శ్రీమద్భగవద్గీత - శ్రీశంకరభాష్యం యథాతథం (తిరుమలగిరివాసుని ఆశీస్సులతో)

5) కలాకారకా వ్యక్తిత్వ ఔర్ కావ్యమే ఉస్కీ అభివ్యక్తి

6) వికలరాగిణి (హిందీకవితల సంగ్రహము)

7) జ్ఞానోపనిషత్తు (అచ్చులో వున్నది)

8) శతకసార శతకము (పది శతకముల సంగ్రహము, వ్యాఖ్యానముతో) (అచ్చులో వున్నది)

9) సత్యం, జ్ఞానం, ఆనందం బ్రహ్మ (అప్రకాశితము)

10) జగద్గురు (హిందీలో) (అప్రకాశితము)

11) "తత్త్వమసి" (సిద్ధాంతగ్రంథము) (అప్రకాశితము)

12) తులసీ కా వ్యక్తిత్వ (హిందీలో శోధప్రబంధము) (అప్రకాశితము)

13) శ్రీమదాంధ్ర మహాభారత నీతి శతకము (అప్రకాశితము)

14) అద్వైత తత్త్వము (అనువాదము) (అప్రకాశితము)

15) అద్వైత బ్రహ్మ సాక్షాత్కారము (అప్రకాశితము)